కీచక వధ

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత
డా॥ ఆర్. అనంత పద్మనాభరావు

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2018

KICHAKA VADHA
with Commentary

Commentary by
Dr. R. Anantha Padmanabha Rao

T.T.D. Religious Publications Series No. 1349

First Print : 2018

Copies : 2000

Published by :

Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.

Publications Division
T.T.D., Tirupati.

Printed at

Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **"మహాభారతం"** అయ్యింది.

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు – అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలను వ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **కీచక వధ.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

పీఠిక

శ్రీయనగౌరి నా బరగు చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపము దాల్చి "విష్ణు రూ
పాయ నమశ్శివాయ" యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చుమెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్టసిద్ధికిన్".

(శ్రీమదాంధ్ర మహాభారతము - విరాటపర్వము - ప్రథమాశ్వాసము-1)

"కీచకవధ" ఘట్టం శ్రీమదాంధ్ర మహాభారతము - విరాటపర్వము - ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడింది. దీని రచయిత తిక్కన సోమయాజి. తిక్కన 13వ శతాబ్దివాడు. నెల్లూరును పాలించిన మనుమసిద్ధికి ఆప్తుడు, మంత్రి, దండనాథుడు, ఆస్థానకవి. తిక్కన మంచి యౌవనంలో ఉన్నపుడు ఉత్తర రామాయణాన్ని నిర్వచనంగా వ్రాశాడు. పూర్వరామాయణాన్ని తిక్కన తాత భాస్కరుడు వ్రాశాడు. తిక్కన యజ్ఞం చేసి సోమయాజియైనాడు. ఆంధ్రదేశంలో ఆనాడు వైష్ణవులు శైవులు మతకలహాలతో, సంకుచిత స్వభావాలతో ఐకమత్యం లేకుండా నాశనమైపోతున్నారు. అది గమనించిన తిక్కన విష్ణువు శివుడు వేరువేరు కాదని లోకానికి తెలియజేయాలని హరిహరనాథుని ఆరాధించాడు.

"కిమస్థిమాలాం కిము కౌస్తుభం వా
పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్
కింకాలకూటః కిము వా యశోదా
స్తన్యం తవ స్వాదు వద ప్రభో మే."

(శ్రీమదాంధ్ర మహాభారతము-విరాటపర్వము-ప్రథమాశ్వాసము-11)

(ఓ దేవా! నీ అలంకరణలలో ఎముకల దండలు ఉన్నాయి(శివుడు) కౌస్తుభరత్నం ఉంది (విష్ణువు) వాటిలో నీకేది ఇష్టం. ఓస్వామీ నీవు కాలకూట విషం త్రాగావు (శివుడు). యశోద చనుప్రాలు తాగావు (శ్రీకృష్ణుడు- విష్ణువు) వాటిలో నీకేది రుచిగా ఉంది. తేల్చి చెప్పుమని ప్రశ్నించాడు) అంటే విష్ణువే ఈశ్వరుడు ఈశ్వరుడే విష్ణువు అని అర్థం. సోమయాజియైన తిక్కన ఈ

అభిప్రాయంతో వ్యాసభారతాన్ని తెనుగు చేశాడు. అంతకు పూర్వమే పదకొండవ శతాబ్దం వాడైన నన్నయ తెలుగులో భారతాన్ని వ్రాయదలచి ప్రణాళికను రూపొందించాడు. ఆ ప్రణాళికతో పాటు ఆది, సభాపర్వాలు, ఆరణ్యపర్వంలో కొంతభాగం అనువదించాడు. ఆ ప్రణాళిక ఆధారంగానే తిక్కన భారతానువాదానికి పూనుకొన్నాడు. అయితే ఆరణ్యపర్వం జోలికి పోకుండా విరాటపర్వంతో మొదలుపెట్టాడు. మహాప్రస్థాన పర్వం వరకుగల పదునైదు పర్వాలను తెనిగించాడు. భారతారంభ ప్రార్థనా పద్యమైన "శ్రీయన గౌరినాబరగు" పద్యంలో హరిహరనాథుని స్తుతించాడు. "విష్ణురూపాయ నమశ్శివాయ" మని నమస్కరించాడు. నిర్వచనోత్తర రామాయణాన్ని తనకు ఆప్తుడు, ప్రభువు అయిన మనుమసిద్ధికి అంకితమిచ్చాడు. సోమయాజిగా తన భారతాన్ని నరాంకితం చేయడానికి ఇష్టపడక హరిహరనాథునికే అంకితమిచ్చాడు. తిక్కన తన భారతంలో తన్ను గురించి చెప్పుకున్న అంశాలు చాల తక్కువ. భారతానికి పూర్వం తిక్కన తానువ్రాసిన "నిర్వచనోత్తర రామాయణములో తనను గూర్చి కొంతచెప్పుకున్నాడు.

మ॥ "అమలోదాత్తమనీష నేనుభయ కావ్యప్రౌఢి బాటించు శి
ల్పమునం బారగుడం, గళావిదుడ, నాపస్తంబ సూత్రుండ, గౌ
తమ గోత్రుండ, మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండ, న
న్నమకుంగొమ్మన మంత్రికిన్ సుతుడ దిక్కాంకుండ సన్మాన్యుడన్

(నిర్వచనోత్తర రామాయణము-ప్రథమాశ్వాసము-13)

తిక్కన తనను తాను పరిచయం చేసుకున్న మొదటి పద్యం ఇది. దీనినిబట్టి ఆతని తల్లిదండ్రులు, గోత్రాదులు స్పష్టంగా తెలుస్తున్నాయి. అంతేగాక తిక్కనకు ఆనాటికే ఉభయకవి మిత్రుడనే బిరుదుకూడ ఉన్నట్లు తెస్తుంది

ఇక భారతాన్ని గూర్చి తిక్కన చెప్పిన విషయం గుర్తింపదగి ఉంది.

ఉ॥ కావున భారతామృతము కర్ణపుటంబుల నారగ్రోలి యాం
ధ్రావళి మోదమును బొరయు నట్లుగ సాత్యవతేయ సంస్మృతి
శ్రీవిభవాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ కృతుల్

(శ్రీమదాంధ్ర మహాభారతము-విరాటపర్వము-ప్రథమశ్వాసము.30)

'ఆంధ్రులందరూ దొప్పలవంటి చెవులతో మహాభారతమనే అమృతాన్ని తనివితీరా త్రాగి, ఆహ్లాదాన్ని పొందేటట్లుగా, వ్యాస భగవానుని భావనలతో నిండిన విషయాలను గొప్ప కవిత్వలక్షణాలతో పద్యాలు, గద్యాలలో రచిస్తాను'. అని తిక్కన చెప్పుకున్నాడు. ఇక్కడ కొన్ని విశేషాలు గమనింపదగి ఉన్నాయి.

1. "భారతామృతము"-

అంటే భారతాన్ని తిక్కనగారు అమృతంతో సమానంగా చెప్పాడు. మృత్యువు నుండి తప్పించేది అమృతం. దీనిని సేవించినవారు దేవతలు. భారతం వినేవారి చెవులలో అమృతం పోసినట్లుగా ఉంటుందని తిక్కనగారి అభిప్రాయం. ఈమాటద్వారా తిక్కన భారతం యొక్క నిత్యత్వాన్నీ ఆస్వాదనీయత్వాన్నీ, విశ్వజనీనత్వాన్నీ సూచించాడు.

2. "కర్ణపుటంబుల.... మోదంబొరయునట్లుగ"-

తన కవిత శ్రవణానందాన్ని కలిగిస్తుందనీ, చవులూరిస్తుందనీ, ఆలోచనామృతాన్ని అందిస్తుందనీ, పాఠకులకు రసానందాన్ని నింపుతుందనీ, తిక్కన తెలియజేశాడు. అంతేగాక సామాజిక ప్రయోజనాలు గూడ ఈ భారతంలో చక్కగా చర్చించబడినట్లు తిక్కన సూచించాడు.

తిక్కన భారతము ఎక్కువగా నాటకీయశైలిలో వ్రాయబడింది. భారతము లోని ప్రతిపాత్ర ప్రతిసన్నివేశం పాఠకునికి, శ్రోతకు కన్నులకు కట్టినట్లుగా ఉంటుంది. ఆవిధమైన ఒక అద్భుతమైన నాటక సన్నివేశం గల ఘట్టం "కీచకవధ". ఈ ఘట్టంలో ప్రధాన పాత్రలు 1. కీచకుడు 2. ద్రౌపది 3. భీముడు. వీరితోపాటు విరాటరాజు, ఆతని భార్య సుధేష్ణ, ధర్మజాదులు ఉపకీచకులు పాత్రలుగా కనిపిస్తారు. తిక్కన పాత్రసృష్టిగాని సన్నివేశకల్పనా చాతుర్యంకాని అనితరసాధ్యం. అందుకే పండిత విమర్శకులు ఆతనిని "కవిబ్రహ్మ" అని అన్నారు. అంతేగాక సంస్కృతాంధ్ర భాషలలో కవితచెప్పగల నేర్పరియని తెలిసిన పండితులు "ఉభయకవి మిత్రుడ"ని సన్మానించారు. ఇంతటి మహానుభావుడైన తిక్కన "కీచకవధ" ఘట్టాన్ని మనం కొంంత పరిశీలిద్దాం.

భారతీయ సంస్కృతికి మూలమైన గ్రంథాలు ప్రధానంగా మూడు. అవి ఒకటి రామాయణము, రెండు భారతము, మూడు భాగవతము. ఇందులో రామాయణము ప్రధానంగా గృహస్థధర్మాన్ని చెపుతుంది. భారతము సమాజ ధర్మాన్ని ప్రధానంగా ప్రబోధిస్తుంది. భాగవతము ప్రధానంగా మోక్షమార్గాన్ని తెలియజేస్తుంది. భారతములో పాత్రలు అనేకాలు. కొన్ని పాత్రలు సాత్విక గుణ ప్రసిద్ధాలు. మరికొన్ని పాత్రలు రజోగుణ ప్రసిద్ధాలు. ఇంకనూ కొన్ని పాత్రలు తమోగుణ ప్రసిద్ధాలు. ఇంతవైవిధ్యం గల పాత్రలతో ఎన్నో సన్నివేశ కల్పనలతో భారతము చక్కగా తీర్చిదిద్దబడింది. అందుకే భారతంలోలేని విషయం ప్రపంచంలో లేదని అంటారు. సహజంగా 'భారత' శబ్దానికి భరతవంశీయుల చరిత్ర అని అర్థం చెపుతారు. అంతేగాక భ=ప్రకాశం; ప్రకాశం సత్వగుణంతో కలుగుతుంది. ర=రజోగుణం. త=తమోగుణం. వెరసి భారతమని గూడ చెప్పవచ్చు. అంటే సత్త్వరజస్తమోగుణ ప్రధానమైన పాత్రలచే నిర్మింపబడిందని అర్థం.

కవిత్రయంవారు (నన్నయ, తిక్కన, ఎర్రన) వ్రాసిన భారతము పర్వాలుగా విభజింపబడింది. కురుపాండవుల జన్మాదుల విషయాన్ని తెలియజేసేది ఆదిపర్వం. సభలో జూదమాడడం ద్రౌపదీ పరాభవం సభాపర్వం. పాండవులు అరణ్యవాస జీవితాన్ని గడిపిన అంశాన్ని తెలిపేది అరణ్యపర్వం. పాండవులు మారువేషాలలో ఒక్క సంవత్సరకాలం విరాటమహారాజు కొలువులో అజ్ఞాతవాసాన్ని గడిపిన విషయాన్ని కలిగి ఉండేది విరాటపర్వం. ఆ విధంగా తెలుగులో భారతకథ పదునెనిమిది పర్వాలలో వ్రాయబడింది. కథ విస్తృతిని బట్టి పర్వాలు మళ్ళీ ఆశ్వాసాలుగా విభజింపబడినాయి. కీచకవధ ఘట్టం భారతము–విరాటపర్వములో ద్వితీయాశ్వాసములో ఉంది.

పూర్వకథ : కురు సామ్రాజ్యాధిపతియైన ధృతరాష్ట్రుని కుమారులు వందమంది. వీరిని కౌరవులు అంటారు. ధృతరాష్ట్రుని తమ్ముడు పాండురాజు. ఇతని కుమారులు ఐదుమంది. వీరిని పాండవులు అంటారు. రాజ్యాధికారం కోసం కురుపాండవుల మధ్య అభిప్రాయభేదాలు ఏర్పడినాయి. వారి మధ్య సయోధ్య కుదరదని తెలిసిన భీష్మద్రోణాదులు రాజ్యాన్ని రెండుగా చేయడానికి అంగీకరించారు. వారి అనుమతితో ధృతరాష్ట్రుడు హస్తినను కౌరవులకు,

ఇంద్రప్రస్థాన్ని పాండవులకు పంచి ఇచ్చాడు. శ్రీకృష్ణుని సాయంతో పాండవులు రాజసూయయాగం నిర్వహించారు. ఆయాగానికి వచ్చిన దుర్యోధనుడు పాండవులకు ఇతరరాజులు తెచ్చి ఇచ్చిన కానుకలు చూసి ఈర్ష్యకు లోనైనాడు. అంతేగాక తాను మయసభలో కాలుజారి పడినపుడు ద్రౌపది చూచి నవ్విందని భ్రమపడి పాండవులపై పగను పెంచుకున్నాడు. ఆ కారణంగా పాండవుల్ని హస్తినకు పిలిపించి తనమామ శకునితో మాయజూదం ఆడించాడు. పాండవుల రాజ్యాన్ని హస్తగతం చేసుకొన్నాడు. నిండు సభలోనికి పాండవులు చూస్తుండగా ద్రౌపదిని దుశ్శాసనుడు జుట్టుపట్టిలాగికొని వచ్చాడు. ఆమెను వివస్త్రను చేయడానికి పూనుకొన్నాడు. శ్రీకృష్ణపరమాత్మ ద్రౌపది మానాన్ని తనమాయచే కాపాడాడు. ఇది జరిగిన తరువాత ధృతరాష్ట్రుడు పాండవుల రాజ్యాన్ని పాండవులకిచ్చివేశాడు. దుర్యోధనుడు తిరిగి ధర్మారాజును పునర్ ద్యూతానికి ఆహ్వానించాడు. క్షత్రియధర్మానుసారం ధర్మరాజు తిరిగి జూదమాడాడు. శకుని మాయా జూదంలో ధర్మరాజు తిరిగి ఓడిపోయాడు. ఈసారి పందెం ఓడినవారు పండ్రెండు సంవత్సరాలు అరణ్యవాసం ఒక్కసంవత్సరం అజ్ఞాతవాసం చేయడానికి ధర్మరాజు కంకుభట్టు పేరుతో విరాటరాజు దగ్గర చేరాడు. భీముడు వలలుడు అనుపేరుతో విరాటరాజు వంటశాలలో వంటవాడుగా చేరాడు. అర్జునుడు బృహన్నల పేరుతో విరటుని కొలువులో నాట్యాచారుడుగా చేరాడు. నకులుడు దామగ్రంథి పేరుతో విరటుని అశ్వశాలలో చేరాడు. సహదేవుడు తంత్రీపాలుడు పేరుతో విరాటరాజు గోశాలలో చేరాడు. ద్రౌపది మాలిని పేరుతో విరాటరాజు భార్య సుధేష్ణ వద్ద చేరింది. ఈవిధంగా వారి అజ్ఞాతవాసం ప్రారంభమయ్యింది.

కీచకవధ కథ :– విరాటరాజు బావమరిది కీచకుడు. ఆతడు మత్స్య రాజ్యానికి దండనాథుడు. ఆతని తమ్ములు నూట ఐదుగురు. కీచకుడు సింహబలుడు. బలగర్వితుడు. ఒకనాడు తన సహోదరియైన సుధేష్ణ మందిరానికి వచ్చాడు. సైరంధ్రిగా మాలిని పేరుతోఉన్న ద్రౌపదిని చూచాడు. మొదటి చూపులోనె ఆమెపై వలపుగొన్నాడు. ఆమె సౌందర్యానికి ఆకర్షితు డైనాడు. ఆమెపై మోహంతో అనుచితమైన పనులు చేయనారంభించాడు. ఆమెను కళ్ళతోనె మింగేటట్లు చూశాడు. ఆమె గజగజ వణికిపోయింది. ఆమెను

సమీపించబోయాడు. ఆమె తెల్లబోయింది. ఆమెను గురించిన వివరాలు అక్క సుధేష్ణను అడిగాడు. సుధేష్ణ నేర్పుగా మాటమార్చింది. అయినా ఆతని మనసుమారలేదు. ఆతడు తెగించి సైరంధ్రితో నేరుగా మాట్లాడడం మొదలు పెట్టాడు. ఆమె అందాన్ని పొగడాడు. నీ పేరేమిటి? నీవు ఎవ్వరివి? నీ భర్త ఎవరు ? అని ప్రశ్నలు వేశాడు. అన్నిటికి ఆమె మౌనం పాటించి ముఖం తిప్పుకొంది. అయినా కీచకుడు సైరంధ్రిని అనేక విధాల బతిమాలుతూ తన కోరికను తెలిపాడు. సైరంధ్రి తెలివిగా కీచకుని 'అన్నా' అని పిలిచింది,.. "అన్నా! నేనున్నస్థితిని నా మాసిన చీరలు చూస్తే నీకు ఏవగింపు కలగడం లేదా? ఉత్తములు ఇటువంటి మాటలు మాట్లాడవచ్చునా? నీకు తోబుట్టువులు ఉన్నారుకదా! ఈవిధంగా వ్యవహరించడం మంచిదికాదని సున్నితంగా హెచ్చరించింది. కాని ఆమాటలు ఆకామాంధుని చెవికెక్కలేదు. ఆమె శరీర సౌందర్యాన్ని మళ్ళీ మళ్ళీ వర్ణించసాగాడు. పరసతీ సంగమం వల్ల వచ్చే పాపాన్నైనా భరిస్తాను కాని, నీ సంగమాన్ని మాత్రం వదులుకోలేనని మూర్ఖంగా మాట్లాడాడు. ఇంతవరకు సున్నితంగా హెచ్చరించిన సైరంధ్రి ఇక లాభం లేదనుకొని గట్టిగా మందలించిది. "ఓ కీచకా! నివారించడానికి వీలులేని భుజపరాక్రమం కలిగి, గర్విష్ఠులైన శత్రువులను అవలీలగా వధించి కీర్తిపొందిన ఐదుగురు గంధర్వులు నా భర్తలు. వారిపుడు నిన్ను ఎదిరించి నీ మానప్రాణాలు హరిస్తారు" అని కోపాద్రిక్తురాలై హెచ్చరించింది. కీచకుడు సుధేష్ణను సైరంధ్రి వివరాలు చెప్పుమని బలవంతం చేశాడు. సుధేష్ణ కూడ అనేక రీతుల వారించింది. ఎన్నో నీతులు చెప్పింది. పరవనితకు ఆశపడటం ధర్మంకాదని మందలించింది. అయినా కీచకుడు వినలేదు. ఏదో కారణం చెప్పి సైరంధ్రిని తన మందిరానికి పంపుమని చెప్పాడు. ఆమె తిరిగి ఏదో చెప్పబోగా వినకుండా సైరంధ్రిని తనమందిరానికి పంపకపోతే చచ్చిపోతానని బెదిరించాడు. విధిలేని పరిస్థితులలో సుధేష్ణ ఒక్కరోజు మద్యం తెచ్చే నెపంతో కీచకుని మందిరానికి పంపుతానని మాట ఇచ్చింది. కీచకుడు సంతోషంగా తనమందిరం చేరి సైరంధ్రికోసం ఎదురుచూడసాగాడు.

సుధేష్ణ సైరంధ్రితో "నాకు దప్పిక ఎక్కువగా ఉంది. నానోరు ఎండిపోతూ ఉంది. చక్కని సువాసనతో కూడిన మదిరను (కల్లును) తాగాలని కోరిక కలిగింది. కీచకుని మందిరంలో రుచిగల మద్యం ఎపుడూ ఉంటుంది. నీవు త్వరగా వెళ్ళి తీసుకొని రావాలి" అని చెప్పింది. ఆ మాటలు విని ద్రౌపది కంపించిపోయింది. సైరంధ్రి భయంతోకూడిన భక్తితో "అమ్మా సుధేష్ణ! మదిరను తీసికొనిరావడానికి వేరెవ్వరినైన పంపు. నీచ పరిచారకులు చేసే ఇలాంటిపనులు నేను చేయలేను. తల్లీ! నా భర్తలు దూరంగా ఉన్నా నీ ఇంట సదాచార సంపన్నత ఉందనే ఆశతో నీ వద్ద పరిచారికగా చేరాను. అటువంటి నాకు ఇటువంటి మర్యాదలేని పనులు చెప్పడం భావ్యమా? నేను మీ ఇంట పనికి కుదిరే నాడే నీచపు పనులు చేయను అని చెప్పాను. అందుకు మీరు అంగీకరించారు. ఇపుడు మీరు మాటతప్పి నన్ను ఇతరుల ఇంటికి పంపడం భావ్యమా' అని ప్రశ్నించింది. అయినా సుధేష్ణ కీచకుని కోరికను కాదనే ధైర్యం చేయలేకపోయింది. "సైరంధ్రీ నేను మనసుపడి మదిరను తాగాలనుకొని నిన్ను తెమ్మంటున్నాను. అది ఇతరులకు చెప్పడం నాకిష్టం లేదు. మన మధ్య స్నేహాన్ని పురస్కరించుకొని నీకీపని చెపుతున్నాను. నిన్ను తక్కువగా భావించికాదని నిష్ఠూరంగా మాట్లడింది. ద్రౌపది ఇక వాదనకు దిగదలచుకోలేదు. సుధేష్ణ ఇచ్చిన బంగారు పాత్రను తీసికొని కీచకుని మందిరానికి బయలుదేరింది. తనకు రానున్న ఆపదను తలచుకొని శ్రీహరిని మనసులో నిలుపుకొంది. ఆతనినే స్మరిస్తూ ముందుకు సాగింది! దేవా నేను పాండవులను ఏకచిత్తంతో భావించేదానినైతే నాకు ఏ ఆపద కలుగకుండా రక్షించే భారం నీదే స్వామి' అని మనస్సులో ఆస్వామికి నమస్సులు అర్పించింది. ఆమె నమ్మిన ఆ సూర్యనారాయణుడు ఎవ్వరికి కనిపించకుండా ఓ రక్కసుని ఆమెకు రక్షగా సృష్టించాడు. సైరంధ్రి భయపడుతూనే పులి పొద లోనికి వెళుతున్న లేడివలె కీచకుని మందిరంలోనికి ప్రవేశించింది.

సైరంధ్రిని చూచిన కీచకుడు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిపోయాడు. ఆమె ముందు వింత చేష్టలు చేయసాగాడు. అయినా సైరంధ్రి గంభీరంగా నిల్చింది. 'దేవి మదిరను తెమ్మంది. మదిరను ఇస్తే వెళతాను అని ముక్తసరిగా చెప్పింది. మదన పీడితుడైన కీచకుడు ఆమెకు దగ్గరగా వచ్చాడు. దేవిదాహం

తీర్చడానికి ముందు నీవు నాదప్పికను తీర్చాలని కోరాడు. సైరంధ్రి ఏమాత్రం చలించకుండా ఆతనితో" ఆలస్యమవుతుంది. దేవి ఎదురు చూస్తూ ఉంటుంది. తొందరగా వెళ్ళాలి. మదిరను ఇమ్మని అడిగింది. ఆ మాటలు వినిపించుకోని కీచకుడు మన్మథప్రేలాపనతోకూడిన మాటలు మాట్లాడుతూ ఆమెను పట్టుకున్నాడు. సరిగ్గా ఆసమయంలో సూర్యనారాయణుని చేత పంపబడిన శక్తి ఆమె శరీరంలో ప్రవేశించి కీచకుని ఆవలకు తోచేసింది. వెంటనే సైరంధ్రి కీచకుని మందిరాన్ని వదలి పరుగెత్తింది. తేరుకున్న కీచకుడు ఆమె వెంటబడ్డాడు. దిక్కుతోచని స్థితిలో సైరంధ్రి విరాటరాజు కొలువులోనికి ప్రవేశించింది కీచకుడు సభలోనికి ఆమె వెంటబడ్డాడు. సభలోని వారు చూస్తున్నారు అనే సిగ్గుగాని భయంగాని లేకుండా సైరంధ్రి తలపట్టి పడద్రోశాడు. ఆసమయంలో ఆమెలో దాగిఉన్నశక్తి కీచకుని నేలపై బడేటట్లు కొట్టింది. కీచకుడు తన భంగపాటును ఇతరులు చూడకుండా వడిగా లేచి నిలబడినాడు. ఆ సభలో కంకుభట్టు (ధర్మరాజు) వలలుడు (భీముడు) ఉన్నారు. సైరంధ్రి (ద్రౌపది) అవస్థను గమనించిన భీముడు వెంటనే దగ్గరలో ఉన్న ఒక మహావృక్షం వైపు చూశాడు. ఆ వృక్షాన్ని పెకలించి అటు కీచకుని, ఇటు విరాటరాజును చంపాలనేది భీముని అభిమతం. భీముని చూపులలోని ఆంతర్యాన్ని గమనించిన ధర్మరాజు నర్మగర్భంగా ఇలా పలికాడు. "వంటల వాడైన వలలుడు ఎక్కడ చూచాడో కాని ఇక్కడ కాక మరొక చోట పనికి మాలిన చెట్లు పుట్టవా? పండ్లు బాగా పండిన పెద్దకొమ్మలతో గూడి ఆశ్రయించిన వారికి నీడను ఇచ్చి శ్రమను పోగొట్టే ఈ చెట్టును వంటకట్టెల కొరకు నరకడం దేనికి?" అని ప్రశ్నించాడు. అన్నమాటలలోని ఆంతర్యాన్ని గ్రహించిన భీముడు కోపాన్ని అదుపు చేసుకున్నాడు.

కోపాన్ని అదుపు చేసుకోలేక సైరంధ్రి వేషంలో ఉన్న ద్రౌపది ఆగ్రహంగా ఇలా మాట్లాడింది. "మహావీరులు ఐదుగురు నాకు భర్తలై ఉండికూడ, నన్ను ఒకడు ఈ విధంగా అవమానం చేస్తూవుంటే ఊరకుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఉంది. మహావీరులైన వారికి భార్యనైన నాకే ఇంతటి అవమానం జరిగితే సామాన్యులైన వారి భార్యలను కాపాడేవారెవరు? ఈ సభలో ఎవ్వరో ఒక్కరు గూడ ఈ అధర్మాన్ని ఖండించకపోవడం శోచనీయం. ఇంత

జరుగుతున్నా ఈ రాజ్యానికి ప్రభువైన రాజు కూడ నోరుమెదపలేదు. కీచకుడు ఇంతచేసినా దండించరా?" అని రోషంగా పలికింది. విరాటరాజు సమాధాన మేమి చెప్పలేదు. మీదు మిక్కిలి కీచకుని సాంత్వన వాక్యాలతో అనునయించి పంపాడు. అపుడు కంకుభట్టుగా ఉన్న ధర్మరాజు కల్పించుకొని సైరంధ్రిగా ఉన్న ద్రౌపదితో ఇలా అన్నాడు. "ఓ వనితా! నీమాటలు రాజు, సభలోని వారు విన్నారు. నీవు వెంటనే సుధేష్ణ మందిరానికి వెళ్ళు. నీపరాభవాన్ని చూచిన నీపతులైన గంధర్వులు నిజంగానే కోపగించుకొని ఉంటారు. కాని వారికిది సమయం కాకపోవచ్చు. వారు కోపాన్ని ప్రకటించలేకపోవచ్చు. కాబట్టి నీవు నీపతులను నిందించడం ధర్మంకాదు. సభలో ఇంతసేపు నీవు ఉండకూడదు వెళ్ళుమని హెచ్చరించాడు. అయినా సైరంధ్రి అక్కడనుండి కదలలేదు. ధర్మరాజు కులసతి గౌరవాన్ని కించపరచే విధంగా సభలో నాట్యం చేస్తున్న విధంగా మాట్లాడడం తగదన్నాడు. ఆమాటలకు ద్రౌపది సాభిప్రాయంగా మాట్లాడింది. "ఓ కంకుభట్టూ నిజంగా నాభర్త నటుడే. కాబట్టి నాపతివలెనే నేను కూడ నటినే. నాకు నాట్యం పరిచయమే. నాభర్త నటుడు మాత్రమే కాదు, జూదరికూడ. జూదరి భార్యకు మర్యాద ఎక్కడ ఉంటుంది అని నిష్ఠూరంగా మాట్లాడుతూ అక్కడనుంచి వెళ్ళిపోయింది. అంతః పురానికి వెళ్ళి జరిగిన ఉదంతం సుధేష్ణకు తెలిపింది. ఆమె సైరంధ్రిని బాధపడవద్దని, తాను కీచకుని మందలిస్తానని చెప్పింది. అందుకు సైరంధ్రి సుధేష్ణతో నీకాశ్రమ అవసరం లేదులే తల్లీ! నా భర్తలు పగతీర్చుకుంటారు అని చెప్పింది. ఆరాత్రి అందరూ నిద్రించారు. సైరంధ్రి మాత్రం రహస్యంగా వంటశాలలో ఉన్న భీముడి (వలలుడి) దగ్గరకు పోయింది.

ద్రౌపది మెల్లగా తన చేతిస్పర్శతో భీముడిని పిలిచింది. భీముడు ఇంత అర్ధరాత్రివేళ ఎందుకొచ్చావని ద్రౌపదిని ప్రశ్నించాడు. బాధతో ద్రౌపది తన అవమాన బాధ నంతటిని తెలిపింది. తనకు జరిగిన పరాభవాలను తలచుకొని కంటతడి పెట్టింది. అందుకు భీముడు ద్రౌపదితో 'ధర్మరాజు అడ్డుపడకుంటే కీచకుడిని అక్కడనే మట్టు పెట్టేవాడనని' ఆవేశంగా పలికాడు. ద్రౌపది భీముడి ఆవేశాన్ని చల్లారుస్తూ అక్కడ నీవు కీచకుడిని చంపి ఉంటే మన అజ్ఞాతవాసం బయటపడేది. తిరిగి మనం అరణ్య అజ్ఞాత వాసాలు చేయవలసి వచ్చేది.

అందుకే ధర్మరాజు వారించాడని వివరించింది. ధర్మరాజును కీర్తించింది. భీముడి పరాక్రమాన్ని ప్రశంసించింది. అర్జున నకుల సహదేవుల దైన్యానికి జాలి పడింది. సమయభంగం కాకుండ కీచకుడిని చంపాలని కోరింది. భీముడు ద్రౌపదిని అనునయించాడు. రేపు కీచకుడిని నర్తనశాలకు రహస్యంగా తీసుకొనిరమ్మని సూచించాడు. నర్తనశాలలో నీబదులు నేను ఉండి కీచకుడిని చంపుతానని మాటయిచ్చాడు. ద్రౌపది శాంతించి తన శయనమందిరానికి వెళ్ళింది.

ఉదయం కీచకుడు ద్రౌపదిపై అనురాగంతో సుధేష్ణ మందిరానికి వచ్చాడు. ఒంటరిగా ఉన్న ద్రౌపదిని చూశాడు. తన బలపరాక్రమాదుల్ని వేనోళ్ళ పొగుడుకున్నాడు. ద్రౌపది భీముడు చెప్పిన విషయాన్ని గుర్తుంచుకొని, కీచకుడిపై ప్రేమ నటించింది. రాత్రికి రహస్యంగా నర్తనశాలకు రమ్మని చెప్పింది. సంతోషంతో కీచకుడు వెళ్ళిపోయాడు. విషయాన్ని నిపుణంగా ద్రౌపది భీముడికి తెలియజేసింది. ఆరాత్రి నర్తనశాలలో ఉత్తర విశ్రాంతి తీసుకొనే మంచం మీద భీముడు ముసుగు కప్పుకొని కీచకుడి రాకకోసం ఎదురు చూస్తున్నాడు. అక్కడికి దగ్గరలో ద్రౌపది చాటుగా నిలబడి ఉంది. కొంత సమయానికి మన్మథతాపంతో కీచకుడు నర్తనశాలలోనికి ప్రవేశించాడు. ముసుగు ధరించి పడుకున్న భీముడిని సైరంధ్రిగా భావించి తన ఆభిజాత్యాన్ని మాటలతో వ్యక్తపరిచాడు. భీముడు కూడ గొంతుమార్చి సరసంగా మాట్లాడాడు. తరువాత భీముడు ముసుగుదీసి ముందుకు వచ్చాడు. కీచకుడు భీముడిని గంధర్వుడని భావించాడు. ఇద్దరి మధ్య భీకరంగా ముష్టియుద్ధం జరిగింది. భీముడు గూఢమర్దనక్రియలతో కీచకుడిని చంపి, కాళ్ళు చేతులు కడుపులోనికి చొప్పించి ముద్దచేసి భయంకరంగా పడవేశాడు. తరువాత భీముడు ద్రౌపదితో "గుండెలో ములికి వంటి నీ దుఃఖం తీరిందా? నాబలం నీ మనస్సును మెప్పించిందా? నీ కోపాగ్ని చల్లారిందా? దుష్టుడైన కీచకుడి భంగపాటును చూచావుకదా? సంతోషం కలిగిందా" అని అనునయించి ఆమెను శాంతింపజేశాడు.

సన్నివేశాలు :- కీచకవధ ఘట్టం చక్కని సన్నివేశాలతో రూపుదిద్దుకొంది. మొదటి సన్నివేశం సుధేష్ణ మందిరం. ఈరంగంలో సుధేష్ణ, కీచక, ద్రౌపదుల మధ్య సంభాషణ. రెండవ రంగం కీచకుని మందిరం. కీచక ద్రౌపదుల మధ్య సంభాషణ. మూడవ రంగం విరటుని కొలువు. ధర్మరాజు ద్రౌపదుల మధ్య సంభాషణ. నాల్గవ రంగం వంటశాల. భీమ ద్రౌపదుల మధ్య సంభాషణ. ఐదవ రంగం నర్తనశాల కీచక భీముల (ద్రౌపది గొంతుకతో) సంభాషణ. అదే రంగంలో భీమద్రౌపదుల మధ్య ఆనందాభి భాషణలు. ఈ విధంగా కీచకవధఘట్టాన్ని తిక్కన చక్కని సన్నివేశాలతో ఒక గొప్ప నాటకంగా రూపుదిద్దాడు. ప్రతి సన్నివేశంలోను ఆయా వ్యక్తుల మధ్య సంభాషణలు మన కళ్ళముందు ఆ వ్యక్తులు నిలబడి మాటలాడు తున్నట్లుగ తిక్కన తీర్చిన తీరు అనితర సాధ్యం. ఈ సన్నివేశాన్ని చదువుతున్న పాఠకులు, వింటున్న శ్రోతలు తాము నిజంగా ఆయా వ్యక్తులను చూస్తున్నట్లు, వారి మాటలు వింటున్నట్లుగ, భావించి పొందే ఆనందం వర్ణనాతీతం. ఇందుకు ఒక ఉదాహరణకు చూడవచ్చు.

కీచకుడు నర్తనశాలకు వస్తున్నాడని భీముడికి తెలియజేయడానికి వచ్చిన ద్రౌపది ఆనందంతో కూడిన స్వరంతో

కం॥ నా కొఱత దీర్చి వచ్చితి
నీ కొఱతయయింక, సూతునిందెగజూడన్
లోకము వంచింపందగు
చీకటిరేయొదవె; నేమీ సేసెదొ చెపుమా. **(శ్రీమదాంధ్రమహాభారతము- విరాటపర్వము-ద్వితీయాశ్వాసము 271)**

అని అంటుంది. కీచకుని మాయమాటలతో నమ్మించి రాత్రికి నర్తనశాలకు వచ్చే ఏర్పాటు చేసింది ద్రౌపది. ఆ విషయాన్నే ఎంతో చాకచక్యంగా "నా కొఱత దీర్చి వచ్చితి" అని చెప్పింది. అంటే నేను చేయవలసిన పని పూర్తి చేసుకొని వచ్చాను. ఇక నీవు చేయవలసిన పని మిగిలివుంది. లోకానికి తెలియకుండా ఈ రాత్రి కీచకుని కడతేర్చమని ద్రౌపది భీముని కోరింది. ద్రౌపది ఆనందంతో, ఆశతో, ఆకాంక్షతో ఆసక్తి కలిగించేటట్లు భీముడితో మాట్లాడింది. అందుకు భీముడు స్పందిస్తూ-

కం॥ నన్నడుగనేల నీవును
నన్నీచుడు నేమి మాటలాడితి రదినా
కున్నట్టు లెఱుగ జెప్పుము
నిన్నే మెచ్చించువాడ నీరజ వదనా (శ్రీమదాంధ్రమహాభారతము-విరాటపర్వము-ద్వితీయశ్వాసము-273)

"నీవంతుపని నీవు చేశావు. నావంతుపని నేను తప్పక చేస్తాను. నీవు ఆ నీచుడూ ఏమి మాట్లాడినారో ఉన్నది ఉన్నట్లు చెప్పు" అని అంటాడు. అంటే కీచకునికి ఏమి చెప్పినావు. ఎక్కడికి ఎపుడు ఏలా రమ్మని చెప్పినావు ఆ విషయాలు స్పష్టంగా తెలిపితే ఆ నీచుని చంపే పనిని పూర్తిచేస్తానని భీముడు ద్రౌపదిని ఓదార్చాడు. రెండు చిన్న పద్యాలలో సాగిన ఈ సంభాషణ అటు సన్నివేశచిత్రణకు, ఇటు సంభాషణాశైలికి మాత్రమే గాక అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని సృష్టించే తిక్కన నాటకీయ శైలికి చక్కని ఉదాహరణగా గ్రహించవచ్చు.

కీచకమంటే వెదురుబొంగు. ఇదిలోపల గుల్లగా ఉంటుంది. గాలి వచ్చినపుడు ఈ బొంగుల శబ్దం ఈల వేసినట్లుగా ఉంటుంది. అట్లే కీచకుడు గూడ పైన దర్పం, అహంభావం కలిగి, లోపల అంటే మనస్సులో ధర్మప్రవృత్తి లేక నీచ ప్రవృత్తి కలిగిన కాముకుడు. చంచలమైన మనస్సుకలవాడు. అంటే మనఃచాంచల్యానికి కీచకుడు ప్రతినిధిగా కనిపిస్తాడు. అటువంటి కీచకుని వధించడంతో అధర్మప్రవృత్తిని అణచివేసినట్లయింది. భారతములో ప్రతి సన్నివేశంలోను ఏదో ఒక ధర్మ ప్రతిపాదన కనిపిస్తుంది. పరస్త్రీ వ్యామోహం ఎట్టి వారినైన, ఎంతవారినైన నాశనం చేస్తుంది అనడానికి కీచకవధా ఘట్టం చక్కని ఉదాహరణ.

మారన తన మార్కండేయ పురాణంలో తిక్కనను గూర్చి చెప్పిన మాటలు గమనింపదగి ఉన్నాయి

చం॥ ఉభయకవిత్వతత్త్వవిభవోజ్జ్వలు, సంవిహితాధ్వర క్రియా
ప్రభు, బుధబంధు, భూరిగుణబంధురు, భారతసంహితాకథా
విభు, పరతత్త్వబోధను, నవీనపరాశరసూను, సంతత
త్రిభువనకీర్తనీయయశు దిక్క కవీంద్రుని గొల్తు నర్థితోన్
(మారన-మార్కండేయపురాణము-పీఠిక-10)

- డా॥ జి. దామోదరనాయుడు

కీచక వధ

కీచకుఁడు పాంచాలిం జూచి మోహించుట (సం.4-13-1)

వ. ఇట్లు పాండవులు పాంచాలీ సహితంబుగా విరాటు నగరంబున వర్తించుచుఁ గతిపయదినంబులు గొఱంతగా నేఁడుకాలంబు గడపిన సమయంబున మత్స్యపతి మఱందియు, దండనాథుండును, గీచకాగ్రజుండును, రూపా భిమానియు, నానాభరణ ధరణశీలుండును. దుర్విదగ్ధుండును. బలగర్వి తుండును నగు సింహబలుండు దనయప్ప సుదేష్ణకు మ్రొక్కంజనువాఁ డద్దేవి కనతిదూరంబున నున్న ద్రుపదరాజ నందనం గనుంగొని. 1

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవులు; పాంచాలీ సహితంబుగాన్= ద్రౌపదితో గూడ; విరాటు నగరంబునన్= విరాటుడు పాలించే మత్స్య దేశరాజధానిలో; వర్తించుచున్= ఉంటూ; కతిపయదినంబులు= కొన్ని రోజులు; కొఱంతగాన్+ఏఁడు కాలంబు= సంవత్సరానికి కొంచెం తక్కువగా; కడపిన సమయంబునన్= గడిపినప్పుడు; మత్స్యపతి మఱందియున్= విరాటుని బావమరదీ; దండనాథుండును= సేనాధ్యక్షుడూ; కీచక+అగ్రజుండును= కీచకులలో పెద్దవాడూ; రూప+అభిమానియున్= తన రూపాన్ని అభిమానించే వాడూ; నానాభరణ ధరణ శీలుండును= అనేక రకాలైన అలంకారాలు ధరించే స్వభావం కలవాడూ; దుర్విదగ్దుండును= వివేకం లేనివాడూ; బలగర్వితుండు నున్+అగు= తనబలంచేత గర్వించినవాడూ అయిన; సింహబలుండు= సింహబలు డనేవాడు; తన అప్ప= తన అక్క అయిన; సుదేష్ణకున్; మ్రొక్కన్+చనువాఁడు= నమ స్కరించటానికి వెళ్లుతున్నవాడు; ఆ+దేవికిన్= ఆ మహారాణికి; అనతిదూరంబునన్= సమీపాన; ఉన్న= ఉండిన; ద్రుపదరాజ నందనన్= ద్రౌపదిని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా పాండవులు ద్రౌపదీ సమేతంగా విరాటనగరంలో ఉంటూ అజ్ఞాతవాసం గడుపుతున్నారు. సంవత్సరానికి కొద్ది రోజులు తక్కువగా ఉండే సమయంలో విరాటరాజు బావమరది అయిన సింహబలు డనేవాడు ఒక రోజు తన అక్క సుదేష్ణను చూచి గౌరవంగా నమస్కరించటానికి వచ్చి ఆమె సమీపంలో ఉన్న ద్రౌపదిని చూచాడు. అతడు నూట్రైదుగురు కీచకులకు అన్న, అందమైన రూపాన్ని అభిమానించేవాడు, అనేకరకాలైన అలంకారాలను ధరించే స్వభావం కలవాడు, వివేక విహీనుడు, బలగర్వితుడు. అతడు నూట్రైదుగురు కీచకులకు అన్న, అందమైన రూపాన్ని అభిమానించేవాడు, అనేకరకాలైన అలంకారాలను ధరించే స్వభావం కలవాడు, వివేక విహీనుడు, బలగర్వితుడు.

విశేషం: 1. యౌవనం, ధనసంపత్తి, ప్రభుత్వం, అవివేకం- వీటిలో ఒక్కొక్కటే అనర్థ దాయకం. నాలుగూ కీచకుడిలో రాశీభూతంగా ఉన్నాయి.

2. సంస్కృతంలో 'మాసా దశ సమత్యయుః, (4-13-1) అని 10 మాసాలు గడిచినట్లు చెప్పబడింది. రెండు నెలల వ్యవధిలో దుర్యోధనుడు గ్రహించకపోడని తిక్కన సమంజసమైన మార్పు చేశాడు.

ఉ. అక్కజమైన చెల్వమున నాత్మకు వ్రేగయి పొల్చు పొల్తిపై
నెక్కొను చూడ్కిఁ గ్రమ్మఱుప నేరక యూరక నిల్చెఁ గాముచేఁ
జిక్కిన నెమ్మనంబుఁ గడుఁ జేడ్పడు మానముఁ జేష్టితంబులం
దక్కిన యంగముం దలఁకు ధైర్యమునై యతఁ డప్పు డయ్యెడన్. 2

ప్రతిపదార్థం: అక్కజము+ఐన= అబ్బురపాటు కలిగించే; చెల్వమునన్= అందంతో; ఆత్మకున్= మనస్సుకు; వ్రేఁగు+అయి పొల్చు= తాపం కలిగించే; పొల్తిపైన్= స్త్రీపై; నెక్కొనుచూడ్కిన్= నిలిచిన చూపును; క్రమ్మఱుపన్+నేరక= మరలించలేక; కాముచేన్+చిక్కిన= మన్మథునికి వశమైన; నెఱ+మనంబున్= నిండు మనస్సూ; కడున్+చేడ్పడు= మిక్కిలి కలత పడే; మానమున్=

అభిమానమూ; చేష్టితంబులన్= చేష్టలను; తక్కిన= కోల్పోయిన; అంగమున్= శరీరమున్నూ; తలఁకు= చలించే; ధైర్యమును+ఐ= ధైర్యమూ కలిగి; అతఁడు= సింహబలుడు; అప్పుడు; ఆ+ఎడన్= అచ్చట; ఊరక, నిల్చెన్= వ్యర్థంగా నిలబడ్డాడు.

తాత్పర్యం: ఆశ్చర్యాన్ని కలిగించే ద్రౌపది సౌందర్యం కీచకుడి హృదయానికి భరించలేనిదయింది. ఆమె మీద వాలిన చూపులను మరల వెనుకకు మరల్చుకొనలేక అట్లాగే నిశ్చేష్టుడై నిలిచిపోయాడు. మన్మథుడికి లొంగిపోయిన అతడి మనస్సు కలత చెందింది. అతడి నిబ్బరం చెదిరిపోయింది. అతడి శరీరం చేష్టలు దక్కింది. ధైర్యం చలించింది. వరుసగా ఈ అవస్థలను అతడు పొందాడు.

విశేషం: విరాటపర్వం నానారసాభ్యుదయోల్లాసి. అపూర్వ సౌందర్యవతి అయిన ద్రౌపది కీచకుడికి శృంగార విభావంగా ప్రత్యక్షమైంది. అతడు మన్మథాయత్తుడైనాడు. శృంగార రసావిష్టులైన నాయికానాయకులలో దశవిధ మన్మథావస్థలను వర్ణించటం ప్రబంధ సంప్రదాయం. తిక్కన కీచకుడిలో ఆ దశావస్థలు చిత్రించాడు.

"దృఙ్మనస్సంగసంకల్పా, జాగరః కృశతాఽరతిః
హ్రీత్యాగోన్మాద మూర్ఛాంతా ఇత్యనంగదశా దశ."

అని లక్షణోక్తి. దృక్సంగమం, (దర్శనం వలన చక్షుప్ప్రీతి), మనస్సంగమం, సంకల్పం, జాగరం, కృశత, అరతి, హ్రీత్యాగం, ఉన్మాదం, మూర్ఛ, అంతం (మరణం) అనేవి దశవిధమన్మథావస్థలు. వీటిలో దృక్సంగమం ఈ పద్యంలో వర్ణించబడింది. ద్రౌపదిది అపూర్వమైన సౌందర్యం. దానివలన కీచకుడికి అద్భుతం, రతిభావం రెండూ కలిగాయి. చూపులు ఆమె అందం మీద వాలాయి. అందులో చిక్కుకొన్నాయి. సంగమించాయి. అది దృఙ్మీలనం - లేదా - దృక్సంగమం. ఆ అవస్థను వ్యక్తం చేసే అనుభావాలు (చేష్టలు) సాత్త్వికభావాలుగా (సహజంగా కలిగే అభినయాలవలె) అతని శరీరంలో పొటమరించాయి. చూపులు వెనుకకు తీసికొనలేని తన్మయత్వం (మైమరపు), రతిభావం చేత మనసు చలించటం,

శరీరం స్తంభావస్థను (చేష్టలు లేకుండా కొయ్యబారిపోయినట్లు కావటం) పొందటం, స్థైర్యాన్ని కోల్పోవటం - వలపు చూపులు ప్రసరించిన ప్రథమావస్థకు అభివ్యక్తులైన వారి అభినయముద్రలు. పాత్రలు అభినయిస్తున్నట్లు వర్ణించటం తిక్కన నాటకీయతలో ప్రధాన లక్షణం. (సంపా.)

తే. ద్రౌపదీ రూప మను నురిఁ దగిలి తనదు।
హృదయ మను మృగ మత్తఱి నుదిలగొనుచుఁ
గాముఁడను బల్లిదపు వేఁటకాని బారిఁ।
బడుట కెంతయు నా సింహబలుఁడు తలరి. 3

ప్రతిపదార్థం: ద్రౌపదీరూపము+అను= ద్రౌపదీ సౌందర్యమను; ఉరిన్+తగిలి= ఉరిత్రాడుకు తగిలికొని; తన హృదయము+అను= మృగము= తన హృదయమనే జింక; ఆ+తఱిన్= ఆ సమయంలో; ఉదిలగొనుచున్= పరితపిస్తూ; కాముఁడు+అను= మన్మథుడనే; బల్లిదము+వేటకాని= బలిష్ఠుడైన వేటగాడియొక్క; బారిన్+పడుటకున్= గురిలోపడినందుకు; ఆ సింహబలుఁడు= ఆ కీచకుడు; ఎంతయున్= ఎంతో; తలరి= చలించి.

తాత్పర్యం: ద్రౌపదీ రూప సౌందర్యమనే ఉచ్చులో చిక్కి ఆ కీచకుడి హృదయం అనే జింక మన్మథుడనే బలిష్ఠుడైన వేటగాడి పన్నుగడలో పడిపోవటం వలన అప్పుడు ఆ సింహబలుడు చలించి. (ముందరకు అన్వయం.)

విశేషం: 1. అలం: సావయవ రూపకం. ద్రౌపది రూపం, కీచకుడి హృదయం, మన్మథుడు అనే ఉపమేయాలమీద ఉరి, జింక, వేటకాడు అనే ఉపమానాలు ఆరోపించబడ్డాయి.

2. ఇందులో మనస్సంగమమనే ద్వితీయ మన్మథావస్థ అలంకార సుందరంగా వర్ణించబడింది. వలలోపడిన మృగం వేటగాడి చేత చంపబడుతుంది - అనే భావన చేత, ద్రౌపది చేత ప్రేరితుడైన భీముడి చేత కీచకుడు వధించబడతాడని అలంకార ధ్వని.

3. వలలో చిక్కిన జింకవలె హృదయం రాగబద్ధమైనదనీ, మోహమగ్నమైన దనీ వ్యంగ్యం.

4. పేరుకు సింహబలుడు కాని, లేడివలె ద్రౌపదీ రూపమనే ఉచ్చులో పడ్డాడు. విషమాలంకారచ్ఛాయ కనపడుతున్నది. కీచకుడు రూపాభిమాని కాబట్టి అందమైన ఆకారాన్ని చూచి అభిమానించి వశుడైపోయాడని ధ్వని. (సంపా.)

వ. నిజాంతర్గతంబున. 4

తాత్పర్యం: తన మనస్సులో.

ఉ. 'ఎందును నిట్టిరూపు నరు లెవ్వరుఁ గాంచిరె? నాక కాదు సం
క్రందనసూతికిం దగిలి కన్గొనఁ జాలదె! దీన నిందిరా
నందను నాజ్ఞ యేచి భువనంబులఁ బ్రబ్బదె? యిత్తలోదరిం
జెందఁగఁ గాన్పుగాదె ఫలసిద్ధి పురాతన పుణ్యవృద్ధికిన్! 5

ప్రతిపదార్థం: నరులు+ఎవ్వరున్= మానవులెవరైనా; ఎందునున్= ఎక్కడైనా; ఇట్టిరూపున్= ఈ విధమైన సౌందర్యాన్ని; కాంచిరె?= చూచారా?; నాకున్+అ కాదు= నాకే కాదు; సంక్రందన సూతికిన్= ఇంద్రుడి కుమారుడైన జయంతుడికి కూడా; తగిలి= ఆసక్తి పొంది; కన్గొనన్+చాలదె!= చూడ తగిందే సుమా!; దీనన్= దీనిచేత (ఇట్టిరూపుచేత); ఇందిరానందను+ఆజ్ఞ= మన్మథుడి ఆదేశం; ఏచి= అతిశయించి; భువనంబులన్= లోకాలలో; ప్రబ్బదె?= వ్యాపించదా?; పురాతన= పూర్వజన్మ; పుణ్యవృద్ధికిన్= పుణ్యాతి శయానికి; ఫలసిద్ధి= ఫలితం దక్కటం; ఈ+తలోదరిన్= ఈ సుందరిని; చెందఁగన్+కాన్పుకాదె!= పొందగలగటమే కదా!

తాత్పర్యం: 'ఎక్కడైనా ఇటువంటి సౌందర్యరాశిని మానవు లెవ్వరైనా చూచారా? నేనే కాదు, ఆ దేవేంద్రుడి కొడుకైన జయంతుడుకూడా ఈమె అందాన్ని ఆసక్తితో చూడక మానలేడు. దీనివలన కలిగిన మన్మథేచ్ఛ అతిశయించి లోకాల

నన్నిటిని ముంచెత్తదా? ఈ సుందరాంగి పొందు లభించినవాడి జీవితం నిజంగా పూర్వజన్మల పుణ్యాలపంట!

విశేషం: అలం: సంబంధాతిశయోక్తి, కావ్యార్థాపత్తి. సంక్రందనసూతికిన్, ద్రౌపదీ రూపమునకును సంబంధం లేకున్ననూ, సంబంధమున్నట్లు వర్ణింపబడటం చేత సంబంధాతిశయోక్తి. సంక్రందన సూతి జయంతుడే కాక, అర్జునుడు కూడా, ఆమె రూపును తగిలికొనువాడే కదా! అయితే అందగాడుగా జయంతుడే కాని, అర్జునుడు చెప్పబడడు. సంక్రందన సూతికే తగిలి కన్గొనవచ్చునంటే ఇంక నా సంగతి వేరే చెప్పాలా? అనటం చేత అలంకారం కావ్యార్థాపత్తి. ఇందిరా నందనుడి (మన్మథుడి) ఆజ్ఞ ఏచి ప్రబ్బుటకు ఈమె రూపే సాధనమనటం వలన, ఆమె సౌందర్యాతిశయం ద్యోతకమవుతున్నది. 'పుణ్యబుద్ధికిన్' అనే పాఠంకంటె 'పుణ్యవృద్ధికిన్' అనే పాఠాంతరం అనువుగా ఉండటంతో దీనిని గ్రహించటం జరిగింది. ఈ పద్యంలో 'సంకల్పం' అనే మూడవ మన్మథావస్థ ప్రారంభమైనది. మనుషులే కాక దేవతలు కూడా చూచి ఆశ్చర్యపడే రూప సౌందర్యం ద్రౌపదిదని పేర్కొంటూ, ఆమెపొందు పూర్వజన్మఫలంవలనగాని లభించదని భావించాడు. ద్రౌపది పుణ్యవతి అని, దివ్యసౌందర్యవతి అని ధ్వని. నాయికా సంగమాన్ని గాఢంగా సంకల్పించటం ఇందులో స్పష్టం. (సంపా.)

సీ. ఇయ్యింతి ప్రాపున నయ్యనంగుఁడు పార్వ।
తీశునైనను దక్కనేలకున్నె!
యిన్నాతి చెలువంబు గన్న శచీ ప్రియుం।
డైనను గనుకలి నవియకున్నె!
యిత్తన్వి కెనలేమి కెదిరి పన్నిదము భా।
షావిభుతోనైనఁ జఱవరాదె!
యిత్తలోదరి జీవితేశున కిందిరా।
పతినైన మెచ్చక పలుకఁజనదె!.

తే. కుసుమబాణుని బాణముల్ గూడ నైదు।
కరఁగి నేరిమి పాటించి కరువు గట్టి
పోసి చేసి చైతన్యసంపుటము దగ ఘ।
టించెనో కాక యిట్టి చేడియలు గలరె! 6

ప్రతిపదార్థం: ఈ+ఇంతిప్రాపునన్= ఈమె అండతో; ఆ+అనంగుఁడు= ఆ మన్మథుడు; పార్వతీ+ఈశున్+ఐనను= శివుడిని అయినా; తక్కన్+ఏలక+ఉన్నె= లొంగేటట్లు చేయలేడా?; ఈ+నాతిచెలువంబు= ఈమె అందాన్ని; కన్న= చూచిన; శచీప్రియుండు+ ఐనను= ఇంద్రుడైనా; కనుకలిన్= చూడటం చేతనే; అవియక+ఉన్నె!= విరహంతో చిక్కిపోకుండా ఉంటాడా!; ఈ+తన్వికిన్= ఈమెకు; ఎనలేమికిన్= సాటిలేకపోవటం అనేవిషయమై; భాషావిభుతోన్+ఐనన్= బ్రహ్మతోనైనా; ఎదిరిపన్నిదము= ఎదురుపందెం; చఱవరాదె!= వేయవచ్చునుకదా!; ఈ+తలోదరి= ఈమెయొక్క; జీవిత+ఈశునకున్= భర్తకు; ఇందిరాపతిన్+ఐనన్= విష్ణువునైనా; మెచ్చక= ప్రశంసించక; పలుకన్+చనదె!= మాట్లాడవచ్చును కదా!; కుసుమబాణుని బాణముల్= మన్మథుని బాణాలు; కూడన్= కలిపి; ఐదు కరఁగి= ఐదూ కరగించి; నేరిమి+పాటించి= నేర్పు ప్రదర్శించి; కరువు+కట్టి= మూసను ఏర్పరచి; పోసి= అందులో పోసి; చేసి= రూపం తయారుచేసి; చైతన్య సంపుటము= ప్రాణచైతన్యాన్ని; తగన్+ఘటించెనో= ఒప్పునట్లుగా కూర్చాడేమో!; కాక= లేకపోతే; ఇట్టి చేడియలు= ఇటువంటి స్త్రీలు; కలరె!= ఉంటారా!.

తాత్పర్యం: ఈ అందమైన వనిత అండదండలుంటే అలనాడు మన్మథుడు పార్వతీపతి అయిన పరమేశ్వరుడిని సైతం లొంగదీసికొని తన చెప్పుచేతలలో ఉంచుకొనకుండా ఉండేవాడా! ఈ వయసుకత్తె అందాన్ని చూస్తే శచీమనోహరుడైన ఇంద్రుడు కూడా దృక్సంగమం వలన కలిగిన విరహంతో చిక్కిశల్యమై పోకుండా ఉండేవాడా!; ఈ సన్నని మేనుగల అందగత్తెకు లోకంలో ఎవ్వరూ సాటిలేకపోవటం అనే విషయంపై సరస్వతీదేవి భర్త అయిన బ్రహ్మ

దేవుడితో సైతం ఎదురుపందెం వేసి గెలువవచ్చును కదా! ఈ సుందరికి భర్త అయిన వాడు లక్ష్మీపతి అయిన విష్ణుదేవుని సంపదనూ, సౌందర్యాన్ని సైతం లెక్కచేయకుండా మాట్లాడవచ్చును కదా! ఈమె అందాన్ని చూస్తే బ్రహ్మదేవుడు మన్మథబాణాలైదింటిని కలిపి ఒకేసారి కరిగించి, నేర్పుతో మూసలో పోసి, రూపుకట్టించి, ప్రాణంపోసి, చైతన్యస్ఫూర్తిని సంఘటించాడేమో! లేకపోతే ఇటువంటి అందగత్తెలు ఈ సృష్టిలో సామాన్యంగా ఉంటారా? (ఈమె బ్రహ్మదేవుడి విశిష్ట సృష్టి).

విశేషం: అలం: పరికరాంకురం, కావ్యార్థాపత్తి, వ్యతిరేకం, ఉత్ప్రేక్ష. ద్రౌపది సౌందర్యాన్ని అలంకారికంగా వర్ణించిన తిక్కన మేటి పద్యాలలో ఇది ఒకటి.

1. సీస పద్యం మొదటి పాదంలో వ్యతిరేకాలంకారం గోచరిస్తుంది. ఉపమానం కంటె ఉపమేయమే బలంగా చిత్రించబడే స్ఫూర్తివలన ద్రౌపది సౌందర్యానికి అతిశయం భాసించింది.

2. ఈ పద్యంలో భార్యాసహితులైన దేవతలనే పేర్కొనటం విశేషం. ద్రౌపది సౌందర్యం వారి ప్రియురాండ్ర నుండి భర్తలను దూరం చేయగల శక్తి కలదని తిక్కన నిరూపణ. వివాహితులైన దేవతలే ఆమె సౌందర్యం చూస్తే విరహానికి గురి ఔతారనగా ఇక కీచకుడి మాట వేరేచెప్పాలా? అని అర్థాపత్తి అలంకారం ధ్వనింపచేశాడు. శచీవల్లభుడి విషయం చెప్పటంచేత కైముతిక న్యాయంతో కీచకుడి అర్థం కూడా ధ్వనిమయంగా సిద్ధించటం అర్థాపత్తి. ఇట్లాగే వాణీచతుర్ముఖుల. లక్ష్మీనారాయణుల విషయంలోనూ కూడ అన్వయించుకొనాలి.

3. వ్యతిరేకాలంకారాన్ని ఆశ్రయించి ద్రౌపది సౌందర్యాన్ని ధ్వనింపచేయటం సీసపద్యపాదాలలోని శిల్పం. ఉపమానం కంటె ఉపమేయం బలంగా ఉన్నట్లు చిత్రించటం ఈ అలంకార స్వభావం. మహేశ్వరుడు మన్మథుడి కంటె గొప్పవాడు. అతడిని కూడా ధిక్కరించగలిగే శక్తి మన్మథుడికి ద్రౌపది సౌందర్యం కలిగిస్తుందట! భోగప్రియుడు ఇంద్రుడు, ఆయనకు భార్య ఉన్నది. వేయి కన్నులున్నాయి. అయినా ఆయన చూపులను ఆకర్షించి విరహంతో చిక్కిపోయేటట్లు చేయగలిగినది ద్రౌపది

సౌందర్యం. ఆమె అందానికి ఎదురు లేదు. అందువలన ఆ అందాన్ని సృష్టించిన సరస్వతీ భర్తనే (బ్రహ్మనే) 'మరల నావలె సృష్టి చేయగలవా?' అని అడుగగలిగిన శక్తి కలది ద్రౌపది అందం. ఇందిరాపతి ఐశ్వర్యవంతుడు. ద్రౌపదిని పొందినవాడు అతడికంటె ఘనుడు. ఈ విధంగా ఉపమేయ స్థానీయులందరిని అధికతరం చేసి చెప్పిన వైఖరితో ద్రౌపది సౌందర్యాన్ని ధ్వనిమయం చేశాడు తిక్కన.

4. ఈశ్వరుడు, ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువు - వీరికి బదులుగా పార్వతీశుడు, శచీప్రియుడు, భాషావిభుడు, ఇందిరాపతి అని విశేష్యాలను సాభిప్రాయంగా ప్రయోగించడంచేత అలంకారం పరికరాంకురం.

5. ఎత్తుగీతిలో ఉత్ప్రేక్ష అందగించింది. అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలం- అనే అయిదు పూలు మన్మథుడి పంచబాణాలు. ఉపమానం యొక్క తాదాత్మ్యాన్ని ఉపమేయంలో సంభావించటం ఉత్ప్రేక్ష. పంచబాణుడి ఒక్కొక్క బాణమే ఎంతో ప్రభావం కలది. అటువంటి అయిదు బాణాలూ కలిపి ఒక మూసలో పోసి రూపొందించి ప్రాణప్రతిష్ఠ చేసినట్లు ఉన్న సౌందర్యమో అన్నట్లు అపూర్వంగా ఉన్నది ద్రౌపది సౌందర్యం. అంతటి అందగత్తెలు సృష్టిలో లేరు.

6. సీస పాదాలలో క్రమంగా ద్రౌపదీ సౌందర్యబలాన్నీ, ప్రభావాన్నీ, సాటిలేనితనాన్నీ, వైభవాన్నీ చిత్రించాడు. ఎత్తుగీతిలో అపూర్వతను అభివ్యక్తం చేశాడు. కీచకుడు సంకల్పావస్థను ప్రదర్శిస్తూ సంగమానుకూల సౌందర్యాలంబనాన్ని ఉల్లేఖంగా కీర్తించటం-రసభావపోషకం.

7. ఈ సీసపద్యం, విశేషించి ఎత్తుగీతి అల్లసాని పెద్దనాది ప్రబంధకవులకు మార్గదర్శకమైనది. చూడండి: మనుచరిత్ర. 2.36 (సంపా.)

క. ఈ నెలఁతఁ గన్న మన్మథుఁ।
డైనఁ జిగురు గొడుగుఁ పువ్వుటమ్ములపొదులున్
లోనుగ సెజ్జలు సేయం।
దా నియమింపండె? విరహతాపము పేర్మిన్.' 7

ప్రతిపదార్థం: ఈ నెలఁతన్+కన్న= ఈ స్త్రీని చూచినచో; మన్మథుఁడు+ఐనన్= మదనుడైనా; విరహతాపముపేర్మిన్= విరహతాపాతిశయంచేత; చిగురుగొడుగు= చిగురుటాకుల గొడుగు; పువ్వు+అమ్ములపొదులున్= పూల బాణాల పొదులు; లోనుగన్= మొదలయినవి; తాను= ఆయన; సెజ్జలు+చేయన్= పడకలు తయారుచేయడానికి; నియమింపండె?= ఆజ్ఞాపించడా?

తాత్పర్యం: ఈమెను చూచి, మన్మథుడు విరహతాపానికి లోనయి, తన చిగురాకు గొడుగులను, పూలబాణాల పొదులను తనకు మెత్తటి పరుపుగా తయారుచేయుమని ఆజ్ఞాపించక తప్పదు.'

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ద్రౌపదిని చూస్తే మన్మథుడికైనా విరహతాపం కలగకమానదని సూచించి, తిక్కన కీచకుడి మోహాన్నీ ద్రౌపది సౌందర్యాన్నీ వ్యంగ్యంగా చెప్పాడు.

వ. అని వెండియు. **8**

తాత్పర్యం: అని మరలా (ఇట్లా అనుకొన్నాడు.)

సీ. దీని జన్మంబునఁ దేజంబునొందిన ।
యింతియుఁ బతియును నెవ్వరొక్కొ!
దీని నామాకృతిగా నోఁచి పడసిన ।
యింపగు వర్ణంబు లెవ్వియొక్కొ!
దీని వల్లభుఁ డనఁగా నిల సొబగు సొం ।
పెసఁగ వర్తిల్లు వాఁ డెవ్వఁడొక్కొ!
దీని వసించుటఁ దా నొప్పి పెంపున ।
నేపారు మందిరం బెద్దియొక్కొ!

ఆ. దీనిఁ బొందఁగాంచు తెఱఁగు నా కెయ్యది ।
యొక్కొ! యిట్టిపనికి నూఱడిల్లి
తోడుకొనఁగ నిచట నీడగు చుట్టంబుఁ ।
దడవి యెట్టులొక్కొ పడయువాఁడ!' **9**

ప్రతిపదార్థం: దీని జన్మంబునన్= ఈమె పుట్టుకచేత; తేజంబున్+ఒందిన= ప్రకాశించిన; ఇంతియున్, పతియునున్= భార్యాభర్తలు (తల్లిదండ్రులు); ఎవ్వరు+ఒక్కొ!= ఎవరో కదా!; దీని నామాకృతిగాన్+నోఁచి= ఈమె పేరు అగునట్లుగా నోములు నోచి; పడసిన= పొందిన; ఇంపు+అగు వర్ణంబులు= సొంపయిన అక్షరాలు; ఎవ్విఒక్కొ!= ఏవో కదా!; దీని వల్లభుఁడు+అనఁగాన్= ఈమె భర్తగా; ఇలన్= భూమిమీద; సొబగు సొంపు+ఎసఁగన్= అందచందాలు అతిశయించగా; వర్తిల్లు= జీవించునట్టి; వాఁడు= ఎవ్వ+డు+ఒక్కొ!= వాడెవడో కదా!; దీని వసించుటన్= ఈమె ఉండటం చేత; తాన్+ఒప్పి= తాను (మందిరం) అందగించి; పెంపునన్= ఐశ్వర్యవంతమై; ఏపారు= ప్రకాశించే; మందిరంబు= గృహం; ఎద్ది+ఒక్కొ!= ఏదో కదా!; దీనిన్+పొందన్+కాంచు= ఈమెను అనుభవించగల; తెఱఁగు= విధం; నాకున్+ఏ+అది+ఒక్కొ!= నాకెట్లా కలుగుతుందో కదా!; ఇట్టిపనికిన్= ఈ పనికి; ఊఱడిల్లి= ఉపశమనం పొంది; తోడుకొనఁగన్= సహాయం పొందటానికి; ఇచటన్= ఇక్కడ; ఈడు+అగు= సరిఅయిన; చుట్టంబున్= బంధువును; తడవి= వెదకి; ఎట్టులు+ఒక్కొ!= ఎట్లా; పడయువాఁడన్?= పొందుతానోగదా!

తాత్పర్యం: 'ఈ సుందరికి జన్మనిచ్చి వెలుగొందిన ఆ పుణ్యదంపతులు ఎవరో కదా! ఈమె పేరుగా రూపొందటానికి నోములు నోచిన ఆ అందమైన అక్షరాలు ఏవో! ఈమె భర్తగా ఈ లోకంలో అందచందాలతో ఒప్పారే ఆ సౌభాగ్యవంతుడు ఎవడో! ఈమె నివసించటం చేత తన ఉనికియొక్క అందాన్నీ అతిశయాన్నీ పెంచుకొన్న ఆ మందిరం ఏదో? ఈమెపొందును పొందగలిగే మార్గం నా కేదో? ఈ పనికి న న్నోదార్చి నాకు తోడుపడే తగిన బంధువును (ఆప్తుడిని) నే నెట్లా వెదకి పట్టుకొనవలెనోగదా!

విశేషం: అలం: పర్యాయోక్తం. ప్రతిపాదంలోనూ 'ఒక్కొ' - అను మాటను ఆవృత్తం చేయటం చేత పద్యంలో శాబ్దికమైన సమత ఏర్పడింది. స్త్రీ జీవితంలో క్రమబద్ధమైన పరిణామాలు - పుట్టడం, నామకరణం, వివాహమాడటం, అత్తగారింటికి వెళ్ళటం

- అనే విషయాలు-ఇవి పద్యంలో క్రమంగా పేర్కొనబడ్డాయి. దానివలన అర్థసంబంధమైన సమతకూడ సిద్ధించింది. పైగా స్త్రీ జీవితంలోని ఆనుపూర్వి పాటించబడింది. ఇది తిక్కన పద్య శిల్పంలోని రహస్యం. ఈమె ఎవరికూతురో, ఈమె పేరేదో, ఈమె భర్త ఎవరో, ఈమె ఇల్లు ఏదో అనక, వాటినే భంగ్యంతరంగా చెప్పటం వలన అలంకారం పర్యాయోక్తం. దానిచేత ఆయా వాటి ఔన్నత్యం ద్యోతకమవుతున్నది.

చ. అని యని యుగ్గడించు, ధృతి యల్లల నాడినఁ దల్లడించుఁ బై
కొను తలపోఁత నించు, మదిఁ గోర్కులు పేర్చిన నప్పళించు, నె
ట్టన తెగ నగ్గలించు, నచటన్ జనులం బరికించు, బుద్ధి దూ
లిన వెస నెంతయుం గళవళించు మనోజవికారమగ్నుఁడై. 10

ప్రతిపదార్థం: మనోజ, వికార, మగ్నుఁడు+ఐ= (కీచకుడు) మన్మథుడి వలన మనసులో కలిగిన భావవికారాలలో మునిగినవాడై (మదనభావావేశపరుడై); అని+అని= మాటిమాటికి (ఈ విధంగా పెక్కుసార్లు); ఉగ్గడించున్= ప్రశంసిస్తాడు; ధృతి= మనోధైర్యం; అల్లన్+ అలన్+ఆడినన్= చలిస్తే; తల్లడించున్= కలవరపడతాడు; పైకొను= క్రమ్ముకొని వచ్చే; తలపోఁతన్= ఆలోచనచేత; ఇంచున్= సంతోషిస్తాడు; మదిన్= మనస్సులో; కోర్కులు పేర్చినన్= కోరికలు పెల్లుబ్బగా; అప్పళించున్= తమకిస్తాడు; నెట్టన= అని వార్యంగా, అధికంగా; తెగన్+అగ్గలించున్= తెగించటానికి ఉత్సాహం ప్రదర్శిస్తాడు; అచటన్= అక్కడి; జనులన్= మనుష్యులను; పరికించున్= చూస్తాడు; బుద్ధి+తూలినన్= మనస్సు కలవరపడగా; వెసన్+ఎంతయున్= వెంటనే మిక్కిలిగా; కళవళించున్= తికమక పడతాడు, తల్లడిల్లుతాడు.

తాత్పర్యం: రతిభావతీవ్రతచేత కీచకుడు మన్మథ వికారాలకు లోనయ్యాడు. ద్రౌపదీ సౌందర్యాన్ని గురించి అన్నమాటే అంటూ అనేక విధాలుగా ప్రశంసిస్తూ

మాట్లాడసాగాడు. ముంచుకొని వచ్చే ఎన్నో వలపు తలపులకు సంతోషించసాగాడు. మనసులో కోరికలు పెల్లుబికితే తట్టుకొనలేక తమకించేవాడు. వారించటానికి వీలులేని ఉద్రేకంతో ఎంతకైనా తెగించటానికి ఉత్సాహించేవాడు; తనను (వింతగా) చూస్తున్న జనులను తేరిపార చూచేవాడు. మతి తప్పినట్లు కాగా వెంటనే ఎంతో తల్లడిల్లేవాడు.

విశేషం: 26వ పద్యం నుండి 30వ పద్యం వరకు తిక్కన కీచకుడి వాచికాభినయాన్ని కళాసుందరంగా వ్యక్తీకరించాడు. ఈ పద్యంలో ఆంగికాభినయాన్ని అభినయ బంధురంగా ఆవిష్కరించాడు.

1. మదన వికార చేష్టలను వర్ణించటంలో ఇంతటి మధురమైన పద్యం తెలుగులో అంతవరకు వెలువడలేదు. తిక్కన వాడిన విశేషణాలూ, క్రియలూ; రమణీయార్థ ప్రతిపాదకాలు. ఉదాహరణకు - 'మనోజ వికార మగ్నుఁడై' అనే విశేషణం గమనిద్దాం. మనోజ= మనస్సునుండిపుట్టిన; మన్మథ సంబంధమైన - అనిన్నీ; వికార= భావాలలో, చేష్టలలో అనిన్నీ చెప్పుకొనవచ్చును. వికార శబ్దాన్ని లాక్షణికులు భావపరంగానూ, చేష్టాపరంగానూ వాడతారు. భావాలంటే సంచారి భావాలు. భావాల వలన వాటికి అనుగుణమైన అనుభావలు (చేష్టలు) జనించటం నాట్యంలో, జీవితంలో గమనిస్తాం. ఇక్కడ తిక్కన ఆ రహస్యాన్ని కళామయంగా శ్లేషలో నిబంధించాడు. అందువలన ఈ పద్యంలోని భావాలనూ, చేష్టలనూ వివేచించటం వివేకం.

2. మన్మథావస్థలలో మూడవదైన సంకల్పంలో రతిభావం ఉత్కటావస్థకు చేరుతుంది. అంటే స్థాయి గౌరవాన్ని పొందుతుంది. ఆ సమయంలో సంచారి భావాలతో రతిభావాన్ని పోషించే ప్రక్రియను తిక్కన చేపట్టటం సార్థక రసాభ్యుదయ శిల్పం. నాలుగు పద్యాలలో సంచారిభావ సమున్మేషాన్ని చిత్రించిన తిక్కన ఇందులో చేష్టలను చిత్రించి ఆ అంశానికి ఒక సమగ్రతను సాధించాడు.

3. మనోజ వికార మగ్నుడైనవాడు ప్రదర్శించే చేష్టలు అప్రయత్నకృతాలు కావటం చేత సాత్త్విక భావాలవంటివి. భావాలని పేరుపెట్టినా సాత్త్వికభావాలు

సహజభావాభివ్యక్తులైన చేష్టలే. తిక్కన ఆ చిత్రణను అపూర్వంగా ఈ పద్యంలో నిర్వహించాడు.

(1) పదే పదే ద్రౌపది సౌందర్యాన్ని ప్రస్తావించి ప్రశంసించటం ప్రలాపం. (ఇది వాఙ్మయ చేష్ట).

(2) ఆమె తనను అంగీకరిస్తుందో లేదో అనే అనుమానంతో మనోనిగ్రహం చలించగా అతడు తబ్బిబ్బు పడిపోయేవాడు. (తల్లడిల్లటం భావానుగుణమైన చేష్ట).

(3) వలపు తలపులు ముప్పిరికొంటూంటే దానికి సంతోషించటం తన్మయత్వ భంగిమ (చేష్ట).

(4) కోర్కెలు పిచ్చటిల్లుతూ ఉంటే తట్టుకోలేక అప్పళించటం (చేష్ట).

(5) కోర్కెలు అనివార్యం కాగా, తెగించి ఆమెను దరిచేరటానికి ఉత్సహించటం (చేష్ట).

(6) ఆవేశంతో ఆమెవైపు పోతే చూచేవా రేమనుకొంటారో అనే అనుమానంతో జనంవైపు చూడటం (చేష్ట).

(7) వలపు తలపులతో మతిచలించినంత మనోవేదన పడుతూ నిస్సహాయస్థితిని వ్యక్తం చేయటం కళవళింత (చేష్ట).

రసాభ్యుదయం భావానుభావ పరిణామ క్రమంతో వ్యక్తీకరించటంలో ప్రకాశిస్తుంది. ఉగ్గడించు, తల్లడించు, తలపోతనించు, అప్పళించు, అగ్గలించు, పరికించు, కళవళించు - క్రియలను వాడి అచ్చతెనుగు క్రియలకున్న అర్థశక్తిని తిక్కన ప్రదర్శించటం ఆయన కవితా శిల్ప విశేషం.

(4) అలం: సముచ్చయం. ఏకకాలంలో అనేక కార్యాలు జరిగినట్లు వర్ణించబడటం సముచ్చయాలంకార లక్షణం. దానికీ పద్యం హృద్యమైన ఉదాహరణ. (సంపా.)

క. మాసిన చందముఁ దనుఁ గని।
రోసిన డెందంబుఁ గల తరుణి నెఱుఁగఁడ బి
ట్టేసిన మదనునిచే ధృతి।
వాసిన బెగడొందు సింహబలుఁ డట్టియెడన్. 11

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయలో; బిట్టు+ఏసిన= తీవ్రంగా బాణాలతో కొట్టిన; మదనునిచేన్= మన్మథుని చేత; ధృతి+పాసిన= ధైర్యాన్ని కోల్పోగా; బెగడొందు= కలతచెందే; సింహబలుఁడు= కీచకుడు; మాసిన చందమున్= కాంతి తరిగిన విధంగా ఉన్నా; తనున్+కని రోసిన= తనను చూచి అసహ్యించుకొనే; డెందంబున్+కల= మనస్సు గల; తరుణిన్+ఎఱుఁగఁడు+అ= ద్రౌపది మనస్సు తెలిసికొనలేకపోయాడు.

తాత్పర్యం: మన్మథ వికారానికి లోనైన ఆ కీచకుడు ఆ సమయంలో నిబ్బరాన్ని కోల్పోయి ఉండటం చేత ద్రౌపది మాసిన దుస్తులలో కళావిహీనంగా ఉన్నా, తనను చూచి అసహ్యించుకొంటున్నా ఆమె మనస్సును గ్రహించలేకపోయాడు.

విశేషం: తిక్కన సందర్భాన్ని బట్టి ఒక్కొక్క సంచారిభావాన్ని ఒక్కొక్క పద్యంలో వర్ణించి రసాభ్యుదయోల్లాసాన్ని కలిగించే కావ్య రస శిల్పాన్ని ప్రదర్శిస్తాడు. సంకల్పమనే మదనావస్థలో ఉన్న కీచకుడి చిత్తవృత్తికి పోషకంగా ఈ పద్యంలో మోహమనే సంచారి భావాన్ని తిక్కన పోషించాడు. “భయ వియోగాది ప్రయోజ్యా వస్తుతత్త్వానవధారణీ చిత్తవృత్తి ర్మోహః’’ అని లక్షణం. రక్తుడైన కీచకుడు మోహావిష్టుడు. అందువలన ద్రౌపది కాంతిహీనంగా ఉన్నా, తనను మనసులో ఏవగించుకొంటున్నా ఆమె మనస్తత్త్వాన్ని (వస్తుతత్త్వాన్ని) వివేచించే స్థితిలో లేడు. దుర్విదగ్ధుడి విశిష్ట లక్షణమిది. (సంపా.)

సీ. వెఱవక ననుఁ జూచె వీఁడని యెదఁ గలు।
షించిన నొండొండ చెమట వొడమ,

ననుచితకృత్యంబు లాచరించు విధాతృ।
బలిమికి నివ్వెఱపాటు దోఁప,
నిచ్చట దిక్కులే రెవ్వరు నా కను।
భయమున మేనఁ గంపంబు పుట్టఁ,
జేయంగ నేమి యుపాయంబు లేమి నా।
ననమున వెల్లఁదనంబు గదుర

తే. నున్న పాంచాలిఁ గనుఁగొని యన్నరాధ।
ముఁడు వివేక విహీనుఁడై ముదితుఁడగుచు
మదనవికృతియకాఁ దన మదిఁ దలంచి।
రాగసాగరపూర నిర్మగ్నుఁ డయ్యె. 12

ప్రతిపదార్థం:వీఁడు= ఇతడు, కీచకుడు; వెఱవక= భయపడక, వెనుకాడక; ననున్+చూచెన్+అని= నన్ను చూచాడని; ఎదన్= హృదయంలో; కలుషించినన్= కలత బారటం చేత; ఒండు+ఒండ= క్రమక్రమంగా; చెమట+పొడమన్= (ఒడలంతా) చెమట పట్టగా; అనుచితకృత్యంబులు= ఒప్పని పనులు; ఆచరించు= చేసే; విధాతృబలిమికిన్= బ్రహ్మదేవుని శక్తికి, విధి బలీయతకు; నిండు+వెఱపాటు+తోఁపన్= (మిక్కలి భయం వలన కలిగే) నిశ్చేష్టత ప్రకటితం కాగా; నాకున్= (ద్రౌపదికి); ఇచ్చటన్= ఇక్కడ; ఎవ్వరున్= ఎవరూ; దిక్కులేరు= రక్షించేవారు లేరు; అనుభయమునన్= అనే భయంతో; మేనన్+ కంపంబు+పుట్టన్= శరీరంలో వణకు పుట్టగా; చేయంగన్= చేయటానికి (ఆ విపత్తు నుండి తప్పించుకొనటానికి); ఏమి+ఉపాయంబు= ఎటువంటి ఉపాయమూ; లేమిన్= లేకపోవటం చేత; ఆననమునన్= ముఖంపై; వెల్లన్+తనంబు= వెలవెలబాటు; కదురన్= కలుగగా; ఉన్న పాంచాలిన్= ఉన్నటువంటి ద్రౌపదిని; ఆ+నర+అధముఁడు= ఆ నీచుడు; కనుఁగొని= చూచి; వివేకవిహీనుఁడు+ఐ= ఇది మంచి, ఇది చెడు అని విడమరచి తెలిసికొనే తెలివి

కోల్పోయినవాడై; ముదితుఁడు+అగుచున్= (తనలో తాను) సంతోషిస్తూ; మదన వికృతి+అ కాన్= (ద్రౌపది ప్రకటించిన సాత్త్వికభావాలను) మన్మథవికారముగా (శృంగార చేష్టలుగా); తలంచి= తలపోసి; రాగసాగరపూర= అనురాగం (వలపు) అనే సముద్రపు నీటిలో; నిర్మగ్నుఁడు+అయ్యెన్= మునిగిపోయాడు.

తాత్పర్యం: ఈ కీచకుడు నన్ను జంకుగొంకులు లేకుండా చూస్తున్నాడే అని ద్రౌపది మనసులో కలత పడింది. దానివలన ఆమె శరీరం నిండా అంచెలంచెలుగా క్రమంగా చెమటపట్టింది. 'బలమైన ఆ విధి నా పట్ల ఎప్పుడూ ఉచితంగాని పనులే ఎందుకు చేస్తాడో? వాటిని తప్పించుకొనటం ఎట్లా?' అనే భావం తోచగానే ఆమె నిశ్చేష్టురాలై పోయింది. ఈ సమయంలో నా కెవ్వరూ ఇక్కడ దిక్కులేరనే భయం కలిగేసరికి ఆమె శరీరంలో వణకు పుట్టింది. ఈ అపాయాన్ని తప్పించుకొనటానికి ఏ ఉపాయమూ లేదనిపించటం చేత ఆమె ముఖం వెలవెలపోయింది. ఇటువంటి భయహావభావాలను ప్రదర్శిస్తున్న ద్రౌపదిని నీచుడూ, వివేకరహితుడూ అయిన కీచకుడు పరిశీలించాడు. ఆమె ప్రకటిస్తున్న భయసాత్త్విక భావాలన్నీ తనపై వలపుచేత ప్రదర్శిస్తున్న చేష్టలని భావించి లోలోన మురిసిపోతూ క్రమంగా వలపు మున్నీట మునిగిపోయాడు.

విశేషం: 1. తెలుగు సాహిత్యంలో ఈ పద్యం ఒక అపూర్వ ప్రయోగం. పై సీసంలోని నాలుగు పాదాలలో వరుసగా స్వేదం, స్తంభం, వేపథువు, వైవర్ణ్యం అనే సాత్త్విక భావాలు వర్ణించబడ్డాయి. సాత్త్విక భావాలంటే భావాలు కావు. సమాహిత చిత్తం నుండి అప్రయత్నంగా వెలువడే చేష్టలు. తిక్కన ద్రౌపదిలో భయాన్నీ, కీచకుడిలో రతిభావాన్నీ ఈ సందర్భంలో పోషించాలి. రతి భావానికి శృంగార విభావం కావాలి. ద్రౌపది అందంగా ఉన్నదే కాని భయవిహ్వలురాలై ఆ భావాన్ని వ్యక్తం చేసే సాత్త్విక భావాలను ప్రకటిస్తున్నది. అంచెలంచెలుగా చెమటపోయటం, నిశ్చేష్టురాలై పోవటం, శరీరం వణకటం, ముఖం వెలవెలపోవటం అనేవి భయభావం వలన కలిగే సాత్త్వికభావాలు. వీటినే శృంగార రసపరంగా రతిభావజనకాలైనవిగా కీచకుడు భ్రమించినట్లు తిక్కన చిత్రించాడు. విరుద్ధ రసభావాల నడుమ సాత్త్విక

భావాలు సమంగా ఏ విధంగా ఉండటానికి వీలుంటుందో తిక్కన సూక్ష్మబుద్ధితో వివేచించి కవితలో ఆవిష్కరించాడు. సాత్త్వికభావా లొకటైనా విరుద్ధభావాలకు అనుగుణంగా వ్యాఖ్యానించే కావ్య రసమర్మం ఈ పద్య శిల్పం. ఇది అసాధారణం.

2. 'కామీ స్వతాం పశ్యతి' - అని కాళిదాసోక్తి, భయభావ జనితమైన సహజ చేష్టలను రతిభావావిష్టుడైన కీచకుడు తన కనుకూలంగా వ్యాఖ్యానించుకొన్నాడు. నాయకుడు సూటిగా నాయికవైపు చూస్తే లజ్జాతిశయం వలన కలిగిన బెరుకు చేత చెమటపోయటం శృంగార రసంలో సహజం. నాయక సాన్నిహిత్యం వలన కలుగబోయే పరిణామాలను భావించి చేష్టలుడిగి అతడికి వశం కావటం స్తంభంగా అతడికి భాసించింది. ప్రథమ సమాగమ భీతిచేత శరీరం కంపించటం ముగ్ధకు సహజం. అంతకాలం నిబ్బరంగా ఉండి నాయకుడికి అంతలోనే వశమై పోతున్నందుకు తన బలహీనతకు తానే తెల్లబోవటం నైజం. కీచకుడు ఆమెను గురించి అట్లా భావిస్తే పఠిత అతడు నీచు డనుకొంటాడు; వివేకవిహీను డనుకొంటాడు - తిక్కన సహృదయుడి ప్రతిస్పందనకు ప్రతిబింబంగా 'అన్నరాధముడు, వివేకవిహీనుడు' అని విశేషణాలు వాడాడు. సామాజిక నిష్ఠమైన కావ్యరస పోషణ తెలిసిన కవి చేసే పని ఇది. భయసాత్త్విక భావాలను, రతి కనుకూలంగా ఎందుకు భావించాడు? అంటే - అతడు రాగసాగర పూర నిర్మగ్నుడైనాడు కాబట్టి. రాగరసం శృంగార రసంగా చెప్పటానికి వీల్లేదు. కాని రసాభాసానికి "ఏకత్రైవానురాగశ్చేత్"అనే శ్లోకంతో ఉన్న ప్రతాపరుద్రీయ నిర్వచనం ప్రసిద్ధం. అటువంటి అనురాగమే ఈ రాగం. ఒక విధంగా అది ఆభాస సూచకంగా తిక్కన వాడాడేమో! రసాభాస శిల్పంలో వాడదగిన రసవదలంకార శిల్పంగా తిక్కన భావించాడేమో! రాగసాగరమన్నప్పుడు రూపకం రాణించింది. సాగరమగ్నుడైన కీచకుడు అకారణంగా మరణించనున్నాడని ధ్వని అనుగమ్యమానమౌతున్నది (సంపా.)

వ. అయ్యవసరంబున. 13

తాత్పర్యం: ఆ సమయంలో.

చ. పొలఁతుక కాంతి యింత పొలివోవఁగనీ కెసలారఁ దార ని
శ్చలతఁ గడంగి క్రోలికొనఁజాలుటఁ గీచకముఖ్యు లోచనం
బులు 'నయనం ప్రధాన' మను పూర్వవచస్స్థితి తప్పకుండఁగా
నెలమి వహించెఁ దక్కుఁ గల యింద్రియ వర్గము ధిక్కరించుచున్. 14

ప్రతిపదార్థం: పొలఁతుక= ద్రౌపది యొక్క; కాంతి= శోభ; ఇంత పొలివోవఁ గన్+ ఈక=కొంచెంకూడా వృథా కాకుండా; ఎసలారన్= ఒప్పారగా; తార నిశ్చలత= కంటి చూపు (కనుగుడ్లను) తదేకంగా నిలిపి; కడంగి= పూని; క్రోలికొనన్+చాలుటన్= చూపులతో జుర్రుకొన గలగటం చేత; తక్కున్+కల= మిగిలిన; ఇంద్రియవర్గమున్= కన్నులు తప్ప మిగిలిన ఇంద్రియ సముదాయాన్ని; ధిక్కరించుచున్= తిరస్కరిస్తూ; కీచకముఖ్యు= కీచకులలో శ్రేష్ఠుడైన సింహబలుడి యొక్క; లోచనంబులు= కళ్ళు; 'నయనం ప్రధానం'= కళ్ళు ముఖ్యమనే; పూర్వవచఃస్థితి= పాతకాలపు సూక్తి, సామెత; తప్పకుండఁ గాన్= పొల్లుపోకుండా నిజంచేసే విధంగా; ఎలమి వహించెన్= ప్రీతిని పొందాయి.

తాత్పర్యం: ద్రౌపది శరీర సౌందర్య శోభ కొంచెం కూడా వృథా కాకుండా రెప్పపాటు లేని చూపులతో జుర్రుకొందామనే తపనతో తదేకంగా ఆమెనే చూస్తున్న కీచకుడి కన్నులు **"సర్వేంద్రియాణాం నయనం ప్రధానం"** అనే నానుడిని నిజంచేసే విధంగా ప్రీతిని పొందాయి.

విశేషం: అలం: నిరుక్తి, లోకోక్తి, వ్యుత్పత్తి వలన నామాలకు అన్వార్థాన్ని కల్పిస్తే నిరుక్త్యలంకారం. **'సర్వస్య గాత్రస్యశిరః ప్రధానం; సర్వేంద్రియాణాం నయనం ప్రధానం'** అని ప్రసిద్ధమైన సూక్తి. దీనికి సమాహార రూపం **'నయనం ప్రధానం'.** ఆ మాత్రం అంటే ఆ సూక్తి అంతా లోకుల మనస్సులలో స్ఫురిస్తుంది. లోచనం, నేత్రం అనే శబ్దాలు వాడితే సరిపోయేచోట నయన శబ్దాన్ని వాడి తిక్కన చమత్కరించాడు. నీయతే అనేన ఇతి నయనం- అని గురుబాల ప్రబోధిక. దీనిచేత

అర్థాలు పొందించబడతాయి కాబట్టి నయనం. కీచకుడి చూపు తన కామ్యార్థ సిద్ధి కొరకు ఉపయోగించిన సాధనం అని దృఙ్మీలనంతో ఉత్కట మదనావస్థగా తిక్కన వ్యాఖ్యానించాడు. అందువలన నిరుక్త్యలంకారం భాసించింది. అందాన్ని కన్నులతో జుర్రుకోవటం అనే తెలుగు లోకోక్తిని వర్ణనంలో కలిపి చెప్పటం వలన లోకోక్త్యలంకారం. జాగరమనే మదనావస్థను కూడా ఈ సాత్త్వికభావం ధ్వనింప చేస్తున్నది. రాగ సాగర పూర నిర్మగ్నుడైన కీచకుడు రెప్పపాటులేని చూపును ప్రదర్శిస్తున్నాడంటే - నీట మునిగి చనిపోయిన వాడి స్థితి స్ఫురించి భావికథార్థం అలంకార ధ్వనితో పోషించబడిన రసధ్వనిగా గమ్యమానం ఔతున్నది.(సంపా.)

క. అప్పయుఁ బరిజనములుఁ దనుఁ।
దప్పక కనుఁగొనుచునుండఁ దగవేది కరం
బొప్పని తమకము చిత్తముఁ।
గప్పికొనుట నుత్తలంబు గదురఁగ నచ్చోన్. 15

ప్రతిపదార్థం: తనున్= కీచకుడిని; ఆ+చోటన్ - అచ్చోన్= అక్కడ; అప్పయున్= అక్క; సుదేష్ణాదేవి; పరిజనములున్= చుట్టూ ఉన్న పరిచారికలూ; తప్పక= విడవక, అదేపనిగా; కనుఁగొనుచున్+ఉండన్= గమనిస్తూ ఉండగా; తగవు+ఏది= మర్యాద లేకుండా; కరంబు= మిక్కిలి; ఒప్పని= తగని, భరించరాని; తమకము= మోహం; చిత్తమున్= మనస్సును; కప్పికొనుటన్= ఆవరించటం చేత; ఉత్తలంబు= కలతతో కూడిన వేగిరపాటు; కదురఁగన్= కలుగగా, అతిశయించగా.

తాత్పర్యం: తన అక్క అయిన సుదేష్ణాదేవి, ఆమె చుట్టూ ఉన్న పరిచారికలూ తనవైపే చూస్తూ ఉన్నా, మర్యాద లేకుండా కీచకుడు మిక్కిలి మించిన తగని మోహం మనస్సును ఆవరించటం చేత ఆపలేని వేగిరపాటును అధికంగా పొందుతూ అక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శృంగార దశవిధావస్థల వలెనే అష్టాదశ శృంగార చేష్టలు కూడ చెప్పబడ్డాయి. సాహిత్య దర్పణకారుడు వాటిని ఇరవై ఎనిమిదిగా పేర్కొన్నాడు. అవి నాయికా నాయకులకు సత్త్వజాలైన అలంకారాలని చెప్పాడు. వాటిలో మూడు మనస్సు వలన పుట్టేవనీ, ఏడు అయత్నంగా పుట్టేవనీ, పదునెనిమిది స్వభావం వలన కలిగేవనీ విశ్లేషించి చెప్పాడు. స్వభావజాలైన శృంగార చేష్టలలో 'తపన' అనేది ఒకటి. **"తపనం ప్రియ విచ్ఛేద స్మరావేగోత్థ చేష్టితం"** అని దాని లక్షణం. ప్రియ విరహ సమయంలో మోహాతిరేకం చేత కలిగే చేష్ట తపన. ఇది ఇక్కడ కీచకపరంగా తిక్కన చిత్రించాడు. ఇక్కడ పూర్వరాగ విరహావస్థలో కీచకుడి మోహాతిశయావస్థ వలన వేగిరపాటు, కలతపాటు అనే చేష్టావిశేషాలు సూచించబడుతున్నాయి. తరువాతి పద్యంలో దాని అభినయాంశ వివరించబడింది. తిక్కన నాటకీయ రచనలో సూక్ష్మంగా వివరించే రసభావాభినయ శిల్ప ప్రౌఢిని ఈ పద్యం. తరువాతి పద్యం ప్రదర్శిస్తున్నాయి. (సంపా.)

సీ. తన్వంగి మవ్వంపుఁ దనులత నెసఁగెడు।
నునుఁగాంతి వెల్లువ మునుఁగఁబాఱఁ,
గిసలయహస్త కెంగేల నేపారు క్రొ।
మ్మిం చను లేయెండ మిగులఁ బర్వఁ,
గమలాస్య ముద్దు మొగంబు లేమెఱుఁగుల।
మొత్తంబు పరి చుట్టు ముట్టి కొనఁగ,
ధవళాక్షి తొంగలి తఱచు ఱెప్పల చెన్ను।
కప్పను చీఁకటి గవియుదేర,

తే. బెగ్గలం బంత కంతకు నగ్గలింప।
నొదవు చెమటతోఁ జిత్తంబు చెదరి యెందు
మెలఁగఁ దలఁపేది యా సింహబలుఁ డనంగు।
పట్టి యాడెడు జంత్రంబు పగిది నుండె. 16

ప్రతిపదార్థం: తను+అంగి= సన్నని మేనుగల సైరంధ్రి (ద్రౌపది) యొక్క; మవ్వము+ తనులతన్= కోమలమైన లతవంటి శరీరం పై; ఎసఁగెడు=

ప్రకాశించే; నును+కాంతి వెల్లువ= లలితమైన కాంతి అనే వరద; మునుఁగన్+పాఱన్= (కీచకుడు) మునిగి పోయేటట్లు ప్రవహించగా; కిసలయహస్త= చిగురాకులవంటి చేతులు గల ఆ సుందరి యొక్క; కెంపు+కేలన్= ఎర్రని చేతిలో; ఏపు+ఆరు= అతిశయించే; క్రొత్త+ మించు+అను= క్రొత్త మెరుపుతీగఅనే; లేత+ఎండ= లేత ఎండ; మిగులన్+ పర్వన్= మిక్కుటంగా వ్యాపించగా; కమల+ఆస్య= పద్మం వంటి మొగం గల సైరంధ్రి (ద్రౌపది) యొక్క; ముద్దుమొగంబు= అందమైన ముఖం యొక్క; లేఁత+మెఱుంగుల= నునుకాంతుల; మొత్తంబు= సమూహం అనే; పరి= సేన; చుట్టుముట్టికొనఁగన్= చుట్టూమూగి ఆవహించగా; ధవళ+అక్షి= తెల్లని కన్నులు గల ఆమె యొక్క; తొంగలి= వాలే; తఱచు= దట్టమైన; ఱెప్పల చెన్ను కప్పు= కనురెప్పల అందమైన నల్లని కాంతి; అను చీఁకటి= అనే చీకటి; కనియున్+తేరన్= క్రమ్ముకోగా; బెగ్గలంబు= భయం; అంతకున్+అంతకున్+అగ్గలింపన్= మరీ మరీ అధికంకాగా; ఒదవుచెమటతోన్= పుట్టే చెమట చేత; చిత్తంబు చెదరి= మనసు చెదిరిపోయి; ఎందున్+మెలఁగన్= ఎక్కడా నిలవటానికి; తలఁపు+ఏది= మనసురాక; ఆ సింహబలుఁడు= ఆ కీచకుడు; అనంగు పట్టి+ఆడెడు= మన్మథుడు పట్టి ఆడించే; జంత్రంబు పగిదిన్= యంత్రం వలె; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: ఆ సన్నని మేనుగల సైరంధ్రి యొక్క లేతతీగవంటి శరీరంనుండి పెల్లుబికే అందమైన వెలుగు వెల్లువవలె పొంగి అతడిని ముంచివేస్తుండగా; చిగురాకుల వంటి చేతులు గల ఆ సైరంధ్రి కెంపులవలె ఎర్రగా ఉన్న చేతుల నుండి అతిశయించి వెలువడే క్రొత్త మెరుపుల లేతయెండ అతడిపై మిక్కిలి వ్యాపించగా, కమలంవంటి మొగం కలిగిన ఆ సైరంధ్రి అందమైన ముఖం ప్రసరించే లలితమైనకాంతుల సమూహం అతడిపై కాంతి సైన్యం వలె విజృంభించి చుట్టుముట్టగా, తెల్లని కన్నులు గల ఆ వాలుగంటి యొక్క పెద్దవైన కనురెప్పలు అందమైన నల్లని కాంతితో అతడిపై చీకట్లు ముసిరేటట్లు చేయగా,

ఆ సింహబలుడు (కీచకుడు) భయం (విహ్వలం) అంతకంతకూ మనసులో అధికం కాగా, ఒంటినిండా పట్టే చెమటతో ఉక్కిరిబిక్కిరై మనసు చెదిరిపోయి, ఎక్కడా ఒకచోట ఉండటానికి మనసురాక, మన్మథుడు పట్టి ఆడించే ఒక యంత్రపు బొమ్మ వలె కనిపించాడు.

విశేషం: 1. అలం: ఉపమ (రూపకానుప్రాణితం), క్రమాలంకారం, సింహబలుడు మన్మథుడి చేతి కీలుబొమ్మవలె అత డాడించినట్లు ఆడుతున్నాడని అపూర్వమైన ఉపమాలంకారాన్ని చెప్పి కీచకుడి మదనావస్థను సహృదయుల హృదయాలకు ఆలంకారికంగా అందేటట్లు చేశాడు తిక్కన. కీచకుడికి 'బెగ్గలము' పుట్టి అంతకంతకు అగ్గలించిందట. బెగ్గలమంటే భయం, విహ్వలత, వివశత్వం, వ్యాకులత, కలత-అని సూర్యరాయాంధ్ర నిఘంటువు. తిక్కన తెలుగు పదం వాడితే దాని కెన్ని అర్థాలున్నాయో అన్నీ అక్కడ అన్వయించేటట్లు ప్రయోగించటం ఆయన ప్రౌఢి. సంస్కృత పదమైతే ఇన్ని అర్థాలు ఒక్కచోట కలిసిరావు. అందువలన 'బెగ్గలం' అనేది మోహాతిశయం వలన కలిగే శృంగార చేష్టలకు మూలమైన సాత్త్విక భావం. దానికి నాలుగు ముఖాలున్నాయి. నాలుగు అభినయాలున్నాయి. వాటిని తిక్కన క్రమాలంకార సుందరంగా ఈ పద్యంలో ఆవిష్కరించాడు. అది భావనామయం. 1. సన్నని తీవెవంటిసైరంధ్రిమేనుకాంతి మెరుపుతీగవలె మెరిసిపోతున్నది. దాని కాంతి వెల్లువవలె కీచకుడిని ముంచివేస్తున్నది. దానికి అతడు భయపడ్డాడు. భయంతో మొదలైన అతడి మానసికావస్థలు అంతటితో ఆగలేదు. ఆపైన మరికొన్ని పరిణామాలకు దారితీశాయి. ద్రౌపది శరీరాన్నంతా తేరిపార చూచినప్పుడు ఆమె శరీరకాంతి అతడి కొక విద్యుద్ఘాతం వలె బెడిసికొట్టింది. అందుకే ఆ భయం. కాని, ఆ అవస్థ మోహమగ్నుడైన అతడికి ఒక వివశత్వాన్ని కలిగించటానికి కారణమయింది. 2. ఆ తరువాత కరగ్రహణం కొరకు ఆమె చేతులను చూచాడు. చూస్తే చిగురుటాకుల వలె కెంపుల రంగును క్రుమ్మరిస్తూ మనోహరంగా ఉన్నాయి. కాని, ఆ కరకాంతులు లేయెండ చిరువేడిని పుట్టిస్తున్నాయి. అందుకు అతడికి చెమటపట్టింది. భయంవలన కలిగిన సాత్త్వికభావం చెమటపట్టటం. దానికి కారణం ఆమె చేతులనుండి వెలువడే

క్రొత్త మెరుపు లేయెండ అని చెప్పటం ఆలంకారికం. ఆమె చేతుల వలన అతడికి మిగిలేది బెదిరింపులే కాని ఆదరింపులు కావని ధ్వని. కాని, మోహమగ్నుడు కావటం చేత అతడు శృంగార విలాసంగా భ్రమించాడు. ఇది విహ్వలత లక్షణం. 3. ముద్దులాడి చేయిపట్టుకొన్న తరువాత రసికుడు ఆమె ముద్దుల మోమును ముద్దుపెట్టుకొనాలని భావిస్తాడు. అది అతడి తపనావస్థలోని స్వభావజమైన వేగిరపాటు లక్షణం. పద్మంవంటి అందమైన ఆమె ముఖంలో లావణ్యకాంతులు ఒక్కసారిగా అతడిని సైన్యం చుట్టుముట్టినట్లు క్రమ్ముకొని బెదిరించాయి. ఆ భావనలో అతడి మనసు చెదరిపోయింది. ఎటూ కదలటానికి వీలులేని బందీగా చిక్కిపోయాడు. ఇది వివశత్వ లక్షణం. 4. సైరంధ్రి సహజంగా ధవళాక్షి. విశాలమైన కన్నులలో కనుగ్రుడ్లకు కాంతినిచ్చే తెల్లదనం ఎవరి కళ్ళలో కనపడుతుందో ఆమె ధవళాక్షి. కళ్ళు తెరిస్తే సైరంధ్రి ధవళాక్షి. ఆమె చూపులలో చూపులుంచి. ఆ చూపులు తనపై నిలిచేటట్లు ఆమెను సమీపించాలని కీచకుడు ఆమె కళ్ళను చూచాడు. ఆమె భయంతో కనురెప్పలు చాలసార్లు మూస్తున్నది. అందువలన కనురెప్పల నూగారువలన ఏర్పడే నల్లనికాంతి చీకటిగా రేగి అతడిని ముంచివేస్తున్నది. ఆ చీకటిలో అతడికీ ఎటూ కదలాడే వీలులేక మనసు చెడి వ్యాకులపాటుతో (కలతతో) ఉండిపోయాడు. ఈ విధంగా 'బెగ్గలం' అనే మాటను కీచకుడు సార్థకం చేశాడు. క్రమాలంకారాన్ని పోషించాడు. సీసపద్యంలోని పూర్వార్ధంలో ఉపమను, ఉత్తరార్ధంలో రూపకాన్ని సమాసాలలో నిబంధించటం రూపకంతో ఉపమకు వన్నెతెచ్చే అలంకారశిల్పం.

2. తిక్కన సమాంతర తుల్య పద్య శిల్ప నిర్మాత. ఈ పద్యం "వెఱవకు ననుఁ జూచె వీఁడని యెదఁ గలుషించిన నొండొండ చెమట వొడమ" (33వ పద్యం) అనే పద్యానికి ప్రతిరూప శిల్పం. అక్కడ ద్రౌపదికి భయం వలన కలిగిన సాత్త్విక భావాలు వర్ణించాడు. ఇక్కడ కీచకుడికి భయం వలన కలిగిన శృంగార సాత్త్విక స్వభావ చేష్టలు వర్ణించాడు. కీచకుడికి భయకారకమైనది సైరంధ్రి (ద్రౌపది) యొక్క కాంతి గుణం. అది శరీరంలో, చేతులలో, ముఖంలో, కన్నులలో వివిధ రీతులలో ప్రసరించి కీచకుడిని వివిధావస్థలకు గురిచేయించింది. ద్రౌపది పతివ్రతా

ప్రభావాన్ని తిక్కన ఆమెలో కాంతిగా నిలిపి, మోహపరవశుడైన కీచకుఁడా కాంతికి భీతుడు, వివశుడు, క్షుబ్ధుడు, నిశ్చేష్టుడు అయినట్లు ధ్వనింప చేయటం రసధ్వని. శ్రీనాథు డన్నట్లు ఇది 'రసాభ్యుచితబంధం'. (కాశీఖండము 1.13)

4. 'అనంగు పట్టియాడెడు జంత్రంబు పగిదినుండె' - (వ్యాని.) - ధాతుజ విశేషణ పూర్వావ్యవహితకర్తృ ప్రథమకు తఱచుగ యొక్క షష్ఠి ఔతుంది - అనఁగుని యొక్క పట్టి ఆడు జంత్రమని అర్థం. 'యొక్కకు లోపంబు బహుళంబు". అనే సూత్రంచేత యొక్క లోపించి 'అనంగువట్టియాడెడు..' అని ప్రయోగించబడింది. (సంపా.)

కీచకుఁడు సుదేష్ణవలన ద్రౌపదితెఱం గెఱుంగఁ గోరుట (సం.4.13-5)

వ. ఇట్లు కందర్పదర్ప గోచరుండైన కీచకుండు నిజసహోదరివలన నక్కోమలి కలరూపు తెలియందలంచి దాని దెసం దగిలిన దృష్టి యెట్టకేలకుం దిగి చికొని చని యద్దేవికిం బ్రణమిల్లిన. 17

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; కందర్పదర్పగోచరుండు+ఐన= మన్మథుని గర్వానికి గురి అయినవాడు; కీచకుండు; నిజసహోదరి వలనన్= తన అక్క సుదేష్ణ వలన; ఆ+కోమలి కలరూపు= ఆ వనిత (సైరంధ్రి) యొక్క వాస్తవ పరిస్థితిని; తెలియన్+తలంచి= తెలిసికొనవలెనని భావించి; దానిదెసన్= ఆమె పట్ల; తగిలిన= తగుల్కొనిన; దృష్టి= చూపును; ఎట్టకేలకున్= చిట్టచివరకు ఎట్లాగో; తిగిచికొని= వెనుకకు మరలించికొని; చని= వెళ్ళి; ఆ+దేవికిన్= ఆ రాణికి; ప్రణమిల్లినన్= నమస్కరించగా.

తాత్పర్యం: మన్మథ ప్రభావానికి గురిఅయిన కీచకుడు తన అక్క సుదేష్ణ నడిగి సైరంధ్రిని గురించిన వాస్తవాలను తెలిసికొనాలనే కోరికతో, ఎట్టకేలకు సైరంధ్రిపై నుండి దృష్టి మరలించి అక్కను సమీపించి ఆమెకు నమస్కారం చేశాడు.

విశేషం: నిర్వ్యాజంగా అక్కకు భక్తితో మ్రొక్కటానికి వచ్చిన కీచకుడు ఇప్పుడు సవ్యాజంగా సైరంధ్రి వివరాలు తెలిసికొనటానికి నమస్కరించాడు. 'సంకల్పం' అనే మదనావస్థను ఫలవంతం చేసికొనటానికి అతడికి ఇది ఒక ఉపాయంగా ఉపయోగపడింది.

క. కాంచన పీఠము వెట్టఁగఁ।
బంచి ప్రియము చూడ్కి ముసుఁగువడఁ దను
సంభా వించునెడ నాతఁ డప్పకుఁ।
బాంచాలిం జూపి వేగపడి యిట్లనియెన్. **18**

ప్రతిపదార్థం: కాంచన పీఠము= బంగారు గద్దెను; పెట్టఁగన్= ఉంచటానికి; పంచి= పరిచారికలను ఆజ్ఞాపించి; ప్రియము= తమ్ముని మీది ప్రేమ; చూడ్కిన్= చూపులో; ముసుఁగుపడన్= క్రమ్ముకొనగా; తనున్= (కీచకుని); సంభావించు+ఎడన్= ఆదరించే మాటలు మాట్లాడేటప్పుడు; అతఁడు= కీచకుడు; అప్పకున్= అక్కకు; పాంచాలిన్= ద్రౌపదిని; చూపి= చూపించి; వేగము+పడి= త్వరపడి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సుదేష్ణ తమ్ముడి కొరకు పరిచారికలను పురమాయించి బంగారు గద్దెను వేయించింది. ప్రీతితో నిండిన చూపులతో తమ్ముడిని ముంచెత్తింది. అనువైన విధంగా మర్యాదగా మాటలాడటం మొదలుపెట్టింది. కాని, అతడు ఆమె మాటలు పట్టించుకొనక తొందరపడి ద్రౌపది వైపు చేయి చూపిస్తూ అక్కతో ఇట్లా పలికాడు.

విశేషం: దృఙ్మీలనం, మనస్సంగమం, సంకల్పం అనే మదనావస్థలను పొంది వివశుడైన కీచకుడు ద్రౌపదిని కనుకలితో వలచాడు, ఇప్పుడు వినుకలితో దానిని పెంపొందింప దలచు కొన్నాడు. నడుమ ఎట్టి విఘాతాన్నీ అతడు సహించేటట్లు లేడు. సుదేష్ణ చెప్పే మాటలు వలపునకు పరోక్ష పోషకాలు, ద్రౌపది మాటలు ప్రత్యక్ష పోషకాలు. వాటినే వినదలచుకొని లౌకిక ప్రసంగాలపట్ల అరుచిని ప్రదర్శించాడు. ఇది సంకల్పంలోని వినుకలి ప్రారంభదశ. (సంపా.)

ఉ. 'ఇయ్యరవిందగంధి కుల మేమి? చరిత్రము చంద మెట్లు? పే
రెయ్యది? నాథుఁ డెవ్వఁ? డిది యెచ్చట నెప్పుడు నుండు? నిప్డు దా
నియ్యెడ కేఁగుదేవలయు టేపని సేయఁగఁ బూని? దీనిపై
నెయ్యము కల్మి యేకొలఁది నీ మది? కింతయు నాకుఁ జెప్పుమా!' **19**

ప్రతిపదార్థం: ఈ+అరవిందగంధి= (పద్మగంధం వంటి మేని వాసనగల) ఈ వనిత యొక్క; కులము= వంశం, జాతి; ఏమి?= ఏమిటి?; చరిత్రము చందము= నడవడిక పద్ధతి; ఎట్లు?= ఎటువంటిది?; పేరు= నామం; ఏ+అది= ఏది; నాథుఁడు= భర్త; ఎవ్వఁడు?= ఎవడు?; ఇది= ఈమె; ఎచ్చటన్= ఎక్కడ; ఎప్పుడున్= ఎల్లప్పుడు; ఉండున్?= ఉంటుంది?; ఇప్డు= ఇప్పుడు; తాన్= తాను; ఈ+ఎడకున్+ ఇక్కడికి; ఏఁగుదేవలయుట= రావటం; ఏ పని+చేయఁగన్+పూని?= ఏ పనిని చేయటానికి?; నీ మదికిన్= నీ మనస్సుకు; దీనిపైన్= ఈమె మీద; నెయ్యము= ప్రేమ; కల్మి= కలిగి ఉండటం; ఏ+కొలఁది?= ఏ పాటిది?; నాకున్= నాకు (కీచకుడికి); ఇంతయున్= ఈ వివరాలన్నీ; చెప్పుమా!= చెప్పాలి సుమా!

తాత్పర్యం: 'అక్కా! ఈ పద్మసువాసన లీనే కాంత కుల మేమిటి? ఈమె నడవడిక ఎట్లాంటిది? పేరేమిటి? ఊరేమిటి? దీని భర్త ఎవరు? ఎక్కడ ఉంటున్నది? ఇక్కడికి ఏం పనిమీద వచ్చింది? దీనిని నీవు ఎంత ప్రీతితో చూచుకొంటున్నావు? ఇవి అన్నీ వివరించి చెప్పాలి.'

విశేషం: ఇన్ని ప్రశ్నలు ఒక్కసారిగా వేయటంలో కీచకుడి తమకం స్ఫురణకు వస్తుంది.

క. అనవుడు నయ్యంగన 'యితఁ।
డనంగశర దళిత హృదయుఁ డయ్యె నకట! యీ
తని చిత్తవృత్తి మరలుప।
ననురూపం బగు నుపాయ మది యెయ్యదియో?' **20**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆ+అంగన= ఆ సుదేష్ణ; అకటా!= అయ్యో!; ఇతఁడు= కీచకుడు; అనంగ శరదళిత హృదయుఁడు= మన్మథ బాణాలచేత చీల్చబడిన మనస్సు కలవాడు; అయ్యెన్= అయినాడు; ఈతని= కీచకుడి యొక్క; చిత్తవృత్తి= మానసిక పద్ధతిని; మరలుపన్= మరలించటానికి; అనురూపంబు+అగు= తగిన; ఉపాయము= ఉపాయం; అది+ఎయ్యదియో!= అదేదో కదా!.

తాత్పర్యం: కీచకుడి మాటలు విని సుదేష్ణ ఇట్లా అనుకొన్నది - 'ఇతడి హృదయం మన్మథ బాణాల తాకిడికి గాయపడింది (అంటే ఇతడు మన్మథ భావావేశపరుడైనాడు అని భావం). ఇప్పటి ఇతని మనోధోరణిని మరలించ టానికి తగిన ఉపాయం ఏదో?'

వ. అని తలంచుచుఁ గీచకుని మాటలు గీటునంబుచ్చి యొండు పలుకులు జరిపిన, నతండును సత్త్వహీనుండు గావున సత్వరుండై క్రమ్మఱి, ద్రౌపది యున్న యెడకుం జని, యా సమీపంబున నట్టాడుచు నమ్మానవతితో నిట్లనియె. 21

ప్రతిపదార్థం: అని, తలంచుచున్= అని ఆలోచిస్తూ; కీచకుని మాటలు; గీటునన్+పుచ్చి= అనాదరించి; ఒండుపలుకులు= వేరే మాటలు; జరిపినన్= కొనసాగించగా; సత్త్వహీనుండు= మనోనిగ్రహం లేనివాడు; కావునన్; సత్వరుండు+ఐ= తొందరపాటు కలవాడై; క్రమ్మఱి= మరలి; ద్రౌపది+ఉన్న+ఎడకున్+చని= ద్రౌపది ఉన్నచోటికి పోయి; ఆ సమీపంబునన్= ఆ ప్రాంతంలో; ఆడుచున్+ఆడుచున్= తారట్లాడుతూ; ఆ+మానవతితోన్= మానధనురాలైన సైరంధ్రితో (ద్రౌపదితో); ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కీచకుడి మాటలు లెక్కపెట్టకుండా సుదేష్ణ మాటమార్చడానికి ప్రయత్నించింది. కాని, వాడు అవివేకికాబట్టి తాల్మికోల్పోయి తొందరపాటుతో మరలివచ్చి ద్రౌపది సమీపంగా తిరుగుతూ ఆమెతో ఇట్లా అన్నాడు.

విశేషం: కార్యసాధనలో ఉపేక్ష ఒక ఉపాయం (శుక్రనీతి). సుదేష్ణ దానిని ప్రయత్నించబోయింది. కీచకుడు లొంగలేదు.

క. 'ఇవ్వసుమతి నే పొలఁతుల।
కివ్విధమునఁ జెలువు గలదె యెన్నండును?
నీ వెవ్వరి తనయవు? నీ పతి।
యెవ్వఁడు? పే రేమి? సెప్పు మిందునిభాస్యా!' 22

ప్రతిపదార్థం: ఇందు నిభ+ఆస్యా!= చంద్రుడి వంటి ముఖం కలదానా!; ఈ+ వసుమతిన్= ఈ భూమిపై; ఎన్నండును= ఎప్పుడైనా; పొలఁతులకున్= స్త్రీలకు; ఈ+ విధమునన్= ఇటువంటి; చెలువు= సౌందర్యం; కలదె?= ఉన్నదా? (లేదని భావం); నీవు; ఎవ్వరి; తనయవు?= కూతురివి?; నీ పతి+ఎవ్వఁడు?= నీ మగ డెవరు?; పేరు+ ఏమి?= నీ పేరేమిటి? చెప్పుము.

తాత్పర్యం: 'ఓ చంద్రవదనా! ఏనాడయినా? ఈ భూమిమీద ఏ వనితలకైనా ఇంతటి అందచందా లున్నాయా? నీ వెవరి కూతురివి? నీ మగ డెవరు? నీ పేరేమి? చెప్పుము'.

విశేషం: ఇవ్విధమునఁ జెలువు - ఈ అనే విశేషణం సౌందర్య ప్రశంసాసూచకం. ఇందు నిభాస్యా! - అనే సంబోధన సమయస్ఫూర్తిగా వాడాడు. రూపాభిమాని అయిన కీచకుడిని మోహపెట్టే విశిష్ట సౌందర్యం ద్రౌపదికి ఉన్నది.

వ. అనిన నప్పలుకులు వినియు వినమి భావించి యప్పాంచాలి నిర్వికారయై యూరకున్న నచ్చపలుండు వెండియు నిట్లనియె. 23

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+పలుకులు= ఆ మాటలు; వినియున్= వినికూడా; వినమిన్= విననట్లుగానే; భావించి= నటించి; ఆ+పాంచాలి= పాంచాల రాజపుత్రి అయిన ఆ ద్రౌపది; నిర్వికార+ఐ= ఏవిధమైన వికారం లేని మనస్సు కలదై (చలించక); ఊరక+ఉన్నన్= మాట్లాడకుండా ఉండగా;

ఆ+చపలుండు= చంచలచిత్తుడైన ఆ కీచకుడు; వెండియున్= మరల; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: కీచకుడు మాట్లాడిన మాటలు వినీ విననట్లుగా నటిస్తూ ద్రౌపది నిర్వికారచిత్తంతో మాట్లాడకుండా నిలుచున్నది. కాని, చంచలచిత్తుడైన ఆ కీచకుడు ఆమెతో ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: ద్రౌపది అతడి మాటలకు మారు పలకలేదు. చలించలేదు. కానీ, కీచకుడు తమకంతో వేగిరపడుతూ ఉండటం చేత నిగ్రహించుకొన లేకపోయాడు. ఆమె ధీరురాలు, అతడు చంచలుడు. భిన్న ప్రవృత్తుల వైరుధ్యం వైవిధ్యాన్ని కల్పిస్తూ రసోల్లాసాన్ని కలిగిస్తుంది. (సంపా.)

సీ. 'తెలి గన్నుఁగవ కాంతి పొలుపార నించుక।
కను విచ్చి చూచినఁ గాదె యబల!
చెలువంపు నెమ్మోము నెలమి సొం పినుమడి।
గా నల్ల నవ్వినఁ గాదె యింతి!.
దంతమౌక్తికరుచి దలకొన మఱుమాట।
వలికినఁ గాదె యుత్పలదళాక్షి!
యుల్లంబు సరసత దెల్లంబుగా లీలఁ।
గైకొన్నఁగాదె పంకరుహవదన!'

ఆ. యనుచుఁ జూచుఁ, జేరుఁ, నమ్ముగ్ధ పలుకులు।
వినఁగఁ గోరుఁ, గేలు తనదు కేలఁ
గీలుకొలుపఁ దలఁచుఁ గీచకాధముఁడు ని।
జానురక్తిఁ దెలుప నప్పళించు. 24

ప్రతిపదార్థం: కీచకాధముఁడు= కీచకుడనే నీచుడు (సంభాషణ కొనసాగిస్తూ); అబల!= ఓ కోమలీ!; తెలి+కన్నుఁగవకాంతి= తెల్లని కనుదోయి యొక్క వెలుగు; పొలుపారన్= ప్రకాశించగా; ఇంచుక= కొంచెం; కనువిచ్చి= కనులు తెరచి; చూచినన్+కాదె= చూడరాదా?; ఇంతి!= ఓ స్త్రీ!; చెలువము+నెఱ+ మోము= అందమైన, నిండైన ముఖం యొక్క; ఎలమిసొంపు= వికాస సౌందర్యం; ఇనుమడిగాన్= రెట్టింపుకాగా; అల్లన్= నెమ్మదిగా; నవ్వినన్+కాదె= నవ్వకూడదా?; ఉత్పలదళ+అక్షి!= కలువ రేకులవంటి కనులదానా!; దంతమౌక్తిక రుచి= ముత్యాలపలువరుస కాంతి; తలకొనన్= ప్రసరించగా; మాఱుమాట= బదులు పలుకు; పలికినన్+కాదె?= పలుకరాదా?; పంకరుహవదన!= పద్మముఖీ!; ఉల్లంబు= మనసులోని; సరసత= రసికత్వం; తెల్లంబుకాన్= తెలిసేటట్లు; లీలన్= విలాస చేష్టలను (శృంగారహావభావాలను), కైకొన్నన్+కాదె?= స్వీకరించరాదా?; అనుచున్= అని పలుకుతూ; చూచున్= ఆమె వైపు చూస్తాడు; చేరున్= ఆమెను సమీపిస్తాడు; ఆ+ముగ్ధ పలుకులు= ఆ సహజసుందరియొక్క మాటలు; వినఁగన్+కోరున్= వినాలని ఉబలాట పడతాడు; కేలు= ఆమె చేతిని; తనదుకేలన్= తన చేతితో; కీలుకొలుపన్= పట్టుకొనటానికి; తలఁచున్= భావిస్తాడు; నిజ+అనురక్తిన్= తన వలపును; తెలుపన్= ఆమెకు తెలియచెప్పటానికి; అప్పళించున్= ప్రయత్నిస్తాడు.

తాత్పర్యం: 'ఓ కోమలీ! నీ తెల్లని కన్నుల కాంతి వెలిగిపోయేటట్లు కొద్దిగా నీ కన్నులు విచ్చి చూస్తే ఏమౌతుంది? ఓ కాంతా! అందమైన నీ నిండు మొగంలోని వికాస సౌందర్యం రెట్టింపయ్యేటట్లు మెల్లగా నవ్వితే ఏం పోతుంది? కలువ రేకుల కన్నుల దానా! నీ ముత్యాలవంటి పలువరుస మెరుగులు వ్యాపించేటట్లు నోరువిచ్చి మారు పల్కితే ఏమి ఒలికిపోతుంది? పద్మముఖీ! నీ మనసులోని సరసత్వం తేటతెల్లమయ్యేటట్లు, శృంగారహావ భావాలను ప్రదర్శిస్తే ఏం పోతుంది?' అంటూ ఆ అధముడైన కీచకుడు ఆమె వైపు చూస్తాడు. ఆమెను సమీపిస్తాడు, ఆ ముద్దరాలి మాటలు వినాలని ముచ్చటపడతాడు, ఆమె చేతిని తన చేతిలోకి తీసికొందామని భావిస్తాడు. తన వలపును ఆమెకు తెలపటానికి ప్రయత్నిస్తాడు.

విశేషం: 1.అలం: క్రమాలంకారం లేదా యథాసంఖ్యాలంకారం. సైరంధ్రిని కన్నులు విచ్చి చూస్తే ఏమౌతుంది?. అని ఆమె వైపు అదేపనిగా చూస్తాడు: నవ్వితే ఏమౌతుంది అని అంటూ సమీపిస్తాడు: మారు పలికితే ఏమౌతుంది? అని ఆమె మాటలు వినాలని తహతహలాడతాడు; లీలలను ప్రదర్శిస్తే ఏమౌతుంది అని అంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసికొనాలని యత్నిస్తాడు. ఆ విధంగా సీస పద్య పాదాలలోని మాటలకూ, ఎత్తుగీతిలోని క్రియలకూ వరుసగా అన్వయం చెప్పుకొనాలి కాబట్టి క్రమాలంకారం. ఈ అలంకారం కీచకుడు సైరంధ్రిని పొందటంలో అత డనుభవించ దలచుకొన్న నాలుగు దశలను క్రమంగా ధ్వనింప చేస్తుంది.

2. ద్రౌపది తన వైముఖ్యాన్నీ అనాదరాన్నీ అతడి మాటలు విన్నా విననట్లు నటించటం ద్వారా వ్యక్తం చేసింది. కీచకుడు - తిక్కన మాటలలో - అధముడు. వాస్తవాన్ని తెలిసికొనలేక ఆమె శృంగార చేష్టలను ప్రదర్శిస్తున్నదని భావించేవాడు. శృంగార చేష్టలలో 'విహృతం' అనేది ఒకటి. **"వక్తవ్యకాలేஉప్యవచో వ్రీడయా విహృతం మతమ్"** అని లక్షణం. పలుకవలసిన సమయంలో సిగ్గు వలన పలుకకుండా మౌనంగా ఉండటం విహృతం. సైరంధ్రి విహృతాన్ని ప్రదర్శిస్తున్నదని కీచకుడు భావించాడు. విహృతానికి విరుగుడు విలాసం. **"యానవస్థా నాసనాదీనాం ముఖనేత్రాది కర్మణాం । విశేషస్తు విలాసస్స్యా దిష్ట సందర్శనాదినా"** - అని విలాస లక్షణం. ప్రియుడిని చూడగానే నడకలో, నించోటంలో, కూర్చోటంలో, చూడటంలో, మాట్లాడటం మొదలైన వాటిల్లో ప్రదర్శించే హేలా విశేషాలు విలాసంలో ప్రకటితాలౌతాయి. విముఖురాలైన నాయికను ప్రసన్నురాలిని చేసికొని, విలాసవతిగా మార్చుకొనటానికి నాయకుడు అనునయాన్ని (సాంత్వనాన్ని) ఆశ్రయిస్తాడు. కీచకు డీ పద్యంలో ప్రదర్శించింది ప్రార్థనారూప సాంత్వన ప్రక్రియ.

3. సాంత్వన ప్రక్రియలో కీచకుడు మొదట 'కుతూహలాన్ని' ప్రకటిస్తున్నాడు. ప్రదర్శిస్తున్నాడు. "రమ్యవస్తు సమాలోకే లోలతాస్యా త్కుతూహలమ్" అని లక్షణం. రమించదగిన సైరంధ్రి విలాసాన్ని చూచి, కైవసం చేసికొని, రమించాలని చాపల్యాన్ని ప్రకటించటం కీచకుడు ఈ పద్యంలో చేసిన మదన చేష్ట. ఈ అంశాన్ని 'అచ్చపలుండు' అనే విశేషణంలో తిక్కన సూచించాడు. అటు మాటలో (వాచికాభినయంలో) ఇటు చేతలో (ఆంగికాభినయంలో) దానిని ప్రదర్శిస్తున్నట్లు తిక్కన చిత్రించి నాటకీయతను రక్తికట్టించాడు.

4. కుతూహల ప్రకటనలో కూడా ఒక క్రమాన్ని పాటించటం తిక్కన రసశిల్ప రహస్యం. వలచిన దాని పొందు పొందేటప్పుడు ఆమె మనసులో కూడ కుతూహలం ఉండాలని వలపుకాడు అనుకొనటం సహజం. ఆ కుతూహలం నాలుగు దశలలో ప్రకటితమౌతుంది. (1) చూపు, సిగ్గుతో కనురెప్పలు వాలి ఉన్న నాయిక ఆసక్తితో కళ్ళు అర్ధ నిమీలితంగా తెరిచి తన సౌముఖ్యాన్ని తెలుపుతుంది. (2) అందమైన ముఖాన్ని సుముఖంగా చేసి తన మనసులోని రతిభావ సమ్మోదాన్ని చిరునవ్వు కాంతులతో తెలియపరుస్తుంది. (3) ఆ మీద మనసుతోపాటు మధురంగా మాటకూడా కలుపుతుంది. (4) ఆ తరువాత స్పర్శాదుల వలన కలిగే అనుభవాలను లీలలుగా ప్రదర్శిస్తుంది. నాయిక ప్రదర్శించే ఆ నాలుగు దశలను క్రమంగా నాయకుడు చూస్తూ, సమీపిస్తూ, మాటలు రక్తితో వింటూ, కేలు కేలు కలుపుతూ రమిస్తాడు. వాటన్నింటిని భావనామయంగా ఊహిస్తూ కీచకుడు కళ్ళు తెరిచే కలలుకంటూ, ఆమెను ఆ కలలను నిజం చేయుమన్నట్లుగా అనునయించాడు. ఒక మదనావస్థలోని ఇన్ని అంతర్దశలను చిత్రించిన తిక్కన రసబ్రహ్మ.

5. 'చూచుఁజేరు' అను పాఠానికి 'చూచుఁగేరు' అని పాఠాంతరం ఉన్నది. అదే ఉచితమైనదని కొందరి భావం. అది సరికాదు. కేరు అనే క్రియకు ఉత్సహించు, కుతూహలపడు, విజృంభించు, తిరస్కరించు, పరిహసించు-అనే అర్థాలున్నాయి. అందువలన దీనిని గ్రహిస్తే సందర్భశుద్ధి లేకపోగా, విరుద్ధార్థ స్ఫూర్తి కూడా కలుగుతుంది. కాబట్టి ప్రస్తుత పాఠమే ప్రశస్తం. (సంపా.)

వ. ఇట్లు దాన తమకంబున వడిగొనుచు, నప్పు డయ్యంగన యింగితం బూహింప వెరవుమాలి మఱియును. 25

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తాను+అ= తనకుతానే (కీచకుడు); తమకంబునన్= మోహావేశంతో; వడిగొనుచున్= వేగిరపడుతూ; అప్పుడు=

ఆ సమయంలో; ఆ+అంగన= ఆమె యొక్క; ఇంగితంబు= మనోభావాన్ని; ఊహింపన్= ఊహించటానికి; వెరవుమాలి= శక్తిలేక (ఉపాయంతోచక); మఱియును= ఇంకా (ఇట్లా పలికాడు).

తాత్పర్యం: మోహావేశంతో వేగిరపడుతున్న కీచకుడు ద్రౌపది మనస్సును తెలిసికొనే ఉపాయం తోచక (శక్తిచాలక) ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'సుదతి! నీమై చక్కఁ జూచుట కోడెదఁ।
గనుఁ బాటు వొరయునో యని తలంచి;
మదిఁ బొనర్చిన మాట మగువ! నీ పెంపునఁ।
గుదిసి నా నాలుక తుదికి రాదు;
పడఁతి! నీ కరములు పట్టంగఁ దివిరి శం।
కించి వడంకెడుఁ గేలు సూడు;
నెఱి నిట్టి దని యింతి! నీ నెమ్మనం బెన్ని।
భంగుల నరసినఁ బట్టు వడదు;

తే. చెలువ! యింక నొక్కించుక సేపు నీ వ।
నాదరంబున నెప్పటియట్ల యున్న
మన్మథుఁడు సమయించిన మగుడ నన్నుఁ।
బడయవచ్చునె యెన్ని యుపాయములను?' 26

ప్రతిపదార్థం: సుదతి!= మంచి దంతములు కలదానా!; కనుఁబాటు= దృష్టిదోషం; పొరయునో+ అని= తగులుతుందేమోనని; తలంచి= అనుకొని; నీ మై= నీ శరీరాన్ని; చక్కన్+చూచుటకున్= సూటిగా చూడటానికి; ఓడెదన్= జంకుతాను; మగువ!= ఓ వనితా; మదిన్= మనస్సులో; పొనర్చినమాట= పుట్టిన పలుకు; నీ పెంపునన్= నీ అధిక్యం వలన; కుదిసి= అణగిపోయి (ముడుచుకొని); నా; నాలుక తుదికిన్‌రాదు= నాలుక చివరిదాకా రాదు; పడఁతి!= ఓ వనితా!; నీ కరములు= నీ చేతులు; పట్టఁగన్+తివిరి= పట్టుకొనాలని యత్నించి; శంకించి= జంకు గలిగి; కేలు= చేయి; వడంకెడున్= వణుకుతున్నది; చూడు!= ఇదిగో ఈ చేయి చూడుము!; ఇంతి!= ఓ వనితా!; నీ నెఱ+మనంబు= నీ నిండు మనస్సు; నెఱిన్= పూర్తిగా; ఇట్టిది+అని= ఇటువంటిదని; ఎన్నిభంగులన్+అరసినన్= ఎన్ని రకాలుగా ఆలోచించినా; పట్టు+పడదు= స్పష్టం కాదు; చెలువ!= ఓ అందమైనదానా!; ఇంకన్= ఇక మీద; ఒక్కించుకసేపు= కొంచెం సేపు; నీవు; అనాదరంబునన్= ఆదరం చూపకుండా; ఎప్పటి+అట్లు+అ+ఉన్నన్= ఎప్పటి వలెనే ఉంటే; మన్మథుడు; సమయించినన్= చంపివేస్తే; మగుడన్= తిరిగి; నన్నున్= (కీచకుని); ఎన్ని+ ఉపాయములను= ఎన్ని ఉపాయాల చేతనైనా; పడయన్+వచ్చునె?= పొందగలవా? (లేదని భావం).

తాత్పర్యం: ఓ సుందరీ! దృష్టిదోషం తగులుతుందేమోనని నీ మేని సౌందర్యాన్ని చూడటానికే జంకుతున్నాను. నీ ఆధిక్యం చూచిన తరువాత మాట్లాడాలన్నా నాలుక చివరిదాకా మాటలు రావటం లేదు. నీ చేతులు పట్టుకొనాలని ప్రయత్నించినా (నన్ను గ్రహిస్తావో లేదో అన్న) అనుమానంతో చేతులు వణుకుతున్నాయి. ఎన్ని రకాలుగా ఆలోచించినా అసలు నీ మనస్సు ఏమిటో నాకు అంతుపట్టటం లేదు. నీ విట్లాగే మరికొంత సేపు నన్ను అలక్ష్యం చేస్తే ఆ పాడు మదనుడు నన్ను మట్టుపెట్టుతాడు. అప్పుడు ఎన్ని ఉపాయాలతో యత్నించినా నన్ను నీవు తిరిగి పొందలేవు.

విశేషం: తిక్కన రచించిన గొప్ప పద్యాలలో ఇది ఒకటి. రచనా శిల్పం అనల్పం. 1. తిక్కన ఒక గొప్ప పద్యం రచించి దానికి ప్రతిగా అంతటి గొప్ప పద్యాన్ని మరొకటి వ్రాసి చూపించే ప్రతిభ ప్రదర్శించటం ఆయన నైజం. 'తెలిగన్నుఁగవకాంతి పొలుపార నించుక కనువిచ్చి చూచినఁ గాదె యబల' -అనే 45వ పద్యానికి సమాంతర ప్రతి శిల్పంగా ఈ సీసాన్ని రచించాడు. సైరంధ్రికీ కీచకుడికీ భావసాజాత్యం, తాదాత్మ్యం ఉన్నట్లు కీచకుడు భావిస్తున్నట్లు ఈ పద్యంలో

చిత్రించటం ఇక్కడ విశేషం. తిక్కనగా రన్నట్లు అతడి 'తమకానికి' (46) ఇది నిదర్శనం. సైరంధ్రి కన్నెత్తి చూడదు - కీచకుడూ ఆమెను సూటిగా చూడలేదు. కారణాలు వేరు. కాని అవస్థలు సమం. ఆమె మాట్లాడదు-ఇతడి నోటామాట వెలువడదు. ఆమె లీలగా చేయి అందించదు. ఇతడూ చేయి వణకటం చేత అందించ(గ్రహించ)లేడు. ఆమె తీరు ఎదుటివారు గ్రహించటం కష్టం. అతడు ఆమె తీరునే కాదు తన తీరును కూడా వివేచించుకొనే స్థితిలో లేడు. సమానావస్థల ననుభవించేవాడు సానుభూతిని, సహానుభూతిని పొందాలి. కాని, సైరంధ్రి అటువంటి ఆదరబుద్ధిని ప్రదర్శించటం లేదు. మన్మథావస్థల కన్నింటికి చివరిది మన్మథబాధతో మరణించటం. అది జరిగితే ఇరువురికి పొందు కలుగదు. అది జరుగక పూర్వమే ఉపాయాంతరం చేత సమాన ధర్మాన్ని అనుభవిస్తున్న తనను రక్షించుకొనటం సైరంధ్రి కర్తవ్యమని కీచకుడి విన్నపం. విరుద్ధ రసభావ వ్యంజకాలైన సాత్త్విక భావాలను ద్రౌపది పాత్ర నాలంబనంగా చేసికొని చిత్రించిన పద్యం (33) ఒకవైపు, కీచకుడి పాత్ర నాలంబనంగా నిర్మించిన పద్యం ఇక్కడ ఈ వైపు - సమాంతర రచనా కళాఖండాలు.

2. తిక్కన తన రచనలోని మర్మాన్ని పఠితలకు కొన్ని సంకేతాల ద్వారా వ్యాఖ్యల ద్వారా సూచిస్తుంటాడు. ఈ పద్యం తరువాతి వచనంలో తిక్కన 'తన యభిలాషంబు తేటపడంబలికిన' (48) అని సూచించాడు. అభిలాష - అనేది కోరిక అనే సామాన్యార్థమే కాదు. శృంగార రసపరమైన పారిభాషిక పదార్థాన్ని కూడా ప్రకటిస్తుంది. శృంగారం సంభోగ విప్రలంభ భేదం చేత ద్వివిధం. వాటితో విప్రలంభ శృంగారం అభిలాష, ఈర్ష్యా, విరహ, ప్రవాస కారణాలతో జనించి నాలుగు రకాలుగా రాణిస్తుంది. అభిలాష విప్రలంభానికి పూర్వరాగ విప్రలంభమని కూడా పేరు. తిక్కన ఈ పద్యంలో 'అభిలాష' ను స్పష్టంగా చిత్రించానని చెప్పటం గమనించదగింది. అంటే రతిభావావస్థ రసస్థితిని (ఉత్కటావస్థను, స్థాయిస్థితిని) అందుకొన్నదని ధ్వనింప చేస్తున్నాడు. దశవిధావస్థల నీ ఘట్టంలో చిత్రిస్తున్నానని సూచించాడు. ఇది తిక్కన రసాభ్యుదయ శిల్పం.

3. ఈ పద్యంలో ప్రౌఢమైన వ్యాజస్తుతి ఉన్నది. నిందచేత స్తుతిగాని, స్తుతిచేత నిందగాని స్ఫురింపజేయటం వ్యాజనింద. అది కవిప్రౌఢోక్తిచేత గాఢతరం కావటం

ఇక్కడ దర్శనీయం. ఇక్కడ పరోక్షంగా చేసింది ద్రౌపదీ సౌందర్యస్తుతి; ప్రత్యక్షంగా చేసింది తనకు మన్మథావస్థ వలన ఏర్పడిన తొట్రుపాటు. అంటే ఆత్మ నింద. మరొకరకంగా చూస్తే కీచకుడు రసిక ప్రతిస్పందనను ప్రదర్శించి లలితుడివలె రాణించాడు. కాని, దానిని సైరంధ్రి అనాదరించటం చేత బూడిదలో పోసిన పన్నీరైపోతున్నది. కాబట్టి ఈరకంగా చూస్తే కీచకుడిది ప్రశంస; ద్రౌపది పట్ల నింద. ఈ విధంగా విరుద్ధ భావచిత్రణాన్ని అవిరుద్ధంగా సాగించటం తిక్కన నేర్పరితనం.

4. ఇందులో నాటకీయంగా 'గండం' అనే అంగం పోషించబడింది. ఒక పాత్ర అసంకల్పితంగా భావికథలో తనకు జరిగే ఒక కీడును తన మాటలలో ధ్వనింపచేస్తే గండమౌతుంది. ఈ పద్యంలో కీచక వచనాలన్నీ భావికథలో ద్రౌపదీ భీములు పన్నే మాయోపాయం వలన అతడు పొందే విషాదాంతాన్ని ధ్వనింప చేస్తున్నాయి.

5. తిక్కన 45వ పద్యంలో కుతూహలాన్నీ, ఇందులో అభిలాషనూ పోషించాడు. అభిలాషా విప్రలంభంలో చూడటంలో, పలకరించటంలో, కేలు పట్టటంలో, మనసు నర్థం చేసికొనటంలో మోహంవలన విఫలుడైనట్లు చిత్రించటం శృంగార రసాభాస చిత్రణ శిల్పం. (సంపా.)

వ. అని తన యభిలాషంబు తేటపడం బలికిన నబ్బోటి కలుషించియు, దుర్వారం బైన పరిభవ వికారంబు దోఁపకుండ తన్నుందాన యుపశమించు కొని 'వీడు దురభిమానియై యున్నవాఁడు, వేగిరపడుట వెరవుగాదు. వెరవు తోడన తప్పించుకొనవలయు' నని తలంచి యతని కిట్లనియె. 27

ప్రతిపదార్థం: అని; తన; అభిలాషంబు= కోరిక; తేటపడన్= స్పష్ట పడేటట్లుగా; పలికినన్= మాటలాడగా; ఆ+బోటి= ద్రౌపది; కలుషించియున్= కోపించినా; దుర్వారంబు+ఐన= వారింపశక్యంగాని; పరిభవ వికారంబు= అవమానం వలన కలిగిన వికారాన్ని; తోఁపకుండన్= బయటపడనీయకుండా; తన్నున్=

తాన్+అ= తనను తానే; ఉపశమించుకొని= నిగ్రహించుకొని; వీఁడు= కీచకుడు; దురభిమాని+అయి= ఎవరిని లెక్కచేయని గర్విష్ఠి అయి; ఉన్నవాఁడు= ఉన్నాడు; వేగిరపడుట= తొందరపడుట; వెరవుకాదు= యుక్తం కాదు; వెరవు తోడను+అ= నేర్పుతోనే, ఉపాయంతో; తప్పించుకొనవలయును+అని; తలంచి= భావించి; అతనికిన్+ఇట్లు+అనియెన్= అతనితో ఇట్లా అన్నది.

తాత్పర్యం: కీచకుడు తన మనస్సులోని కోరిక బయటపడేటట్లు మాట్లాడటంతో ద్రౌపది కోపించి కూడా, ఆ భరించలేని పరాభవాన్ని బయటికి పొక్కనీయకుండా, తనను తాను నిగ్రహించుకొని, వీడు దురహంకారి అని తలచి, తొందరపాటు మంచిది కాదని, ఎట్లాగో నేర్పుగా తప్పించుకొనాలని అనుకొని అతడితో ఇట్లా అన్నది.

క. **'నాయున్నబాముఁ దలఁపవ;।**
యీ యొడ లీ చీర యిట్టి యేవపుఁజందం
బో యన్న! మదన వికృతిం।
జేయు ననుట యెంతయును నిషిద్ధము గాదే! **28**

ప్రతిపదార్థం: ఓ+అన్న!= ఓ సోదరా!; నా+ఉన్న బామున్= నే నున్న కష్టపరిస్థితి; తలఁపవు+అ= నీవు ఆలోచించవు;ఈ+ఒడలు= ఈ శరీరం; ఈ+చీర= ఈ వస్త్రం; ఇట్టి= ఇటువంటి; ఏవము+చందంబు= అసహ్యమైన ఆకారం; మదన వికృతిన్+చేయున్+ అనుట= మదన వికారం కలిగిస్తుందంటే; ఎంతయును= అధికంగా; నిషిద్ధము కాదే!= తగనిది కదా!

తాత్పర్యం: 'ఓ అన్నా! కష్టాలలో ఉన్న నా పరిస్థితి నీ వూహించటం లేదు. నా మేను, నా కట్టు, బొట్టు, తీరు ఎంత అసహ్యంగా ఉన్నాయో ఆలోచించుము. ఈ పరిస్థితిలో కూడా నీకు మదనవికారం కలిగిం దనటం ఏమీ భావ్యం కాదు.

విశేషం: 'ఆఈఏ'లు త్రికం. ఆ మూడు సర్వనామాలూ తెలుగులో నిర్దేశార్థకాలే కాక, అనంత భావార్థకాలు. ద్రౌపది తన మేనును, చీరను 'ఈ' తో చూపుతూ

చెప్పటం చేత శృంగార విభావ సౌందర్య రాహిత్యం స్ఫురిస్తున్నది. అన్న, అయ్య, అప్ప - అనేవి గౌరవ వాచకాలు. తనకంటె పెద్దవయసు కలవాడు అయితే అతడిని అన్నా అని పిలవటం తెలుగువారి అలవాటు. తనను వలచి విరహాన్ని ప్రకటిస్తున్న కీచకుడిని 'ఓ అన్న!' అని బంధువాచకంతోనూ గౌరవవాచకంతోనూ పిలిచి తనను కామించటం ధర్మవిరుద్ధమని ద్రౌపది పరోక్షంగా హెచ్చరించింది. (సంపా.)

తే. **చనునె యిమ్మాటలాడ సజ్జనుల కాఁడుఁ।**
బుట్టువులతోడ నీవును బుట్టినాఁడ;
వట్లుగాకయు హీనవంశాభిజాత।
నై పతివ్రతనగు నన్ను నడుగఁ దగునె?' **29**

ప్రతిపదార్థం: సత్+జనులకున్= మంచివారికి; ఈ+మాటలు+ఆడన్= ఇటువంటి మాటలు పలుకటం; చనునె?= తగునా?; నీవును= నీవుకూడా; ఆఁడుఁబుట్టువులతోడన్= ఆడపడుచులతో; పుట్టినాఁడవు= పుట్టావు; అట్లు+కాకయున్= అట్లా కాకపోయినా; హీనవంశ+అభిజాతను+ఐ= తక్కువ కులంలో పుట్టినదాననై; పతివ్రతన్= పతివ్రతను; అగు= అయిన; నన్నున్; అడుగన్+తగునె?= అడుగవచ్చునా? (కామంతో కోరవచ్చునా?).

తాత్పర్యం: మంచివారు ఇటువంటి మాటలు మాటాడవచ్చునా? నీవా తోబుట్టువులు ఉన్నవాడివి. అందువలన అందరినీ ఆడుబడుచులుగా భావించి అసలే అట్లా మాట్లాడకూడదు. అది అట్లా ఉండగా, తక్కువ కులంలో పుట్టిన దాననూ, పతివ్రతనూ అయిన నన్ను ఇట్లా అడుగవచ్చునా?'

విశేషం: అడుగుట అనేది అచ్చమైన తెలుగు భాష, కామక్రీడకు అని అర్థం. హీనవంశాభిజాత అనేచోట శ్లేష ఉన్నదని కొందరు. హీనవంశంలో పుట్టావని ఒక అర్థం. హీన!= ఓరీహీనుడా!; వంశ+అభిజాతను= సద్వంశంలో జన్మించినదానను; అనికూడా విరవవచ్చును. పాఠకులు ఈ చమత్కారం గమనించాలి. ఆఁడుపుట్టువులతో పుట్టినవాడవు అనటంలో నీ అప్ప చెల్లెండ్రను ఎవరైనా ఇట్లా అడిగితే ఏం చేస్తావు? -అనే హెచ్చరిక ఉన్నది.

క. అని వీడఁగఁ బల్కిన న।
మ్మనుజాధముఁ డంతఁ బోక మదనోన్మాదం
బునఁ దన్ను నెదిరి నెఱుఁగక।
వనితకు నిట్లనియె గారవంపుఁ బలుకులన్. 30

ప్రతిపదార్థం: అని= అని పలికి; వీడఁగఁన్= వదలించుకొన్నట్లు; పల్కినన్= మాట్లాడగా; ఆ+మనుజ+అధముఁడు= ఆ నీచమానవుడు, కీచకుడు; అంతన్+పోక= అంతటితో ఆగక; మదన+ఉన్మాదంబునన్= మన్మథోద్రేకంతో; తన్నున్= తనను; ఎదిరిని= ఎదుటివారిని; ఎఱుఁగక= తెలిసికొనలేక; వనితకున్= ఆకాంతకు; గారవము+పలుకులన్= మర్యాదగల మాటలతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా స్పష్టంగా చెప్పినా కీచకుడు అంతటితో ఆగక, మన్మథావేశంతో ద్రౌపది అభిప్రాయం తెలిసికొనలేక మర్యాదగా ఇట్లా అన్నాడు.

విశేషం: 1. తిక్కన కీచకుడిపట్ల నరాధముడు (33వ) కీచకాధముడు (45) మనుజాధముడు (51) అని ముమ్మారు అధమ శబ్దం ప్రయోగించాడు. వివేకం లేనివాడు అనే అర్థం కావచ్చును. 2. వీడు= స్పష్టమగు-అని సూర్యరాయాంధ్ర నిఘంటువు పేర్కొన్నది. వదలించుకొనుట-అనే అర్థం సముచితం.

సీ. 'నెత్తమ్మిరేకుల మెత్తఁదనము దెచ్చి।
యచ్చునఁ బెట్టిన ట్లంద మొంది,
చక్రవాకంబుల చందంబు గొనివచ్చి।
కుప్పలు సేసిన ట్లొప్పు మెఱసి,
చందురు నునుఁగాంతి కం దేర్చి కూర్చి బా।
గునకుఁ దెచ్చిన యట్లు కొమరు మిగిలి,
యళికులంబుల కప్పు గలయంతయును దెచ్చి।
నారు వోసిన భంగి నవక మెక్కి,

తే. యంఘ్రితలములుఁ, గుచములు, నాననంబుఁ,।
గచభరంబును నిట్లున్న రుచిరమూర్తి
యనుపమాన భోగములకు నాస్పదంబు।
కాదె? యీ త్రిప్పు లేటికిఁ గమలవదన?' 31

ప్రతిపదార్థం: కమలవదన!= పద్మం వంటి ముఖం కలదానా!; నెత్తమ్మిరేకుల మెత్తఁదనము= చక్కని తామరరేకుల మృదుత్వాన్ని; తెచ్చి= తీసికొని వచ్చి; అచ్చునన్+పెట్టినట్లు= అచ్చుబోసినట్లు; అందము+ఒంది= అందమైన చందాన్ని పొంది; చక్రవాకంబుల చందంబు= చక్రవాకపక్షుల (గుండ్రని) తీరును; కొనివచ్చి= తీసికొని వచ్చి; కుప్పలు+చేసినట్లు= (రెండు) కుప్పలుగా పోసినట్లు; ఒప్పు+మెఱసి= అందంతో ప్రకాశించి; చందురు నునుకాంతి= చంద్రుని చక్కని కాంతిని; కందు= మచ్చను; ఏర్చి= వేరుచేసి; కూర్చి= అచ్చమైన కాంతిని ఒకచోట ప్రోగుచేసి; బాగునకున్+తెచ్చిన+అట్లు= శుభ్రపరచి తీసికొని వచ్చినట్లుగా; కొమరు, మిగిలి= అందం అతిశయించి; అళికులంబుల కప్పు= తుమ్మెదల సమూహాల నల్లదనం; కల+అంతయును= ఉన్నదంతా; నారు+పోసినభంగి= నారుపోసినట్లుగా; నవకము+ఎక్కి= నిగనిగలాడి; అంఘ్రితలములున్= అరికాళ్ళున్నూ; కుచములున్= స్తనాలున్నూ; ఆననంబున్= ముఖమున్నూ; కచభరంబును= ఒత్తైన కేశసమూహమున్నూ; ఇట్లు+ఉన్న= ఇంత బాగా ఉన్న; రుచిర మూర్తి= చక్కని రూపం; అనుపమానభోగములకున్= సాటిలేని సౌఖ్యాలకు; ఆస్పదంబు+కాదె= చోటు కాదా? ఈ త్రిప్పులు= ఈ డొంకతిరుగుళ్ళు; ఏటికిన్?= ఇంకా ఎందుకు?

తాత్పర్యం: 'ఓ సుందరీ! తామర రేకుల మెత్తదనం తెచ్చి, అచ్చుపోశారో అన్నట్లు నీ అడుగులు అందంగా ఉన్నాయి. చక్రవాకపక్షుల గుండ్రనితనాన్ని పోగుచేసి కుప్పలు పోసినట్లు నీ స్తనాలు ఒప్పుగా ఉన్నాయి. చంద్రబింబంలోని కళంకాన్ని తొలగించి కాంతిని బాగుచేసి దాని అందాన్ని అతిశయింప జేసినట్లుంది నీ ముఖ సౌందర్యం. తుమ్మెదల నల్లదనాన్ని కుప్ప చేసి

ప్రోగుపోసినట్లున్నది నిగనిగలాడుతున్న నీ కొప్పు. ఇంత అందమైన నీ సుందరరూపం సాటిలేని భోగాలను పొందటానికి తగినది సుమా! ఇక నీ కీ త్రిప్పట లెందుకు?

విశేషం: 1. పాదాలు చిగురుటాకులతోను, స్తనాలు చక్రవాకాలతోను, ముఖాన్ని చంద్రుడితోను, కురులను తుమ్మెదల బారుతోను పోల్చటం కవి సమయం. ఇక్కడ తిక్కన ఈ నాలుగింటిని సీసపద్యంలో విశేషంగా చెప్పాడు.

2. పాదాలు పద్మాలవలె పూజార్హాలు. చక్రవాకాలతో పోల్చడంతో స్తన సౌష్ఠవం కూడా తోస్తున్నది. కీచకుడు అవయవాల సొంపును పాదాల నుండి తలదాకా ఆపాదమస్తకం వర్ణించాడు. చూపు పాదాల నుండి క్రమంగా పైకి పాకింది. దేవతలను పాదాల నుండి మస్తకం వరకూ, మానవులను మస్తకంనుండి పాదాల వరకూ వర్ణించటం అలవాటు. ఆమె మానవకాంత కాదని కీచకుడి అభిప్రాయం.

తే. నీవు దుర్జాతిగామికి నీవ సాక్షి। పరసతీ సంగమున వచ్చు పాపమునకు నోరుతును గాని, సైరింప నోపఁ బచ్చ। విలుతు తూపుల తాఁకున కలరుఁ బోఁడి!' 32

ప్రతిపదార్థం: నీవు; అలరున్+పోఁడి!= పువ్వువంటి మేనుగలదానా!; దుర్జాతి= నీచ జాతిదానివి; కామికిన్= కాకపోవటానికి; నీవు+అ= నీకు నీవే; సాక్షి= సాక్ష్యం; పరసతీ సంగమునన్= పరస్త్రీ సంభోగం వలన; వచ్చు, పాపమునకున్= కలిగే పాపాన్ని; ఓరుతును+కాని= సహిస్తాను గాని; పచ్చవిలుతు= మన్మథుని; తూపుల తాఁకునకున్= బాణాల దెబ్బకు; సైరింపన్+ఓపన్= ఓర్చుకొనలేను.

తాత్పర్యం: ఓ సుందరీ! నీవు నీచజాతి దానివి కాదనటానికి నీవే సాక్షివి. నేను పరస్త్రీ సాంగత్యం వలన కలిగే పాపాన్ని ఓర్చుకొనగలను కాని, మన్మథబాణాల తాకిడికి ఓర్చుకొనలేకున్నాను,'

విశేషం: ద్రౌపది హీనవంశాభిజాతను, పతివ్రతను అన్నదానికి ఇది కీచకుడి సమాధానం, దోషంలో గుణాన్ని భావించి ఆ దోషాన్ని కోరుకొనటం అనుజ్ఞాలంకారం.

క. అను నప్పలుకుల కయ్యం।
గన కోపము గదిరి 'నీచు గావున జంకిం
చినఁ గాని మెత్తఁబడి పోఁ'।
డని మనమునఁ దలఁచి యిట్టు లనియెం బెలుచన్. 33

ప్రతిపదార్థం: అను+ఆ+పలుకులకున్= కీచకుడనే ఆ మాటలకు; ఆ+అంగన= ఆ ద్రౌపది; కోపము= కోపం; కదిరి= కలిగి; నీచు= అల్పుడు; కావునన్= కాబట్టి; జంకించినన్+కాని= బెదిరిస్తే గాని; మెత్తఁబడిపోఁడు+అని= అంగీకరించడని; మనమునన్+తలఁచి= మనస్సులో అనుకొని; పెలుచన్= పెద్ద ధ్వనితో గద్దిస్తున్నట్లుగా; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: కీచకుడి మాటలకు ద్రౌపది ఎక్కువ కోపం చెందింది. 'వీడు నీచుడు కాబట్టి భయపెట్టితేగాని తొలగిపోడని భావించి గట్టిగా ఇట్లా చెప్పింది.

విశేషం: ద్రౌపది మానసిక పరిస్థితిని, ఆమె కోపస్వభావాన్ని కవి చెప్పబోతున్నాడు. నీచుడితో మాట్లాడదగిన విధంగా మాట్లాడితే కాని వాడు జంకడు.

ద్రౌపది కీచకునితోఁ బరుష వాక్యంబులు వలుకుట (సం.4-13-28)

శా. 'దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసం గిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!' 34

ప్రతిపదార్థం: కీచకా!= ఓ కీచకా!; మత్పతుల్= నా భర్తలు; దుర్వార= అణపరాని; ఉద్యమ= ప్రయత్నం గల; బాహువిక్రమరస= భుజ బలాతిశయ సారం చేత; అస్తోక= తక్కువగాని; ప్రతాప= పరాక్రమం చేత; స్ఫురత్= ప్రకాశిస్తున్న; గర్వ= గర్వంచేత; అంధ= కనులు మూతబడ్డ; ప్రతివీర= శత్రువుల యొక్క; నిర్మథన= వధించటమనే; విద్యాపారగుల్= విద్యను

ఆసాంతం చదివినవారు; గీర్వాణ+ఆకృతులు= దేవతలతో సమానమైన రూపాలు కలవారు; గంధర్వుల్+ఏవురు= గంధర్వులైదుగురు; నినున్= నిన్ను; దోర్లీలన్= భుజబల విలాసంతో; వెసన్+కిట్టి= అవలీలగా పట్టి; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; మానమున్+ప్రాణమున్+కొనుట= నీ పరువునూ;, ప్రాణాన్నీ హరించడం; తథ్యం= తప్పదు.

తాత్పర్యం: 'ఓయి కీచకా! వారించటానికి వీలులేని భుజ బల పరాక్రమం గలిగిన గర్విష్ఠులైన శత్రువుల నవలీలగా వధించే విద్యలో ప్రవీణులని ప్రఖ్యాతిగాంచిన ఐదుగురు గంధర్వులు నా భర్తలు. వారు ఇప్పుడే అవలీలగా నీ మానప్రాణాలు హరిస్తారు సుమా!

విశేషం: 1. తిక్కన భారత రచనలో తెలుగువారి మక్కువ చూరగొన్న పద్య రత్నాలలో ఇది ఒకటి. తిక్కనే తన రచనకు తానే మురిసిపోయి విరాటపర్వంలోని ఈ అశ్వాసంలోనే మరల మరొకసారి ద్రౌపదినోట పలికించి (172వ పద్యం) తన కీ పద్యం మీద ఉన్న అభిమానాన్ని ప్రకటించుకొన్నాడు. ఇట్లా తిక్కన పునరావృత్తి చేసిన రెండుమూడు వృత్తాలలో ఇది మొదటిది. అదీ దీని ఘనత!

2. తెలుగులోని విమర్శకులు తిక్కన కవితను సమీక్షించేటప్పుడు ఈ పద్యాన్ని సాధారణంగా వదలిపెట్టరు. అందువలన అందరి ప్రశంసలనూ స్మరించలేము కాని, ఈ శతాబ్ది మొదటిపాదంలో 'ఆంధ్ర భారత కవితా విమర్శనము' (1929) అనే విలువైన గ్రంథాన్ని రచించి, భారత విమర్శకు ఒక మంచి బాటను చూపించిన కీ.శే. కోదాడ రామకృష్ణయ్యగారి మాటలు ముందుగా స్మరించదగినవి. వ్యాఖ్యకు మంచి బాటలు వారి ఈ క్రింది మాటలు:

"ద్రౌపదికి బాగుగఁ గోపము గదిరినది. వీఁడు నీచుఁడు గావున జంకించిన గాని పోడని తలంచినది. ఆ స్థితిలో కీచకుని జంకించుటకును, ద్రౌపదికి గదిరిన కోపమును వెలిపుచ్చుటకును తిక్కన యెట్టి గంభీరమగు శైలిని, దానికిఁ దగిన వృత్తము నవలంబించి నాఁడో చూడుడు. శార్దూల వృత్తమును వాడినాడు. అందులో ద్రౌపది - 'కీచకా' యని సంబోధించినది. 'ఓ యన్న' యను సమయము దాటినది గదా యిపుడు. అత్యంత గంభీరము, భయంకరమునగు 'దుర్వారోద్య' మేత్యాద్యతిదీర్ఘ సమాసముతో పాటు- **'మత్పతుల్; గీర్వాణాకృతుల్; గంధర్వుల్'** అను నీ హలంత పదములన్నియు నెదుటివానిని జంకించి యదల్చి వేయుటకుఁ దగినవియై యున్నవి. అవసరము కలిగినఁ గాని, తిక్కన ప్రౌఢసంస్కృత దీర్ఘ సమాసములు వాడడు. ఈ సందర్భమున నీ పద్యమును ద్రౌపదిచేఁ బలికించి దానికంటెను గంభీరంబగు నామె స్వభావమును వెల్లడి చేసినాడు. మఱియు నామె చెప్పఁదలచిన విషయమునంత ఒక్క పద్యముననే యిమిడ్చినాఁడు. ఆ సంగ్రహ నైపుణ్యముఁ (brevity of expression) బరికింపుడు. ఇట్టి సమాసములనే కాక యీ శార్దూల వృత్తము సైతము తిక్కన చాల అరుదుగనే వాడినట్లున్నాడు... సంస్కృత మూలమున ద్రౌపది ధర్మాధర్మ విచారణతోఁ గూడిన యొక్క ధర్మోపన్యాస మిచ్చినది...**"గంధర్వాః పతయో మమ - తే త్వాం నిహన్యుః"** అను దానికి గాను తిక్కనార్యుఁ డీ దుర్వారోద్యమేత్యాది పద్యమును రచించినాఁడు". (ఆంధ్రకవితా విమర్శనము - పు. 289-290).

3. ఈ పద్యశిల్పాన్ని గురించి కీ.శే. డాక్టర్ పాటిబండ మాధవశర్మగారి వ్యాఖ్య గమనార్హం: "కీచక భర్త్సనమున ద్రౌపది ప్రయోగించిన "దుర్వారోద్యమ" ఇత్యాది శార్దూల వృత్తము యొక్క నిర్మాణమునందు తిక్కన యద్భుతమైన శిల్పము ప్రదర్శించెను. **"విచ్ఛిన్నపాదం పూర్వార్ధే ద్వితీయార్ధే సమాసవత్ । శార్దూలం క్రీడితం భాతి విపరీత మతోఽధమమ్" (సువృత్త తిలకము. 2.37)** అని క్షేమేంద్రుని యుపదేశము. తిక్కన దర్శన మందుకు భిన్నముగా నున్నది. క్షేమేంద్రుడు అధమమని తెగడిన నిర్మాణమునే తిక్కన మహాశిల్పముగా నిచ్చట ప్రదర్శించెను. ద్రౌపదీ వాక్యము పూర్వార్ధమున అవిచ్ఛిన్న సమాసవంతము, ఉత్తరార్ధమున అసమస్త పదము, విచ్ఛేద బహుళమునై యున్నది. కీచకుని నీచ ప్రసంగము వినివిని యెట్లును వాడా ప్రసంగమును మానడని నిశ్చయించుకొని చిరము నిరోధించుకొన్న క్రోధమును ద్రౌపది యొక్కసారిగా వాగ్రూపమున బహిర్గతము చేసినది. చిరవిరుద్ధ క్రోధ ప్రవాహముయొక్క యుద్గతి ఆరంభమున

అత్యంత మోజోమయమగుట సహజము. ఆ యోజోలక్షణము అవిచ్ఛిన్న కల్లోలాయమాన ధారాపాతము. ఓజోవ్యయమునఁ గ్రమముగ వాగ్విచ్ఛేదనము, క్రమవర్ధమాన క్రోధాద్యుద్వేగ నిర్వహణమున క్షేమేంద్రుని యుపదేశము గ్రాహ్యము. చిరనిరుద్ధ క్రోధావేశము యొక్క హఠాద్యుత్క్రాంతియందు అది త్యాజ్యమే. తిక్కన నిర్మాణమే యిచ్చట ఉపాదేయ మగుచున్నది. పద్యమందలి స్థాయ్యక్షరము రేఫము. మూర్ధన్యమైన రేఫము ఆగ్నేయము. అది శ్రుతినికర్తన చిత్త సంతాపన శీలమని యభినవులు. అట్టి రేఫము బహువారావృత్తిచే స్థాయిత్వమును, ప్రాసాక్షరయోగముచే పుష్టిని పొంది పద్యమున దీప్తిని చక్కగా వ్యాపింపఁజేయుచున్నది. దంత్యత్వముచే కాఠిన్య లక్షణములయిన తవర్గాక్షరములు అనువారి భావమున రేఫకృత దీప్తిని పోషించుచున్నవి. ప్రథమ ద్వితీయ తృతీయ పాదములందు వడి ఉకార అకార ఈకార యుక్తమై ద్రౌపది వాక్యోచ్చారణము అనుదాత్త స్వరమున నారంభించి క్రమముగ ఉచ్చస్వరత్వమును దాల్చుచున్నదని సూచించుచున్నది. ప్రాసాక్షరమురేఫ పరసంయోగముచే ప్రాసాక్షరమురేఫ పరసంయోగముచే పరుషతరమై దారుపిండ ధర్మమును వ్యంజించుచున్నది. "దుర్" అన్న యుపసర్గము వాక్యారంభమునం దుండి కీచక దూషణరూప వాక్యోత్పత్తికి బీజత్వము ధరించుచున్నది. పూర్వపాదద్వయము హలంతత్వముచే తీక్ష్ణమై యున్నది. పద్యపూర్వ భాగమున సుదీర్ఘ సమాసము పాండవుల ప్రతివీర నిర్మథన విద్యాపారగత్వమును వ్యంజింపగా ఉత్తరార్ధము భిన్నాంగమై భీమకృత కీచక మాన ప్రాణాంగ భంగక్రమమును ప్రత్యక్షము చేయుచున్నది. ఘోషాక్షర బాహుళ్యముచే పద్యమున గాఢత్వరూపమైన ఓజస్సు మూర్తీభవించు చున్నది.

ఈ పద్యమునఁ దాను గావించిన శిల్పము తిక్కనకే మెచ్చుకొల్పి యుండ వలయును. తాను కీచకుని భంగించిన తెఱంగును భీమసేనునకుఁ జెప్పు సందర్భమునఁ దిక్కన ఈ పద్యమును యథారూపముగ ద్రౌపది ముఖమున బునరుక్తము చేసెను. భర్త్సన మాత్ర ప్రయోజనమైన స్త్రైణ క్రోధమును - అమర్షను వ్యంజించుటకు శార్దూల వృత్త నిర్మాణ మెట్లుండవలెనో తిక్కన శిల్పించి చూపెను.'' (ఆంధ్ర మహాభారతము: ఛందఃశిల్పము. పు-398. (సంపా.)

తే. అనుడు నతఁ డిట్టు లనియె 'నా యతుల బాహు।
బలముఁ జెనయంగ భవదీయ పతుల కారు
మూఁడులోకంబులందు నెవ్వాఁడు లేమి।
నిక్కువం బింత నమ్ముము నీరజాక్షి!' 35

ప్రతిపదార్థం: అనుడున్= అనగా విని; అతఁడు= కీచకుడు; ఇట్టులు+ అనియెన్= ఈ విధంగా పలికాడు; నీరజ+అక్షి!= పద్మాలవంటి కన్నులు కలదానా!; నా= నా యొక్క; అతుల బాహుబలమున్= సాటిలేని భుజశక్తిని; చెనయంగన్= ఎదిరించటానికి; భవదీయపతులు+అ= నీ భర్తలే; కారు= కాదు; మూఁడు లోకములందున్= (స్వర్గం, భూతలం, పాతాళం అనే) మూడు లోకాలలోనూ; ఏ+వాఁడున్= ఎవ్వడూ; లేమి= లేకపోవటం; నిక్కువంబు= నిజం; ఇంత= దీనిని; నమ్ముము.

తాత్పర్యం: ఆమెమాటలు విని కీచకుడు ఇట్లా అన్నాడు. "పద్మాలవంటి కన్నులు కలదానా! నన్నెదిరించటానికి నీ భర్తలే కాదు, మూడులోకాలలో మరెవ్వరూ సమర్థులు లేరన్నది నిజం. ఇది నమ్ముము'.

విశేషం: కీచకుడి మదాంధత్వం ఇందులో తెలుస్తుంది.

వ. అనిన విని సైరంధ్రి సైరణ దక్కి ధిక్కరించి యిట్లనియె. 36

ప్రతిపదార్థం: అనినన్, విని= అనగా విని; సైరంధ్రి= సైరంధ్రి వేషంలో ఉన్న ద్రౌపది; సైరణ+తక్కి= ఓర్పు కోల్పోయి; ధిక్కరించి= ఎదిరించి; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అనగా విని సైరంధ్రి సహనాన్ని కోల్పోయి కీచకుడిని ఎదిరించి ఇట్లా అన్నది.

క. 'చనుఁ జనదని చూడక యం।
దని ప్రూఁకులపండ్లు గోయఁ దలఁచుట హితమే?

మును చెడిన రావణాదుల।
విని యెఱుఁగవె యెన్నఁడును వివేకవిహీనా!' **37**

ప్రతిపదార్థం: వివేకవిహీనా!= ఓయీ వివేకం (బుద్ధి) లేనివాడా!; చనున్+చనదు చూడక= ఇది తగింది, ఇది తగనిది అని ఆలోచించకుండా; అందని మ్రాఁకుల= (ఎత్తుగా ఉండి) అందని చెట్ల యొక్క; పండ్లు+కోయన్+తలఁచుట= పండ్లు కోయాలనుకొనటం; హితమే?= మేలా?; మును చెడిన= పూర్వకాలంలో చెడిపోయిన; రావణ+ఆదులన్= రావణాసురుడు మొదలైన వారిని గురించి; ఎన్నఁడును= ఎప్పుడుకూడా; విని+ఎఱుఁగవె?= వినలేదా?

తాత్పర్యం: ఓయీ వివేకం లేని కీచకా! ఈ పని తగునా తగదా అని ఆలోచించక, అందని చెట్లకు కాసిన పండ్లు కావాలని కోరుకొన్నట్లుగా, దుర్లభాలైన వాటిని కోరటం మేలుగాదు. తొల్లి రావణాదులు ఇటువంటి కోర్కెలు కోరి చెడిపోయారని ఎన్నడూ వినలేదా?

విశేషం: 'అందని మ్రానిపండ్లు' అనేది తెలుగు జాతీయం. అందని ద్రాక్షపండ్లు పుల్లన. పురాణగాథతో ప్రస్తుతాంశాన్ని మేళవించి ద్రౌపది హెచ్చరిస్తున్నది. రావణాదులవలె కీడు తెచ్చుకుంటావని చెప్పింది. త్రేతాయుగంలో రావణుడు స్త్రీ వ్యామోహం చేత తాను తన వంశాన్ని కూడా నాశనం చేయటం ఇక్కడ ద్రౌపది గుర్తుచేస్తున్నది. పరస్త్రీ వ్యామోహం ఎంతటి ఘోరాల పాలు చేస్తుందో తెలియజేసింది. అలం: లలితం; చెప్పదలచుకొన్న విషయాన్ని చెప్పకుండా దానితో సమానంగా మరో అప్రస్తుత విషయం చెప్పటం లలితాలంకారం.

తే. ఇవ్విధంబునఁ బలికిన యింతి పలుకు।
గాన నేరక తమ యప్పకడకు మగుడ
నరిగి నెవ్వగ మనమునఁ బిరిగొనంగఁ।
జిన్నఁబోయిన మొగముతో సింహ బలుఁడు. **38**

ప్రతిపదార్థం: ఈ విధంబునన్+పలికిన= ఇట్లా మాట్లాడిన; ఇంతిపలుకు= సైరంధ్రి మాటను; కాననేరక= తెలిసికొనలేక; తమ అప్పకడకున్= తన అక్క వద్దకు; సింహబలుఁడు= కీచకుడు; నెఱ+వగ= మిక్కిలి దుఃఖం; పిరిగొనంగన్= ఆవహించగా; చిన్నఁబోయిన మొగముతోన్= వాడిపోయిన ముఖంతో; మగుడన్+అరిగెన్= మళ్ళీ వెళ్ళాడు.

తాత్పర్యం: ఇట్లా మాట్లాడిన ఆమె మాటను అర్థం చేసికొనలేక సింహబలుడు మనసులో మిక్కిలి బాధ నిండిపోగా మొగం చిన్నబుచ్చుకొని తిరిగి తన అక్క దగ్గరికి వెళ్ళాడు.

క. చని మదనాగ్ని జ్వాలలు।
దనుకఁగ నిట్టూర్పు గాడ్పు దందడి నిగుడం
దను నూరార్పఁగ సఖి దొరక ।
కొనమికి వెనుఁబడుచుఁ గీచకుం డా సతితోన్. **39**

ప్రతిపదార్థం: కీచకుండు= కీచకుడు; చని= వెళ్ళి; మదన+అగ్నిజ్వాలలు= విరహం అనే అగ్ని యొక్క మంటలు; తనుకఁగన్= పైకి రేగగా; నిడు+ఊర్పు గాడ్పు= నిట్టూర్పు సెగలు; దందడి నిగుడన్= మాటిమాటికీ (సాంద్రతతో) వ్యాపించగా; తనున్= తనను (కీచకుడిని); ఊరార్పఁగన్= ఊరడించటానికి, సఖి= సైరంధ్రి; దొరకొనమికిన్= అంగీకరించక పోవటం చేత; వెనుఁబడుచున్= వెనుకకు మరలి; చని= వెళ్లి; ఆ సతితోన్= సుదేష్ణతో.

తాత్పర్యం: కీచకుడు అట్లా వెళ్ళి మన్మథాగ్ని జ్వాలలు కాల్చివేయగా నిట్టూర్పులు దీర్ఘంగా విడుస్తూ, ద్రౌపది తన మాటకు అంగీకరించలేదనే పరితాపంతో మళ్ళీ వచ్చి సుదేష్ణతో ఇట్లా అన్నాడు.

వ. 'ఏ నప్పుడు నీకుం జూపి యన్వయ నామధేయంబు లడిగిన యప్పొలఁతి వలనం జిక్కి చిత్తం బుత్తల పడుచున్నయది; యిటమీఁద నీవ యెఱుంగు; దయ్యింతి యింతసేపు నీ చేరువనుండి యిప్పుడెట మెలఁ

గె?' నని యడిగిన విని, యతని వేగిరపాటు చూచి శిరఃకంపంబు సేయుచు
సుదేష్ణ నిజాంతర్గతంబున. 40

ప్రతిపదార్థం: ఏన్+అప్పుడు= నేను వచ్చిన వెంటనే; నీకున్+చూపి= నీకు చూపించి; ఏను= నేను; అన్వయ నామధేయంబులు= వంశమూ, పేరూ; అడిగిన= ప్రశ్నించిన; ఆ+పొలఁతి వలనన్+చిక్కి= ఆ వనితపైన లగ్నమై; చిత్తంబు= మనస్సు; ఉత్తలము+ పడుచున్+ఉన్న+అది= బాధపడుతున్నది; ఇటమీఁదన్= ఇకపైన; ఈవు+అ= నీవే; ఎఱుంగుదు(వు)= తెలిసికొంటావు; ఆ+ఇంతి= ఆ వనిత; ఇంతసేపు= ఇంతకాలం; నీ చేరువన్+ఉండి= నీ దగ్గర ఉండి; ఇప్పుడు; ఎట మెలఁగెన్?= ఎక్కడికి వెళ్ళింది; అని, అడిగిన; విని; అతని= కీచకుడి యొక్క; వేగిరపాటు= తొందరపాటు; చూచి= గమనించి; సుదేష్ణ; శిరఃకంపంబు+చేయుచున్= తల ఆడిస్తూ; నిజ+అంతర్గతంబునన్= తన మనస్సులో.

తాత్పర్యం: 'నే నప్పుడు నీకు చూపించి వంశాన్నీ, పేరునూ గురించి అడిగిన స్త్రీమీది మోహంతో నా మనస్సు వేగిరపడుతున్నది. ఆపైన నీకే తెలుసు. ఆమె ఇంతవరకు నీ దగ్గరే ఉండి ఇప్పు డెక్కడికి వెళ్ళింది?' అని కీచకుడడిగాడు. అతడి తత్తరపాటు చూచి సుదేష్ణ తల ఊపుతూ మనస్సులో ఇట్లా అనుకొన్నది.

విశేషం: శిరఃకంపం ఒక సాత్త్విక భావం. వితర్క సూచకం. తిక్కన నాటకీయ శిల్ప సంకేతం. (సంపా.)

తే. **'రాగరసమగ్నుఁడయ్యె సైరంధ్రిఁ జూచి।**
యకట! దీన నింకేమి యపాయమగునొ?
వలదు తగదన్న నుడిగెడు వాఁడె వీఁడు?
మాయదైవమ! యే నేమి సేయుదాన? 41

ప్రతిపదార్థం: వీఁడు= ఇతడు, కీచకుడు; సైరంధ్రిన్+చూచి= సైరంధ్రిని చూచి; రాగరసమగ్నుఁడు+అయ్యెన్= మోహమనే (వలపనే) నీటిలో మునిగాడు; దీనన్= ఇందువలన; ఇంకన్+ఏమి అపాయము+అగునొ?= ఏమి కీడు జరుగుతుందో; వలదు, తగదు+అన్నన్= వద్దు, మంచిది కాదని చెప్పినా; ఉడిగెడు వాఁడె?= మానుకొనే వాడుకాదు; మాయదైవమ!= ఓయి మాయలు కల్పించే భగవంతుడా!; ఏను+ఏమి, చేయుదానన్?= నేనేం చేసేది?

తాత్పర్యం: సైరంధ్రిని చూచి కీచకుడు మోహపరవశుడైనాడు. దీనివలన ఏమి అపాయం కలుగుతుందో తెలియదు. వలదని వారించినా వీడు మానేవాడు కాడు (మాట వింటాడా?). భగవంతుడా! ఇప్పుడు నే నేమి చేసేది?

విశేషం: ఈ పద్యంలో 'అకట!' అనే విచార సూచకమైన ఆశ్చర్యార్థకం మొదట గమనించ తగింది. సైరంధ్రిని చూచి రాగరసంలో కీచకుడు మునిగాడని గ్రహించింది సుదేష్ణ. అయితే విచార మెందుకు? సైరంధ్రి పరపురుషులను కోరని చిత్తవృత్తి కలిగినందుకా? అంతఃపుర స్త్రీల పట్ల రాణిమందిరంలో ఒక పురుషుడు అట్లా వ్యవహరించినందుకా? ఈ రెండు ప్రశ్నలు ధర్మసంబంధులు. దీనికంటె ఆమెను కలవరపెట్టేది సైరంధ్రి భర్తల పరాక్రమం (ప్రథమాశ్వాసంలో 324,325 పద్యాలు గమనించాలి). నీచమతితో ఆమెను చూచినవాడిని హరిహరాదులు అడ్డం వచ్చినా ఆమె భర్తలు ఆ రాత్రిలోపే మట్టుపెట్టుతారట! వందలకొలది బంధువులున్నా, ఎంత శక్తిమంతుడైనా అతడు చావటం తప్పదట! సైరంధ్రి చెప్పిన ఆ మాటలు కీచకుడిపట్ల మరణమృదంగం వలె మనస్సులో మారుమ్రోగి ఉంటాయి. ఆ గండాన్ని స్మరించి ఆమె 'అయ్యో!' అని బాధపడింది. అందుకే ఈ వలపు వలన కీచకుడికి ఎటువంటి అపాయం వస్తుందో అని భయపడింది. ఆ సంగతి అతడితో చెప్పటానికి వీలు లేదు. కాక, ఎట్లా చెప్పినా అతడు వినడు. దుర్విదగ్ధుడు కావటం చేత ఒకరు చెప్పిన మాట వినడు. తనకు తోచదు. అందువలన ఆ పరిస్థితులలో ఆమె ఏమీ చేయలేని ఒక నిస్సహాయస్థితిలో నిలిచిపోయింది. అప్పటి ఆమె మానసికస్థితిని 'మాయదైవమా!' అని దయనీయంగా అనటంలో తిక్కన ధ్వనింపచేశాడు. జరుగకూడనిది ఏదైనా జరిగినా, పొసగకూడనిది ఎక్కడైనా పొసగినా అది విధివైపరీత్యంగా భావించటం లోకసహజం. ఆ లోకవైపరీత్య భావానికి వాచికమైన ప్రతిస్పందన 'మాయదైవమా!' అనే

తెలుగుజాతీయం. భావానుగుణమైన వాచికాభినయం ఈ పద్యంలోని రసశిల్పం. (సంపా.)

వ. అయిన నా నేర్చుకొలంది(దగిన తెఱంగున వారించి చూచెదంగాక!' యని యూహించి యిట్లనియె. 42

ప్రతిపదార్థం: అయినన్= అయినప్పటికి; నానేర్చుకొలందిన్= నా శక్తి కొలదీ; తగిన తెఱంగునన్= తగిన విధంగా; వారించి చూచెదన్+కాక!= సాధ్యమైనంత వరకు వద్దని చెప్పి చూస్తాను; అని; ఊహించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అయినా నా శక్తివంచన లేకుండా వద్దని చెప్పి చూస్తానని ఊహించి సుదేష్ణ ఇట్లా అన్నది.

విశేషం: కీచకుడి ఔద్ధత్యం, తన భద్రత దృష్టిలో పెట్టుకొని మితిమీరకుండా సుదేష్ణ ప్రవర్తించింది.

సీ. 'లలితంబు లగు మట్టియల చప్పు డింపార।
నంచకైవడి నడ నల్ల వచ్చి,
యెడ మేని నెత్తావి సుడియంగ(బయ్యెద।
సగము దూలించి పై మగుడ(దిగిచి,
సోలెడు నెలదీ(గె లీల(గ్రాలుచు వింత।
చెలువంబు దలకొన(జేరి నిలిచి
తెలిగన్ను(గవకు నెచ్చెలియైన లే(తన।
వ్వొలయంగ సరసంపు(బలుకు పలికి,

తే. మెఱయు చెయ్వుల రాగంబు మెయికొనంగ।
నెడ(ద సొగయించు మాటల నెలమి మిగుల
నిన్ను ననురక్తి(గొలుచు నన్నెల(త లుండ।
నీరసాకార సైరంధ్రి(గోర(దగునె?' 43

ప్రతిపదార్థం: లలితంబులు+అగు= మనోహరమైన; మట్టియల చప్పుడు= కాలిమట్టెల శబ్దం; ఇంపు+ఆరన్= చెవికి ఇంపు కలిగించేటట్లు; అంచకైవడి నడన్= హంసనడకవంటి నడకతో; అల్లన్+వచ్చి= మెల్లగా వచ్చి; ఎడమేని నెత్తావి= సున్నితమైన శరీరపు మంచివాసన; సుడియంగన్= ప్రసరించగా; పయ్యెద= పైట; సగము తూలించి= సగభాగం విలాసంగా జార్చి; మగుడన్+తిగిచి= మళ్ళీ మీదికి లాగుకొని; సోలెడు ఎలదీ(గెలీలన్= వ్రాలే లేత తీగవలె; క్రాలుచున్= చలిస్తూ; వింత చెలువంబు= కొత్త అందం; తలకొనన్= కలిగేటట్లు; చేరి, నిలిచి= ప్రక్కకు వచ్చి నిలబడి; తెలికన్ను(గవకున్= తెల్లని కన్నుల జంటకు; నెచ్చెలి+ఐన= చెలి అయిన (సైదోడయిన అని భావం); లే(తనవ్వు= చిరునవ్వు; ఒలయంగన్= వ్యాపించగా; సరసము+పలుకు= వలపు మాటలు; పలికి= మాట్లాడి; మెఱయు చెయ్వులన్= ప్రకాశించే ప్రేమ చేష్టలలో; రాగంబు= వలపు; మెయికొనంగన్= కలుగగా; ఎడ(దన్= మనస్సును; సొగయించుమాటలన్= పరవశింపజేసే మాటలతో; ఎలమి= సంతోషం; మిగులన్= అతిశయించగా; నిన్నున్= (కీచకుడిని); అనురక్తిన్= ప్రేమతో; కొలుచు= సేవించే; ఆ+నెల(తలు+ఉండన్= ఆ కాంతలుండగా; నీరస+ఆకారన్= రసహీనమైన రూపం కలిగిన; సైరంధ్రిన్= ఆ పూలుముడిచే దానిని; కోరన్+తగునె?= కోరటం భావ్యమా?

తాత్పర్యం: అందమైన కాలిమట్టెల చిరుసవ్వడులు చెవికి, మనసుకు హాయి కలిగిస్తూ ఉండగా హంస నడకలతో మెల్లగా వచ్చి, సున్నితమైన శరీరపు సువాసన చుట్టుముట్టగా, పైట సగం జారిపోగా దానిని పైకి మరల సర్దుకొంటూ, గాలికి అటునిటు తూగే లేత తీగవలె ఒప్పారుతూ అబ్బురం కొలిపే అందం తొణికిసలాడేటట్లు దగ్గరగా చేరి నిలువగా, తెల్లని కాంతుల కనుదోయికి ఇష్టసఖి (సాటి) అయిన చిరునవ్వు చిలికేటట్లు వలపు మాటలు పలికి, ప్రదర్శించే ప్రతి చేష్టలోనూ మనసులోని వలపు ఒలకపోయగా, మనసును మరపించే మాటలతో ప్రీతిని పెంచేటట్లు నిన్ను అనురాగంతో సేవించే ఆ అందగత్తెలు (అంతమంది నీ ఇంట) ఉండగా (వారందరినీ వదలి), ఎటువంటి రాగరసాన్ని

అందించలేని ఆకారం గల (నీరసాకార) ఈ సైరంధ్రిని కోరటంలో ఏమి న్యాయం ఉన్నది?

విశేషం: మట్టెలతో నడచివచ్చే వనిత సామీప్యాన్ని కోరి ఆసక్తిని, పయ్యెదను జార్చుకొనే వనిత అభిలాషను, తీగవంటి మేనును, వింత సోయగాలతో ప్రదర్శించే లలితాంగి పొందును, తెలిగన్నుల కాంతితో చిరునవ్వును ప్రదర్శిస్తూ వలపు మాటలు పలికే వనిత సాముఖ్యాన్నీ, శృంగార చేష్టలు ప్రకటించే వనిత లీలావిభ్రమాన్నీ, మనసును మరపించే మాటలాడే వనిత పారవశ్యాన్నీ ప్రకటిస్తారని సుదేష్ణ చెప్పటం తమ్ముడి మనసు మరల్చటానికే! ప్రియుడికై బయలుదేరిన స్థితి నుండి అతడి పొందులో పరవశించేంతవరకు ఆరు రకాలైన స్త్రీల మదన చేష్టలు ఈ సీసంలో చెప్పబడ్డాయి. ఒక్కొక్క చరణంలో వర్ణించబడిన వనిత ఒక్కొక్కరు వేరుగా ఉండవచ్చును. ఒక్క వనితలోని వివిధావస్థలు కావచ్చును. హావభావాలను అట్లా రసానుభవానికి అనుగుణంగా ఆవిష్కరించగలిగిన అందమైన ఆకారం కలిగినవారు కీచకుడికి ఎందరో ఉన్నారు. అత డప్పటికే దక్షిణ నాయకుడు. అతడి రసికతకు తగినంత రసికురాలు సైరంధ్రి కాదనీ (మనసులో వలపు లేనిదనీ) సుదేష్ణ నచ్చచెప్పి అతడిని వారింపచేయటానికి ప్రయత్నించింది. కాని, కీచకుడి దృష్టికి సుదేష్ణ మాటలు అపరిణతాలు, అనాదరణీయాలుగా తోచాయి. అది నిజం కూడా. ఇంతటి వర్ణనం నిష్ఫలం కావటం అతడి రాగరసమగ్నతకు రమణీయ వ్యాఖ్యానం. సీసపద్య ప్రథమ తృతీయ చరణాలలో ఉపమాలంకారం. ద్వితీయచతుర్థ చరణాల్లో స్వభావోక్తి అలంకారం రచనకు వన్నె పెట్టుతున్నాయి. (సంపా.)

వ. అనిన నప్పలుకులదెస ననాదరంబు సేయుచు నచ్చేడియం జూచి
కీచకుం డిట్లనియె. 44

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+పలుకుల, దెసన్= ఆ మాటల పట్ల; అనాదరంబు+ చేయుచున్= లెక్కపెట్టక; కీచకుండు; ఆ+చేడియన్= ఆ సుదేష్ణను; చూచి; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సుదేష్ణ మాటలను లెక్కపెట్టక కీచకు డిట్లా అన్నాడు.

క. 'నా కొలువు వార కా; ర।
న్నాకేశుం గొలుచు నంగనలలోనైనన్
లేకునికి నాకుఁ దెల్లం।
బా కొమ్మకు నీడు పోల్పనయ్యెడు సుదతుల్. 45

ప్రతిపదార్థం: నా కొలువు వారు+అ= నా కొలువులోనివారే; కారు= కాదు; ఆ+నాక+ ఈశున్= ఆ ఇంద్రుని; కొలుచు+అంగనలలోన్+ఐనన్= సేవించే (దేవ) వనితలలోకూడా; ఆ కొమ్మకున్= ఆ స్త్రీతో; పోల్పన్= పోల్చటానికి; ఈడు= సరి (అయిన); సుదతుల్= స్త్రీలు; లేక+ఉనికి= లేకపోవటం; నాకున్+తెల్లము= నాకు స్పష్టంగా తెలి యును.

తాత్పర్యం: సైరంధ్రితో పోల్చదగిన స్త్రీలు నా కొలువులోనే కాదు, ఆ ఇంద్రుడిసభలో కూడా లేరు. అది నాకు తెలుసు.

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. నాకేశుడిని కొలిచే స్త్రీలలో కూడా లేరనటంవలన సేవించే స్త్రీలలలో ఇతర స్త్రీలమాట వేరే చెప్పాలా? అని భావం కనుక కావ్యార్థాపత్తి. ద్రౌపది అపూర్వ సౌందర్యవతి అని కీచకుడి భావన. అట్లా చెప్పగలిగిన అనుభవజ్ఞుడు కూడా అతడు. (సంపా.)

సీ. గండుమీలకుఁ బుట్టి కాము బాణములతోఁ।
గలసి యాడెడు నట్టి కన్నుఁగవయు,
బిస కాండముల శిక్షఁ బెరిఁగి లేఁ దీఁగల।
మెచ్చక యున్నట్టి మృదు కరములుఁ,
జిగురులతో సంధి సేసి యంబుజముల।
పై నెత్తి చను నట్టి పదతలములుఁ,
గలకంఠములచేతఁ గఱచిన విద్య వీ।
ణల కిచ్చునట్టి తిన్నని యెలుంగు,

తే. నత్తెఱంగున రేఖయు, నవ్విధంబు।
గరువ చందంబు, నమ్మెయి కలికితనము,
నట్టి చెన్నును సైరంధ్రియంద కాక।
కలవె యొరులకు? నెఱుఁగక పలికి తబల! 46

ప్రతిపదార్థం: గండుమీలకున్= పెద్ద చేపలకు; పుట్టి= జన్మించి; కామ బాణములతోన్= మన్మథబాణాలతో; కలిసి+ఆడెడు+అట్టి= కలిసిమెలసి ఆడుకొనే; కన్నుఁగవయున్= కనుదోయి; బిసకాండముల శిక్షన్= తామర తూండ్ల శిక్షణలో; పెరిఁగి= పెద్దవి అయి; లేఁత+తీగల మెచ్చక+ఉన్న+అట్టి= లేత తీగలను మెచ్చని; మృదుకరములున్= మెత్తని చేతులు; చిగురులతోన్ సంధి+చేసి= చిగురుటాకులతో సఖ్యపడి; అంబుజము లపైన్+ ఎత్తి= తామరల మీద యుద్ధానికి; చను+అట్టి= వెళ్ళే; పదతలములున్= అరికాళ్ళు; కలకంఠముల చేతన్= కోకిలల చేత; కఱచిన విద్య= నేర్చుకొన్న చదువు; వీణలకున్+ ఇచ్చు+అట్టి= వీణలకు ఇచ్చే; తిన్నని+ఎలుంగున్= చక్కని కంఠస్వరం; ఆ+తెఱంగున రేఖయున్= ఆ విధమైన ఆకార లక్షణం; ఆ+విధంబు= అటువంటి (సాటిలేని అని భావం); గరువచందంబున్= ప్రౌఢమైన చక్కదనం; ఆ+మెయి కలికితనమున్= ఆ విధమైన సౌందర్యం; అట్టి చెన్నును= అటువంటి (సాటిలేని) చక్కదనం; సైరంధ్రి+ అందున్+అ= సైరంధ్రిలో మాత్రమే; కాక= కాకపోతే; ఒరులకున్= ఇతరులకు; కలవె= ఉన్నాయా? అబల!= వనితా! (సుదేష్ణా!); ఎఱుఁగక= తెలియక; పలికితి(వి)= మాట్లాడావు.

తాత్పర్యం: పెద్ద చేపలకు పుట్టి, మన్మథబాణాలతో కలిసి ఆడే కళ్ళూ, తామర తూళ్ళ శిక్షణలో పెరిగి లేత తీగల సౌకుమార్యం మెచ్చని చేతులూ, చిగురాకులతో చెలిమి చేసికొని పద్మాలపై దండెత్తే అరికాళ్ళూ, కోకిలల వద్ద నేర్చుకొన్న స్వరవిద్యను వీణెలకు అందించే మెల్లని కంఠస్వరం, ఆ సాటిలేని

రూపవైభవం, ఆ సాటిలేని గడుసుదనం, అటువంటిదే అయిన నేర్పరితనం, అంతటి చక్కదనం సైరంధ్రిలోనే ఉన్నాయి కాని ఇతర వనితలలో కనబడతాయా? (లేవని భావం). ఓ అమాయకురాలవైన అక్కా! నీవు ఈ విషయం గమనించకుండా మాట్లాడావు.

విశేషం: 1. అలం: ఆర్థీ ఉపమ. క్రమాలంకారం; కారణమాల.

2. ద్రౌపదీ సౌందర్య వర్ణనంలో వాక్యగత పూర్ణ ఆర్థీ ఉపమాలంకారాన్ని తిక్కన సార్థకంగా వాడి ప్రౌఢిని ప్రదర్శించాడు. 'వలె' వంటి ఉపమావాచకాలు వాడకుండా ఆ అర్థాన్ని చెప్పే విశిష్ట పదాలతో వాక్యాల ద్వారా, సమాసాల ద్వారా, తద్ధితాల ద్వారా ఆర్థీ ఉపమ రచనలో రాణిస్తుంది. భావుకుడైన వాడు ఈ అలంకారాన్ని సార్థకంగా ప్రయోగిస్తాడు. సైరంధ్రీ సౌందర్య భావనంలో ఊహాలోకాలలో విహరిస్తూ, సుదేష్ణకు తెలియని సౌందర్య విశేషాలను వివరించాలనే కీచకుడి తమకం ఈ అలంకారోక్తిని ప్రదర్శించినట్లు రచించటం సార్థకశిల్పం. ఆర్థీ ఉపమ ధ్వనికి, అందులోనూ రసధ్వనికి ఎంతో ఉపస్కారకంగా ఉంటుందని లాక్షణికుల అభిమతం. దానికి ఈ తిక్కన పద్యం ఉచితోదాహరణం.

3. సీసపాదాల పూర్వార్ధంలో ఉపమాలంకార ధ్వని పుట్టి, శిక్షఁబెరిగి, సంధి చేసి, కఱచినవిద్య - ఇవి ఉపమాద్యోతకాలు, సమానార్థకాలు. ఇక రెండుమూడు పాదాల ఉత్తరార్ధాలలో ఉపమానాలకంటె ఉపమేయాలకు ఆధిక్యం చెప్పబడటం చేత వ్యతిరేకాలంకారం (మెచ్చని, పైనెత్తిచను= తిరస్కరించు); మొదటిపాదంలోని ఉత్తరార్థంలో కలసియాడు= సమానం - కాబట్టి ఉపమాధ్వని. నాల్గవపాదం ఉత్తరార్థంలో - వీణలకు విద్యలేదు కాబట్టి వ్యతిరేకాలంకారధ్వని.

4. అలంకారధ్వని రసధ్వనిలో పర్యవసించే ఒక శిల్పప్రస్థానం ఈ పద్యంలో ప్రత్యక్షమౌతుంది. ఎత్తుగీతిలో సైరంధ్రి అందంలో రేఖ, గఱువచందము, కలికితనము, చెన్ను-అనేవి క్రమంగా పేర్కొనబడ్డాయి. ఇతరులయందు ఉండని విధంగా ఒక ప్రత్యేకత, అపూర్వత వాటియందు చెప్పబడింది. ఆ నాలుగింటిలోని

ఆ విశేషాలను నాల్గు సీసపద్యపాదాలలో వర్ణించి తిక్కన క్రమాలంకారాన్ని లేదా యథాసంఖ్యాలంకారాన్ని పాటించాడు. అందులో మరొక చమత్కారం కారణమాలను పొదగటం. ఇందులో పూర్వపూర్వములకు ఉత్తరోత్తరాలు కారణాలైనట్లు నిబద్ధించబడటం చేత కారణమాల రాణించింది. ఎట్లాగంటే - సైరంధ్రి అందం ముందుగా కన్నుగవలో రూపుతాల్చింది. అట్లా రూపుకట్టటానికి కారణం ఆమె కన్నులు గండు చేపలకు పుట్టటం, మదనబాణాలతో కలిసి ఆడటం. పుట్టి ఆటలాడుతున్న బాల్యం భావనామయం. గండుమీలకు పుట్టినాయంటే వాటి పోలిక కలిగి ఉన్నాయని కవిసమయం. మదనబాణాలతో కలిసి ఆడాయంటే చూపులు తూపులుగా ఉండటమే కాక కామభావకారకాలని వ్యంగ్యం. ఆమె అందానికి ఒక తీరును కల్పించేది కన్నుగవ సౌందర్యమని భావం. సైరంధ్రి సౌందర్యంలోని రెండవగుణం సాటిలేని గరువతనం. ఆ గర్వం శిక్షణలో పెరగటం వలన, లేతగుణాన్ని మెచ్చలేకపోవు ప్రౌఢివలన ఏర్పడింది. (కారణమాల). ఆమె కోమలమైన చేతులు తామరతూండ్ల వద్ద శిక్షణతో పెరిగాయట. అంటే ఆ తామరతూండ్ల వలె కోమలత్వాన్ని క్రమంగా అలవరచుకొని అందంతో అతిశయించాయన్నమాట. తామరతూండ్లు గరువచందాన్ని ప్రకటిస్తూ లేతీగలవలె రూపొంది వాటి కంటె మెత్తగా ఉండటం చేత వాటిని మెచ్చలేదట! అంటే తామరతూండ్లవలె, లేతతీగలవలె ఉన్నా వాటికంటె మిన్నగా మృదువులుగా ఉన్నాయని ధ్వని. గరువతనంతో లేదీగలను లెక్కచేయని సైరంధ్రి అందం చిగురాకులతో సంధి చేసిందట. ఆమె అరికాళ్ళు చిగురాకులతో సంధి (చెలిమి) చేసి పద్మాలపై దాడి చేసినట్లు ఉన్నాయట. అంటే చిగురాకుల వలె ఎర్రగా ఉండి పద్మాలకంటె అందంగా ఉండి ఆమె కలికితనాన్ని ప్రదర్శిస్తున్నాయన్నమాట! సైరంధ్రిమాట సౌందర్యం కోకిలవద్ద చదువు నేర్చుకొన్నదట! వీణలకు చదువు చెప్పే సన్నని తియ్యని కంఠనాదంతో తన విలాసాన్నంతా ప్రదర్శించిందట! కళ్ళనుండి కాళ్ళవరకూ ఆమె అందం ఒక క్రమాభివృద్ధి చెందినట్లు పుట్టి పరులపై దండెత్తి పోయేటంత కలికితనం సంపాదించింది. అది ఆంగిక సౌందర్యం తీరు.

ఆమె మాటలు పంచమస్వర మధురం. వీణానాదానికి వంకలు తీర్చే గురుపీఠం. ప్రత్యక్షరం మధురం-అని వర్ణించి, సైరంధ్రి అందమే ఒక అందమైన వ్యక్తిత్వంతో పరిణతి చెందినట్లు - ఉపమానాలన్నీ క్రమంగా దానికి కారణమాలగా తోచేటట్లు చిత్రించటం తిక్కన అలంకారధ్వని రసధ్వనిలో పర్యవసింపచేసే కావ్యరసవిద్య. తిక్కనగారి గొప్ప పద్యాలలో ఇది ఒకటి. (సంపా.)

వ. కావున నా యెలనాఁగ నేమి యుపాయంబుననైన నన్నుం జేర్పవైతేని కందర్పదర్పంబున నలందురి వందుదు' ననిన నవ్వెలంది వెండియు నిట్లనియె. 47

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఆ ఎలనాఁగన్= ఆ సైరంధ్రిని; ఏమి+ ఉపాయంబునన్+ఐనన్= ఏ ఉపాయంతోనైనా సరే; నన్నున్= నాతో; చేర్పవు+ ఐ(తివి)+ఏని= చేర్చక (కూర్చక)పోతే; కందర్పదర్పంబునన్= మన్మథప్రతాప గర్వంచేత; అలందురి= కృశించి; వందుదున్= బాధపడతాను; అనినన్= అని అనగా; ఆ+వెలంది= ఆ సుదేష్ణ; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: 'కాబట్టి, ఆ సైరంధ్రిని ఏ ఉపాయంతోనయినా సరే నాతో కలపకపోతే నేను మన్మథుడు మదించి వేసే బాణాలకు కృశించిపోతాను' - అని కీచకుడు అనగా సుదేష్ణ ఇంకా ఇట్లా అన్నది.

తే. 'ఆయురైశ్వర్య కీర్తుల నపహరించుఁ
బరసతీ సంగమము; ధర్మపథమునందుఁ
బరఁగువారలు పరిహరింపంగఁ గనియు,
వినియుఁ దెలియవె యిది దుర్వివేక మగుట. 48

ప్రతిపదార్థం: పరసతీ సంగమము= పరస్త్రీ పొందు; ఆయుః+ఐశ్వర్య కీర్తులను= ఆయుస్సును, ధనాన్ని, పేరు ప్రఖ్యాతులను; అపహరించున్= నశింపజేయును; ధర్మపథము నందున్= న్యాయమార్గంలో; పరఁగువారలు=

ఒప్పెడువారు; పరిహరింపంగన్= వదలి పెట్టటం; ఇది= ఈ పని; దుర్వివేకము= దుర్బుద్ధి; అగుట= కావటం; కనియున్, వినియున్, తెలియవె?= స్వయంగా చూచికాని, ఎవరైనా చెప్పగా వినికాని తెలిసికొనలేదా?

తాత్పర్యం: 'పరస్త్రీతోడి పొందు ఐశ్వర్యాన్ని, కీర్తినీ, ఆయుస్సును నశింపజేస్తుందనీ, ధర్మపరులు దీనిని నిషేధిస్తారనీ నీవు ఎక్కడా చూచిగాని, వినిగాని ఎరుగవా? అది దుర్వివేకం అని తెలియదా?

విశేషం: పరసతీ సమాగమం వలన ఆయువు, ఐశ్వర్యము, కీర్తి నశిస్తాయని భారతం (1-8-31) చెప్పుతున్నది. (శీలం వరభూషణమే).

సీ. పతి యెఱింగినఁ దన ప్రాణంబుపై వచ్చు।
నను భయంబున నుల్లమదరు చుండ,
జనులు గాంచిన మానుషము దూలుఁ దన కను।
పుయిలోటమున మోము పుల్లగిలఁగ,
బోటికిఁ దోఁచినఁ బొలియుఁ దేఁకువ యను।
వెగడునఁ జెయ్వులు వీడుపడఁగ,
బంధుల కగపడ్డఁ బాయు నన్వయ మను।
కలఁక మైఁ జెమటలు క్రమ్ము దేరఁ,

తే. గ్రీడ దెసఁ గౌతుకం బురియాడ రతుల।
చవులు గొనియాడ నేరని జార పొందు
హృదయమున కింపు చేయమి నెఱుక గలుగు।
వారు దీని సుఖంబుగాఁ గోర రెందు. 49

ప్రతిపదార్థం: పతి+ఎఱింగినన్= భర్త తెలిసికొంటే; తన ప్రాణంబుపైన్+ వచ్చున్+అను= తన ప్రాణం మీదకు వస్తుందని; భయంబునన్= భయంతో; ఉల్లము+అదరుచుండన్= మనస్సు భయపడుతూ ఉండగా; జనులు కాంచినన్= ఇతరులెవరైనా చూస్తే; తనకు; మానుషము+తూలున్+అను=

పరువుపోతుందనే; పుయిలోటమునన్= సంకోచంతో; మోము= ముఖం; పుల్లగిలఁగన్= వెలవెలపోగా; బోటికిన్+తోఁచినన్= చెలికత్తెకు తెలిస్తే; తేఁకువ= గౌరవం (మర్యాద); పొలియున్= నశిస్తుంది; అను వెగడునన్= అనే భయంతో; చెయ్వులు= విలాసచేష్టలు; వీడుపడఁగన్= వదలిపెట్టగా; బంధులకున్+ అగపడ్డన్= బంధువుల కంటపడితే; అన్వయము= వంశప్రతిష్ఠ; పాయున్+ అను= పోతుందనే; కలఁకన్= భయంతో; మైన్= శరీరమునందు; చెమటలు క్రమ్ముదేరన్= చెమటలు పట్టగా; క్రీడదెసన్= రతి క్రీడలో; కౌతుకంబు= ఆసక్తి; ఉరియాడన్= చలించగా; రతుల చవులు= రతిరుచులు; కొనియాడ నేరని= పొగడలేని; జారపొందు= రంకుటాలితో కలయిక, రంకుతనం; హృదయమునకున్= మనస్సునకు; ఇంపుచేయమిన్= ప్రియంకలిగించదు కాబట్టి; ఎఱుక+కలుగువారు= బుద్ధిమంతులు; దీని సుఖంబు= జారసుఖాన్ని; ఎందున్+కోరరు= ఎన్నడూ కోరరు.

తాత్పర్యం: జారశృంగారంలో (రంకుతనంలో) పాల్గొనే వనిత పురుషుడి హృదయానికి సంతోషాన్ని కలిగించలేదు. భర్త తెలిసికొంటే తన ప్రాణంమీదకే వస్తుందని ఆమె గుండె గడగడలాడుతూ ఉంటుంది. జనాలకు తెలిస్తే పరువుపోతుందనే భయంతో ఆమె ముఖం వెలవెలబోతుంది. చెలికత్తెకు తెలిస్తే అవమానం కలుగుతుందనే భయంతో ఆమె విలాస చేష్టలు ప్రదర్శించలేక పోతుంది. బంధువులకు తెలిస్తే వెలివేస్తారనే భయంతో ఆమె మనసు వికలమై చెమటలు పట్టుతాయి. రతి క్రీడా సమయంలో కూడా మనస్సు బాధపడు తుండటం వలన ఆసక్తిని చూపలేక రతిలోని రుచులను అనుభవించలేదు. కాబట్టి జారిణీ స్త్రీ సాంగత్యం మనస్సుకు ఉల్లాసకరం కాదని తెలివిగల వారు దాని కెప్పుడూ దూరంగా ఉంటారు.

వ. అదియునుంగాక. 50

తాత్పర్యం: అంతేకాక.

క. బలవిక్రమ సంపన్నులు।
గల రేవురు దానిపతులు గంధర్వులు; వా
రలఁ దలఁచిన నా చిత్తము।
దలఁకెడు; నది యేల నీకుఁ దమ్ముఁడ! చెపుమా! 51

ప్రతిపదార్థం: దాని పతులు= ఆమె భర్తలు; గంధర్వులు= గంధర్వలోకం వారు; బల విక్రమ సంపన్నులు= బలపరాక్రమం అధికంగా గలవారు; ఏవురు+ కలరు= ఐదుగురు న్నారు; వారలన్+తలఁచినన్= వారిని తలచుకొంటే; నా చిత్తము= నా మనస్సు; తలఁకెడున్= కలవరపడుతున్నది; (కాబట్టి) తమ్ముఁడ!= ఓ తమ్ముడా; నీకున్; అది= ఆమె పొందు; ఏల చెపుమా!= ఎందుకు చెప్పుము.

తాత్పర్యం: బలోపేతులైన దాని భర్తలు గంధర్వులు ఐదుగురున్నారు. వారిని తలచుకొంటేనే నా మనస్సు కలత పడుతున్నది. ఒరే తమ్ముడా! దాని ధ్యాస నీకెందుకు చెప్పుము.

విశేషం: గంధర్వులు, బలవిక్రమ సంపన్నులు ఐదుగురు అని చెప్పి భయపెట్టాలని చెప్పిచూచింది. తమ్ముడా! అని ప్రియంగా సంబోధించింది.

తే. కాని తెరువునఁ బోయినఁ గలుగునయ్య!।
బ్రదుకు? చవి యెంతయైన నపథ్యములకు
వేడ్క సేయుదురయ్య వివేకు? లెవ్వి।
ధమున నా బుద్ధి వినవయ్య తమక ముడిగి.' 52

ప్రతిపదార్థం: కాని తెరువునన్= చెడుత్రోవలో; పోయినన్= పోతే; బ్రతుకు= జీవితం; కలుగున్+అయ్య!= కలుగదు; చవి+ఎంత+ఐనన్= ఎంతటి రుచి(ఆసక్తి) ఉన్నను; వివేకులు= బుద్ధిమంతులు; అపథ్యములకున్= హితము కానివాటికి; వేడ్క+చేయుదురు+ అయ్య?= ఉబలాటపడతారా నాయనా?; తమకము+ఉడిగి= మోహాన్ని వదలిపెట్టి; నాబుద్ధి= నేను చెప్పేమాటలు; వినవయ్య!= వినుము.

తాత్పర్యం: చెడుబాటలో సాగితే బ్రతుకు నిలిచేనా? హితం కాని పనులు ఎంత రక్తిని కలిగించినా బుద్ధిమంతులు వాటిని కోరరు. కాబట్టి నా మాట విని ఏ విధంగానైనా సరే నీ మోహాన్ని మానుకొనుము.'

విశేషం: ఎంత అందంగా ఉన్నా పరసతీ వ్యామోహం వివేక లక్షణం కాదు. తమకంలో ఉన్న నీవు నా మాటలు వినుమని సుదేష్ణ చనవుగా పలికింది.

క. అనవుడు నమ్మాటలు దన।
మనమునకు సహింపరామి మల్లడిగొనుచున్
మనసిజ పరతంత్రత ని।
ట్లని పల్కె సుదేష్ణతోడ నతఁ దుద్ధతుఁడై. 53

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; ఆ+మాటలు= ఆమె చెప్పిన పలుకులు; తన మనమునకున్= కీచకుని మనస్సునకు; సహింపరామిన్= ఓర్చుకోలేనివి కావటంచేత; అతఁడు= కీచకుడు; మల్లడి+కొనుచున్= పరితపిస్తూ; మనసిజ పరతంత్రతన్= మన్మథునికి లోబడియుండుటచేత; ఉద్ధతుఁడు+ఐ= గర్వించినవాడై; సుదేష్ణతోడన్= సుదేష్ణతో; ఇట్లు+అని పలికెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సుదేష్ణ చెప్పిన మాటలు కీచకుడి మనస్సుకు ఓర్వరానివైనాయి. మన్మథ పారవశ్యంలో బాధపడుతూ అతడు గర్వంగా సుదేష్ణతో ఇట్లా అన్నాడు.

విశేషం: మనసిజ పరతంత్రత - పదప్రయోగం ఔచిత్యవంతం. మన్మథుడు ప్రవేశించిన మనస్సులో మరొకరు ప్రవేశించటం కష్టం. అందుకే కీచకుడి కా మాటలు రుచించలేదు.

మ. 'వనితా! యే నొక పల్కు పల్కెదఁ జతుర్వారాశి మధ్యంబునన్
ఘనబాహాబల మొప్ప నన్ను నెదురంగా నొక్కడున్ లేమి యె
వ్వనికిం దెల్లము గాదె! దాని మగలన్ వజ్రాహతిం గూలు శై
ల నికాయం బన మద్భుజాసమదలీలన్ గీ టడంగించెదన్. 54

ప్రతిపదార్థం: వనితా!= ఓ సుదేష్ణా!; ఏను+ఒక పల్కుపల్కెదన్= నేనొక మాట చెప్పుతాను; చతుర్+వార్+రాశి మధ్యంబునన్= నాలుగు సముద్రాల నడుమగల భూమిమీద; ఘనబాహా బలము= గొప్పవైన భుజాల బలం; ఒప్పన్= ఒప్పగా; నన్నున్+ఎదురంగాన్= నన్నెదిరించటానికి; ఒక్కఁడున్ లేమి= ఒక్కడు కూడా లేకపోవటం; ఎవ్వనికిన్+తెల్లము కాదె?= ఎవరికి తెలియదు? (అందరికీ తెలుసుకదా!); దాని మగలన్= ఆమె భర్తలను; మత్+భుజాసమద లీలన్= నా భుజబల గర్వంయొక్క విలాసంతో; వజ్ర+ఆహతిన్= వజ్రాయుధంతో కొట్టటం వలన; కూలు= పడిపోయే; శైలకాయంబు= పర్వత సముదాయమో; అనన్= అన్నట్లు; గీటు+అడంగించెదన్= కూల్చివేస్తాను.

తాత్పర్యం: 'ఓ సుదేష్ణా! నాలుగు సముద్రాల మధ్యలో ఉన్న ఈ నేలపై నా బాహుబలాన్ని ఎదిరించి నిలువగలవాడు లేడని అందరికీ తెలుసు కదా! వజ్రాయుధం దెబ్బతో కూలిన పర్వతాలో అన్నట్లు నా భుజబలంతో దాని భర్తలను కూల్చి వేస్తాను.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఉపమానం యొక్క తాదాత్మ్యమును ఉపమేయము నందు సంభావించటం ఉత్ప్రేక్ష. ఇంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాల రెక్కలను ఛేదించటం పురాణ ప్రసిద్ధం. అట్లా వజ్రాయుధపాతంతో పడిపోయిన పర్వతాలో అన్నట్లు సైరంధ్రీ భర్తలను చంపుతాననటం అలంకారం. సింహబలుడు తన అక్కను 'వనితా!' - అని సంబోధించటం ద్వారా ఔద్ధత్యం వెల్లడయింది.

ఉ. బుద్ధులు సెప్పు టెల్ల నటు వో విడు; మెమ్మెయి నైన సౌఖ్యసం
సిద్ధి యొనర్పు నాకు; నెడ సేసినఁ దాపము రూపుమాపు; నా
వృద్ధియ కోరుదేని 'నవివేకివి నీ' వని నన్ను ని ట్లసం
బద్ధములైన వాక్యములు పల్కక వే పిలిపింపు కోమలిన్.' 55

ప్రతిపదార్థం: బుద్ధులు చెప్పుట+ఎల్లన్= నీతులు చెప్పటమంతా; అటు+పోవిడుము= అట్లా వదలివేయుము; ఏ+మెయిన్+ఐనన్= ఎట్లాగైనా; నాకున్= (కీచకుడికి) సౌఖ్య సంసిద్ధి= ఆమెపొందువలని సుఖాన్ని; ఒనర్పు= కలిగించుము; ఎడచేసినన్= ఆలస్యం చేస్తే; తాపము= మన్మథతాపము, విరహబాధ; రూపుమాపున్= (నన్ను) నాశనం చేస్తుంది; నా వృద్ధి+అ= నా ఉన్నతినే; కోరుదు(వు)+ఏనిన్= కోరేదానివైతే; నీవు= (కీచకుడా, నీవు); అవివేకివి= బుద్ధిహీనుడవు; అని= అని అంటూ; అసంబద్ధములు+ఐన= అసంగతాలైన; వాక్యములు= మాటలు; పల్కక= ఆడక; కోమలిన్= ఆ సుకుమారిని; వే పిలిపింపు= త్వరగా పిలువనంపుము.

తాత్పర్యం: నీవు నాకు బుద్ధులు చెప్పటం మానివేయుము. ఏదో ఒక ఉపాయంతో నాకు ఆమెను పొందే సౌఖ్యాన్ని కలిగించుము. ఆలస్యం చేశావంటే నేను మన్మథ తాపంతో మరణిస్తాను. కాబట్టి నీవు నిజంగా నా మేలునే కోరేదానివైతే 'నీవు అవివేకివి' అంటూ అసంగతాలైన మాటలతో నన్ను నిందించక, శీఘ్రంగా సైరంధ్రిని పిలిపించుము.'

విశేషం: వనితా! అని గర్వంగా పలికి ఇప్పుడు హెచ్చరిస్తున్నాడు.

తే. అనుచు దైన్యంబు నొందెడు నాననంబు।
తోడ దిగ్గన లేచి యత్తోయజాక్షి
చరణ పీఠంబుకడఁ జక్కఁజాఁగి మ్రొక్కి।
యున్న నద్దేవి కనుఁగొని చిన్నఁబోయి. 56

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; దైన్యంబున్+ఒందెడు= దీనత్వం పొందే; ఆననంబు తోడన్= ముఖంతో; దిగ్గనన్ లేచి= వెంటనే లేచి; ఆ+తోయజాక్షి= ఆ సుదేష్ణ యొక్క; చరణపీఠంబుకడన్= అడుగుపీటవద్ద; చక్కన్+చాఁగి మ్రొక్కి= నిలువునాసాష్టాంగ పడి; ఆ+దేవి= ఆ సుదేష్ణను; కనుఁగొని= చూచి; చిన్నబోయి= మొగం చిన్నబుచ్చు కొని.

తాత్పర్యం: అని మాట్లాడుతూ ముఖంలో దీనత్వం ఉట్టిపడేటట్లు వెంటనే లేచి ఆ సుదేష్ణ పాదాలు పెట్టుకొనే పీటవద్ద నిలువునా పడి సాష్టాంగ నమస్కారం

చేసిన ఆ కీచకుడిని చూచి సుదేష్ణ చిన్నబోయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: కీచకుడు మూర్ఖుడు. అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు - అనే రకం. దాసుడి తప్పులు దండంతో సరి - అని అక్కను ప్రసన్నురాలిని చేసికొనటానికి ఇది ఒక్కటే బ్రహ్మాస్త్ర మనుకొన్నాడు. సప్తవ్యసనాలలో 'వెలది' ని ముందుగానే చెప్పారు. కీచకుడు వ్యసనపరుడు. 'కామాతురాణాం న సుఖం న లజ్జా' అన్న సూక్తి కీచకుడి వర్తనంలో నిజమైనది.

ఉ. 'ఆవల వచ్చు నాపదల కన్నిటి కోర్చి లతాంగిఁ గూర్చి కా
కీ వెడ మాటలన్ మరలఁ; డెన్ని విధంబులఁ జూపి చెప్పినం
గావల మైన వీఁడు తగు కార్యము వట్టునె? వీని కెమ్మెయిం
జావు నిజంబు మన్మథునిశాత శరంబులనైన నక్కటా!' 57

ప్రతిపదార్థం: ఆవలన్= తర్వాత; వచ్చు+ఆపదలకున్= వచ్చే కష్టాలకు; అన్నిటికిన్+ఓర్చి= అన్నీ భరించి; లతాంగిన్+కూర్చికాక= సైరంధ్రిని అతనితో కలిపికాక; ఈ వెడమాటలన్= ఈ వట్టి మాటలతో; మరలఁడు= మనసు మరల్చుకోడు; కావలము+ఐన వీఁడు= కండకావరం కలిగిన వీడు; ఎన్ని విధంబులన్= ఎన్ని రకాలుగా; చూపి, చెప్పినన్= నిరూపించి చెప్పినా; తగు కార్యము= తగిన పనిని; పట్టునె?= చేపట్టుతాడా?; అక్కటా!= అయ్యో!; వీనికిన్= కీచకుడికి; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; మన్మథునిశాత శరంబులన్+ ఐనన్= మన్మథుడి యొక్క వాడి అయిన బాణాలతోనైనా; చావు= చావటం; నిజంబు= తథ్యం (తప్పదని భావం).

తాత్పర్యం: 'తర్వాత ఎన్ని ఆపదలు వచ్చినా, ప్రస్తుతానికి సైరంధ్రిని వీడికి కూరిస్తే తప్ప, వట్టి మాటలతో తృప్తిపడి తిరిగిపోయేటట్లు లేడు. మిక్కిలి గర్వం గలవాడు కావున ఎంతచెప్పినా మంచిమాటలు గ్రహించలేడు. వీ డెట్లాగూ సైరంధ్రి భర్తలచేత కాకపోయినా, మదనబాణాలచేతనైనా చావటం నిజం.'

విశేషం: 1. అక్కపట్ల ఉన్న చనవుతో కీచకుడు అడుగుతున్నాడు. తమ్ముడిపట్ల ఉన్న మమకారంతో సుదేష్ణ ఆలోచిస్తున్నది. వలదన్నా మానని గర్వాంధుడు

సింహబలుడు. అతడి చావు రాసిపెట్టినట్లున్నది. అయితే అది సైరంధ్రి భర్తలవలననా? మన్మథుడి బాణాల వలననా అనేదే ప్రశ్న. మన్మథుడి వలన చనిపోతే దానికి కారకురాలు సుదేష్ణ మరొక రకంగా అయితే కీచకుడే బాధ్యుడు. (సంపా.)

2.'కావలము= పాపము. ఇయ్యది కీచకునికి విశేషణము గానఁ గావలము గలవాఁడని చెప్పవలయును. కావలము కీచకుఁడని చెప్పునప్పుడు కీచకుఁడు కావలము కలవాఁడు గాని కావలము కాఁడు కనుకఁ దాత్పర్యము పాపఁగమిచేఁ గావలము గలవాడను నర్థము లక్షణచే వచ్చునని భావము. మహాకవులు మిక్కుటముగ కలవాఁడను నర్థమునఁ గావలమని ధర్మధర్మ్మల కభేదముగా వాడుచుండుటయుఁ గలదు. "తేజసస్తు న వయస్సమీక్ష్యతే" - ఇచ్చట తేజసః (మహాకవి కాళిదాసు) అనఁగా నెక్కువ ప్రతాపము గలవానికని ధర్మధర్మ్మల కభేదము చెప్పికొనక తప్పదు" (కీ.శే. పళ్ళె పూర్ణ ప్రజ్ఞాచార్యులు : విరాటపర్వ టిప్పణి).

క. అని మనమునఁ దలపోయుచుఁ।
దన తమ్ముని నల్లనెత్తి దందడి దొరఁగం
జనుదెంచు నశ్రుపూరము।
కనుఁగవలో ఫ్రింగికొనుచుఁ గామిని పలికెన్. 58

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; కామిని= సుదేష్ణ; మనమునన్+ తలపోయుచున్= మనస్సులో అనుకొంటూ; తన తమ్మునిన్= తన తమ్ముడైన కీచకుడిని; అల్లనన్+ఎత్తి= మెల్లగా ఎత్తి; దందడి తొరఁగన్= వేగంగా కారటానికి; చనుదెంచు= వచ్చే; అశ్రుపూరము= కన్నీళ్ళధారను; కనుఁగవలోన్= కనుదోయిలో; ఫ్రింగికొనుచున్= అణచుకొంటూ; పలికెన్= మాట్లాడింది.

తాత్పర్యం: ఆ విధంగా మనస్సులో అనుకొంటూ కీచకుడిని లేవనెత్తి ధారలుగా పొంగివచ్చే కన్నీళ్ళను కనుదోయిలో కుక్కుకొంటూ సుదేష్ణ మాట్లాడింది.

విశేషం: 1. తిక్కన సాత్త్విక భావాలను సందర్భోచితంగా విస్తరించి నాటకీయతను రక్తి కట్టిస్తాడు. వెనుకటి పద్యంలో భావసంఘర్షణలో సుదేష్ణ మథనపడింది. సింహబలుడి చావు నిజం. అది తేలిపోయింది. అతడి కోరిక కాదంటే అతడి చావుకు తాను కారకురాలౌతుంది. కాని ఆమెకు తమ్ముడిమీద అలవిమాలిన మమకారం. ఔనంటే - ఆమె అంతఃపుర ధర్మాన్నీ, ఇచ్చిన మాటనూ తప్పినట్లౌతుంది. దానికితోడు కీచకుడి చావుకు పరోక్ష కారణమౌతుంది. ఆమె స్థితి 'ముందు నుయ్యి - వెనుక గొయ్యి'వలె తారసిల్లింది. కీచకుడు ఏవిధంగానైనా సైరంధ్రిని కూర్చుమంటాడు. ఏవిధంగా కూర్చయత్నించినా అతడి చావు తప్పదని ఆమెకు తెలుసు. అందువలన వలపు కారణంగా తమ్ముడు చనిపోతాడన్న తీవ్ర వేదన ఆమె కన్నులలో ధారాపాతంగా జారే కన్నీరును కలిగించింది. కాని, ఆ భావగాంభీర్యాన్ని, ఆమె మనసులోని బాధను అతడు గ్రహించలేడు. అయినా, తమ్ముడు. అందువలన ఆప్యాయంగా అతడిని పైకి లేపింది. కళ్ళనీళ్ళు మ్రింగికొన్నది. అంటే నిగ్రహించుకొన్నది. ధారలుగా కారటానికి సిద్ధమైన కన్నీరును ఆపుకొనటం ఇందలి అభినయాంశం. అనిశ్చితమైన ఆవేదన నుండి ఆమె ఒక నిశ్చిత స్థితికి వచ్చిందని రసధ్వని. మ్రొక్కుతున్న తమ్ముడికి అక్కగా మాట్లాడ నిశ్చయించటం ఆంగికాభినయంలో అశ్రువు అనే సాత్త్విక భావం చేసే ధ్వని. తరువాతి పద్యంలో వాచికాభినయం వ్యక్తం కాబోతున్నది. తిక్కన రచనలో రసాభ్యుదయ శిల్పం క్రమ పరిణామ రమణీయం. (సంపా.)

ఆ. 'ఇంత దలరనేల? యెమ్మెయినైనను।
కొమ్మ నలవరించి కూర్చు టరుదె?
యుమ్మలంబు దక్కియూఱటతోడ నీ।
వేఁగు; మసలవలవ దింక నిచట. 59

ప్రతిపదార్థం: ఇంత+తలరన్+ఏల?= ఇంతగా చింతపడటమెందుకు? ఏ+మెయిన్+ఐనను= ఏవిధంగానైనా; కొమ్మన్= ఆమెను అలవరించి= సానుకూలపరచి, అంగీకరించే టట్లు చేసి; కూర్చుట= నీకు పొందుకలిగించటం; అరుదె?= కష్టమా?; ఉమ్మలంబు= విరహతాపాన్ని; తక్కి= వదలిపెట్టి; ఊఱటతోడన్= కుదుటితనంతో; నీవు+ఏఁగు= నీవు వెళ్ళుము; ఇంకన్= ఇక మీదట; ఇచటన్= ఇక్కడ (అంతఃపురంలో); మసలవలవదు= ఆలస్యం చేయవద్దు.

తాత్పర్యం: 'ఎందుకు ఇంతగా చింతిస్తావు? ఎట్లాగైనా సైరంధ్రిని ఒప్పించి నీతో పొందు కల్పించటం అసాధ్యమేమీ కాదు. మనసులోని వేదన వదలి నీవు ఊరటపొంది ఇంటికి వెళ్ళిపొమ్ము? ఇక్కడ మసలవద్దు.'

విశేషం: సుదేష్ణ నిపుణురాలు. కీచకుడిని ఊరట పరచకపోతే ఆ ప్రదేశాన్ని వీడిపోడు. మొదట అతడిని తిరిగి పంపాలి. ఆ ఉపాయం అతడికి నచ్చేటట్లు ఉండాలి. రాబోయే పద్యం దానికి తార్కాణం.

క. ఆసవమున కని నీదు ని।
వాసమునకు దివములో నవశ్యంబును నే
నా సుదతిం బుత్తెంతు ని।
జాసక్తి ఫలింపఁ గొఱలు మభిమత కేళిన్.' 60

ప్రతిపదార్థం: ఆ సుదతిన్= ఆ సైరంధ్రిని; ఆసవమునకున్+అని= మద్యానికని (మద్యం తెచ్చే మిషతో అని భావం); నీదు నివాసమునకున్= నీ ఇంటికి; దివములోన్= పగటిపూట; అవశ్యంబును= తప్పకుండా; పుత్తెంతున్= పంపుతాను; నిజ+ఆసక్తి= నీ కోరిక; ఫలింపన్= సమకూరేటట్లు; అభిమతకేళిన్= ఇష్టమైన క్రీడను; కొఱలుము= పొందుము.

తాత్పర్యం: నేను ఈ రోజు ముగిసేలోగా మద్యం తీసికొనిరమ్మని సైరంధ్రిని నీ మందిరానికి తప్పక పంపుతాను. అప్పుడు నీ యిష్టం ప్రకారం విలాసంగా నీ కోరిక నెరవేర్చుకొనుము.'

విశేషం: 1. సుదేష్ణ మాటలను తిక్కన మూలంలోకంటె సందర్భోచితంగా మార్చాడు.

"పర్వణి త్వం సముద్దిశ్య సురామన్నం చ కారయ। తత్రైనాం ప్రేషయిష్యామి సురాహారీం తవాన్తికమ్॥

తత్ర సంప్రేషితా మేనాం విజనే నిరవగ్రహే। సాన్త్వయేథా యథాకామం సాన్త్వమానా రమేద్ యది॥ **(సం.4.14.5-6)**

పండుగనాడు కీచకుడు సుదేష్ణకొరకు రుచ్యమైన ఆహారాలను, మద్యాలను తయారుచేయించాలట! వాటిలో సురను తెప్పించుకొనే నెపంతో సుదేష్ణ సైరంధ్రిని కీచకుడి మందిరానికి పంపుతుందట! ఆమె అక్కడికి వెళ్ళినప్పుడు అతడు ఆ ప్రాంతంలో జనులెవ్వరూ లేకుండా చూచుకొనాలట! ఎటువంటి ఆటంకాలూ లేని తావును ఎన్నుకోవాలట! అక్కడ అతడు తన కోరికమేరకు ఆమెను ఒప్పించాలట. ఆమె ఇష్టపడితే ఆమెతో భోగించాలట! - ఇది మూలంలో సుదేష్ణ చెప్పిన వ్యూహం. తెలుగులో అది మారింది. ఎప్పుడో వచ్చే పండుగకొరకు సుదేష్ణ ఆగలేదు. ఆ పగలు తెల్లవారే లోపల పంపుతానన్నది. తెచ్చేది సుర కాబట్టి అన్నం వండవలసిన పనిలేదు. పండుగే లేదు కాబట్టి పంచభక్ష్యపరమాన్నాల ప్రసక్తి తెలుగులో రాలేదు. కీచకుడు తయారుచేసిన ఆసవాలూ, వాటి నంజుళ్ళూ సుదేష్ణ కోరిక మీద చేసినవి కావు. అతడి వలపు తెలపటానికి చేసినవి మాత్రమే. సైరంధ్రి కీచకుడి మందిరానికి వెళ్ళినప్పుడు ఆమె నతడు ఒప్పించాలనీ, అంగీకరిస్తేనే ఆమెను పొందాలనీ సూచించింది. ఆ మాటలు తెలుగులో లేవు. ఆమె నంగీకరింప చేసే బాధ్యత తెలుగు భారతంలో సుదేష్ణ తీసికొన్నది. ఈ మార్పులో ఒక లోతైన ఆలోచన సుదేష్ణ మనసులో ఉన్నట్లు తిక్కన చిత్రించాడు. ముందు ముందు అది ఆవిష్కృతమౌతుంది. వ్యాసుడి సుదేష్ణకంటె తిక్కన సుదేష్ణ గడుసరి. (సంపా.)

2. దినము : దినము అని పాఠాంతరము; నిజశబ్దానికి యుష్మదర్థము, అస్మదర్థమూ రెండూ తిక్కన వాడాడు. (విరాటపర్వం 2-263)

కీచకుండు ద్రౌపదియందలి మోహంబునఁ బరితపించుట (సం. 4-14-7)

వ. అనిన విని కీచకుండు ముదిత హృదయుండయి నిజసదనంబునకుం జని వివిధ మధురసంబు లొనరించి, సముచిత ఖాద్యంబులు సమకట్టి, తత్ప్ర

దేశంబు విజనంబు గావించి, యొక్కరమ్యస్థలంబుననుండి పాంచాలి వలని తగులు చిత్తంబు నుత్తలపఱుపం దలరి నెవ్వగల కగపడి తలపోఁతలకుం జొచ్చి దుర్విదగ్ధుండు గావున నమ్ముగ్ధకుం దన సన్నిధిఁ గామ వికారంబు వుట్టుట గలుగ భావించుచు. 61

ప్రతిపదార్థం: అనినన్+విని= అని సుదేష్ణ చెప్పగా విని; కీచకుండు; ముదిత హృదయుండు+అయి= సంతోషించిన మనస్సు గలవాడయి; నిజసదనం బునకున్= తన మందిరానికి; చని= వెళ్ళి; వివిధ మధురసంబులు= అనేక రకాలైన మద్యాలను, ఒనరించి= తయారుచేసి; సముచిత ఖాద్యంబులు= వాటికి తగిన తినుబండారాలను; సమకట్టి= సిద్ధపరచి; తద్+ప్రదేశంబు= ఆ స్థలాన్ని; విజనంబు+కావించి= జనులు లేనట్లుగా చేసి; ఒక్క రమ్యస్థలం బునన్= ఒక మనోహర ప్రదేశంలో; ఉండి; పాంచాలివలని= ద్రౌపదిపట్లగల; తగులు= మోహం; చిత్తంబున్+ఉత్తలపఱుపన్= మనస్సును ఉద్వేగ పరచగా; తలరి= చలించి; నెఱ+వగలకున్= మిక్కిలి చింతలకు; అగపడి= లోనై; తలపోఁ తలకున్+చొచ్చి= పరిపరివిధాలైన ఊహలలో ప్రవేశించి (మనసు చొప్పించి); దుర్విదగ్ధుండు కావునన్= అవివేకి కావటం వలన; ఆ+ముగ్ధకున్= ఆ ముద్దరాలికి, ఆ సైరంధ్రికి; తన సన్నిధిన్= తన ఎదుట దగ్గరగా ఉన్న వేళలో; కామవికారంబు+పుట్టుట= (ఆమెలో) కామ (రతి) భావం పుట్టటం; కలుగన్= సాక్షాత్తు కంటిముందు కనపడుతున్నట్లు అనుభవిస్తున్నట్లు; భావించుచున్= తన్మయత్వంలో తనలో తాను ఊహించుకొంటూ.

తాత్పర్యం: సుదేష్ణ మాటలకు సంతోషపడి తన మందిరానికి వెళ్ళి పలురకాలైన మద్యాలను, వాటి కనుగుణంగా తినే భక్ష్యాలను సిద్ధపరచి, ఆ మందిరపు చుట్టుపక్కల జనం లేకుండా చేసి, ఒక మనోహర ప్రదేశంలో కూర్చుండి, అవివేకి కావడం వలన సైరంధ్రి తన దగ్గరకు చేరినట్లు, (తన దర్శనస్పర్శనాదుల వలన) ఆమెలో మన్మథభావాలు రేకెత్తినట్లు, అవి తన కన్నులకు కనపడు తున్నట్లు, తన్మయత్వంలో భావించి ఆ భావనలో రమిస్తూ - (ఇట్లా అనుకొన్నాడు.)

విశేషం: ఈ సన్నివేశం అమూలకం. తిక్కన ప్రతిభాజన్యమైన రమణీయ రంగ పరికల్పనం. ఇందులో కీచకుడు భావుకుడుగా, రసికుడుగా, శృంగారనాయక లక్షణ విశిష్టుడుగా పఠితలకు పరిచయమౌతాడు. భావి శృంగారనాయకులకు వెలుగుబాట చూపిస్తాడు. తిక్కన కవితా శిల్పమంతా ఇతడి నోట పుక్కిటపట్టించినట్లు సన్నివేశం మధురంగా చిత్రించబడింది. విచిత్ర మేమంటే- ఇది భౌతికరంగం కాదు: భావనాలోకంలో సాక్షాత్తూ ప్రత్యక్షంగా అనుభవిస్తున్నట్లు కాల్పనిక, స్వాప్నిక దర్శనం వలె భాసించే రంగం. సంకల్పం అనే మదనావస్థలో ఇదొక మధురతరంగం. (సంపా.)

సీ. 'కేలిమై నొక్కట లీలఁ గ్రేళ్ళుఱికెడు।
వాలుగు సోగల నేలుదెంచి,
కరువలి సుడియమిఁ గందక చెన్నొందు।
నెఱవిరితమ్ముల నుఱక తెగడి,
బెడఁగొందఁ దుడిచి మైఁ దొడసిన వలరాజు।
వాలిక తూపులఁ దూలఁ దోలి,
పొలపంబు మెఱసి దిక్కులఁ గాంతి పూరించు।
క్రొక్కారు మెఱుఁగుల నుక్కడంచి,

తే. తన విలోచనములు నాదు మనము నాఁచి।
కొనఁగ నయ్యింతి ననుఁ గనుఁగొనియె, నాత్మఁ
గై కొనియె, రాగ రసమునఁ గడలుకొనియె।
మదన వికృతి బయల్పడ నుదిలకొనియె. 62

ప్రతిపదార్థం: ఆ+ఇంతి= ఆ సైరంధ్రి; లీలన్= విలాస చేష్టతో; కేలిమైన్= క్రీడగా; ఒక్కటన్= ఒక్కసారిగా; క్రేళ్ళు+ఉఱికెడు= ఎగిరిపడే; వాలుగు సోగలన్= వాలుగ చేపల పొడవును; ఏలు+తెంచి= తగ్గించి; కరువలి= గాలి; సుడియమిన్= వీచకపోవటం వలన; కందక= వాడిపోక; చెన్ను+ఒందు= అందంగా వెలిగే; నెఱ విరి తమ్ములన్= నిండుగా వికసించిన కమలాలను; ఉఱక= లెక్కపెట్టకుండా; తెగడి= తిరస్కరించి; బెడఁగు+ఒందన్= అందం కలిగేటట్లు; తుడిచి= శుభ్రంచేసి; మైన్+తొడసిన= ఆకారాన్ని కడిగిన; వలరాజు వాలికతూపులన్= మన్మథుని వాడిబాణాలను; తూలన్+తోలి= తిరస్కరించి; పొలపంబుమెఱసి= కాంతి జిగేలుమని; దిక్కులన్+కాంతిపూరించు= దిక్కులను వెలుగుతో నింపివేసే; క్రొత్త+కారుమెఱుఁగులన్= వర్షాకాలపు తొలికారు మెఱుపుల యొక్క; ఉక్కు+అడంచి= గర్వం పోగొట్టి; తన విలోచనములు= సైరంధ్రి కనులు; నాదు మనమున్= నా మనస్సును; ఆఁచికొనఁగన్= ఆకట్టుకొనగా; ననున్+కనుఁగొనియెన్= నన్ను చూచింది; ఆత్మన్+కైకొనియెన్= మనస్సు హరించింది; రాగరసమునన్= వలపురసంతో; కడలుకొనియెన్= ఉప్పొంగింది; మదనవికృతి= రతిభావం; బయల్పడన్= బయటపడేటట్లు; ఉదిలకొనియెన్= వేగిరపడుతుంది (ఉత్తలపాటు పొందుతుంది.)

తాత్పర్యం: 'విలాస క్రీడగా ఒక్కసారి పైకి కుప్పించి ఎగిరే వాలుగ చేపల పొడుగరితనాన్ని శాసించి ఆ సైరంధ్రి తన చూపులతో నా మనస్సును దోచుకొనేటట్లు నన్ను చూచింది; గాలి కొట్టకపోవటం చేత చెక్కుచెదరకుండా నిలిచి అందాలను విరజిమ్మే వికసించిన పద్మాలను తిరస్కరించేటట్లు చూచి నన్ను లోబరచుకొన్నది; అందం అతిశయించేటట్లు శుభ్రం చేసి బాగా కడిగిపెట్టిన మన్మథుడి వాడి బాణాలను ఓడించిన చూపులతో చూచి నన్ను రాగరసంలో పొంగులు వారేటట్లు చేసింది. కాంతి మిరుమిట్లు కొలిపేటట్లు దిక్కులనిండా మెరిసే తొలకరి మెరుపుల గర్వాన్ని అణచిన చూపులతో మదనవికారం ప్రకటితమయ్యేటట్లు చూచి నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

విశేషం: అలం: క్రమాలంకారం. మాలోపమ. 1. సీసపద్యపాదాలలోని చూపుల లీలలతో ఆమె సాధించిన వలపు చర్యలు ఎత్తుగీతిలో వరుసగా చెప్పబడ్డాయి. వాటితో క్రమంగా అన్వయం కలిగింది. కాబట్టి క్రమాలంకారం లేదా యథాసంఖ్యాలంకారం.

2. ఇందులో సైరంధ్రి చూపుల విలాస వైభవం వర్ణితం. అది మాలోపమాలంకారంలో ప్రదర్శితం. చేపలవలె విశాలంగా ఉండి వాటికంటె లీలావిలాసంలో మిన్న అయిన చూపులు మనసును ఆకర్షిస్తాయి. ఆకర్షించి ఆమె కీచకుడి వద్దకు సమీపిస్తుంది. గాలికి కదలని పద్మాలవలె తదేకదృష్టితో వికసించిన పద్మాలవంటి కన్నులను అతడిమీదనే నిలిపి అభిలాషను వ్యక్తం చేస్తుంది. ఆ చూపులు అతడి హృదయాన్ని కైవసం చేసుకొంటాయి. అంటే నాయిక కౌగిలికి సమీపించిందని భావం. కడిగి తుడిచి వాడిచేసిన మదన బాణాలకంటె వాడి అయిన చూపులను ఆసక్తితో ప్రసరించి అతడిని కన్నులతో జుర్రుకొంటుంది. ఆ చూపులు అతడిని రాగరసంలో ముంచితేలుస్తాయి. తొలకరి మెరుపులవంటి కాంతి తళతళలను మించిన వెలుగులు వెదచల్లే చూపులతో చూస్తూ మనసులోని రతి కోర్కెను ప్రదర్శిస్తూ అతడిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. దూరంగా చూచినది మొదలు మదన ప్రీతి కలిగించేవరకు ఒక శృంగారనాయిక ప్రసరించే చూపుల విలాస వైభవాలను, తత్ప్రభావాలను మాలోపమాలంకారంతో ఆవిష్కరించిన ఈ పద్యం కీచకుడి కాల్పనికభావనాశక్తికి (Romantic imagination) చక్కని ఉదాహరణం.

3. దృఙ్మీలన మనే మదనావస్థను స్మరణలో కీచకుడు పునశ్చరణం చేయటం వలన అతడి మనసులోని రతిభావం ఉద్దీప్తమౌతుంది. రసాభ్యుదయశిల్పంలో ఇది ఒక శిల్పం. (సంపా.)

ఉ. చిత్తము మెచ్చి నావలనఁ జిక్కఁగ వెండియు నా లతాంగి య
చ్చొత్తిన యట్లు నాకుఁ దన యుల్లము దెల్లము సేయకున్కిఁ దా
నత్తఱిఁ గ్రొత్తకాన్పగుట నడ్డము సొచ్చిన సిగ్గుపెంపు త
న్నుత్తలమందఁ జేయుటకునో తలపోసి యెఱుంగ నయ్యెదన్.' 63

ప్రతిపదార్థం: చిత్తము మెచ్చి= మనసుపడి; నా వలనన్+చిక్కఁగన్= నా యందు ఆసక్తిని చూపగా; వెండియున్= అంతేగాక; ఆ లతా+అంగి= ఆ సైరంధ్రి; అచ్చు+ఒత్తిన+అట్లు= అచ్చు గ్రుద్దినట్లు విస్పష్టంగా; నాకున్= నాకు; తన ఉల్లము= తన మనస్సు; తెల్లము+చేయక+ఉన్కిన్= బయట పెట్టక

పోవటం వలన; తాను+ఆ+తఱిన్= తాను ఆ సమయంలో; క్రొత్త కాన్పు+ అగుటన్= క్రొత్తగా చూడటం జరిగదంవల్ల; అడ్డము+ చొచ్చిన= అడ్డుపడిన; సిగ్గు పెంపు= అధికమైన సిగ్గు; తన్ను= తనను; ఉత్తలము+ అందక+ చేయుటకునో= కలవరపాటును కలిగించినందువల్లనో ఏమో; తలపోసి+ ఎఱుంగన్+అయ్యెదన్= భావించి తెలిసికోలేకపోయాను.

తాత్పర్యం: సైరంధ్రి మనస్సు నా మీద లగ్నమైనప్పటికీ తన భావం నాకు స్పష్టంగా వెల్లడి చేయలేకపోయింది. దానికి కారణం ఉన్నది. తానప్పుడు నన్ను మొదటిసారి చూడటం వలన సిగ్గు బాగా అడ్డుపడి తనకు తత్తరపాటు కలిగించి ఉండటం కావచ్చునేమో! అప్పుడు నేను దానిని గురించి ఆలోచించలేక పోయాను.'

విశేషం: కీచకుడు తన దుర్విదగ్ధత్వాన్ని మరొకసారి ప్రదర్శిస్తున్నా డీ పద్యంలో. ఒక వాస్తవాన్ని విపరీతంగా వ్యాఖ్యానించటం దుర్విదగ్ధత్వం. కీచకుడిని చూచి సైరంధ్రి భయపడింది. అతడిపై కోపగించుకొన్నది. అతడి ప్రవర్తనకు అసహ్యించుకొన్నది. మొదట మాటాడకుండా ఉండిపోయింది. ఈ చర్యల కన్నింటికీ తొలిచూపు వలన కలిగిన సిగ్గు కారణమని దుర్వ్యాఖ్యానం చేయటం ఈ పద్యంలో గమనించవచ్చును. (సంపా.)

తే. అనుచుఁ గొందలపడు కోర్కెలగ్గలించి।
చిట్టుముట్టాడుచుండ నచ్చెలువ చెలువు
తగిలి తన యిచ్చఁబాఱు చిత్తంబు పజ్జ।
నరిగి యిట్లనునక్కీచకాధముండు. 64

ప్రతిపదార్థం: అనుచున్= ఆ విధంగా అంటూ; ఆ+కీచక+అధముండు= నీచుడైన ఆ కీచకుడు; కొందలపడు= కలతపడే; కోర్కెలు+అగ్గలించి= కోర్కెలు అధికమై; చిట్టు ముట్టు+ఆడుచున్+ఉండన్= పెనగులాడుతూ ఉండగా; ఆ+చెలువ చెలువు= ఆ సైరంధ్రి సొగసునందు; తగిలి= తగుల్కొని;

తన+ఇచ్చున్+పాఱు= దాని ఇష్టప్రకారం పరుగెత్తే; చిత్తంబుపజ్జన్= మనస్సు వెంట; అరిగి= వెళ్ళి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా అంటూ అధముడైన ఆ కీచకుడు కలతపెట్టే తన కోర్కెల విజృంభణానికి సంక్షోభపడి కొట్టుమిట్టాడుతూ తన మనసు సైరంధ్రి సొగసులో చిక్కుకొని యథేచ్ఛగా విహరిస్తూ ఉండగా దానివెంట నడుస్తూ ఈ విధంగా అనుకొన్నాడు.

విశేషం: 'మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః,' అనే సూక్తి స్మరణీయం. కీచకుడు మనస్సుమీది నిగ్రహాన్ని కోల్పోయి మదనావేశంతో ప్రలాపమనే మదనచేష్టను ప్రదర్శించాడు. తిక్కన అతడి ప్రలాపాన్నికూడా కాల్పనిక కళా సుందరంగా చిత్రించాడు. (సంపా.)

సీ. 'లీల నాముందట నా లేమ పొలసినఁ।
జూడ్కికిఁ జుబ్బనచూఱగాదె!
కనువిచ్చి నన్ను నా తనుమధ్య సూచినఁ।
దనువున కమృతసేచనము గాదె!
చిఱునవ్వు బెరయ నచ్చెలువ నా తోడఁ బ।
ల్కినఁ జెవులకు రసాయనము గాదె!
యెలమి నమ్మెలఁత నన్నెలయింపఁ దివిరిన।
నెడఁద కానందంబు నిక్క గాదె!

తే. యా నితంబిని మక్కువ ననఁగి పెనఁగి।
యింపు పొంపిరివోవ న న్నేలికొనఁగఁ
దలఁచి పొందిన నది జన్మఫలము గాదె!'
యనుచు వలరాజు బారికి నగ్గమయ్యె. 65

ప్రతిపదార్థం: ఆ లేమ= ఆ వనిత, సైరంధ్రి; లీలన్= విలాసంగా; నా ముందటన్= నా ఎదుట; పొలసినన్= తిరిగితే; చూడ్కికిన్= నా చూపునకు;

చుబ్బనచూఱకాదె!= కన్నులతో జుర్రుకొన్న సంబరం కాదా!; ఆ తనుమధ్య= సన్నని నడుముగల ఆమె; కనువిచ్చి= కళ్ళు తెరచి; చూచినన్= చూస్తే; తనువునకున్= శరీరానికి; అమృతసేచనము+కాదె!= అమృతంలో తడిసినట్లే కదా!; ఆ+చెలువ= ఆమె; చిరునవ్వు బెరయన్= చిరునవ్వు చిందించగా; నాతోడన్+పల్కినన్= నాతో మాట్లాడితే చాలు; రస+అయనము కాదె!= శ్రవణానందం కాదా, చెవులకు పండుగ కాదా!; ఆ+మెలఁత= ఆమె; ఎలమిన్= సంతోషంతో; నన్నున్+ఎలయింపన్= నన్ను పొందడానికి; తివిరినన్= ప్రయత్నించి నట్లయితే; ఎడఁదకున్= హృదయానికి; ఆనందంబు+ఇక్క= ఆనందానికి చోటు; కాదె?= కాదా!; ఆ నితంబిని= ఆ స్త్రీ; మక్కువన్= ప్రేమతో; అనఁగి పెనఁగి= వశమై క్రీడించి; ఇంపు= ప్రేమ; పొంపిరిపోవన్= అతిశయించగా; నన్ను+ఏలికొనఁగన్= నన్ను భర్తగా మన్నించటానికి; తలఁచి= తలపోసి; పొందినన్= కూడితే; అది జన్మఫలము కాదె!= అది పుట్టుకకు సార్థకం కాదా!; అనుచున్= అంటూ; వలరాజు బారికిన్= మన్మథుడి బారికి; అగ్గమయ్యెన్= వశమయ్యాడు.

తాత్పర్యం: 'ఆ సుందరి నా ముందు విలాసంగా మసలితే చాలు - నా చూపులు జుర్రుకొనే ఆనందం కలిగినట్లే. నన్ను కన్ను తెరచి చూస్తే చాలు - నా శరీరానికి అమృతాభిషేకం చేసినట్లే. ఆమె చిరునవ్వు చిందిస్తూ మాట్లాడితే చాలు - నాకు శ్రవణానందాన్ని అందించినట్లే. ఆ వనిత నన్ను సంతోషపెట్టా లనుకొంటే చాలు - పరమానందం సిద్ధించినట్లే. ఆమె వలపుతో కలసి మెలసి నన్ను పొందితే చాలు - ఈ పుట్టుక నెత్తినందుకు ఫలాన్ని పొందినట్లే' అని అనుకొంటూ కీచకుడు మన్మథుడికి వశమైపోయాడు.

విశేషం: 1.అలం: అంత్యానుప్రాసం. ప్రతిపాదం చివర 'కాదె!' అనే ఆశ్చర్యార్థకాన్ని పునరావృత్తం చేయటం వలన ప్రలాప స్వభావం ప్రసన్నమౌతున్నది.

2. తిక్కన తన పద్యాలలో పాటించిన శిల్ప రహస్యాలను అక్కడికక్కడ వెంటనే సూచించే స్వభావం కలవాడు. ఈ ఘట్టంలో రచించిన పద్యాలలో

గమనించదగిన అంశంగా రాబోయే వచనంలో 'అనంగ విభ్రమములకు అనుగుణమైన అనేకవిధాల ప్రలాపాలతో ప్రొద్దుపుచ్చుతున్నట్లు' చెప్పాడు. దీనినిబట్టి - కీచకుడు సైరంధ్రి ప్రదర్శించినట్లుగా తాను భావిస్తున్న శృంగార హావ భావాలకు అనుగుణంగా అతడు ప్రలాపాలు చేస్తున్నాడన్నమాట. ప్రలాపాలంటే సామాన్యార్థంలో అర్థరహితాలైన మాటలు పలకటమని గ్రహించవచ్చును. కాని, ఇక్కడ అది పారిభాషిక పదంగా వాడబడింది. దశవిధ శృంగారావస్థలకు మరి రెండింటిని చేర్చాడు ప్రతాపరుద్రీయంలో విద్యానాథుడు. అవి ప్రలాపం, (సం)జ్వరం. "ప్రలాపః ప్రియ సంశ్లిష్ట గుణాలాప ఉదాహృతః'' అని ప్రియ (యా) గుణస్తుతి ప్రలాపమని చెప్పాడు. జ్వరమంటే అధిక మదనతాపంగా పేర్కొన్నాడు. ఈ పద్యంలో కీచకుడు తన ప్రియురాలుగా భావిస్తున్న సైరంధ్రి యొక్క శృంగార విలాసాలు తనలో కలిగించే అనుభవ విశేషాలను పేర్కొంటూ ప్రలాపాలు (గుణకీర్తనలు) చేశాడు. సాన్నిహిత్యం, దృష్టిప్రసారం, పలుకరింపు, విలాసం, సంయోగం - అనే నాయికా శృంగార విభ్రమాల విశేషల వర్ణనమే ఈ ప్రలాపరూప పద్యశిల్పం. (సంపా.)

వ. మఱియు ననేకభంగుల ననంగ విభ్రమంబుల కనురూపంబులైన బహువిధ ప్రలాపంబులం బ్రొద్దుగడుపుచు నమ్మదిరాక్షిరాక కెదురు చూచుచుండె; నక్కడ పాంచాలి రావించి సుదేష్ణ తృష్ణ భావించుచు నిట్లనియె. 66

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; అనేకభంగులన్= అనేకవిధాలుగా; అనంగ విభ్రమంబులకున్= మదన విలాసాలకు; అనురూపంబులు+ఐన= తగిన; బహువిధ ప్రలాపంబులన్= పలు రకాల పలవరింతలతో, (ఒకవిధమైన మదనావస్థతో); ప్రొద్దు+కడుపుచున్= ప్రొద్దుపుచ్చుతూ; ఆ+మదిరాక్షి= ఆ సైరంధ్రి యొక్క; రాకకున్= రావటానికి; ఎదురుచూచుచున్+ఉండెన్= ఎదురుచూస్తూ ఉన్నాడు; అక్కడ= రాణి మందిరంలో; సుదేష్ణ= సుదేష్ణాదేవి; పాంచాలిన్+రావించి= సైరంధ్రిని పిలిపించి; తృష్ణ భావించుచున్= మద్యం త్రాగాలనే దప్పికను నటిస్తూ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అక్కడ ఈ విధంగా కీచకుడు మన్మథ భావాలకు అనుగుణమైన పలవరింతలు ప్రలాపాలు చేస్తున్నాడు. ఆమె రాకకు ఎదురు చూస్తున్నాడు. ఇక్కడ అంతఃపురంలో సుదేష్ణ సైరంధ్రిని రావించి మద్యం త్రాగాలనే దప్పికను నటిస్తూ ఇట్లా అన్నది.

విశేషం: కృత్రిమ పిపాసను సుదేష్ణ చక్కగా నటించింది. ఇక్కడ మదిరాక్షి అని సైరంధ్రిని వర్ణించటం సాభిప్రాయం. ఆమె మదిరకోసం తన ఇంటికి రావాలి; కాబట్టి ఆమె మదిరాక్షి వలె వస్తుందని కీచకుడి భావన.

క. 'ఒదవెడు తృష పెల్లిదమున।
వదనము వఱువట్లు వట్టె వాసిత రాజ
న్మదిరారస మానఁగ నా।
హృదయంబున వేడ్క యెసకమెసఁగెడుఁ దరుణీ! 67

ప్రతిపదార్థం: తరుణీ!= ఓ వనితా!; ఒదవెడు= కలుగుతున్న; తృష పెల్లిదమునన్= దప్పిక యొక్క ఆధిక్యంచేత; వదనము= నోరు; వఱువట్లు+ పట్టెన్= మిక్కిలి ఎండిపోయింది; వాసితరాజత్+మదిరారసము= సువాసనతో కూడిన సురను; ఆనఁగన్= త్రాగటానికి; నా హృదయంబునన్= నా మనస్సులో; వేడ్క= కోరిక; ఎసకమెసఁగెడున్= అధికమవుతున్నది.

తాత్పర్యం: 'ఓ తరుణీ! దప్పిక ఎక్కువగా ఉండి నా నోరు ఎండిపోతున్నది. చక్కని సువాసనతో కూడిన మదిరను తాగాలని నామనస్సు తీవ్రంగా వేడుక చూపుతున్నది.

విశేషం: సంభాషణ లెక్కువ, కథ చెప్పే తీరు తక్కువ. అంతా రూపకంలోని పాత్రలవలె సుదేష్ణ, సైరంధ్రి రంగస్థలంపై ప్రదర్శించినట్లు కళ్ళకు కట్టిస్తున్నాడు తిక్కన.

క. కీచకుని యింట నెప్పుడు।
వాచవి యగు బహువిధముల వారుణి గలుగున్

వే చని యచటికిఁ గొని ర।
మ్మా చూతముగాని నీ గమన వేగంబున్. 68

ప్రతిపదార్థం: ఎప్పుడున్= ఎల్లవేళల; కీచకుని+ఇంటన్= కీచకుడి ఇంట్లో; వాచవి+అగు= రుచికరాలైన; బహువిధముల= పలు రకాలైన; వారుణి= మద్యం; కలుగున్= ఉంటుంది; అచటికిన్= అక్కడకు; వే+చని= త్వరగా వెళ్ళి; కొనిరమ్మా= తీసికొని రావాలి; నీ గమనవేగంబున్= నీ వెంత త్వరగా వెళ్ళి వస్తావో; చూతముగాని= చూద్దాంగా.

తాత్పర్యం: కీచకుడి ఇంట్లో ఎప్పుడూ మంచి రుచిగల మద్యం ఉంటుంది. నీవు త్వరగా వెళ్ళి తీసికొని రావాలి. నీ వెంత త్వరగా వెళ్ళి వస్తావో చూద్దాం.

వ. అనవుడు. 69

తాత్పర్యం: అనగా.

ఉ. ఉల్లము దల్లడిల్లఁ దను వుద్గత ఘర్మజలంబు దాల్చుచున్
డిల్లపడంగ 'నా కిది కడింది విచారము పుట్టె; నందుఁ బో
నొల్ల ననంగ రా, దచటి కూరక పోవను రాదు, నేర్పు సం
ధిల్లఁగ దీనిఁ బాపికొను దీమస మెట్టిది యొక్కొ దైవమా!' 70

ప్రతిపదార్థం: ఉల్లము= మనస్సు; తల్లడిల్లన్= అల్లాడిపోగా; తనువు= శరీరం; ఉద్గత ఘర్మజలంబు= పైకుబికిన చెమటను; తాల్చుచున్= ధరిస్తూ; డిల్లపడంగన్= భయంతో నీరసపడగా; ఇది= సుదేష్ణ ఆదేశం వలన; నాకున్= (సైరంధ్రికి); కడింది విచారము= అధిక దుఃఖం; పుట్టెన్= కలిగింది; అందున్= కీచకుని ఇంటికి; పోన్+ఒల్లను= వెళ్ళటం ఇష్టం లేదు; అనంగరాదు= అనటానికి వీలుకాదు; అచటికిన్+ఊరక పోవను రాదు= అక్కడికి నిస్సహాయంగా (ఒంటరిగా) వెళ్ళటానికీ వీలులేదు; దైవమా!= ఓ భగవంతుడా!; నేర్పు+సంధిల్లఁగన్= నైపుణ్యంతో; దీనిన్= ఈ సమస్యను; పాపికొను= వదిలించుకొనే; దీమసము+ఎట్టిది+ఒక్కొ!= ఉపాయ మెటువంటిదో కదా!

తాత్పర్యం: ద్రౌపది మనసు కంపించిపోయింది. దానితో శరీరమంతా చెమటపట్టింది. పైపెచ్చు నీరసించింది. అప్పుడు ఇట్లా అనుకొన్నది; 'సుదేష్ణమాటవలన నాకు మిక్కిలి దుఃఖం కలిగింది. అయినా, నేను కీచకుడి ఇంటికి పోలేను అని అనలేను. అక్కడికి ఒంటరిగా పోనూ లేను. ఓ భగవంతుడా! ఈ చిక్కునుండి బయటపడే ఉపాయం ఏదో నీవే చూపించాలి.'

విశేషం: 1. అలం: వికల్పం. **'విరోధే తుల్య బలయో ర్వికల్పాలంకృతి ర్మతా'** అని లక్షణం. సమాన బలం గల రెండు విరుద్ధాంశాల మధ్య వికల్పాన్ని చెప్పేది వికల్పాలంకారం. సేవావృత్తిలో ఉన్న ద్రౌపది యజమానురాలి ఆజ్ఞను దాటటానికి వీలు లేదు. అంటే ఆమె కీచకుడి ఇంటికి పోవటం ధర్మం. అందువలన ఆమె వెళ్ళననటానికి ఒకవైపు వీలు లేదు. ఇక రెండవవైపు ఒంటరిగా ఆతడి మందిరానికి పోతే అతడామెను బలాత్కరించే అపాయం పొంచి ఉన్నది. కాబట్టి పోవటానికీ వీలులేదు. సేవాధర్మం స్వీయధర్మం రెండూ సమానబలం కలిగినవే. ఈ రెండింటి మధ్య సంఘర్షణ ఏర్పడింది. కాబట్టి ఆమె మనస్సు ఉయ్యాల ఊగినట్లు ఊగిసలాడుతున్నది. ఒత్తిడిలో నుండి ఉపాయం పుట్టాలి. ఒత్తిడికి తట్టుకోలేక ఉపాయం కొరకు ఆమె నిస్సహాయతతో భగవంతుడిని స్మరించింది. ద్రౌపది ఎప్పుడు భగవంతుడిని స్మరించినా అతడి అనుగ్రహం పిలిచినట్లు పలుకుతుంది. ఇది ఆమె చరిత్రలో కాదనలేని సత్యం. కథలో ఏర్పడే సన్నివేశాలలో అంతర్గర్భితంగా భగవద్రక్ష కొనసాగుతుందని కథార్థధ్వని.

2. మరొక విశేషం: వ్యాసభారతంలో ఈ మనస్సంఘర్షణ లేదు. మూలంలో ద్రౌపది సూటిగా, మూలంగా ధర్మావేశంతో మాట్లాడుతుంది.

"న గచ్ఛేయ మహం తస్య రాజపుత్రి ! నివేశనమ్ । త్వ మేవ రాజ్ఞి! జానాసి యథా స నిరపత్రపః।" (సం.4.14.11) ఓ రాజపుత్రీ! నేను కీచకుడింటికి పోను, ఓ రాజ్ఞీ ! అత డెంత లజ్జలేనివాడో నీకు తెలియదా?' అని కుండబ్రద్దలు కొట్టినట్లు మాట్లాడుతుంది. అది సమయోచిత సంభాషణవైఖరి కాదు. అంతర్మథనం. అది కథార్థాలను రక్తి కట్టిస్తుంది. తిక్కన నాటకీయతకు, రసపోషణకు ఈ అమూలక కల్పనం అమూల్యోదాహరణం. (సంపా.)

వ. అని తలంచుచు డోలాందోళితమానస యగుచు నమ్మానిని సుదేష్ణ కిట్లనియె. 71

ప్రతిపదార్థం: అని తలంచుచున్= అని తలపోస్తూ; డోలా+ఆందోళితమానస= ఉయ్యాల వలె ఊపబడే మనస్సు కలది; అగుచున్= అవుతూ; ఆ+మానిని= ఆ కాంత (ద్రౌపది); సుదేష్ణకున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని ఆలోచిస్తూ ఉయ్యాలవలె ఊగిసలాడే మనస్సుగల సైరంధ్రి సుదేష్ణతో ఇట్లా అన్నది.

ఉ. 'ఉత్పలగంధి! నన్నుడుగు, మొడ్లను బంపుము కల్లుదేర; నే
సత్పథవృత్తి నీ కడన సంతతమున్ బహుమానపాత్రనై
తత్పరతం జరించి యుచితంపుఁ బనుల్ దగఁ జేయఁ గాక దు
ష్కత్పరివారయోగ్య పరిచారముమైఁ జను నట్టి దాననే? 72

ప్రతిపదార్థం: ఉత్పలగంధి!= కలువల సౌరభంగల శరీరం గలదానా!; నన్నున్+ ఉడుగుము= నన్ను వదలిపెట్టుము (విడువుము); కల్లుతేరన్= కల్లు తీసికొనిరావటానికి; ఒడ్లను= ఇతరులను; పంపుము; ఏన్= నేను; సత్పథవృత్తిన్= సన్మార్గ ప్రవర్తనంతో; సంతతమున్= ఎల్లప్పుడును; నీ కడన్+అ= నీవద్దనే; బహుమానపాత్రను+ఐ= గౌరవార్హురాలినై; తత్పరతన్= ఆసక్తితో; చరించి= మెలగి; ఉచితము+పనుల్= తగిన పనులను; తగన్+ చేయన్+కాక= సరిగా చేయుటానికే గాని; దుష్కృత్ పరివారయోగ్య పరిచారముమైన్= నీచ సేవకులకు తగిన పనికై; చను+అట్టిదాననే?= వెళ్ళేటిదాననా?

తాత్పర్యం: 'ఓ వనితా! నన్ను వదలిపెట్టుము. కల్లు తీసికొనిరావటానికి ఇంక ఎవ్వరినైనా పంపుము. నీ దగ్గర నే నెప్పుడూ సన్మార్గవర్తినై సమ్మానార్హమైన కార్యాన్ని మాత్రమే చేసే దానినే గాని, ఇట్లా నీచ పరిచారికలు చేయదగిన పనులు చేసేదానినా? (కాదు).

విశేషం: పూలు ముడిచే సుకుమారమైన పని చేస్తానే గాని, కల్లు తీసికొనిరావటం వంటి నీచపు పనులు చేయనని మహారాణి కొలువులో చేరేటప్పుడే సైరంధ్రి చెప్పింది. ఇప్పు డామాట ధైర్యంగా గుర్తుచేస్తున్నది.

క. అతివ! తగునమ్మ నీ గృహ ।
మతి నిర్మల చరితభరితమని యీ యెడ మ
త్పతుల యసన్నిధి నైనను ।
మతి నూఱడి యున్నచోట మన్నన దప్పన్. 73

ప్రతిపదార్థం: అతివ!= ఓ సుదేష్ణాదేవీ; నీ గృహము= మీ అంతఃపురం; అతినిర్మల చరితభరితము= అత్యంత పవిత్రమైన నడవడికచేత నిండినది; అని= అనుకొని; ఈ+ ఎడన్= ఈ ప్రదేశంలో; మత్+పతుల+అసన్నిధిన్+ ఐనను= నా భర్తలు దగ్గర లేకున్నా; మతిన్+ ఊఱడి= మనస్సులో ఊఱటపడి; ఉన్నచోటన్= ఉన్నప్పుడు; మన్నన+తప్పన్= గౌరవం తప్పటం; తగునమ్మ?= తగునా తల్లీ?

తాత్పర్యం: ఓ దేవీ! ఇక్కడ నీ ఇంట సదాచార సంపన్నత కలదని తెలిసి, నా భర్తలు దగ్గర లేకున్నా, నేను నమ్మకంతో సరిపెట్టుకొని ధైర్యంగా ఉంటూ ఉండగా ఈ విధంగా మర్యాద తప్పటం న్యాయమా?

ఉ. సాధులు సేరి నెమ్మిగ నిజస్థిర వృత్తము దుష్టకోటిచే
బాధలఁ బొందకుండఁ దమపాల వసించినఁ బెద్దవారు ది
క్కై ధరియించి వారికొక యాపద వుట్టకయుండఁ గాచు టొ
ప్పై ధరఁ గీర్తి కెక్కదె? యపాయము సేసిన నింద వుట్టదే? 74

ప్రతిపదార్థం: సాధులు= సజ్జనులు; చేరి= ప్రయత్నించి; నెమ్మిగన్= ప్రీతితో; నిజ స్థిరవృత్తము= తమ నిశ్చల సదాచార ప్రవర్తన; దుష్టకోటిచేన్= దుర్మార్గులచేత; బాధలన్+ పొందకుండన్= బాధలుపడకుండా; తమపాలన్+

వసించినన్= తమను ఆశ్రయించి ఉండగా; పెద్దవారు= ఉన్నతులైనవారు; దిక్కు+ఐ= ఆధారమై; ధరియించి= పోషించి; వారికిన్= ఆశ్రయించినవారికి; ఒక ఆపద+పుట్టక+ ఉండన్= ఏవిధమైన ఆపదా కలగకుండా; కాచుట+ఒప్పు+ ఐ= కాపాడటం తగినదై; ధరన్+కీర్తికిన్+ఎక్కదె?= లోకంలో ప్రశస్తి పొందదా?; అపాయం చేసినన్= కీడు కలిగిస్తే; నింద+పుట్టదే?= నింద కలుగదా?

తాత్పర్యం: సజ్జనులైనవారు తమ సత్ప్రవర్తన చెడ్డవారి చేత చెరచబడకుండా కాపాడు కొనటానికి పెద్దలను ఆశ్రయిస్తే వారు వారికి ఆశ్రయమిచ్చి, వారి యోగక్షేమాల భారం వహించి, వారికి ఎటువంటి ఆపదలు కలుగకుండా కాపాడి, అన్నివిధాల రక్షిస్తే కీర్తి పొందుతారు. అట్లాకాక వారిని అపాయానికి గురిచేస్తే నిందల పాలవుతారు.

విశేషం: శరణాగత రక్షకులైన సజ్జనుల లక్షణాలు చెప్పే ఈ పద్యం చక్కని సూక్తి. ఇందులో సజ్జనుల ప్రసక్తి పాండవులకు, పెద్దల ప్రసక్తి విరాటరాజునకు పరోక్షంగా వర్తిస్తుంది.

ఆ. ఎవ్వరేని యింటి కెద్దియే నొకటికి।
నన్నుఁ బంపఁదగునె? నిన్ను నాఁడ
కొలుచునెడ ననుజ్ఞగొననె? నీచములగు।
పనుల కేను జాలకునికి సెప్పి.' 75

ప్రతిపదార్థం: ఎవ్వరేని+ఇంటికిన్= ఎవరి ఇంటికైనా; ఎద్దియేన్+ఒకటికిన్= దేనికో ఒకదానికి; నన్నున్+పంపన్+తగునె?= నన్ను పంపవచ్చునా?; నిన్నున్+కొలుచున్+ఎడన్= మీ కొలువులో చేరినపుడు; నాఁడు+అ= ఆ రోజే; నీచములు+అగు పనులకున్= చెడుపనులకు; ఏను+చాలక+ఉనికి= నేను సరిపోనని; చెప్పి= విన్నవించి; అనుజ్ఞ+కొననె?= అనుమతి పొందలేదా?

తాత్పర్యం: నన్ను ఎవరింటికో ఎందుకో ఒకదానికి పంపటం భావ్యం కాదు. నేను మీకొలువులో చేరేనాడే నీచపు పనులు చేయనని మీతో చెప్పి మీ అంగీకారం పొందలేదా?'

విశేషం: 'ఎవ్వరేని యింటికిన్' - ఇది 'ఎవ్వనియేని ముఖామృతాంశుబింబమ్మున' అను వాగనుశాసనుని ప్రయోగము వంటిది. అప్యర్థమునకు సమాసమధ్యపాత మిట విశేషము. 'ఒకటికి నన్నుఁబంపఁ దగునె?' - ఇందలి అశ్లీలత కవినాటికి లేదని యెఱుఁగనగును. కాళిదాసు తన యభిజ్ఞాన శాకుంతలమున - దుష్యంతుఁడు తననుఁ దోడ్కొని పోవునో పోవడోయని డోలాయమాన మానసయగు శకుంతల నూరడింపజేయుటకు 'విశ్వస్తా భవ' (ఆయన చెప్పినట్లు తోడ్కొనిపోవును గాన - నమ్మకము గలదాని వగుము) అని చెలికత్తెచేఁ బల్కించినాఁడు. ఆయన కాలములో 'విశ్వస్తావిధవే సమే' అనునది ప్రచారములో నుండినచో అప్పుడే వివాహితయగు శకుంతల నట్లాశీర్వదించుట జరుగదు కదా! అట్లే మనకాలమునం దశ్లీలములుగా నొప్పు కొన్ని పదములు తిక్కనాది మహాకవుల కాలములయందు సభ్యార్థములుగనే యున్నవని యూహింపనగు. ఏ కవులైనను వారివారి కాలంబులం దశ్లీల ప్రతీతి జనకంబుల మానుదురే కాని భావికాలాశ్లీల ప్రతీతి జనకంబుల మానసాధ్యము కాదు గదా! 'ఎవ్వరేని యింటి కెద్దియే నొకటికి' ననుటచే ఈ సుదేష్ణా కపట వర్తనము ద్రౌపదికి విదితమైనట్లు గూడ స్ఫురించెడివి. అయిన నేల పోయె నన్నచోఁ దన పాతివ్రత్య మహిమచే సంరక్షితము గాఁగలనను నమ్మికచేతనని తెలియునది.'' (కీ.శే. పళ్ళె పూర్ణ ప్రజ్ఞాచార్యులు - విరాటపర్వ టిప్పణి). ఎవ్వరేని...ఎవరి ఇంటికి బడితే వారి ఇంటికి, దేనికి పడితే దానికి- అని గోప్యంగా చెప్పటంలో, అవి ఎంతటి అవాచ్యాలో తెలుస్తున్నది (సంపా.)

క. అనిన విని యనుచితంబున।
కనయము శంకించియును లతాంగి మదిన్
తమ్ముని వలవంత దలఁచి యి।
ట్లనియెం బాంచాలితోడ సాదర వృత్తిన్. 76

ప్రతిపదార్థం: అనినన్+విని= ఆ మాటలు విని; అనుచితంబునకున్= అనువుకాని పనికి; అనయమున్= మిక్కిలిగా; శంకించియును= అనుమానపడి

కూడా; లతా+అంగి= సుదేష్ణ; మదిన్= మనస్సులో; తమ్ముని వలవంత= కీచకుడి విరహ బాధను; తలఁచి= జ్ఞాపకం చేసికొని; పాంచాలితోడన్= (ద్రౌపది) సైరంధ్రితో; స+ఆదరవృత్తిన్= గౌరవభావంతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ద్రౌపది చెప్పిన మాటలు విని చెడుపనిమీద పంపుతున్నందుకు సందేహించినా తమ్ముడైన కీచకుడి విరహబాధను స్మరించి గౌరవపురస్సరంగా సుదేష్ణ ఇట్లా అన్నది.

ఉ. 'అక్కట! యేను వేడ్కపడి యానెడు నాసవ మర్థిఁ దేర నొం
డొక్క నికృష్టఁ బంచుటకు నోపక చెప్పిన దీని నీవు గో
సెక్కఁగఁజేసి నిన్ను నతిహీన విధాన నియుక్తఁ జేఁతగా
నిక్కము యుమ్మలించి; తిది నెయ్యము తియ్యము కల్మియే? సఖీ! 77

ప్రతిపదార్థం: సఖీ!= ఓ చెలీ (సైరంధ్రీ)!; ఏను= నేను; వేడ్కపడి= ముచ్చటపడి; ఆనెడు ఆసవము= త్రాగే మద్యం; అర్థిన్+తేరన్= అక్కరగా తీసికొని రావటానికి; ఒండు+ఒక్క= మరొక; నికృష్టన్= నీచ స్త్రీని; పంచుటకున్+ ఓపక= పంపటం ఇష్టం లేక; చెప్పినన్= ఈ పని అప్పగిస్తే; నీవు, గోసు+ఎక్కఁ గన్+చేసి= నీవు దానిని దోషంగా పెద్ద చేసి; నిన్నున్; అతిహీన విధాననియుక్తన్= మిక్కిలి నీచకార్యానికి పంపినదానిగా; చేఁత+కాన్= చేయటమని; నిక్కము+ అ= తప్పక; ఉమ్మలించితి(వి)= దుఃఖపడుతున్నావు; ఇది నెయ్యము తియ్యము= ఇది స్నేహమూ, ప్రీతీ; కల్మి ఏ?= కలిగి ఉండటమవుతుందా?

తాత్పర్యం: 'ఓ చెలీ! నేను ఎంతో మనసుపడి త్రాగే మద్యాన్ని తెచ్చేందుకు నీచస్త్రీ నెవ్వరినీ పంపటం ఇష్టం లేక నీకు చెప్పితే, నీ వేమో దాని నొకక పెద్ద దోషంగా భావించి నీచకార్యం చెప్పానని నిజంగా భావించి లోలోన బాధపడుతున్నావు. ఇది స్నేహమాధుర్యం కలిగి ఉండట మనిపించుకొంటుందా?

విశేషం: సైరంధ్రి అనుచిత కార్యమని పేర్కొన్న పనిని ఉచితమైనదని సుదేష్ణ వాదించటమే కాక - స్నేహం, ప్రీతి ఉన్నచోట ఏ పని అయినా నీచమనీ, ఉదాత్తమనీ

పాటించటం పాడికాదని స్నేహధర్మమర్మాన్ని చూపుతున్నది. మాటల గడుసరి తనాన్ని ప్రదర్శించింది. (సంపా.)

క. అది లాఁతియిల్లె? నినుఁ దమ
హృదయంబుల నెవ్వరేని నెఱుఁగరె? యేఁ జె
ప్పుదు నీదు పెంపు నినుఁగ
న్నది మొదలుగ నెల్లవారి కయ్యై భంగిన్. 78

ప్రతిపదార్థం: అది= ఆ కీచకుని ఇల్లు; లాఁతి+ఇల్లె?= పరాయి యిల్లు కాదు గదా?; నినున్= సైరంధ్రిని; తమ హృదయంబులన్= తమ మనస్సులలో; ఎవ్వరు+ఏనిన్+ఎఱుఁగరె?= ఎవరికైనా తెలియదా?; ఏన్= నేను; నినున్+కన్నది మొదలుగన్= నిన్ను చూసినప్పటి నుండి; ఎల్లవారికిన్= అందరికీ; ఆ+ఐ+భంగిన్= ఎన్నో విధాలుగా; నీదు పెంపు చెప్పుదున్= నీ గొప్పతనం చెప్పుతూ ఉంటాను.

తాత్పర్యం: కీచకుడి ఇల్లు నీకేమైనా పరాయి ఇల్లా? నీవు అందరి మనసులకూ ఎక్కినదానవే? (అందరూ మెచ్చేదానివే); నిన్ను చూచినది మొదలు నీలోని సద్గుణాలను అందరికీ ఎన్నో విధాలుగా చెప్పేదానిని. కాబట్టి నీవు అందరికీ తెలుసు.'

విశేషం: నా ఇల్లు ఎట్లా నిర్మలచరితభరితమో మా తమ్ముడి ఇల్లు కూడా అట్లాగే; పరాయి ఇల్లు కాదని సుదేష్ణ నమ్మబలుకుతున్నది.

క. అని మఱియుఁ బెక్కుభంగులఁ
దనుఁ బ్రార్థింపంగ ద్రుపదతనయకుఁ జిత్తం
బున'నింకఁ బెద్ద పెనఁగం
జన దీయమతోడ' నను విచారము పుట్టెన్. 79

ప్రతిపదార్థం: అని; మఱియున్= ఇంకా; పెక్కు భంగులన్= అనేక విధాలుగా; తనున్+ప్రార్థింపంగన్= సైరంధ్రిని వేడగా; ద్రుపద తనయకున్= ద్రౌపదికి;

చిత్తంబునన్= మనస్సులో; ఈయమ తోడన్= ఈమెతో; ఇంకన్+పెద్ద పెనఁగన్+చనదు= ఇకపై అడ్డం చెప్పటం తగదు; అను విచారము= అనే ఆలోచన; పుట్టెన్= కలిగింది.

తాత్పర్యం: అని ఇంకా సైరంధ్రిని అనేక విధాలుగా ప్రార్థించటం చేత, 'ఈ సుదేష్ణతో ఇంకా ఎక్కువగా వాదులాడటం మంచిదికా' దనే ఆలోచన ద్రౌపదికి (సైరంధ్రికి) కలిగింది.

వ. ఇట్లు దోఁచిన తలంపునం జేసి. 80

తాత్పర్యం: ఈ విధంగా పుట్టిన ఆలోచనతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ద్రౌపది కీచకునింటికిఁ గల్లు దేరంబోవుట (సం.4-14-17)

చ. మన మురియాడుచుండ ననుమానముతోన సుదేష్ణఁ జూచి 'నీ
వనయముఁ గోరినట్టి పని యర్థిమెయిం జని చేయుదానఁ గా'
కను తన మాట కప్పొలఁతి హర్షముఁ బొందుచు నందియిచ్చు కాం
చన చషకంబు పుచ్చికొని చారువిలోచన యార్తమూర్తియై. 81

ప్రతిపదార్థం: చారువిలోచన= అందమైన కన్నులు కలది, ద్రౌపది; మనము= మనస్సు; ఉరియాడుచుండన్= ఊగిసలాడుతూ ఉండగా; అనుమానముతోన్+అ= సందేహిస్తూనే; సుదేష్ణన్+చూచి= సుదేష్ణను చూచి; నీవు; అనయమున్+కోరిన+అట్టిపని= ఎంతో, మరిమరీ కోరిన పనిని; అర్థిమెయిన్= ప్రేమతో, ఆసక్తితో; చని= వెళ్ళి; చేయుదానన్+కాక= చేస్తానులే; అను తనమాటకున్= అనే సైరంధ్రి మాటలకు; ఆ+పొలఁతి= ఆ దేవి (సుదేష్ణ); హర్షమున్+పొందుచున్= సంతోషిస్తూ; అంది+ఇచ్చు= చేతికి అందించే; కాంచన చషకంబు= బంగారు మధుపాత్రను; పుచ్చికొని= తీసికొని; ఆర్తమూర్తి+ఐ= దీనమైన ఆకారంకలదై;

తాత్పర్యం: ద్రౌపది తన మనస్సు ఊగిసలాడుతూ ఉండగా, సందేహంగానే సుదేష్ణ వైపు చూచి, 'నీ వింతగా కోరిన పనిని నీ మీది ప్రీతితో తప్పక చేస్తాను' అని చెప్పింది. ఆ మాటకు ఆ సుదేష్ణ ఎంతో సంతోషిస్తూ తన కందించిన బంగారు పానపాత్రను తీసికొని శోకమూర్తి అయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: సముచ్చయం. ఇది చక్కని అభినయ బంధురమైన రచన. మనసు ఊగిసలాడటం, అనుమానంతో చూడటం, నీమీది గౌరవంతో, ఇంతగా అడుగుతున్నావు కాబట్టి ఈ పని చేస్తానని ఒప్పుకొనటం, ద్రౌపది మాటలు విని సుదేష్ణ వెంటనే సంతోషంతో పొంగిపోవటం, ఆలస్యం చేయకుండా పానపాత్రను అందించటం, ద్రౌపది దానిని తీసికొనటం. అంతవరకూ అందంగా ఉన్న ద్రౌపది చూపులు ఆర్తితో నిండిపోవటం, ఆ అభినయంతో ఆమె శోకమూర్తిగా కనపడటం అనే అభినయ విశేషాలు ఒక క్రమ విన్యాసంలో నిబంధించటం ఈ పద్యంలోని నాటకీయత. ఏకకాలంలో కాదగిన (యౌగపద్యం గల) అంశాలను కూర్చి చెప్పితే సముచ్చయాలంకారం. దానిని తిక్కన ఒక క్రమవిన్యాసంతో ప్రయోగించాడు. (అభినయ వ్యాఖ్యకు రాబోయే పద్య విశేషాంశాన్ని కూడా చూడండి). (సంపా.)

వ. చనుచుండి, నీచహృదయుండగు కీచకుండు తనయెదుర నప్పుడాడిన కర్ణశూలంబులగు మాటల మీఁదం బిడుగుపడినవానిఁ గొఱవింజూఁడిన తెఱంగున సుదేష్ణ ద న్ననుచిత వ్యాపారంబునకు నియోగించుటకు నిర్వేదనం బునం బొంది. 82

ప్రతిపదార్థం: చనుచున్+ఉండి= వెళ్ళుతూ; నీచ హృదయుండు+అగు= నీచమైన మనస్సు గల; కీచకుండు= కీచకుడు; తన+ఎదురన్= తనముందు; అప్పుడు+ఆడిన= మొదటిసారి కలిసినప్పుడు పలికిన; కర్ణశూలంబులు+అగు మాటలమీఁదన్= చెవికి శూలాలు గుచ్చుకుంటే కలిగే బాధవంటి బాధ కలిగించే మాటలపై; పిడుగుపడినవానిన్= పిడుగుపడ్డవానిని; కొఱవిన్+చూఁడిన తెఱంగునన్= కొఱవితో కాల్చినట్లుగా; చమైన మనస్సుగల; సుదేష్ణ; తన్నున్= తనను (సైరంధ్రిని); అనుచిత వ్యాపారంబునకున్= తగని పనికి; నియోగించుటకున్= పంపినందుకు; నిర్వేదనంబునన్+పొంది= దుఃఖించి.

తాత్పర్యం: సైరంధ్రి అట్లా వెళ్ళుతూ నీచుడైన కీచకుడు తనముందు చెవికి శూలాలు సోకినట్లు కఠినంగా మాట్లాడిన మాటల తరువాత సుదేష్ణ తనను తగనిపనికి పంపటం పిడుగు పడినవాడిని కొఱవితో కాల్చినట్లు కాగా, నిర్వేదన స్థితి పొందింది.

విశేషం: అలం: ఉపమ. తిక్కన నాటకీయ పరిభాషను, అభినయ ముద్రలకు సంబంధించిన నాట్యాంశాలను కావ్యరచనలో ప్రవేశపెట్టి ఉభయకావ్య ప్రౌఢి పాటించే శిల్పాన్ని ప్రదర్శిస్తా డనటానికి ఈ పద్యం ఒక తార్కాణం. 'నిర్వేదంబునం బొంది' అన్న ప్రయోగం గమనించదగింది. నిర్వేదం అనే భావాన్ని పొంది అని కాదు. నిర్వేదం అనే భావంలో ఆ భావానికి తగిన అనుభావాలను ప్రదర్శిస్తున్న నాట్యముద్రను ముమ్మూర్తులా అలవరచుకొని అని అర్థం చెప్పాలి. నిర్వేదం సంచారిభావం. దాని అనుభవ, అభినయస్థితి నిర్వేదనం. "నిర్వేదో నామ దారిద్ర్య వ్యాధ్యవమానాధిక్షేపాకృష్ట క్రోధ తాడనేష్టజన వియోగ తత్త్వజ్ఞానాదిభిః విభావైః సముత్పద్యతే. స్త్రీ నీచకుత్సితసత్త్వానాం రుదిత నిశ్వసితో చ్ఛ్వసిత సంప్రధారణాదిభిః అనుభావైః తమభినయేత్" అని భరత నాట్యశాస్త్రం (vll-28). దారిద్ర్యం, వ్యాధి, అవమానం, అధిక్షేపం, తిట్టు, క్రోధతాడనం, ఇష్టజన వియోగం, తత్త్వజ్ఞానం మొదలైన విభావాల వలన నిర్వేదం కలుగుతుంది. రోదనం, ఉచ్ఛ్వాసనిశ్వాసాలు, సంప్రధారణం మొదలైన అనుభావాలతో స్త్రీలు, నీచ ప్రవృత్తులు, కుత్సితులు నిర్వేదాన్ని అభినయించాలి. చెప్పగూడని పని చెప్పి మాట తప్పి సైరంధ్రిని వంచించి అవమానించింది సుదేష్ణ; నీచ హృదయుడై కర్ణశూలాల వంటి మాటలు మాట్లాడి అవమానాన్ని ఆకృష్ట (తిట్టు)ను ప్రదర్శించిన కీచకుడు ద్రౌపదికి కలిగిన నిర్వేదనానికి విభావాలు. వీటి వలన సైరంధ్రి ఆర్తమూర్తి అయిందని పై పద్యంలో చెప్పబడింది. అంటే రోదనం లేదా ఆర్తి అనే అనుభావం మూర్తమైనట్లు గోచరించిందన్నమాట! తెలుగులో చెప్పాలంటే తన నిస్సహాయస్థితికి బావురుమని ఏడ్చినట్లు ఆకారం పెట్టిందన్నమాట! భావానుభావాలను తిక్కన ఇట్లా అభినయ సుందరంగా ఆవిష్కరించాడు. దాన్ని ఉపమాలంకార గమ్యంగా కూడా చేశాడు. కీచకుడి మాటలవలన పిడుగుపడితే కలిగే బాధను, ఆ మీద

కొరవిపెట్టి కాలిస్తే కలిగే వేదనను సుదేష్ణ నియోగం వలన పొందిందని భావం. ఒకటి ఒక్కసారిగా శీలాన్ని నిలువునా కూల్చేది, రెండోది మనసునంతా కోపంతో దహించి వేసేది. కావ్యాలంకార నాట్యాలంకారాల ఈ కమనీయ సంయోజనం కవిబ్రహ్మ సృష్టి. (సంపా.)

చ. అలమటఁ బొంది మాయ విధియా! యని దైవము దూఱు, నిత్తఱిం
గలరొకొ నాకు దిక్కను, మొగంబున నశ్రులు వెల్లిగొల్పుఁ, దొ
ట్రిలఁబడు, జల్లనం జెదరు డెందముఁ గూడఁగఁ దెచ్చి నన్నుఁ గే
వలమున ముట్ట నెవ్వరికి వచ్చుననుం, గలఁగున్, వెనుంబడున్. 83

ప్రతిపదార్థం: అలమటన్+పొంది= చింతపడి; దైవమున్= భగవంతుడిని; మాయ విధియా+అని= అయ్యో ఎంతటి క్రూర ప్రారబ్ధం కల్పించావయ్యా! అని; దూఱున్= తిట్టుతుంది; ఈ+తఱిన్= ఈ సమయంలో; నాకున్+దిక్కు= నాకు ఆధారం; శరణం; కలరు+ఒకొ అనున్= ఉన్నారా అని అంటుంది; మొగంబునన్= ముఖం మీద; అశ్రులు వెల్లి+కొల్పున్= కన్నీళ్ళను మిక్కుటంగా కారుస్తుంది; తొట్రిలన్+పడున్= తడబడుతుంది; జల్లు+అనన్= జల్లుమనేటట్లు; చెదరుడెందమున్= చలించే మనస్సును; కూడఁగన్+తెచ్చి= కూడదీసికొని; నన్నున్= సైరంధ్రిని; కేవలమున= కావాలని; ముట్టన్= తాకటానికి; ఎవ్వరికిన్+వచ్చున్= ఎవ్వరికి సాధ్యపడుతుంది; అనున్= అంటుంది; కలఁగున్= కలతపడుతుంది; వెనున్+పడున్= వెనుకకు తగ్గుతుంది.

తాత్పర్యం: బాధపడుతూ, మాయవిధీ! అని దైవాన్ని నిందిస్తూ, తనకు దిక్కెవ్వరూ లేరని కన్నీళ్ళు బాగా కారుస్తూ, తూలుతూ, సైరంధ్రి కొంతసేపటికి తన మనస్సు కుదుటపరచుకొని, తనను అన్యులు ఎవ్వరూ ముట్టజాలరని ధైర్యం తెచ్చుకొని కూడా కలతపడి వెనుకకు తగ్గింది.

విశేషం: నిర్వేదం అనే సంచారి భావంలో ప్రదర్శించే చేష్టాదికాలు (అనుభావాలు) ఇందులో సహజంగా వర్ణించటం అభినయ సౌందర్యాన్నీ, భావశబలతనూ వెలారుస్తున్నాయి. (సంపా.)

క. అట్టియెడ. **84**

తాత్పర్యం: ఆ సమయంలో.

సీ. దైన్యంబు తలపోఁత తలకొన్నఁ జెలువ కా।
ననమున వెల్లఁదనంబు గదిరె;
భయరసవేగంబు పైకొని ముట్టినఁ।
గాంతకుఁ దనులతఁ గంప మడరె;
బెగ డంతకంతకు మిగిలిన నింతికిఁ।
బదముల నటఁ దొట్రుపాటు బెరసెఁ;
దల్లడం బొందినఁ దన్వికి నవయవం।
బుల నెల్ల ఘర్మాంబు కళిక లెసఁగెఁ;

ఆ. దలఁకు పుట్టెఁ, గొంకు కొలఁదికి మీఁటె, వె।
న్బాటు దోఁచె, ముట్టుపాటు దొడరె
వెఱఁగుపాటు దనికె, నెఱ నాడె నొవ్వ నె।
వ్వగలు వగల నీనె, దిగులు వొదివె. **85**

ప్రతిపదార్థం: చెలువకున్= సైరంధ్రికి; దైన్యంబు= తనకప్పుడు కలిగిన దీనత్వ సంబంధమైన; తలపోఁత= ఆలోచన; తలకొన్నన్= కలుగగా, ముసురుకోగా; ఆననమునన్= ముఖంమీద; వెల్లఁదనంబు= వెలవెలపాటు; కదిరెన్= ఆవహించింది; కాంతకున్= సైరంధ్రికి; భయరసవేగంబు= మిక్కుటమైన భయమనే రసం యొక్క తీవ్రత; పైకొని ముట్టినన్= ఆవహింపగా, క్రమ్ముకోగా; తనులతన్= శరీరంలో; కంపము+అడరెన్= వణుకు పుట్టింది; ఇంతికిన్= ఆమెకు; బెగడు= విహ్వాలత్వం; అంతకున్+అంతకున్= క్షణక్షణానికి; మిగిలినన్= ఎక్కువకాగా; పదములన్= అడుగులలో; తొట్రుపాటు బెరసెన్=

తడబాటు కలిగింది; తన్వికిన్= ఆమెకు; తల్లడంబు+ఒందినన్= కలతపాటు కలుగ టంతో; అవయవంబులన్+ఎల్లన్= శరీరంలోని అంగాలనిండా; ఘర్మ+ అంబుకళికలు= చెమట నీటి బిందువులు; తొడరెన్= వ్యాపించాయి; తలఁ కు+పుట్టెన్= భయంపుట్టింది; కొంకు= సంకోచం; కొలఁదికి మీఁటెన్= మోతాదుకు మించింది, అతిశయించింది; వెన్+పాటు+తోఁచెన్= దిగులు కలిగింది; ముట్టుపాటు+తొడరెన్= సంకటం కలిగింది; వెఱఁగుపాటు= భయం వలన నిశ్చేష్టత; తనికెన్= కలిగింది; నొవ్వు= బాధ; నెఱనాడెన్= పూర్ణంగా నాటుకొన్నది (జీవస్థానంలో తగిలింది); నెఱ+వగలు= పూర్తిచింత; వగలన్= దుఃఖాలను; ఈనెన్= నింపివేసింది; దిగులు+పొదివెన్= దిగులు చుట్టుకొన్నది.

తాత్పర్యం: ద్రౌపదికి మనస్సున దీనత్వం కలుగటంతో ముఖం తెల్లబోయింది. భయంతో శరీరం వణకసాగింది. శరీరం పరవశం కావటంతో అడుగులు తొట్రుపడసాగాయి. కలతపాటు కలగటంతో దేహమంతటా చెమటలు పట్టాయి. భయం, సంకోచం, నిశ్చేష్టత, సంకటపాటు, బాధ అతిశయించాయి. దిగులు పెనవేసికొన్నది.

విశేషం: 1. భావ సంఘర్షణలను చిత్రించేటప్పుడు తిక్కన ఆకృతుల కంటె అభినయాలను ఎక్కువగా వర్ణిస్తాడు. ముందు పద్యంలో ద్రౌపది అనుభావాలను చెప్పి ఈ పద్యంలో సాత్త్వికభావాలను చిత్రించాడు. రసాభ్యుదయోల్లాస శిల్పంలో ఈ పద్యం ఒక రత్నం. ఇందులోని శిల్పాన్ని నాలుగు రకాలుగా వివేచించవచ్చును. 1. భావోదయం.2.అనుభావ ప్రకటనం. 3. సాత్త్వికభావ ప్రదర్శనం. 4. వాటియొక్క అభ్యుదయ క్రమోల్లాసం. ఈ సీసపద్యంలో అనుభావ సాత్త్వికభావాలు వరుసగా సీసపద్య పాదాలలోనూ, భావోదయ క్రమం ఎత్తుగీతిలోనూ, వాటి అభ్యుదయాన్ని క్రమాలంకారంలో ఉల్లాసపరచటం అలంకార రచనలోనూ తిక్కన ఆవిష్కరించాడు. ఆ క్రమాన్ని ఈవిధంగా భావించవచ్చును.

భావం

అనుభావం

సాత్త్వికభావం

1. తలఁకు పుట్టటం

\- 1. ధైర్యంబు తలపోత

1. మొగమున వెల్లదనం.

2. భయం మితిమీరటం

\- 2. భయరసవేగం పైకొనటం

2. శరీరం వణకటం.

3. వెన్‌బాటు తోచటం

\- 3. విహ్వలత అంతకంతకు పెరగటం   3. నడకలో తడబాటు.

4. ముట్టుపాటు (కలత) పుట్టటం   -

\- 4. తల్లడిల్లడం

4. ఒడలెల్ల చెమటపట్టడం.

ఎత్తుగీతి పూర్వార్ధంలో భయం అనే రసభావం యొక్క నాలుగు దశలను వికాసక్రమంలో పేర్కొనటం, ఆ భావదశలకు తగిన అనుభావసాత్త్విక భావాభివ్యక్తులను సీసపద్య పాదాల పూర్వోత్తరార్ధాలలో క్రమంగా వర్ణించటం క్రమాలంకార విన్యాసం. ఎత్తుగీతి ఉత్తరార్ధంలో భావోల్లాసాన్ని అవస్థాపరంగా పేర్కొనటం జరిగింది. తరువాతి వచనంలో 'ఇవ్విధంబున ద్రుపదపుత్రి దురవస్థం బొందుచు' అని తిక్కన తన రసభావ శిల్పరహస్యాన్ని సూచించాడు. దానిని అన్వయించుకొంటే ద్రౌపది పొందిన దురవస్థ (భరించటానికి శక్యంగాని మనోవేదన) నాలుగు ముఖాలుగా పరిణతి చెందింది. అవి- వెఱగుపాటు పొందటం, అదే ఒక దురవస్థ దశ. దాని కంటె దుర్భరమైనవి క్రమంగా - మర్మస్థానాలను బాధపెట్టే వేదన, నెవ్వగల వగలు, దిగులు. ఇంత క్రమబద్ధంగా

ఒక పాత్రలోని భావానుభావాల కనుగుణమైన సాత్త్వికభావాలను వర్ణించి, అవి మానసిక అవస్థలుగా రూపొందిన పద్ధతిని ప్రదర్శించిన అభినయశిల్పాన్ని శ్రవ్యకావ్యంలో మొదట ప్రవేశపెట్టినవాడు కవిబ్రహ్మ తిక్కన. మహాకవిత్వంలో ఉండే అభినయ నిర్మాణ శిల్పానికి (Structural beauty) ఈ పద్యం తార్కాణం. (సంపా.)

2. విధి ఒక వ్యక్తిని ఎంత దయనీయ స్థితికి తీసికొనివస్తుందో ఈ పద్యం ఉదాహరణంగా చెప్పవచ్చును. సకలరాజన్యుల చేత పరిచర్యలు పొందవలసిన పాండవ పట్టమహిషి ఒక పరిచారికగా సుదేష్ణ కొలువులో చేరటం విధి వైపరీత్యం. ఆమెకు ఈ కష్టకాలంలో తోడ్పడేవారు ఎవ్వరూ లేరనే బాధ కలిగింది. ఆ నీచుడి ఇంటికి వెళ్ళక తప్పలేదు. అట్టి దయనీయ స్థితిని తిక్కన ఈ పద్యంలో వివరించాడు. భావం ఒకటే అయినా వేర్వేరు పదాలను వాడటం భావతీవ్రతకు, సమగ్రతకు దోహదం చేశాయి.

వ. ఇవ్విధంబున ద్రుపదపుత్రి దురవస్థం బొందుచు 'మహాపదలకుం బరిహరణంబు హరి (చరణ) స్మరణంబ' యని తన హృదయపుండరీకం బునం బుండరీకాక్షు నిక్షేపించుకొని, సుదేష్ణ మందిరంబు వెలువడి దినకరుం గనుంగొని వినయవినమితోత్తమాంగయై నిజాంతర్గతంబున. 86

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; ద్రుపదపుత్రి= ద్రౌపది (సైరంధ్రి); దురవస్థన్+పొందుచున్= పడరాని మానసికవేదన పడుతూ; మహా+ఆపదలకున్= గొప్ప కష్టాలకు; పరిహరణంబు= నివారణోపాయం; హరి (చరణ) స్మరణంబు+అ= విష్ణు పాదాలను తలంచటమే; అని= అనుకొని; తన హృదయపుండరీకంబునన్= తన హృదయ కమలంలో; పుండరీకాక్షున్= తెల్లని పద్మాలవంటి కన్నులు కలవాడైన విష్ణువును; నిక్షేపిం చుకొని= నిలుపుకొని; సుదేష్ణ మందిరంబు= సుదేష్ణ నివసించే భవనం నుండి; వెలువడి= బయటికి వచ్చి; దినకరున్= సూర్యుడిని; కనుంగొని= చూచి; వినయ వినమిత+

ఉత్తమ+ అంగ+ఐ= అణకువచే వంచిన శిరస్సుగలదై; నిజ+అంతర్గతం బునన్= తన మనస్సులో.

తాత్పర్యం: ద్రౌపది ఈ విధంగా దుఃఖిస్తూ, కష్టాలు గట్టెక్కటానికి భగవంతుడి స్మరణమాత్రమే మార్గమని తలచి, విష్ణువును ధ్యానించి, సుదేష్ణ మందిరం వెలువడి, సూర్యడిని చూచి అణకువతో తలవంచుకొని నమస్కరించి, తన మనస్సులో, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: రూపకం; పుండరీకాక్షుడు అన్నది సాభిప్రాయ విశేషణం, పుండరీకముల వంటి కనులుగల నారాయణుడిని స్మరించటం వలన ఆమెను కనుపాపవలె కాపాడవలసిన బాధ్యత విష్ణుమూర్తిపై పడింది. ద్రౌపది మందిరం నుండి బయటికి రాగానే సూర్యుడికి నమస్కరించింది. సూర్యుడు కమలాప్తుడు, ద్రౌపది హృదయపుండరీకానికి కూడా వికాసం కలిగించక తప్పదు. నారాయణుడి పుండరీకాక్షులను కూడా వికసింపజేయక తప్పదు. ద్రౌపది హృదయపద్మం వికసిస్తుందని ధ్వని.

తే. 'పాండుపుత్రులకేను తప్పని మనంబు।
గలుగుదాననయేని నో కమలమిత్ర!
కీచకుని దెస న న్నొక కీడు తెరువు।
వొరయకుండఁగ రక్షింపు కరుణతోడ.' **87**

ప్రతిపదార్థం: ఓ కమలమిత్ర!= పద్మాలకు మిత్రుడవైన ఓ సూర్యభగవానుడా!; ఏను= నేను (సైరంధ్రి); పాండుపుత్రులకున్= పాండవులకు; తప్పనిమనంబు= తొలగనిమనస్సు; కలుగుదానను+అ+ఏనిన్= కలదానినైతే; కీచకునిదెసన్= కీచకుని వలన; నన్నున్= నన్ను; ఒక కీడు తెరువు= ఎటువంటి హాని జరిగేపద్ధతి; పొరయక+ఉండఁగన్= ఏర్పడకుండా; కరుణతోడన్= దయతో; రక్షింపు(ము)= రక్షించుము.

తాత్పర్యం: 'ఓ సూర్యభగవానుడా! నేను పాండవులను తప్ప ఇతరులను భర్తలుగా భావించని పతివ్రతనైతే నాకు కీచకుడి వలన ఎటువంటి అపాయం జరిగే దారు లేర్పడకుండా దయతో రక్షించుము.'

విశేషం: ద్రౌపది మహాభక్తురాలు. ఒకసారి భగవంతుడిని సమాహితచిత్తంతో స్మరిస్తే ఆయన వెంటనే ప్రసన్నుడౌతాడు. ఆమెకు శ్రీకృష్ణుడే శ్రీమన్నారాయణుడు. ఆమె హరినామస్మరణం ఆపదలనుండి కాపాడుతుందని గాఢమైన విశ్వాసం కలది. **"యద్భావం తద్భవతి."** ఆమె మనఃపద్మంలో పుండరీకాక్షుడిని స్థిరంగా నిలుపుకొన్నది. ఆమె మనసు పుండరీకం, ఆ దేవుడి చూపు పుండరీకం. ఆతడి కరుణ ఆమె పట్ల ఉండటం సహజసిద్ధం అని ధ్వని. మందిరం దాటి బయటికి వచ్చింది ద్రౌపది. ఆమెకు సూర్యనారాయణుడు ఎదుట మింట కనిపించాడు. **"సూర్యో నారాయణో హరిః"** అని సంప్రదాయం. హరి పద్మాక్షుడు, సూర్యుడు పద్మమిత్రుడు. పైపెచ్చు నారాయణ నామధేయుడు. సర్వవ్యాపకుడైన హరికి ప్రత్యక్ష సాక్షి సూర్యుడు. ఆయనకు నమస్కరించింది. సూర్యుడు మహాపదార్థాలలో ఒకడు. జగత్సాక్షి, ద్రౌపది పాతివ్రత్యానికి సాక్షిగా నిలువదగిన దైవం ఆతడే - అందువలన ఈ విధంగా ఆయనను ప్రార్థించింది. ఆమె పతులపట్ల చెదరని భక్తి గలదని చెప్పగలిగిన ఆ కర్మసాక్షియే, ఆ ధర్మానికి కీడు రాకుండా ఉండే మార్గాలను కల్పించి ఆమె శీలాన్ని రక్షించే బాధ్యత తీసికొనగల మహితాత్ముడు. నారాయణుడైనా, సూర్యనారాయణుడైనా తత్త్వతః ఒక్కడే. **"ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి'** కదా! అటువంటి భేదం లేని భక్తితో ద్రౌపది సూర్యుడికి నమస్కరించింది. అనన్యచింతతో స్మరించిన ఆమెయొక్క యోగక్షేమం వహించవలసిన బాధ్యత ఆ భగవానుడిదే! (సంపా.)

వ. అనుచుం గేలు మొగిచిన. **88**

తాత్పర్యం: అంటూ చేతులెత్తి నమస్కరించగా.

క. తరణియు దుఃఖితయగు న।
త్తరుణిం గాచుటకు నత్యుదగ్రభుజావి

స్ఫురణాఢ్యు నొక్క రక్కసుఁ ।
గరుణార్ద్రమనస్కుఁ డగుచు గ్రక్కునఁబనిచెన్. 89

ప్రతిపదార్థం: తరణియున్= సూర్యుడునూ; కరుణార్ద్ర మనస్కుఁడు+ అగుచున్= దయారసంతో తడిపిన మనస్సుకలవాడై; దుఃఖిత+అగు+ దుఖంతోఉన్న; ఆ+తరుణిన్= ఆ కాంతను; కాచుటకున్= రక్షించుట కొరకై; అతి+ఉదగ్ర భుజావిస్ఫురణ+ఆఢ్యున్= మిక్కిలి అధికమైన భుజపరాక్రమం చేత గొప్పవాడైన; ఒక్క రక్కసున్= ఒక రాక్షసుడిని; గ్రక్కునన్= వెంటనే; పనిచెన్= పంపాడు.

తాత్పర్యం: ద్రౌపది మొర విన్న సూర్యుడు దయాంతరంగంతో ఆమెను రక్షించటానికి బాహుబలాఢ్యుడైన ఒక రాక్షసుడిని పంపాడు.

వ. వాఁడునుం బనిపూని యంబరతలంబున నదృశ్యాకారుండై వచ్చి నిలిచె. 90

ప్రతిపదార్థం: వాఁడునున్= వాడుకూడా; పనిపూని= బాధ్యత స్వీకరించి; అంబరతలం బునన్= ఆకాశమార్గంలో; అదృశ్య+ఆకారుండు+ఐ= కనబడని రూపం కలవాడై; వచ్చి; నిలిచెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: ఆ రాక్షసుడు వెంటనే పనిపూని వచ్చి ఆకాశంలో ఎవరికీ కనబడకుండా ఆమెకు రక్షగా నిలబడ్డాడు.

తే. ఇట్లు ప్రార్థించి పాంచాలి యెట్టకేని।
సింహబలు మందిరం బల్లఁ జేర నరిగి
యొల్లఁబోవుచు బెబ్బులి యున్న పొదరు।
సొచ్చు లేడి చందంబునఁజొచ్చుటయును. 91

ప్రతిపదార్థం: ఇట్లు ప్రార్థించి= ఇట్లా వేడికొని; పాంచాలి= ద్రౌపది (సైరంధ్రి); ఎట్టకేనిన్= ఎట్లానో, ప్రయాసతో; సింహబలు మందిరంబు= కీచకుని నివాసభవనం; అల్లన్+ చేరనరిగి= నెమ్మదిగా సమీపించి; ఒల్లన్+పోవుచున్= కలతపడుతూ; బెబ్బులి+ఉన్న పొదరు= బెబ్బులి ఉన్న పొదను; చొచ్చు లేడి చందంబునన్= ప్రవేశించే లేడివలె; చొచ్చుటయును= ప్రవేశించగా.

తాత్పర్యం: ఇట్లా ప్రార్థించి, ప్రయాసపడుతూ సైరంధ్రి ఎట్లాగో కీచకుడి గృహాన్ని చేరి కలతపడుతూ, పెద్దపులి ఉండే పొదలోపలికి వెళ్ళే లేడివలె ఆ మందిరంలో ప్రవేశించినంతనే. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. 'బెబ్బులి యున్న పొదరు సొచ్చు లేడి చందంబున' అనేది జాతీయం. బలవంతులైన వారి ప్రయోజనాలకై నిస్సహాయులైనవారు బలి కావలసిన స్థితి ఏర్పడుతుంది. ఆ సందర్భంగా ఈ మాట వాడుతారు. ఈ ఉపమాలంకారం సందర్భోచితంగా సంతరించ బడింది. తిక్కన ఉపమానాలన్నీ సామాన్య జనజీవన పరిధిలోనుండి ఎన్నుకొనబడటం గమనార్హం. 'ఆంధ్రావళి మోదముం బొరయునట్లు' ఆయన చేసే రచనకు ఇది ఒక సహజాలంకారం.

ఉ. అంబురుహాక్షి వచ్చు తెరు వారయఁ గీచకముఖ్యుఁ డప్డు తె
ల్లంబుగఁ జూచి యుల్లము కలంకయు వారక మేన వెమ్మతా
పంబును డిగ్గఁ ద్రావి, గరుపాఱుచు నుత్కట సంభ్రమంబు హ
ర్షంబుఁ బెనంగొనంగ నతిచంచలభావ పరీతమూర్తియై. 92

ప్రతిపదార్థం: కీచక ముఖ్యుఁడు= కీచకులలో మొదట లెక్కించదగినవాడు, సింహబలుడు; అప్డు= అప్పుడు; అంబురుహ+అక్షి= కమలాల వంటి కనులుగల సైరంధ్రి; వచ్చు తెరువు= వచ్చే దారిని; ఆరయన్= తేరిపారగా; తెల్లంబుగన్+చూచి= స్పష్టంగా చూచి, ఉల్లము కలంకయున్= మనస్సులోని కలతనూ; వారక= ఎడతెగక; మేనన్+వెమ్మ= శరీరాన్ని తపింపచేసే; తాపంబును= విరహబాధనూ; డిగ్గన్+తావి= దిగమ్రింగి; గరుపాఱుచున్= గగుర్పాటు నొందుతూ; ఉత్కట సంభ్రమంబు= మిక్కిలి తొట్రుపాటు; హర్షంబున్= సంతోషం; పెనంగొనంగన్= ముప్పిరికొనగా (పెనవేసికొనగా);

అతి చంచలభావ పరీతమూర్తి+ఐ= మిక్కిలి చాపల్యంతో పెనగొన్న మనస్సు కలవాడై.

తాత్పర్యం: కీచకుడు సైరంధ్రి వచ్చే దారిని కనువిచ్చి స్పష్టంగా తేరిపార చూచాడు. మనసులోని కలతను శరీరంలోని ఆరని మదనతాపాన్ని దిగమ్రింగుకొన్నాడు. గగుర్పాటుతో కూడిన ఆశ్చర్యం, సంతోషం పెనవేసికొనగా చపల స్వభావంతో కూడినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. చిడిముడి పడుచు నెదురు చనఁ।
గడఁగుచు హారములు సక్కఁగాఁద్రోచుచు మ
ల్లడి గొనుచు దుర్విలాసం।
బొడలికి నొడఁ గూర్చుచుండ నుగ్మలి యంతన్. **93**

ప్రతిపదార్థం: చిడిముడి పడుచున్= తొట్రుపాటు పడుతూ; ఎదురుచనన్= ఎదురుగా పోవటానికి; కడఁగుచున్= ప్రయత్నిస్తూ; హారములు+చక్కఁగాన్+త్రోచుచున్= మెడలో హారాలు సరిచేసికొంటూ; మల్లడి గొనుచున్= సుడులు సుడులుగా తిరుగుతూ; ఒడలికిన్= శరీరానికి; దుర్విలాసంబు= దుష్టమైన విలాసం; ఒడన్+కూర్చుచున్+ఉండన్= ప్రదర్శిస్తూ ఉండగా; ఉగ్మలి= సైరంధ్రి; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: కీచకుడు తొట్రుపాటు పడుతూ, ఎదురుపోవటానికి సమకట్టి, హారాలు సవరించుకొంటూ, శరీరం మీద ఉదాత్తంగాని శృంగార చేష్టలు ప్రదర్శిస్తూ నిలుచున్నాడు. అప్పుడు సైరంధ్రి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'దుర్విలాసం' అనేది సాభిప్రాయమైన ప్రయోగం. కీచకుడు రూపాభిమాని. హారాలు సవరించుకొనడం వంటివి చేశాడు. దుర్విదగ్ధుడి హర్షం కాబట్టి దుర్విలాసం.

వ. తత్ప్రదేశంబునకుం జని. **94**

తాత్పర్యం: ఆ ప్రదేశానికి వెళ్ళి.

తే. 'దేవి తృష పుట్టి వారుణిదేరఁ బనుప।
నరుగుదెంచితిఁ బోయింపుఁ' డనిన నింతి
నెమ్మొగంబున దృష్టులు నిలిపి, తమక।
మడర నిట్లను నా కీచకాధముండు. **95**

ప్రతిపదార్థం: దేవి= సుదేష్ణాదేవి; తృష పుట్టి= మద్యపు దప్పికగొని; వారుణి+తేరన్= మద్యం తెమ్మని; పనుపన్+అరుగుదెంచితిన్= పంపగా వచ్చాను; పోయింపుఁడు+అనినన్= పోయించండి అని అనగా; ఇంతి నెఱ+మొగంబునన్= సైరంధ్రి అందమైన ముఖంమీద; దృష్టులు నిలిపి= చూపులు నిలిపి; తమకము+అడరన్= మోహం అతిశయించగా; ఆ కీచక+అధముండు= ఆ నీచుడైన కీచకుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'సుదేష్ణాదేవి దప్పికగొని మద్యం తీసికొని రమ్మని పంపగా వచ్చాను. పోయించం'డని సైరంధ్రి పలుకగా, మోహపరవశత్వంతో ఆమెను చూస్తూ ఆ నీచకీచకు డిట్లా అన్నాడు.

విశేషం: సైరంధ్రి (ద్రౌపది) తలవంచుకొని ముక్తసరిగా మాట్లాడటం ఆమె స్వభావానికి ఉచితం.

క. 'దేవి తృష దీర్పఁ బూనితి;।
వా వెలఁది సహోదరుండ నగు నా తృష లీ
లావతి! నీదు సరస సం।
భావనమెయిఁ దీర్పకునికి పాడియె చెపుమా! **96**

ప్రతిపదార్థం: లీలావతి!= ఓ సౌందర్యవతీ!; దేవి= సుదేష్ణాదేవి యొక్క; తృష+తీర్పన్+పూనితివి= దప్పిక తీర్చటానికి పూనుకొన్నావు; (కాని); ఆ వెలఁది= ఆమె యొక్క; సహోదరుండన్+అగు= తమ్ముడనైన; నా తృషను= నా యొక్క దప్పికను; నీదు సరస సంభావనమెయిన్= నీ సరసమైన మన్నన చేత; తీర్పక+ఉనికి= తీర్చకుండా ఉండటం; పాడియె చెపుమా!= న్యాయమా చెప్పుము!

తాత్పర్యం: 'ఓ సుందరాంగీ! మీ దేవి దప్పిక తీర్చటానికి పూనుకొన్న నీవు, ఆమె తమ్ముడనైన నా దప్పిక కూడా నీ సరస సల్లాపాలతో తీర్చకుండటం న్యాయమా? చెప్పుము.

విశేషం: ఇక్కడ తృష= దప్పిక, కామము అనే అర్థాల మీద కవి ఇద్దరి చేతా మాట్లాడించి చమత్కరించాడు. ఒకరు కోరే అర్థం మరొకరికి తెలియజేశాడు. సుదేష్ణ దాహం మదిరతో తీరుతుంది. కీచకుడి దాహం ఆమె సరస సంభావనతో చల్లారుతుంది.

సీ. కాంతి దళ్కొత్తు నీ కడగంటి చూడ్కితోఁ।
బొందఁగానని మేను పొగులుటయును,
దీపారు నీ పల్కుఁ దెల్లంబుగా వినఁ।
గానని వీనులు గందుటయును,
నింపగు నీ చెయ్వు లెలమిమైఁ గొనియాడఁ।
గానని కోర్కులు గలఁగుటయును,
సొగయించు నీ కేళిఁ దగిలి యానందంబుఁ।
బొందఁగానని మది గుందుటయును

తే. బాయ, నాదగు జన్మంబు ఫలము నొంద।
భావజన్ముని పూనిక పార మెయ్దు
నన్ను బంటుగా నేలుము నలినవదన!।
యింక నీ సిగ్గుదెర యోల మేల నీకు?' 97

ప్రతిపదార్థం: నలినవదన!= పద్మంవంటి ముఖం కలదానా! సైరంధ్రీ!; కాంతి= కాంతి అనే గుణం; తళ్కొత్తు= ప్రకాశించే; నీ కడగంటి చూడ్కితోన్= నీ క్రీగంటి చూపుతో; పొందన్+కానని మేను= కూడలేని శరీరం; పొగులుటయును= తపించటమున్నూ; తీపారు= తియ్యని; నీ పల్కున్= నీ

మాటను; తెల్లంబుగాన్= స్పష్టంగా; వినన్+కానని= విననోచని; వీనులు= చెవులు; కందుటయును= తాపం చెందటమున్నూ; ఇంపు+అగు= అందమైన; నీ చెయ్వులు= నీ చేష్టలు; ఎలమిమైన్= సంతోషంగా; కొనియాడన్+కానని= ప్రశంసించలేని; కోర్కులు= కోరికలు; కలఁగుటయును= కలత చెందటమున్నూ; సొగయించు= సొక్కింపచేసే; నీ కేళిన్+తగిలి= నీ శృంగార చేష్టలలో చిక్కి; ఆనందంబు= సంతోషం; పొందన్+కానని= పొందలేని; మది= మనస్సు; కుందుటయును= తపించటం; పాయన్= పోయేటట్లుగా; నాది+అగు జన్మంబు= నాయొక్క పుట్టుక; ఫలమున్+ఒందన్= ఫలించేటట్లు; భావ జన్ముని= మన్మథుని; పూనిక= ప్రయత్నం; పారము+ఎయ్దన్= అంచులు ముట్టేటట్లు (పరిపూర్ణమయ్యేటట్లు); నన్నున్ బంటుగాన్+ఏలుము= నన్ను నీ సేవకుడిగా పాలించుకొనుము; ఇంకన్= ఇకమీద; ఈ సిగ్గు తెర+ఓలము= సిగ్గు అనే తెరమరుగు; నీకున్+ఏల?= నీ కెందుకు?

తాత్పర్యం: నీ కటాక్ష వీక్షణాలను పొందకపోవటంచేత కలిగిన దేహతాపాన్నీ, నీ తీయని పలుకులు వినలేకపోవటం చేత కలిగిన శ్రవణతాపాన్నీ, అందమైన నీ విలాస చేష్టలను ప్రీతితో మెచ్చలేని కోర్కెల వలన కలిగిన మదనతాపాన్నీ, నీతో రహస్య క్రీడలతో రమిస్తూ ఆనందం పొందకపోవటం వలన కలిగిన మనస్తాపాన్నీ పోగొట్టి నా జన్మ సఫలం చేసి నన్ను నీ బంటుగా స్వీకరించి పాలించుము. ఇక మీద కూడా ఈ సిగ్గు తెరల చాటుమాటుతనం ఎందుకు?'

విశేషం: 1.'అగ్ని దగ్గరుండి, ప్రియురాలు దూరంగా ఉండి తాపం కలిగిస్తారు. అగ్ని దూరంగా పోతే ప్రియురాలు దగ్గరైతే తాపం తగ్గుతుంది' అనే లోకోక్తి ప్రసిద్ధం. సైరంధ్రిపై వలపు పెంచుకొన్న కీచకుడు మదనతాపంతో వేగిపోతున్నాడు. దానికి నాలుగు కారణాలను సీస పద్యపాదాలలో వరుసగా చెప్పాడు. మెరుపులవలె మెరిసే కడగంటి చూపులు పొందలేని శరీరం విరహతాపాన్ని పొందింది. ఇప్పుడు అట్టి చూపులు ప్రసరింపచేయటానికి సమీపించింది కాబట్టి అది తగ్గిపోతుందని అతడి

భావన. అట్లాగే వలపుమాటలు వినని చెవులు తాపాన్ని పొందాయి. ఇప్పు డా వలపుమాటలవలన ఆ తాపం తగ్గుతుంది. వలపు చేష్టలను పొగడి కోరికలు తీర్చుకొనలేదని తాపం ఉండేది. ఆమెను పొంది సుఖం అనుభవించలేదని మనోవేదన ఉండేది. అవన్నీ నీవు దరిచేరటం వలన తగ్గి (తొలగి) పోతాయి-అని అన్నాడు. సీస పద్య పాదాలు అంత్యానుప్రాసంతో అలంకరించబడటం గమనించతగింది. కీచకుడి విరహతాపం లోని మాధుర్యగుణం. సాతత్య స్వభావం దానివలన ధ్వనించబడుతున్నది.

2. సీస పద్య పాదాలలోని వాక్యాలు 'పాయన్' అనే క్రియతో అన్వయించే ఒక క్రమం ఇందులో ఉన్నది. తాపం క్రమంగా శరీరంలో, చెవులలో, కోర్కెలలో, హృదయంలో వ్యాపించగా అది మరల క్రమంగా ఉపశమిస్తుందని సూచించబడింది. అంతేకాక తాపం తగ్గిన తరువాత కలిగే ఫలితాంశాలను నాల్గింటిని ఎత్తుగీతిలో తిక్కన చెప్పాడు. అవి - ఆమె కటాక్షం వలన జన్మసఫలం కావటం; వలపు మాటలు వినటం వలన మన్మథభావం పరిపూర్ణం కావటం, అందమైన ఆమె వలపు చేష్టలతో పెల్లుబికే కోర్కెల వలన కలిగే తృప్తి వలన ఆమెకు బంటుగా వశుడై పోవటం, సుఖకేళితో ఆనందం పొంది సిగ్గుతెరలు లేకుండా చనువుతో మెలగటం కలుగుతుందట! ఇందులో అందమైన ఒక క్రమం ఉన్నది. నలినవదన అన్నప్పుడు ఉపమాస్ఫూర్తి, సిగ్గుతెర యోలము అన్నప్పుడు రూపకస్ఫూర్తి రాణించాయి. అలంకారాలు కాకపోయినా అలంకారాల అనుభూతిని కలిగించే సూక్తివైచిత్రి ఇది.

3. సంకల్పం అనే మదనావస్థకు తిక్కన క్రమవికాసాన్ని కలిగిస్తూ, ఈ పద్యంలో ఒక పరిణత స్థితిని చిత్రించాడు. రసాభ్యుదయ శిల్పంలో ఇది ప్రతిభావంతమైన ప్రయోగం. (సంపా.)

వ. అనవుడు. 98

తాత్పర్యం: అనగా.

తే. చెలువ యప్పలుకులు పెడ చెవులఁ బెట్టి।
ధీర గావున విగతవికార యగుచు
'మదిర వోయింపుఁ డద్దేవి యెదురుచూచు।
నలుగుఁ దడవైన మగుడఁ బోవలయు'ననిన. 99

ప్రతిపదార్థం: చెలువ= సైరంధ్రి; ఆ+పలుకులు= కీచకుని మాటలు; పెడచెవులన్+పెట్టి= పట్టించుకొనకుండా; ధీర+కావునన్= ధీరురాలు కాబట్టి; విగతవికార+అగుచున్= ఎటువంటి చాంచల్యం లేనిది ఔతూ; ఆ+దేవి= ఆ సుదేష్ణాదేవి; ఎదురుచూచున్= ఎదురుచూస్తుంటుంది; తడవు+ఐనన్= ఆలస్యమైతే; అలుగున్= కోపపడుతుంది; మగుడన్= మరల; పోవలయున్= వెళ్ళిపోవాలి; మదిర+పోయింపుఁడు= మద్యం పోయించండి; అనినన్= అనగా.

తాత్పర్యం: కీచకుడి మాటలను ద్రౌపది లక్ష్యపెట్టక, ధీరురాలుకాబట్టి ఎటువంటి వికారానికీ లోనుకాకుండా ఉండి, 'త్వరగా మద్యం పోయించండి. ఆలస్యమైతే దేవి కోపిస్తుంది. నేను శీఘ్రంగా వెనుకకు వెళ్ళాలి' అని అనగా - (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ద్రౌపది తన ముఖభావాలను కనబడనీయకుండా గంభీరంగా మాట్లాడింది.

చ. 'మదిర సుదేష్ణపాలి కొకమాత్రన పుచ్చెద నొడ్ల చేత; నిం
పొదవెడు నట్టి దీని చవి యుల్లము సొక్కఁగ నాను మీవు; నీ
వదన సరోజ సౌరభమవారణ నన్నును గ్రోల నిమ్ము; బె
ట్టిదుఁ డగు కాము తూపులఁ దొడింబడకుండఁగఁ గావు మిత్తఱిన్. 100

ప్రతిపదార్థం: మదిరన్= మద్యాన్ని; సుదేష్ణపాలికిన్= సుదేష్ణవద్దకు; ఒక మాత్రన్+అ= ఒక రెప్పపాటుకాలంలోనే; ఒడ్లచేతన్= ఇతరులచేత; పుచ్చెదన్= పంపుతాను; ఇంపు+ ఒదవెడు+అట్టి= ఆనందాన్ని కలిగించే; దీని చవి= ఈ మద్యం రుచిని; ఉల్లము= మనస్సు; సొక్కఁగన్= పరవశమయ్యేటట్లు;

ఈవు+ఆనుము= నీవు త్రాగుము; నీ వదన సరోజ సౌరభము= నీ ముఖకమలం యొక్క సుగంధం; అవారణన్= అడ్డులేకుండా; నన్నును= నన్నుకూడా; క్రోలనిమ్ము= త్రాగనిమ్ము; బెట్టిదుఁడు+అగు= క్రూరుడైన; కాముతూపులన్= మన్మథుడి యొక్క బాణాలకు; తొడిన్+పడక+ఉండఁగన్= తొట్రు పాటు; ఈ+ తఱిన్+ కావుము= ఇప్పుడు కాపాడుము.

తాత్పర్యం: 'నేను మద్యాన్ని అక్క సుదేష్ణకు ఇతరుల ద్వారా ఇప్పుడే పంపుతాను. నీవు ఈ మద్యం త్రాగి, ఈ వేళ నీ ముఖపద్మం లోని మంచి వాసనను నన్ను త్రాగనిచ్చి, నా మదనతాపాన్ని పోగొట్టి రక్షించుము.

క. **కరితురగ రథసమితిఁ బొం।**
పిరివోయెడు నాదు లక్ష్మి పెంపున కెల్లన్
సరసిరుహవదన! నీవ కు।
దురుగా నొనరించెదం గుతూహల మెసఁగన్. **101**

ప్రతిపదార్థం: సరసిరుహ+వదన!= పద్మం వంటి ముఖంగల ఓ సైరంధ్రీ!; కరి, తురగ, రథసమితిన్= ఏనుగులు, గుర్రాలు, రథాల సమూహంతో; పొంపిరి+పోయెడు= అతి శయించే; నాదులక్ష్మి= నా సంపద యొక్క; పెంపునకున్= అతిశయానికి; ఎల్లన్= అంతటికి; నీవు+అ కుదురుగాన్= నీవే ఆధారంగా; కుతూహలము+ఎసఁగన్= ఆనందం నిండగా; ఒనరించెదన్= చేస్తాను.

తాత్పర్యం: ఓ పద్మముఖీ! చతురంగబలాలతో పెంపారే నా సంపద కంతటికీ కుతూహలంతో నిన్నే కుదురుగా రాణిని చేస్తాను.

క. **రుచిర మణి భూషణంబులు।**
నుచిత విహారప్రకార యోగ్యాగార
ప్రచయము సుందరగణికా।
నిచయము నొప్పించువాఁడ నీకుం దరుణీ! **102**

ప్రతిపదార్థం: తరుణీ!= ఓ వనితా!; నీకున్= (సైరంధ్రికి); రుచిరమణి భూషణంబులు= అందమైన మణులతో చెక్కబడిన ఆభరణాలు; ఉచిత= తగిన; విహార ప్రకార= క్రీడించటానికి; యోగ్య+అగార ప్రచయము= తగిన ఇళ్ల సముదాయం; సుందర గణికానిచయమున్= అందమైన వేశ్యల సమూహాన్ని; ఒప్పించువాడన్= సమకూర్చి ఇస్తాను.

తాత్పర్యం: ఓ సైరంధ్రీ! నీకు అందమైన మణిహారాలను, విలాస గృహాలను, పరిచారికలుగా వేశ్యాసమూహాలను పుష్కలంగా సమకూర్చి ఇస్తాను.

విశేషం: గణికా సంచారం మందిరానికి అందం. వారు అలంకరణలోనూ, తదితర పరిచర్యలలోనూ నేర్పరులు. నాట్య సంగీత విన్యాసాలతో రాణి మనస్సు రంజింపజేస్తారు.

క. **నా కులకాంతల నెల్లను।**
నీకుం బనిసేయఁ బనిచి నెయ్యంబున నే
నీ కనుసన్నన మెలఁగెద।
నే కార్యంబైన నడుపు మీవ తగంగన్.' **103**

ప్రతిపదార్థం: నా కులకాంతలను= నా భార్యలను; ఎల్లను= అందరినీ; నీకున్= నీకు; పని+చేయన్+పనిచి= సేవలు చేసేందుకు ఆజ్ఞాపించి; నెయ్యంబునన్= ప్రేమతో; నేన్= నేను; నీ కనుసన్నన్+అ= నీ కనుసన్నలలోనే; మెలఁగెదన్= తిరుగుతాను; ఏ కార్యంబు+ ఐనన్= ఏ పని అయినా; ఈవు+అ= నీవే; తగంగన్= సరిగా; నడుపుము= జరుపుము.

తాత్పర్యం: నా భార్యల నందరినీ నీ దాసీజనంగా చేసి, స్నేహంతో నేను నీ కనుసన్నలలో మెలగుతాను. అన్ని పనులు నీవే నడిపించుము. (సర్వాధికారాలు నీ కిస్తాను).'

విశేషం: సాధారణ స్త్రీలు కోరుకొనే ఆభరణాలు, రథగజతురగాది సంపదలు, విలాసవస్తువులు కల్పిస్తానని చెప్పి కీచకుడు సైరంధ్రిని తనవశం చేసికొన

జూస్తున్నాడు. తన భార్యలను అందరినీ తనకు దాసీలనుగా చేస్తానంటే సైరంధ్రి లోబడుతుందని ఆ నీచుడి ఆలోచన. ఇవి మోహావేశపు పలుకులు.

వ. అనుచు సింహబలుండు తన యంతరంగంబున నంతకంత కగ్గలించు తమకంబునఁ దన్నుఁదా నెఱుంగక పయింబడి పట్టుకొనిన. 104

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ సింహబలుండు= కీచకుడు; తన అంతరంగం బునన్= తన మనస్సులో; అంతకున్+అంతకున్= క్షణక్షణానికి; అగ్గలించు= అధికమవుతున్న; తమకంబునన్= మోహంతో; తన్నున్+తాను+ ఎఱుంగక= ఒడలు మరచి; పయిన్+పడి= పైనబడి; పట్టుకొనినన్= ఒడిసి పట్టగా.

తాత్పర్యం: అంటూ కీచకుడు మోహావేశపరవశుడై తన ఒడలు మరచి సైరంధ్రిపైబడి ఒడిసి పట్టగా.

క. తనుఁ గాచి వెనుక వచ్చిన।
దనుజు మహాబలము తనదు తనువొందిన, నా
తని చే విదిల్చి రభసం।
బునఁ దన్మందిరము ద్రుపదపుత్రిక వెడలెన్. 105

ప్రతిపదార్థం: ద్రుపదపుత్రిక= ద్రౌపది; తనున్= (సైరంధ్రిని); కాచి= రక్షించి; వెనుకన్+వచ్చిన= వెంబడించి వస్తున్న; దనుజు మహాబలము= రాక్షసుడి యొక్క అధికశక్తి; తనదు తనువు= తన శరీరం; ఒందినన్= ప్రవేశించగా; ఆతని చే= కీచకుడి చేతిని; విదిల్చి= ఒక్కుమ్మడిగా విదిలించుకొని; రభసంబునన్= వేగంగా; తద్+మందిరము= ఆ ఇంటినుండి; వెడలెన్= బయటపడింది.

తాత్పర్యం: తనకు రక్షకుడుగా తన వెంబడి వస్తున్న రాక్షసుడి అధికశక్తి సైరంధ్రి నావహించగా ఆమె కీచకుడి చేతిని గట్టిగా విదిలించి, వేగంగా ఆ ఇంటినుండి బయటికి వచ్చింది.

వ. ఇట్లు ద్రోచిపోయినం గీచకుండు వెనువెంటం దగిలిన నమ్మగువయు మరలి చూచి భయభ్రాంతయై 'యెవ్వలనికిం బోదునో' యని తలంచి, దైవయోగంబున విరాటుం డప్పుడు గొలువునికిం జేసి తత్సభా భాగంబు దెసకు వెసం బాఱినం, గామాయత్తచిత్తుండును, గర్వోన్మత్తుండును గావున జనసమూహంబు సరకుసేయక రహస్యప్రకాశవిభేదవిచారంబు దక్కి. 106

ప్రతిపదార్థం: ఇట్లు+త్రోచిపోయినన్= ఈ విధంగా విదిలించి సైరంధ్రి వెళ్లగా; కీచకుండు; వెనువెంటన్= వెంబడించి; తగిలినన్= తరుమగా; ఆ+మగువయున్= ఆ సైరంధ్రియూ; మరలి చూచి= వెనుదిరిగి కనుగొని భయభ్రాంత+ఐ= భయపడి; ఏ+వలనికిన్+పోదునో అని= ఏ మూలకు వెళ్ళాలా? అని; తలంచి= ఆలోచించి; దైవయోగంబునన్= అదృష్టవశాత్తు; విరాటుండు; అప్పుడు; కొలువు= సభ తీర్చి; ఉనికిన్+ చేసి= ఉండటం చేత; తద్+సభాభాగంబుదెసకున్= ఆ సభవైపునకు; వెసన్+పాఱినన్= వేగంగా పరువెత్తగా; కామ+ఆయత్తచిత్తుండును= స్త్రీవాంఛతో నిండిన మనస్సు కలవాడూ; గర్వ+ఉన్మత్తుండును= గర్వంచేత మత్తెక్కి పొగరుపట్టినవాడూ; కావునన్; జన సమూహంబున్ సరకు+చేయక= జనుల గుంపును లెక్కచేయక; రహస్య ప్రకార విభేద విచారంబున్+తక్కి= గుట్టు రట్టు ఔతుందనే ఆలోచన కూడా లేకుండ.

తాత్పర్యం: ఈ విధంగా సైరంధ్రి తనను విదిలించి వెళ్ళిపోగా, కీచకుడు వదలక ఆమెను వెంబడించాడు. భయంతో పరుగు తీసి, ఎక్కడికి పోవాలో తెలియక, అదృష్టవశాత్తు విరాటమహారాజు అప్పుడు కొలువు తీర్చి ఉండటం చూచి ఆమె ఆ సభలోకి ప్రవేశించింది. కామంతో కళ్ళు మూసికొనిపోయిన ఆ గర్విష్ఠి కీచకుడు జనాలను లెక్కపెట్టక, గుట్టు రట్టు అవుతందనే సంగతి కూడా మరచిపోయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

కీచకుఁడు ద్రౌపదిం బట్టుకొనుటకు వెంటఁదగులుట (సం.4-15-7)

సీ. సమదవారణము జంగమలత వెనుకొని,
సరభసంబునఁ బట్టఁ జనువిధమునఁ
గ్రూరదానవుఁడు భూచారి నిర్జరకాంతఁ,
బొదువ రయమ్మునఁ బోవుభంగి
ఘోర గృధ్రము సుకుమార నాగాంగనఁ,
బటుగతి నొడియంగఁ బాఱు కరణిఁ
బ్రబల బిడాలంబు బాలశారిక మీఁద,
నడరి సత్వరముగ నరుగుమాడ్కి
తే. సింహబలుఁ డత్యుదగ్రతఁ జిగురుబోఁడి,
పజ్జఁ గడువడిఁ దగిలి కోపంబు గదుర
నొడిచి తలపట్టి తిగిచి మహోగ్రవృత్తి,
గొంకు కొసరించుకయు లేక కూలఁదాఁచె. 107

ప్రతిపదార్థం: సమదవారణము= మదించిన ఏనుగు; జంగమలతన్= కదలి నడిచే తీగను; వెనుకొని= వెంబడించి; సరభసంబునన్= వేగంగా; పట్టన్+చనువిధమునన్= పట్టటానికి వెళ్ళినట్లు; క్రూరదానవుఁడు= భయంకర రాక్షసుడు; భూచారి= భూలోకంలో తిరిగే; నిర్జరకాంతన్= దేవతాస్త్రీని; పొదువన్= పట్టుకోవటానికి; రయమ్మునన్= వేగంగా; పోవుభంగిన్= వెళ్ళునట్లు; ఘోరగృధ్రము= భయంకరమైన గ్రద్ద; సుకుమార నాగ+అంగనన్= సున్నితమైన నాగవనితను; పటుగతిన్= గట్టిగా; ఒడియంగన్= పట్టుకొనటానికి; పాఱుకరణిన్= పరుగెత్తేటట్లు; ప్రబల బిడాలంబు= బలమైన గండుపిల్లి; బాలశారికమీఁదన్= చిన్నగోరువంక మీదికి; అడరి= అతిశయించి; సత్వరముగన్= వేగంగా; అరుగుమాడ్కిన్= వెళ్ళునట్లు; సింహబలుఁడు= కీచకుడు; అతి+ఉదగ్రతన్= మిక్కిలి గర్వంతో; చిగురుబోఁడి పజ్జన్= సైరంధ్రి

వెనుక; కడువడిన్= మిక్కిలి వేగంగా; తగిలి= వెంబడించి; కోపంబు కదురన్= కోపంరాగా; ఒడిచి తలపట్టి= ఎగసి నిపుణంగా సిగపట్టి; తిగిచి= లాగి; మహా+ఉగ్రవృత్తిన్= మిక్కిలి భయంకరంగా; కొంకుకొసరు+ఇంచుకయున్ లేక= వెనుకంజ కాస్త కూడా లేకుండా; కూలన్+తాఁచెన్= నేలపై పడేటట్లు తన్నాడు.(త్రోశాడు).

తాత్పర్యం: మదపుటేనుగు నడిచే తీగను వేగంగా పట్టబోయినట్లు. రాక్షసుడు భూలోకానికి వచ్చిన దేవకాంతను త్వరగా పట్టబోయినట్లు. పెద్ద గ్రద్ద యాడుపామును వేగంగా ఒడిసి పట్టబోయినట్లు, గండుపిల్లి గోరువంక పిల్ల మీదికి దురుసుగా దూకి, పట్టటానికి పరుగెత్తినట్లుగా కీచకుడు మిక్కిలి కోపంతో కోమలాంగి అయిన ద్రౌపది వెంటబడి పరుగిడి ఎగసి జుట్టుముడిపట్టి లాగి, ఏమాత్రం జంకుగొంకు లేకుండా నేల బడద్రోశాడు. (పడతన్నాడు.)

విశేషం: 1. అలం: మాలోపమ, ఉల్లేఖం. క్రమాలంకారం లేదా యథాసంఖ్యాలంకారం.

2. మూలంలో కంటె తిక్కన ఈ సన్నివేశాన్ని సహజసుందరంగా చిత్రించాడు. ఎట్లాగంటే - మూలంలో కీచకుడు మొదట ఆమెకుడిచేయి పట్టుకొన్నాడు. ఆమె విదిలించి కొట్టింది. అతడు అంతటితో ఆగక ఆమెను పట్టుకొనటానికి యత్నించి పైటను చిక్కించుకొన్నాడు. ఆమె నిట్టూర్పులు నిగుడిస్తూ వేగంగా విదిలించి కొట్టింది. అతడు మొదలు నరికిన చెట్టువలె నేలమీద పడ్డాడు. అప్పుడు ఆమె భయంతో పరుగెత్తి రాజూ, యుధిష్ఠిరుడూ ఉన్న సభలో ప్రవేశించి శరణువేడింది.

"తాం కీచకః ప్రధావన్తీం కేశపాశే పరామృశత్
అథైనాం పశ్యతో రాజ్ఞః పాతయిత్వా పదావధీత్' (సం.4.15.7)

వేగంగా పరుగెత్తుతున్న ద్రౌపదిని కీచకుడు వెన్నంటి జడపట్టుకొని, రాజు చూస్తూ ఉండగానే, నేలమీద పడవేసి కాలితో తన్నాడు. ఇది మూలకథనం. తిక్కన దీనిని మార్చి సహజత్వాన్నీ, ఔచిత్యాన్నీ పోషించాడు. తిక్కన తీర్చిన కీచకుడు ఆమె చేయిపట్టుకొనబోవలేదు. మదనావేశంతో ఆమెను కౌగిలించుకొనబోయాడు.

(పైనబడి పట్టుకొన్నాడట). ఆమె (దనుజదత్తబలంతో) అతడిని త్రోసిందట. అతడు ఆమె కొంగుపట్టుకొనటం, ఆమె త్రోయటం, అతడు విరిగినచెట్టువలె నేలపై పడటం తిక్కన తీసివేశాడు. సైరంధ్రి అతడిని త్రోసి, త్వరగా పరుగెత్తింది. అతడు వెన్నంటాడు. ఈ సారి అతడు పట్టుకొంటే కీడుమూడుతుందని భావించి విరాటుడి సభవైపు పరుగెత్తటం మొదలుపెట్టింది. కాని, మూలంలో చెప్పబడినట్లు అప్పటికి రాజును శరణు వేడలేదు. రాజుముందే కీచకుడు సైరంధ్రిని కొప్పుపట్టి లాగి పడవేసి ఆమెను కాలితో తన్నినట్లు సంస్కృత భారతం. ధూర్తుడైన కీచకుడి కది సహజం. కాని, ద్రౌపది పాదహతి పొందినట్లు చెప్పటం తిక్కనకు ఉచిత మనిపించలేదు. అందుకే - నిపుణంగా 'కూలఁదాఁచెన్' - అని తెలుగులో చెప్పాడు. కూలబడేటట్లుగా తాచాడని దానికి అర్థం. కూలబడగా (కూలబడినతరువాత) తాఁచాడనే అర్థం దూరాన్వయం ఔతుంది. తెలుగులో 'తాఁచు' అనే క్రియకు విసరివేయు, కొట్టు, పాదంతోతన్ను, అదుము, అణగత్రొక్కు అనే అర్థాలున్నాయి. కాబట్టి ఒక చేత్తో జుట్టుముడిపట్టిలాగి, మరొక చేత్తో ఆమెను కొట్టి, నేలకు విసరివేసినట్లు అర్థం చెప్పే అవకాశం తిక్కన కల్పించాడు. 158వ పద్యంలో కీచకుడు 'వెనుకం గూడఁగ ముట్టి పట్టికొని తన్నెన్' అని ద్రౌపది (సైరంధ్రి) సుదేష్ణతో చెప్పింది. 'తన్నెన్' అనే క్రియకు కొట్టు, పాదంతో తాడించు అనే రెండర్థాలున్నాయి. తిక్కన తెలుగు క్రియలు వాడి ఔచిత్యం పోషిస్తాడన్నదానికి ఇదొక ఉదాహరణం. 'కూలఁదాఁచెన్' అన్నప్పుడు నేలమీద పడేటట్లు త్రోశాడనీ లేక తన్నాడనీ అర్థం చెప్పుకొనవచ్చును. పాదతాడనం తెలుగులో చెప్పబడలేదు. అది తిక్కన పాటించిన ఔచిత్యం. మరొక విశేషం. 257వ పద్యంలో కీచకుడే 'అట్లు ద్రోవన్' అని అన్నాడు. ఈ ప్రతిలో ఆ పాఠమే ఉన్నది. 'తాపన్', 'తన్నన్' అనే పాఠాంతరాలు కూడా ఉన్నాయి. దీనిని బట్టి తిక్కన తాను చేసిన ఔచిత్యాన్ని పరోక్షంగా పలుచోట్ల సమర్థించుకొన్నాడు కూడా. ఆమె శరీరంలో సూర్యవరంతో రాక్షసబలం నిక్షిప్తమై ఉండటం చేత ఆమె వేగంగా పరుగెత్తింది. ఆమెను అందుకొనటం అతడికి అంత తేలిక కాలేదు. కసికొద్దీ ఆమెను వెన్నంటిన కీచకుడు ఎంతో ప్రయత్నం చేసి ఆమె కొప్పును పట్టుకొని వెనుకకు లాగాడు. వేగంగా ముందుకు పోతున్న మనిషిని

ఒక్కసారి జుట్టుపట్టి లాగి కొట్టి త్రోస్తే కుప్పగూలటం సహజం. అటువంటి సహజ సన్నివేశాన్ని తిక్కన చిత్రించాడు.

3. పరుగెత్తే సన్నివేశాన్ని చలనచిత్రంగా వర్ణించటం తిక్కన వర్ణనాశిల్పం. ఉపమాలంకారాలను వరుసగా నాలుగింటిని వాడి అప్పటి ఆ పాత్రల స్వభావదశా విశేషాలను ధ్వనింపచేశాడు. 1. మదించిన ఏనుగు నడుస్తున్న తీగను వేగంగా తుండంతో పెనవేసి పట్టుకొనాలనుకొంటుంది. లత అబల, మదించిన ఏనుగు ధూర్తం. ద్రౌపదిని బాహువులతో కబళించాలని మదించినవాడి ప్రయత్నం. అందులో అతడి బలగర్వం విఫలమయింది. 2. ఆమె అతడి చేతికి చిక్కలేదు. బలగర్వితుడు రాక్షసుడివలె తయారయ్యాడు. విజాతిస్త్రీ అయిన నిర్జరకాంతను పొదివి (రెండు బాహువుల మధ్య ఇరికించి) కౌగిలించిపట్టుకొనాలని యత్నించాడు. అతడు కాముకుడు, వెనుకాడనివాడు. ఆమె విముఖురాలు, భీతురాలు. అదీ సఫలం కాలేదు. 3. ఆమె ఆడునాగువలె సూటిగా పరుగెత్తకుండా వంకర టింకరలుగా పరుగెత్తుతుండవచ్చును. వెంటాడే వారినుండి తప్పించుకొనే పద్ధతులలో అది ఒకటని ప్రసిద్ధం. పెద్ద గ్రద్ద పామును వీలునుబట్టి గట్టిగా ఒడిసిపట్టటానికి ప్రయత్నిస్తుంది. కీచకుడు ఆ పద్ధతిని వాడాడు. ఆమె కొప్పు చిక్కింది. 4. గండుపిల్లి వెనకనుండి ఎగిరిదూకి గోరువంక పిల్ల గొంతు పట్టుకుంటుంది. అట్లాగే కీచకుడు కుప్పించి ఎగసి (ఎడరి) ఆమె కొప్పును పట్టిలాగాడు, తన్నాడు. ఆ పట్టు యొక్క తీవ్రతకు ఆమె పడక తప్పలేదు. తిక్కన సీసపద్యపాదాలలో నాలుగంశాలు చెప్పాడంటే, ఎత్తుగీతిలో యథాసంఖ్యాలంకారాన్ని ప్రయోగిస్తా డన్నమాటే! కీచకుడు అత్యుగ్రతతో వెన్నాడటం మొదలుపెట్టి మహోగ్రవృత్తితో ఆమెను కూలత్రోశాడట! సైరంధ్రి తనను తిరస్కరించి త్రోసివేయటం వలన కలిగిన అవమానంతో అతడి యందు కలిగింది క్రోధం. అది తారస్థాయిలో ఉంటే ఉగ్రత. ఇది కలిగినప్పుడు మదించిన ఏనుగువలె వెన్నంటి పరుగెత్తాడు. ఆ తరువాత క్రోధం ద్విగుణీకృతమైంది. (కోపంబు గదుర) రాక్షసుడివలె వ్యవహరించాడు. ఆపైన గ్రద్దవలె ఆమెను ఒడిచి కొప్పును పట్టాడు.

చివరి దశ అయిన మహోగ్రవృత్తితో జంకుగొంకు లేకుండా కూలదోశాడు. సీస చరణాలలోని మానసిక దశలకూ ఎత్తుగీతిలోని క్రియాదశలకూ క్రమాన్వయం కుదరటం అలంకార శిల్పం. అదే యథాసంఖ్యాలంకారం. ద్రౌపదిని వెన్నంటిన ఆ దృశ్యాన్ని అనేక విధాలుగా వర్ణించటం వలన ఉల్లేఖాలంకారం కూడా గమ్యమానం ఔతున్నది. భీము డీ దృశ్యాన్ని గమనించాడు. కీచకుడి మహోగ్రవృత్తికి ప్రతిక్రియగా భయంకరాకారతను ప్రదర్శించాడు. (134 పద్యం) తులనాత్మకపద్య రచనా శిల్పం తిక్కన నైజం. (సంపా.)

వ. అట్టియెడఁ బాంచాలీ రక్షకుండైన రాక్షసుం డతని డొల్లవ్రేసిన. 108

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; పాంచాలీ రక్షకుండు+ఐన= ద్రౌపదిని రహస్యంగా రక్షించేవాడైన; రాక్షసుండు; అతనిన్= కీచకుడిని; డొల్లవ్రేసినన్= పడద్రోయగా.

తాత్పర్యం: ద్రౌపదిని కాపాడటానికి (సూర్యప్రేరితుడై) ఆమె వెంటనంటి తిరిగే రాక్షసుడు ఆ సమయంలో కీచకుడిని నేలపైపడతోశాడు. అప్పుడు.

క. కీచకుఁడు వ్రేటుపడి తన।
నీచపుదశ యొరు లెఱుంగ నేరకయుండన్
లేచి వెనుకఁ జని విస్మయ।
గోచరుఁడై యసురకతనఁ గుంఠితుఁడగుచున్. 109

ప్రతిపదార్థం: కీచకుఁడు; వ్రేటుపడి= దెబ్బతిని; తన నీచము+దశ= తన అథమస్థితిని, తనకు జరిగిన అవమానాన్ని; ఒరులు+ఎఱుంగ నేరక+ఉండన్= ఇతరులు తెలిసి కొనకుండా ఉండాలని; లేచి= పైకి లేచి నిలబడి; వెనుకన్+చని= వెనుతిరిగి; విస్మయ గోచరుఁడు+ఐ= ఆశ్చర్యానికి లోనై; అసురకతనన్= రాక్షసుడి వలన; కుంఠితుఁడు+అగుచున్= భయపడిన (మొక్కవోయిన) వాడౌతూ.

తాత్పర్యం: ద్రౌపదీసంరక్షకుడైన రాక్షసుడిచేత కీచకుడు కొట్టబడి తనదీనమైన స్థితిని ఇతరులు తెలిసికొనకుండా వెంటనే లేచి, రాక్షసుడి కారణంగా ద్రౌపది వెంటబడక వెనుతిరిగి మొక్కవోయినవాడౌతూ (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: జీవితంలో మొదటిసారి ఎదురుదెబ్బతిన్న గర్వోన్నతుడు పొందే చిన్నతనం మొక్కవోవటం - లేదా - కుంఠితుడు కావటం. ఆయుధం మొక్కవోవటం వంటి దిది. భావి మరణానికి మొదటి సూచన. (సంపా.)

వ. ఒడుపు దప్పిన మహానాగంబునుం బోలె నిట్టూర్పు నిగుడ నిట్టలంబగు కోపంబు పెల్లున మల్లడిగొనుచుండె; నయ్యవసరంబున. 110

ప్రతిపదార్థం: ఒడుపు+తప్పిన= పట్టు తప్పిన; మహానాగంబునున్+పోలెన్= పెద్ద పామువలె; నిడు+ఊర్పు నిగుడన్= దీర్ఘశ్వాసలు (బుసలు) కలుగగా; ఇట్టలంబు+అగు= గొప్పదైన; కోపంబు పెల్లునన్= కోపాతిశయంచేత; మల్లడిగొనుచుండెన్= లోలోన కుతకుతలాడుతూ ఉన్నాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: పట్టుదప్పిన పెద్దపామువలె బుసలు కొట్టుతూ, కోపం ఎక్కువగా కీచకుడు లోలోన ఉడికిపోతున్నాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తానును నన్నయు నయ్యా।
స్థానమ్మున నుండి పవనతనయుఁ డసహ్యం
బైన మనోవల్లభ యవ।
మానము, నా సింహబలుని మదజృంభణమున్. 111

ప్రతిపదార్థం: పవనతనయుఁడు= భీముడు; తానును= తానూ; అన్నయున్= ధర్మజుడును; ఆ+ఆస్థానమునన్+ఉండి= ఆ విరాటుని కొలువులో ఉండి; అసహ్యంబు+ఐన= ఓర్చుకొనలేని; మనస్+వల్లభ= ద్రౌపదియొక్క;

అవమానమున్= భంగపాటును; ఆ సింహబలుని= ఆ కీచకుడి; మదజృంభణ మున్= గర్వాతిశయాన్నీ.

తాత్పర్యం: విరాటుడి కొలువులో అన్నతోగూడ కూర్చొని ఉన్న భీముడు ద్రౌపదికి జరిగిన అవమానాన్నీ, కీచకుడి పొగరుబోతుతనాన్నీ. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. కనుఁగొని కోప వేగమునఁ గన్నుల నిప్పులు రాల, నంగము
ల్గనలఁగ, సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ, నితాంతదంతపీ
డనరట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త న
ర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధ మూర్తియై. 112

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; కోపవేగమునన్= కోపభావం యొక్క తీవ్రత చేత; కన్నులన్= కన్నుల నుండి; నిప్పులు రాలన్= నిప్పులు రాలినట్లు ఎఱ్ఱనికాంతులు కురియగా; అంగముల్+కనలఁగన్= అవయవాలు వేడెక్కగా; సాంద్ర ఘర్మ సలిలంబులు= దట్టంగా చెమట బిందువులు; క్రమ్మన్= పట్టగా; నితాంత= ఆగకుండా; దంతపీడన= పండ్లు కొరకటంచేత; రటత్= చప్పుడు చేస్తున్న; ఆస్యరంగ= ముఖమనే రంగస్థలంపై; వికట= వంకలు తిరిగిన; భ్రుకుటీ= బొమముడియొక్క; చటుల= కదలికవలన; ప్రవృత్త= ఏర్పడిన; నర్తన= నాట్యం యొక్క; ఘటనా= అమరిక యొక్క; ప్రకార= పద్ధతి చేత; భయద= భయాన్ని కలిగించే; స్ఫురణా= ప్రకాశం చేత; పరిణద్ధ= రూపొందిన; మూర్తి+ఐ= ఆకారం కలవాడై.

తాత్పర్యం: భీముడు కీచకుడి మద విజృంభణాన్ని చూచాడు. అతడి మనసులో కోపం తీవ్రంగా రేగటం వలన కన్నుల నుండి నిప్పులు రాలాయి. ఒడలంతా ఉడికిపోయింది. దట్టంగా చెమటబిందువులు క్రమ్మాయి. కోపంతో ఎడతెగకుండా పండ్లు పటపట కొరకటం వలన ధ్వనిస్తున్న ముఖమనే రంగస్థలం మీద వంపులు తిరిగే కనుబొమల కదలికల వలన ఏర్పడిన నాట్యప్రదర్శన వైఖరిచేత భయంకరంగా రూపుదాల్చిన ఆకారం కలవాడై.

విశేషం: 1. అలం: రూపకం, వృత్త్యనుప్రాసం.

2. భీముడి కోపభావాన్ని అభినయ బంధురంగా రూపుగట్టించిన మంచి పద్యమిది. కోపం ఒక్కసారిగా వేగంగా ప్రజ్వరిల్లింది. జ్వలనం కోపస్వభావం. మనసులోని కోపపు మంట కళ్ళలో నుండి నిప్పులు రాలుస్తున్నది. కళ్ళు ఎఱ్రబడటం కోపంయొక్క మొదటి అనుభావం. భార్య కవమానం చేసినవాడిమీద పగతో కూడిన క్రోధం భగ్గున మండింది. ప్రతీకారభావంతో ఒడలంతా వేడెక్కిపోయింది. తమ భార్యను అవమానిస్తుంటే చూడవలసివచ్చిందనే అప్పటి నిస్సహాయత వలన శరీరమంతా చెమటలు క్రమ్మాయి. అంతటి అవమానం చేసినవాడికి తగిన శాస్తి చేయాలి. అతడిపై ప్రతీకారం తీసికొనాలి-అనే రోషం అతడిచేత పళ్ళు పటపట లాడింపజేసింది. కనుబొమలను అల్లల్లాడ చేయించింది. అది క్రోధనర్తకి భయంకర నాట్యం చేస్తున్నట్లున్నది. పళ్ళ పటపటలు కాలి ఇనుపగజ్జెలు, కనుబొమల విన్యాసం నాట్యవైఖరులు, ముఖం నాట్యరంగం, కోపం భయంకరాకారంతో రూపుకట్టి తాండవించినట్లు భీముడు తన ఆకారాన్ని ప్రదర్శించాడు. దాన్ని తిక్కన రూపకంలో రూపొందించాడు. తకార, రకార, టకారాల పునరావృత్తి వలన వృత్త్యనుప్రాసం రూపొంది రుద్రనాట్య లయ నినదించింది. ఓజోగుణ భూయిష్ఠమైన ఈ రచన తిక్కన 'రసాభ్యుచితబంధం'. ఓజోగుణంలో శబ్దగుణ స్వభావం ఈ పద్యంలోనూ, అర్థగుణస్వభావం రాబోయే పద్యంలోనూ ప్రదర్శించి శబ్దార్థ గుణ ప్రధాన రచన చేయగల ఉభయగుణప్రౌఢిని నిరూపించాడు. కవిబ్రహ్మ.

3. ఛందశ్శిల్పం; "రతి, ఉత్సాహము, క్రోధము, శోకము, హర్షము, ఆవేగము, సంభ్రమము, ఔత్సుక్యము, భయము, ఉగ్రత - మున్నగు భావములు ఉత్కటావస్థయందు చిత్తద్రుతి హేతువులగును. కవిత్రయ మిట్టి భావముతోడనే చిత్తస్పందత్వరను వ్యంజింపవలసినపట్ల తరచు చంపకమాలావృత్తమును ప్రయోగించిరి. కీచకుడు రాజ మార్గమున ద్రౌపదినిఁ బరాభవించుటఁ దిలకించిన భీముని క్రోధమును తిక్కన చంపకము నందే వర్ణించెను. ఇదియు క్రోధవేగము యొక్క సాత్త్వికాభినయమే. అజ్ఞాత వాసమున భీముడు తన క్రోధోద్రేకమును

సంయమించుకొనక తప్పదు. ఎంత సంయమించు కొన్నను అది శరీరము నందగపడకమానదు. అజ్ఞాతవాస వ్రతమున క్రోధప్రకటనము కారాని కోపముయొక్క అనివార్యవ్యక్తిని తిక్కన వర్ణించెను.''

"తిక్కన చంపకమున జగణములు ఇంచుమించుగా నన్నియు స్థగితములైనవి. శకలితములైన ఆ జగణముల యంగములు పూర్వోత్తర గణములకుఁ దగుల్కొని భగణ, సగణములు రూపొందినవి. 'కోపవేగమునఁ గన్నులు నిప్పులురాల'. 'సాంద్రఘర్మసలిలమ్ములు గ్రమ్మ' అను తీరున పద్యపూర్వార్థమున గల భగణరూపమున నవరోహణము స్ఫుటమై యుత్ ప్లుతమగుచున్న హృదయగతిని అణచి శాంతము చేయు భీముని యత్నమును సూచించుచున్నది. అణచరాని యుత్ప్లుతి 'నితాంత'. 'ప్రవృత్త'. 'ప్రకార' పదములందు తలయెత్తుచున్నది. అణఁచబడిన యుత్ప్లుతి యంతయు ఆరోహణరూపము ధరించి పద్యము నుత్తరార్ధము నందలి సగణావభాసమునకు గారణమైనది. 'వికట..మూర్తియై' అన్న వాక్యంబునందలి పదములు పెక్కు నగణరూపమున నున్నవి. అణఁచరాని కోపము యొక్క వేగము భీముని క్రమవర్ధమాన భయంకరాకారమున పర్యవసించుట పద్యమందలి క్రమవర్ధమాన వాక్యప్రమాణముునను గుర్తింపవచ్చును. "నితాంత..ప్రకారము' అక్షరఘటనా ప్రకారమున ప్రస్ఫుటమగుచున్నది. 'నితాంతదంతపీడనమున' బిందుపూర్వక దంత్యాక్షరములు మర్దలధణంధణలు మొరయించుట. వికటభ్రుకుటీచటుల ప్రవృత్తనర్తనమున మూర్ధన్య పరుషటకారవృత్తి శ్రుతికటువులైన పదఘట్టనములను దలపించుట యక్షరములచే వర్ణ్యవస్తుసాక్షాత్కారము చేయించు మహాశిల్పము.''

-డాక్టర్ పాటిబండ మాధవశర్మ (ఆంధ్ర మహాభారతము; ఛందశ్శిల్పము. పు. 420-422)

సీ. నేలయు నింగియుఁ దాళముల్గాఁ జేసి।
యేపున రేఁగి వాయించి యాడఁ,
గులపర్వతంబులు గూల్చి యొండొంటితోఁ
దాఁకంగ వీఁకమైఁ దన్ని యాడ,

నేడు సాగరములు నిక్కడక్కడఁ బెట్టి।
పలుచని రొంపి మై నలఁదికొనఁగ,
దిక్కులు నాలుగు నొక్కచోటికిఁ దెచ్చి।
పిసికి పిండలి సేసి పిడుచగొనఁగ,

తే. మిగిలి బ్రహ్మాండభాండంబు పగుల వ్రేయ।
నప్పళించుచుఁ బ్రళయకాలా నలమున
గండరించిన రూపంబు కరణి భీముఁ।
డతి భయంకరాకారత నతిశయిల్లె. 113

ప్రతిపదార్థం: నేలయున్, నింగియున్= భూమి, ఆకాశమూ; తాళముల్+ కాన్+చేసి= తాళాలుగాచేసి; ఏపునన్, రేఁగి= గర్వంతో పెట్రేగి; వాయించి+ ఆడన్= వాయించి ఆడేటట్లుగా; కులపర్వతంబులు+కూల్చి= కులపర్వతాలను పడగొట్టి; ఒండు+ ఒంటితోన్+తాఁకంగన్= ఒకదానితో ఒకటి ఢీకొనేటట్లు; వీఁకమైన్= పరాక్రమంతో; తన్ని+ ఆడన్= తన్ని ఆడేటట్లుగా; ఏడు సాగరములున్= ఏడు సముద్రాలను; ఇక్కడన్+ అక్కడన్+పెట్టి= ఇటు నటుచేసి; పలుచని రొంపి= పలచటి బురద; మైన్+అలఁది కొనఁగన్= ఒంటికి పూసికొనేట్టుగా; దిక్కులు నాలుగున్= నాలుగు దిక్కులను; ఒక్క చోటికిన్+ తెచ్చి= ఒకటిగా జేసి; పిసికి పిండలి చేసి= పిసికి ముద్దజేసి; పిడుచకొనఁగన్= మ్రింగేటట్లుగా; మిగిలి= అతిశయించి; బ్రహ్మాండభాండంబు= బ్రహ్మాండమనే కుండను; పగులవ్రేయన్= పగలగొట్టడానికి; అప్పళించుచున్= ప్రయత్నిస్తూ; భీముడు; ప్రళయకాల+అనలమునన్= ప్రళయకాలంలోని అగ్నిలోనుండి; గండరించిన రూపంబు కరణిన్= రూపొందించిన ఆకారంవలె; అతిభయంకర+ ఆకారతన్= మిక్కిలి భయం కలిగించే రూపంతో; అతిశయిల్లెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: నేలనూ, ఆకాశాన్నీ తాళాలుగా చేసికొని పేట్రేగి వాయించి ఆడినట్లుగానూ, కులపర్వతాలను పడగొట్టి ఒకటి మీద ఒకటి పడేటట్లు తన్ని

ఆడినట్లుగానూ, ఏడు సముద్రాలను అటునిటు చేసి నీరు పోగా మిగిలిన పలుచని బురదను శరీరం నిండా పూసికొన్నట్లుగానూ, నాలుగు దిక్కులనూ కలిసి ఒకచోట చేర్చి ముద్దచేసి మ్రింగ బోతున్నట్లుగానూ అతిశయించి, బ్రహ్మాండమనే భాండాన్ని పగులగొట్టాలని, జబ్బలు చరుస్తూ ప్రళయకాలంలోని మహాగ్ని పుట్టి మానవరూపం తాల్చిందా అన్నట్లు భీముడు మిక్కిలి భయాన్ని కలిగించే ఆకారంతో ప్రకాశించాడు.

విశేషం: 1. అలం: సీసపాదాలలో - అత్యుక్తి; ఎత్తుగీతిలో - ఉత్ప్రేక్ష, క్రమాలంకారం.

"అత్యుక్తి రద్భుతాతథ్య శౌర్యౌదార్యాది వర్ణనమ్." అద్భుతాలూ, అసహజాలూ అయిన శౌర్యౌదార్యాదులను వర్ణించటం అత్యుక్తి. ఉపమాన తాదాత్మ్యాన్ని ఉపమేయంలో సంభావించటం ఉత్ప్రేక్ష. ఈ రెండలంకారాలను ఒకచోట కూర్చటం వలన తిక్కన భీముడి భయంకర రూపాన్ని అపూర్వంగా, భావనామయంగా, అద్భుతంగా ప్రత్యక్షీకరించగలిగాడు. పైపద్యంలో క్రోధోద్రేకం వలన కలిగిన ఆంగికాభినయాన్ని సమాసాడంబరంతో అక్షరరమ్యంగా రూపకాలంకారాన్ని ఆశ్రయించి రూపుకట్టించాడు. ఈ పద్యంలో తిక్కన భీముడి మనస్సులో రేకెత్తిన క్రోధ తీవ్రతను అలంకారికంగా పఠితల మనస్సులలో రూపొందేటట్లు చిత్రింపదలచుకొన్నాడు. రెండు పద్యాలలోనూ భీముడి భయంకరాకారమే వర్ణించబడింది. పైపద్యంలో భీముడి ముఖమే ఒక నర్తనశాల, అతడి కోపమే ఒక కరాళ నృత్యం. ఈ పద్యంలో బ్రహ్మాండభాండాన్ని పగలగొట్టటానికి రూపుతాల్చిన ప్రళయాగ్నివలె తోచటం సాత్త్వికాభి నయం. భీముడి మనసులో పుట్టింది క్రోధం. అది ఉత్కటావస్థ పొంది రౌద్రరసరూపం తాల్చింది. ఆ రౌద్రరసముద్రలో ఉన్న భీముడి రూపం చూచేవారికి భయంకరంగా ఉన్నది. తిక్కన రసశిల్పం ఇక్కడ విశిష్టం. 'రసం సామాజిక నిష్ఠం కదా! భీముడు రౌద్రరసవిభావం; ఆయనను చూస్తే ప్రేక్షకులకు కలిగేది భయం. జనకజన్యరస విశిష్ట సమ్మేళనం భయాన్ని కలిగించే రౌద్రాకారం రసానుభవాన్ని కలిగించే

రమణీయ విభావం. ఇది రసశిల్పం తెలిసిన కవి మాత్రమే చేయగలడు. విభావాన్ని చూచిన సహృదయుడు విభావనం చేస్తాడు. భౌతిక విభావాన్ని పైపద్యంలో ప్రదర్శించిన తిక్కన సహృదయ పక్షంలో భీముడి రౌద్రాన్ని ఈ పద్యంలో భావనామయం చేశాడు. ఆలోచనామృతాన్ని అందించాడు. దానికి తోడ్పడే అర్థాలంకారాలు అత్యుక్తి, ఉత్ప్రేక్ష. అలంకారంతో రసధ్వనిని కల్పించటం ఇందులోని వర్ణనాశిల్పం.

2. తిక్కన కల్పించిన క్రమాలంకారం పై రెండు అలంకారాలకు అంతస్సూత్రం. ప్రళయాగ్ని రూపుడుగా కనబడుతున్న భీముడు కౌరవాంతకు డౌతాడని అలంకారధ్వని. భూమ్యాకాశాలను కలిపి తాళం వేస్తూ నాట్యం చేస్తున్నట్లున్నది అతడి హావం. ఇది జాతీయప్రయోగంతో సాధిస్తున్న ధ్వని. రెండు అసాధ్యమైన, విరుద్ధమైన అంశాలను కలిపి సాధించే ఒక సాహసాన్ని నేలానింగీ కలిపి తాళం వేసి ఆడటం వలె చెప్పటం తెలుగు జాతీయం. అజ్ఞాతవాసంలో ఉన్న వాస్తవాన్నీ, కీచకుడిని సంహరించటాన్నీ భీముడు అద్భుతంగా సాధించే భావికథార్థం. భూమ్యాకాశాలను తాళాలుగా మ్రోగిస్తే బ్రహ్మాండభాండం పగలటం. ఇదీ జాతీయమే, ఇందుట్లో వస్తుధ్వని, కులపర్వతాలను ఒకదానిపై ఒకటివేసి తన్ని ఆడినట్లుగా అతడి కోపం పెచ్చుపెరిగిందట. ఈ అత్యుక్తి ద్వంద్వయుద్ధంలో కీచకుడి సంహారాన్ని ప్రౌఢంగా ధ్వనింపజేస్తున్నది. ఆ పని చేయటానికి సిద్ధపడుతున్నట్లు కీచకుడు అప్పళించాడు. సప్తసాగరాలను ఇంకింపచేయటం తెలుగు జాతీయం. 'సముద్రా లింకినా, భూమి బ్రద్దలైనా, ప్రళయం వచ్చినా నేనీపని చేస్తా'ననే వాక్యాలు లోకంలో వింటాం. ఆ ప్రాగల్భ్యం భీముడి రౌద్రోద్రేకంలో ప్రత్యక్షమయింది. సముద్రజలాలను ఇట్టట్టు చేసేదీ, ఇంకింప చేసేదీ ప్రళయకాలాగ్ని. ఇది కవిసమయం కూడా. అందువలననే ఈ భావోద్రేకాన్ని ప్రదర్శిస్తున్న భీముడు ప్రళయకాలాగ్ని రూపం తాల్చినట్లుగా తోచాడు. ఇక నాల్గవపాదంలో నలుదిక్కులను ముద్దచేసి మ్రింగే భయంకర భావావిష్కారం జరిగింది. అందువలననే భీముడు 'భయంకరాకారత నతిశయిల్లె'నని తిక్కన

వర్ణించాడు. సీసపద్యంలో క్రమాలంకారం పాటించటం తిక్కన సహజశిల్పం. దానిని భావనామయం చేయటం ఇక్కడ రసధ్వని శిల్పం. (సంపా.)

3. కులపర్వతాలు ఏడు: మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం, సప్తసముద్రాలు: లవణ, ఇక్షు, సురా, ఘృత, దధి, క్షీర, జల సముద్రాలు.

వ. ఇట్లు పేర్చిన కోపాటోపంబున నవిచారిత సమయవర్తనుండయి వృకోదరుండు కీచకుని గీటడంగింపంజూచి తత్సంబంధబద్ధుండును నాజ్ఞాపరిపాల కుండును గావున మత్స్యపతిఁ దన యలుకలోని వానిన కాఁదలంచుచు నచ్చేరువ నున్న యున్నతవృక్షంబు నిరీక్షించి, యాననంబు పల్లటిల్ల ధర్మ తనయుం గనుం గొనిన నతండు తన నయనాకారంబున వారించి యిట్లనియె. 114

ప్రతిపదార్థం: ఇట్లు పేర్చిన= ఈ విధంగా అధికమైన; కోప+ఆటోపంబునన్= కోపాతి శయం చేత; అవిచారిత సమయ వర్తనుండు+అయి= ఆలోచించబడని అజ్ఞాతవాస వ్రత ప్రవర్తన కలవాడై - అంటే - అజ్ఞాతవాస నియమాన్ని గురించి పట్టించుకొనని ఆచరణకు పూనుకొన్నవాడై ఉన్న; వృకోదరుండు= భీముడు; కీచకునిన్+ గీటు+అడంగింపన్= కీచకుడిని మట్టుబెట్టాలని; చూచి= చూచి; తత్‌సంబంధ బద్ధుండును= వానితో చుట్టరికం వలన కట్టబడ్డవాడూ; ఆజ్ఞాపరి పాలకుండును= ఆ కీచకుని ఆనతి పాటించేవాడూ; కావునన్= కనుక; మత్స్యపతిన్= మత్స్యదేశానికి రాజయిన విరాటరాజు; తన అలుకలోని వానిన్+అ= తనకోప పరిధిలోకి వచ్చేవాడినిగానే; తలం చుచున్= భావిస్తూ; ఆ+చేరువన్+ఉన్న= ఆ సమీపంలో ఉన్న; ఉన్నతవృక్షంబు= పెద్దచెట్టును; నిరీక్షించి= ఎగాదిగ చూచి; ఆననంబు పల్లటిల్లన్= ముఖము ఎర్రబారగా; ధర్మతనయున్= ధర్మరాజును; కనుంగొనినన్= చూడగా; అతండు=

ధర్మరాజు; తన= తనయొక్క; నయన+ఆకారంబునన్+వారించి= కనుసైగలతో అడ్డుపెట్టి; ఇట్లు+అనియెన్; ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అధికమైన కోపంతో భీముడు తమ అజ్ఞాతవాస ప్రతిజ్ఞను మరచిపోయి కీచకుడిని మట్టుబెట్టాలని చూచి, కీచకుడితోడి చుట్టరికంవలన, అతడి ఆజ్ఞకు విరాటరాజు లోబడి ఉండటం వలన విరాటుడినీ తనకోప పరిధిలోని వాడినిగా భావిస్తూ, దగ్గరలో ఉన్న పెద్దచెట్టును ఎగాదిగా చూచి మొగం ఎర్రబారగా ధర్మరాజు వైపు చూచాడు. భీముడి ఆకారాన్ని చూచి ధర్మరాజు కనుసైగలతో వారించి ఇట్లా అన్నాడు.

విశేషం: తిక్కన నాటకీయత కిది మచ్చుతునక. భీముడు ఆవేశపరుడైనా ఆదేశంకొరకు అన్నవైపు చూడటం, అతడు వారించగానే ఆగిపోవటం భీముడిలోని సమయజ్ఞతను, క్రమశిక్షణను తెలియజేస్తాయి.

మ. 'వలలుం డెక్కడఁ జూచె నొండెడ నసేవ్యక్ష్మాజముల్ పుట్టవే?
ఫలితంబై వరశాఖ లొప్పఁగ ననల్పప్రీతి సంధించుచున్
విలసచ్ఛాయ నుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపఁగాఁ
గల యీ భూజము వంటకట్టియలకై ఖండింపఁగా నేటికిన్?' 115

ప్రతిపదార్థం: వలలుండు= వలలుడు అనే పేరుతో వ్యవహరిస్తున్న వంటవాడు (భీముడు); ఎక్కడన్+చూచెన్= ఎక్కడ చూచాడో; ఒండు+ఎడన్= మరొకచోట; అసేవ్యక్ష్మాజముల్= సేవింపదగని చెట్లు; పుట్టవే?= పుట్టవా?; ఫలితంబు+ఐ= పండ్లు పండినదై; వరశాఖలు+ఒప్పఁగన్= మంచి కొమ్మలు కలుగగా; అనల్పప్రీతిన్= ఎక్కువ సంతోషాన్ని; సంధించుచున్= కలిగిస్తూ; విలసత్+ఛాయన్= ప్రకాశిస్తున్న నీడతో; ఉప+ఆశ్రిత ప్రతతికిన్= దగ్గర చేరిన జనసమూహానికి; విశ్రాంతి+కావింపఁగాన్+కల= ఊఱట కలిగించగల; ఈ భూజమున్= ఈ చెట్టు; వంటకట్టియలకై= వంటకట్టెలకొరకు; ఖండింపఁ గాన్+ఏటికిన్?= నరికి వెయ్యడం ఎందుకు?

తాత్పర్యం: 'వంటలవాడైన వలలుడు ఎక్కడ చూచాడో కాని ఇక్కడ కాక మరొకచోట పనికిమాలిన చెట్లు పుట్టవా? పండ్లు బాగా పండిన పెద్దకొమ్మలతో గూడి, విశాలమై నీడనిచ్చి ఆశ్రయించిన వారికి శ్రమను పోగొట్టే ఈ చెట్టును వంటకట్టెలకొరకు నరికివేయటం దేనికి?'

విశేషం: 1. అలం: గూఢోక్తి, ప్రస్తుతాంకురం. (అన్యాపదేశం).

2. భీముడు కోపవేగంతో పెచ్చుపెరిగి ఒక పెద్దవృక్షాన్ని పెరికి అటు కీచకుడినీ, ఇటు విరాటునీ వధించటానికి యత్నిస్తూ ఆ చెట్టువైపు చూచి గురి నిలిపాడు. కాని, ఆ పనికి ధర్మరాజుయొక్క అనుమతి కావాలి కాబట్టి అతడి వైపు చూచాడు. అతడు కనుసైగతో అతడి ప్రయత్నాన్ని మాన్పాడు. ఇది ఆంగికమైన అభినయాంశం. దానికి పోషకంగా వాచికాభినయాంశంగా ఈ పద్యాన్ని పలికాడు. భీముడితో ధర్మజుడు సూటిగా మాట్లాడ కూడదు. దేవిమీదనో పెట్టి అన్యాపదేశంగా చెప్పాలి. ఆ చెప్పే పద్ధతి కూడా గూఢంగా ఉండాలి. భీముడితో చెప్పుతున్నా, అతడికి ఆ మాటలలోని అర్థం రహస్యభాషలో అర్థమౌతున్నా, చుట్టూ ఉన్నవారికి తెలియకూడదు. అట్లా మాట్లాడటం గూఢోక్త్యలంకారం. ధర్మరాజు మాటలు 'నిగూఢ భాషణలు' అని తిక్కన రాబోయే పద్యంలో పేర్కొన్నాడు. ప్రస్తుత వర్ణనం చేత ప్రస్తుత వృత్తాంతమే ద్యోతమానమైతే ప్రస్తుతాంకురాలంకారం. ధర్మరాజు వంటలవాడి చిత్తవృత్తి మీద చమత్కరించి అన్యాపదేశంగా గూఢోక్తులు పలికాడు. వలలుడు అని నామ నిర్దేశం చేయటం వలన వంటవాడి ప్రసక్తి ప్రకటంగా, భీముడి ప్రసక్తి గూఢంగా తెలియబడుతుంది. రెండూ ప్రస్తుతాలే కావటం చేత ప్రస్తుతాంకురం. వంటలవాడు కట్టెలకొరకు కూల్చటానికే చెట్టువైపు చూస్తాడు. భీముడు చూచిన వృక్షం కీచకుడినీ, విరాటుడినీ చంపటానికి ఉపయోగించదలచుకొన్న ఆయుధం. ధర్మరాజు ఆ చెట్టును కేంద్రంగా చేసి అన్యాపదేశంగా గూఢోక్తులు పలికాడు. ఆ చెట్టును విరాటుడికి అన్యాపదేశం చేశాడు. అది పండ్లు పండిన వరశాఖలున్న పచ్చని చెట్టు, విస్తారమైన నీడతో ఆశ్రయమిచ్చి సేద తీర్చగలిగిన చెట్టు. అంటే కుటుంబ పరివార సమేతంగా విస్తృత రాజ్యాన్ని

పాలిస్తూ పాండవులకు వివిధ శాఖలలో ఆశ్రయమిచ్చి వారి అజ్ఞాతవాస వ్రతాన్ని ఫలవంతం చేస్తున్న విరాటుడు వరఫలవృక్షం. దానివైపు కట్టెల కొరకు చూస్తే, మరొకవైపు అసేవ్య వృక్షాలు (పనికిమాలిన చెట్లు) అంటే సేవలు కోల్పోయి, అజ్ఞాతవాసవ్రతం భంగమైన పాండవ వృక్షాలు కట్టెలకు సిద్ధమౌతాయి. కాబట్టి ఆ చెట్టును పెరికితే తమ ఆశ్రయాన్ని తామే నాశనం చేసికొన్నట్లు పాండవులు రెంటికి చెడ్డ రేవడులు కాగలరని వ్యంగ్యమైన సూచన. భీముడికి మాత్రమే తెలిసే కనుసైగలు, గూఢోక్తులు ధర్మరాజు మాట్లాడతాడు. అవి చెడ్డ రేవడులు కాగలరని వ్యంగ్యమైన సూచన. భీముడికి మాత్రమే తెలిసే కనుసైగలు, గూఢోక్తులు ధర్మరాజు మాట్లాడతాడు. అవి ఆ సభలో ద్రౌపదికి మాత్రమే అర్థం కావటం విశేషం. తెలుగువారు అన్యాపదేశంగా మాట్లాడే మాటలకు 'వలలుం డెక్కడ చూచె'ననే ఈ పద్యాన్ని ఒక సంకేతంగా సంభాషణలలో ఉటంకించటం సాహిత్యమర్యాద. తెలుగునాట అంత ప్రచారం చెందిం దీ పద్యం. (సంపా.)

3. కీ.శే. పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులు గారు విరాటపర్వ టిప్పణిలో భీముడికీ - ఇతరులకూ స్ఫురించే అర్థాలను వేరువేరుగా వింగడించి వివరించారు. అందులోని ముఖ్యాంశాలు - భీమపరంగా - 'ఓ భీమసేనా! ఏల చెట్టువైపు చూచెదవు? ఈ చెట్టు పెఱికికొని యీ ఱేని నీతని బావమఱఁదినీ చంపఁజూచెదవు. ఈరాజు సేవ్యక్ష్మాజము - ఈ యజ్ఞాతవాసమునం దరణ్యవాస దుఃఖతప్తులమగు మనకు సేవనీయమైన వృక్షమువలె బసయిచ్చిన మహానుభావుడు. సంపన్నుడై బందుగుల పోషించుచు, నాశ్రయించిన మనబోటి వారికి, నిలువ నీడ యిచ్చుచు ఛాయావృక్షమువలె నున్నవాడు. అట్టి మహాపురుషునిదెసపై నుపకారముల నేమియును దలంపక మనకు సమయభంగ మను భీతియు లేక కీచకుని మందలింపలే డాయె నను చిన్న నేరమెన్ని ద్రుంపవచ్చునే? అట్లు సేయుట యాశ్రితృహనన న్యాయమగును. ఇతని యింటిలో మనము దలదాచుకొంటిమి కాన మనకు సమయభంగము కాకుండుటకుఁ గాని, యితని ప్రియము సేఁతకుఁగాని యేతద్బంధువగు కీచకునిఁ ద్రుంచుటయుఁ బ్రస్తుత ముచితముకాదు.

అంతగా నీకుఁ ద్రుంపవలయునవియేయున్న హస్తినాపురములో భ్రాతృత్వాదుల నేనియు నెన్నక మనసర్వస్వము నపహరించి మనకు నిలువనీడ లేకుండ జేసిన నీరస తరువులనుబోలు దుర్యోధనాదులు లేరా? చంపెదనని ప్రతిజ్ఞను జేసితివే! వారిని సమయానంతరము చంపుము. అజ్ఞాతవాసానంతరము తన ముద్దుకూతురగు నుత్తరను మన యర్జునపుత్రుండగు నభిమన్యునకు నొసంగి, యిట్లే ముందును హితము గావించుచు వరశాఖలు విజృంభింపగా మనకుఁ బ్రీతిఁ గావించు ఊనిని ద్రుంపఁదగదు''.

ఇతరులకుఁ దోచునర్థము; 'ఈ వంటలవాడికి ఈ చెట్టు ఎక్కడ కానుపించెను? ప్రొయ్యిలోనికి కావలయు నన్న వేఱొకచోట శుష్కవృక్షంబులు లేకపోయెనే? ఇయ్యది పండ్లతోను, మంచికొమ్మలతోను విస్తరించి, యాశ్రయించిన బాటసారులకు నుపయోగపడుచు, నిల్వనీడనిచ్చుచున్నది. దీనిని వంటకట్టియలకై కొట్టుట ఉచితము కాదు.''

తే. అని నిగూఢభాషణముల నయ్యజాత।
శత్రుఁ డనిలజు కోపరసంబు పేర్మి
చెఱిచె, నయ్యన్నదమ్ముల చేష్టితములు।
దెల్లముగ నప్డు సూచుచు నల్లలేచి. 116

ప్రతిపదార్థం: అని= అంటూ; నిగూఢభాషణములన్= రహస్య వాక్యాలచేత; ఆ+ అజాతశత్రుఁడు= ఆ ధర్మరాజు; అనిలజు= భీముడియొక్క; కోపరసంబు పేర్మిన్+ చెఱిచెన్= కోపావేశాన్ని తగ్గించాడు; ఆ+అన్నదమ్ముల చేష్టితములు= ధర్మజభీముల చర్యలు; తెల్లముగన్= స్పష్టంగా; అప్డు= అప్పుడు; చూచుచున్= గమనిస్తూ; అల్లన్+ లేచి= మెల్లగా లేచి.

తాత్పర్యం: ధర్మజుడు రహస్యవచనాలతో భీముడి కోపాతిశయాన్ని తగ్గించాడు. అన్నదమ్ముల చేష్టలను ద్రౌపది గమనిస్తూ మెల్లగా లేచింది.

సీ. ఎలదీఁగఁ గప్పిన లలితపరాగంబు।
క్రియ మేన మేదినీ రేణువొప్పఁ,
జంపకంబున నవసౌరభం బెసఁగెడు।
కరణి నాసిక వేఁడి గాడ్పు నిగుడఁ,
దోయజ దళములతుది మంచు దొరఁగెడు।
గతిఁ గన్నుఁగవ నశ్రుకణము లురుల,
నిందుబింబము మీఁది కందు చందంబునఁ।
గురులు నెమ్మొగమున నెరసియుండ,
తే. సర్వజన వంద్య యైన పాంచాలి సింహ।
బలునిచే నివ్విధంబున భంగపాటు
దనకు వచ్చిన నెంతయు దైన్యమొంది।
యవ్విరాటుని సభఁ జేర నరిగి నిలిచి. 117

ప్రతిపదార్థం: ఎలతీఁగన్= లేత తీగను; కప్పిన= చుట్టుకొన్న; లలిత పరాగంబుక్రియన్= మెత్తని పుప్పొడివలె; మేనన్= శరీరంపై; మేదినీ రేణువు+ఒప్పన్= దుమ్ము నిలవగా; చంపకంబునన్= సంపెంగపువ్వునుండి; నవసౌరభంబు+ఎసఁగెడు= కొత్తవాసన కలిగినట్లు; కరణి= రీతి; నాసికన్= ముక్కున; వేడిగాడ్పు నిగుడన్= వేడి నిట్టూర్పు రాగా; తోయజదళముల తుదిన్= తామరరేకుల కొనలలో; మంచు తొరఁగెడుగతిన్= మంచుబిందువులు జారినట్లు; కన్ను+కవన్= కనుదోయినుండి; అశ్రుకణములు+ ఉరులన్= కన్నీరు జారగా; ఇందుబింబము మీఁది= చంద్రబింబము మీదనున్న; కందుచందంబునన్= మచ్చవలె; కురులు= వెంట్రుకలు; నెఱ+మొగమునన్= అందమైన మొగంపై; నెరసి+ఉండన్= వ్యాపించి ఉండగా; సర్వజనవంద్య+ ఐన= జనులందరిచేత మ్రొక్కులందే; పాంచాలి= ద్రౌపది; సింహబలునిచేన్= కీచకుడిచేత; ఈ విధంబునన్ భంగపాటు= ఇటువంటి అవమానం; తనకున్

వచ్చినన్= తనకు కలుగగా; ఎంతయున్+ దైన్యము+ఒంది= ఎంతో దుఃఖపడి; ఆ విరాటుని సభన్, చేరన్+ అరిగి నిలిచి= దగ్గరకు వెళ్ళి నిలిచింది.

తాత్పర్యం: లేతతీగమీద దట్టంగా పడిన మెత్తని పుప్పొడివలె ఆమె శరీరంమీద దుమ్ముధూళి క్రమ్ముకొన్నది. సంపెంగ పువ్వునుండి క్రొత్తసువాసన ప్రసరిస్తూ ఉన్నట్లు ఆమె ముక్కునుండి వేడి నిట్టూర్పులు వెలువడుతూ ఉన్నాయి. పద్మదళాల అంచులనుండి మంచుకణాలు పడుతున్నట్లు ఆమె కనుదోయి నుండి కన్నీటి బొట్లు రాలుతున్నాయి. చంద్రబింబంమీద మచ్చలున్నట్లుగానే అందమైన నిండుమొగం మీద కురులు బాగా వ్యాపించి ఉన్నాయి. అందరిచేత గౌరవించబడే ద్రౌపది కీచకుడిచేత ఆవిధంగా అవమానాలపాలు కావటంతో ఎంతో దీనురాలై ఆ విరాటుడి సభను సమీపించి నిలిచింది.

విశేషం: అలం: ఉపమ. జనవంద్యురాలైన పాంచాలి భంగపాటు వలన దైన్యం పొందింది అనే భావాన్ని ఉపమాలంకార సుందరంగా తిక్కన ఈ సీసపద్య పాదాలలో ఆవిష్కరించాడు. తీగమీద పుప్పొడి పడి ఉండటం గౌరవం, మేని మీద దుమ్ముపడి ఉండటం దైన్యం. సంపెంగపూవు వాసనవంటి సుగంధ పరిమళ నిశ్శ్వాసం కలిగి ఉండటం ఉత్తమజాతి స్త్రీ గౌరవలక్షణం, వేడి నిట్టూర్పులు దైన్య లక్షణం. పద్మదళాల అంచులపై మంచుబిందువులు స్రవించినట్లు ఆనందబాష్పాలు రాలటం గౌరవం, అంతటి అందమైన కన్నులనుండి కన్నీరుకారటం దైన్యం. చంద్రబింబానికి మచ్చవలె మొగంమీద ముంగురులు అందంగా ఉండటం గౌరవం, మొగంమీద కురులు క్రమ్ముకొనటం దైన్యం. పరోక్షంగా ఆ దైన్యరూపం ఆమెయొక్క అజ్ఞాతవాసవ్రత రక్షణకవచంగా ఉండటం ప్రకరణౌచిత్యం. ఉపమాలంకారంలోని ఉపమానాలన్నీ కవిసమయసిద్ధాలై ఉండటం గమనించదగిన అంశం. (సంపా.)

ద్రౌపది తన భంగపాటు విరాటునితోఁ జెప్పుట (సం.4-15-13)

ఉ. పంబిన కోపమున్ సమయభంగ భయంబును నగ్గలించి యు
ల్లంబు పెనంగొనంగఁ బతులం దగ సభ్యులఁ జూచుమాడ్కి రూ

క్షంబగు చూడ్కి నా ద్రుపదుకన్నియ సూచి సభాజనప్రతా
నంబును మత్స్యనాథుఁడు వినంగ నెలుంగు చలింప నిట్లనున్.118

ప్రతిపదార్థం: పంబినకోపమున్= అతిశయించిన కోపమూ; సమయభంగ భయంబును= ప్రతిన చెడిపోతుందనే భయమూ; అగ్గలించి= అధికమై; ఉల్లంబు= మనస్సు; పెనం గొనంగన్= కలవరపరచగా; పతులన్= భర్తలను; తగన్+సభ్యులన్+చూచుమాడ్కిన్= తగినట్లు సభాజనులను చూచినట్లే; రూక్షంబు+అగుచూడ్కిన్= క్రూరమైన చూపుతో; ఆ+ద్రుపదుకన్నియ+ చూచి= ఆ ద్రౌపది చూచి; సభాజన ప్రతానంబును= సభలోని జన సమూహమూ; మత్స్యనాథుఁడున్= విరాటరాజునూ; వినంగన్= వినేటట్లు; ఎలుంగు చలింపన్= స్వరం కంపింపగా (గద్గద స్వరంతో); ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఒకవైపు పెల్లుబికే కోపం, మరొకవైపు అజ్ఞాతవాస భంగభయం మిక్కుటమై కలవరపరచగా సైరంధ్రి (ద్రౌపది) సభాసదులను చూచినట్లుగా తన భర్తలను తీక్ష్ణంగా చూచి, విస్తారమైన ఆ సభలోని సభాసదులూ, విరాటుడూ వినేటట్లు గద్గదస్వరంతో ఇట్లా పలికింది.

విశేషం: ద్రౌపది సమయభంగ భయంతో మాట్లాడటం ఆమె సమయజ్ఞతకు సూచకం. ఇప్పు డామె పరిస్థితి దయాస్పదం; కౌరవసభలో భర్తలు ఉండీ రక్షించలేకపోయారు. అప్పుడు రాజు భంగపరిస్తే, ఇప్పుడు రాజు బావమరిది. సభ్యులపై రూక్షవీక్షణం తగునా? అంటే తర్వాతి పద్యాలలో సమాధానం కన్పిస్తుంది.

సీ. 'నిఖిల ధర్మాధర్మ నిపుణంబు లైన శు।
ద్ధాంతరంగంబుల నతిశయిల్లి,
శిష్ట సంరక్షణ దుష్ట నిగ్రహముల।
నీతి వాటింపంగ నేర్పు గల్గి,

సకల శస్త్రాస్త్ర సంచయములఁ బరమాద్భు ।
తంబు సేయు పరిశ్రమంబు దాల్చి,
దుర్దమ ప్రతిభట మర్దన క్రీడమైఁ
జతురులు నా నెందు నుతికి నెక్కి,

తే. యున్న గంధర్వు లేవురు నన్ను నిట్టు।
లొకఁడు వఱుపంగ నూరక యునికి సూడ
నచ్చెరువు గాదె! యెవ్వరి యాండ్రు రింకఁ।
బరిభవంబునఁ బొందకఁబ్రదుకువారు? **119**

ప్రతిపదార్థం: నిఖిల ధర్మ+అధర్మనిపుణంబులు= అన్నిరకాలైన ధర్మాలలో, అధర్మాలలో నైపుణ్యం గలిగిన; శుద్ధ+ అంతరంగంబులన్= స్వచ్ఛమైన మనస్సులచేత; అతిశయిల్లి= వృద్ధిపొంది; శిష్టసంరక్షణ= సజ్జనులను రక్షించటంలోనూ; దుష్ట నిగ్రహములన్= దుష్టులను శిక్షించడంలోనూ; నీతి+ పాటింపంగన్= ధర్మాన్ని పాటించటంలోను; నేర్పు+కల్గి= సామంపతులన్= భర్తలను; సామర్థ్యం వహించి; సకల శస్త్ర+అస్త్రసంచయములన్= అన్ని బాణాల, అస్త్రాల సముదాయాలలో; పరమ+ అద్భుతంబు+చేయు= మిక్కిలి ఆశ్చర్యాన్ని కలిగించే; పరిశ్రమలు తాల్చి= చక్కని అభ్యాసం, సామర్థ్యం కలిగి; దుర్దమ= అణచలేని; ప్రతిభట మర్దనక్రీడమైన్= అణచరాని శత్రువీరులను చంపటమనే ఆటలో; చతురులు నాన్= సమర్థులని; ఎందున్= అంతటా; నుతికిన్+ ఎక్కి+ఉన్న= ప్రసిద్ధివహించిన; గంధర్వులు+ఏవురు= ఐదుగురు గంధర్వులు; నన్నున్= నన్ను (ద్రౌపదిని); ఇట్టులు+ఒకఁడు= ఈ విధంగా ఒకడు (ఒక నీచుడు); పఱుపంగన్= పాటుపడజేయగా, బాధపెట్టగా; ఊఱక+ఉనికి= అలక్ష్యంగా ఉండటం; చూడన్= చూస్తే; అచ్చెరువు కాదె?= ఆశ్చర్యంగా లేదూ?; ఇంకన్= ఇకమీద; ఎవ్వరి ఆండ్రురు= ఎవ్వరి భార్యలు; పరిభవం బునన్= అవమానాన్ని; పొందక బ్రదుకువారు?= పొందకుండా బ్రతకగలరు?

తాత్పర్యం: ఏది ధర్మమో, ఏది అధర్మమో క్షుణ్ణంగా తెలిసినవారూ, సాధుజనులను రక్షించి, దుష్టులను శిక్షించేవారూ, అస్త్రశస్త్రవిద్యలలో ఆరితేరినవారూ, శత్రువుల నవలీలగా చంపగల గంధర్వులైన నా భర్తలు ఐదుగురు కీచకుడీ విధంగా నన్ను అవమానించగా ఉదాసీనంగా ఊరకుండిపోయారు. ఇకపై లోకంలో ఇతరుల భార్యలకు ఇటువంటి అవమానం కలిగితే రక్షించే దిక్కు ఎవరుంటారు?

విశేషం: అలం: పరికరం. 'అలంకారః పరికర స్సాభిప్రాయ విశేషణై;' - విశేషణం సాభిప్రాయమైతే పరికరాలంకారం. ద్రౌపది తన భర్తలైన అయిదుగురు గంధర్వుల విశిష్ట గుణాలను సీసపద్య పాదాలలో పేర్కొన్నది. అవి మొత్తం నాలుగు. ఆ నాలుగూ సామూహికంగా అయిదుగురికీ అన్వయిస్తాయి. పరిశీలించి చూస్తే ధర్మజ, భీమార్జునులకు మొదటిమాటా, చివరిది కవలైన నకుల సహదేవులకూ అన్వయిస్తాయి. ఇట్లు విశేషణాలను వాడటం సాభిప్రాయం. ధర్మాధర్మ నిర్ణయ నిపుణులైన ధర్మజ్ఞుల సభలలో ఉత్తముడుగా రాణించేవాడు ధర్మరాజు. శిష్టులను రక్షించాలనీ దుష్టులను శిక్షించాలనీ భావించే నీతి పాటించే నేర్పరి భీముడు. సమస్త శస్త్రాస్త్రాలను అద్భుతంగా ప్రయోగించే పరిశ్రమ కలవాడు అర్జునుడు. అసాధ్యులైన శత్రువులను చంపటం క్రీడగా భావించే చతురులు నకుల సహదేవులు. ఈ విధంగా విశేషణాలు సాభిప్రాయం కావటం చేత పరికరాలంకారం భూషించబడింది. ఈ విధంగా పతుల పరాక్రమ విశేషాలను పరోక్షంగా పొగడి, వారు మారుపలుకకుండా మిన్నకున్నందుకు నొచ్చుకొన్నది. ఇట్లా ఊరుకొంటే ఎవరి భార్యలు అవమానాలు పొందక బ్రతుకుతారు? అని హెచ్చరించి, తాను ఎవరికీ కానిదై అవమానం పొంది చనిపోవటం తప్పదు - అని వ్యంగ్యంగా వేదన వ్యక్తం చేసింది. (సంపా.)

క. ఈ నరపతి యాస్థానము।
లో నొక్కరుఁడైన ధర్మలోప భయమునన్
బూని తగవైన వెడ పలు।
కైనను బలుకంగఁ జాలఁ డయ్యెను నకటా! **120**

ప్రతిపదార్థం: అకటా!= ఔరా! అయ్యో!; ఈ నరపతి+ఆస్థానములోన్= ఈ విరాటరాజు కొలువులో; ధర్మలోప భయమునన్= ధర్మానికి విఘ్నం కలుగుతుం దనే భయంతో; ఒక్కరుఁడు+ఐనన్= ఒక్కడైనా; పూని= ప్రయత్నించి; తగవు+ఐన= న్యాయమైన వెడపలుకు+ఐనను= చిన్నమాట అయినా; పలుకంగన్+చాలఁడు+అయ్యెను= మాట్లాడలేకపోయాడు.

తాత్పర్యం: ఈ విరాట మహారాజు సభలో ఉన్న ఇంతమందిలో ఒక్కరైనా ధర్మానికి లోపం జరుగుతుందేమో నన్న భయం వలన ధర్మ రక్షణం కొరకు ముందుకు వచ్చి ఒక్క చిన్నమాటైనా న్యాయంగా పలికేవారు లేకపోయారు. అధర్మానికి భయపడేవారే లేకపోయారు.

విశేషం: అలం: గూఢోక్తి. ప్రక్కనున్న వారికి తెలియకుండా తనవారి నుద్దేశించి గూఢంగా పలుకటం గూఢోక్తి అలంకారం. ఈ పద్యంలో అందరికీ అర్థమయ్యే తాత్పర్యం పైన చెప్పుకొన్నది. ఇక రెండవ అర్థం గంధర్వులను ఉద్దేశించి - అంటే తన పతులైన ధర్మారాజాదులను ఉద్దేశించి చెప్పే తాత్పర్యం ఇది-ఈ రాజాస్థానంలో ఉన్న ఒక్కడైనా అజ్ఞాతవాస ధర్మం భగ్నమౌతుందేమోనన్న భయంతో, ఆ పూనికకే ప్రాధాన్యమిచ్చి, అనువైన ఒకమాటకూడా మాటాడలేనివాడైపోయాడు కదా! అయ్యో! ఎంతటి దీన పరిస్థితి ఏర్పడింది. గూఢోక్తి వలన ఈ సన్నివేశంలో నాటకీయ సంభాషణ శ్లేషవలె రాణిస్తూ జనాంతిక చమత్కారాన్ని ప్రదర్శించి, తిక్కన రచనా శిల్పాన్ని వెలార్చింది. (సంపా.)

ఉ. ఇందఱుఁ జూడఁగా నిచట నిమ్మెయి నన్నుఁ బతివ్రతా గుణా
స్పందిత వర్తనం బరమ సాధ్వి ననిందితశీలఁ గీచకుం
డెందును నెట్టి యంగనల నెవ్వరుఁజేయనియట్లు సేయఁగాఁ
గొందఱకైన నిప్డు కృపకుం దఱిగాదటె? యేమి సెప్పుదున్? 121

ప్రతిపదార్థం: ఇచటన్= ఈ విరాటుని కొలువులో; ఇందఱున్+చూడఁగాన్= ఇంతమంది సభాసదులు చూస్తూ ఉండగా; ఈ+మెయిన్= ఈ విధంగా; పతివ్రతా గుణ+అస్పందిత వర్తనన్= పాతివ్రత్య ధర్మాన్ని వీడని నడవడిక కలదానిని; పరమసాధ్విన్= ఉత్తమమైన సాధుస్వభావం కలిగినదానిని; అనిందిత శీలన్= నిందకు తావులేని చరితం (స్వభావం) కలదానిని; నన్నున్= (ద్రౌపదిని); కీచకుండు= కీచకుడు; ఎందునున్= ఎక్కడా; ఎట్టి+అంగనలన్= ఏ స్త్రీలను; ఎవ్వరున్ చేయని+అట్లు= ఎవ్వరూ చేయని విధంగా; చేయఁగాన్= చేస్తే; కొందఱకున్+ఐనన్= కొంతమందికైనా; ఇప్డు= ఇప్పుడు; కృపకున్= దయకు; తఱికాదటె?= సమయం కాదా? ఏమిచెప్పుదున్?= ఏమి చెప్పుకొనేది?

తాత్పర్యం: ఇంతమంది సభాసదులు చూస్తుండగా పతివ్రతాగుణ సంపన్నమైన ప్రవర్తన కలదానను, ఉత్తమ సాధుస్వభావం కలదానను, మచ్చలేని శీలంగలదానిని అయిన నన్ను ఈ కీచకుడు ఇంతకుముం దెన్నడు ఏ స్త్రీకీ జరగని విధంగా అవమానం చేస్తే, ఇంతమందిలో కొంతమందికైనా ఇప్పుడు కొద్దిపాటి దయనైనా చూపే తరుణం కాదా ఇది? ఇక ఏమనాలో నాకు ఏమీ తోచటం లేదు!

విశేషం: అలం: గూఢోక్తి. సభలో అందరినీ ఉద్దేశించి ద్రౌపది మాట్లాడు తున్నట్లుంటుంది. కాని, ఆమె తనపతులను ఉద్దేశించి గూఢంగా పలుకుతున్న ట్లుంటుంది. ఆమె మాటలలోని మర్మం అది. సభాసదులందరినీ ఉద్దేశించి చెప్పిన సాధారణ తాత్పర్యం పైన పేర్కొన్నది. ఇక ఆమె గూఢంగా పాండవుల నుద్దేశించిన తాత్పర్య మిది. ఇంతమంది చూచేటట్లుగా ఈ సభాస్థలిలో ఈ విధంగా కీచకుడు నన్ను అవమానించాడు. అయినా పతులను మనసారా సేవించే వ్రతం నుండి తొలగని ప్రవర్తన కలదానినిగా ఉన్నాను. సాధ్వులలో శ్రేష్ఠురాలుగానే ఉన్నాను. నా శీలం కళంకితం కాలేదు. ఇంతవరకు నన్ను నేను రక్షించుకొన్నాను. నేను పడిన కష్టాలు మరే ఇల్లాలూ పడి ఉండదు. అయినా, నా పతులైన అయిదుగురిలో కొందరికైనా ఇప్పటికీ దయ చూపించదగిన సమయం వచ్చింది అనే భావం కలగలేదంటే - ఇక నే నేమి చెప్పేది? ఈ పద్యంలో ఇందరు చూడగా అనే మాట ప్రజలకూ వర్తిస్తుంది. పాండవులకూ వర్తిస్తుంది. 'కొందఱికైనన్'- అనే మాట

అక్కడున్న ధర్మజభీములకైనా దయరాదా? అన్నట్లు స్పష్టమౌతుంది. గూఢోక్తిని (భార్యాభర్తల నడుమ) నిష్ఠురోక్తులకు మారుగా వాడిన తిక్కన వాక్యచాతుర్యం ప్రశంసనీయం. (సంపా.)

ఉ. ఐనను మత్స్యదేశమున యాజ్ఞకితం డొడయుండు గాన నా
కీ నరనాథు దూఱఁదగు; నెయ్యది యేని నధర్మ మెవ్వ రెం
దైన నొనర్చినం బ్రభువు లారసి దండన మాచరింతు; రి
చ్చో ననుఁ దన్ను కీచకునిఁ జూచియు నూరక యున్కి పాడియే?' 122

ప్రతిపదార్థం: ఐనను= ఐనప్పటికీ; మత్స్యదేశమున+ఆజ్ఞకున్= ఈ మత్స్యదేశం యొక్క ప్రభుత్వానికి; ఇతండు= విరటుడు; ఒడయుండు+కానన్= రాజుగాబట్టి; నాకున్= (ద్రౌపదికి); ఈ నరనాథున్= ఈ విరాటరాజును; దూఱన్+తగున్= నిందించటం భావ్యం; ఏ+అది+ఏనిన్= ఏదైనా; అధర్మము= ధర్మము కానిదాన్ని; ఎవ్వరు+ఎందైనన్= ఎవరైనా, ఎక్కడైనా; ఒనర్చినన్= చేస్తే; ప్రభువులు= రాజులు; అరసి= గమనించి; దండనము+ ఆచరింతురు= శిక్షిస్తారు; ఈ+చోన్= ఇక్కడ; ననున్= (ద్రౌపదిని); తన్ను= తన్నిన; కీచకునిన్+చూచియున్= కీచకుడిని చూచికూడా; ఊరక, ఉన్కి, పాడియే?= ఊరుకొనటం ధర్మమా?

తాత్పర్యం: ఇంత జరిగినందుకు ఈ మత్స్యదేశాధినేత అయిన ఈ విరాటరాజును నేను నిందించాలి. ఏదైనా ధర్మలోపం ఎక్కడైనా జరిగితే రాజు దానిని గమనించి శిక్షించాలి. ఈ సభలో ఈ విధంగా నన్ను తన్నిన కీచకుడిని చూస్తూ ఊరుకొనటం ధర్మమా?'

విశేషం: అలం: గూఢోక్తి. ఈ పద్యంలోకూడా గూఢోక్తి రమణీయంగా నిర్వహించబడింది. గూఢోక్తిలో అధిక్షేపోక్తిని కూడ తిక్కన మేళవించాడు. ఈ పద్యంలో 'ఇతండు ఒడయుండుగాన' 'నరనాథు దూఱఁదగు', ప్రభువు లారసి దండన మాచరింతురు 'మొదలైన మాటలు గమనించదగినవి. ఆమె మత్స్యదేశంలో ఉన్నది కాబట్టి, కీచకుడి వలని అవమానం మత్స్యదేశంలో జరిగింది కాబట్టి, ఆ రాజ్యానికి ఏలిక విరాటుడు కాబట్టి, అత డా విషయంలో తగిన ఆజ్ఞ ఈయదగినవాడు. కాబట్టి పాండవులు మారుపల్కక కూర్చున్నారని భావించినా, ఆజ్ఞ ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్న విరాటుడు నిందించదగినవాడు కాబట్టి ద్రౌపది అతడిని అధిక్షేపించింది. ఒకవేళ విరాటుడు తగిన ఆజ్ఞ ఇవ్వలేకపోతే, అధర్మాన్ని అరికట్టలేకపోతే పాండవులు మారుపల్కకుండా ఉండటం న్యాయమా? వారు తగిన చర్యలు తీసికొనటానికి అవకాశం ఉన్నదని ద్రౌపది ధర్మమార్గాన్ని సూచించింది. లోకంలో రాజు లుంటారు. ప్రభువు లుంటారు. రాజులు సామంతులు కావచ్చును, కాని ప్రభువులు ఒకరికి తలఒగ్గి ఉండరు. విరటుడు రాజు; ధర్మజుడు ప్రభువు. అతడి తమ్ములుకూడ ప్రభువులే. రాజు అసమర్థుడై అధర్మాన్ని అణచలేకపోతే, ధర్మాన్ని రక్షించలేకపోతే, ప్రభువులు మిన్నకుండరాదు. వారు పరిస్థితిని పరిశీలించి రంగంలోకి దిగి అధర్మపరులకు తగిన దండన విధించాలి. అది ధర్మం కాబట్టి 'ఇది మత్స్యదేశం, విరటుడే ఆజ్ఞ ఇవ్వాలి - అని కూర్చోకుండా, మీ ప్రభుత్వాన్ని ప్రదర్శించి నన్ను ఆపదనుండి రక్షించండి. ఊరక ఉండటం న్యాయం కాదు' అని ద్రౌపది గూఢంగా ధర్మజాదులను అధిక్షేపించింది. రహస్యంగా పాండవులను క్రియాశీలురు కమ్మని ప్రేరేపించింది. ఈ తాత్పర్యం సభలోనివారికి తెలియరాదు. పాండవులకే తెలిసివస్తుంది. పఠితలకు రెండర్థాలూ స్ఫురిస్తాయి. ఇది గూఢోక్తి రమ్యత. (సంపా.)

చ. అనుడు విరాటుఁ డుల్లమున నక్కటికం బొలయంగ నంగనం
గనుఁగొని, కీచకుం గినియఁగాఁ దగు సత్త్వము లేమిఁ జేసి సాం
త్వనములు పల్కి రోషభరితస్థితిఁ గంపితమూర్తి యైన యా
తని మది కుందు వాపిన నతండును బోయె నివాసభూమికిన్. 123

ప్రతిపదార్థం: అనుడున్= ఆ విధంగా ద్రౌపది పలుకగా; విరాటుఁడు= విరాటమహారాజు; ఉల్లమునన్= మనస్సులో; అక్కటికంబు+ ఒలయంగన్=

దయకలుగగా; అంగనన్= ద్రౌపదిని; కనుఁగొని= చూచి; కీచకున్= కీచకుడిపై; కినియఁగాన్+తగు= కోపించటానికి తగిన; సత్త్వము లేమిన్+చేసి= శక్తిలేక పోవటం వలన; సాంత్వనములు పల్కి= ఓదార్పు మాటలాడి; రోషభరితస్థితిన్= కోపంతో నిండిన మానసిక స్థితి చేత; కంపితమూర్తి+ఐన= వణకే దేహంతో ఉన్న; ఆతని మది కుందు+పాపినన్= కీచకుడి మనస్సులోని పరితాపాన్ని పోగొట్టగా; అతండును= కీచకుడుకూడ; నివాసభూమికిన్+ పోయెన్= ఇంటికి వెళ్ళాడు.

తాత్పర్యం: ద్రౌపది మాట్లాడిన మాటలను విని విరాటుడు మనసులో దయబూని ద్రౌపదిని చూచాడు. కాని కీచకుడిని మందలించే ధైర్యం లేకపోవటం వలన ఆమెను ఊరడించాడు. నిండిన కోపంతో ఊగి (వణికి) పోతున్న ఆ కీచకుడి పరితాపాన్ని విరాటుడు అనునయంతో ఉపశమింపజేశాడు. అప్పుడు కీచకు డింటిముఖం పట్టాడు.

వ. అట్టి యవసరంబున. 124

తాత్పర్యం: ఆ సమయంలో.

సీ. 'శుభలక్షణాంగి యీ సుందరి సైరంధ్రి।
యగు టెట్లొకో!' యని వగచువారు,
'నిమ్మేని కక్కట యిట్టిది సేసెనే!।
మాయ దైవం' బని మఱుఁగువారు,
'నింత కీ డొనరించెనే! రాజు సూడ నీ।
దుష్టాత్మకుం' డని దూఱువారు,
'దేవి యుపేక్షయ చూవె! యీయమకు ని।
ప్పాటు వచ్చుట' యని ప్రందువారు

తే. నగుచు సభవార లందఱు నంత నంత।
నల్ల నల్లన గుజగుజ లాడుచుండి;

రుల్లమున నిండి ఖేదంబు వెల్లివిరిసె।
నాఁగ మోముల విన్నఁదనంబు గదుర. 125

ప్రతిపదార్థం: శుభలక్షణ+అంగి= మంచి అవయవాలు కలిగిన; ఈ సుందరి= ఈ సౌందర్యవతి; సైరంధ్రి అగుట+ఎట్లు+ఒకో= సైరంధ్రీ వేషంలో ఉండటం ఎందుకు జరిగిందో; అని వగచువారున్= అని దుఃఖించేవారూ; మాయ దైవంబు= దుష్టుడైన విధి; ఈ+మేనికిన్=ఈ (అందమైన) శరీరానికి; ఇట్టిది+ చేసెనే= ఇటువంటి విపరీతమైన పని చేశాడే; అని= అని; మఱుఁగువారు= బాధపడేవారూ; రాజు+చూడన్= రాజు చూడగా; ఈ దుష్టాత్మకుండు= ఈ చెడు స్వభావముగల కీచకుడు; ఇంతకీడు+ఒనరించెనే!= ఇట్టి చెడ్డపని చేశాడే; అని దూఱువారు= అని నిందించేవారూ; దేవి+ఉపేక్ష+అ చూవె= సుదేష్ణ అలసత్వమేగదా చూడగా; ఈయమకున్= ద్రౌపదికి; ఈ+పాటు= ఈ కష్టం; వచ్చుట అని ప్రందువారున్= పరితపించువారూ; అగుచున్= ఔతూ; సభవారలు+ అందఱున్= సభాసదులంతా; ఉల్లమునన్= మనస్సులో; నిండి= నిండిన; ఖేదంబు= దుఃఖం; వెల్లివిరిసెన్+నాఁగన్= పైకి వచ్చిందా అన్నట్లు; మోములన్ విన్నఁదనంబు+ కదురన్= మొగాలపై దైన్యం ఉట్టిపడగా; అంతన్+ అంతన్= దూరదూరంగా; అల్లనన్+ అల్లనన్= మెల్లమెల్లగా; గుజగుజలు+ ఆడుచుండిరి= గుసగుసలాడసాగారు;

తాత్పర్యం: మంగళకరమైన లక్షణాలు గల ఈ సుందరాంగి సైరంధ్రిగా ఎందుకు మారిందో - అని కొందరు విచారించసాగారు. ఇంతటి లలితాంగికి ఇటువంటి కష్టాలు పెట్టాడు. దేవుడు నిజంగా నిర్దయుడు - అని కొందరు కుతకుతలాడసాగారు. దుర్మార్గుడైన కీచకుడు రాజు చూస్తుండగానే ఈమెకు ఇంతటి కీడు చేశాడే-అని కొందరు అతడిని నిందించసాగారు. ఈమెకు ఈ అవమానం కలగటానికి కారణం సుదేష్ణ ఉపేక్షయే - అని కొందరు

పరితపించసాగారు. ఈ విధంగా సభాసదులందరూ మెల్లమెల్లగా, గుసగుసలాడుతూ, మనసులలోని దుఃఖం పొంగిపొరలగా ముఖాలు వెలవెలపోతూ కనిపించారు.

విశేషం: అలం: ఉల్లేఖం. **"బహుభిర్బహుధోల్లేఖా దేకస్యోల్లేఖ ఇష్యతే".** ఒకే వస్తువును అనేకులు అనేక విధంగా వర్ణించినట్లు చెప్పితే ఉల్లేఖం. సభ్యులలో కొన్ని వర్గాలవారు తమకు తోచిన వ్యాఖ్యలు చేశారు. అవన్నీ ద్రౌపదిపట్ల సానుభూతితో, గౌరవంతో సాగినవే. సభ్యుల నుద్దేశించి ద్రౌపది పెట్టుకొన్న మొరకు సభ్యుల మాటలు మౌనప్రతిస్పందన. 'యథారాజా తథా ప్రజా' అన్నట్లు ఆ సభాసదులు కూడా జాలిని ప్రదర్శించారే తప్ప ఆమెకు కలిగిన కష్టాన్ని తీర్చలేకపోయారు. ఉల్లేఖంలో కూడా తిక్కన ఒక క్రమాన్ని పాటించాడు. ఉత్తమజాతి స్త్రీగా నిరూపించేవి ఆమె శుభ లక్షణాంగకాలు. ఉదాత్తురాలికి అనుదాత్తమైన పరిస్థితి ప్రాప్తించింది. ఆమె శరీరం కోమలం. కాని, ఆమె చేసే సేవలు కఠినం. స్వభావానికి తగినటువంటి సేవావృత్తి లభించలేదని భావం. రాజు చూస్తుండగా దుర్మార్గుడు ఆమెకు కీడు చేశాడు. ఉత్తమురాలికి తగని అవమానం జరిగిందని జాలిపడి, అవమానించిన వాడిని నిందించారు. దీనికంతా కారణం దేవి ఉపేక్షాభావ మని నిశ్చయించి విచారించారు. ద్రౌపది అమాయకత్వంపై వారు సానుభూతి ప్రకటించారు. పరిస్థితిని విశ్లేషించి వివేకాన్ని ప్రదర్శించగల ప్రవృత్తిని సభ్యులలో చిత్రించి తిక్కన రాజ సభాసదుల పాత్రకు న్యాయం చేశాడు. విరటుడి వలెనే ఆ సభ్యులు కూడా ధర్మాన్ని సమర్థిస్తారు. దానిని అభిమానిస్తారు. కాని, అధర్మాన్ని ఎదుర్కొనలేరు-అని తిక్కన తీర్పు. ఉల్లేఖాలంకారం సభాస్వభావ వ్యంజకం కావటం విశేషం. (సంపా.)

ఉ. అప్పుడు ధర్మసూతి హృదయంబు గలంగ, లలాట భాగముం
గప్పఁగ ఘర్మవారి, యధికంబగు రోషము నొందియుండియుం
దప్పఁగఁ ద్రోచికొంచుఁ దనధైర్యము పెంపున నిర్వికారుఁడై
యెప్పుడుఁ దాను పల్కు నెలుఁ గేర్పడ ద్రౌపదితోడ నిట్లనున్. 126

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ధర్మసూతి= ధర్మరాజు; హృదయంబు కలంగన్= మనస్సు కలతపడగా; ఘర్మవారి= చెమటనీరు; లలాటభాగమున్+కప్పఁగన్= నుదుటిపై వ్యాపించగా; అధికంబు+అగు రోషమున్= ఎక్కువైన కోపం; ఒంది+ఉండియున్= పొందికూడా; తప్పఁగన్+త్రోచికొంచున్= తొలగత్రోసికొంటూ; తన ధైర్యము పెంపునన్= తన స్థిరమైన మనస్సు యొక్క గొప్పతనంతో; నిర్వికారుఁడు+ఐ= మనోవికారాలు లేనివాడై, నిబ్బరం కలవాడై; ఎప్పుడున్+తాను; పల్కు+ఎలుఁగు+ఏర్పడన్= తాను మామూలుగా మాట్లాడే కంఠస్వరంతో; ద్రౌపదితోడన్+ఇట్లు+ అనున్= ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు ధర్మరాజు మనస్సు కలతచెందింది. నెన్నుదురుమీద చెమట క్రమ్మింది. మిక్కుటమైన రోషం పెచ్చుపెరిగింది. అయినా, ఆ రోషాన్ని ధీరగుణంతో అణచుకొన్నాడు. వికారం లేని మనసుతో స్థైర్యాన్ని పొందాడు. ఎప్పుడూ మాట్లాడే కంఠస్వరంతో ఈ విధంగా ద్రౌపదితో అన్నాడు.

విశేషం: ద్రౌపది పలికిన గూఢోక్తులకు, అధిక్షేపోక్తులకు, కీచకుడి అనౌచిత్య వర్తనానికి ధర్మరాజు చిత్తం కలత చెందింది. అది స్వేదమనే సాత్త్వికభావంతో వ్యక్తమయింది. కీచకుడి దుష్టవర్తనం అతడిలో రోషాన్ని పెంచింది. ధీరుడు కాబట్టి ధర్మరాజు దానిని అదుపు చేసికొన్నాడు. ఎంతటి మానసిక సంక్షోభాన్నైనా సంయమించుకొనటంలో వశీకృతచిత్తుడు ధర్మరాజు. (సంపా.)

సీ. 'జననాయకుండు నీ సభవారు నీదగు।
తెఱఁగెల్ల నెఱిఁగిరి తెఱవ! యింక
మానక యీ పలుమాట లాడఁగ నేల?।
చనుము నీవు సుదేష్ణ సదనమునకు;
నీ పరాభవమునఁ గోపింప నేరరే।
గంధర్వులకుఁ దఱిగాదుగాక;
సమయ మెయ్యది యేనిఁ దమకును నీకుఁ గ।
ల్గిన యట్టులైనను గినియ రిచట

తే. గాన నాథుల దూఱంగఁ గాదు వినుము।
సతికిఁ దానెంత వడియును సభలలోనఁ
దడవుగా నిల్చి యిట్టు లుదగ్రవృత్తి।
శంక సెడి ధిక్కరింపంగఁ జనునె చెపుమ!' **127**

ప్రతిపదార్థం: తెఱవ!= ఓ వనితా! (ద్రౌపదీ!); జననాయకుండున్= రాజూ; ఈ సభవారున్= ఈ సభలో జనులూ; నీది+అగు= తెఱఁగు+ఎల్లన్= నీ భంగపాటునంతా; ఎఱిఁగిరి= తెలిసికొన్నారు; ఇంకన్+మానక= ఇంక చాలించక; ఈ పలుమాటలు= ఇట్లాంటి అనేక రకాలైన మాటలు; అడఁగన్+ఏల?= పలకటం ఎందుకు?; సుదేష్ణ సదనమునకున్= మహారాణి నివాసానికి; నీవు చనుము= నీవు వెళ్ళిపొమ్ము; గంధర్వు లకున్= గంధర్వులకు; తఱి+కాదు+కాక= సమయం కాదు కానీ లేకపోతే; నీ పరాభవము నన్= నీ అవమానానికి; కోపింప నేరరే?= కోపపడలేరా?; సమయము+ఎయ్యది+ఏని= ఏదైనా ఒక నియమం; తమకును, నీకున్= వాళ్ళకూ నీకూ; కల్గిన అట్టులు+ఐనను= ఉన్నట్లయితే; ఇచటన్+కినియరు= ఇక్కడ కోపపడరు; కానన్= కావున; వినుము= తెలిసికొనుము; సతికిన్= భార్యకు; నాథులన్= భర్తలను; దూఱంగన్+కాదు= నిందించతగదు; తాను+ ఎంత+పడియును= తాను ఎంతబాధ పడినా, సభలలోనన్= సభలలో; ఇట్టులు= ఈ విధంగా; తడవుగాన్ నిల్చి= ఎక్కువసేపు నిలబడి; ఉదగ్రవృత్తిన్= కోపంగా; శంక+చెడి= సంకోచం లేకుండా; ధిక్కరింపంగన్= ఎదిరించటం; చనునె చెవుమ= తగునా చెప్పుము.

తాత్పర్యం: 'ఓ సైరంధ్రీ! నీ సమాచారం రాజుగారికి, సభాసదులకు సవివరంగా తెలిసింది. ఇంక ఎక్కువ మాట్లాడకుండా రాణిగారి మందిరానికి వెళ్ళిపొమ్ము. నీకు జరిగిన అవమానానికి నీ భర్తలైన గంధర్వులు కోపించరా? కాని, ఇది తగిన సమయం కాదని ఊరకున్నారు. నీకూ వారికీ ఏదో నియమం ఉన్నట్లయితే, సమయం కాదని వా రిప్పుడు కోపగించరు. కాబట్టి దానిని గమనించక నీ భర్తలను నీవు నిందించటం ఉచితం కాదు. సతి తా నెన్ని పాట్లుపడినా నిండు సభలలో చాలాసేపు నిలబడి ఆవేశంతో సంకోచం లేకుండా ఎదిరించి మాట్లాడటం మంచిదా? నీవే చెప్పుము.'

విశేషం: అలం: గూఢోక్తి. ద్రౌపది గూఢోక్తులతో మాట్లాడింది. ధర్మరాజు కూడ గూఢోక్తులతోనే ఆమెకు సమాధానం చెప్పసాగాడు. ఆమె ఉద్వేగకరంగా మాట్లాడింది. ధర్మజుడు నిబ్బరంగా, నిర్వికారంగా మాట్లాడుతున్నాడు. ప్రజలు ధర్మజుడి మాటల తీరులో తేడా లేదు కాబట్టి సభలో ఆమెను మందలిస్తున్నాడనే భావించి ఊరుకుంటారు. ధర్మరాజు మాటలు సభ్యుల దృష్టిలో మందలింపు మాటలుగా, ద్రౌపది దృష్టిలో చేయవలసిన కర్తవ్యాన్ని బోధిస్తున్న విధివాక్యాలుగా స్ఫురించటం గూఢోక్తి అలంకార విశేషం. గంధర్వుల పేరు చెప్పి తన మనసులోని అభిప్రాయాన్ని చెప్పాడు ధర్మరాజు. ఈ మాటలు ఆమె కెంత సూచనలో, ఆ సభలో ఉన్న భీమునికి కూడా అంత సూచనలే! వారికి తోచే తాత్పర్యం ఇట్లా ఉంటుంది. 'ఓ సైరంధ్రీ! నీకు జరిగిన అవమానాన్ని అటు రాజూ! ఇటు సభాసదులూ తెలిసికొన్నారు. ఇక దానిని గురించి వివరించటం మానటం మంచిది. అట్లా కాకుండా నీవు సభలో నిలువబడి పలుమాటలు మాట్లాడుతున్నావు. అది మంచిది కాదు. అందువలన నీవు వెంటనే సుదేష్ణాదేవి మందిరానికి వెళ్ళిపొమ్ము.' (భావి కార్యక్రమం అక్కడి నుండి సాగాలి కాని, సభలో కాదు. నీ పరాభవాన్ని చూచిన మాకు (గంధర్వులకు) కోపం రాదా? వచ్చింది. కాని, దానిని ప్రదర్శించే సమయం కాదిది. కోపం వలన నియమభంగం ఔతుంది. అంటే నీకూ మాకూ కూడా అజ్ఞాతవాసవ్రతం చెడుతుంది. కాబట్టి మేమిక్కడ మారుపల్కటానికి వీలులేదు. దీనిని గమనించి నీవు మమ్ములను (నీ భర్తలను) నిందించవద్దు. నేను చెప్పేమాటలు బాగా అర్థం చేసికొమ్ము, భార్యవైన నీవు ఎన్నోపాట్లు పడిన మాట నిజమే. సమయ నియమబద్ధులైన భర్తలు సభలో ఉండగా వారి నుద్దేశించి గూఢంగానైనా ఎక్కువసేపు మాట్లాడటమే దోషం. పైపెచ్చు నీవు జంకూ గొంకూ

లేకుండా కోపోద్రేకంతో ధిక్కరించి మాట్లాడటంవలన ఏం ప్రయోజనం సాధించ గలుగుతావు? నీ వెంత మాట్లాడినా మేము నిండుసభలో ఏమీ మారుమాట మాట్లాడలేం. ఇది సమయం కాదు; ఈ సభ స్థలం కాదు. రాణిమందిరంలోనే జరుగవలసిన పని జరగాలి. నీవు ఆవేశం మానాలి. మాకు నీకంటె ఎక్కువగానే కోపంగా ఉన్నది. నియమం చెడకుండా ఉపాయం ఆలోచించాలి. ప్రస్తుతానికి నీ విక్కడ ఉండటం శ్రేయస్కరం కాదు. ఎవరైనా నిన్ను ద్రౌపదిగా గుర్తిస్తే అజ్ఞాతవాస వ్రతం భంగం కాకతప్పదు') అని గూఢోక్తులకు గూఢోక్తులతోనే సమాధానం చెప్పించటం తిక్కన సంభాషణ శిల్పం. (సంపా.)

వ. అనియిట్లు సెప్పిన ధర్మ తనయుని పలుకులు విని వెండియు సైరంధ్రి యచ్చోటు గదలక నిలిచి యెద్దియేనియుం బలుకం దలంచినం జూచి యతండు మఱియు నిట్లనియె. 128

ప్రతిపదార్థం: అని+ఇట్లు+చెప్పినన్= అని ఈ విధంగా పలికిన; ధర్మతనయుని= ధర్మరాజు యొక్క; పలుకులు విని= మాటలు విని; వెండియున్= తిరిగి; సైరంధ్రి; ఆ+చోటు కదలక నిలిచి= అక్కడి నుండి కదలకుండా నిలబడి; ఎద్ది+ఏనియున్= ఏదో; పలుకన్+తలంచినన్= మాట్లాడాలనే ఉద్దేశంతో ఉండటం; చూచి= గమనించి; అతండు= ధర్మరాజు; మఱియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లా మాట్లాడిన మాటలు వినికూడా ద్రౌపది అక్కడినుండి కదలకుండా నిలబడి, ఏదో మాట్లాడాలని అనుకొంటుండగా, ధర్మరాజు మళ్ళీ ఇట్లా అన్నాడు.

విశేషం: ధర్మరాజు ద్రౌపదిని సుదేష్ణ అంతఃపురానికి పొమ్మన్నాడు. ద్రౌపది పోవటానికి ఆలస్యం చేసింది. దాని వెనుక ఏదో కారణం ఉండాలి. దానిని వ్యంగ్యంగా పఠిత ఊహకు వదలిపెట్టటం ఇక్కడ విశేషం. అంతఃపురానికి వెళ్ళితే సమస్య తీరదు. కాగా, అది మరీ తీవ్రతరం కావచ్చును. కాబట్టి సమస్యను వేగంగా

తీర్చవలసిన అవసరం ఉన్నదని ఆమె భావం. దానిని ఎట్లాగైనా ధర్మరాజుకు గుప్తంగానే చెప్పవలెనని యత్నించటం ద్రౌపది అప్పటి మసలటంలోని పరమ తాత్పర్యం. దానిని ధర్మరాజు గ్రహించి, ఆమె అక్కడ ఉండి, ఆ మాటలు చెప్పనవసరం లేదని, త్వరగా వెళ్ళుమని సూచించాడు. ఆమె దానిని గ్రహించలేదు. అందువలననే ఆమె ఆరాటపడసాగింది. ధర్మరాజుశాసనాన్ని కాదనటానికి వీలులేదు; అయినా తన మనసులోని మాట చెప్పుకొనకుండా ఉండటానికి వీలులేదు. ఈ సంఘర్షణలో ద్రౌపది వెనుకముందాడుతున్నది. (సంపా.)

క. 'పలుపోకలఁ బోవుచు వి।
చ్చలవిడి నాట్యంబు సలువు చాడ్పున నిచటన్
గులసతుల గఱువ చందము।
దొలఁగఁగ నిట్లునికి దగునె తోయజవదనా!' 129

ప్రతిపదార్థం: తోయజవదనా!= పద్మంవంటి ముఖం కలదానా!, ఓ సైరంధ్రీ; పలు పోకలన్+పోవుచున్= పెక్కు హొయలులు పోతూ; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; నాట్యంబు సలుపు చాడ్పునన్= నాట్యం చేస్తున్నట్లుగా; ఇచ్చటన్= ఈ కొలువులో; కులసతుల= కులస్త్రీలయొక్క; గఱువ చందము తొలఁగఁగన్= గొప్పతనం తొలగిపోయేటట్లు; ఇట్లు+ ఉనికి+తగునె?= ఇక్కడ ఇట్లా ఉండటం భావ్యమా?

తాత్పర్యం: 'ఓ సైరంధ్రీ! ఇట్లా స్వైరవిహారం చేస్తూ నాట్యం చేస్తున్నట్లుగా ఈ కొలువులో కులస్త్రీల ఔన్నత్యం తొలగిపోయేటట్లు నీవు నిలబడటం సంభావ్యం కాదు.'

విశేషం: అలం: ఉపమ. సమాజంలో ఉండే ఒక ఆచారానికి సంబంధించిన సాంస్కృతికమైన ఉపమానాన్ని తిక్కన సాభిప్రాయంగా ఇక్కడ వాడటం విశేషం. కులసతుల గౌరవ వర్తనం ఇందులో చెప్పబడింది. అది పలుపోకడలు పోవటం వలన, విచ్చలవిడిగా నాట్యం చేయటం వలన కులసతి గౌరవం తొలగిపోతుంది- అనే భావం సాంస్కృతికమైన ఒక విలువ. తెలుగులో 'పలుపోకలు పోవుట' -

జాతీయం. దానికి- అనేక మార్గాలలో తిరగటం, పెక్కుహొయలు ప్రదర్శించటం, పలు కపటచేష్టలు చేయటం, పెక్కుమందితో విహరించటం (చరించటం), పలు రీతులలో అభినయించటం (వర్తించటం)-అని అర్థాలు చెప్పవచ్చును. ఇవన్నీ కులసతికి నిషేధాలే. 'విచ్చలవిడి నాట్య' మాడటం- అనేది కూడా తెలుగు జాతీయమే. ఇష్టం వచ్చినట్లు చేతులూపుతూ, కాళ్ళూపుతూ, అభినయిస్తూ మాట్లాడటం. అదుపూ ఆజ్ఞా లేకుండా వ్యవహరించటం. ప్రేలటం, స్వతంత్ర ధోరణితో ఆవేశంగా వ్యవహరించటం. కపటనాటకాలు ఆడటం, కపట నటనం చేయటం మొదలైన అర్థాలు చెప్పవచ్చును. భర్త మాట జవదాటని కులసతికి ఈ లక్షణాలు పనికిరానివి. కాబట్టి సభలో ఉండటం కులసతి లక్షణ విరుద్ధమని ధర్మజుడి అభిప్రాయం. అందులో సున్నితమైన మందలింపూ ఉన్నది. పరుషమైన అదలింపూ ఉన్నది. (సంపా.)

వ. అనిన విని పాంచాలి సాభిప్రాయంబుగా నతని కిట్లనియె. 130

తాత్పర్యం: ధర్మజుని మాటలు విని ద్రౌపది ఉద్దేశపూర్వకంగా ఆయనతో ఇట్లా అన్నది.

తే. 'నాదు వల్లభుండు నటుఁ; డింత నిక్కంబు;।
పెద్దవారి యట్ల పిన్నవారు
గానఁ బతుల విధమకాకయే శైలూషిఁ।
గా ననంగరాదు కంకభట్ట! 131

ప్రతిపదార్థం: కంకభట్ట!= కంకభట్టు వేషంలో ఉన్నవాడా! (ధర్మరాజా!); నాదు వల్లభుండు= నా భర్త; నటుడు= నటించేవాడు. నాట్యాచార్యుడు; ఇంతనిక్కంబు= అంతవరకు నిజమే; పెద్దవారి+అట్లు+అ= పెద్దవారివలెనే; పిన్నవారు= చిన్నవారు ప్రవర్తిస్తారు; కానన్= కాబట్టి; పతుల విధము+అ+కాక= భర్తల పద్ధతిలోగాక; ఏన్= నేను (ద్రౌపది); శైలూషిన్= నాట్యకత్తెను; కాను+అనంగరాదు= కాను అని అనటానికి వీలు లేదు.

తాత్పర్యం: 'ఓ కంకభట్టా! నా భర్త నటుడు. ఇది కాదనలేని వాస్తవం. పెద్దవారితోడి వారే చిన్నవారు. కాబట్టి, నేనూ నా భర్త వంటి దానినే. అందువలన నేను నర్తకిని కాను అనటానికి వీలులేదు.

విశేషం: 1. అలం: పరికరం. **"అలంకారః పరికర స్సాభిప్రాయ విశేషణైః".** విశేషణం సాభిప్రాయమైతే అది పరికరాలంకారం. ఈ పద్యంలో ద్రౌపది 'నాదు వల్లభుండు నటుఁడు' అని అన్నది. 'నటుడు' అనే విశేషణం సాభిప్రాయం. దానివలన బృహన్నల సూచితు డయ్యాడు. మత్స్యయంత్రాన్ని ఛేదించి స్వయంవర సభలో ఆమెను గ్రహించిన భర్త అర్జునుడు. అతడు నాట్యాచార్యుడై ఉత్తరాదులకు నాట్యం నేర్పుతున్నాడు. 'నటుడి భార్యను కాబట్టి నేను నర్తకినే. పెద్దలవలె పిన్నలుండటం న్యాయం. నన్ను నర్తకిని కాదనటానికి వీలులేదు, అని ధర్మజుడి మాటలకు ప్రత్యాఖ్యానం చేసింది. ధర్మరాజు మాటవరసకు జాతీయ ప్రయోగంగా 'నాట్యంబు సలుపు చాడ్పున' నిండు సభలో మెలగవద్దని హెచ్చరించాడు. అక్కడి అర్థం ఔపచారికం. దానిని వాచ్యంగా గ్రహించి ద్రౌపది త్రిప్పికొట్టింది. ద్రౌపది అభిమానవతి. మాటపడదు. అందువలన మాటకు మాట వడ్డించింది. దానికి కారణం ఆమె చెప్పదలచుకొన్న మాటను ధర్మరాజు సభలో చెప్పనీయలేదనే రోషం.

2. 'నేను ఆటవెలది' నని ద్రౌపది చెప్పిన పలుకులను 'ఆటవెలది' లో రచించటం తిక్కన ప్రదర్శించిన వృత్తౌచిత్యం. (సంపా.)

వ. అట్లగుటంజేసి నాకు నాట్యంబును పరిచితంబ; మత్పతి శైలూషుండ కాఁడు, కితవుండునుం గావున జూదరి యాలికి గఱువచందం బెక్కడిది?' యనుచు నచ్చోటు వాసి తన చిత్తంబున. 132

ప్రతిపదార్థం: అట్లు+అగుటన్+చేసి= అట్లా కావటం వలన; నాకున్= (ద్రౌపదికి); నాట్యంబును పరిచితంబు+అ= నాట్యంకూడా తెలుసు; మత్పతి= నా భర్త; శైలూషుండు+ అ-కాఁడు= ఆటకాడు మాత్రమే కాదు; కితవుండునున్+కావునన్= జూదరి కూడా కాబట్టి; జూదరి+ఆలికిన్= జూదరి

యొక్క భార్యకు; గఱువచందంబు= పెద్దరికం, గౌరవం, ఔన్నత్యం; ఎక్కడిది?= ఎక్కడ ఉంటుంది?; అనుచున్= అనిపల్కుచు; ఆ+చోటువాసి= అంటూ ఆ ప్రదేశం వదలి; తన చిత్తంబునన్= తన మనస్సులో.

తాత్పర్యం: అట్లా కావటం వలన నాకు నాట్యం చేయటం అలవాటే. నా భర్త నాట్యకాడు మాత్రమే కాదు. జూదరి కూడా! జూదరి భార్యకు పెద్దరికం, గౌరవం ఎక్కడి నుండి వస్తుంది?' అంటూ ఆ ప్రదేశం వదలిపెట్టి, తన మనస్సులో, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: పరికరాంకురం. **"సాభిప్రాయే విశేష్యే తు భవే త్పరికరాంకురః".** విశేష్యం సాభిప్రాయంగా ప్రయోగించబడితే పరికరాంకురాలంకార మౌతుంది. వెనుకటి పద్యంలో ద్రౌపది తాను నర్తకినే అని చెప్పుకొనటానికి తగిన హేతువును పేర్కొన్నది. నాట్యాచార్యుడైన అర్జునుడికి భార్య కావటం చేత తాను నర్తకినని చెప్పి, సాభిప్రాయంగా సమర్థించుకొన్నది. అందులో అధిక్షేపంతోపాటు ఒక అనౌచిత్యం కూడా స్ఫురించే అవకాశం ఉన్నది. ఎట్లాగంటే- 'నిజంగా నా భర్త అర్జునుడే. అతడు ఇప్పుడు నాట్యం చేస్తున్నాడు కాబట్టి నన్ను రక్షించుకొనే స్థితిలో లేడు. అందువలన నేనూ, నన్ను నేను రక్షించుకొనటానికి ఎన్నో నటనలు చేయవలసి వస్తున్నది. భర్త యొక్క వృత్తియే భార్యకు ప్రవృత్తిగా మారింది' - అని పలికి అర్జునుడు (బృహన్నల) సాకుగా భర్తల అసమర్థతను ఎత్తిపొడిచి అవహేళనం చేసింది. రోషంతో ఆ మాట అని ఆమె నాలుక కొరుక్కొని ఉంటుంది. వెంటనే ఆ అనౌచిత్యాన్ని పరిహరించే మరొక వాక్యాన్ని ఇప్పుడు పలికింది. 'నా భర్త నటుడే కాదు జూదరి కూడా' - అని. ఈ రెండు విశేష్యాలూ సాభిప్రాయాలు. నా భర్త నటుడైన అర్జునుడే కాడు. జూదరి అయిన ధర్మరాజు కూడా! అని ఒక అర్థం. నా భర్త నటుడూ, జూదరీ - రెండూ అయినవాడు అని - రెండో అర్థం. ధర్మరాజు వాడిన 'విచ్చలవిడి నాట్యంబు సూపు చాడ్పున' - అనే పోలికకు తగిన వడ్డింపు ఇక్కడ వచ్చింది. ధర్మరాజు కంకభట్టుగా వేషాన్ని ధరించి నటిస్తున్నాడు. కాబట్టి అతడూ నటుడే. ఆ నటనలోకూడా జూదరి పాత్రనే నిర్వహిస్తున్నాడు. నటనలోకూడా జూదరి అయిన విశేష లక్షణం ధర్మరాజుకే దక్కింది. దానిని ఎత్తి

పొడిచింది ద్రౌపది. జూదరి భార్యను అమ్ముకొంటాడు. ఆమెకు కలిగే అవమానాన్ని లక్ష్యపెట్టడు. అతడికి ఇల్లాలైన వనితకు లోకంలో గౌరవం ఉండదు. గౌరవం పోయిన జూదరి భార్యకు 'విచ్చలవిడితనం' దోషం కాదని అధిక్షేపించింది. ద్రౌపది యందు ధర్మజుడు ఆరోపిస్తున్న అవలక్షణాలన్నీ ధర్మరాజు జూదరి కావటం వలన ఏర్పడినవే అని అధిక్షేపోక్తి. ధర్మరాజు తనను మాట్లడనీయకుండా అడ్డుపడ్డాడు. ఆమె కూడా ఆయన మాట్లాడలేనట్లు అడ్డుపలికి ఆయన సమాధానం కొరకు వేచి ఉండకుండానే వెనుదిరిగిపోయింది. ధర్మరాజు ఆదేశించినట్లే సుదేష్ణ యొక్క అంతఃపురానికి ఆమె వెళ్ళి ధర్మరాజు ఆనతిని పాటించింది. కాని, అధిక్షేపోక్తితో తన తీవ్ర పరితాపాన్ని వ్యక్తం చేసింది. తన కష్టాల కన్నిటికీ ధర్మజుడిని బాధ్యుడిని చేసింది. ఆ కష్టాలు తీర్చే బాధ్యత కూడా అతడిమీదనే పెట్టింది. ఇక మాటలతో పనిలే దన్నట్లు, కార్యాచరణమే ముఖ్యమన్నట్లు గిర్రున తిరిగి వెళ్ళిపోయింది. తిక్కన రచనలో పాత్రల ప్రతికదలికలో రసధ్వని రవళిస్తుంది. అందుకు ఈ సన్నివేశం సజీవోదాహరణం. (సంపా.)

సుదేష్ణ ద్రౌపది నూఱడించుట (సం.4-15-36)

ఉ. 'న న్నిటు లాదురాత్ము సదనంబునకుం జనుమన్నజంత కీ
బన్నములన్నియుం దెలిపి ప్ర య్యిడనే' యని పోయె నార్తయై
కన్నుల బాష్పపూరములు గ్రమ్మఁగ మోమున దైన్యమొందఁగా
నన్నలినాక్షి తొట్రిలుచు నంగము దూల సుదేష్ణపాలికిన్. 133

ప్రతిపదార్థం: ఆ+నలిన+అక్షి= పద్మాలవంటి కన్నులు గల ఆ సైరంధ్రి (ద్రౌపది); నన్నున్+ఇటులు= నన్ను ఈ విధంగా; ఆ దురాత్ముసదనంబునకున్= ఆ దుష్టుడైన కీచకుని ఇంటికి; చనుము+అన్న= వెళ్ళుమన్న; జంతకున్= ధూర్తురాలికి, (సుదేష్ణకు); ఈ బన్నములు+అన్నియున్= ఈ అవమానాలన్నీ; తెలిపి= తెలిసేటట్లు చెప్పి; ప్రయ్యి+ఇడను+ఏ= నిందించనా? (తిట్టిపోయనా?); అని ఆర్త+ఐ= అని అనుకొంటూ పెద్దగా ఏడుస్తూ; కన్నులన్ బాష్పపూరములు= కళ్ళలో కన్నీటి ధారలు; క్రమ్ముఁగాన్= వ్యాపించగా; మోమునన్= ముఖంమీద;

దైన్యము+ఒందఁగాన్= దీనత్వం కనిపించగా; తొట్రిలుచున్= తడబడతూ; అంగము+తూలన్= శరీరం తూలుతూ ఉండగా; సుదేష్ణపాలికిన్= సుదేష్ణవద్దకు; పోయెన్= వెళ్ళింది.

తాత్పర్యం: 'నన్ను ఆ దుష్టుడైన కీచకుడి ఇంటికి వెళ్ళుమన్న ఆ ధూర్తురాలికి నాకు జరిగిన అవమానాలన్నీ తెలియచెప్పి నిందించా'లని అనుకొంటూ కన్నీళ్ళు ధారాపాతంగా ప్రవహించగా, బావురుమని దుఃఖిస్తూ శరీరం కంపించగా, తూలుతూ, దీనవదనంతో ఆ సైరంధ్రి సుదేష్ణవద్దకు వెళ్ళింది.

విశేషం: తిక్కన రచించిన అభినయాత్మకమైన పద్యాలలో ఇది ఒకటి. మనసులోని భావపరిణామానికి అనువుగా ఆంగిక అభినయం ప్రవర్తిల్లినట్లు వర్ణించటం తిక్కన నాటకీయ రచనా శిల్పం. ఈ పద్యంలో ద్రౌపది మనస్సులో అనుకొన్న మాటలివి; 'నన్ను ఈ విధంగా - ఆ దురాత్ముడి ఇంటికి పొమ్మని - పంపిన - ఆ జంతకు - నా పడిన అవమానాలన్నీ - చెప్పి - నోరారా నిందిస్తాను' - ఈ మాట లనుకుంటూ సుదేష్ణ వద్దకు పోతున్న ద్రౌపది రోదించింది. నమ్మినవారు మోసం చేయగా, గత్యంతరం లేక మరలవారి వద్దకే వెళ్ళవలసిన దీనస్థితి వచ్చినప్పుడు ఉన్నతవంశసంజాతురాలు, ఉత్తమురాలు, అభిమానవతి అయిన సతి మొదట బావురుమన్నట్లు రోదించటం సహజ సాత్త్వికాభినయం. కీచకుడి ఇంటికి పంపిన సన్నివేశ స్మరణం చేత ద్రౌపదికి కన్నీటి ధారలు పొంగి వచ్చాయి. మాట తప్పిన యజమానురాలి దుర్నీతికి బలి అయిన ఒక ఇల్లాలు బలవంతంగా ఒక దుర్మార్గుడి ఇంటికి ఒంటరిగా వెళ్ళవలసి వచ్చినప్పుడు సంభవించే అపాయాన్ని తలచినప్పుడు కళ్ళనీళ్ళు పొంగి పొరలటం సహజా భినయం. అక్కడ కీచకుడు ఆమెపట్ల వర్తించిన వికార చేష్టలను, పలికిన వాక్యాలను, తాను పడిన అవమానాలను తలపునకు తెచ్చుకొన్నప్పుడు ఆమె కంపించిపోయింది. సుదేష్ణకు ఆ సంగతులు ఎట్లా చెప్పాలి? - అనే అభిమానం అడ్డం వచ్చి, చెప్పక తప్పని తన దయనీయ స్థితిని భావించి, ముందుకు వెళ్ళలేక వెళ్ళుతున్నప్పుడు ఆమె శరీరం తూలినట్లయింది. ఈ అభినయం భావప్రవాహ ప్రతిస్పందనం. తిక్కన అభినయ కళాప్రతిభకు అభినవ దర్పణం! (సంపా.)

తే. చనిన, నయ్యెలనాఁగయు సంభ్రమంబుఁ।
దెచ్చికొని తానెఱుంగని తెఱఁగు దాల్చి
శాఠ్యమున నుమ్మలించి పాంచాలితోడ।
నెలుఁగువేఱొక భంగిగా నిట్టులనియె. 134

ప్రతిపదార్థం: చనినన్= వెళ్లగా, ఆ+ఎలనాఁగయున్= ఆ మహారాణి సుదేష్ణ కూడా; సంభ్రమంబున్+తెచ్చుకొని= వేగిరపాటును తెచ్చిపెట్టుకొని; తాను+ఎఱుంగని తెఱఁగు+తాల్చి= తనకేమీ తెలియదన్న వైఖరిని ప్రదర్శిస్తూ; శాఠ్యమునన్= కపటంగా; ఉమ్మలించి= దుఃఖాన్ని తెచ్చిపెట్టుకొని; పాంచాలితోడన్= సైరంధ్రితో; ఎలుఁగు వేఱు+ఒక భంగిగాన్= డగ్గుత్తిక చెందినట్లుగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ద్రౌపది అట్లా వెళ్ళగా సుదేష్ణకూడా వేగిరపాటును తెచ్చిపెట్టుకొని, తన కేమీ తెలియనట్లుగా ప్రవర్తిస్తూ, కపటమైన దుఃఖాన్ని కొనితెచ్చుకొని, సైరంధ్రితో డగ్గుత్తిక చెందిన స్వరంతో ఈ విధంగా పలికింది.

విశేషం: సైరంధ్రిది సహజాభినయం, సుదేష్ణది కపటాభినయం. తులనాత్మక పరిశీలనలో ఈ వైరుద్ధ్యం తిక్కన రచనలో ప్రసన్నం. (సంపా.)

సీ. 'ధరణీ పరాగంబు వొరసి ధూసరితమై।
చేడియ! నీ మేను చెన్నుదఱిఁగెఁ;
జిత్తంబు తలపోఁతచే వాడు పొదవిన।
చెలువ। నీ నెమ్మోము చిన్నఁబోయెఁ;
బ్రస్వేదమునఁ దోఁగి ఫాలంబుతో నంటి।
యుగ్మలి ! నీ కురు లొప్పు కుందెఁ;
గన్నీరు వఱ్ఱొడ్డి కాంతి యెంతయుఁగొన్న।
వెలఁది! నీ కనుఁగవ విన్ననయ్యెఁ;

ఆ. నేది కారణమున నెవ్వ రెచ్చోట నీ।
కేమి కీ డొనర్చి రెట్టిపాటి
సాహసికులొ వారిఁ జంపుదు నొంపుదు।
భంగపఱుతు నిడుమపఱుతుఁ జెఱుతు. 135

ప్రతిపదార్థం: చేడియ= ఓ వనితా! (సైరంధ్రీ!); ధరణీ పరాగంబు= నేలమీది దుమ్మును; పొరసి= పొంది; ధూసరితము+ఐ= బూడిదరంగు కలదై; నీ మేను= నీ శరీరం; చెన్ను+తఱిఁగెన్= అందం కోల్పోయింది; చెలువ!= ఓ సైరంధ్రీ; చిత్తంబు తలపోఁతచేన్= మనసులోని చింతవలన; వాడు+పొదవినన్= వాడినందువలన; నీ నెఱ+మోము= నీ అందమైన ముఖం; చిన్నఁబోయెన్= కాంతిహీనమైనది; ఉగ్మలి!= ఓ సైరంధ్రీ!; ప్రస్వేదమునన్+తోఁగి= మిక్కిలి చెమటపోసి; ఫాలంబుతోన్+అంటి= నుదుటికి అంటుకొని; నీ కురులు= నీ కేశాలు; ఒప్పు కుందెన్= అందవిహీనాలైనవి; వెలఁది!= సైరంధ్రీ!; కన్నీరు= కన్నీరు; వఱ్ఱు+ఒడ్డి= ప్రవహించి; కాంతి+ఎంతయున్+కొన్న= కాంతి నంతటినీ తగ్గించటంచేత; నీ కనుఁగవ= నీ రెండు కళ్ళు; విన్నన్+అయ్యెన్= చిన్నబోయి ఉన్నాయి; ఏది కారణమున్= ఏ కారణంవలన; ఎవ్వరు, ఏ+చోటన్= ఎవరైనా, ఎక్కడైనా; నీకున్+ఏమి కీడు+ఒనర్చిరి?= నీ కేదైనా బాధ కలిగించారా?; ఎట్టిపాటి సాహసికులొ= వాళ్లు ఎంతధైర్యవంతులో! ఐనప్పటికీ; వారిన్+చంపుదున్= వారిని నాశనం చేస్తాను; నొంపుదున్= బాధిస్తాను; భంగపఱతున్= అవమానం చేస్తాను; ఇడుమపఱుతున్= కష్టపెట్టుతాను; చెఱుతున్= నశింపచేస్తాను.

తాత్పర్యం: దుమ్ము అంటుకొని నీ శరీరం కాంతిహీనం అయింది. మనసులోని చింతచేత నీ ముఖం వాడి చిన్నవోయింది. చెమటకు తడిసి నీ ముంగురులు నుదురు కంటుకొనటంచేత అందంకోల్పోయి ఉన్నాయి. కన్నీరు కారి నీ కళ్ళు విలాసరహితంగా ఉన్నాయి. నీకు ఎవరైనా ఎక్కడైనా ఎప్పుడైనా అపకారం చేశారా? వారి కెంత ధైర్యం? వారిని చంపుతాను. అవమానాల పాలుచేస్తాను. కష్టాల పాలుచేస్తాను. రూపుమాపుతాను.

వ. ఇత్తెఱంగు నాకుం జెప్పు 'మనిన 'నీ వెఱింగియు నెఱుంగమి భావించిన, నింక నే మని పలుకంగలదాన? నైనను విను' మని సైరంధ్రి యిట్లనియె.136

ప్రతిపదార్థం: ఈ+తెఱంగు= ఈ సంగతి; నాకున్+చెప్పుము+అనినన్= నాకు చెప్పుమని అనగా; నీవు ఎఱింగియున్= నీకు తెలిసికూడా; ఎఱుంగమి భావించినన్= తెలియనట్లుగా భావిస్తే; ఇంకన్+ఏమని, పలుకన్+కలదానను?= ఇంక ఏమని చెప్పేది?; ఐనను వినుము+ అని= ఐనా వినుమని; సైరంధ్రి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఎట్లా జరిగిందో నాకు చెప్పు' మని అడుగగా సుదేష్ణను చూచి సైరంధ్రి ఇట్లా అన్నది. 'అన్నీ తెలిసీ, తెలియనిదానివలె నన్ను అడిగితే నే నింక ఏమని చెప్పగలను?

మ. ' నను నీ వప్పుడు సూతమందిరమున న్మద్యంబుఁ దెమ్మన్నఁ బో
యిన నాతం డవినీతి సేసినను జేయీ కేను మత్స్యావనీ
శుని యాస్థానము దిక్కువే చనిన నచ్చోఁ దీవ్రకోపంబున
న్వెనుకం గూడఁగ ముట్టి పట్టికొని తన్నెం బల్కు లింకేటికిన్?' 137

ప్రతిపదార్థం: ననున్= (ద్రౌపదిని); ఈవు= నీవు సుదేష్ణ; అప్పుడు= ఆ సమయంలో; సూత మందిరమునన్= కీచకుడి ఇంటిలో; మద్యంబు తెమ్ము+అన్నన్= కల్లు తీసికొనిరమ్మని చెప్పగా; పోయినన్= వెళ్ళితే; ఆతండు= ఆ కీచకుడు; అవినీతి+చేసినను= దుర్మార్గపు పనిచేయగా; చేయి+ ఈక= పట్టుకోనీక; ఏను= ద్రౌపదినైన నేను; మత్స్య+ అవనీశుని+ఆస్థానము దిక్కు= విరాటరాజు కొలువువైపు; వే+చనినన్= త్వరగా వెళ్ళగా; అచ్చోన్= అక్కడ; తీవ్రకోపంబునన్= అధికమైన కోపంతో; వెనుకన్+కూడఁగన్+ముట్టి= వెంబడించి; పట్టికొని తన్నెన్= నన్ను పట్టుకొని తన్నాడు; పల్కులు+ ఇంకన్+ఏటికిన్?= వేరే మాట లిం కెందుకులే.

తాత్పర్యం: 'అప్పుడు నీవు నన్ను సూతుడైన కీచకుడి ఇంటికి మద్యం తెమ్మని పంపగా నేను వెళ్ళాను. అప్పుడతడు అవినీతి పనిచేయబోగా, నే నతడికి అవకాశ

మివ్వక విరాటరాజు కొలువువైపు పరుగుతీశాను. అతడు మిక్కిలి కోపంతో నా వెనుకనే వచ్చి నన్ను పట్టుకొని తన్నాడు. ఇంతకంటె నే నేమి చెప్పేది?'

వ. అని యేర్పడం బలికిన. 138

తాత్పర్యం: అని తెలిసేటట్లు చెప్పగా.

ఉ. 'ఖేదము దక్కుమీ క్షణమ కీచకు దండితుఁ జేసి నీకు నా
హ్లాద మొనర్తు నేనని నయంబునఁ గేకయరాజపుత్త్రి య
త్యాదరవృత్తితో ననునయం బొనరించిన నయ్యసత్య సం
వాదిని పూన్కి పాండుసుతవల్లభ యాలము సేసి యిట్లనున్. 139

ప్రతిపదార్థం: ఖేదము+తక్కుము= విచారించటం మానివేయి; ఈక్షణము+అ= ఇప్పుడే; నేను= నేను; కీచకున్ దండితున్+చేసి= కీచకుడిని దండించి; నీకున్+ఆహ్లాదము+ ఒనర్తున్= నీకు (ద్రౌపదికి) సంతోషం కలిగిస్తాను; అని= అని పలికి; కేకయరాజపుత్రి= సుదేష్ణ; నయంబునన్= కోమలంగా, నెమ్మదిగా; అతి+ఆదరవృత్తితోన్= ఎంతో గౌరవంగా; అనునయంబు+ ఒనరించినన్= ఓదార్చగా; ఆ+అసత్యసంవాదిని పూన్కి= ఆ అబద్ధాలకోరుప్రయత్నం; ఆలము+చేసి= లక్ష్యపెట్టకుండా; పాండుసుత వల్లభ= పాండవపత్ని ద్రౌపది; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: 'నీవు విచారం మానుము! ఆ కీచకుడిని దండించి నీకు సంతోషం కలిగిస్తానులే' అని సుదేష్ణ ఎంతో ఆదరంగా ఓదార్పు మాటలు పలికింది. ఆ అబద్ధాలకోరు మాటలను నిర్లక్ష్యం చేస్తూ ద్రౌపది ఇట్లా అన్నది.

విశేషం: సుదేష్ణ కావాలని కీచకుడి ఇంటికి సైరంధ్రిని పంపింది. కీచకుడు దుష్టుడు, నీచుడని తెలుసు. సైరంధ్రి పట్ల అగౌరవం ప్రదర్శించటం తన వంశానికే కళంకం అని సుదేష్ణకు తెలుసు. ఈ సందిగ్ధ పరిస్థితిని ఇక్కడ కవి చక్కగా వర్ణించాడు.

క. 'నీ వింత యలుగ నేటికి?।
నా వంతయుఁ బౌరజన మనఃఖేదము నొ

క్కావంత ద్రిక్కకుండఁ గ।
లావంతులు మత్పతులు గలరు పగఁ దీర్పన్'. 140

ప్రతిపదార్థం: నీవు= సుదేష్ణ; ఇంత+అలుగన్+ఏటికిన్= ఇంతగా కోపించట మెందుకు? (అవసరంలేదని భావం); నా వంతయున్= నా దుఃఖమూ; పౌరజనమనఃఖేదమున్= లోకుల మనస్సులోని దుఃఖమూ; ఒక్క+ఆవంత= కొంచెంకూడా; త్రిక్కకుండన్= విడవకుండా; కలావంతులు= సమర్థులు; మత్+పతులు= నా భర్తలు; పగన్+దీర్పన్+కలరు= పగ సాధించగలరు.

తాత్పర్యం: 'ఓ సుదేష్ణాదేవీ! నీవు అంతగా కోపపడవలసిన పనిలేదులే! నా కష్టాలను, లోకుల దుఃఖాన్నీ కించిత్తుకూడా మిగల్చకుండా పగదీర్చగల సమర్థులు నా భర్తలు ఉన్నారులే.'

విశేషం: ఇక్కడ వ్యంగ్యంగా కీచకుడిని మట్టుపెట్టటం త్వరలో జరగగలదని కవి సూచించాడు.

క. అనిన సుదేష్ణయుఁ దత్పరి।
జనములు వెఱఁబొంది యెన్ని సాంత్వనములు సె
ప్పినఁ దేఱద, మజ్జన భో।
జనములకుం జొరద ద్రుపదసంభవ యెట్లున్. 141

ప్రతిపదార్థం: అనినన్= ఆమె అట్లా అనగానే; సుదేష్ణయున్= సుదేష్ణయూ; తద్+పరిజనములున్= ఆమె పరిచారికలూ; వెఱన్+పొంది= భయపడి; ఎన్ని సాంత్వనములు= ఎన్ని రకాల ఓదార్పు మాటలు; చెప్పినన్= చెప్పినా; ద్రుపద సంభవ= ద్రౌపది; తేఱద= తేరుకోదు; ఎట్లున్= ఎన్నిరకాల యత్నించినా; మజ్జన= స్నానం చేయటానికీ; భోజనములకున్= అన్నం తినటానికీ; చొరదు= పూనుకొనదు.

తాత్పర్యం: ద్రౌపది మాటలకు సుదేష్ణా, ఆమె పరిచారికలూ భయభ్రాంతు లయ్యారు. వారు ఎన్ని ఓదార్పు మాటలు చెప్పినా ద్రౌపది కోపం వదలలేదు. స్నానం చేయలేదు. అన్నపానాదులు ముట్టలేదు.

విశేషం: క్రియలమీద అవధారణార్థకం చేర్చి తేఱదు+అ, చొరదు+అ అని ప్రయోగించి తిక్కన ద్రౌపది దృఢ ప్రవృత్తిని, వేదన తీవ్రతను ధ్వనింపచేశాడు. (సంపా.)

వ. అట్టియెడ సుదేష్ణ సేయునది లేక నివ్వెఱఁగంది యుండెఁ; దక్కటి యంగనలును గీచకుని నీచత్వంబు దలంచి వాని చేటున కొడంబడిరి; పరిభవానల సంతప్తయైనపాంచాలి నిజశయనస్థానంబునకుం జని తల్పంబుపై మేను వైచి, యపాంగంబులం దొరంగు కన్నీరు చెవుల కొలంకులు నిండ నెవ్వగలు నివ్వటిలం దలపోయుచుండి. 142

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో సుదేష్ణ; చేయు+అదిలేక= చేసేదేమీ తోచక; నివ్వెఱఁగు+అంది+ఉండెన్= ఆశ్చర్యంతో చేష్టలుడిగి ఉండిపోయింది; తక్కటి అంగనలును= మిగతా స్త్రీలు కూడా; కీచకుని నీచత్వంబు+తలంచి= కీచకుడియొక్క అల్పత్వాన్ని మనసులో భావించి; వాని= అతడి యొక్క; చేటునకున్+ఒడంబడిరి= ముప్పునకు అంగీకరించారు; పరిభవ+ అనలసంతప్త+ఐన= అవమానమనే అగ్నిచేత కాల్చబడిన; పాంచాలి= ద్రౌపది; నిజశయనస్థానంబునకున్= తన పడకటింటికి; చని= వెళ్ళి; తల్పంబుపైన్= పడకపై; మేను వైచి= నడుము వాల్చి; అపాంగంబులన్= కనుగొలకుల నుండి; తొరంగు కన్నీరు= వచ్చే కన్నీళ్ళు; చెవుల కొలంకులు, నిండన్= చెవులనే సరస్సులు నిండగా; నెఱ+వగలు= పెనుదుఃఖం; నివ్వటిలన్= కలుగగా; తలపోయుచున్+ఉండి= ఎన్నో ఆలోచనలు చేస్తూ.

తాత్పర్యం: అప్పుడు సుదేష్ణ చేసే దేమీ లేక అచ్చెరువుతో భయభ్రాంతురాలై ఊరక ఉండిపోయింది. మిగిలిన ఆడువారు కీచకుడి నీచస్వభావాన్ని తలచి, వాడికి తప్పక కీడు కలగటానికి మనసులలో అంగీకరించారు. ద్రౌపది అవమానాగ్నితో వేగిపోతూ పడకగదిలోకి పోయి పడకమీద నడుం వాల్చింది. అయినా, ఆమె కనుకొలకుల నుండి కన్నీరు ధారలుగా కారుతూ చెవులు అనే సరస్సులు నిండిపోతున్నాయి. హృదయం నుండి పెల్లుబుకుతున్న దుఃఖం అతిశయిస్తూ ఉండగా ఎన్నో ఆలోచనలు చేస్తూ ఉండింది.

విశేషం: 1. మేను వైచి- తెలుగు జాతీయం. శరీరాన్ని పక్కమీద పడేసి అని అర్థం. ఆ చర్య దుఃఖ వివశత్వాన్ని సూచిస్తుంది. కన్నీరు కనుకొలకుల నుండి జారి చెవులదొప్పలు నిండటం- అనే అవస్థ ఆమె ఆలోచనలో పడి ఒకే భంగిమలో చాలా సేపు ఉండిపోయిందని సూచన. భావి కార్య నిర్వహణకై ఆమె యోచించ నారంభించింది. (సంపా.)

2. కొన్ని ప్రతులలో ఈ క్రింది అధిక పాఠం కనపడుతున్నదని ఉ.వి. సంశోధిత మహాభారత ముద్రిత ప్రతిలో పాదసూచిగా ఇవ్వబడింది. "వాని చేటున కొడంబడిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె- అయ్యా! కీచకుం డేవంశంబునవాఁ డెవ్వం డనిన నమ్మునివరుం డా జనపతి కిట్లని చెప్పె - బ్రాహ్మణియందు క్షత్రియుని వలనం బుట్టినవాఁడు సూతుం డనంబరఁగుఁ; బ్రతిలోమజాతులలోన న(న)ద్విజుండనఁబరఁగి క్షత్రియునికంటె నించుక తక్కువయు, వైశ్యునికంటె నధికుండునై ప్రాతిలోమ్యంబున రాజసంబంధార్హుం డగునట్టి సూతువంశంబున సూతవిషయాధీశుండును రాజకన్యా సముద్భూతుండును నగు కీచకుం డనువాఁడు గలండు; వానికి మాళవియందు నూటయాఱ్వురు కీచకులు పుట్టి; రం దగ్రజుండు బలవంతుండై యుండి కేకయ రాజపుత్రియగు తమ తల్లి చెలియలి కూఁతురైన సుదేష్ణకుం బరిచరించుచు విరాటనగరంబున నుండు; వాని తమ్ములు నూటయేవురును వానిన యనుసరించి యుండుదు రని యిట్లు సూతవంశ ప్రకారం బెఱింగించి యిట్లనియె; నంతం బరిభవానల..."

క. 'ప్రబలుం డారయ నా సిం।
హబలుం; డాతని జయింప ననిలతనయు బా
హుబలంబ కూడఁ దగు; దై।
వబలం బును నాతనికి నవశ్యముఁ గల్గున్.' 143

ప్రతిపదార్థం: ఆరయన్= ఆలోచించి చూడగా; ఆ సింహబలుండు= ఆ కీచకుడు; ప్రబలుండు= చాల బలవంతుడు; ఆతనిన్= జయింపన్= వాడిని జయించడానికి; అనిలతనయు బాహుబలంబు+అ= భీముడి భుజబలమే; కూడన్+తగున్= సరితూగుతుంది; ఆతనికిన్= భీముడికి; దైవబలంబును= దైవశక్తికూడా; అవశ్యమున్+కల్గున్= తప్పక సిద్ధిస్తుంది.

తాత్పర్యం: 'ఆ కీచకుడు బలాఢ్యుడు. అతడిని జయించడానికి తగిన సమర్థుడు ఒక్క భీముడే. అతడి భుజబలశక్తికి తోడు దైవబలం కూడా తప్పక సమకూరుతుంది.'

విశేషం: 1. కీచకుడు సింహబల నామధేయుడు, ప్రబలుడు, అతడిది మృగరాజ బలమని ధ్వని. మరి భీముడు అనిలతనయుడు కావటంచేత దైవబలం, ప్రభంజనత్వం సహజసిద్ధం. విరోధులను సంహరించేటప్పు డతడిలో అతడి తండ్రి ఆవేశిస్తాడు. ఎన్ని శారీరక ఉపద్రవాలు వచ్చినా, రాక్షసులతో యుద్ధాలు వచ్చినా భీముడు ఎప్పుడూ విజయుడే - అని తర్కబద్ధంగా ప్రతివ్యూహాన్ని ఊహించింది ద్రౌపది. 2. ఈ పద్యానికి మారుగా ఈ క్రింది పద్యం ఒక ప్రతిలో కనపడుతున్నదని ఉ.వి. సంశోధిత మహాభారతం పేర్కొన్నది. **'తే. ప్రబలుఁ డారయ నా సింహబలుఁడు నతని, బరగ సమయింప ననిలజుబాహుబలము(ను), కాక యితరుల కలవియే ఘనుఁడ(డి)తండు, దైవబల మతనికి (క) నవశ్యంబు గలదు."** (ఈ పద్యంలోని నాల్గవ పాదంలో యతిమైత్రి లేదు.)

ద్రౌపది భీమసేనుతోఁ దన భంగపాటు సెప్పి పరితపించుట **(సం.4-16-5)**

వ. ఇట్లూహించి రాత్రిసమయుం బగుటయు, సమస్త జనంబులుఁ గ్రమంబున నిద్రింపం దొడంగినం దానును శయ్యాతలంబు విడిచి, మేని ధూళి గడిగి, ధౌత పరిధాన పరీతయై మహానస గృహంబున సుప్తుండైన వృకోదరు కడకుం జని. 144

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఊహించి= ఆలోచించి; రాత్రి సమయంబు= రాత్రివేళ; అగుటయున్= కావటం వలన; సమస్త జనంబులున్= అంతఃపురంలోని జనమంతా; క్రమంబునన్, నిద్రింపన్+ తొడంగినన్= క్రమంగా నిద్ర కుపక్రమించగా; తానును= ద్రౌపది; శయ్యాతలంబు విడిచి= పడకనువదలి; మేని ధూళి+కడిగి= శీరరం పైనున్న దుమ్ము కడుగుకొని; ధౌతపరిధానపరీత+ఐ= ఉతికిన చీర కట్టుకొని; మహానస గృహంబునన్= వంటింటిలో; సుప్తుండు+ఐన= నిద్రిస్తున్న; వృకోదరు కడకున్+చని= భీముడి దగ్గరకు వెళ్ళి.

తాత్పర్యం: ఇట్లు ఆలోచించి, రాత్రి కావటం వలన జనులందరూ నిద్రలో మునుగగా ద్రౌపది పడకటిల్లు వదలి, శరీరంపై కమ్మిన దుమ్ము కడుగుకొని, ఉతికిన చీర కట్టుకొని, వంటింట్లో నిద్రపోతున్న భీముడి దగ్గరకు వెళ్ళింది.

ఉ. 'నన్నుఁ బరాభవించి సదనంబునకుం జని కీచకుండు ము
న్నున్న తెఱంగు దప్పక సుఖోచిత శయ్యను నిద్ర సేయ నీ
కన్ను మొగుడ్చు నూఱటకుఁ గారణ మెయ్యది? భీమసేన! మీ
యన్న పరాక్రమంబు వలదన్న నొకో దయమాలి తక్కటా!' 145

ప్రతిపదార్థం: భీమసేన!= ఓ భీమసేనా!; నన్నున్+పరాభవించి= నన్ను అవమానించి; సదనంబునకున్= ఇంటికి; చని= వెళ్ళి; కీచకుండు; మున్ను+ఉన్న తెఱంగు+తప్పక= ఇంతకు ముందున్న తీరు వదలక; సుఖ+ఉచితశయ్యను= మెత్తని పాన్పుపై; నిద్ర+చేయన్= హాయిగా నిద్రించగా; నీకన్నుమొగుడ్చు= నీవు నిద్రపోయే; ఊఱటకున్= నిశ్చింతకు; కారణము+ఏ+అది?= కారణమేమి?; అక్కటా!= ఔరా!; మీ+అన్న= ధర్మజుడు; పరాక్రమంబు= సాహసం; వలదు+అన్నన్+ఒకో= వద్దన్నందువలన కాబోలు; దయమాలితి(వి)?= నాపై దయచూపటం మానావు?

తాత్పర్యం: 'ఓ భీమసేనా! నన్ను అవమానించి కీచకుడు ఇంటికి వెళ్ళి హాయిగా ఇంతకుముందు వలె యథావిధిగా సుఖశయ్యపై నిద్రపోతుంటే, నీవు నిశ్చింతగా నిద్రపోవటానికి కారణ మేమిటి? అక్కటా! మీ అన్న ధర్మజుడు

నీవు సాహసం చూపించటానికి ఇది తగిన సమయం కాదని చెప్పటం వలన కాబోలు, నీవు నాపై దయచూపటం లేదు'.

విశేషం: అలం: సంభావన. ప్రతిపదసార్థకమైన ధ్వనిమయ రచన ఇది. తనను అవమానించి కూడా కీచకుడు ఎటువంటి ప్రతిఘటననుగాని, కీడునుగాని పొందకుండా సుఖశయ్యమీద నిద్రపోవటం ద్రౌపది సహించలేకపోయింది. ఆమెకు పరాభవాగ్ని వలన రాత్రి నిద్రపట్టలేదు. ఆమెను రక్షించవలసిన, శత్రువును శిక్షించవలసిన భీముడు మాత్రం నిశ్చింతగా నిద్రపోతున్నాడు. శత్రువును నిద్ర పోనిస్తున్నాడు. తనకొరకు మేల్కొని ఉండవలసిన భర్తలు నిశ్చింతగా నిద్రపోవటం, శత్రువు సుఖంగా ఉండటం అనే ఆ విపరీతస్థితిని చెప్పి అధిక్షేపిస్తూనే దానికి కారణాన్ని కూడా సంభావించింది. భీముడి నిశ్చింతకు కారణం ధర్మరాజు అతడి పరాక్రమాన్ని వారించటంగా ఊహించింది. ఇందులో భీముడిపై అధిక్షేపమూ ఉన్నది; దానికి తగిన కారణం ఉండటం వలన సమర్థనీయమనే సాంత్వనమూ ఉన్నది. ద్రౌపది మాటలలో పృథక్పదత్వంతో కూడి శబ్దగుణ మాధుర్యమూ ఉన్నది. ఉక్తివైచిత్ర్యంతో కూడిన అర్థగుణమాధుర్యమూ ఉన్నది. పతిహృదయాన్ని తన కనుకూలంగా మార్చుకొనే నేర్పును మాధుర్య గుణ వ్యంజితం చేయటం సార్థకం. (సంపా.)

వ. అనుచు మంద మంద సంభాషణంబుల సంబోధించు పాంచాలి పాణి స్పర్శంబున మేలుకని 'యిది యెవ్వ' రనవుడు? నే' నను నమ్మానిని యెలుంగెఱింగి భీమసేనుండు 'యాజ్ఞసేని కీచకు దురాచరణంబు నాకుఁ బ్రకటించి వాని నిర్జింప నియోగించునదియై యరుగుదెంచెంగా వలయు; నత్తెఱం గిత్తెఱవ దాన చెప్పవిందు' నని తలంచి. 146

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; మంద మంద సంభాషణంబులన్= మెల్లమెల్లని మాటలతో; సంబోధించు= పిలిచే; పాంచాలి= ద్రౌపది యొక్క; పాణిస్పర్శంబునన్= చేతి తాకుడుకు; మేలుకని= నిద్రలేచి; ఇది ఎవ్వరు= ఎవరది?; అనవుడున్= అనగా; నేను= నేను (ద్రౌపదిని); అను+అ+మానిని= అనే ద్రౌపది యొక్క; ఎలుంగు= గొంతు సవ్వడి; భీమసేనుండు= భీముడు; ఎఱింగి= గుర్తించి; యాజ్ఞసేని= ద్రౌపది; కీచకు దురాచరణంబు= కీచకుడు చేసిన అవినీతి; నాకున్+ప్రకటించి= భీమునికి తెలియజెప్పి; వానిన్ నిర్జింపన్= కీచకుడిని చంపటానికి; నియోగించునది+ఐ= ప్రేరేపించటానికై; అరుగు దెంచెన్+కావలయున్= వచ్చింది కాబోలు; ఆ+తెఱంగు= ఆ పద్ధతి; ఈ+ తెఱవ=ఈ ద్రౌపది; తాన్+అ= తానే; చెప్పన్విందున్= చెప్పగా వింటాను; అని తలంచి= అనిభావించి

తాత్పర్యం: అని మెల్లమెల్లగా మాట్లాడుతూ చేతితో తాకగా ద్రౌపది స్పర్శకు భీముడు మేల్కొని, ఎవరు? అని అనగా, నేనని ద్రౌపది బదులు పలికింది. కీచకుడి దుష్టకార్యాలను తెలిపి వాటిని మట్టుపెట్టటానికి తనను ప్రేరేపించటానికి వచ్చిందని భీముడు భావించాడు. ఆ సంగతి ఆమె నోటనే వినాలని అనుకొన్నాడు.

విశేషం: లోక సహజమైన విషయాన్ని ఇక్కడ తిక్కన చూపాడు. రాత్రిపూట సహజంగా భార్యాభర్తలు ఒకరి గొంతు ఒకరు పోల్చుకొనగలరు. 'నేను' అంటే చాలు. ఫలానా ద్రౌపదిని అని చెప్పనక్కరలేదు. అదే మాట అన్నది ద్రౌపది.

తే. 'ఇంత ప్రొద్దేల యిచ్చోటి కేఁగుదేరఁ।
గారణం బేమి? యెవ్వరుఁ గానకుండు
నట్లుగాఁ జనుదెంచితె యంబుజాక్షి!'।
యనిన నయ్యింతి యిట్లను నతని తోడ. 147

ప్రతిపదార్థం: అంబుజాక్షి!= ఓ ద్రౌపదీ!; ఇంతప్రొద్దు= ఇంత రాత్రివేళ; ఏల= ఎందుకు?; ఈ+చోటికిన్= ఇక్కడికి; ఏఁగు+తేరన్= రావటానికి; కారణంబు+ఏమి?= కారణమేమి?; ఎవ్వరున్+కానకుండునట్లుగాన్= ఎవరూ చూడకుండా; చను+తెంచితె?= వచ్చావా? అనినన్= అని భీముడనగా; ఆ+ఇంతి= ద్రౌపది; అతనితోడన్ ఇట్లు+అనున్= భీముడితో ఇట్లా అన్నది.

తాత్పర్యం: 'ఓ ద్రౌపదీ! ఇంత ప్రొద్దుపోయిన తర్వాత ఇట్లా ఎందుకొచ్చావు? కారణమేమిటి? ఎవరూ చూడకుండా వచ్చావా?' అని భీము డనగా ద్రౌపది ఇట్లా పలికింది.

విశేషం: ద్రౌపది రాకకు కారణం భీము డిదివరకే ఊహించాడు. కాని, ఆమె నోటనే వినాలని ఈ ప్రశ్నలు వేశాడు. నడిరేయి రాకకూ, రహస్య భాషణకూ ఏదో రహస్యమైన కారణమే ఉండాలి. అయితే ఆమెరాకగానీ, ఆమెమాటలుగానీ మరెవ్వరికీ తెలియకుండా జాగ్రత్త వహించటం జరిగిందా? అని ప్రశ్నించి అజ్ఞాతవాస వ్రత స్పృహను ప్రకటించాడు భీముడు. (సంపా.)

చ. 'ఎఱిఁగి యెఱింగి నన్నడుగ నేమిటి? కప్పు డెఱింగి యింతకు
న్మఱచుట గల్గెనే, నది వినం బనిలే; దటుగాక యున్నరూ
పెఱిఁగియు నేన చెప్ప విన నిష్టము గల్గుట చాల లెస్స; య
త్తెఱఁగెఱిఁగించెదన్ వినుము తెల్లముగా మొదలింటినుండియున్. 148

ప్రతిపదార్థం: ఎఱిఁగి+ఎఱింగి= తెలిసి తెలిసి; నన్నున్+అడుగన్+ఏమిటికిన్= నన్నడగటం దేనికి?; అప్పుడు= ఆ సమయంలో (కొలువు దగ్గర జరిగిన సంఘటన సందర్భంలో,); ఎఱింగి= తెలిసి; ఇంతకున్+మఱచుట= ఇంతలో మరచిపోవటం; కల్గెన్+ఏన్= జరిగివుంటే; అది వినన్+పనిలేదు= దానినిగూర్చి విన నవసరం లేదు; అటు+కాక= అట్లాకాక; ఉన్న రూపు+ఎఱిఁగియున్= ఉన్నదంతా తెలిసి కూడా; నేను+అ చెప్పన్+వినన్= నేనే చెప్పగా వినాలని; ఇష్టము+కల్గుట= ఇష్టపడటం; చాల లెస్స= చాలా బాగుంది; మొదలింటి నుండియున్= మొదటి నుండీ; ఆ తెఱఁగు= ఆ ప్రకారం; తెల్లముగాన్= సవిస్తరంగా; ఎఱిఁగించెదన్= వివరిస్తాను; వినుము= వినుము.

తాత్పర్యం: 'భీమసేనా! తెలిసి తెలిసీ నీవు నన్ను ఎందు కడుగుతావు? కొలువులో జరిగింది చూశావుకదా! ఇంతలోనే మరిచిపోతే నేను చెప్పపనిలేదు. నీవు విన నవసరం లేదు. అట్లాకాక ఉన్నదంతా నా నోటితో వినాలని ఉంటే సరే, తేటతెల్లంగా చెప్పుతాను విను.

విశేషం: 1. ద్రౌపది వివేకవతి - భీముడు తెలిసి తెలిసి కావాలని అడుగుతున్నాడని పసిగట్టింది. ఆమె గడుసరి. సూర్యోదయ సమయాన కొలువులో తెలిసికొన్న సంగతిని చంద్రోదయ సమయానికి మరచిపోయేవారికి జ్ఞాపకం చేసి కూడా ప్రయోజనం లేదులే అని ఎత్తిపొడిచింది. అది మరువరానిదని కూడా గూఢంగా హెచ్చరించింది. ద్రౌపది పరేంగితజ్ఞురాలు. ఎదుటివారి మనసును పసిగట్టగల సూక్ష్మబుద్ధి కలది. అందువలననే తన నోట స్వయంగా వినాలనే కోరికతో భీము డడుగుతున్నట్లుగా నిశ్చయించి విషయం తెల్లమయ్యేటట్లు చెప్పనా రంభించింది.

2. తెల్లమయ్యేటట్లు చెప్పటమంటే - జరిగిన కథలోని వివరాల జోలికి పోకుండా తాత్పర్యం బోధనపడేటట్లు, ప్రధానాంశాలు వదలకుండా చెప్పటమన్న మాట. పునఃకథనంలో ఈ కథాకథన శిల్పాన్ని తిక్కన ప్రయోగిస్తున్నాడని సూచన.

3. విరాటుడి సభవద్ద ద్రౌపదికి కీచకుడివలన కలిగిన అవమానం భీముడికి తెలుసుకాని, దాని వివరాలు తెలియవు. ఆ సన్నివేశమే భీముడిలో రౌద్రాగ్నిని ప్రకోపింపచేసింది. దానిని ధర్మరాజు చల్లార్చాడు. ఆ కోపాగ్ని మరల ప్రజ్వలించ బడాలి. అందుకు ద్రౌపదినోట కథనంతా భీముడు వినాలి. శత్రుకృత పరాభవ శ్రవణం- అందులోనూ అవమానిత అయిన అర్ధాంగి చెప్పగా వినటం, భీముడిలో శత్రుసంహార సమర్థమైన రౌద్రోద్రేకానికి సమర్థమైన కారణం కాగలదు. తిక్కన రసాభ్యుదయోల్లాస శిల్పంలో ఇదొక సంవిధానం. (సంపా.)

చ. అధిపు మఱంది సింహబలుఁ డప్పకు మ్రొక్కఁగ వచ్చి నన్నున
త్యధికమనోజ రాగ మతియై కనుఁగొంచుఁ గడంగి యెన్నియేన్
విధములఁ బల్కి నాకుఁ దన విన్నను వెల్లను జూపి చెప్పి మా
నధన విహీనతం జెనకినం గడునేవము పుట్టి యయ్యెడన్. 149

ప్రతిపదార్థం: అధిపుమఱంది= విరాటుని బావమరిది; సింహబలుఁడు= కీచకుడు; అప్పకున్ మ్రొక్కఁగన్+వచ్చి= అక్కకు నమస్కరించడానికి వచ్చి; నన్నున్= ద్రౌపదిని; అతి+అధికమనోజరాగమతి+ఐ= ఎక్కువైన మన్మథావేశంతో; కనుఁగొంచున్= చూస్తూ; కడంగి= ప్రయత్నించి; ఎన్నియేన్ విధములన్+పల్కి=

ఎన్నో రకాలుగా మాట్లాడి; నాకున్= ద్రౌపదికి; తన విన్ననువు= తన నేర్పరితనం; ఎల్లన్+చూపి= అంతా ప్రదర్శించి; చెప్పి= తననుగురించి తాను పొగడికొని; మానధనవిహీనతన్= సిగ్గులేకుండా; చెనకినన్= సమీపించగా; ఆ+ఎడన్= అక్కడ; కడున్+ఏవముపుట్టి= మిక్కిలి అసహ్యం కలిగి.

తాత్పర్యం: ఓ భీమసేనా! విరాటుడి బావమరిది కీచకుడు తన అక్క సుదేష్ణకు మ్రొక్కటానికి వచ్చి, నన్ను మదనావేశంతో చూస్తూ ఎన్నో రకాలుగా మాట్లాడి తన నేర్పరితనం చూపించి, పొగడికొని, సిగ్గులేకుండా నన్ను సమీపించాడు. అప్పుడు నాకు అసహ్యం కలిగింది.

విశేషం: 1. ఉ.వి. సం. ప్రతిలో "చూచి చెప్పి'' అని ఉన్నది. దానికంటె "చూపి చెప్పి'' అనే పాఠం పొసగుతుంది. కాబట్టి ఇక్కడ గ్రహించటమైనది. కీచక ప్రథమ సన్నివేశంలోని అంశాల నన్నింటిని బీరువోకుండా ఈ పద్యంలో సూచించింది. అవి- మదనాతిశయంతో చూడటం, ఎన్నో రకాలుగా విలాసంగా మాట్లాడటం, తన నేర్పరితనాన్ని చూపటం, పొగడుకొనటం. అంతటితో ఆగకుండా తాకటానికి దగ్గరికి రావటం-ఇవన్నీ మదనాతురుడు ప్రదర్శించే చేష్టలే. వాటన్నిటిలో సిగ్గులేనితనం కనబడింది ద్రౌపదికి. అందువలన ఆమెకు ఏవగింపు కలిగింది. కీచకుడు మదనాతురుడైనా, ద్రౌపది అతడిపట్ల ఏవగింపు ప్రదర్శించిందని తాత్పర్యం. భీముడికి కీచకుడి వర్తనం కోపాన్నీ, ద్రౌపది వర్తనం సానుభూతినీ కలిగిస్తాయి. (సంపా.)

క. విడియం బలుకఁగ వెండియు।
నుడుగక కీచకుఁడు మన్మథోన్మాదము ద
న్నడరిన న న్నడుగుటకుం।
దొడరినఁ గోపించి వానితో నిట్లంటిన్. 150

ప్రతిపదార్థం: విడియన్= నన్ను వదలిపోయేటట్లు; పలుకఁగన్= మాట్లాడగా; వెండియున్= మరల; ఉడుగక= వదలిపెట్టక; కీచకుఁడు; మన్మథ+ ఉన్మాదము= మదనుని పిచ్చి; తన్నున్= కీచకుడిని; అడరినన్= అధికంగా ఆవహించగా; నన్నున్+ అడుగు టకున్= నన్ను కోరటానికి; తొడరినన్= ప్రయత్నించగా; కోపించి= కోపపడి; వానితోన్+ఇట్లు+ అంటిన్= ఆ కీచకుడితో ఇట్లా అన్నాను.

తాత్పర్యం: అతడిని విదిలించినట్లు నేను మాట్లాడినా అతడు మత్తెక్కిన మదనావేశంతో నన్ను కామంతో కోరగా, వాడిమీద కోపించి నే నిట్లా అన్నాను.

విశేషం: వెనుక పద్యంలో ద్రౌపది కీచకుడు మనోజరాగమతితో వ్యవహరించిన తీరు చెప్పింది. ఈ పద్యంలో మదనోన్మాదావస్థను ప్రకటించిన విధం తెలిపింది. 'అడుగుట' అనే క్రియకు తెలుగులో కామకేళికి పిలవటం అనే అర్థం ఉంది. అది ఉన్మాదావస్థకు చిహ్నంగా చెప్పింది. (సంపా.)

శా. దుర్వారోద్యమ బాహు విక్రమరసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతు
ల్గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసన్ గిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా! 151

కీచకవధ ప్రయత్నం (ఈ పద్యానికి అర్థ తాత్పర్యాలు 55వ పద్యం వద్ద ఇవ్వబడ్డాయి.)

విశేషం: ఈ పద్యం కీచకుడిని బెదిరించటానికి అప్పుడు పలికింది. ఇప్పుడు కీచకుడి ముందు పాండవ ప్రతాపాన్ని కీర్తించిన పద్ధతిని భీముడికి తెలియజెప్పటమే కాక, 'ఇప్డు నిను దోర్లీలన్ వెసన్గిట్టి.. మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిన్' అని తానన్న మాటలు నిజం చేయవలసిన అవసరం వచ్చిందని భీముడికి పరోక్షంగా సూచించటానికి అవే మాటలు తు-చ తప్పక పునరుక్తం చేయటం జరిగింది. ఇకముందు భీముడు కీచకవధప్రయత్నం చేస్తాడనీ, అందులో దుర్వార ఉద్యమం, బాహువిక్రమం, గర్వాంధ ప్రతివీరనిర్మథన విద్యా ప్రదర్శనం అనే దశలు స్ఫురిస్తాయని ధ్వని. (సంపా.)

వ. అనిన విని వాఁడు గొన్ని ప్రల్లదంబులు పలికిన నేనునుం దత్కాలోచిత వచనం బులం ద్రోచిపుచ్చినం బోయెఁ; బదంపడి పాపాత్మయైన సుదేష్ణ తనకు మదిరారసంబు దేరం గీచక నివాసంబునకు నన్నుం బనిచినం బోవుట కొడంబడక, యెన్ని సెప్పిన నన్నింటికి నన్ని సెప్పి నిర్బంధించినం బెద్ద పెనంగ నొల్లక నా మనంబున నన్నెవ్వరికి నేమి సేయవచ్చు నని మీలావు నచ్చి సూతునింటికి సురకుం బోయిన. 152

ప్రతిపదార్థం: అనినన్, విని= అనగా విని; వాఁడు= కీచకుడు; కొన్ని ప్రల్లదంబులు= కొన్ని వదరుబోతుమాటలు; పలికినన్=పలుకగా; నేనునున్= నేనుకూడా; తద్+కాలోచిత వచనంబులన్= ఆ సమయానికి తగిన మాటలతో; త్రోచిపుచ్చినన్= త్రోసివేయగా; పోయెన్= పోయాడు; పదంపడి= మళ్ళీ; పాపాత్మ+ఐన= పాపిష్ఠిదైన; సుదేష్ణ; తనకున్; మదిరారసంబు= కల్లు; తేరన్= తీసికొనిరమ్మని; కీచక నివాసంబునకున్= కీచకుడి ఇంటికి; నన్నున్+పనిచినన్= నన్ను పంపగా; పోవుటకున్+ఒడంబడక= పోవటానికి ఇష్టపడక; ఎన్ని చెప్పినన్= ఎన్ని కారణాలు చెప్పినా; అన్నింటికిన్+అన్ని+చెప్పి= అన్నిటికీ అన్ని విధాల అడ్డంకులు చెప్పి; నిర్బంధించినన్= బలవంతం చేయగా; పెద్ద పెనంగన్= చాలాసేపు ఘర్షణపడటం; ఒల్లక= ఇష్టం లేక; నా మనంబునన్= నా మనస్సులో; నన్నున్+ ఎవ్వరికిన్+ఏమిచేయవచ్చున్+అని= నన్ను ఎవరేమి చేయగలరనే ధైర్యంతో; మీలావు నచ్చి= మీ బలంపై నమ్మకంతో; సూతుని+ఇంటికిన్= కీచకుడి ఇంటికి; సురకున్= కల్లుతేవటానికి; పోయినన్= పోవగా.

తాత్పర్యం: కీచకుడు ఎన్నో రకాల వదరుబోతు మాటలు పలుకగా, నేను సమయో చితంగా మాట్లాడి త్రోసిపుచ్చాను. ఎట్టకేలకు అతడు మరలిపోయాడు. కాని, ఆ తరువాత పాపాత్ముంరాలైన ఆ సుదేష్ణ మాత్రం నన్ను కల్లు తెమ్మని కీచకుడి ఇంటికి పొమ్మని ఆజ్ఞాపించింది. నేను పోనని వాదించినా ఆమె వినలేదు. నే నెన్ని కారణాలు చెప్పినా, అన్నింటికీ ఆమె అడ్డంకులు చెప్పి

బలవంతపెట్టింది. ఎక్కువగా ఘర్షణ పడటం బాగుండదని తలచి, నా మదిలో మీ బలసంపన్నతపై ఉన్న నమ్మకంతో, నన్ను ఎవ్వరూ ఏమీ చేయలేరని నిశ్చయించుకొని కీచకుడి ఇంటికి కల్లు తెద్దామని వెళ్ళాను.

క. కొన్ని వెడమాట లాడుచు।
నన్ను నతఁడు చెట్టవట్టినం ద్రోచి వెసం
జన్న వెనుకొనుటయును మీ।
యున్నెడ కే నపుడు సంభ్రమోపేతగతిన్. 153

ప్రతిపదార్థం: అతఁడు= కీచకుడు; కొన్ని వెడమాటలు+ఆడుచున్= కొన్ని అసందర్భపు మాటలు పలుకుతూ; నన్నున్= ద్రౌపదిని; చెట్ట+పట్టినన్= చేయిపట్టుకోగా; త్రోచి,వెసన్+ చన్నన్= తొలగద్రోసి వెళ్ళగా; వెనుకొనుట యును= వెంబడించగా; మీ+ఉన్న+ ఎడకున్= మీరున్నచోటికి; సంభ్రమ+ ఉపేతగతిన్= వేగిరపాటుతో కూడిన నడకతో; ఏను+అపుడు= నేను (ద్రౌపది) అప్పుడు.

తాత్పర్యం: కీచకుడు కొన్ని అసందర్భపు మాటలాడుతూ నన్ను చేయిపట్టుకొనపోగా, నేను వాడిని తొలగద్రోసి పోసాగాను. వాడు నన్ను వెంబడించాడు. నే నప్పుడు వడివడిగా మీరున్న చోటికి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. పాఱుతెంచిన నక్కులపాంసనుండు।
గోప మడరంగ వెనుకన కూడముట్టె;
నట యెఱుంగుదు వీవు; మీ యన్న పెద్ద।
తనముఁ జూచితి; వేమందు ననిలతనయ! 154

ప్రతిపదార్థం: పాఱుతెంచినన్= పరుగెత్తి రాగా; ఆ+కులపాంసనుండు= ఆ కులభ్రష్టుడు; కోపము+అడరంగన్= కోపం ఎక్కువకాగా; వెనుకన కూడముట్టెన్= వెంబడించి పట్టు కొన్నాడు; అట= అప్పటినుండి;

అనిలతనయ!= భీమా!; నీవు+ఎఱుంగుదు(వు)= నీకు తెలుసు; మీ+అన్న= ధర్మజుడియొక్క; పెద్దతనము చూచితివి= గొప్పతనం చూచావు; ఏమందును?= ఇంక ఏమి చెప్పగలను?

తాత్పర్యం: నే నట్లా పరుగెత్తి రాగా ఆ కులభ్రష్టుడైన కీచకుడు నన్ను వెంబడించి వచ్చి పట్టుకొన్నాడు. ఆ సభలో ఏం జరిగిందో నీకు తెలుసు. మీ అన్న ధర్మజుడు చూపిన పెద్దతనం చూచావు. ఇంక అంతకన్నా ఎక్కువ ఏమి చెప్పగలను?

విశేషం: సభలో పెత్తనం నిర్వహించేవారు ఎట్లా ప్రవర్తిస్తారో, ధర్మానికి ఎట్లా విఘాతం కలుగుతుందో ద్రౌపది ఇక్కడ ఎత్తిపొడిచింది.

ఉ. మీ సుభటత్వమున్ బలము మిన్నకపోవఁగ దుస్ససేనుఁ డ
ట్లా సభలోన నన్ బఱిచె; నంతియకాక జయద్రథుండు సం
త్రాసభరంబు లే కనుచితం బొనరించినఁ జెల్లిపోయె; నేఁ
డీ సభికుల్ గనుంగొనఁగ నిట్లయితిన్; వగ నాకు వింతయే! 155

ప్రతిపదార్థం: మీ సుభటత్వమున్= మీ పరాక్రమమూ; బలమున్= శక్తీ; మిన్నకపోవఁగన్= వమ్మయిపోగా; దుస్ససేనుఁడు= దుశ్శాసనుడు; అట్లు+ఆ సభలోనన్= ఆ విధంగా ఆ సభలో; నన్+పఱిచెన్= నన్ను అవమానించాడు; అంతియకాక= అంతేకాక; జయద్రథుండు= సైంధవుడు; సంత్రాసభరంబు లేక= ఎట్టి భయం లేకుండా; అనుచితంబు+ఒనరించినన్= ఉచితంకాని పనిచేయగా; చెల్లిపోయెన్= చెల్లుబాటు అయింది; నేఁడు= ఈ రోజు; ఈ సభికుల్= విరాటుడి కొలువులో సభ్యులు(జూదరులని); కనుంగొనఁగన్= చూడగా; ఇట్లు+అయితిన్= ఈ విధంగా అయ్యాను; నాకున్= ద్రౌపదికి; వగ= దుఃఖం; వింతయే!= క్రొత్తగాదు కదా!

తాత్పర్యం: మీ బలపరాక్రమాలు వమ్మయిపోయాయా అన్నట్లు ధృతరాష్ట్రుడి కొలువులో దుశ్శాసనుడు నన్ను అవమానించాడు. అంతేకాక, సైంధవుడు నన్ను

నిర్భయంగా అట్లా తీసికొని పోయి అనుచితం చేసినా చెల్లిపోయింది. ఈనాడు విరాటుడి కొలువులో సభాసదులందరూ చూస్తూ ఉండగా వీడు ఈ విధంగా చేశాడు. అయినా మిమ్ములను అనుకొని ప్రయోజనం లేదు. దుఃఖపడటం నాకీనాడు క్రొత్తగాదుగదా!.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ద్రౌపది జన్మించినదాది కష్టాల ననుభవిస్తున్నది. పాండవపత్ని అయినది మొదలు ఆమెకు కడగండ్లు చుట్టుముట్టాయి. దుశ్శాసనుడు నిండు కొలువులో వస్త్రాపహరణ ప్రయత్నం చేశాడు. భర్తలంతా చూస్తూ నిలుచుండిపోయారు. కృష్ణుడు రక్షించాడు. వనవాసకాలంలో సైంధవుడు ద్రౌపదిని నిర్భయంగా తీసికొని వెళ్ళాడు. పాండవులు విడిపించుకొని వచ్చారు. ఇన్ని అవమానాలకు తలదన్నేటట్లు ఈనాడు నీచకీచకుడు భర్తలూ, సభ్యులూ చూస్తుండగా తన్నాడు. కాని, పాండవులు అజ్ఞాతవాస భయంతో సభలో ఏమీ చేయలేకపోయారు. 'వగనాకు వింతయే' - అనే సామాన్యాంశంచేత విశేషాంశం సమర్థించబడింది. కాబట్టి అర్థాంతరన్యాసాలంకారం.

ఆ. అకట! యాఁడుకూయు నాలకూయును లాఁతి।
వారికైన నరయవలయు ననిన
నన్నుఁ గీచకుండు దన్నంగ నెట్టులు।
సూడ నేర్చె ధర్మసూనుఁ డపుడు.' 156

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; ఆఁడుకూయున్= ఆడదాని ఏడుపును; ఆలకూయును= ఆవుల అరుపును; లాఁతివారికైనన్= పరులకైనా; అరయన్+వలయు+అనినన్= గమనించి రక్షించాలి అని లోకంలో ప్రసిద్ధి ఉండగా; నన్నున్= ద్రౌపదిని; కీచకుండు+ అపుడు= అప్పుడు కీచకుడు; తన్నంగన్= తన్నగా; ధర్మసూనుఁడు= ధర్మజుడు; ఎట్టులు+ చూడన్నేర్చెన్?= ఎట్లా చూడగలిగాడు?

తాత్పర్యం: స్త్రీరోదనాన్నీ, గోమాత అరుపునూ విన్నప్పుడు పరాయివారైనా వారిని పట్టించుకొని రక్షించటం లోకపరిపాటి. అట్లాంటిది ఆ సభలో కీచకుడు నన్ను తన్నగా చూచి ధర్మజుడు చూస్తూ ఎట్లా ఉండిపోయాడు?'

విశేషం: భర్తల సమక్షంలో అవమానాన్ని పలుమార్లు పొందటం భరించరానిదిగా ఉన్నదని ద్రౌపది భావం.

వ. అనిన విని యతం డిట్లనియె. 157

తాత్పర్యం: ఆ మాటలు విని భీము డిట్లా అన్నాడు.

ఉ. 'కీచకుఁడట్లు మీఁదు పరికింపక నిన్నుఁ బరాభవింపఁగాఁ
జూచి మహోగ్రకోప వివశుండగు నన్నును జూచి ధైర్య హే
మాచలుఁడైన ధర్మసుతుఁ డమ్మెయి వారణ సేయకున్న నే
నీచత వాని మత్స్యవిభునిం బరివారము నుగ్గు సేసినన్. 158

ప్రతిపదార్థం: కీచకుఁడు; అట్లు మీఁదు పరికింపక= ఆ విధంగా క్రిందుమీదులు చూడక; నిన్ను పరాభవింపఁగాన్+చూచి= ద్రౌపది నవమానించటం చూచి; మహా+ఉగ్ర కోపవివశుండు+అగు= అధికమైన కోపావేశంతో ఉన్న; నన్నును+చూచి= భీముడిని చూచి; ధైర్యహేమ+అచలుఁడు+ఐన= ధైర్యంలో మేరుపర్వత సమానుడైన; ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఆ+మెయిన్= ఆ విధంగా; వారణచేయక+ఉన్నన్= నివారించనిచో; నేన్= భీముడు; నీచతన్= హీనంగా; వానిన్= కీచకుడినీ; మత్స్యవిభునిన్= విరాటుడినీ; పరివారమున్= సేనలనూ; నుగ్గుచేసినన్= మట్టుపెట్టినట్లయితే.

తాత్పర్యం: 'కీచకుడు క్రింది మీదులు చూడకుండా ఆ విధంగా నిన్ను పరాభవించటం చూచి కోపావేశంతో ఒడలు తెలియని నన్ను చూచి, ధైర్యంలో మేరుపర్వత సమానుడైన ధర్మజుడు నన్ను అడ్డుపెట్టకపోతే కీచకుడిని, విరాటుడిని, అతని సేనలను నేను మట్టుపెట్టి ఉండేవాడిని.

విశేషం: ధర్మరాజును నిర్దయుడిగా చిత్రించింది ద్రౌపది. అది పరిభవ వేదన వలననే కావచ్చును. 'మీ అన్న పెద్దతనము' అని ఎత్తిపొడిచింది. దానికి భీము డిచ్చిన సమాధాన మిది. భార్యను పరిభవించిన కీచకుడిని ఒకవైపు చూచాడు ధర్మరాజు, ఆ దృశ్యాన్ని చూచి మహోగ్రకోపవివశుడైన భీముడిని మరొక వైపు

చూచాడు. మొదటి దృశ్యం చూచి భీముడివలె ధర్మజుడూ కోపావేశంతో విజృంభించి ఉండాలి. భీముడి ఆవేశాన్ని చూచి అభినందించిఉండాలి. కాని, అతడు మేరుపర్వతంవలె స్థిరచిత్తుడై ఉండిపోయాడు. స్థైర్యాన్ని పర్వతంతో పోల్చి చెప్పటం కవిసమయం. పర్వతాలలో శ్రేష్ఠమైనది మేరుపర్వతం కాబట్టి ధీరులలో అగ్రగణ్యుడు ధర్మజుడని భీముడి భావం. (సంపా.)

వ. ఆ సంరంభంబున సమయభంగంబుగా జనంబులు మనల నెఱింగిరయేని 159

ప్రతిపదార్థం: ఆ సంరంభంబునన్= ఆ సంక్షోభంలో; సమయభంగంబు+కాన్= అజ్ఞాత వాస ప్రతిజ్ఞ చెడిపోగా; జనంబులు= లోకులు; మనలన్+ఎఱింగిరి+అ+ఏని= మనలను కనిపెడితే.

తాత్పర్యం: ఆ ఉద్రిక్త పరిస్థితిలో అజ్ఞాతవాస ప్రతిజ్ఞావాస ప్రతిజ్ఞాపాలన వమ్మయిపోయి, లోకులు మనలను గుర్తిస్తే, (తరువాతి పద్యంతో అన్వయం).

క. ముందటి భంగిన కానల।
యందుఁ జరింపంగ వలదె? యది నీవును నే
నుం దెచ్చిన యాపదగా।
నిందింపరె యెల్లవారు నీరజనయనా! 160

ప్రతిపదార్థం: నీరజనయనా!= పద్మాక్షీ, ద్రౌపదీ!; ముందటిభంగిన్+అ= ఇంతకుముందు వలెనే; కానల+అందున్= అరణ్యాలలో; చరింపంగవలదె!= తిరగాలికదా!; అది= ఆ స్థితి; నీవును నేనున్= నీవూ నేనూ; తెచ్చిన= తెచ్చిపెట్టిన; ఆపదకాన్= ఇబ్బందిగా; ఎల్లవారు= అందరూ; నిందింపరు+ఎ?= ఆడిపోసుకోరా?

తాత్పర్యం: ఓ ద్రౌపదీ! అట్లా చేసి ఉంటే ఇంతకు ముందువలె మళ్ళీ అరణ్యవాసం చేయవలసి వచ్చేది. అది నీవూ నేనూ కలిసి కల్పించిన ఆపదగా జనులందరూ నిందించరా?

విశేషం: పంచపాండవులలో భీముడు ఉద్ధతుడు. అతడి వలన ఏదో ఒక ఆపద వస్తుందని లోకులు అనుకొనటం పరిపాటి. మాటపడకుండా చూచుకొనాలని భీముడి తపన.

వ. కావున సత్యవ్రత నిష్ఠుండగు యుధిష్ఠిరుండు పొగడ్తకుం దగువాఁడుగాని దూఱువడ నర్హుండుగాఁ' డని వెండియు నిట్లనియె. 161

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; సత్యవ్రత నిష్ఠుండు+అగు= ఆడిన మాటకు కట్టుబడి ఉండే; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; పొగడ్తకున్= ప్రశంసకు; తగువాఁడు+కాని= అర్హుడే కాని; దూఱు+పడన్= నింద పడటానికి; అర్హుండు+కాఁడు= తగడు; అని వెండియున్= అని మరల; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆడిన మాటలకు లోబడి ఉండే స్వభావం గల ధర్మరాజు ప్రశంసా పాత్రుడేకాని, నిందార్హుడు కాడు' అని భీముడు మరల ఇట్లా అంటున్నాడు.

విశేషం: ధర్మరాజు వర్తనానికి మూలకారణం అతడి సత్యవ్రత నిష్ఠయే అని భీముడి వ్యాఖ్య. (సంపా.)

క. 'పరిభవకరుఁడగు కీచకుఁ।
బరిమార్చుట యిపుడు గడవఁబడియెనె? యిమ్మై
దురపిల్ల నేల? వ్రేల్మిడిఁ ।
బొరిగొని నీ మనము కలఁక పుత్తు లతాంగీ! 162

ప్రతిపదార్థం: లతాంగీ!= తీగవంటి కోమలమైన శరీరం కలదానా, ద్రౌపదీ!; పరిభవకరుఁడు+అగు= అవమానం కలిగించిన; కీచకున్= కీచకుడిని; పరిమార్చుట= చంపటం; ఇపుడు= ఇప్పుడు; కడవన్+పడియెనె?= దాటిపోయిందా?; ఈ+మెయిన్= ఈ విధంగా; దురపిల్లన్+ఏల?= బాధపడట మెందుకు?; వ్రేల్మిడిన్= వెంటనే; పొరిగొని= చంపి; నీ మనము= నీ మనస్సులోని; కలఁకపుత్తున్= దుఃఖాన్ని పోగొట్టుతాను.

తాత్పర్యం: 'ద్రౌపదీ! నిన్ను అవమానించిన కీచకుడిని మట్టుపెట్టటం ఇప్పటికైనా మించిపోలేదు. ఈ విధంగా నీవు బాధపడ నవసరం లేదు. నేను వెంటనే వాడిని చంపి నీ మనస్సులోని చింతను పోగొట్టుతాను.

విశేషం: ఓదార్పు మాటలు చెప్పటంలో ఇట్లా సహజంగా జరుగుతుంది. 'ఇప్పుడేం మించిపోయింది? రెండు నిమిషాలలో నీ పని పూర్తి చేస్తా'నంటే ఎదుటివారికి ఊరట కలుగుతుంది. భీము డదే చేశాడు.

వ. మనల నెవ్వరు నెఱుఁగకుండునట్టి తెఱంగు తలపోయవలయుఁగాక, పగతుని భంజించుట యెంతపని?' యనిన విని యా మానిని యిట్లనియె. 163

ప్రతిపదార్థం: మనలను= పాండవులను; ఎవ్వరున్+ఎఱుఁగక+ఉండు+అట్టి= ఎవ్వరూ గుర్తుపట్టని; తెఱంగు= ఉపాయం; తలపోయవలయున్+కాక= ఆలోచించాలిగాని; పగతునిన్= శత్రువును; భంజించుట= చంపటం; ఎంతపని?= సులభమే; అనినన్; విని; ఆ మానిని= ద్రౌపది.

తాత్పర్యం: మనలను లోకులు గుర్తించని రీతిలో ఉపాయం ఆలోచించాలి కాని, శత్రువును మట్టుపెట్టటం ఒక లెక్కలోనిది కాదు' అని భీముడు పలుకగా ద్రౌపది ఇట్లా అన్నది.

క. 'గొంతికి నంత వెఱవ, మీ।
కంత వెఱవ, దైవమునకు నంత వెఱవ, న
త్యంత కలుషాత్మ విరటుని।
కాంతకు నే వెఱతుఁ బనులు గావించునెడన్. 164

ప్రతిపదార్థం: ఏన్= నేను; గొంతికిన్= కుంతికి, అత్తగారికి; అంత వెఱవన్= అంత భయపడను; మీకున్+అంత వెఱవన్= పతులైన మిమ్ములను చూచి భయపడను; దైవమునకున్+అంత వెఱవన్= దేవుడికి కూడా అంత భయపడను; అతి+ అంతకలుషాత్మ= మిక్కిలి నీచస్వభావురాలైన; విరటుని కాంతకున్= సుదేష్ణకు; పనులు కావించు+ఎడన్= సేవలు చేసేటప్పుడు; వెఱతున్= నేను భయపడతాను.

తాత్పర్యం: 'నా జీవితంలో నేను అత్తగారైన కుంతికి భయపడలేదు. పతులైన మీకు భయపడలేదు. చివరకు ఆ దైవానికి కూడా భయపడలేదు. కాని, దురాత్ముురాలైన సుదేష్ణకు సేవలు చేస్తూ అమితంగా భయపడుతున్నాను.

విశేషం: అత్తకు, పతులకు, దైవానికి కూడా భయపడవలసిన అవసరం రాలేదు. కాని, ఈనాడు సుదేష్ణ కొలువు భయంకరమని భావన.

చ. కినుకకుఁ జాల కెంతయును గీడ్పడి నా పడుపాటులెల్ల వ
మ్మునఁ గలయంగ నిట్టు లొక మూర్ఖునిచేఁ దుదిఁబోయి కోలుపో
యెనె యభిమానమ న్వగపు నేడ్తెఱ డెందము కొందలంబుఁ బొం
దిన ధృతి మాలి యేఁ బలికితిం దగవెల్ల నెఱింగియుండియున్.165

ప్రతిపదార్థం: కినుకకున్+చాలక= కోపగించటానికి అవకాశం లేక; ఎంతయును+కీడ్పడి= ఎన్నో అవమానాలు భరించి; నా పడుపాటులు+ఎల్లన్= నేను అనుభవించిన కష్టాలన్నీ; వమ్మునన్+కలయంగన్= వ్యర్థమైపోగా; తుదిన్+పోయి= చివరకు పోయి పోయి; ఇట్టులు+ఒక= ఈ విధంగా ఒక; మూర్ఖునిచేన్= నీచుడైన కీచకుడిచేత; అభిమానము= పరువు; కోలుపోయెనె?= నశించిందా? అను, వగపు= అనే దుఃఖంయొక్క; ఏడ్తెఱన్= అతిశయంతో; డెందము= హృదయం; కొందలంబున్+పొందినన్= కలత చెందగా; ధృతిమాలి= ధైర్యాన్ని కోల్పోయి; తగవు+ఎల్లన్= న్యాయమంతా; ఎఱింగి+ఉండియున్= తెలిసికూడా; ఏన్+పలికితిన్= నేను మాట్లాడాను.

తాత్పర్యం: కోపతాపాలు తెలుపుకొనే వీలు లేక ఎన్నో అవమానాలను భరించి నేను పడే పాట్లన్నీ వ్యర్థమైపోగా, చివరకు మూర్ఖుడైన ఈ కీచకుడి వలన ఆత్మగౌరవం కోల్పోవలసి వచ్చిం దనే దుఃఖంతో మంచీ చెడూ తెలిసినదానినైనా మనసు కలత చెందటం చేత ఇట్లా అన్నానుగాని, ధర్మరాజు గొప్పతనం తెలియనిదానిని కాను.

విశేషం: ఆత్మగౌరవం కోల్పోయే అవమానం కలిగినప్పుడు ఎంతటి వివేకవంతులైనా విజ్ఞతను కోల్పోయి మాట్లాడటం సహజం. అయితే, ఉత్తములు తమ పొరపాటు తెలిసికొని వెంటనే తమను తాము సరిదిద్దుకొంటారు. ద్రౌపది దానికి ఉదాహరణం.(సంపా.)

ద్రౌపది భీమునితో ధర్మరాజు మహిమ చెప్పుట (సం.4-17-15)

వ. ఇట్టిద కాని సమస్త జనస్తవనీయుండగు పాండవాగ్రజు నిక్కంబ నిందించినదానం గా 'నని పలికి మఱియును. 166

ప్రతిపదార్థం: ఇట్టిది+అకాని= అంతేకాని; సమస్త జనస్తవనీయుండు+అగు= జను లందరిచేతా ప్రశంసించబడే; పాండవ+అగ్రజున్= ధర్మరాజును; నిక్కంబు+అ= నిజంగా; నిందించిన దానన్+కాను= నిందించలేదు; అని పలికి; మఱియును.

తాత్పర్యం: ఇంతేకాని, జనులందరి చేత కీర్తించబడే ధర్మరాజును నిజంగా నిందించే దానిని కాను' అని పలికి ఇంకా ఇట్లా అన్నది.

క. 'ధర్మతనూభవు సంతత
ధర్మనిరతి మనము బ్రదుకఁ దలఁచుట యరుదే?
నిర్మలుఁ డగు నాతని స
త్కర్మంబునఁ గాదె బ్రదుకు ధాత్రికి నెల్లన్. 167

ప్రతిపదార్థం: ధర్మతనూభవు= ధర్మరాజు యొక్క; సంతతధర్మనిరతిన్= నిత్యధర్మ దీక్షచేత; మనము= పాండవులు; బ్రదుకన్+తలఁచుట= బ్రతకాలను కొనటం; అరుదే!= అబ్బురమా?; నిర్మలుఁడు+అగు= నిష్కల్మషుడైన; ఆతని సత్కర్మంబునన్+కాదె= ఆయన మంచి పనుల వలననేకదా; ధాత్రికిన్+ఎల్లన్= లోకానికంతా; బ్రతుకుకాదె?= మనుగడకదా!.

తాత్పర్యం: 'ఆ ధర్మరాజు ధర్మదీక్షవలన సమస్త జగత్తు రక్షించబడుతున్నది. ఆ ధర్మం వలనే పాండవులమైన మనం బ్రతకాలనుకొనటం సహజమే కదా!

విశేషం: విశ్వాన్ని ధరించేది ధర్మం. ఆ ధర్మమే మూర్తికట్టినవాడు ధర్మరాజు. ప్రపంచమే అతడి ధర్మనిరతితో బ్రతుకుతూ ఉంటే పాండవులు కూడా ఆ ధర్మ ప్రభావంతోనే బ్రతుకుతున్నా రనటంలో ఆశ్చర్య మేముంది? (సంపా.)

సీ. చనునె వేఱొకని కజాతశత్రుండను।
పేర దిగ్విజయంబు పెంపు దాల్ప?
రాజసూయ మహాధ్వరముఁ గోరి చేయంగఁ।
దీరునే పెఱధరిత్రీపతులకు?
ధర్మైకనిరతుఁ డాతం డొక్కరుఁడ చూవె।
యనఁ జన నొరులకు నలవి యగునె?
నిత్యవ్రతంబుగా సత్యంబు పాటింప।
వచ్చునె యొరుల కెవ్వరికి నైన?

తే. నయ్యుధిష్ఠిరు గాంభీర్య మతనిధైర్య।
మరయ నొండెడఁ గలుగునె? యతఁడు కీర్తి
ధరుఁడు కరుణోత్తరుఁడు మహీసుర సమృద్ధి।
కరుఁడు నిజవంశకరుఁ డుపకారపరుఁడు. 168

ప్రతిపదార్థం: అజాతశత్రుండు+అనుపేరన్= పుట్టని శత్రువులు కలవాడు అనే పేరుతో; దిగ్విజయంబు= అన్ని దిక్కులను జయించి; పెంపు+తాల్పన్= అతిశయించటం; వేఱు+ఒకనికిన్= మరొకరికి; చనునె?= సాధ్యమా?; రాజసూయ మహా+అధ్వరము= రాజసూయం అనే గొప్ప యజ్ఞాన్ని; పెఱ ధరిత్రీపతులకున్= ఇతర రాజులకు; కోరి చేయంగన్= కావాలని చేయటానికి; తీరునే?= వీలుపడుతుందా? ధర్మ+ఏకనిరతుండు= ధర్మదీక్షకలవాడు; ఆతండు+ఒక్కరుఁడు+అ చూవె= ఆయన ఒక్కడేకదా; అనన్+చనన్= అనటానికి; ఒరులకున్= ఇతరులకు; అలవి+అగునె?= సాధ్యపడుతుందా?; నిత్యవ్రతం బుగాన్= అనుదినం దీక్షగా; సత్యంబు= సత్యాన్ని; ఎవ్వరికిన్+ ఐనన్= ఎవరికైనా; ఒరులకున్= ఇతరులకు; పాటింపవచ్చునె?= పాలించ సాధ్యమా; ఆ+యుధిష్ఠిరు గాంభీర్యము= ఆ ధర్మజుడి గంభీరస్వభావం; అతని ధైర్యము= ఆయన సాహసం; అరయన్= చూడగా; ఒండు+ఎడన్+ కలుగునె?= మరొకచోట ఉంటుందా?; అతఁడు కీర్తిధరుఁడు= అతడు ఖ్యాతిని చక్కగా ధరించినవాడు; కరుణా+ఉత్తరుఁడు= దయా గుణంచేత శ్రేష్ఠుడు; మహీసుర సమృద్ధికరుఁడు= బ్రాహ్మణులకు సంపదను కలిగించే వాడు; నిజవంశకరుఁ డు= తన వంశానికి కీర్తి తెచ్చేవాడు; ఉపకార పరుఁడు= ఉపకారం చేసేవాడు.

తాత్పర్యం: అజాతశత్రుడనే బిరుదం కలిగి ఉండి కూడా దిగ్విజయం చేసి కీర్తికెక్కటం ధర్మరాజుకు తప్ప వేరొకరికి సాధ్యమౌతుందా? రాజసూయ మహాయజ్ఞాన్ని కోరి నిర్విఘ్నంగా నిర్వహించటం మిగిలిన భూపతులకు శక్యమౌతుందా? ధర్మాచార పరాయణుడని కీర్తించటానికి అత డొక్కడే తగినవాడుకాని, ఇతరుల కది వీలవుతుందా? సత్యవ్రతాన్ని నిత్యంగా పాటించటం అతడివలె ఇతరుల కెవ్వరికైనా సాధ్యమౌతుందా? ఆ ధర్మరాజుకున్న గాంభీర్యం, ధైర్యం మరొకరిలో ఎక్కడైనా కానవస్తాయా? అతడు యశస్వి, కరుణామయుడు, బ్రాహ్మణ హితకరుడు, చంద్రవంశకీర్తికరుడు, ఉపకారపరుడు.

విశేషం: అలం: ఉదాత్తం. ఎత్తుగీతిలో ధీరోదాత్త నాయక లక్షణాలు పేర్కొనబడ్డాయి. సీసపద్య పాదాలలో ఉదాత్త నాయకులందరిలో శ్రేష్ఠుడైన మహానాయకుడి లక్షణాలు చెప్పబడ్డాయి. ధీరుడంటే కష్టాలను సహించేవాడు. ఉదాత్తుడంటే తనను తాను పొగడుకొనని వాడు. దయామయుడు. హర్షశోకాదులచేత అభిభూతుడు కానివాడు. అంతేకాక గంభీరుడు, మహాసత్త్వుడు, దృఢవ్రతుడు, గూఢమానము కలవాడని లాక్షణికులు చెప్పారు. ఈ లక్షణాలన్నీ ఎత్తుగీతిలో ప్రస్తావించబడ్డాయి. ఈ లక్షణాలన్నీ ధర్మరాజు చరిత్రలో సంభవిల్లిన

నాలుగు విలక్షణాంశాలలో ధ్వనించబడుతున్నాయి. దిగ్విజయం చేసి కూడా అజాతశత్రు వనిపించుకొన్న మహాసత్త్వుడు. రాజసూయం చేయటం వలన వచ్చే ఫలితాలను గురించి తెలిసి కూడా పితృతృప్తి కొరకు సాహసంతో చేసిన ధీరుడు. ధర్మాచరణం వలన కలిగే కష్టనిష్ఠురాలను ఎదురొడ్డి నిలిచిన గంభీరుడు. సత్యవ్రతాన్ని నిత్యంగా పాటించటం వలన ఎన్ని ఆపదలు వచ్చినా ఆ వ్రతాన్ని వీడని దృఢవ్రతుడు - ఆయా గుణాలలో అతడికంటె ఘనుడు మరొక్కడు లేడని అతడి ఔదాత్యాన్ని ఉదాత్తాలంకారంలో చెప్పటం సార్థకం. (సంపా.)

క. కలిమికి నొప్పగు నీఁగియు,।
బలిమికిఁ దొడవైన యట్టి బలఁగమునై లో
కులచిత్తములకు వ్రేఁగగు।
కొలఁది మన న్గొంతి పెద్దకొడుకున కమరున్. 169

ప్రతిపదార్థం: కలిమికిన్= సంపదకు; ఒప్పు+అగు= తగిన; ఈఁగియున్= దానగుణమూ; బలిమికిన్= బలానికి; తొడవు+ఐన+ అట్టి= అలంకారప్రాయ మయిన; బలఁగమున్+ఐ= పరివారం కలవాడై; లోకుల చిత్తములకున్= జనుల హృదయాలకు; వ్రేఁగు+అగు కొలఁదిన్= అబ్బురమైన (పట్టనంత) పరిమితిచేత; మనన్= ప్రవర్తించటానికి; గొంతి పెద్దకొడుకునకున్= ధర్మరాజునకు; అమరున్= సాధ్యపడుతుంది.

తాత్పర్యం: తనకున్న సంపదకు తగినట్లుగా దానం చేస్తూ, శౌర్యానికి తగ్గట్లు సహాయ సంపత్తులూ బలగమూ కలిగి లోకుల హృదయాలు పట్టనంతగా ఆనందం కలిగించే ప్రవర్తన కొనసాగించటం ఆ ధర్మరాజుకే చెల్లింది.

విశేషం: ధనం దానం వలన ఫలిస్తుంది. శౌర్యం సహాయ సంపత్తులతో ప్రకాశిస్తుంది. ఆ రెండింటినీ సాధించిన రాజులు ప్రజల హృదయాలను చూరగొంటారు. ధర్మరాజు అటువంటివారిలో అగ్రగణ్యుడు. (సంపా.)

సీ. ఎవ్వని వాకిట నిభమదపంకంబు।
రాజభూషణ రజోరాజి నడఁగు;
నెవ్వని చారిత్ర మెల్ల లోకములకు।
నొజ్జయై వినయంబు నొఱపుఁ గఱపు;
నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి।
మానిత సంపద లీనుచుండు;
నెవ్వని గుణలత లేడు వారాసుల।
కడపటి కొండపైఁ గలయఁబ్రాఁకు;

తే. నతఁడు భూరిప్రతాప మహాప్రదీప।
దూర విఘటిత గర్వాంధకారవైరి
వీర కోటీరమణి ఘృణివేష్టితాంఘ్రి।
తలుఁడు కేవల మర్త్యుఁడె ధర్మసుతుఁడు! 170

ప్రతిపదార్థం: ఇభమద పంకంబు= ఏనుగుల మదజలం వలన నేల తడిసి ఏర్పడిన బురద; ఎవ్వని వాకిటన్= ఎవరి వాకిటి ముందు; రాజభూషణ= రాజులయొక్క అలంకారాల రాపిడివలన రాలిన; రజోరాజిన్= దుమ్ము సముదాయంచేత; అడఁగున్= అణగుతుందో; ఎల్లలోకములకున్= సమస్త లోకాలకు; ఎవ్వని చారిత్రము= ఎవని నడవడి; ఒజ్జ+ఐ= గురుత్వం వహించి; వినయంబున్+ఒఱపున్= వినయంయొక్క పద్ధతిని; కఱపున్= నేర్పుతుందో; ఎవ్వని కడకంటన్= ఎవరి కనుకొనలలో; నివ్వటిల్లెడుచూడ్కి= ప్రసరించే చూపు; మానితసంపదలు= అధిక సంపదలు; ఈనుచుండున్= కలిగిస్తూ ఉంటుందో; ఎవ్వని గుణలతలు= ఎవరి గుణాలనే తీగలు; ఏడువారాసుల= ఏడు సముద్రాల; కడపటికొండపైన్= చివరనున్న చక్రవాళ పర్వతంపై; కలయన్+ప్రాఁకున్= బాగా అల్లుకొంటుందో; అతఁడు= ఆయన; భూరిప్రతాప= గొప్ప

పరాక్రమమనే; మహాప్రదీప= గొప్పదీపంచేత; దూరవిఘటిత= దూరంగా పారదోలబడిన; గర్వాంధకార= గర్వమనే చీకటి కల; వైరివీర= శత్రురాజుల; కోటీర= కిరీటాలలో; మణిఘృణి= రత్నకాంతులచేత; వేష్టిత= చుట్టబడిన; అంఘ్రితలుఁడు= పాదాలు (అడుగులు) కలవాడు; ధర్మసుతుఁడు= ధర్మజుడు; కేవల మర్త్యుఁడె?= సామాన్య మానవుడా? (కాదని భావం).

తాత్పర్యం: ఎవరి ముంగిట్లో మదపుటేనుగుల శరీరాలనుండి కారే మదజలధారలవలన ఏర్పడిన బురదను ఆయనను సేవించటానికి వచ్చే మహారాజుల అలంకారాల ఒరపిడివలన రాలిన ధూళి రాజిఅనే దుమ్ము అణచివేస్తుందో అట్టి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి ఉత్తమ ప్రవర్తన లోకాల కన్నింటికీ ఆదర్శమై (గురువై) వినయ వర్తనానికి ఒరవడి పెట్టుతుందో అట్టి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి కటాక్ష వీక్షణం గొప్ప సంపదలను కలుగజేస్తుందో, అటువంటి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి సుగుణాలనే తీవెలు సప్తసముద్రాలు దాటి చక్రవాళ పర్వతం మీదకు కలయప్రాకుతాయో అట్టి ధర్మరాజు సామాన్య నరుడా? ఎవరి మహాపరాక్రమమనే పెద్ద దీపం శత్రువుల గర్వమనే అంధకారాన్ని దూరంగా పారద్రోలుతుందో, ఎవరి పాదాలు శత్రువీరుల కిరీటాలలోని రత్నకాంతులతో సదా ఆవరింపబడి వెలిగిపోతూ ఉంటాయో అటువంటి ధర్మరాజు కేవలం మానవుడా? (కాడు-దివ్యమానవ సదృశుడని భావం.)

విశేషం: అలం: ఉదాత్తం. రాజభూషణ రజోరాజిన్ అనే సమాసానికి రాజులు ధరించే అలంకారాల రాపిడి వలన ఏర్పడిన రత్నాల పొడి సమూహమని అర్థం. ఆ రాజులు మహారాజులు. వారు ఎన్నో అభరణాలు ధరిస్తారు. వారు ధర్మరాజును ఒకరి నొకరు తోసుకుంటూ రావటం వలన రాపిడికి లోనై నుగ్గునుగ్గై ధూళిగా అయి ఆ పంకాన్ని అణచివేస్తాయి. దీనివలన ఆ రాజులయొక్క మహత్త్వమూ, వారి అపరిమిత సంఖ్యా, వారి అభరణాల విరివీ, ధర్మరాజుదర్శనం కొరకు వారు పడే తహతహా ఇవన్నీ వ్యజ్యమానమౌతాయి. 'ధర్మరాజు శాంతమూర్తి' అనే కీర్తి లోకంలో వ్యాప్తి చెందింది. అది అతడి వినయపద్ధతి. ఆ పద్ధతికి ఆయనే ఆదర్శంగా

లోకం చెప్పుకొంటుంది. అతడు చక్రవర్తి. అర్థులు అతడిని ఆశ్రయించినప్పుడు కడకంటితో చూస్తే చాలు, అర్థులకు మహనీయసంపద లభిస్తుంది. అత డంతటి దయామయుడైన దాత. అతడి సుగుణాలు సప్త సముద్రాలు దాటి లోకాంతరాలకు వ్యాపించాయి. అతడి ప్రతాపానికి రాజులందరూ తలలు వంచారు. వారు అతడికి నమస్కారాలు చేస్తున్నప్పుడు వారి కిరీటమణికాంతులతో అతడి పాదాలు వెలిగిపోతుంటాయి. **'నా విష్ణుః పృథివీపతిః'** అని న్యాయం, పృథివీపతు లెందరో తన పాదాలమీద పడి సేవించే ధర్మరాజు ఎవడు? అనే ప్రశ్న ఏర్పడుతుంది. అతడు కేవల మర్త్యుడు మాత్రం కాడు - అనే సమాధానం మాత్రం సత్యం. (సంపా.)

ఉ. అట్టి మహాత్ముఁ డొక్కనికి నాశ్రితుఁడై వెడకూడుఁ జీరయుం
బెట్టఁగ నిల్చి వాని మది ప్రీతికి నీడగువృత్తిఁ బేరునుం
బుట్టును మాలి యిప్పు డిటు బ్రుంగుడుపాటునఁ బొందఁ జూచి నా
కెట్టు మనంబు వట్టు? ధృతి యెమ్మెయిఁ దూలక నిల్చుఁ? జెప్పుమా! 171

ప్రతిపదార్థం: అట్టి మహాత్ముఁడు= ఆ విధమైన మహానుభావుడు (ధర్మజుడు); ఒక్కనికిన్= ఒక రాజునకు (అనామకునకు అనిర్దని) అందుకే పేరు చెప్పలేదు; ఆశ్రితుఁడు+ఐ= ఆశ్రయించినవాడై; వెడకూడు= అల్పమైన భోజనం; చీరయున్+పెట్టఁగన్= కట్టుబట్టలు ఇవ్వగా; నిల్చి= వాడివద్ద సేవకుడుగా కుదిరి; వానిమది ప్రీతికిన్= అతడి మనస్సుకు సంతోషం కలిగించటానికి; ఈడు+అగువృత్తిన్= తగినవర్తనం పాటిస్తూ; పేరునున్+పుట్టును మాలి= పేరూ, పుట్టుకా వదలి; ఇప్పుడు+ఇటు= ఇప్పు డిట్లా; బ్రుంగుడు పాటునన్+పొందన్= మరుగున పడిపోవటం; చూచి; నాకున్; మనంబు+ఎట్టు+ పట్టున్?= ఎట్లా మనస్కరిస్తుంది; ధృతి= ధైర్యం; ఏ+మెయిన్= ఏ విధంగా; తూలక నిల్చున్?= చలించదో; చెప్పుమా!= నీవే చెప్పుము.

తాత్పర్యం: ఆ విధమైన మహితాత్ముడైన ధర్మజుడు సాధారణ వ్యక్తివలె ఒక రాజు వద్ద కూడూ అల్పమైన గుడ్డ కొరకు పరిచర్యలు చేయటం, పేరూ,

వంశప్రతిష్ఠా, కులగౌరవం వదలి గోప్యంగా ఉండిపోవటం చూస్తే ధైర్యం చలించి, మనస్సు వికలమౌతున్నది. నాకు మిక్కిలి దుఃఖం కలుగుతున్నది.

విశేషం: రోజులు బాగా లేనపుడు తలవంచక తప్పదని ఈ కథ చెప్పుతున్నది.

ఉ. నీ వలమూపులావు మును నేల వహించిన నాగకూర్మ గో
త్రావనిభృద్దిశాకరుల కారయ నూఱటపట్టు గాదె? సం
భావన భూజనంబులకుఁ బండువు గాదె? మహోగ్ర కోప రే
ఖావిభవంబు వైరులకుఁ గాలము చేరువ గాదె పావనీ! 172

ప్రతిపదార్థం: పావనీ!= పవనపుత్రుడవైన ఓ భీమా!; ఆరయన్= పరిశీలించగా; నీ వలమూపులావు= నీ కుడిభుజబలం; మును= పూర్వం; నేలన్+వహించిన= భూభారాన్ని మోసిన; నాగ, కూర్మ, గోత్ర+అవనిభృత్= ఆదిశేషువు, తాబేలు, కులపర్వతాలకు; దిశాకరులకు= దిగ్గజాలకు; ఊఱటపట్టు+కాదె= ఊరటకు స్థానం కాదా?; సంభావన= నీవు గౌరవించటం; భూజనంబులకున్= లోకులకు; పండువు కాదె?= పండుగ కాదా?; మహా+ఉగ్రకోపరేఖావిభవంబు= మిక్కిలి భయాన్ని కొలిపే నీ కోప పరిపూర్ణత అనెడి సంపద; వైరులకున్= శత్రువులకు; కాలము చేరువు+అకాదె= కాలం మూడటమేకదా!

తాత్పర్యం: ఓ భీమసేనా! నీ కుడిభుజపు బలపరాక్రమం చూచి ఇంతకు ముందు భూభారం మోపిన ఆదిశేషువు, ఆదికూర్మం, ఏడుకులపర్వతాలూ, ఎనిమిదిదిగ్గజాలూ ఊరటపొందాయి. నీవు గౌరవంగా చూడటం లోకానికి పండుగ ఔతుంది. నీవు కోపంతో మహోగ్రమైన స్వరూపాన్ని వహిస్తే శత్రువులకు కాలం మూడినట్లేకదా!

విశేషం: అలం: అతిశయోక్తి. ఇక్కడ భూభారాన్ని ఆదిశేషుడు మోస్తూ ఉండటమనే పురాణగాథ ప్రస్తావించబడింది. అట్లాగే దశావతారాలలో ఒకటైన కూర్మావతార రూపంలో శ్రీవిష్ణువు భూ భారాన్ని మోశాడని గాథ. భూమిని సప్తకుల పర్వతాలూ, ఎనిమిది దిక్కులలో అష్టదిగ్గజాలూ మోస్తాయని ప్రతీతి. ఇక్కడ ఆ పురాణ గాథలు

ఆధారంగా ద్రౌపది భీముడి భుజబలాన్ని ప్రశంసిస్తున్నది. పొగడ్తలకు లొంగనివాడు లేడు. అందులో భీముడూ ఒక భాగమే.

తే. బక హిడింబ కిమ్మీరుల బాహుబలము,
నా జరాసంధు నుగ్రదర్పాతిశయము
లోకభీకరములు విజయాకరములు,
నైన నీ కరములకు లోనయ్యెఁ గాదె! 173

ప్రతిపదార్థం: బక= బకాసురుడియొక్క; హిడింబ= హిడింబాసురుడియొక్క; కిమ్మీరుల= కిమ్మీరుడియొక్క; బాహుబలమున్= భుజశక్తి; ఆ జరాసంధు= జరాసంధుడియొక్క; ఉగ్రదర్ప+అతిశయము= భయంకరమైన గర్వాధిక్యమూ; లోకభీకరములు= జనానికి భయాన్ని కలిగించేవి; విజయ+ఆకరములున్= జయాన్ని చేకూర్చేవి; ఐన; నీ కరము లకున్= నీ చేతులకు; లోనయ్యెన్+ కాదె!= లోకువయినవికదా!

తాత్పర్యం: లోకాలకు భయాన్నీ, విజయాలనూ కలిగించే నీ చేతులకు బక, హిడింబ, కిమ్మీరుల బాహుబలాలు, జరాసంధాదుల భయంకర గర్వాతిశయాలు లొంగిపోయాయి కదా!

విశేషం: భీముడు తన చేతి మీదుగా బకాసురుడిని చంపాడు. హిడింబుడిని మట్టుపెట్టాడు. కిమ్మీరుడిని అంతమొందించాడు. జరాసంధుడిని చీల్చి వేశాడు. ఇవి అన్నీ ఆయన భుజ పరాక్రమానికి సాక్షులు. వాటిని వరుసగా గుర్తు చేసింది ద్రౌపది.

ఆ. అట్టి నీవు వంటకట్టియలకు లావు,
సూపుచుండ నెపుడుఁ జూచి చూచి
వగతు; నదియుఁగాక తగవేది యమ్మత్స్య,
మేదినీశ్వరుఁడు వినోదములకు 174

ప్రతిపదార్థం: అట్టి నీవు= అంతటి బలసంపన్నుడవైన నీవు; వంటకట్టి యలకున్= వంటకట్టెల కొరకు; లావు+చూపుచున్+ఉండన్= బలప్రయోగం

చేస్తుంటే; ఎపుడున్+ చూచిచూచి, వగతున్= నిత్యం పెక్కుసార్లు చూస్తూ ఎంతో బాధపడుతుంటాను; అదియున్+కాక= అంతేకాక; తగవు+ఏది= న్యాయం తప్పి; ఆ మత్స్యమేదినీ+ఈశ్వరుఁడు= ఆ విరాటరాజు; వినోదముల కున్= ఆహ్లాదం కొరకు.

తాత్పర్యం: అంతటి బలసమన్వితుడవైన నీవు నీ భుజబలాన్ని వంటకట్టెలు విరచటానికి వినియోగించటం నిత్యం చూచి దుఃఖపడుతూ ఉంటాను. అంతేకాక. ధర్మం తప్పి, ఆ విరాటరాజు తన వినోదాల కొరకు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: వలలుడు బలం కలవాడు కాబట్టి అతడిని ఇతరమృగాలపైకి మల్లురపైకి పంపుతాడు విరాటుడు. అది హింసాత్మక చర్య అని ద్రౌపది గర్హిస్తున్నది.

మ. మహిష వ్యాఘ్ర గజాది సత్త్వ చయమున్, మల్లవ్రజంబుం గృపా
రహితుండై యెదు రొడ్డుచున్ వరుసఁ బోరంజూచు నిన్నెప్పుడున్;
మహనీయంబగు నీ శరీరము జగన్మాన్యంబు; నీచక్రియా
విహితం బైన కుజీవనంబు విధి గావించెం గటా దీనికిన్'. 175

ప్రతిపదార్థం: కృపారహితుండు+ఐ= (విరటుడు) దయమాలి; మహిష= దున్నపోతులు; వ్యాఘ్ర= పెద్దపులులు; గజ+ఆది= ఏనుగులు మొదలైన; సత్త్వచయమున్= జంతువుల సముదాయమునూ; మల్లవ్రజంబున్= జెట్టీల గుంపునూ; ఎదురు+ఒడ్డుచున్= నీకు ఎదురుగా నిలబెడుతూ; వరుసన్= వరుసగా; పోరన్= నీవు వారలతోపోరాటం చేస్తూ ఉండగా; ఎప్పుడున్+ నిన్నున్= ఎప్పుడూ నిన్ను; చూచున్= (వినోదంగా) చూస్తూ ఉంటాడు; మహనీయంబు+అగు= గొప్పదైన; నీ శరీరము= నీ మేను; జగత్+ మాన్యంబు= లోకం ప్రశంసించదగింది; విధి= దైవం; నీచక్రియా విహితంబు+ ఐన= నీచమైన పనులు చేయటానికి అనువయిన; కుజీవనంబున్= చెడు ప్రవృత్తిని; దీనికిన్= నీదేహానికి; కావించెన్+కటా!= ఏర్పరచాడు కదా!

తాత్పర్యం: (విరాటుడు) దున్నపోతులు, పెద్దపులులు, ఏనుగులు మొదలైన జంతువులతోను, జెట్టీలతోను నిర్దయగా పోటీలు పెట్టి నీచేత ఎదుర్కొనేటట్లు చేసి ఆడిస్తుంటాడు. లోకులు మెచ్చుకొనే నీ శరీరం ఇట్లా నీచపుపనులకు తలొగ్గటం విధి కావించిన దుష్క్రియ కాక మరేమిటి?'

విశేషం: రాజుల వినోదాలు రకరకాలు. కొందరు జూదమాడుతారు. విరాటుడు ధర్మరాజుతో ఆడేవాడు. మరికొందరు నాట్యం చూస్తారు. అర్జునుడు ఆ విద్య చూపేవాడు. మల్లురతోను, క్రూరమృగాలతోను బలాఢ్యులకు పోటీలు పెట్టి రాజులు వినోదించేవారు. విరాటుడు వలలుడిని అందుకు వినియోగించుకొనటం విధి వైపరీత్యం. ద్రౌపది బాధ ఇదే. అయితే, భీముడి చేత అటువంటి వినోదాలు చేయించవచ్చునని సూచించింది ధర్మరాజే. అజ్ఞాతవాస వ్రతకాలంలో అతడు శరీర వ్యాయామంలో వెనుకపడకుండా ఉండటానికి ధర్మజుడి పన్నాగ మది. ఆ రహస్యం తెలియని ద్రౌపది బాధపడడంలో ఆశ్చర్యం లేదు.

వ. అని మఱియు నిట్లనియె 'వివేకహీనుండగు విరాటుండు నిన్నుంబోరిం చునప్పుడు నిజాంతఃపురకాంతలకు వినోదంబు సేయ వారల రావించిన నేనును సుదేష్ణతో నరుగుదెంచి చూచుచుండుదు; నయ్యవసరంబున. 176

ప్రతిపదార్థం: వివేకహీనుండు+అగు= తెలివిలేనివాడైన; విరాటుండు; నిన్నున్+ పోరించునప్పుడు= నీచేత యుద్ధం చేయించేటప్పుడు; నిజ+అంతః పురకాంతలకున్= తన అంతఃపురస్త్రీలకు; వినోదంబు+చేయన్= ఆహ్లాదం కలిగించటానికి; వారలన్= వారిని; రావించినన్= రప్పించగా; నేనును; సుదేష్ణతో; అరుగుదెంచి= వచ్చి; చూచుచుండుదున్= చూస్తూ ఉంటాను; ఆ+అవసరం బునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: తెలివిమాలినవాడైన ఆ విరాటుడు నీచేత జంతువులతో పోరాడింప చేసేటప్పుడు అంతఃపురకాంతలను కూడా వినోదం కొరకు పిలిపించేవాడు. సుదేష్ణాదులతో పాటు నేనూ వచ్చి నిన్ను చూస్తూ ఉండే దానిని. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: వివేకహీనుడని విరాటరాజును పేర్కొనటం సాభిప్రాయం. ఆనాడు మల్లయుద్ధాలు అంతఃపురస్త్రీలకు వినోదాన్ని కలిగించటానికి కూడా ఏర్పాటు చేసేవారు.

క. భరమున నీ పోరెడు నెడఁ।
బరమ విషాదంబు, నీవు బలిమి మెఱసి యు
ద్ధురవృత్తి జయము గొనినం।
బరితోషముఁ బొందు నన్ను భావించి మదిన్. 177

ప్రతిపదార్థం: భరమునన్= కష్టంతో; నీ పోరెడు+ఎడన్= నీవు పోరాడే సమయంలో; పరమవిషాదంబు= అధిక దుఃఖాన్నీ; నీవు బలిమి మెఱసి= నీవు పరాక్రమం అతిశయించగా; ఉద్ధుర వృత్తిన్= దృఢమైన ప్రవర్తనతో; జయము+కొనినన్= విజయం సాధిస్తే; పరితోషమున్+పొందు= సంతోషించే; నన్నున్= నన్ను (ద్రౌపదిని); భావించి= తలంచి; మదిన్= మనస్సులో.

తాత్పర్యం: ఓ భీమసేనా! నీవు మల్లయుద్ధాలలో కష్టపడుతున్నప్పుడు నేను పొందే దుఃఖాన్నీ, నీవు బలాన్ని ప్రౌఢంగా ప్రదర్శించి జయం సాధించినపుడు నేను పొందే సంతోషాన్నీ గమనించి, నన్ను గురించి ఆలోచిస్తూ మనస్సులో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: భర్తపడుతున్న ఆవేదననూ, ఆవేశాన్నీ చూచి దుఃఖాన్నీ, హర్షాన్నీ పొందటం స్త్రీలకు సహజం. అవి ఇతరులకు తెలిసిపోయేవి.

వ. ఊహించి సుదేష్ణయుఁ దత్పరిజనంబులుం దమలోన. 178

ప్రతిపదార్థం: ఊహించి= ఊహచేసి; సుదేష్ణయున్; తత్+పరిజనంబులున్= అక్కడి పరిచారికలు కూడా; తమలోనన్= తమలో తాము.

తాత్పర్యం: అట్లా ఊహచేసి సుదేష్ణా, అక్కడి పరిజనాలూ తమలో తాము. (తరువాతి పద్యంతో సమన్వయం).

క. 'వలలుని దెస మాలినిచూ।
డ్కుల తెఱఁ గెడపొందుఁ దెలిపెడుం గంటిరె! వీ
రలు వచ్చిన సమయంబును।
దలఁపఁగ నొక్కటియ యివ్విధం బెట్లొక్కో! 179

ప్రతిపదార్థం: వలలునిదెసన్= భీముడివైపు; మాలినిచూడ్కు= సైరంధ్రి చూపులయొక్క; తెఱఁగు= పద్ధతి; ఎడపొందున్+తెలిపెడున్= ప్రేమను ప్రకటిస్తున్నాయి; కంటిరె?= చూచారా?; వీరలు= వీరిద్దరు (భీముడు-ద్రౌపది); వచ్చిన సమయంబును= కొలువులోకి వచ్చినవేళ; తలఁపఁగన్+ఒక్కటియ= ఆలోచిస్తే ఒకటే; ఈ+విధంబు+ఎట్లొక్కో!= ఇది ఎట్లా జరిగిందో గదా!

తాత్పర్యం: 'ఈ వలలుడిని సైరంధ్రి చూచే చూపుల తీరు మనసు కలిసిన జాడ తెలియజేసేదిగా ఉన్నది. మనకొలువులోకి వీరిద్దరూ ఒకే సమయంలో రావటం కూడా జరిగింది. ఈ తీ రేమిటో ఆశ్చర్యంగా ఉన్నది.'

వ. అనుచుం గలదు లేదని పెక్కువిధంబులం దలపోసి గుజగుజలు పోవు చుండుదు రట్టియెడ. 180

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; కలదు, లేదు+అని= ఉందీ, లేదు అని; పెక్కు విధంబులన్= అనేక రకాలుగా; తలపోసి= ఆలోచించి; గుజగుజలు పోవు చుండుదురు= గుసగుసలు ఆడుతుంటారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని అంటూ తల కొక రకంగా ఆలోచిస్తూ, ఔను కాదని వాదించుకొంటూ, గుసగుసలాడుకొంటూ ఉంటారు. అప్పుడు.

తే. మరగి నీమూర్తిపైఁ గన్ను మనముఁ దగిలి।
యుండ నేమఱియుండి యొక్కొక్కమాటు
తలఁచికొని వారిదెస మది నిలుపు నప్పు।
డెఱుఁగనగు వారు నా తెఱఁ గెఱుఁగుటెల్ల. 181

ప్రతిపదార్థం: నీమూర్తిపైన్= నీ ఆకారంపై; మరగి= ఆసక్తికలిగి; కన్నున్= చూపూ; మనమున్= మనస్సూ; తగిలి+ఉండన్= లగ్నమై ఉండగా; ఏమఱి+ఉండి= మైమరచి ఉండి; ఒక్కొక్కమాటు= ఒక్కొక్కసారి; తలఁచికొని= ఆలోచించి; వారిదెసన్= పరిచారి కలవైపు; మది నిలువునప్పుడు=చూపుత్రిప్పినపుడు; వారు= పరిచారికలు; నా తెఱఁగు+ ఎఱుఁగుట+ ఎల్లన్= నా ప్రవర్తన అంతా గమనించటం; ఎఱుఁగన్+అగున్= తెలుస్తుంది.

తాత్పర్యం: నా చూపులూ, మనస్సూ నీమీద ఆసక్తితో లగ్నమై ఉండగా ఒడలు మరచి ఉండేదానిని. మధ్య మధ్య ఒక్కొక్కసారి నా స్థితిని నేను తలచుకొంటూ వారివైపు చూచేదానిని. అప్పుడు వారు నన్ను గమనిస్తున్న తీరును తెలిసికొనేదానిని.

విశేషం: అప్రయత్నంగా భీముడి ఆకారాన్ని అనురాగపూరిత నయనాలతో ద్రౌపది చూడటం స్వభావం. ప్రేమలో పడ్డవారికి ఎదుటివారు తమను గమనిస్తారని అనుకోరు. లోక సహజమైన భావాన్ని కవి ఇట్లా ఎత్తి చూపాడు.

వ. కావున మదీయ పరిభవాతిరేకంబునకు నీ వుద్రేకించిన జనంబులు మనల భేదింతురు; నీకుం బోలిన భంగి రహస్యభంగంబు గాకుండ నరిభంగంబు సేయు' మని వెండియు. 182

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మదీయ పరిభవ+అతిరేకంబునకున్= నాకు కలిగిన అవమానాతిశయానికి; నీవు+ఉద్రేకించినన్= నీవు విజృంభిస్తే; జనంబులు= లోకులు; మనలన్ భేదింతురు= మనలను సులభంగా గుర్తుపట్టివేస్తారు. నీకున్+పోలినభంగిన్= నీకు అనువైన విధంగా; రహస్య భంగంబు+కాకుండన్= అజ్ఞాతవాస సమయం బయట పడకుండా; అరిభంగంబు= శత్రువును చంపటం; చేయుము= చేయుము; అని= అని చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: నేను పొందిన అవమానభారానికి కోపపడి నీవు నిజంగా విక్రమిస్తే లోకులు మనలను ఇట్టే పోల్చుకొనగలరు. కాబట్టి, నీ కనువైనవిధంగా మన రహస్యవర్తనం బయట పడకుండా, శత్రువును చంపాలి' అని ద్రౌపది చెప్పి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. తొడరిన హరునైన దోర్బలంబునఁ దన్ను।
మిగులంగనీఁడను మేటి మాట,
యమరేంద్రు నర్ధాసనమునకు నైన న।
ర్హుం డెంతయును నను రూఢిమాట,
జము నిల్లు సొచ్చిన జంతువు నైనను।
గాచు నెమ్మెయి నను రాచమాట,
తనుఁ గోరి యూర్వశి దాన వచ్చిన నైన।
లోలుండు గాఁడను మేలిమాట.

తే. శౌర్యవైభవ ప్రాభవ శౌచములకు।
నొరులకైనఁ గైవారమై యుల్లసిల్లు
నొక్కరుని కివి యెల్లను నిక్కమట్టె!।
యెందుఁ గలుగునె యర్జును నీడువాఁడు? 183

ప్రతిపదార్థం: తొడరిన= ఎదుర్కొనిన; హరున్+ఐనన్= శివుడినైనా; దోస్+ బలంబునన్= భుజశక్తితో; తన్నున్ మిగులంగన్+ ఈఁడు= తనను మించిపోనీడు; అను మేటిమాట= అనే గొప్పమాట; అమరేంద్రు+అర్ధ+ ఆసనమునకున్+ఐనన్= ఇంద్రుడి సగం సింహాసనానికైనా; ఎంతయునున్= ఎంతైనా; అర్హుండు= సమర్థుడు; అను రూఢిమాట= అనే గట్టిమాట; జము+ ఇల్లు= యమలోకం; చొచ్చినజంతువున్+ఐనను= ప్రవేశించిన పశువునైనా; ఏ+మెయిన్+కాచున్= ఎట్లాగైనా కాపాడుతాడు; అను రాచమాట= అనే పౌరుషపు మాట; ఊర్వశి= ఊర్వశి; తనున్+కోరి= తనను వరించి; తాన్+అవచ్చినన్+ ఐనన్= తనంతట తానే వచ్చినా; లోలుండు+కాఁడు= లోబడడు; అను మేలిమాట= అనే మంచిమాట; శౌర్య= పరాక్రమానికి; వైభవ= ఐశ్వర్యానికి; ప్రాభవ= ప్రభుత్వానికి; శౌచములకున్= శుచిత్వానికి; ఒరులకైనన్=

ఇతరులకైనా; కైవారము+ఐ= పొగడదగినదై; ఉల్లసిల్లున్= (అర్జునుడు) ప్రకాశిస్తుంటాడు; ఒక్కరునికిన్= అలా ప్రకాశించటం (అర్జునుడు తప్ప) మరో వ్యక్తి యెడల; ఒక్కరునికిన్= ఇవి+ఎల్లను= ఇవి అన్నీ; నిక్కము+ అట్టె!= నిజాలౌతాయా!; అర్జును+ఈడువాఁడు= అర్జునుడితో సమానుడు; ఎందున్+కలుగునె?= ఎక్కడైనా ఉంటాడా?

తాత్పర్యం: పరమేశ్వరుడే ఎదిరించినా అతడిని భుజబలంలో తనను మించనీయడు అనే గొప్ప కీర్తి, ఇంద్రుడి సగం గద్దె మీద కూర్చుండ గలిగిన అర్హత ఎంతైనా కలవాడు అనే గట్టి కీర్తి, యమలోకంలో ప్రవేశించిన జంతువునైనా ఏదో విధంగా రక్షించగలడనే పౌరుషపు కీర్తి, ఊర్వశి తనను కోరి తనంతట తాను వచ్చినా స్త్రీలోలుడు కాని ఉత్తమ కీర్తి వరుసగా తన పరాక్రమానికీ, వైభవానికీ, మహిమకూ, నిర్మల వర్తనానికీ సాక్షులై శత్రువులచేత కూడా పొగడ్తలు పొందగలగటం ఒక్కరికి మాత్రమే చెల్లింది. ఆ ఒక్కడు ఆ అర్జునుడు. అతడితో దీటైనవాడు మరొకడు లేడు. ఇది సత్యం.

విశేషం: అలం: ఉదాత్తం, యథాసంఖ్యం. పాశుపతాస్త్ర సంపాదన ఘట్టంలో పరమేశ్వరుడితో దీటైనవాడని అనిపించుకొనటం అర్జునుడి పరాక్రమానికి ఒక ప్రశంసాపత్రం. ఇట్లాగే మిగిలిన సీసపద్య పాదాలను వైభవ, ప్రాభవ, శౌచాలనే గుణాలకు అన్వయించుకొనాలి. మాట అనే పదానికి పలుకు, కీర్తి, అపకీర్తి, సంభాషణ, రూఢి మొదలైన అర్థాలున్నాయి. తిక్కన ఈ పద్యంలో కీర్తి అనే అర్థంలో ప్రయోగించాడు. మేటి మాట- అంటే అంతకంటె మించి చెప్పదగిన మాట (కీర్తి) లేదని భావం. రూఢిమాట- అంటే లోకంలో బాగా స్థిరపడిన మాట (కీర్తి) అని అర్థం. రాచమాట- అంటే గర్వంగా చెప్పుకొనే మాట (కీర్తి) అని తాత్పర్యం. మేలిమాట- అంటే అంతకు మించి చెప్పలేని మంచిమాట (నిష్కల్మషమైన కీర్తి) అని భావం. కైవారం రాజగుణకీర్తనకు సంబంధించిన స్తుతి. అర్జునుడు నాలుగు గుణాలలో సాటిలేని మేటికీర్తిని పొందాడు. అట్లా పొందినవాడు సమకాలీన భారతంలో మరొకడు లేడు. అట్టి ఉదాత్తుడి వర్తనం ఉదాత్తాలంకార శోభితం కావటం సార్థకం. (సంపా.)

పాశుపతాస్త్ర గాథ, ఇంద్రసింహాసనం ఎక్కటం, గో సంరక్షణ, ఊర్వశీ పరాభవం, అర్జునుడి బలపరాక్రమాలకు నిదర్శనాలు. కడచిన భారతకథలో ఇవి వచ్చాయి. వాటిని గమనించగలరు.

క. ఆ పార్థుఁడు భరతాన్వయ।
దీపకుఁ డమరేంద్ర సుతుఁడు తేజోనిధి వి
ద్యాపారగుండు వినుత।
వ్యాపారుం డాపదలకు నగ్గం బయ్యెన్. 184

ప్రతిపదార్థం: ఆ పార్థుఁడు= ఆ అర్జునుడు; భరత+అన్వయదీపకుఁడు= భరతవంశాన్ని ప్రకాశింపజేసిన వాడు; అమర+ఇంద్ర సుతుండు= దేవేంద్రుడి కుమారుడు; తేజస్+నిధి= పరాక్రమానికి ఆటపట్టు; విద్యాపారగుండు= విద్యలను పారం ముట్టేటట్లు పూర్తిగా నేర్చినవాడు; వినుత వ్యాపారుండు= పేరెన్నిక గన్న పనులు చేసేవాడు; ఆపదలకున్+అగ్గంబు+అయ్యెన్= కష్టాలపాలయ్యాడు.

తాత్పర్యం: ఆ అర్జునుడు భరతవంశానికే పేరు తెచ్చినవాడు, దేవేంద్రుడి కుమారుడు, పరాక్రమశాలి, అస్త్రశస్త్ర విద్యానిధి, ప్రశంసించదగిన ఆచరణ కలవాడు అయిన ఆ ఘనుడు ఈనాడు ఆపదలకు గురి అయ్యాడు.

విశేషం: బలహీనుడు కష్టాలకు లోనుకావటం సహజం. భుజబలపరాక్రమం కలిగిన అర్జునుడి అంతటివాడు అన్న మాటకు కట్టుపడి, అజ్ఞాతవాసానికి సిద్ధపడి, బృహన్నలా రూపంలో ఆడవాళ్ళతో కలసి మెలిసి నాట్యాచార్యుడుగా ప్రవర్తించటం ద్రౌపది మనస్సుకు కష్టం కలిగించింది. విధి బలీయం. ఎంతటివారైనా విధికి తలొగ్గక తప్పదు. ఈ విధంగా ద్రౌపది ఇక్కడ అర్జునుడి గుణగానం చేసింది.

చ. అరయ నతండు మానధనుఁ డక్కట రంగమునందు నిల్చి సుం
దరులకు నాట సూపెడు విధం బతిదీనము; దానిఁ జూచి యేఁ
బురపురఁ బొక్కుదుం; గడుపుఁ బ్రోచికొనన్ లఘువృత్తి కిమ్మెయిం
జొరనగువాఁడె దేవపతిసూనుఁడు? దైవము చేఁత సూచితే? 185

ప్రతిపదార్థం: అక్కట!= ఔరా!; మానధనుఁడు= అభిమానమే ధనంగా కలవాడైన; అతండు= ఆ అర్జునుడు; రంగమునందున్ నిల్చి= నాట్యరంగం మీద నిలబడి; సుందరులకున్= స్త్రీలకు; ఆట+చూపెడువిధంబు= నాట్యం చేసిచూపే తీరు; అరయన్= ఆలోచించగా; అతిదీనము= కడు జాలి కలిగించేది; దానిన్+చూచి= అది చూచి; ఏన్= నేను-(ద్రౌపది); పురపురన్ పొక్కుదున్= లోలోపల మిగుల దుఃఖిస్తాను; దేవపతి సూనుఁడు= ఇంద్రుడి కుమారుడు; కడుపున్+ప్రోచికొనన్= ఆకలి తీర్చుకొనటానికి; ఈ+మెయిన్= ఈ విధంగా; లఘువృత్తికిన్= నీచపు పనికి; చొరన్+అగువాఁడె?= పాల్పడదగినవాడా?; దైవము చేఁత= భగవంతుడి చేష్ట; చూచితే?= చూచావా?

తాత్పర్యం: అటువంటి అభిమానధనుడైన అర్జునుడు నాట్యరంగంలో నిలబడి రాచకన్నెలకు నాట్యం నేర్పవలసి వచ్చిన ఆ స్థితి ఎంతో దయనీయం. జాలి కలిగిస్తున్నది. దానిని చూచి నేను లోలోన దుఃఖంతో కుమిలిపోతూ ఉంటాను. దేవేంద్రుడి కుమారుడైన అర్జునుడు కడుపు నింపుకొనటానికి ఇంతటి నీచవృత్తికి పాల్పడటమా? విధి చేసే వింత చేష్టలు చూచావా?

విశేషం: ఊర్వశి శాపంవలన అర్జునుడికి ఈ స్థితి ఏర్పడింది. అది అతడికి అజ్ఞాతవాస సమయంలో బృహన్నలగా ఉండటానికి ఉపకరించింది.

చ. **'మగలకు మేటియైన బలమర్దననందనుఁ బేడిఁ జేయఁగాఁ**
దగునె విధాత నీకు?' నని దైవము దూఱుదు, నోర్వరాని నె
వ్వగ తలకొన్న నెంతయును వందుదు, నిద్దురవస్థ యెన్నఁడో
తెగుటని సంతతంబును మదిం దలపోయుదు నేమి సేయుదున్? 186

ప్రతిపదార్థం: విధాత!= ఓ బ్రహ్మదేవా!; మగలకున్= పురుషులకు; మేటి+ఐన= శ్రేష్ఠుడైన; బలమర్దన నందనున్= ఇంద్రుడి కుమారుడైన అర్జునుడిని; పేడిన్+చేయఁగాన్= నపుంసకుడిని చేయగా; నీకున్; తగునె?= న్యాయమా?; అని దైవమున్ దూఱుదున్= అని విధిని నిందిస్తాను; ఓర్వరాని= భరించరాని; నెఱ+వగ తలకొన్నన్= అధిక దుఃఖం కలుగగా; ఎంతయును= ఎంతైనా; వందుదున్= చింతిస్తాను; ఈ+దురవస్థ= ఈ కష్టం; ఎన్నఁడో తెగుట+అని= ఎప్పుడు తొలగిపోతుందా? అని; సంతతంబును= ఎల్లప్పుడూ; మదిన్+తలపోయుదున్= మనసులో ఆలోచిస్తాను; ఏమి చేయుదున్?= ఇంతకంటె చేయగలిగింది ఏముంది?

తాత్పర్యం: 'ఓ బ్రహ్మదేవా! అంతటి ఇంద్రకుమారుడిని పేడివాడిగా చేసి ఆడిస్తున్న నీ చేష్టలు దూషితా'లని ఆ భగవంతుడిని నిందిస్తాను, భరించరాని దుఃఖం నన్ను ఆక్రమిస్తుంది. ఈ కష్టాలు ఎన్నడు గట్టెక్కుతాయా? అని ఆలోచిస్తాను. ఐనా చేసేది ఏముంది?

విశేషం: ఎంతటి బలవంతుడికైనా విధిని తప్పించుకొనటం సాధ్యం కాదు. పరాక్రమంచేత పరమశివుడి పాశుపతాస్త్రాన్ని ప్రసాదంగా పొందిన బలవంతుడైన అర్జునుడు బృహన్నలా రూపం దాల్చడం విచిత్రం. అజ్ఞాతవాస సమయంలో ఒక్కొక్కరు ఒక్కొక్క రూపం దాల్చాలనుకొన్నారు. ఊర్వశి శాపం గుర్తుకు వచ్చింది అర్జునుడికి. అది అర్జునుడికి వరంగా మారింది. అది ఇంద్రు డిచ్చిన వరంప్రభావం.

సీ. **తనయొ ప్పెదురఁ గన్నఁ దగిలి యెవ్వరికైన।**
మలఁగి క్రమ్మఱఁ జూడవలయువాఁడు,
తన వర్తనము విన్న మునిజనంబులకైన।
నలవరించికొనంగవలయువాఁడు,
తన బంటుతన మాజిఁ గనిన మార్తురకైన।
బలుమాఱు నగ్గింప వలయువాఁడు,
తన వితరణ కేళి వినినఁ గల్పకతరు।
వులకైనఁ దలయూఁపవలయువాడు.

తే. **నకులుఁ డొరులకు నశ్వశిక్షకుఁడుగాఁగ।**
నగునె యాతని దుస్థితి యనుదినంబుఁ

గాంచి కన్నీ రడంచుచుఁ గడవరాని।
దైవఘటనకు నొత్తుఁ జిత్తంబులోన. 187

ప్రతిపదార్థం: తన+ఒప్పు= తన అందాన్ని; ఎదురన్+కన్నన్= ఎదుటపడి చూస్తే; తగిలి= ఆసక్తితో; ఎవ్వరికిన్+ఐనన్= ఎటువంటివారికైనా; మలఁగి= తిరిగి మరలా; క్రమ్మఱన్= మరొకమారు; చూడన్+వలయువాఁడు= చూడాలనిపించేవాడు; తన వర్తనము= తన నడవడి; విన్న= వినిన; మునిజనంబులకున్+ఐనన్= మునులకైనా; అలవరించికొనంగన్+ వలయువాఁడు= అలవాటు చేసికొనవలెనని+అనిపింపచేసేవాడు; తన బంటుతనము= తన శూరత్వాన్ని; ఆజిన్+కనినన్= యుద్ధంలో చూస్తే; మార్తురకున్+ ఐనన్= శత్రువుల కైనా; పలుమాఱు= పెక్కుసార్లు; అగ్గింపన్+వలయువాఁడు= మెచ్చుకొన దగినవాడు; తన వితరణ+కేళి= తన దానగుణవిలాసాన్ని; వినినన్= విన్నట్లైతే; కల్పకతరువులకున్+ ఐనన్= కల్పవృక్షాలకైనా, తల+ఊఁపన్+ వలయువాఁడు= తలవూపి మెచ్చుకొన తగినవాడు; ఒరులకున్= ఇతరులకు; అశ్వశిక్షకుఁడు= గుర్రాలకు శిక్షణనిచ్చే కాపరిగా; నకులుఁడు= నకులుడు; కాఁగన్+అగునె?= కావటం న్యాయమా?; ఆతని దుస్+స్థితి= నకులుడి కష్టపరిస్థితి; అనుదినంబున్+కాంచి= రోజూ చూచి; కన్నీరు+ అడంచుచున్= కన్నీళ్ళు క్రుక్కుకొంటూ; కడవన్+రాని= దాటరాని; దైవఘటనకున్= విధిచేష్టలకు; చిత్తంబులోనన్= మనస్సులో; నొత్తున్= బాధపడతాను.

తాత్పర్యం: తన అందాన్ని ఎదుటబడి చూస్తే మరల తిరిగి చూడాలని ఎవరికైన అనిపించే అందగాడు, తన ప్రవర్తనాన్ని గురించి వింటే మునులకైనా దానిని అనుసరించాలని అనిపించే ఆదర్శశీలుడు, యుద్ధంలో తన పరాక్రమాన్ని చూస్తే శత్రువులకు కూడా పెక్కుసార్లు కీర్తించవలెనని అనిపించే శూరుడు, తన దానవిశేషాలను వింటే కల్పవృక్షాలచేత కూడా తలలూపింప జేయగల దానశీలుడు అయిన నకులుడు ఇతరులసేవలో గుర్రాలకు శిక్షకుడుగా ఉండదగినవాడా? అతడి శోచనీయస్థితిని చూచి నిత్యం కన్నీరు పెట్టుతుంటాను. దాటరాని దైవ సంఘటనను మనస్సులో తలచుకొని నొచ్చుకొంటూ ఉంటాను.

విశేషం: 1. నకులుడిలో విరుద్ధ గుణాల విశిష్ట మేళనం కనబడుతుంది. ఆకర్షించే అందం ఒకవైపు, మునులకు కూడా ఆదర్శంగా ఉండే నియమ నిష్ఠలు మరొకవైపూ ప్రవృత్తి నివృత్తి లక్షణాల సంయోజనాన్ని వ్యక్తం చేస్తున్నాయి. యుద్ధం చేసే వీరకృత్యం ఒకవైపు ఉన్నదంతా దానం చేసే దానవృత్తం మరొకవైపు రాజస సాత్త్విక ప్రవృత్తులను తెలుపుతున్నాయి. అతడు అశ్వశిక్షకుడైనాడు. అశ్వాలు ఇంద్రియాలకు ప్రతీకలు. ఇంద్రియాలను భోగ, యోగ, యుద్ధ, దాన ప్రవృత్తులలో నియంత్రించగలగటం రాజయోగి లక్షణం. అంతటి ఉత్తమాధికారి భౌతికంగా గుర్రాలకు-అదీ ఇతరుల గుర్రాలకు నడవడి నేర్పేవాడయ్యా డన్నదే ద్రౌపది దుఃఖం. పూర్వవైభవ సంస్మరణం ప్రస్తుత నిరంతర దుఃఖానికి కారణం కావటం విశేషం. 2. ఈ పద్యంలో శబ్దార్థ మాధుర్య గుణాలు పోషించబడ్డాయి. పృథక్ పదత్వ రూపమైన శబ్దగుణమాధుర్యం సౌందర్యాన్ని పోషిస్తే, సౌశీల్యాన్నీ, పరాక్రమాన్నీ, దానగుణాన్నీ వ్యంజింపజేసే ఉక్తి వైచిత్ర్యం ఇందులోని అర్థగుణమాధుర్యాన్ని పోషించింది. ఉభయగుణ పోషకమైన ఈ రచన నకులుడి బాహిరమైన, ఆంతరమైన సౌందర్యాలను రూపుకట్టించింది. (సంపా.)

శా. ఆ రూపం బవికార, మా భుజబలం బత్యంత నిర్గర్వ, మా
శూరత్వంబు దయారసానుగత, మా శుంభత్క్రియాజ్ఞాన మా
ర్యారంభ ప్రతికూల వాదరహితం, బా యోఁ గి సన్మాన వి
స్తారోదాత్తము మాద్రి పిన్నకొడు కేతన్మాత్రుఁడే చూడఁగన్? 188

ప్రతిపదార్థం: చూడఁగన్= పరిశీలించగా; ఆ రూపంబు= అంతటి సౌందర్యం; న+వికారము= మార్పులేనిది; ఆ భుజబలంబు= ఆ భుజబలం; అత్యంత నిర్గర్వము= మిక్కిలి గర్వం లేనట్టిది; ఆ శూరత్వంబు= ఆ సాహసం; దయా+రస+అనుగతము= దయారసాన్ని అనుసరించి ఉండేది, దయతో

కూడినది; ఆ శుంభత్+క్రియాజ్ఞానము= ఆ ప్రకాశించే పనులలోని నేర్పరితనం; ఆర్య+ఆరంభ ప్రతికూల= పెద్దల నడవడికకు అడ్డు చెప్పే; వాదరహితంబు= వాదం లేనట్టిది; ఆ+ఈఁగి= ఆ దానగుణం; సత్+ మానవిస్తార+ ఉదాత్తము= గౌరవం యొక్క గొప్పతనంచేత ప్రకాశించేది; మాద్రి పిన్నకొడుకు= మాద్రి చిన్నకొడుకు సహదేవుడు; ఏతద్+మాత్రుఁడే?= సామాన్యుడా?

తాత్పర్యం: మాద్రి చిన్న కొడుకైన సహదేవుడు సామాన్యుడా? (అసామాన్యుడని భావం). అతడి ఆ రూపం నిర్వికారం. ఆ బాహుబలం గర్వం లేనిది. ఆ పరాక్రమం దయారసంతో కూడింది. ఆ కార్య నిర్వహణ పరిజ్ఞానం పెద్దల నడవడికకు వ్యతిరేకం కానిది, వివాదాలకు గురి కానిది. ఆ దానం గౌరవ ప్రపత్తి చేత ఉదాత్తమైనది. కనుక, అతడు వయసులో చిన్నవాడైనా గుణాలలో పెద్దవాడే.

విశేషం: 1. తెలుగులో 'ఆ' అనే నిర్దేశక వాచకము ధ్వనిమయం. అది అనంతత్వాన్నీ, అద్భుతాన్నీ, అసదృశత్వాన్నీ, అస్వాద మాధుర్యాన్నీ ధ్వనిమయంగా నిర్దేశిస్తుంది. ఈ పద్యంలో 'ఆ' అనే విశేషణం అసదృశత్వాన్ని (దాన్ని పోలింది మరొకటి లేదు అనే భావం) ధ్వనింపచేస్తున్నది. 'ఆ' గుణవాచకంగా పునరావృతం కావటం చేత పద్యంలో శ్లేష అనే గుణం రూపు కట్టింది. మసృణత్వం శబ్దగుణలక్షణం, ఘటన అర్థగుణశ్లేష లక్షణం. ఆ రెండూ పద్యంలో అందంగా అమరాయి. 2. శ్లేషలో కాకువు రాణించటం అలంకార లక్షణం. 'మాద్రిపిన్నకొడుకు+ఏతన్మాత్రుఁడే చూడఁగన్?' అనే వాక్యంలో కాకువు ఉన్నది. దాని వలన రెండు అర్థాలు స్ఫురిస్తాయి. మాద్రి చిన్నకొడుకు చిన్నకొడుకువలె ఉండడు, పెద్దకొడుకువలెనే ఉంటాడు. వయసుకు చిన్నవాడైనా గుణాలలో అన్నను పోలి ఉంటాడు-అని ఒక అర్థం. అందువలననే ద్రౌపది నకులుడి యందు ఏ గుణాలున్నాయని చెప్పిందో - వాటినీ సహదేవుడి యందు కూడా పేర్కొన్నది. నకులుడి వలెనే ఇతడు కూడా అందగాడు, బలవంతుడు, పరాక్రమవంతుడు, యుద్ధ కార్యకుశలుడు, దానపరుడు, అందువలన అన్నింటా అన్నను పోలినవాడనే తాత్పర్యం స్ఫురిస్తుంది. నకుల సహదేవులు కవలబిడ్డలు కాబట్టి ఒకరి పోలికలు మరొకరికి కొట్టవచ్చినట్లుగా ఉండటంలో ఆశ్చర్యం లేదు. కాని- ఇక్కడ రెండవ అర్థం ఇట్లా చెప్పుకొనాలి- అతడు 'ఏతన్మాత్రుఁడే' -అటువంటివాడే (నిశ్చితార్థం) కాని సామాన్యుడా? అనిపిస్తాడు. అంటే సమానగుణాలున్నా సహదేవుడిలో అవి విశిష్టంగా ఉంటాయని కాకువు. అది ఎట్లాగంటే - నకులుడియందు విరుద్ధ లక్షణ సమాహారం కనపడితే, సహదేవుడిలో అసామాన్యగుణ సమారోపణం కనబడుతుంది. సుందరరూపానికి చపలత్వం (విలాసత్వం) సామాన్య లక్షణంగా చెప్పబడుతుంది. కాని, సహదేవుడి సౌందర్యం అవికారం. ఇది అసామాన్య లక్షణం. అట్లాగే భుజబలం నిగర్వంగా, శౌర్యం దయారసంగా, క్రియాజ్ఞానం వివాదరహితంగా, దానం గౌరవోదాత్తంగా ఉండటం-అనేవి అసామాన్య లక్షణాలే ఔతాయి. దీనిని బట్టి చూస్తే 'ఏతన్మాత్రుఁడే?' -నకులుడి వంటివాడా సహదేవుడు? అతడి కంటె అన్నింటా ఘనుడు - అని చెప్పినట్లు స్ఫురిస్తుంది. తిక్కన శ్లేషగుణావిష్కార రచనకు ఈ పద్యం ప్రసిద్ధోదాహరణం. (సంపా.)

క. సుకుమారుఁ డతఁడు గోపా।
లకవృత్తి వహించి యడవులం గ్రుమ్మరుచు
న్కికి నాక కాదు పగవా।
రికినైనను నకట! మన మెరియదే వగలన్? 189

ప్రతిపదార్థం: అకట!= ఔరా!; అతఁడు= ఆ సహదేవుడు; సుకుమారుఁడు= కోమలుడు (నీడపట్టున సుఖపడవలసినవాడు); గోపాలకవృత్తిన్+వహించి= గొల్లవాడి పనిని అంగీకరించి; అడవులన్+క్రుమ్మరుచున్+ఉన్కికిన్= అడవులలో తిరుగుతుండటానికి; నాకు+అ కాదు= నాకేకాదు; పగవారికిన్+ఐనను= శత్రువులకైనా; వగలన్= దుఃఖాలతో; మనము+ఎరియదే?= మనస్సు పరితపించదా?

తాత్పర్యం: అతికోమలుడైన ఆ సహదేవుడు ఆవుల కాపరిగా ఉంటూ అడవులలో సంచరిస్తూ ఉండటం చూస్తే నాకే కాదు, శత్రువులకైనా దుఃఖంతో మనసు పరితపిస్తుంది.

విశేషం: 'ఇటువంటి కష్టాలు పగవారికి కూడా రాకూడదు' - వంటి లోకోక్తులు తెలుగు పలుకుబడిలో సహజం. దైన్యం యొక్క పరాకాష్ఠను తెలిపే అభివ్యక్తి అది. ఇక్కడ సహదేవుడి వంటి సుకుమారుడు అడవులలో పశువులను కాయటం అనే దీనావస్థను పొందాడని చూచేవారు అమితంగా బాధపడతారు-అనే అర్థాన్ని జాతీయంతో ధ్వనింపచేసింది ద్రౌపది. (సంపా.)

ఉ. ఏనును మీరుఁ గానలకు నేగునెడ న్ననుఁ జేరి యెంతయున్
దీనత దోఁపఁ గుంతి సహదేవుని నిల్లడపెట్టి నాకు 'న
మ్మా! నిను నమ్మి చాల విషమంబగు నివ్వనవాస మీతఁడుం
బూనఁగ నియ్యకొంటి' నని బోరన నశ్రులు గ్రమ్ముచుండఁగన్. 190

ప్రతిపదార్థం: ఏనును= నేనూ (ద్రౌపది); మీరున్= మీరున్నూ, (పాండవులున్నూ); కానలకున్+ ఏగు+ఎడన్= అడవులకు వెళ్ళేటప్పుడు; కుంతి= అత్తగారైన కుంతీదేవి; ననున్+చేరి= నా దగ్గరకు వచ్చి; ఎంతయున్= ఎంతో; దీనత+తోఁపన్= దైన్యం ఉట్టిపడగా; సహదేవునిన్; నాకున్; ఇల్లు+అడ పెట్టి= అప్పగించి; అమ్మా!= ఓ ద్రౌపదీ; నినున్+నమ్మి= నిన్ను నమ్మి; చాల విషమంబు+అగు= ఎంతో కష్టమైన; ఈ+వనవాసము= ఈ అరణ్యవాసం; ఈతఁడున్= ఈ సహదేవుడు కూడ; పూనఁగన్= చేయటానికి; ఇయ్యకొంటిన్= ఒప్పుకొన్నాను; అని= అని పలికి; బోరనన్= ధారలు కట్టేటట్లు; అశ్రులు+క్రమ్ముచుండఁగన్= కన్నీరు నిండగా.

తాత్పర్యం: నేనూ మీరూ అరణ్యవాసానికి బయలుదేరేటప్పుడు కుంతి నన్ను దగ్గరకు తీసికొని నాకు సహదేవుడిని అప్పగిస్తూ 'కోడలా! నిన్ను నమ్మి అతికష్టమైన ఈ వనవాసాన్ని చేయటానికి సహదేవుడిని పంపటానికి ఒప్పుకొంటున్నాను' అని కన్నీరు ధారలు కట్టగా అన్నది.

విశేషం: భార్య తల్లితో సమానంగా ప్రవర్తిస్తుంది ఒక్కొక్కసారి. మరొకసారి దాసిగా నడుచుకొంటుంది. ఇక్కడ ద్రౌపదిపై చిన్న కొడుకు భారాన్ని మోపింది కుంతి. మాద్రి చనిపోయినా తన సొంతబిడ్డగా చూచుకొన్నది. తన కడగొట్టు బిడ్డగా భావించి గారాబం చేసింది. అందుకే అంత మమకారం. 2. ఇల్లడ పెట్టడం= మరల తిరిగి ఇచ్చే నియమంతో ఒకరి వద్ద ధనాన్ని దాచిపెట్టుకొనటం.

వ. మఱియును. 191

తాత్పర్యం: అంతేకాక.

చ. 'కడుఁ బసిబిడ్డ వీఁ; డొకటి కాదవునా నెఱుఁగండు; ముంద రె
య్యెడ నొకపా టెఱుంగఁ; డెద యెంతయుఁ గోమల; మెప్పుడైన నేఁ
గుడువఁగఁ బిల్తుఁగాని తనకుం గల యాఁకటిప్రొ ద్దెఱుంగఁ డీ
కొడు కిటు పోకకు న్మనము గుందెడు; ని న్గని యూఱడిల్లెడున్. 192

ప్రతిపదార్థం: వీఁడు= ఈ సహదేవుడు; కడున్+పసిబిడ్డ= మిక్కిలి గారాల బిడ్డ; ఒకటి కాదు+అవున్+ననాన్= ఒకటి ఔను, ఒకటి కాదు అని; ఎఱుఁగండు= తెలియనివాడు, చెప్పలేడు; ముందర= ఇంతకుముందు; ఏ+ఎడన్= ఎక్కడా; ఒకపాటు= ఏ కష్టాన్నీ; ఎఱుంగఁడు= అనుభవించలేదు; ఎద+ఎంతయున్= మనసెంతో; కోమలము= సున్నితం; ఎప్పుడైనన్= ఎన్నడైనా; నేన్= నేను (కుంతి); కుడువఁగన్= అన్నం తినుమని; పిల్తున్+కాని= పిలుస్తానుగాని; తనకున్+కల= సహదేవుడికి గల; ఆఁకటిప్రొద్దు= ఆకలయ్యే వేళను; ఎఱుంగఁడు= తెలిసికొనలేడు; ఈ కొడుకు= అట్టి కొడుకు - ఈ సహదేవుడు; ఇటు పోకకున్= ఇట్లా అరణ్యాలకు వెళ్ళటానికి; మనము+కుందెడున్= నా మనస్సు విచారపడుతున్నది; నిన్+కని= నిన్ను చూచి; ఊఱడిల్లెడున్= ఊరట పొందుతున్నది.

తాత్పర్యం: 'ఓ కోడలా! ఈ సహదేవుడు మిక్కిలి పసిబిడ్డ. ఔను, కాదని చెప్పలేని చిరుతడు. ఇంతకుమునుపు ఎట్టి కష్టాలు తెలియనివాడు. మిక్కిలి

సున్నిత స్వభావం కలవాడు. ఆకలి వేళ కూడా తెలిసికొనలేడు. నేను పిలిచి అన్నం పెట్టుతాను కాని, తనకు తానై అడగడు. అలాంటి కొడుకు ఇట్లా అడవులకు వెళుతుంటే మనస్సు విలవిలలాడుతున్నది. అయినా నిన్ను చూచి ఊరటపొందుతున్నది.

విశేషం: తల్లి మమకారంతో నిండిన పై ఆవేదన, చిన్నకొడుకు అమాయకత్వం లోకంలో ఆడపిల్లను అప్పగింతలు పెట్టే స్థితిని గుర్తుకు తెస్తున్నది.

తే. ఎప్పు డెయ్యెడ నేమిట నెట్టు లరయ।
వలసె నమ్మెయి నారయు మలసి డస్సి
నొచ్చియైనను నేమఱ కిచ్చఁ దలఁచి।
తడవి నాచేత దీవన వడయు మమ్మ!' 193

ప్రతిపదార్థం: అమ్మ!= ద్రౌపదీ!; ఎప్పుడు= ఎప్పుడైనా; ఏ+ఎడన్= ఎక్కడైనా; ఏమిటన్= అన్నిటా; ఎట్టులు+అరయవలసెన్= ఎట్లా చూచుకొనాలో; ఆ+మెయిన్= ఆ విధంగా; ఆరయుము= చూచుకొమ్ము; అలసి= అలిసిపోయి; డస్సి= శ్రమపడి; నొచ్చి+ఐనను= కష్టమైనా; ఏమఱక= మరపులేక; ఇచ్చన్+తలఁచి= మనసు కనిపెట్టి; తడవి= కాపాడి; నాచేతన్= నా వలన, కుంతిచేత; దీవన+పడయుము= ఆశీస్సులు పొందుము.

తాత్పర్యం: ఓ ద్రౌపదీ! ఎక్కడైనా, ఎప్పుడైనా, అన్నిటా ఎట్లా చూచుకొనాలో అట్లా చూచుకొమ్ము. అలసి, సొలసి, కష్టపడి, మరపులేకుండా అతడి మనస్సు కనిపెట్టి కాపాడి నా దీవనలను పొందుము.'

విశేషం: 1. ఇక్కడ పసిపిల్లవాడి సంరక్షణ బాధ్యతను అప్పగించే ఒక తల్లి హృదయాన్ని కవి చక్కగా చిత్రించాడు. చిన్న చిన్న మాటలతో తల్లి ఆవేదనను వ్యక్తం చేశాడు. 2. కుంతి 211వ పద్యంలో ఇల్లడపెట్టినట్లు మాట్లాడింది. కాబట్టి అరణ్యాజ్ఞాతవాసాల తరువాత సహదేవుడిని తిరిగి తన కిచ్చి ఆశీస్సులను పొందుమని ద్రౌపది నడిగింది. రాబోయే వచనంలో అజ్ఞాతవాసంలో అతడిని స్వయంగా సేవించలేనందుకు ద్రౌపది విచారం వెలిపుచ్చింది.

వ. అని యప్పగించె; నేనును వనవాసకాలంబున నానేర్చు విధంబున మీకు నెల్లను గారామైన తమ్ముని నమ్మెయిం బరికించికొని వచ్చితి; నిపు డజ్ఞాతవాసాయాసితుండగు నతని నాకు ననుసరింప వెరవు గామిం జేసి చేయునది లేక చింతిల్లుచున్నదాన; నా తెఱంగు వినుము. 194

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; అప్పగించెన్= అప్పగించింది; నేనును= నేను కూడా (ద్రౌపది కూడా); వనవాస కాలంబునన్= అరణ్యవాస సమయంలో; నానేర్చువిధంబునన్= నా శక్తి కొద్దీ; మీకున్+ఎల్లను= మీకందరికీ; గారము+ఐన తమ్మునిన్= ముద్దుల తమ్ముడైన సహదేవుడిని; ఆ+మెయిన్= అట్లా; పరికించుకొని వచ్చితిన్= కాపాడుకొంటూ వచ్చాను; ఇపుడు; అజ్ఞాతవాస+ఆయాసితుండు+అగు= అజ్ఞాతవాస నియమంచేత అలసినవాడైన; అతనిన్= సహదేవుడిని; నాకున్= నాకూ (ద్రౌపదికి); అనుసరింపన్= వెంబడించటానికి; వెరవుకామిన్+చేసి= సాధ్యపడకపోవడంవలన; చేయునదిలేక= చేసేదిలేక; చింతిల్లుచున్+ ఉన్నదానన్= బాధపడుతున్నాను; నాతెఱంగు వినుము= నా కథ వినుము.

తాత్పర్యం: అని చెప్పి నాకు అప్పగించింది. నేను అరణ్యవాస సమయంలో నా శక్తికొద్దీ మీ అందరికీ గారాబు తమ్ముడైన సహదేవుడిని ఆ విధంగా కంటికి రెప్పగా కాపాడాను. మరి ఇప్పుడు అజ్ఞాతంగా ఉన్న సమయంలో అతడి శ్రమ పోగొట్టటం నాకు చేతకావటం లేదు. అందుకు చేసే దేమీ లేక మనస్సులో బాధపడుతున్నాను. ఇక నా సంగతి వినుము.

సీ. ద్రుపద భూవిభుఁడు పుత్త్రులకంటె నెంతయుఁ।
బెంపు సేయుచు గారవింపఁబెరిఁగి,
కుంతీమహాదేవి కోడండ్ర లోపల।
నగ్గలంబుగఁ గొనియాడఁబరఁగి,
ప్రాణంబులకు నెల్లఁ బ్రాణంబుగా మీరు।
నెయ్యంబు తియ్యంబు నెఱప నడచి,

మదిఁ దల్లిదండ్రుల మాఱుగాఁ గొని జను।
లనిశంబు భక్తి సేయంగ నెగడి
తే. రూపగుణ విక్రమంబుల రూఢికెక్కు।
నట్టి కొడుకులఁ గని భరతాన్వయంబు
నందు నా యిల్ల యిల్లుగా నతిశయిల్లి।
తగవుమై బాంధవులచేతఁ బొగడు వడసి. 195

ప్రతిపదార్థం: ద్రుపద భూవిభుఁడు= ద్రుపద మహారాజు; పుత్త్రులకంటెన్= కొడుకుల కంటె; ఎంతయున్+పెంపు+చేయుచున్= ఎంతో మిన్నగా చూస్తూ; గారవింపన్+పెరిఁగి= గౌరవించగా పెద్దదాననై; కుంతీమహాదేవి= మహారాణి అయిన కుంతీదేవి యొక్క; కోడండ్రలోపలన్= కోడళ్ళలో; అగ్గలంబుగన్= అధికంగా; కొనియాడన్+పరఁగి= పొగడగా వర్ధిల్లి; మీరు= పాండవులు; ప్రాణంబు లకున్+ఎల్లన్+ప్రాణంబు+కాన్= ప్రాణాధికంగా; నెయ్యంబు= స్నేహం; తియ్యంబునెఱపన్= మాధుర్యపు వలపు ప్రసరింప చేసేటట్లు; నడచి= ప్రవర్తించి; జనులు= లోకులు; మదిన్= మనస్సులో; తల్లిదండ్రుల మాఱుగాన్+ కొని= తల్లిదండ్రులకు బదులుగా లెక్కించి; అనిశంబున్= ఎప్పుడూ; భక్తి+చేయంగన్= భక్తితో చూడగా; నెగడి= వర్ధిల్లి; రూపగుణ విక్రమంబులన్= రూపంలోను, గుణంలోను, పరాక్రమంలోనూ; రూఢికిన్+ ఎక్కు= ప్రసిద్ధులైన; అట్టి కొడుకులన్= అంతటి ఉపపాండవులను; కని= పొంది; భరత+ అన్వయంబునందున్= భరతవంశంలో; నా+ఇల్లు+అ= నా కుటుంబమే; ఇల్లు+ కాన్+అతిశయిల్లి= గొప్పదైన కుటుంబంగా వర్ధిల్లి; తగవుమైన్= న్యాయమైన రీతిలో; బాంధవులచేతన్+పొగడు+పడసి= చుట్టాల వలన పొగడ్తలు పొంది.

తాత్పర్యం: ద్రుపద మహారాజు తన కొడుకుల కంటె గారాబుగా పెంచి పెద్ద చేస్తే గౌరవంగా పెరిగాను. కుంతీదేవి తన కోడళ్ళందరిలో నన్ను అధికంగా పొగడగా వర్ధిల్లాను. మీరందరూ (భర్తలైదుగురూ) సమానంగా స్నేహానురాగాలు పంచగా ప్రవర్తిల్లాను. లోకులు తల్లిదండ్రులకు మారుగా భక్తితో నన్ను సేవించేటట్లు మసలాను. రూపగుణ బలపరాక్రమాలలో పేరొందిన కుమారులకు తల్లినయ్యాను. భరతవంశంలో నా కుటుంబమే గొప్ప కుటుంబంగా ప్రకాశించాను. అందరితో న్యాయంగా వర్తించటం చేత బంధువుల పొగడ్తలను పొంది.

విశేషం: ఉత్తమురాలైన ఇల్లాలికి ఉండవలసిన సప్తగుణాలు ఇందులో పేర్కొనబడ్డాయి. 1.పుట్టింటి గౌరవం ద్రుపదునింట వంశోద్ధారకుడైన పుత్రుడికంటె ద్రౌపది ఎక్కువగా గౌరవించబడటం విశేషం. 2. మెట్టినింటి మన్నన - పాండవులకు ద్రౌపదితో పాటు మరికొందరు భార్యలు కూడా ఉన్నారు. వారందరికంటె ఘనంగా చూడటమే కాకుండా, ఘనంగా అందరి ముందూ పొగడి చెప్పేది అత్తగారు. అది అందరికీ కలిగే అదృష్టం కంటె విశిష్టం. 3. భర్తల అనురాగం (వాల్లభ్యం) - అయిదుగురు భర్తలూ తమ పంచప్రాణాలకు ప్రాణమైనదానినిగా ద్రౌపదిని చూచుకొనేవారు. అంటే ఆమె లేకపోతే తాము బ్రదుకజాలమనే అనురాగాన్ని ప్రదర్శించేవారన్నమాట! అది సతి పొందే వాల్లభ్య విశేషం. 4. ప్రజానురాగం - ప్రజలకు ప్రత్యక్ష దేవతలు వారి తల్లిదండ్రులు. వారిని భక్తితో పూజించటం వారి ప్రథమ కర్తవ్యం. అయితే ద్రౌపది తల్లిదండ్రులను మరపింపజేసే వాత్సల్యాన్ని ప్రజల పట్ల ప్రదర్శించటం చేత మాతాపితరులకు బదులు ద్రౌపదినే భక్తితో చూచేవారట! ఇది ప్రజానురాగానికి పరాకాష్ఠ. 5. సంతానవతి కావటం- గుణవంతులై ప్రసిద్ధిపొందిన పుత్రులను పొంది ఉండటం పుత్రోత్సవాన్ని పొందటమే. 6. కుటుంబ గౌరవం - 'నా ఇల్లే ఇల్లుగ' (అనన్వయాలంకారం) చెప్పటం విశేషం. ద్రౌపది కుటుంబంతో పోల్చ దగిన కుటుంబం ద్రౌపది కుటుంబ మొక్కటే అని చెప్పుకొనగల గౌరవం ద్వారా భరతవంశ గౌరవం నిలిపింది. 7. బంధుప్రీతి - అన్నీ ఉన్నా బంధువులందరూ ఏకగ్రీవంగా మెచ్చుకొనటం ఇల్లాళ్ళకందరికీ అబ్బే అదృష్టం కాదు. అది ద్రౌపదికి కలిగింది. దానికి కారణం ఆమె న్యాయం తప్పకుండా నడుస్తుంది కాబట్టి. ఉత్తమ సాధ్వికి ఉత్తమోదాహరణం ద్రౌపది. (సంపా.)

మ. వినుతింపందగు రాజసూయమునఁ బృథ్వీదేవతా కోటికె
ల్లను సంతృప్తి యొనర్చి, వారి దయఁ గళ్యాణాత్మనై, పుణ్యవ
ర్తన పాండుక్షితిపాలు కోడ లనఁగా రాజన్యమాన్యప్రియాం
గనలందెల్లఁ బొగడ్తఁగంటి నతిలోకంబైన మీ మన్ననన్. 196

ప్రతిపదార్థం: వినుతింపన్+తగు= పొగడదగిన; రాజసూయమునన్= రాజసూయ యాగంలో; పృథ్వీదేవతాకోటికిన్+ఎల్లను= బ్రాహ్మణుల సముదాయాని కంతటికీ; సంతృప్తి+ఒనర్చి= మంచి తృప్తి కలిగించి; వారి దయన్= వారి అనుగ్రహంతో; కళ్యాణ+ ఆత్మన్+ఐ= శుభప్రదమైన మనసు కలదానినై; అతిలోకంబు+ఐన= అపూర్వమైన; మీ మన్ననన్= మీ అభిమానం చేత; రాజన్యమాన్య ప్రియ+ అంగనలందున్+ఎల్లన్= గౌరవించ దగిన రాజుల పట్టపురాణులందరిలో; పాండుక్షితిపాలుకోడలు= పాండురాజు కోడలైన ద్రౌపది; పుణ్యావర్తన= పుణ్యాలు కలిగించే నడవడి కలది; అనఁగాన్= అనేటట్లు; పొగడ్తన్+ కంటిన్= ప్రశంసలందుకొన్నాను.

తాత్పర్యం: లోకప్రసిద్ధమైన రాజసూయయాగంలో బ్రాహ్మణుల కందరికీ దక్షిణలిచ్చి తృప్తిపరచి వారి దయచేత నిర్మలమైన చిత్తం కలదాననయ్యాను. 'పాండురాజు కోడలైన ద్రౌపది పుణ్యాంగన' అని మహారాజుల పత్నులూ. మాన్యలూ అయిన రాణులందరూ ప్రశంసించే కీర్తి సంపాదించాను. వీటి నన్నింటినీ మీరిచ్చిన ఆదరాభిమానాలవలననే పొందగలిగాను.

విశేషం: పాండవుల చరిత్రలో రాజసూయం ప్రతిష్ఠాత్మక ఘట్టం. ఆ యజ్ఞాన్ని వారు ధర్మపత్నీ సమేతంగా చేశారు. ధర్మరాజాదులతో పాటు ద్రౌపది పొందిన లాభాలను ఈ పద్యం పేర్కొన్నది. బ్రాహ్మణాశీస్సులతో ఆమె కల్యాణాత్మకురా లైనది. రాజసూయయాగంలో ధర్మరాజును దర్శించటానికి వచ్చిన మహారాజుల పట్టమహిషులందరూ ద్రౌపదిని 'పాండురాజు కోడలు' 'పుణ్యాంగన' అనీ కీర్తించారట! స్వర్గస్థుడైన మామగారు నారదుడిద్వారా ధర్మరాజును రాజసూయం చేయుమని కోరగా దానిని నిష్పాదరురాలై భర్తతో కలిసి నిర్వహించిన గౌరవం ఆమెకు దక్కింది. పైపద్యంలో అన్నీ ద్రౌపదికి స్వయంగా లభించిన లాభాలే. ఇవన్నీ భర్తల ప్రేమ వలన తనకు లభించినవి. ఈ విశ్లేషణాత్మక వివేచన ఆమె వివేకాన్ని తెలుపుతున్నది. (సంపా.)

ఉ. **ఏను మనంబు పెంపు సెడి యిప్పుడు నీచతరప్రకారముం**
బూని నికృష్టనై యుదర పోషణకై తగవేది యెంతయున్
దీనతఁ బొంది యిమ్మెయి సుదేష్ణ పనుల్ గనుసన్నఁ జేయుచున్
హీనత నున్కి మీకు వగపేమియుఁ జేయద యేమి సేయుదున్?197

ప్రతిపదార్థం: ఏను= ద్రౌపది; మనంబు పెంపు+చెడి= మనస్సులోగల అభిమానాన్ని కోల్పోయి; ఇప్పుడు= ఈ అజ్ఞాతవాస సమయంలో; నీచతర ప్రకారమున్+పూని= అల్పమైన వృత్తిని చేపట్టి; నికృష్టను+ఐ= హీనురాలనై; ఉదర పోషణకై= పొట్టకూటి కొరకు; తగవు+ఏది= న్యాయం వీడి; ఎంతయున్ దీనతన్+పొంది= ఎంతో దైన్యం పొంది; ఈ+ మెయిన్= ఈ విధంగా; సుదేష్ణ పనుల్= సుదేష్ణయొక్క పనులు; కనుసన్నన్+ చేయుచున్= కనుసైగలమాత్రం చేతనే పనిచేస్తూ; హీనతన్+ఉన్కి= హీనంగా ఉండటం; మీకున్= పాండవులకు; వగపు= దుఃఖం; ఏమియున్+చేయదు+అ= కలిగించదా? ఏమి+ చేయుదున్= ఇందుకు నేనేమి చేయగలను

తాత్పర్యం: నేను మానాభిమానాలు కోల్పోయి నీచంగా పొట్టకూటి కొరకు న్యాయం తప్పి దీనంగా ఈ విధమైన సుదేష్ణ పరిచర్యలకు పూనుకొని ఆమె కనుసన్నలలో హీనంగా చేస్తుండటం మీకు ఏ మాత్రం దుఃఖాన్ని కలిగించటం లేదు. నేనేం చేసేది? అది నా దురదృష్టం.

విశేషం: ఒకానొకప్పుడు రాజాధిరాజపరమేశ్వరుడైన ధర్మజుడి కొలువులో రాజుల భార్యలచేత నమస్కారాలు పొందిన పట్టమహిషి ద్రౌపది ఈనాడు ఒకరి కొలువులో పరిచారికగా పనిచేయటం విధి వైపరీత్యం. బండ్లు ఓడలు, ఓడలు బండ్లు కావటమనే సామెత గుర్తుకు తెస్తుంది. అయితే, ఇక్కడ విశేషమేమంటే-పాండవుల దైన్యస్థితిని చూచి ద్రౌపది ప్రతినిత్యమూ పరితపిస్తున్నది. కాని, ఆమె దీనస్థితిని చూచి పాండవు లెవ్వరూ పరితాపం చెందటం లేదని ఆమె నిష్ఠురమాడింది. పతి మనస్సును తనవైపు సానుభూతితో మరలించుకొనటానికి ఈ అధిక్షేపం సరసమైన ఆయుధం.

క. పని పంపఁగాని యొకతకుఁ।
బనిసేయ నెఱుంగ; నన్నుఁ బనిగొనునెడఁ బాం
డుని యగ్రమహిషి గొంకుచుఁ।
బనిగఱపెడు చందమునన పనుచుటెఱుఁగవే? 198

ప్రతిపదార్థం: పని పంపన్+కాని= పనులు చేయుమని ఒకరిని ఆజ్ఞాపించటమే కాని; ఒకతకున్= ఒక వనితకు; పనిచేయన్= సేవచేయటం; ఎఱుంగన్= ఎరగను; నన్నున్+ పనిగొను+ఎడన్= నాచేత పని చేయించుకొనేటప్పుడు; పాండుని అగ్రమహిషి= కుంతీదేవి; కొంకుచున్= సందేహిస్తూ; పనిగఱపెడు చందమునన్+అ= పనులు నేర్పే పద్ధతిగానే; పనుచుట= ఆజ్ఞాపించటం; ఎఱుఁగవు+ఏ?= ఎరుగవా? (నీకు బాగా తెలియునని భావం).

తాత్పర్యం: పట్టమహిషిగా సహస్రపరిజనులచేత పనులు చేయించుకొనటమే గాని, ఒకరి వద్ద పనిచేయటం నాకు తెలియదు. అత్తగారు కుంతీదేవి కూడా నాకేదైనా పని చెప్పదలచుకొన్నప్పుడు వెనుకాడుతూనే, ఆజ్ఞాపిస్తున్నట్లుకాక పని నేర్పటానికి పనిచెప్పిన విధంగానే పనులు చెప్పేది.

విశేషం: అత్తగారు కూడా మన్ననగా చూచేది ద్రౌపదిని. అజమాయిషీగా పనులు చేయించటం ఒక పద్ధతి. ఆదరంగా బుజ్జగించి కోడలికి పని చెప్పటం ఒక పద్ధతి. కుంతి లౌకిక మెరిగిన సాధ్వి. మనసు నొప్పించకుండా పనులు చేయించుకొనేది. అందుకే ద్రౌపది పొగడ్త లందుకొన్నది. అత్తా కోడళ్ళ అనుబంధానికి కుంతీ ద్రౌపదుల సంబంధం నిదర్శనం.

ఉ. ఒల్లరు రాజుదేవులును నొడ్డులు రాచిన చందనంబు; మే
నెల్లఁ జెమర్పఁగా నలయ కేను శ్రమంపడి నిల్చి నిల్చి య
ల్లల్లన మార్దవం బొనరునట్లుగ నెట్టకునేని రాచి మీ
తల్లికి భక్తిఁ బెట్టెడు విధంబునఁ బెట్టుదు; బ్రహ్మఁ దిట్టుదున్. 199

ప్రతిపదార్థం: రాజు= విరాటరాజుయొక్క; దేవులునున్= సుదేష్ణమొదలైన రాణులూ; ఒడ్డులు రాచిన= ఇతరులు తీసిన; చందనంబు= గంధాన్ని; ఒల్లరు= అంగీకరించరు; మేను+ఎల్లన్+చెమర్పఁగాన్= శరీరమంతా చెమట పట్టేటట్లు; అలయక= అలసిపోకుండా; ఏను= ద్రౌపది; శ్రమంపడి= కష్టపడి; నిల్చి నిల్చి, అల్లన్+అల్లన్= మెలమెల్లగా; మార్దవంబు+ఒనరునట్లుగన్= మెత్త దనం వచ్చేటట్లు; ఎట్టకున్+ఏనిన్= ఏదో విధంగా; రాచి= అరగదీసి; మీ తల్లికిన్= మీకు తల్లీ నాకు అత్తగారూ అయిన కుంతీదేవికి; భక్తిన్= భక్తితో; పెట్టెడు విధంబునన్= శరీరానికి అలదే రీతిగా; పెట్టుదున్= వారి శరీరాలకు అలదుతున్నాను; బ్రహ్మన్+తిట్టుదున్= (నాకిటువంటి దుస్స్థితిని కలిగించి నందుకు) విధిని దూషిస్తాను.

తాత్పర్యం: ఇతరులు తీసిన గంధాన్ని సుదేష్ణ మొదలైన రాణులు ఒప్పుకోరు. నేనే శ్రమపడి చెమటలు పట్టేటట్లు అరగదీసి మెత్తటి చందనాన్ని, మీ తల్లికి భక్తితో అలదిన విధంగా వారికి అలదుతున్నాను. నాకీ స్థితిని కలిగించిన బ్రహ్మను లోలోన నిందిస్తాను.

విశేషం: ఇక్కడ గంధం అరగతీసే ఒక ప్రక్రియ చెప్పబడింది. చందనానులేపనం రాజుల కలవాటు. మనం ఈ రోజు స్నో, పౌడరు పూసికొన్నట్లు వారు చందనం పూసికొనేవారు. అది ఆరోగ్యానికి, ఆహ్లాదానికి, సువాసనకు పనికివస్తుంది. గంధం తీయడం ఒక కళ. మెత్తగా అరగదీసి శరీరానికి అలదాలి. అత్తగారి పరిచర్యలలో ఒక భాగంగా సేవాదృక్పథంతో చేసేది ద్రౌపది. ఇక్కడ పరిచారిక వలె చేయటం బ్రహ్మ వ్రాసిన తలరాత అని బాధపడుతున్నది.

ఉ. నున్నఁదనంబుగా నలుఁగు నూఱియుఁ జందన మట్లు రాచియుం
బన్నుగఁ గ్రొత్తలైన కలపంబులు గూర్చియు నా సుదేష్ణకుం
గన్నుల సన్నలం బనులు గైకొని వారక చేయుచుండుటన్
ము న్నటులున్న పాణితలముల్ బలు కాయలు గాచెఁ జూచితే! 200

ప్రతిపదార్థం: నున్నఁదనంబుగాన్= మెత్తగా; నలుఁగు నూరియున్= నలుగుపిండి నూరి; చందనము+అట్లు రాచియున్= గంధంవలె పూతపూసి; పన్నుగన్= చక్కగా; క్రొత్తలు+ఐన= క్రొత్త క్రొత్తవైన; కలపంబులు= కలపడాలు (వివిధ సుగంధ ద్రవ్యాల మిశ్రమాలు); కూర్చియున్= సమకూర్చి; ఆ సుదేష్ణకున్= ఆ పట్టమహిషికి; కన్నుల సన్నలన్= కనుసైగలతోనే; పనులు= పరిచర్యలు; కైకొని= అంగీకరించి; వారక చేయు చుండుటన్= ఎప్పుడూ కాదనక చేయటం వలన; మున్ను= ఇంతకుముందు; అటులు+ ఉన్న= అట్లా మెత్తగా ఉన్న; పాణితలముల్= అరచేతులు; పలుకాయలు+కాచెన్= ఎన్నో కాయలు కాచాయి; చూచితే?= చూచావా?

తాత్పర్యం: మెత్తగా నలుగుపిండిని గంధంవలె నూరి, మైపూతలు పూసి, సువాసనల కలపములను ఏర్పరచి, ఎప్పుడూ రాణిగారి కనుసన్నలలో పరిచర్యలు చేస్తుంటాను. అందువలన సుకుమారమైన నా అరచేతులు ఎలా కాయలుగాచినాయో చూచితివా!

విశేషం: యజమానుల మెప్పు పొందడానికి పరిచారకులు ఎన్నో తంటాలు పడతారు. చందనాది అనులేపనాలు సమకూర్చి వారి మెప్పు పొందుతారు. అనురాగ ప్రేరకాలైన సువాసనలు వారి సౌభాగ్యానికి చిహ్నాలు. ఇవి ఏర్పరచిన పరిచారికలను రాజులు బహుమానాలతో సన్మానిస్తారు. ఇక్కడ ద్రౌపది పరిచారికగా అట్లా చేయాల్సి వచ్చింది. చేతులు కాయలు కాయటం అనేది నానుడి. కష్టించి పనిచేసేవారి అరచేతులు కాయలు కాస్తాయి. అలవాటు లేని పనులు చేయటం వలన అట్లా ఔతుంది. ద్రౌపది పరిస్థితి అట్లాఉన్నది.

క. అనుచుం దొరఁగెడు నశ్రుల।
మునిఁగినమో మతని వక్షమునఁ జేర్చిన న
వ్వనిత యవస్థయ తాల్చుచు।
ననిలసుతుం డడలె డెంద మలమటఁ బొందన్. 201

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; తొరఁగెడు అశ్రులన్= పొరలిపారే కన్నీటిచేత; మునిఁగిన మోము= తడిసిన ముఖం; అతని వక్షమునన్+చేర్చినన్= ఆయన ఎదురు రొమ్ముపై చేర్చగా; ఆ+వనిత= ద్రౌపది; అవస్థ+అ= కష్టాన్ని; తాల్చుచున్= తనదిగా భావించి తలచుకొంటూ; డెందము= మనస్సు; అలమటన్+పొందన్= కలత పడగా; అనిల సుతుండు= భీముడు, అడలెన్= దుఃఖించాడు.

తాత్పర్యం: అట్లా దుఃఖిస్తూ భీముడి గుండెలపై ముఖాన్ని చేర్చింది ద్రౌపది. ఆమె కష్టస్థితిని చూచి భీముడు కలతపడ్డ హృదయంతో దుఃఖించాడు.

విశేషం: మనస్సులో కష్టాన్ని ఇతరులకు చెప్పేటప్పుడు వరద వలె వచ్చే కన్నీరు బయటికి వచ్చేస్తే మనస్సులో తాపం తీరిపోతుంది. సన్నిహితుల ముందు కష్టాలు చెప్పుకొనటం, వారి ఆసరా తీసికొని గుండెలకు హత్తుకొనేటట్లు ఏడ్వడం సహజం. ఆపుకొనలేని దుఃఖం కలిగితే అది సహజం! ఇక్కడ కవి అది మన కళ్ళకు కట్టేటట్లు రవివర్మ చిత్రంవలె చూపించాడు.

తే. అట్టి యెడఁ దన్నుఁ దాన యూరార్చి కొనుచు।
నంబుజానన నెమ్మొగ మల్లఁదుడిచి.
యనునయించి తత్కరములు దనమొగంబుఁ।
గదియఁ జేర్చుచు నిట్టూర్పు గాడ్పునిగుడ. 202

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= అప్పుడు; తన్నున్+తాను+అ= తనను తానే; ఊరార్చి కొనుచున్= ఓదార్చుకొని; అంబుజ+ఆనన= పద్మముఖి ద్రౌపదియొక్క; నెఱ+మొగము= అందమైన ముఖాన్ని; అల్లన్+తుడిచి= మెల్లగా తుడిచి; అనునయించి= ఓదార్చి; తద్+ కరములు= ఆమె చేతులను; తన మొగంబున్= తన మొగంపై; కదియన్+ చేర్చుచున్= దగ్గరగా తీసికొని; నిడు+ఊర్పు గాడ్పు నిగుడన్= నిట్టూర్పు గాలి వ్యాపింపగా.

తాత్పర్యం: అప్పుడు భీముడు తనను తానే ఓదార్చుకొంటూ ద్రౌపది కన్నీరు తుడిచి, ఆమె చేతులు తన బుగ్గలపై సుతారంగా అదిమి దగ్గరగా తీసికొని నిట్టూర్పు పుచ్చుతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఇది అతి సహజమైన స్వభావం. చిన్న పిల్లలు చేతులు కాలాయని మన దగ్గరకు వస్తే ఆ చేతులు ముద్దాడుతూ మన బుగ్గలకు రాచుకొంటాం. అదే చేశాడు భీముడు. తిక్కన లోకజ్ఞత అది.

వ. చింతాక్రాంతుండైన కౌంతేయునకు నయ్యింతి యిట్లనియె. 203

ప్రతిపదార్థం: చింతా+ఆక్రాంతుండు+ఐన= విచారంచేత ఆక్రమించబడినవాడైన; కౌంతేయునకున్= భీముడికి; ఆ+ఇంతి= ద్రౌపది; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: భీముడు చింతపడుతుండగా ద్రౌపది ఇట్లా అన్నది.

తే. 'ఇందఱకు నిన్నిభంగుల నిడుమ గుడువ।
వలసె ధర్మతనూభవువలనఁ జేసి,
దాయ లొడ్డిన మాయ జూదంపుటురులఁ।
బడి కులంబున కాతఁ డిప్పాటు దెచ్చె. 204

ప్రతిపదార్థం: ధర్మతనూభవు వలనన్+చేసి= ధర్మరాజువలన; ఇందఱకున్= ఇంత మందికి; ఇన్నిభంగులన్= ఇన్ని రకాల; ఇడుమ కుడువవలసెన్= కష్టాలు అనుభవించ వలసి వచ్చింది; దాయలు+ఒడ్డిన= దాయాదులు పన్నిన; మాయ జూదము+ఉరులన్+ పడి= మాయ జూదమనే వలలో పడి; కులంబునకున్= వంశానికంతటికీ; అతఁడు; ఈ+ పాటు తెచ్చెన్= ఈ కష్టాన్ని కలిగించాడు.

తాత్పర్యం: 'దాయాదులు పన్నిన మాయజూదమనే వలలో చిక్కుకొన్న ధర్మరాజు జూదమాడి పణంగా ఒడ్డటం వలన మనమందరం ఈనాడు ఇన్ని రకాలుగా కష్టాలకు లోనయ్యాం. ధర్మజుడే మన వంశానికి వాటిల్లిన ఈ భంగపాటు కంతటికీ కారణం.

ఉ. అక్కట! మోసపోయి యడియాసలఁ జావక యున్నదాన; ము
న్నొక్కెడ నే దురంతదురితోత్కట బాధలఁ బెట్టియున్న నా
కెక్కడి దుఃఖశాంతి గడయెయ్యుట యెమ్మెయిఁ గల్గ నేర్చు? మీ
ముక్కున నూర్పు గల్గ నొక మూర్ఖునిచేఁ బడితిన్ సభాస్థలిన్. 205

ప్రతిపదార్థం: అక్కట!= ఔరా!; మోసపోయి= వంచించబడి కూడా; అడియాసలన్+ చావక+ఉన్నదానన్= చివరి ఆశలతో ఇంకా చావకుండా ఉన్నాను; మున్ను= పూర్వజన్మలో; ఒక్క+ఎడన్= ఒకప్పుడు; ఏన్= నేను; దురంత= అంతులేని; దురిత+ఉత్కట బాధలన్+ పెట్టియున్న= అధికమైన పాపిష్ఠి బాధలను పెట్టి ఉన్న; నాకున్= నాకు; ఎక్కడి దుఃఖశాంతి= దుఃఖానికి శాంతి ఎక్కడిది?; కడ+ఎయ్యుట+ఏమెయిన్+కల్గనేర్చున్= గట్టెక్కుట ఏ విధంగా కలుగుతుంది?; మీ ముక్కునన్+ఊర్పుకల్గన్= మీరు ప్రాణాలతో ఉండగా; ఒక మూర్ఖునిచేన్= ఒక నీచుడిచేత; సభాస్థలిన్= సభలో; పడితిన్= భంగపడ్డాను.

తాత్పర్యం: ఔరా! నేను మోసపోయి చావకుండా ఆశాపాశంతో ఇంకా బ్రదికి ఉన్నాను. పూర్వజన్మలో నేను ఎవరినో నిరంతరం కష్టాలపాలు చేసి ఉంటాను. అందువలననే నాకు దుఃఖశాంతి లేదు. ఈ దుఃఖం నుండి బయటపడి గట్టెక్కటం ఏ విధంగా సాధ్యమౌతుంది? మీరు ప్రాణాలతో ఉండగానే ఒక మూర్ఖుడిచేత సభలో ఆ విధంగా భంగపడ్డాను కదా!

విశేషం: సజీవులుగా ఉండగా అనడానికి 'ముక్కున ఊర్పు కల్గన్' అనే జాతీయాన్ని కవి ప్రయోగించాడు. భర్తలు బ్రతికి ఉండగా, సభలో జనులు చూస్తుండగా అవమానంపాలు కావటం భరించరానిది. ఈ మాటలు భీముడి కోపాన్ని రెచ్చగొట్టగలవు.

క. మీ రేమి సేయుదురు? దై।
వారంభము గాక శుభము నశుభంబును సం

సారులకుం దమ తఱి నని।

వారణఁ బొందంగ మాన్పవచ్చునె? దానిన్. 206

ప్రతిపదార్థం: మీరు= మీరు- పాండవులు; ఏమి+చేయుదురు?= ఏం చేస్తారు?; దైవ+ఆరంభము+కాక= దైవఘటనమేగాని మరొకటికాదు; సంసారులకున్= జనులకు; శుభమున్+అశుభంబును= శుభాశుభాలు, మంచి చెడులు; తమ తఱిన్= వాటి సమయాలలో; అనివారణన్= తప్పించటానికి వీలులేని విధంగా; పొందంగన్= పొందుతూ ఉండగా; దానిన్= ఆ అనుభవాన్ని; మాన్పవచ్చునె?= ఆపగలమా?

తాత్పర్యం: అయినా మీరేం చేస్తారు? విధిఘటన దాటటానికి ఎవరికీ సాధ్యం కాదు. శుభాశుభాలను సంసారులు ఆయా సమయాలలో అనుభవించాల్సిందే. దానిని నివారించటం ఎవరికీ సాధ్యం కాదు గదా!

విశేషం: హరిశ్చంద్రుడు, నలుడు-ఇట్లా ఎందరో చక్రవర్తులు విధికి తలవంచారు. కర్మఫలరూపాలైన శుభాశుభాలు వాటి అంతట అవి ఆయా సమయాలలో వస్తూ ఉంటాయి. వాటిని అతిక్రమించటానికి ఎవరికీ సాధ్యం కాదు. ద్రౌపది ఈ విషయాన్ని భీముడి ముందు స్పష్టం చేయటంలో రెండు హేతువులున్నాయి. దైవసంకల్పం అనివార్యం అని చెప్పటం; పాండవుల పురుషకారంలో ఆనుకూల్యం లేకపోవటం వారి కర్మఫలమని ఓదార్చటం.

ఉ. కావున మీర లభ్యుదయ గౌరవ మొందుట యాత్మఁ గోరి యే

నే విధినైన నాపదల కెల్లను నోర్చెద; దాని కేమి! యీ

కావరమైన కీచకుఁడు కామనిపీడితుఁడై యలంతులం

బోవక యేచి పట్టుకొనఁ బోయినఁ దూలెదఁగాక యిమ్మెయిన్. 207

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మీరలు= పాండవులు; అభ్యుదయ గౌరవము+ఒందుట= ఉన్నతిని, గౌరవాన్ని పొందటం; ఆత్మన్+కోరి= మనస్సులో కోరుకొని; ఏను= నేను; ఏవిధిన్+ఐనన్= ఏ విధంగానైనా; ఆపదలకున్+ఎల్లనున్= కష్టాలన్నిటికీ; ఓర్చెదన్= ఓర్చుకొంటాను; దానికిన్+ ఏమి= దానికేం గాని; ఈ కావరము+ఐన కీచకుఁడు= క్రొవ్వు పట్టిన ఈ కీచకుడు; కామనిపీడితుఁడు+ఐ= మన్మథావేశంతో; అలంతులన్+పోవక= చిన్న చిన్న ప్రయత్నాలతో ఆగక; ఏచి పట్టుకొనన్+పోయినన్= విజృంభించి పట్టుకొన బోవటం చేత; ఈ+మెయిన్= ఈ విధంగా; తూలెదన్+కాక= భయంతో వణికి పోతున్నాను.

తాత్పర్యం: కాబట్టి మీ గౌరవాన్నీ, ఔన్నత్యాన్నీ మనస్సులో కోరుకొని నేను ఎట్లాగైనా ఆపదలన్నిటినీ ఓర్చుకొంటాను. అది ఫర్వాలేదు. కాని, ఈ పొగరుబోతు కీచకుడు మదనపీడితుడై చిన్న చిన్న యత్నాలతో ఆగక, విజృంభించి నన్ను పట్టుకొనటానికి ప్రయత్నించటంతో ఇంతగా భయంతో వణికిపోతున్నాను.

విశేషం: ఆపదలు ఒకదాని వెంబడి ఒకటి ద్రౌపదిని చుట్టుముట్టాయి. కాని, పాండవుల అజ్ఞాతవాసం పూర్తి కావాలి. దానికి ద్రౌపది సహకారం అవసరం. అందుకే అవమానాలు భరిస్తున్నది. కాని, కీచకుడి కండకావరం ఆమెను దుఃఖాల పాలు చేసింది. అందుకే భీముడితో మదనాతురుడైన కీచకుడి ఆగడాలను చెప్పుకొని విలపించింది.

తే. వానిఁ దెగఁ జూడవైతేని వాయుపుత్ర।

నీవు గనుఁగొన నురినైన, నీరనైన,

నగ్నినైన, విషంబున నైన, నేను।

మేను దొఱఁగుదు నెట్టు; నీ యాన సుమ్ము!' 208

ప్రతిపదార్థం: వాయుపుత్ర!= భీమసేనా!; వానిన్= ఆ కీచకుడిని; తెగన్+ చూడనైతి+ ఏనిన్= చంపప్రయత్నించనిచో; నీవు కనుఁగొనన్= నీవు (భీముడు) చూస్తూ ఉండగానే; ఉరిన్+ఐనన్= ఉరివేసికొని అయినా; నీరన్+ఐనన్= నీళ్ళలోపడి అయినా; అగ్నిన్+ఐనన్= అగ్నిలో దూకి అయినా; విషంబునన్+

ఐనన్= విషం త్రాగి అయినా; నేను= (ద్రౌపది); ఎట్టున్= ఎట్లాగైనా; మేను దొఱఁగుదున్= శరీరం వదిలిపెట్టుతాను; నీ+ఆన సుమ్ము!= నీమీద ఒట్టు సుమా!

తాత్పర్యం: ఓ భీమసేనా! ఆ నీచ కీచకుడిని సంహరించకపోతే నేను నీ యెదుటనే ప్రాణత్యాగం చేస్తాను. ఉరి వేసికొనిగాని, నీళ్ళలో దూకిగాని, అగ్నిలో పడిగాని, విషం తినిగాని శరీరం విడిచిపెడతాను. నీమీద ఒట్టు.'

విశేషం: నీ ఆనసుమ్ము- అనేది జాతీయం. ఆత్మీయులతో మాట్లాడేటప్పుడు అట్లా అనటం సహజం. అది ఆత్మీయతకు నిదర్శనం.

వ. అనిన వృకోదరుండు చిఱునవ్వు నవ్వుచు నిట్లనియె. 209

తాత్పర్యం: ఆ మాటలు విని భీముడు చిరునగవు చిందిస్తూ ఇట్లా అన్నాడు.

భీముఁడు కీచకునిఁ జంపుటకుఁ బ్రతిజ్ఞ చేయుట (సం.4-20-1)

చ. 'జలజదళాక్షి! కీచకునిఁ జంపుట కిమ్మెయి ముట్టఁబల్కగా
వలయునె? యేను జూడ ననివారణ నిన్నుఁ బరాభవించి వాఁ
డిల మన, నింక నాంద్రకును నెవ్వరు భంగము నీఁగఁజాలువా?
రలఘు మదీయ బాహుబల మప్పుడు చూపనితప్పు చాలదే? 210

ప్రతిపదార్థం: జలజదళ+అక్షి!= తామరపూరేకులవంటి కన్నులు కలదానా!; కీచకునిన్+ చంపుటకున్= కీచకుడిని చంపటానికి; ఈ+మెయిన్= ఈవిధంగా; ముట్టన్+పల్కఁగాన్= మర్మాలు తగిలేటట్లు మాట్లాడటం; వలయునె?= అవసరమా?; ఏను+చూడన్= నేను చూడగా; అనివారణన్= అడ్డులేకుండా; నిన్నున్= ద్రౌపదిని; పరాభవించి= అవమానించి; వాఁడు= కీచకుడు; ఇలన్= భూమిపై; మనన్= జీవించగా; ఇంకన్= ఇకపై; ఆంధ్రకునున్= ఇల్లాండ్రకు; ఎవ్వరు భంగమున్+ఈఁగఁన్+చాలువారు?= ఎవరు కష్టాలు గట్టెక్కించగలరు?; అలఘు= గొప్పదైన; మదీయ బాహుబలము= నా భుజశక్తి; అప్పుడు చూపని తప్పు= ఆ సమయంలో ప్రదర్శించని పొరబాటు; చాలదే?= చాలదా?

తాత్పర్యం: 'ఓ ద్రౌపదీ! కీచకుడిని చంపటం కొరకు ఈ విధంగా మర్మాలు తగిలేటట్లు ఇంతగా నచ్చచెప్పవలెనా? నేను చూస్తుండగా అడ్డూ ఆపూ లేకుండా నిన్ను పరాభవించిన ఆ కీచకుడు ఇంకా భూమిపై జీవించి ఉంటే ఇల్లాండ్రను మానభంగాలనుండి గట్టెక్కించే మార్గ మేది? ఆనాడు విరాటుడి కొలువులో నా మహా భుజశక్తిని చూపకపోవటమే తప్పయింది. అది చాలు. (మరల ఆ తప్పు చేయను అని భావం.)

విశేషం: ఈ పద్యంలో 'ముట్టన్ పల్కు' అనే క్రియ సార్థకం. తిక్కన ద్రౌపదీ సంభాషణలోని శిల్పరహస్యాన్ని ఈ క్రియాపదంతో సూచించాడు. ముట్టఁ బల్కుట-అంటే మర్మస్థానాలను తాకేటట్లు మాట్లాడటం అని శబ్దరత్నాకరం చెప్పింది. వక్త తాను ఏ ప్రయోజనాన్ని సాధింపదలచుకొన్నాడో అది సాధ్యమయ్యే టట్లు నిపుణంగా సప్రయోజనంగా మాట్లాడటం 'ముట్టఁబల్కటం'. నిర్లిప్తంగా ఉండి, నిద్రపోతున్న భీముడిలో రౌద్రాన్ని ప్రజ్వలింపజేయటం, అతిశీఘ్రంగా, రహస్యంగా కీచకుడిని సంహరింపజేయటం ద్రౌపది సాధింపదలచుకొన్న ప్రయోజనం. అది సఫలమయ్యేటట్లు ముట్టబలికిందని తాత్పర్యం. ఆ అంశాన్ని ఇట్లా భావించవచ్చును. 1.ధర్మరాజు మాయజూదపు ఉరులలో తాను చిక్కుకొని తనవారి కందరికీ కష్టాలు తెచ్చాడట! ధర్మరాజు మహిమను అంతకుముందే అంతగా ప్రశంసిస్తూ పలికిన ద్రౌపది మరల ఇట్లా అనటం ఆశ్చర్యం కలిగించే విషయం. ధర్మజుడి ఓటమివలన అరణ్యాజ్ఞాతవాసాలు సంభవించాయి. దానికి తోడు ద్రౌపదికి అవమాన పరంపరలు కూడా ఆరంభమయ్యాయి. కులసతికి కలిగే ఇక్కట్టులే కులానికి పాటు కలిగిస్తాయని మొదటి హెచ్చరిక. అయిదుగురు భర్తలున్నా భార్యకు మానసంరక్షణం అనుమానస్థితిలో పడటం శోచనీయమని 225వ పద్యంలో ముట్టబలికింది. 2. పతుల ఎదుట సతులకు జరిగే అవమానాలు సతులకు ప్రాణాంతకాలు, పతులకు ఆత్మహత్యా సదృశాలు. పతులు మానధనులై

తనను రక్షించగలరని ఆశపడ్డ ద్రౌపది మోసపోవటమే జరిగింది. నిజానికి ఆమె ప్రాణాలు వదలిపెట్టవలసింది. కాని, ఎప్పుడైనా భర్తలు బ్రతికి ఉండగా తనకు జరిగే అవమానాలకు ప్రతీకారం చేస్తారనే అడియాసలతో ఆమె బ్రతుకు దుఃఖభారంతో సాగిస్తున్నది. ఆ దుఃఖం శాంతించేటట్లు లేదు. ఆమె కష్టాలు గట్టెక్కేటట్లు లేవు. ఎందుకంటే, భర్తలు బ్రతికి ఉండగానే నిండుసభలో ఒక మూర్ఖుడు (కీచకుడు) తనను అవమానించాడు. కాని, అప్పుడు కూడా వారు బ్రతికి ఉన్నట్లు నిరూపించుకొనలేకపోయారు. భార్యా మాన సంరక్షణం చేయలేని భర్తలు జీవన్మృతులవంటి వారని ఆమె ఉద్ధతుడైన భీముడు ఉలికిపడేటట్లు 226వ పద్యంలో ముట్ట బలికింది. 3. భర్తల అశక్తతకు విధివైపరీత్యం కారణమని సత్యం చెప్పినా ఎత్తి పొడుపుగా కాకువులో ముట్టబలికింది. పాండవులు కురుసభలో ధర్మబద్ధులు. విరాటసభలో సమయబద్ధులు. ద్రౌపది మాత్రం వారి వ్రతనిష్ఠవలన బాధితురాలు. పాండవుల వ్రతనిష్ఠ వలన వారికి అభ్యుదయ గౌరవాలు కలుగుతాయి. వారు ధర్మవీరు లనిపించుకొంటారు. కాని, ఆపదలన్నీ అనుభవించేది మాత్రం ద్రౌపదియే. భర్తలకు అభ్యుదయం కలిగేటట్లయితే ద్రౌపది ఎన్ని అవమానాలైనా పడటానికి సిద్ధమే అని చెప్పింది. ఆ మాటలు ఆమె దీనావస్థకు పరాకాష్ఠ. దానిని ముట్టబలికింది 227, 228 పద్యాలలో. 4. ఇప్పుడు ఆమె నిష్ఠురాలు ఎందుకు మాట్లాడుతున్నదో తెలుపుతున్నది. 'కీచకుడి చేష్టలు శ్రుతిమించుతున్నాయి. అతడు కామం చేత పీడింపబడుతున్నాడు. (మన్మథ బాధను పొందుతున్నాడు.) అంటే రతిక్రీడకు తొందరపడుతున్నాడని భావం. మొదట మాటలతో, చిన్న చిన్న చేష్టలతో పోతాడేమో అని అనుకొంటే ఇప్పుడు అంతటితో ఆగక విజృంభించి నన్ను పట్టుకొనటానికి సిద్ధమయ్యాడు భర్తలు చూస్తుండగానే. అతడెప్పుడైనా ఏ విధంగానైనా ఎక్కడైనా నాపై సాహసించగలడు. అప్పుడు నన్ను రక్షించే దెవరు? - 'ఒకవేళ రక్షించగలిగితే నీవొక్కడవే ప్రస్తుతం సమర్థుడవు'- అనే ఆశ తన మనసులో ఉన్నట్లు ముట్టబలికింది 228వ పద్యంలో. 5. ఇప్పుడు శీఘ్రంగా కీచకుడిని చంపటం తప్ప మరొక మార్గం లేదు. ఇది ఉపేక్షకు, విచికిత్సకు సమయం కాదు. ఒకవేళ దానిని భీముడు నిర్వహించకపోతే నేను ఉరిపోసుకునిగాని

నీటిలో దూకిగాని, అగ్నిలో పడిగాని, విషం త్రాగిగాని చచ్చిపోతానన్నది. ఇది బెదిరింపు మాట కాదు. 'మీ మీద ఒట్టుపెట్టి చెపుతున్నాను. మీమీద నాకున్న భక్తి అటువంటిది. నమ్మకం అటువంటిది. నాకు మానభంగం కంటే ప్రాణభంగమే శ్రేష్ఠం'- అని ముట్టబలికింది.

ఆ మాటలకు ప్రతిస్పందన భీముడి ఈ మాటలు. భీముడు ద్రౌపది మాటలలోని ప్రయోగశక్తిని గుర్తించినట్లు పలికాడు. ద్రౌపదిని పరాభవించిన కీచకుడు తనచేత చావటం తప్పదని సంకల్పించాడు. ఆ పని అప్పటికే ఆలస్యమైనందుకు విచారించాడు. దుఃఖభావం నుండి భీముడిని ఉద్ధరించి, క్రోధభావ తీవ్రతను అతడిలో ప్రజ్వలింపచేసి, సత్వర కార్యోన్ముఖుడిగా మార్చిన ద్రౌపది వాక్ శిల్పం రసాభ్యుదయోల్లాసానికి రమణీయోదాహరణం. (సంపా.)

తే. ఎల్లి యెల్ల విధంబుల నెందుఁజొచ్చె౹
నేని, నా ధర్మ తనయుండు దాన వచ్చి
యడ్డపడెనేని నీవ పెంపారు కరుణఁ౹
గాచితేని నాచేఁ బడుఁ గీచకుండు. 211

ప్రతిపదార్థం: కీచకుండు= కీచకుడు; ఎల్లి= రేపు; ఎల్ల విధంబులన్= ఎన్నిరకాలుగానైనా; ఎందున్+చొచ్చెన్+ఏనిన్= ఎక్కడ దాగినా; ఆ ధర్మతనయుండు= ఆ ధర్మజుడే; తాను+ అ,వచ్చి= తానే వచ్చి; అడ్డపడేనేనిన్= అడ్డుపడినా; నీవు+అ= ద్రౌపది కూడా; పెంపారు కరుణన్= పైకి పొంగివచ్చే దయతో; కాచితి(వి)+ఏనిన్= కాపాడినా; నాచేన్+పడున్= నా చేతిలో చస్తాడు.

తాత్పర్యం: రేపటి దినం ఆ కీచకుడు ఎక్కడ ఎట్లా దాగి ఉన్నా, స్వయంగా ధర్మజుడు వచ్చి అడ్డుపడినా, నీవు కూడా అధిక దయతో క్షమించినా, నా చేతిలో అతడికి చావు మూడింది.

విశేషం: భీముడి శపథం సూటిగా, ఘాటుగా ఉన్నది. ప్రతిపదసార్థకంగా సాగింది. కాల విలంబనం వలన కీడు మూడవచ్చునని ద్రౌపది చేసిన సూచనకు

ప్రతిస్పందనగా 'రేపే కీచకుడు నా చేతిలో చస్తాడు' అని ప్రధానాంశాన్ని ప్రకటించాడు. చంపదగిన శత్రువును సత్వరమే చంపటం భీముడి స్వభావం. కాని, అతడి ప్రయత్నాన్ని ఆపు చేయగల శక్తులు రెండున్నాయి. ఒకడు ధర్మరాజు, మరొకరు ద్రౌపది. అలనాడు సైంధవుడి పట్ల అదే జరిగింది. ధర్మరాజు అతడిని చంపవద్దన్నాడు, అందువలన అతడికి పాండవదాసుడనే బిరుదాన్నిచ్చి వదలిపెట్టాడు భీముడు. ద్రౌపది సైంధవ వధను మొదట కోరింది. భీముడు దాని కనుకూలంగా వ్యవహరించి చంపబోయాడు. అర్జునుడు ధర్మజునాజ్ఞను జ్ఞాపకం చేసి వారించాడు. చివరకు ద్రౌపది పట్టుపట్టి సైంధవుడిని చంపటానికి ధర్మరాజును ఒప్పిస్తుందేమో అని భీముడు ఆశపడ్డాడు. సైంధవుడిని బందీగా తెచ్చి అన్నముందు ఉంచాడు. అప్పుడు ద్రౌపది తన మనసు మార్చుకొని పాండవదాసుడైన వాడిపై ధర్మరాజువలెనే దయావర్షాన్ని కురిపించింది. ఈ ఉదంతాన్ని జ్ఞాపకం చేసి భీముడు రెండు విధాల గడుసరితనం ప్రకటించాడు. 'నే నెప్పుడూ కార్యశీలినే. ధర్మరాజా, నీవే సహనమూర్తులు, నా కార్యాలకు అడ్డుపడేవారు' అని ఎత్తిపొడిచి, తనయందు కీచకఘట్టంలో కూడా లోపం లేదని పరోక్షంగా సమర్థించుకొన్నాడు. 2. ధర్మజుడికి తెలిస్తే కీచకుడి మీద దయతో నన్ను వారిస్తాడు. నీవు నాతో చెప్పినట్లు ధర్మరాజుకు కూడా తెలిపావంటే అతడు నిన్ను కూడా మారుస్తాడు. అయినా నేను మారను. మీరిద్దరూ కలిసి వచ్చినా, ఎన్ని రకాలుగా వారించినా నా ప్రతిజ్ఞ ఆగదు అని హెచ్చరించాడు. కీచకవధ అనే కార్యనిర్వహణానికి భీముడు ప్రకృష్టమైన ప్రయత్నావస్థను ప్రకటించాడు. (సంపా.)

వ. వానిదెసం జింత యావంత వలవ; దమ్మాటలు విడువు' మని యూఱడిల్లం బలికి, దుర్దశల నలందురు నవ్వెలంది డెందంబుకుందు వాపం దలంచి యిట్లనియె. 212

ప్రతిపదార్థం: వానిదెసన్= కీచకుడిపట్ల; చింత= దుఃఖం; ఆవంత వలవదు= కొంచెం కూడా వద్దు; ఆ+మాటలు విడువుము= ఇక అతడి గురించి మాటలు మాట్లాడటం ఆపివేయుము; అని; ఊఱడిల్లన్+పలికి= మనసు తేరుకొనేటట్లు మాటలాడి; దుర్దశలన్+అలందురు= కష్టాలు కడగళ్ళతో దుఃఖించే; ఆ+వెలంది= ద్రౌపది యొక్క; డెందంబుకుందు= మనసులోని బాధను; పాపన్+తలంచి= పోగొట్టదలచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇక నీవు కీచకుడి పట్ల ఆవంత కూడా చింత పడవలసిన అవసరం లేదు. వాడి మాటలు ఇక మరచిపోమ్ము' అని ద్రౌపది మనస్సు ఊరడిల్లేటట్లు పలికాడు. అంతేకాక, భీముడు కలసిరాని కష్టకాలంలో ఆమె పొందుతున్న తీవ్ర మనోవేదనను తగ్గించవలెననే భావంతో ఈ విధంగా పలికాడు.

సీ. 'చ్యవనుని వాంఛకు సంయాతినందన।
యిడుమలఁ గుడువదె యడవిలోన?
రాఘవుతోడ నరణ్యవాసము చేసి।
సంతాప మందదె జనకతనయ?
కుంభసంభవునకై ఘోరదుర్గముల లో।
పాముద్ర యలజడి పాలుగాదె?
నలునిపిఱుందఁ గానల కేఁగి దమయంతి।
మనుజులు పడనియిుమ్మలిక పడదె?

తే. వారు సైరణచేసి దుర్వారమైన।
నిరతిశయ దుఃఖభారంబు నిస్తరించి
సౌఖ్యమొందరె? నీవు నా చందముననె।
యాపదల కోర్చి సంపదలనుభవింపు. 213

ప్రతిపదార్థం: చ్యవనుని వాంఛకున్= చ్యవనుడి కోర్కెకు; సంయాతినందన= సంయాతి కుమార్తె సుకన్య; అడవిలోనన్= అరణ్యంలో; ఇడుమలన్+కుడువదె?= కష్టాల ననుభవించలేదా?; రాఘవుతోడన్= రాముడితో; అరణ్యవాసము చేసి= అడవులలో కలిసి నివసించి; జనకతనయ= సీత; సంతాపము+అందదె?=

కష్టపడలేదా? కుంభసంభవునకై= అగస్త్యుడి కొరకై; ఘోరదుర్గములన్= ఘోరారణ్యాలలో; లోపాముద్ర= అగస్త్యుడి భార్య; అలజడి పాలు కాదె= అవస్థల పాలుపడలేదా?; నలుని పిఱుందన్= నలుడి వెంట; కానలకున్+ఏఁగి= అడవులకు వెళ్ళి; దయయంతి; మనుజులు పడని= మనుష్యులు పడనటువంటి; ఉమ్మలిక, పడదె?= దుఃఖాన్ని అనుభవించలేదా?; వారు సైరణ+చేసి= వారంతా ఓర్చుకొని; దుర్వారము+ఐన= భరించరానిదైన; నిరతిశయ దుఃఖభారంబు= అధికమైన కష్టాలబరువును; విస్తరించి= దాటి, ఎట్లాగో మోసి; సౌఖ్యము+ఒందరె?= సుఖపడలేదా?; నీవున్= నీవుకూడా (ద్రౌపది కూడా); ఆ చందమునన్= ఆ విధంగానే; ఆపదలకున్+ఓర్చి= ఆపదలు భరించి; సంపదలు+అనుభవింపు= సౌఖ్యాన్ని పొందుము.

తాత్పర్యం: చ్యవనుడి కోర్కెను మన్నించి సుకన్య అడవిలోబడి కష్టాలను భరించలేదా? రఘురాముడితో అడవుల కేగి సీతమ్మ ఇడుముల పడలేదా? అగస్త్యుడి వెంట పర్వతాలు దాటి లోపాముద్ర అగచాట్లు పడలేదా? నలుడిని వెంబడించి అడవులకు వెళ్ళి దమయంతి మనుష్యులు పడలేని పాట్లు పడలేదా? వారందరూ ఎట్లాగో కష్టాల బరువు కోర్చుకొని సుఖాల తీరాన్ని చేరలేదా? అదే విధంగా నీవు కూడా కష్టాలను ఓర్చుకొని సంపదలను అనుభవించుము.

విశేషం: సుకన్య కథ: (సుకన్య శర్యాతి కుమార్తె అని మహాభారతారణ్యపర్వం చెప్పింది. సంయాతి శర్యాతి కొడుకు. తిక్కనసంయాతి కూతురుగా పేర్కొన్నాడు.) భృగుని కుమారుడు చ్యవనుడు. ఇతడు అనేక సంవత్సరాలు తపస్సు చేశాడు. శరీరమంతా పుట్టలు పోశాయి. ఒకనాడు శర్యాతి అనే రాజు తన కుమార్తె సుకన్యతో చ్యవనుడు తపస్సు చేసికొనే ప్రాంతానికి వచ్చాడు. సుకన్య చిలిపితనంతో పుట్టను గమనించక చ్యవనుడి పుట్టలోనుండి మెరుపులు రావటం చూచి త్రవ్వించింది. ఆ దోషానికి చ్యవనుడు కోపగించాడు. శర్యాతి యొక్క సైనికులను బాధించాడు. ఆ బాధను తొలగించటానికి సుకన్యను తనకిచ్చి వివాహం చేయుమని శర్యాతిని కోరాడు. తండ్రి ఇష్టపడకపోయినా, చ్యవనుడు వృద్ధుడైనా అతడిని వివాహం చేసికొన్నది సుకన్య. ఆ తరువాత చ్యవనుడు ఆశ్వినుల సహకారం వలన, తపశ్శక్తి వలన యువకుడై భార్యకు సుఖసౌఖ్యాలను అందజేశాడు. ఈ విధంగా సుకన్య వృద్ధుడిని వివాహం చేసికొని అనేక కష్టాలు పడి చివరకు సుఖసంతోషాలను పొందగలిగింది. సీతకథ: రామాయణంలోని ఈమె కథ ప్రసిద్ధం. పితృవాక్య పరిపాలకుడైన శ్రీరాముడి ననుసరించి సీత అరణ్యవాసం చేయవలసి వచ్చింది. రాముడితో కలిసి అడవులలో ఎన్నో కష్టాలు అనుభవించింది. రావణుడి చెరలో చిక్కి, అశోకవనంలో ఎన్నో కడగండ్లు భరించింది. మాయలేడిని తెమ్మన్న కారణంగా భర్తకు దూరమయింది. రావణ సంహారానంతరం మరల భర్తదరి చేరకలిగింది. రాజ్యసుఖాలను అనుభవించింది. 3. దమయంతి కథ: నలదమయంతులు ఆదర్శ ప్రేమ దంపతులు. నిషధ రాజును స్వయంవరంలో వివాహమాడింది దమయంతి. స్వయంవరానికి ఇంద్రాది దిక్పాలురు విచ్చేశారు. వారు కూడా దమయంతిని కోరి వచ్చారు. అయినా దమయంతి నలుడిని వరించింది. కలి ఆమెను పొందలేకపోయి పగబట్టాడు. ఫలితంగా కష్టాలపాలైంది. కలి పురుషుడు పెట్టిన కష్టాలు ఇంతంత కాదు. జూదంలో నలుడు సర్వస్వాన్నీ కోల్పోయాడు. అరణ్యాలలో దమయంతిని వదలి నలుడు వెళ్ళిపోయాడు. తక్షకుడి కాటువలన నలుడికి వికృతరూపం కలిగింది. కష్టాలు గట్టెక్కి ద్వితీయ స్వయంవరం నెపంతో దమయంతి మళ్ళీ నలుడిని నిజరూపంతో పొందగలిగింది. నలుడు రాజ్యాన్ని మరలా పొందాడు. దమయంతి రాజ్యభోగాల ననుభవించింది. లోపాముద్ర కథ: అగస్త్యుడు చాలా కాలం బ్రహ్మచర్య వ్రతం చేశాడు. తన తపః ప్రభావంతో విదర్భరాజుకు లోపాముద్ర జన్మించేటట్లు చేశాడు. ఆమెనే తన కిచ్చి వివాహం చేయుమని రాజు నడిగాడు. ఆమెకు వస్త్రాభరణాల కొరకు ఎందరినో ఆశ్రయించాడు. చివరకు అవి సంపాదించి పెట్టి ఆమె ద్వారా పుత్రులను పొందాడు. ఈ నాలుగు కథలలో ఆయా పతివ్రతలు కష్టాల పాలుగావటం, వాటిని ఓర్చుకొని కొన్నాళ్ళకు సుఖాన్ని పొందటం పురాణ ప్రసిద్ధం. అంతేకాదు. ఈ కథలన్నీ ఆరణ్యపర్వంలో మునుల వలన పాండవులు విన్నవే. వాటిని గుర్తుకు తెచ్చి భీముడు ద్రౌపది నోదారుస్తున్నాడు. అప్పుడు శ్రవణంలో నిలిచిన కథలు ఇప్పుడు మననంలోకి మారాయి. పురాణశ్రవణ ఫలితాలలో ఇది ఒకటి. తమతో సమానంగా కష్టా లనుభవించిన ఇతరులను తలచుకొంటే కొంత ఊరట కలుగుతుంది.

అది మానవ స్వభావం. మనం చేసిన పని ఫలించకపోతే, ఎదుటివారిని చూచి వారూ కష్టాలలో ఉంటే చూచి ఊరట పొందుతాం. ఇదే తిక్కన కావ్యశిల్పం.

వ. దుర్యోధన దుశ్శాసన కర్ణ శకుని సైంధవ ప్రముఖంబగు దుష్ట లోకంబు నధోలోకంబున కనుచునంతకు మదీయాంతరంగంబు చింతాభర భుగ్నంబును, నవమాన పంకమగ్నంబును, గోపోద్విగ్నంబును నై వేగిరపడుచున్నయది; ధార్తరాష్ట్రులకుం గాలావసానం బైనయట్లు మనకు సమయ కాలావసానం బయ్యెఁ; నజ్ఞాత వాసంబునకుం జొచ్చి పదునొండు నెలలు సని పండ్రెండవనెల వర్తిల్లుచున్నది. దీని కొఱంత దీఱిన నీదు వంతయుం దీఱు; నూఱడిల్లి యుండుము; సింహబలుండు నిన్నుఁ బరిభవించి మై మైతోన యునికింజేసి యెల్లియుం జెనక వచ్చు; నీవునుం గ్రమంబున నొడంబడుట భావించికొని వానికి నర్తనశాల సంకేత ప్రదేశంబుగాఁ జెప్పి యొంటిమెయిం జనుదేర నియమింపుము; వాఁడు వచ్చిన నా సొబగునిం దెగఁజూచి, నీకుం జూపి నీ చిత్తంబు వడసెద; నిత్తెఱంగు దప్ప నొండు విధంబు గర్జంబుగా; దిదియె నిశ్చయం; బిట్ల చేయు వార; మిమ్మాటలవలనం దప్పవు గాని, వేగుచున్నయది; జనులు మేలుకాంచి మనలం గాంచి రేని వంచన బయలు పడినం గార్యంబు దప్పుఁ; గీచక వధంబునకుం బూనిన నా మనోరథంబు దుది ముట్టవలయు; నిజశయన స్థానంబునకుం బొ' మ్మని శయ్యాతలంబు విడిచి యత్తన్విం దఱిమి కొన్ని యడుగు లనిచి, మరలి మారుతాత్మజుండు కలుషితాత్ముండగుచు సెజ్జకు వచ్చె; నచ్చెలువయుం దన నిద్రించు నెడకుం బోయి పర్యంక భాగంబునం దనువు వైచి, యంకిలి దేఱని దెందంబునఁ గొందలంబుతోడి నిశ్చయంబున నిద్రంబొరయని కనుదోయి మొగిడ్చి యుండె; నంత. 214

ప్రతిపదార్థం: దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకుని, సైంధవ, ప్రముఖంబు+ అగు= దుర్యోధన దుశ్శాసన కర్ణ శకుని సైంధవాది యోధులతో కూడిన;

దుష్టలోకంబున్= దుండగుల సమూహాన్ని; అధో+లోకంబునకున్, అనుచు+ అంతకున్= నరకానికి పంపునంతవరకు; మదీయ+అంతరంగంబు= నా మనస్సు; చింతాభరభుగ్నంబును= దుఃఖభారంతో వంగినదీ; అవమాన పంకమగ్నంబును= అవమానమనే బురదలో మునిగినదీ; కోప+ ఉద్విగ్నం బునున్+ఐ= కోపంతో కలవరపడినదీ అయి; వేగిర పడుచున్న+అది= తొందర పడుతున్నది; ధార్తరాష్ట్రులకున్= కౌరవులకు; కాల+అవసానంబు+ఐన+ అట్లు= కాలం తీరినట్లు, మృత్యువు సమీపించినట్లు; మనకున్= పాండవులకు; సమయకాల+ అవసానంబు+అయ్యెన్= ప్రతిజ్ఞ చేసిన కాలం ముగిసే రోజులు దగ్గరపడ్డాయి; అజ్ఞాత వాసంబునకున్+చొచ్చి= రహస్యంగా ఉండే నియమంతో ప్రవేశించి; పదునొకండు నెలలు చని= పదకొండు నెలలు పూర్తి అయి; పండ్రెండవ నెల= పన్నెండో నెల; వర్తిల్లుచున్+ ఉన్నది= జరుగుతున్నది; దీని కొఱంత తీఱినన్= ఈ ఉపద్రవం తప్పితే; నీదు వంతయున్= నీదుఃఖం కూడా; తీఱున్= తొలగిపోతుంది; ఊరడిల్లి+ ఉండుము= ఊరట పొంది ఉండుము; సింహబలుఁడు= కీచకుడు; నిన్నున్+పరిభవించి= నిన్ను (ద్రౌపదిని) అవమానించి; మైమైతోన్+అ= సశరీరంగా; ఉనికిన్+చేసి= ఉండటం చేత; ఎల్లియున్= రేపు కూడా; చెనక వచ్చున్= సమీపించవచ్చును; నీవునున్= నీవుకూడా (ద్రౌపది కూడా); క్రమంబునన్+ఒడంబడుట= నెమ్మదిగా అంగీకరించటం; భావించికొని= ఊహించుకొని; వానికిన్= కీచకుడికి; నర్తనశాల= నాట్యశాల; సంకేత ప్రదేశంబుగాన్+చెప్పి= గుర్తుగా (కలిసే స్థలంగా) చెప్పి; ఒంటిమెయిన్= ఒంటరిగా; జనుదేరన్= వచ్చుటకు; నియమింపుము= ఆజ్ఞాపించుము, ఏర్పాటు చేయుము; హఁడు= అతడు; వచ్చినన్= రాగా; ఆ సొబగునిన్= ఆ సుందరుణ్ణి, చక్కనివాణ్ణి; తెగన్+చూచి= చంపి; నీకున్+ చూపి= నీకు (ద్రౌపదికి) చూపి; నీ చిత్తంబు+పడసెదన్= నీ మనసు మెప్పిస్తాను; ఈ+తెఱంగు తప్పన్= ఈ పద్ధతి కాకుండా; ఒండు విధంబు= మరొక పద్ధతి; కర్జంబు+కాదు= ఫలించే పని కాదు; ఇది+ఎ+ నిశ్చయంబు= ఇదే నిర్ణయం; ఇట్లు చేయువారము= ఇట్లాగే చేద్దాం; ఈ+మాటలవలనన్+ తప్పవుకాని= ఇక ఈ మాటలవలన పనులు తీరేవి కావు; వేగుచున్న+అది=

తెల్లవారబోతున్నది; జనులు,మేలుకాంచి= లోకులు మేల్కొని; మనలన్+ కాంచిరి+ఏనిన్= మనలను (భీమద్రౌపదులను) చూస్తే; వంచన బయలు పడినన్= అజ్ఞాతవాసం బహిరంగమైతే; కార్యంబు+తప్పున్= అజ్ఞాతవాస కార్యానికి భంగం ఏర్పడుతుంది; కీచక వధంబునకున్+పూనిన= కీచకుడిని చంపటానికి పూనుకొన్న; నా మనోరథంబు= నా సంకల్పం, కోరిక; తుదిముట్ట వలయున్= పూర్తికావాలి; నిజ శయన స్థానంబునకున్+పొమ్ము= నీవు పరుండే ప్రదేశానికి వెళ్ళిపోమ్ము; అని; తన శయ్యాతలంబు= తన పడక; విడిచి= వదలిపెట్టి; ఆ తన్విన్+తఱిమి= ద్రౌపదిని వెంబడించి; కొన్ని అడుగులు+ అనిచి= కొంత దూరం వీడ్కొల్పి; మారుత+ఆత్మజుండు= గాడ్పుకొడుకు భీముడు; కలుషిత+ఆత్ముండు+అగుచున్= కలవరపడ్డ మనస్సుతో; సెజ్జకున్+ వచ్చెన్= పడక మీదికి వచ్చాడు; ఆ+చెలువయున్= ద్రౌపది కూడా; తన నిద్రించు+ఎడకున్+పోయి= తాను నిద్రించే ప్రదేశానికి పోయి; పర్యంక భాగంబునన్= పడకపై; తనువు వైచి= శరీరం పడవేసి; అంకిలి తేఱని డెందంబునన్= కలతవీడని మనస్సుతో; కొందలంబుతోడి= కలవరంతో కూడిన; నిశ్చయంబునన్= నిర్ణయంతో; నిద్రన్+పొరయని= నిద్రరాని; కనుదోయి మోడ్చి= కళ్ళు మూసికొని; ఉండెన్= ఉన్నది; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: దుర్యోధన దుశ్శాసన కర్ణ శకుని సైంధవాది దుష్టుల నందరినీ నరకలోకానికి పంపేటంత వరకు నా మనస్సు చింతా భారంతో వంగిపోయి, అవమానమనే బురదలో కుంగిపోయి, కోపతాపంతో కలత చెంది తొందర పడుతున్నది. దానికి తోడు కౌరవులకు కాలం మూడినట్లు మన అజ్ఞాతవాస సమయంకూడా పూర్తి కావస్తున్నది. పదకొండు నెలలు పూర్తి అయి, పన్నెండో నెల నడుస్తున్నది. ఇంక, ఈ గడువు కాస్తా తీరితే నీ దుఃఖం కూడా తీరుతుంది. కాబట్టి ఊరడిల్లి ఉండుము. కీచకుడు నిన్ను అవమానించి ఇంకా శరీరంతో బ్రతికి ఉన్నాడు. కాబట్టి రేపు వాడు వచ్చినపుడు మట్టుబెట్టవచ్చును. నీవు కూడా క్రమంగా అతడిని అంగీకరిస్తున్నట్లు ఊహించి (నటించి) నర్తనశాలను సంకేతంగా చెప్పి వాడిని అక్కడికి ఒంటరిగా రమ్మని చెప్పుము. అట్లా వస్తే

ఆ సొగసుకాడిని మట్టుబెట్టి, నీకు కళ్ళారా చూపి, నీ మనస్సు రంజింపచేస్తాను. ఇది తప్ప మరొక ఉపాయం లేదు. ఇదే నిర్ణయం. ఇట్లాగే చేద్దాం. ఇక ఈ కార్యం మాటలతో తీరేది కాదు. చేష్టలకు దిగాలి. అదిగో తెల్లవారబోతున్నది. లోకం గుర్తిస్తే, అజ్ఞాతవాస వ్రతానికి భంగం వాటిల్లుతుంది. మన కార్యానికి భంగం కలుగుతుంది. కీచకుడిని చంపాలనుకొన్న నా కోరిక తీరాలి. నీవు వెళ్ళి నీప్రక్కపై పడుకొమ్మని చెప్పి ఆమెను తొందరపెట్టి కొంతదూరం కలసి వెళ్ళి వీడ్కోలు చెప్పి భీముడు కోపంతో కలతచెంది తన పడకపై నడుం వాల్చాడు. ఆమెకూడా పోయి తన పడకపై తనువు వాల్చింది. కాని, కంటికి నిద్ర రాలేదు. అయినా కనుదోయి మూసికొని కదలకుండా పడుకొని ఉండిపోయింది. అప్పుడు.

విశేషం: భీముడి వ్యూహకుశలత, కార్యదక్షత, ఉత్సాహస్ఫూర్తి, ఫలితాన్ని సాధించటంలో దృఢ నిశ్చయం, సమయోచితాలైన ఉపాయాలను సాధించే చాతుర్యం- మొదలైన నాయకలక్షణాలను ఇందులో ప్రదర్శించాడు. (సంపా.)

ప్రభాతకాల వర్ణనము

(ఇది మూలమునందు లేదు)

తే. ద్రుపద నందన పరిభవ దుఃఖమునకు।
నుల్లమున దురపిల్లుచు నున్న సరసి
వేఁడి నిట్టూర్పులో యన వెడలెఁ గ్రొత్త।
తావి మూతులు విచ్చునెత్తమ్మివిరుల. 215

ప్రతిపదార్థం: ద్రుపదనందన= ద్రౌపది యొక్క; పరిభవ దుఃఖమునకున్= అవమానం వలన కలిగిన దుఃఖానికి; ఉల్లమునన్= మనసులో; దురపిల్లుచున్+ ఉన్న= విలపిస్తున్న; సరసి= సరస్సు; వేఁడి నిట్టూర్పులో+అనన్= వేడి నిశ్వాసాలో అన్నట్లు; మూతులు విచ్చు= వికసించు; నెత్తమ్మి విరులన్= చక్కని తామరపూల నుండి; క్రొత్త, తావి= క్రొత్త వాసనలు; వెడలెన్= వెలుపలికి వ్యాపించాయి.

తాత్పర్యం: ద్రౌపది అవమాన దుఃఖాన్ని చూచి విలపిస్తున్న సరస్సు అనే స్నేహితురాలు విడిచిన వేడి నిట్టూర్పులో అన్నట్లుగా మూతులు విచ్చుకొంటున్న కమలాలనుండి వచ్చే కొంగ్రొత్త సువాసనలు వెలువడసాగాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ప్రకృతి కథానాయికపట్ల సానుభూతి చూపినట్లు కవి వర్ణించటం విశేషం. వర్ణనను కథలో మేళవింపజేయటం భాగం.

క. **విచ్చెం దిమిరము; కాఁపులు।**
వచ్చె మధుపకులము లబ్జవనముల; కురులం
జొచ్చె విరులు తరులతికల;।
నిచ్చె రథాంగములు వంత యెల్లఁ దొగలకున్. 216

ప్రతిపదార్థం: తిమిరము= చీకటి; విచ్చెన్= తొలగిపోయింది; మధుపకులములు= తుమ్మెదల సముదాయం; అబ్జవనములకున్= తామరపూవుల సముదాయానికి; కాఁపులు వచ్చెన్= కాపురం వచ్చాయి; విరులు= పూలు; తరులతికలన్= చెట్ల తీగల నుండి; ఉరులన్+చొచ్చెన్= రాల దొడిగాయి; రథాంగములు= చక్రవాకపక్షులు; వంతన్+ఎల్లన్= తమ బాధనంతా; తొగలకున్= కలువలకు; ఇచ్చెన్= ఇచ్చాయి.

తాత్పర్యం: చీకటి తొలగింది. తుమ్మెదలు తామరపూలపై వాలాయి. చెట్లనుండి, తీగలనుండి పూలు రాలాయి. చక్రవాకాలు తమ బాధనంతా కలువపూలకు ఇచ్చాయి.

విశేషం: చక్రవాక పక్షులకు రాత్రి పూట కళ్ళు కనబడవు కాబట్టి జంటలు వియోగావస్థ పొందుతాయి -అని కవిసమయం. కలువలు రాత్రంతా వికసించి సూర్యోదయంతో ముకుళిస్తాయి. తెల్లవారుతుండగా చక్రవాక పక్షులు వికసిస్తూ తమ రాత్రి బాధను ముకుళిస్తున్న కలువలకు అప్పగించినట్లున్నదట! తమ చుట్టమైన చంద్రుడు అస్తమించగా కలువలు ముకుళించాయి. వాటి ముకుళనాన్ని కవి వాటి బాధగా సంభావిస్తూ, అంతవరకూ తమ బాధను చక్రవాకాలు వాటి కందించినట్లు చమత్కరించాడు. (సంపా.)

సీ. **పెనఁకువఁ దనిసిన తనువు లొండొంటితోఁ।**
గీలించి నిద్రించి మేలుకాంచి,
తరుణులుఁ బతులు వాతాయనంబుల నల్లఁ।
బొలయు వేఁబోకటి మలయపవను
నింపారు చోఁకున నిగురొత్తు చిత్తంబు।
లెలసి యొండొరులపైఁ బొలయు చూడ్కు
లాదట నుపకరణావళి వెడ వెడ।
యాదరించుచు రాగ మడరఁ దొడరి
తే. **కేళి సలిపిరి భవన దీర్ఘికల తమ్మి।**
విరుల నెత్తావి నెనయంగ బెరసి చెమట
పొడము మేనుల తనికంపు ప్రోచి తఱచు।
టూర్పుగాడ్పుల పరిమళ ముల్లసిల్ల. 217

ప్రతిపదార్థం: పెనఁకువన్= కలయికచేత; తనిసిన తనువులు= తృప్తిపొందిన శరీరాలు; ఒండు+ఒంటితోన్= ఒకదానితో మరొకదానిని; కీలించి= చేర్చి; నిద్రించి మేలుకాంచి= నిద్రపోయి మేల్కొని; తరుణులున్, పతులున్= భార్యలూ భర్తలూ; వాతాయనంబులన్= కిటికీల నుండి; అల్లన్= మెల్లగా; పొలయు= వీచే; వేఁబోకటి= వేకువజామునందలి; మలయపవను= మందమారుతం యొక్క; ఇంపారు చోఁకునన్= సుఖమైన స్పర్శచే; ఇగురొత్తు= కోరికల వలన చిగురించే; చిత్తంబులు= మనస్సులు; ఎలసి= పొంది; ఒండొరులపైన్= ఒకళ్ళ మీద ఒకరు; పొలయు= వ్యాపించే; చూడ్కులు= చూపులు; ఆదటన్= ప్రేమతో; ఉపకరణ+ఆవళిన్= చందనాది ద్రవ్యాలతో; వెడవెడ= మిక్కిలి కొంచెంగా; ఆదరించుచున్= గౌరవిస్తూ; రాగమడరన్= ప్రేమ అతిశయించగా; తొడరి= పూనుకొని; భవనదీర్ఘికల= ఇళ్ళలోని బావులలోని; తమ్మివిరుల= తామరపూలయొక్క; నెత్తావిన్+ఎనయంగన్=

వాసనలు నిండగా; బెరసి= వ్యాపించి; చెమటపొడము మేనులన్= చెమట పట్టే శరీరాలపై; తనికంపు= చిరువాసనను; తఱచు+ఊర్పుగాడ్పుల= మాటిమాటికి నిట్టూర్పుల; పరిమళము+ఉల్లసిల్లన్= వాసనలు వ్యాపించగా; కేళి సలిపిరి= రతిక్రీడలు చేశారు.

తాత్పర్యం: దంపతులు కలిసి రతి తృప్తి నొంది ఒకొళ్లనొకళ్లు కౌగిలించుకొని నిద్రపోయి తెల్లవారే సమయంలో లేచి, మందమారుతం కిటికీలలో నుండి వీస్తూ సోకగా మరల ఒకరిపై ఒకరికి మమకారం అధికమై భోగసాధనాలైన ఉపకరణాలు కొద్దిగా తీసికొని ఇళ్ళనడబావులలోని తామరపూల సువాసనలు నిశ్శ్వాసాలతో కలిసి శరీరంపై చెమట సుగంధాన్ని అధికం చేయగా రతికేళి సలిపారు.

విశేషం: రాత్రి రతికేళిలో మైమరచి కౌగిలింతలలో పడుకొనటం దంపతులకు సహజం. తెల్లవారే వేళ మళ్ళీ రతిక్రియ కుపక్రమించటం పరిపాటి.

తే. **రాలియున్న పుష్పప్రకరము విదిర్చి।**
చెన్నుగా నున్న సేసిన సెజ్జ యనఁగ
వేగుటయుఁ జుక్కలన్నియు విరిసి విశద।
భాతిఁ జెలువొందెఁ జూడ నంబర తలంబు. **218**

ప్రతిపదార్థం: వేగుటయున్= తెల్లవారగా; రాలియున్న= రాలిపడిన; పుష్ప ప్రకరము, విదిర్చి= పూలరాసులను విదిల్చి; చెన్నుగాన్, నున్న చేసిన= అందంగా నునుపు చేసిన; సెజ్జ+అనఁగన్= పడక అనేటట్లు; అంబరతలంబు= ఆకాశం; చుక్కలు+అన్నియున్= నక్షత్రాలన్నీ; విరిసి= తొలగిపోయి; విశదభాతిన్= స్పష్టమైన ప్రకాశంతో; చూడన్= చూడగా; చెలువొందెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: తెల్లవారగానే నక్షత్రాలన్నీ పోయి నిర్మలమైన ఆకాశం రాలిపడిన పూలన్నీ విదిల్చి నునుపు చేసిన పాన్పా అన్నట్లు ఉన్నది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. వేకువజామున ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అది పూలు విదిల్చి నునుపుచేసిన పాన్పువలె ఉన్నదని కవి చమత్కరించాడు. పాన్పుపై పూలు సువాసనకేగాక కమ్మగా నిద్రపట్టటానికి కూడా ఉపయోగపడతాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

వ. **తదనంతరంబ యల్ల నల్లన తెఱపి యిచ్చి యవులవులం జను నంధకారంబు దూరంబుల యందును లేకునికి వలనం గడళ్ళప్పళించి నెరసి విరసినం బొలుచు కలుకట్టలుంబోని దిక్తటంబులును, దమపాసిన కందువలు రోసి యెత్తిన మెడలను బచరించిన చూడ్కులు వేడ్కలం గ్రందైన డెందంబులుం దమము పాసినం గలిగి మెలంగుచు నొండొంటి బిట్టుగాంచి యొదవు సమ్మదంబునం బొదలు మేనులు బెరయించి పరమానందం బునం జొక్కుచు జక్కవకవలు గలసి పొలసి నలిరేఁగి చెలఁగుచు రేయింటి యాఁకటి పెల్లునం గొదగొని కమిచి చంచువులం దిగిచి త్రుంచి యానుచు నిక్కడక్కడఁ బఱచినం జిక్కువడి యున్న మృణాల శకలంబుల వలన బాల చంద్ర శతాభిరామంబులగు శంభు జలమూర్తి విశేషంబులంబోని సరోవరంబులును, జీఁకటి వాసినం బ్రభాతం బను వింత మానిసి మెలంగి ముసుంగు వుచ్చినట్లు మేలుకని యెఱకలు పొదల విదిర్చి కూర్చికొని కలగొనం బలుకు పులుఁగుల యెలుంగుల వలన నొండొంటిం దెలుపుకరణి నొప్పు ధరణీరుహంబులును, బరఁగు నరుణోదయ రాగపటలంబు నెనయు కెంజాయ రంజిల్ల వికసిల్లు రక్తారవిందంబుల దందడి నెగసి చరించు చంచరీకంబుల యెఱకల నెఱుల గిఱికొని క్రొత్తయగు కాంతి ప్రవాహంబులం గడలుకొల్పు పుప్పొళ్ళు డుల్చి రాల్చుచుం బొలయు మలయానిలంబునం గ్రాలు మవ్వంపుఁదీవలఁ గడివోయి తొరఁగిన విరుల వలన మీనకేతన పురాతన బాణశాలలం బోని లతా మండపంబులును, మొగిడియు జనంబు సంధ్యాంజలిపుటకరణంబుల ననుకరించు విధంబునం దర్శనీయంబులగు కుముద వనంబులును, నేమేని నెపంబున నొండొరుల మేలుకొలుపు రమణ రమణీ జనంబుల నర్మాలాపంబులం**

బెరయు దరహాసంబుల కాంతిఁ దెలుపెక్కునట్లు వెలరారు దీపంబులును, మునుకడ వచ్చి యెఱుక సేయమికి వాతాయన పవనుని పయిం బుట్టిన యలుక విధంబున వేగుఁబోకట నంకురించు మదంబునఁ గెంపు గదురుట నిద్రలేమినని శంకింపక యింపునం గదియు విదగ్ధ విటజనంబుల మనంబులం దిగుచు లలనాలోచనంబులును, రేపకడ వనలక్ష్మి పురశ్రీ నలంకరించు వడువున నెడపడక యెల్లెడల నిగుడు విభాత కుసుమ కదంబ పరిమళంబును నై యున్నంత. **219**

1. తదనంతరంబ.................దిక్తటంబులును.

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= తెల్లవారుతున్నంతనే; అల్లన+అల్లన= మెల్ల మెల్లగా; తెఱపి+ఇచ్చి= సందిచ్చి-తొలగిపోయి; అవులన్+అవులన్+చను= దూరదూరంగా పోయే; అంధకారంబు= చీకటి; దూరంబుల+అందును లేక+ఉనికి వలనన్= దూర ప్రదేశాలలో కూడ లేకపోవటం వలన; కడళ్ళు= దిక్కులు; అప్పళించి= తాకి; నెరసి= నిండి; విరిసినన్= విచ్చిపోగా; పొలుచు= ఒప్పే; కలు కట్టలున్+పోని= రాతి కట్టలను పోలిన; దిక్+తటంబులును= దిక్ప్రదేశాలూ;

తాత్పర్యం: తెల్లవారుతున్నది. చీకటి మెల్లమెల్లగా విచ్చుతూ దూరప్రదేశాలలో కూడా తొలగిపోవటంచేత, దిక్కులను స్పృశించి నిండి విచ్చిపోగా దిక్ప్రదేశాలు రాతికట్టలవలె ఒప్పుతున్నాయి. అలంకారం: ఉపమ.

2. తమ పాసిన.................సరోవరంబులును.

ప్రతిపదార్థం: తమ, పాసిన= తాము (జక్కవలు) వీడిన; కందువలు= చోట్లను; రోసి= వెదకి; ఎత్తిన, మెడలను; పచరించిన= ప్రసరింపజేసిన; చూడ్కులున్= చూపులూ; వేడ్కలన్= వేడుకలచే; క్రందు+ఐన= అధికమైన; దెందంబులున్= మనస్సులును; తమము= చీకటి పాసినన్= తొలగగా; కలిగి; మెలంగుచున్= వర్తిల్లుతూ; ఒండు+ఒంటిన్= ఒకదాని నొకటి; బిట్టు= శీఘ్రంగా; కాంచి= చూచి; ఒదవు= కలిగే; సమ్మదంబునన్= సంతోషంతో; పొదలు= ఒప్పే; మేనులు= శరీరాలు; బెరయించి= చేర్చి; పరమ+ఆనందంబునన్= అధిక సంతోషంతో; చొక్కుచున్= పరవశిస్తూ; జక్కవకవలు= చక్రవాక దంపతులు; కలసి= కూడి; పొలసి= చొక్కి; నలిరేఁగి= విజృంభించి; చెలంగుచున్= కూస్తూ; రేయింటి, ఆఁకటి, పెల్లునన్= రాత్రి ఏమీ తికనపోవటం వలన కలిగిన ఆకలి తీవ్రతచేత; గొదకొని= యత్నించి; కమిచి= గ్రహించి; చంచువులన్= ముక్కులతో; తిగిచి= లాగి; త్రుంచి= ముక్కలు చేసి; ఆనుచున్= తింటూ; ఇక్కడన్+అక్కడన్= ఇక్కడా, అక్కడా; పఱచినన్= పరవగా; చిక్కు+పడి+ఉన్న= చిక్కు పడిపోయిన; మృణాల, శకలంబులవలనన్= తామరతూటి ముక్కల వలన; బాల, చంద్ర, శత+అభిరామంబులు+అగు= నూరు బాలచంద్రబింబాల చేత మనో హరాలయిన; శంభు, జల, మూర్తి విశేషం బులన్+పోని= శివుడియొక్క జలరూప విశేషాలవంటి; సరోవరంబులును= సరస్సులును.

తాత్పర్యం: చక్రవాక మిథునాలకు రాత్రివేళ పరస్పర వియోగం, అవి కన్నులు కనిపించక తమ తమ చోట్లను విడిచిపెట్టుతాయి. తెల్లవారిన పిదప అవి రేయి తాము విడిచిన స్థానాలను వెదుకుతూ, మెడ ఎత్తుకుని, చూపులు ప్రసరింపజేస్తూ పరస్పరం కలిసికొనటం వలన వేడుక లధికమై మనస్సులు సంతోషపడుతూ ఉండగా ప్రవర్తిల్లుతాయి. అవి తమ శరీరాలను ఒకదానితోనొకటి చేర్చి, మిక్కిలి సంతోషంతో పరవశిస్తూ, విజృంభించి కూస్తూ, రాత్రి ఏమీ తినకపోవటం వలన కలిగిన ఆకటి తీవ్రతతో తామరతూండ్లను లాగి ముక్కలు చేసి చిందరవందరగా పడవేస్తాయి. ఆ ముక్కలు నూరు బాలచంద్రుల చేత మనోహరాలయిన ఈశ్వరుడి జలమూర్తి విశేషాలు అన్నట్లుగా సరస్సులుంటాయి.

అలం: స్వభావోక్తి.

3. చీఁకటివాసినం.................ధరణీరుహంబులును.

ప్రతిపదార్థం: చీఁకటి; పాసినన్= తొలగిపోగా; ప్రభాతంబు+అను, వింతమానిసి= ఉదయసమయ మనే వింత మనుష్యుడు; మెలంగి= వర్తిల్లి; ముసుంగు+పుచ్చిన+అట్లు= ముసుగు తొలగించిన విధంగా; మేలుకని= నిద్రలేచి; ఎఱకలు= రెక్కలు; పొదలన్= ఒప్పుగా; విదిర్చి= విదలించి; కూర్చికొని= సరిచేసికొని; కలగొనన్= కలతచెందగా; పలుకు= కూయునట్టి; పులుఁగుల+ఎలుంగుల వలనన్= పక్షుల రొదల మిషచేత; ఒండు+ ఒంటిన్= ఒకదాని నొకటి; తెలుపు, కరణిన్= మేల్కొలిపే విధంగా; ఒప్పు; ధరణీరుహంబులును= చెట్లునూ.

తాత్పర్యం: చీకటి తొలగిపోగా ఉదయమనే వింత మనుష్యుడు, వచ్చి ముసుగుతొలగించినట్లు మేల్కొని రెక్కలు విదిలించుకొని, సరిచేసికొని, కలతపడినట్లు కూసే పక్షుల రొదల మిషచేత ఒకదాని నొకటి మేలుకొలిపే విధంగా ఒప్పే చెట్లునూ.

అలం: స్వభావోక్తి, రూపకం, ఉత్ప్రేక్ష.

4. పరఁగు నరుణోదయరాగ.................లతా మండపంబులును.

ప్రతిపదార్థం: పరఁగు= ఒప్పునట్టి, అరుణ+ఉదయ, రాగ, పటలంబున్= సూర్యోదయము యొక్క ఎరుపుకాంతుల సమూహాన్ని; ఎనయు= సరిపోలే; కెంజాయ (కెంపు+చాయ)= ఎర్రనికాంతి; రంజిల్లన్= ప్రకాశించగా; వికసిల్లు= విచ్చే; రక్త+అరవిందంబులన్= ఎర్రతామరల యందు; దందడిన్= దట్టంగా; ఎగసి= ఎగిరి; చరించు= తిరిగే; చంచరీకంబుల= తుమ్మెదలయొక్క; ఎఱకల, నెఱులన్= రెక్కల సందులందు; గిఱికొని= చిక్కుకొని; క్రొత్త+అగు, కాంతి, ప్రవాహంబులన్= నూతనకాంతుల ప్రవాహాలను; కడలుకొల్పు= అతిశయింప జేసే; పుప్పొళ్ళు, డుల్చి రాల్చుచున్= డుల్లగొట్టి రాలుస్తూ; పొలయు= వీచే; మలయ+అనిలంబునన్= మలయవాయువు చేత; క్రాలు= ఒప్పే; మవ్వము+ తీవలన్= లేతతీగలనుండి; కడి+పోయి= వాసనపోయి; తొరఁగిన విరులవలన= రాలిపోయిన పువ్వులవలన; మీనకేతన, పురాతన, బాణ, శాలలన్+పోని= మన్మథుడి ప్రాత బాణగృహాలను పోలిన; లతా, మండపంబులును= పూలతీగలమంటపాలునూ.

తాత్పర్యం: ఉదయ సూర్యుడి ఎఱ్ఱని కాంతి ప్రసరించగా వికసించే ఎర్రతామర పూలయందు దట్టంగా ఎగురుతూ తిరిగే తుమ్మెదరెక్కల సందుల్లో చిక్కుకొని నూతనకాంతుల ప్రవాహాలను అతిశయింపజేసే పుప్పొళ్ళను డుల్లగొట్టి రాలుస్తూ వీచే మలయవాయువుచేత ఒప్పే లేతతీగలనుండి వాసనపోయి రాలిపోయిన పువ్వులు కలిగి మన్మథుడి ప్రాత బాణ గృహాలవలె ఉన్న లతామండపాలునూ.

అలం: స్వభావోక్తి, ఉపమ.

5. మొగిడియు.................కుముదవనంబులును.

ప్రతిపదార్థం: మొగిడియున్= ముడుచుకొని కూడా; జనంబు, సంధ్యా+అంజలిపుట, కరణంబులన్= సంధ్యావందన మాచరించేటప్పటి జనుల దొప్పలవంటి దోసిళ్లను; అనుకరించు విధంబునన్= అనుసరించేటట్లు; దర్శనీయంబులు+అగు= చూడదగిఉన్న; కుముద, వనంబులునున్= తెల్లకలువల తోపులును.

తాత్పర్యం: ప్రాతస్సంధ్యా సమయంలో ముడుచుకొని కూడా, సంధ్యావందన మాచరించే జనుల అంజలిపుటాలను అనుకరించే రీతిగా చూడదగిఉన్న తెల్లకలువల సమూహాలునూ.

అలం: ఉపమ.

6. ఏమేని నెపంబున.................వెలరారు దీపంబులును.

ప్రతిపదార్థం: ఏమి+ఏని, నెపంబునన్= ఏదో ఒక మిషచేత; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; మేలుకొలుపు= మేలుకొలిపే; రమణ, రమణీ జనంబుల= ప్రియుల, ప్రియురాండ్ర యొక్క; నర్మ+ఆలాపంబులన్= పరిహాస గర్భిత వాక్కులచేత; బెరయు= కలిగే; దరహాసంబుల, కాంతిన్= చిరునవ్వుల

కాంతిచేత; తెలుపు+ఎక్కు+అట్లు= తెలుపెక్కే విధంగా; వెలరారు, దీపంబులును= తెల్లనైన దీపాలూ.

తాత్పర్యం: ఏదో ఒక నెపంతో ఒకరి నొకరు మేలుకొలిపే దంపతుల పరిహాస గర్భిత వాక్కుల చేత కలిగే చిరునవ్వుల కాంతుల చెంత తెలుపెక్కినవాయా అన్నట్లున్న దీపాలూ.

అలం: తద్గుణం, ఉత్ప్రేక్ష.

7. మునుకడ వచ్చి................లలనా లోచనంబులును.

ప్రతిపదార్థం: మునుకడ= ముందుగా; వచ్చి; ఎఱుక+చేయమికిన్= తెలుపక పోవటానికి; వాతాయన, పవనుని, పయిన్= కిటికీల గాలిమీద; పుట్టిన; అలుక, విధంబునన్= కోపం రీతిగా; వేగుఃబోకటన్= తెల్లవారుజామున; అంకురించు= పుట్టే; మదంబునన్= మదంచేత; కెంపు= ఎరుపు; కదురుట= కలగటం; నిద్ర, లేమిన్+అని= నిద్ర లేకపోవటంచేతనని; శంకింపక= సంశయించక; ఇంపునన్= సంతోషంతో; కదియు= కూడే; విదగ్ధ, విట, జనంబుల, మనంబులన్= నేర్పరులైన విట జనుల మనస్సులను; తిగుచు= ఆకర్షించే; లలనా; లోచనంబులును= స్త్రీల కన్నులూ.

తాత్పర్యం: ముందుగా వచ్చి తమను మేలుకొలుపకపోవటంచేత కిటికీల గాలిపై కలిగిన కోపం చేతనా అనేటట్లు ప్రియురాండ్ర కళ్ళు ఎఱ్ఱబడ్డాయి; కాని, తెల్లవారుజామున కలిగే మదం వలన అవి సహజంగానే ఎఱ్ఱనయ్యాయి. పైగా రాత్రి అంతా ప్రియులను కూడటంవలన నిద్రలేక కలిగిన ఎరుపు అని విదగ్ధులైన విటజనులు సంశయించక, తెల్లవారువేళ సంతోషంతో ప్రియురాండ్రను సమీపించినప్పుడు వారి మనస్సులను ఆకర్షిస్తూవున్న ఆ ప్రియురాండ్ర అందమైన నయనాలూ,

అలం: ఉత్ప్రేక్ష.

8. రేపకడ.................నై యున్నంత.

ప్రతిపదార్థం: రేపకడ= ప్రొద్దున; వనలక్ష్మి= వనమనే లక్ష్మి; పురశ్రీన్= నగరమనే లక్ష్మిని; అలంకరించు, వడువునన్= అలంకరించే విధంగా; ఎడపడక= ఎడతెగక; ఎల్ల+ఎడలన్= అన్నిచోట్లా; నిగుడు= వ్యాపించే; విభాత, కుసుమ, కదంబ, పరిమళంబును= వేకువజామునందలి పూల సమూహం యొక్క సువాసనల!; ఐ= అయి; ఉన్న+అంతన్= ఉండగా.

తాత్పర్యం: ప్రొద్దుననే వనలక్ష్మి నగరలక్ష్మిని అలంకరిస్తున్నదా అనే విధంగా, ఎడతెగకుండా అన్నిచోట్లా వ్యాపించే ఉదయ సమయ పుష్పసౌగంధ్యమూ కలిగి ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

అలం: ఉత్ప్రేక్ష. వనలక్ష్మి - రూపకం.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష; ఎడనెడ - ఉపమ. రూపకం-ఉత్ప్రేక్షను అతిశయింప చేశాయి. ప్రభాత వేళ కనువిందు చేసే ప్రకృతి సౌందర్యాన్ని ఊహాసుందరంగా ఆవిష్కరించటం ఇక్కడి అలంకారశిల్పం. వెనుకటి పద్యంలో తెల్లవారుజామున నక్షత్రాలు మాయమై ఆకాశం నిర్మలంగా తేటపడింది. 1. ఆ తరువాత-చీకట్లు క్రమంగా విరిసి దూరదూరంగా పోయి దిక్తటాలు బయట పడటం మొదట వర్ణించబడింది. అవి ముగిసిన చీకట్లు వరిసిపోగా బయటపడిన రాతికట్టలవలె ఉన్నాయి. ఇక్కడ ఉత్ప్రేక్షా గర్భిత ఉపమాలంకారం భావనీయం. 2. ఆ తరువాత - చక్రవాక పక్షులు రాత్రంతా తామరతూండ్ల ముక్కలను చిమ్మటం వలన ఆ ముక్కలు మిలమిలలాడుతూ ఉండగా మెరుస్తున్న సరోవరాలు వెలుగు చూచాయి. ఆ సరోవరాలు చంద్రకళలతో వెలుగొందే శివుడి జలమూర్తులో అన్నట్లున్నాయట! ఈ వర్ణనలో ఉపమాలంకార రంజితమైన ఉత్ప్రేక్ష భాసిస్తున్నది. దిక్కులు తెల్లబడి ఆ కాంతులు నీళ్ళలో ప్రతిఫలించటం ప్రభాత ప్రకృతి సౌందర్య దర్శకులకు సహజంగా గోచరించే సుందర దృశ్యమే. 3. ఆ తరువాత - జనుల దృష్టి నాకర్షించేవి చెట్లమీద వినపడే పక్షుల కలకలారావాలు. ప్రభాతం అనే మనిషి చీకటి అనే (ముసుగు వేసికొని అందరినీ భయపెట్టి ఒక్కసారిగా పై) ముసుగు తీసి వేయగా

అంతవరకూ సడీ సవ్వడీ లేకుడా ఉన్న చెట్లు ఒక్కసారి రెక్కలు విచ్చి ఎగురుతూ వ్రాలుతూ అరుస్తున్న పక్షుల కూతలనే మాటలతో చెలరేగి పరస్పరం యోగక్షేమాల పలకరింపులు మొదలుపెట్టినట్లున్నాయట! రూపకానుప్రాణిత ఉత్ప్రేక్ష ఇందులో ప్రకాశిస్తున్నది. 4. ఆ తరువాత అరుణోదయం- ఆ సమయంలో ఆకాశంలో కానవచ్చే అరుణకాంతితో దీటైన కాంతులు గలవి ఇలలో ఎఱ్ఱదామరలు. వాటి మీద తుమ్మెదలు విశృంఖలంగా తిరగటం వలన వాటి రెక్కలకు పుప్పొడు లంటాయి. వాటిని మలయపవనుడు డులిపి నేలకు రాలుస్తున్నాడు. అతడి వీరవిహారానికి పూలు రాలి లతామండపాల నిండా పడుతున్నాయి. అప్పుడవి మన్మథుడి పాత ఆయుధాగారాలా అన్నట్లు ఉన్నాయట! ఉపమానుప్రాణిత ఉత్ప్రేక్ష ఊహారమణీయం. రాత్రి ఎంత మన్మథోద్దీపకంగా ఉన్నదో అరుణోదయవేళ సైతం అంతటి మన్మథోద్దీపకంగా ఉన్నదని ధ్వని. మన్మథుడి పంచబాణాలు పూలే. (అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలం). 5. ఆ తరువాత నిష్ఠాగరిష్ఠుల ప్రాతఃకాల సంధ్యావందన దృశ్యాలు గోచరిస్తాయి. తెల్లవారేకొద్దీ కలువపూలు ముకుళిస్తాయి. ఆ ముకుళించిన కలువలు సూర్యుడికి అంజలి పట్టే భక్తుల కరపుటాలవలె ఉన్నాయట! ఉపమాలంకార మండిత మీ వర్ణనం. 6. ఆ తరువాత - ప్రభాత కాంతికి దీపాలు వెలవెల పోవటం సహజ రమణీయ దృశ్యం. ఆ దీపాలు మేలుకొలుపుల మిషతో నర్మ సంభాషణలు చేస్తున్న దంపతుల చిరునవ్వుల కాంతులచేత పరిహసించబడ్డాయట! అందువలన వెలవెలపోయాయేమో అన్నట్లు ఉన్నాయట. ఊహారమణీయమైన ఉత్ప్రేక్ష. 7. ఆ తరువాత - తెల్లవారే లోపల మరొకసారి విటులను ఆకర్షించి వినోదించాలనే వేడుకతో కొంటె చూపులు విసిరే వేశ్యల, విటకత్తెల పోకడలు గమనించదగినవి. రాత్రిళ్ళంతా నిద్రలేదు. అందువలన కన్నులు ఎఱ్ఱపడ్డాయి. కాని, ఆ కళ్ళు తొలిజాము కైపువలన అట్లా ఎఱ్ఱపడ్డాయని తలంచి, నేర్పరులైన విటులు తమను మరొకసారి కూడటానికి అనువుగా వారిని రెచ్చగొట్టు తున్నట్లున్నాయట విటకత్తెల చిలిపి చూపులు, ఊహారమ్యమైన ఉత్ప్రేక్ష. 8. ఆ తరువాత- ప్రభాత వాతావరణంలో గుబాళించే పూలవాసన అనుభవించ

దగింది - అది వనలక్ష్మి పురలక్ష్మిని ప్రభాత సేవ కొరకు అలంకరిస్తున్నట్లు దర్శనీయంగా, పూజనీయంగా, పవిత్రంగా కనబడిందట! 9. హరిహరనాథ భక్తుడైన తిక్కన హరుని అష్ట విధ రూపాల ప్రసక్తి ఈ వచనంలో తెచ్చాడు. అష్టవిధ ప్రభాతకాల వైభవాలను ఇందులో వర్ణించాడు. (సంపా.)

సీ. నీరజాకరములు నిష్ఠమైఁ జేసిన।
భవ్యతపంబుల ఫల మనంగ,
దివసముఖాభినందిత చక్రయుగ్మకం।
బుల యనురాగంపుఁబ్రో వనంగ,
హరిహరబ్రహ్మ మహానుభావంబు లొ।
క్కటి గాఁగఁ గరఁగిన గట్టి యనఁగ,
నతుల వేదత్రయ లతికాచయము పెను।
పొందఁ బుట్టెడు మూలకంద మనఁగ

తే. నఖిల జగముల కందెలు యగుచు జన స।
మాజ కరపుట హృదయ సరోజములకు
ముకుళనంబును జృంభణంబును నొనర్చి।
భానుబింబంబు పూర్వాద్రిపై వెలింగె. 220

ప్రతిపదార్థం: నీరజ+ఆకరములు= తామర కొలకులు; నిష్ఠమైన్+చేసిన= నియమంతో దీక్షగా చేసిన; భవ్యతపంబులఫలము+అనంగన్= చేసిన మంగళప్రదమైన తపస్సుల ఫలమో అన్నట్లుగా; దివసముఖ= ప్రాతఃకాలం చేత; అభినందిత= సంతోషింప జేయ బడిన; చక్రయుగ్మకంబుల= చక్రవాక పక్షుల జంటల యొక్క; అనురాగము+ ప్రోవు+ అనంగన్= ప్రేమరాశి అనునట్లు; హరిహరబ్రహ్మ= త్రిమూర్తుల-విష్ణు మహేశ్వర బ్రహ్మల యొక్క; మహత్+అనుభావంబులు= గొప్ప ప్రభావాలు; ఒక్కటి+కాఁగన్= ఒకటిగా

అయ్యేటట్లు; కరఁగిన= కరిగించి చేసిన; గట్టి= కణిక; అనఁగన్= అనునట్లు; అతుల= సాటిలేని; వేదత్రయ= మూడువేదాలనే; లతికాచయము= తీగలసమూహం; పెనుపొందన్= అభివృద్ధి చెందేటట్లు; పుట్టెడు= పుట్టిన; మూలకందము+అనఁగన్= మొదటి దుంప అన్నట్లు; అఖిలజగముల= అన్ని లోకాలకు; కన్+తెఱ= కనురెప్ప; అగుచున్= ఔతూ; జనసమాజ= జనసమూహాల యొక్క; కరపుట= దొప్పలలాంటి చేతులకు; హృదయ సరోజములకున్= హృదయాలు అనే కమలాలకు; ముకుళనంబును= ముడుచు కొనటమూ; జృంభణంబునున్= వికాసాన్ని; ఒనర్చి= కలిగించి; భానుబింబంబు= సూర్యబింబం; పూర్వాద్రిపైన్= తూర్పుకొండపై; వెలింగెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: తామర కొలకులు నిష్ఠతో చేసిన పవిత్ర తపస్సులకు ఫలితమో అన్నట్లు, తెల్లవారగానే కూడుకొన్న చక్రవాకపక్షుల జంటల అనురాగమంతా ఒక రాశిగా రూపొందిందా అన్నట్లు, త్రిమూర్తుల మహిమలను కరగించి చేసిన సిద్ధగుళికయా అన్నట్లు, వేదాలు అనే ఎగ్రబ్రాకే తీగలు పుట్టిన దుంపా అన్నట్లు సకల లోకాలకు కనురెప్పగా ఉండే సూర్యుడి పూర్ణబింబ రూపం తూర్పుకొండ మీద ప్రకాశించింది. లోకానికి కనురెప్ప అయిన సూర్యుడు క్రమంగా జనుల చేతి అంజలులకు ముకుళనాన్నీ, హృదయపద్మాలకు వికాసాన్నీ కలుగజేసి తూర్పుకొండపై ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, రూపకం, తుల్యయోగిత, యథాసంఖ్యం. ఈ పద్య రచనా మహత్త్వాన్ని కీ.శే.భూపతి లక్ష్మీనారాయణరావుగా రిట్లా వ్యాఖ్యానించారు. 'భవ్యతపః ఫలంబగు పరంజ్యోతి స్వరూపము, విశుద్ధ ప్రేమ పరిణామమగు రసస్థితి, హరిహరబ్రహ్మైక్య జ్ఞానమూర్తి, వేదత్రయ జన్మకారణమగు పరబ్రహ్మ స్వరూపము నను నిట్టి యలౌకికోపమానములచే వర్ణన కుదాత్తత సిద్ధించినది. హృదయంగమము లైన యీ యుత్ప్రేక్షలు రచనకు మనోహరత్వము నాపాదించుటయేగాక, సూర్య భగవానుని పరబ్రహ్మతత్త్వమును బ్రతిపాదించు నవియై, పఠితృమానసములను భక్తిభావపూరితములుగా నొనర్చుచున్నవి. 'అఖిల జగముల కన్దెఱ యగుచు'

ననుటలో, సూర్యభగవానుడు చైతన్యప్రదాతయు, జ్ఞానప్రదాతయు నగునను నర్థము సిద్ధించినది. అట్టి పరబ్రహ్మ స్వరూప సాక్షాత్కారముచే జనుల హృదయములు వికాసము నొందుటయు, వారు భక్తిచేఁ గరములు మోడ్చి, సూర్యభగవానునకుఁ బ్రణ మిల్లుటయు, నొక్కుమ్మడి జరుగు కార్యములు. ఈ యుదాత్తార్థమును బ్రతిపాదించుచుఁ, దిక్కన, యథాసంఖ్య, రూపకోత్ప్రేక్షా తుల్యయోగితల నతి ప్రౌఢముగఁ బోషించి యున్నాడు. జగజ్జ్యోతియు, విష్ణుస్వరూపమును నగు సూర్యుని వర్ణించుచుఁ దిక్కన గ్రహించిన పవిత్రములగు నుపమానము లతని యుదాత్త కవితాతత్త్వమునకు నిదర్శనము లగును.'' (భారతము- తిక్కన రచన - రెండవ ముద్రణ: 1962 పు. 25-26). హరి హర బ్రహ్మ మహానుభావంబు లొక్కటి గాఁగఁ గరఁగిన గుటిక యనఁగ' - అనే పాఠాంతరం ఉన్నది.

కీచకుఁడు ద్రౌపది నియ్యకొలుప యత్నించుట (సం.4-21-7)

వ. ఇట్లు సూర్యోదయ మగుటయు సమయ సముచిత కరణీయంబులు వేగిరంబ నడపి వేగిరపాటుతో సింగారంబు సేసికొని సింహబలుండు.221

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సూర్య+ఉదయము+అగుటయున్= ప్రొద్దు పొడుపు కాగా; సింహబలుఁడు= కీచకుడు; సమయ సముచిత= సమయానికి తగిన; కరణీయంబులు= పనులు; వేగిరంబు+అ= త్వరగా; నడపి= జరిపి; వేగిరపాటుతోన్= తొందరపాటుతో; సింగారంబు+చేసికొని= అలంకరించుకొని.

తాత్పర్యం: ఇట్లు సూర్యోదయం కాగా, ప్రాతఃకాలంలో చేయదగిన కృత్యాలను త్వరగా పూర్తి చేసి, వడివడిగా అలంకరించుకొని కీచకుడు.

విశేషం: కీచకుడు 'నానాభరణధరణ శీలుఁడు' అని తిక్కన (2.32) చెప్పటం గమనించదగింది. అతడి వేగిరపాటు కామ భావోద్వేగాన్ని సూచిస్తున్నది. (సంపా.)

క. తన మదిఁ గదిరిన తమకం।
బునఁ జిడిముడిపడుచు ద్రుపదపుత్త్రికపై నూ

నిన వేడ్క దిగువ నొకటియుఁ ।
గనుఁగొన విన లేక మదనకంపితుఁడగుచున్. 222

ప్రతిపదార్థం: తన మదిన్= కీచకుడి మనస్సులో; కదిరిన తమకంబునన్= అధికమైన మోహంతో; చిడిముడి పడుచున్= తొట్రుపడుతూ; ద్రుపద పుత్రికపైన్= ద్రౌపదిపై; ఊనిన వేడ్క= కలిగిన కోరిక; తిగువన్= ఆకర్షించగా; ఒకటియున్+కనుఁగొనన్= ఏ ఒక్కటీ చూడటానికి; వినన్= వినడానికీ; లేక= మనస్సు నిలువక; మదనకంపితుఁడు+అగుచున్= మన్మథ చలితుడై.

తాత్పర్యం: కీచకుడు తన మనస్సులో పెరిగిన మోహంతో చిడుముడిపాటుతో తొట్రుపడుతూ ద్రౌపదిపై కలిగిన ఉత్కంఠతో ఏదీ చూడలేక, ఏదీ వినలేక మదనావేశంతో, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'కామాతురాణాం న భయం న లజ్జా' అనే సూక్తికి ఇది నిదర్శనంగా కనబడుతున్నది. ఇక్కడ కీచకుడి కంటికి ఏదీ కనబడదు. చెవికి ఏదీ వినబడదు.

వ. అతిత్వరితంబ సుదేష్ణమందిరంబున కరుగుచు నంతరంగంబున.223

ప్రతిపదార్థం: అతిత్వరితంబు+అ= మిక్కిలి వేగంగా; సుదేష్ణ మందిరంబునకున్= సుదేష్ణ ఇంటికి; అరుగుచున్= వెళ్లుతూ; అంతరంగంబునన్= మనస్సులో.

తాత్పర్యం: అతి వేగంగా సుదేష్ణ అంతఃపురానికి వెళ్ళుతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. 'చయ్యన నేఁగి యంబుజ విశాల విలోచనఁ గాంచి ప్రీతిమై
నయ్యెడ నేకతంబ హృదయం బలరం దగఁబల్కి యొక్కమై
నియ్యకొనంగఁ జేసి యెలయించెద, నిక్కకుఁ దార్చి, నేర్పునన్
శయ్యకుఁ దెచ్చెదం గుసుమసాయకు పూనికి నేఁడ తీర్చెదన్'. 224

ప్రతిపదార్థం: చయ్యనన్+ఏఁగి= త్వరగా వెళ్లి; అంబుజ విశాల విలోచనన్= పద్మాలవలె విశాలమయిన కన్నులు గల ద్రౌపదిని; కాంచి= చూచి; ప్రీతిమైన్= ప్రేమతో; ఆ+ఎడన్= అక్కడే; ఏకతంబు+అ= ఒంటరిగా; హృదయంబు+అలరన్+తగన్+పల్కి= మనస్సు మెచ్చుకునేటట్లు తగినట్లు మాట్లాడి; ఒక్కమైన్= ఏదో ఒక విధంగా; ఇయ్యకొనంగన్+చేసి= అంగీకరించేటట్లు చేసి; ఎలయించెదన్= అలరిస్తాను; ఇక్కకున్= ఏకాంత మందిరానికి; తార్చి= చేర్చి; నేర్పునన్= మెలకువతో; శయ్యకున్+తెచ్చెదన్= పడకపై చేరుస్తాను; నేఁడు+అ= ఈరోజే; కుసుమసాయకుపూనికిన్= మన్మథుడి ప్రయత్నాన్ని, రతిసౌఖ్యాన్ని; నేఁడు+అ= ఈ దినమే; తీర్చెదన్= పూర్తి చేస్తాను.

తాత్పర్యం: 'నేను త్వరగా పోయి, సైరంధ్రిని చూచి, ప్రీతితో అక్కడ ఏకాంతంలో కలిసి మనసు మురిసేటట్లు మాట్లాడి, ఏదో విధంగా ఆమెను ఒప్పించి ఇంటికి తీసికొని వచ్చి, నేడే నా మదనవాంఛను తీర్చుకొంటాను.'

విశేషం: మదనావేశంలో ఊగిసలాడుతున్నాడు కీచకుడు. సైరంధ్రి అంగీకరిస్తుందా? లేదా? అనేది అనుమానం. తార్చి= అనే మాట తార్పుడుగాండ్ర విషయంలో వాడుతారు. వ్యభిచార స్వభావం కలవారిపట్ల అది సరిపోతుంది. మాటి మాటికి మదనావేశంతో పరవశించిపోతున్నాడు కీచకుడు.

క. అని యువ్విళ్లూరుచు వెసఁ ।
జని కేకయ రాజపుత్రి సదనంబున న
య్యనిమిషచారువిలోచన ।
యనురూప విధాన నిరతయై యుండంగన్. 225

ప్రతిపదార్థం: అని, ఉవ్విళ్లూరుచున్= అని ఉబలాటపడుతూ; వెసన్+చని= త్వరగా వెళ్ళి; కేకయ రాజపుత్రి సదనంబునన్= సుదేష్ణ మందిరంలో; ఆ+అనిమిషచారువిలోచన= ఆ చేపలవంటి అందమైన కనులుగల సైరంధ్రి; అనురూప విధాన= ఆమె వృత్తికి తగిన పనిలో; నిరత+ఐ+ఉండంగన్= లగ్నమై ఉండగా.

తాత్పర్యం: కీచకుడు ఆ విధంగా ఉబలాటపడుతూ త్వరగా వెళ్ళి సుదేష్ణ మందిరంలో అందమైన కనులుగల సైరంధ్రి తన పనిలో నిమగ్నఅయి ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'అనిమిష చారు విలోచన' అనే విశేషణం ద్రౌపది తత్కాలంలో కీచకుడి వర్తనం పట్ల ప్రదర్శిస్తున్న జాగరూకతనూ, 'అనురూప విధాన' మనే ప్రయోగం భీమద్రౌపదులు క్రిందటి రాత్రి యోచించిన పథకానికి అనుగుణంగా - అనే అర్థాన్ని కూడా ధ్వనింప చేయటం విశేషం. (సంపా.)

చ. కనుఁగొని యప్టు గ్రొత్తయగు కౌతుకవృత్తి మునింగి పల్లటి
ల్లిన ధృతితోఁ గ్రమం బరయలేని మనంబు చలింప నచ్చటన్
జను లెడ యౌటఁ గాంచు నెఱి సాలక గ్రక్కున నింతిఁ జేరఁగాఁ
జనియె విధాతృలుబ్ధకవశంబునఁ బోవు మృగంబు చాడ్పునన్. 226

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; అప్డు= ఆ సమయంలో; క్రొత్త+అగు కౌతుక వృత్తిన్= క్రొత్తదైన అనుభవం కొరకు పడే ఆశగల భావంతో; మునింగి= పడిపోయి; పల్లటిల్లిన= మిగుల చలించిన; ధృతితోన్= ధైర్యంతో; క్రమంబు+ అరయలేని= ఉచితానుచితాలు తెలిసికొనలేని; మనంబు= మనస్సు; చలింపన్= స్పందించగా; అచ్చటన్= అక్కడ; జనులు ఎడ+ఔటన్= పరివారం దూరం కావటం కొరకు; కాంచు= నిరీక్షించి చూచే; నెఱి= ఓపిక, బుద్ధి; చాలక= సరిపోక; విధాతృ= బ్రహ్మ అనే; లుబ్ధక వశంబునన్= వేటగాని చేతిలో పడటానికి; పోవు= పోయే; మృగంబు చాడ్పునన్= జింకవలె; గ్రక్కునన్= త్వరగా; ఇంతిన్+చేరఁగాన్= ద్రౌపదిని సమీపించటానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: సైరంధ్రిని చూచి కీచకుడు క్రొత్త కోరికలు చిగురెత్తగా ఆసక్తిలో మునిగి, ధైర్యం కోల్పోయి, వివేకాన్ని వీడి, మనస్సు చలించగా, దగ్గరలో పరిజనం లేకుండా వేచిచూచే ఓపిక కూడా లేకుండా విధి అనే వేటగాడి ఉరిలోకి తనంతట తాను ఉరికే మగజింకవలె శీఘ్రంగా ఆమె సమీపానికి వెళ్ళాడు.

విశేషం: అలం: ఉపమ. జరగబోయే కథను వ్యంగ్యంగా చెప్పుతున్నాడు కవి. కీచకుడు మృగం వలె ప్రాణాలు కోల్పోతాడు. అయితే అది విధి నిర్ణయం. వాడు దానికి లోబడ్డాడు. మృగోపమానం ఇంద్రియలోలుపత్వాన్ని ధ్వనింపచేస్తున్నది.

క. చనుటయు ద్రౌపది యతనిం
గనియుం గానని విధంబు గైకొని చిత్తం
బున బెదరక తనముందటి
పనివెరవున నుండె భీముపలుకుల యూఁతన్. 227

ప్రతిపదార్థం: చనుటయున్= వెళ్ళగా; ద్రౌపది; అతనిన్+కనియున్= కీచకుడిని చూచి కూడా; కానని విధంబు+కైకొని= చూడనట్లుగా భావించి; చిత్తంబునన్+బెదరక= మనస్సులో భీతిల్లక; భీముని పలుకుల+ఊఁతన్= భీముడిచ్చిన మాటల ధైర్యంతో; తన ముందటి= అతడు రాక మునుపు తన చేతిలో ఉన్న; పనివెరవునన్+ఉండె= పనిలో నిమగ్నఅయి ఉన్నది.

తాత్పర్యం: అట్లా కీచకుడు దగ్గరికి వెళ్ళగా, ద్రౌపది భీము డిచ్చిన మాటలను ఊతగా తీసికొని, అతడిని చూచినా చూడనట్లు నటిస్తూ, దూరంగా తొలగిపోకుండా, మనోధైర్యంతో తాను చేస్తూఉన్న పనిలో నిమగ్నురాలైనట్లు ఉండింది.

వ. అట్టియెడ. 228

తాత్పర్యం: ఆ సమయంలో.

సీ. ఎవ్వరితోనైన నెలుఁగెత్తి యొక్కింత
పనిలేని వెంగలి పలుకు వలుకు;
మట్టియ లొండొంటి బిట్టుదాఁకఁగ నేల
నందంద మునిగాళ్ళ నప్పళించుఁ;

గడువికారంబుగా నొడలెల్ల విఱుచుచు।
మలఁగి రిత్తకు రిత్త సెలఁగి నవ్వఁ;
దాళంబుగాఁ గరతలమునఁ బెలుచఁ గం।
బంబు వ్రేయుచు వెడపాట పాడు;

తే. మలయు, నంతంతఁ జేరువఁ బొలయు, నింతి।
తన్ను చూడమి కెంతయుఁదల్లడిల్లు;
నిక్కడక్కడఁబడుఁ, దగు లినుమడింపఁ।
జూచు నత్తన్విఁ బొరిఁబొరిఁగీచకుండు. 229

ప్రతిపదార్థం: కీచకుండు= కీచకుడు; ఎవ్వరితోన్+ఐనన్= ఎవరితోనైనా; ఎలుఁగు+ఎత్తి= గొంతెత్తి; ఒక్కింత= కొంచెమైనా; పనిలేని= వ్యర్థమైన; వెంగలిపలుకు= తెలివిలేని మాటను; పలుకున్= మాట్లాడుతాడు; మట్టియలు= కాలి మట్టెలు; ఒండొంటిన్= ఒకదానికొకటి; బిట్టుదాఁకఁగన్= గట్టిగా తాకగా; నేలన్= నేలమీద; అందంద= అక్కడక్కడ; ముని+కాళ్ళన్= ముందు కాళ్ళతో, కొనగోళ్ళతో; అప్పళించున్= తట్టేవాడు; కడువికారంబు+కాన్= మిక్కిలి అసహ్యంగా; ఒడలు+ఎల్లన్= శరీరమంతా; విఱుచుచున్= విరుస్తూ; మలఁగి= మరలి; రిత్తకు రిత్త= వృథాగా; చెలఁగి నవ్వన్= పెద్దగా నవ్వేవాడు; కరతలమునన్= అరచేతితో; తాళంబుగాన్= తాళంగా; పెలుచన్= శబ్దం చేసేటట్లు; కంబంబు వ్రేయుచున్= స్తంభాన్ని తట్టుతూ; వెడపాట పాడున్= అల్పమైన పాట పాడేవాడు; అంతంతన్= అక్కడక్కడ; మలయున్= తిరుగుతాడు; చేరువన్= దగ్గరగా; పొలయున్= సంచరిస్తాడు; ఇంతి= ద్రౌపది; తన్నున్= (కీచకుడిని); చూడమికిన్= చూడకపోవటానికి; ఎంతయున్+తల్లడిల్లున్= ఎంతో బాధపడతాడు; ఇక్కడ+అక్కడ= ఇక్కడా అక్కడా; పడున్= పడతాడు; తగులు= మోహం; ఇనుమడింపన్= రెట్టింపు కాగా; ఆ

తన్విన్= ద్రౌపదిని; పొరిన్+పొరిన్= మాటిమాటికీ; చూచున్= చూస్తాడు.

తాత్పర్యం: కీచకుడు కంటబడ్డవారితో వృథాగా మాటలు చెప్పుతూ, కాలిమట్టెలు శబ్దం చేసేటట్లు మునిగాళ్ళతో నేల మీద తడుతూ, వికారంగా ఒడలు విరుచుకొంటూ, అకారణంగా నవ్వుతూ, అరచేతితో స్తంభాన్ని తట్టి తాళం వేస్తూ, వెడ పాట పాడుతూ, సైరంధ్రికి దగ్గరగా వెళ్ళి, ఆమె తనను చూడకపోవటంతో మిక్కిలి బాధపడుతూ, అధిక మోహంతో సైరంధ్రిని చూస్తూ ఉన్నాడు.

విశేషం: అలం: యథాసంఖ్యం. కీచకు డిక్కడ ప్రదర్శిస్తున్న చేష్టలు దుర్విలాసాలని తరువాతి వచనంలో తిక్కన పేర్కొన్నాడు. అవి కీచకుడి ఉన్మత్తావస్థను ధ్వనింపచేస్తున్నాయి. ఒక్కొక్క చేష్ట ఒక్కొక్క దుర్విలాసాన్ని తెలుపుతున్నట్లు క్రమంగా అన్వయించటం అలంకార సౌందర్యం. అక్కడక్కడే తిరుగుతూ అనవసరంగా, అర్థరహితంగా, ఎవ్వరితో పడితే వారితో పెద్దగా గొంతు పెంచి మాట్లాడాడట- తాను వచ్చినట్ల సైరంధ్రి తెలిసికొని కన్నెత్తి చూడాలని! కాని, ఆమె దగ్గరలో ఉండి కూడా అతడిని చూడలేదు. అందుకని కాలి మట్టెలు నేలకు తాకేటట్లుగా శబ్దం చేస్తూ మునికాళ్ళను అప్పళించాడు. అయినా ఆమె చూడలేదు. (ఆరోజులలో మగవాళ్ళు కూడా మట్టెలు పెట్టుకొనేవారు కాబోలు! అందరూ కాకపోయినా కీచకుడి వంటి నానాభరణధరణశీలురు ధరించేవారేమో! అవి ధనవంతుల అలంకారాలలోనివి కావచ్చును.) అందుకు కలతపడ్డాడు. ఆమెను ఆకర్షించటానికీ, తన విరహవేదనను ఆమెకు తెలుపటానికీ ఒడలెల్లా విరుస్తూ, కారణం లేకుండానే కలకలా నవ్వుతూ క్రిందా మీదా పడ్డాడు (శతధా యత్నించాడని భావం). అయినా లాభం లేకపోయింది. మోహం అతిశయించగా ఆమె వైపు సూటిగా తేపతేపకు చూస్తూ స్తంభాల మీద చేతులు పెట్టి తాళం వేస్తూ కూనిరాగాలు తీయటం మొదలుపెట్టాడు. ఉన్మత్తుడి వింత వలపును అభినయ సుందరంగా చలనచిత్రంగా చిత్రించిన తిక్కన నాటకీయత కీపద్యం చక్కని ఉదాహరణం. (సంపా.)

వ. ఇట్లు బహుప్రకారంబులగు దుర్విలాసంబులు సేయుచు నద్దురాత్ముండు ద్రుపదనందన డాయంబోయి. 230

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; బహుప్రకారంబులు+అగు= అనేక రకాలైన; దుర్విలాసంబులు= చెడుశృంగార చేష్టలు; చేయుచున్= చేస్తూ; ఆ దురాత్ముండు= ఆ కీచకుడు; ద్రుపదనందనన్= ద్రౌపదిని; డాయన్+పోయి= సమీపించి.

తాత్పర్యం: ఈ విధంగా అనేకరకాలుగా వికార శృంగార చేష్టలు చేస్తూ ఆ దుష్ట కీచకుడు ద్రౌపదిని సమీపించి.

ఉ. 'భాగ్యము గాదె నీ చరణపద్మము లెప్పుడుఁ జేరి కొల్వఁగా
యోగ్యత గల్గెనేని, నను నొక్కని నొల్లవొ? కామసౌఖ్యవై
రాగ్యము నీ మనంబునఁ దిరంబొ? నిజం బెఱుఁగంగఁ జెప్పు; సౌ
భాగ్యము గుందునే మగలపై నొక యించుక చూడ్కి నిల్పినన్. 231

ప్రతిపదార్థం: నీ చరణపద్మములు= నీ (ద్రౌపది) పాదపద్మాలు; ఎప్పుడున్= నిరంతరం; చేరికొల్వఁగాన్= ఆశ్రయించి కొలవటానికి; యోగ్యత కల్గెన్+ఏని= అవకాశం కలిగితే; భాగ్యము+కాదె!= అదృష్టం కదా!; ననున్+ఒక్కనిన్+ ఒల్లవొ?= ఈ కీచకుడిని ఒకడినే కోరుకొనవా?; నీ మనంబునన్= నీ మనస్సులో; కామసౌఖ్యవైరాగ్యము= మన్మథసుఖాలపై ఆశలేకపోవటం; తిరంబొ?= మారనిదా?, స్థిరమా?; నిజంబు+ఎఱుఁగంగన్+చెప్పు= ఉన్నమాట తెలిపేటట్లు చెప్పుము; మగలపైన్= పురుషుల మీద; ఒక+ ఇంచుక చూడ్కినిల్పినన్= కొంచెమైనా దృష్టి నిలిపితే; సౌభాగ్యము= నీ అందం; కుందునే?= తగ్గిపోతుందా?

తాత్పర్యం: 'నీ పాదపద్మాలను ఆశ్రయించి కొలిచే భాగ్యమబ్బితే అదృష్ట వంతుడిని గదా! ఈ కీచకుడిని ఒక్కడినే మోహించటం ఇష్టం లేదా? లేక పురుషజాతిపైనే వైరాగ్యభావం కలిగిందా? ఉన్న విషయం స్పష్టంగా చెప్పుము. మగవారివైపు కాస్త కడకంటిచూపు ప్రసరింపజేస్తే నీ సొమ్మేమైనా తరిగి పోతుందా?

విశేషం: క్షణక్షణానికి కీచకుడి వియోగవ్యధ అధికమవుతున్నది. మాటలు తూలుతున్నాడు. అడుగులకు మడుగులొత్తటానికి కూడా సిద్ధపడుతున్నాడు. 'సౌభాగ్యము కుందునే' - నీ సొమ్మేమైనా పోతుందా? అనే జాతీయానికి ప్రతిరూపం. స్త్రీకి సౌభాగ్యం అందం - కాబట్టి అందమైనా అ(త)రిగిపోతుందా? అన్నట్లు కూడా గ్రహించవచ్చును.

ఉ. ఆలము సేసి నా తగుల మాఱడిపుచ్చఁగ నేల బేల! న
న్నేలి యనంత భోగముల నిచ్చమెయిన్ విహరింపు నిత్యల
క్ష్మీ లతికాలవాలమగు జీవనమంతయు నీ మొగంబకాఁ
బాలన సేయు మిప్పురము భామిను లెల్లను నిన్నుఁ గొల్వఁగన్. 232

ప్రతిపదార్థం: ఆలము+చేసి= నిర్లక్ష్యం చేసి; నా తగులము= నా ఆశను; ఆఱడిపుచ్చఁగన్+ఏల?= వృథా చేయటం ఎందుకు?; బేల!= ఓ అమాయకురాలా!; నన్నున్+ఏలి= నన్ను (ఈ కీచకుడిని) వరించి; అనంతభోగములన్= అపారమైన సుఖాలతో; ఇచ్చమెయిన్= నీ ఇష్టం వచ్చినట్లు; విహరింపు(ము)= క్రీడించుము; నిత్యలక్ష్మీ= నిరంతర సంపద అనే; లతికా+ఆలవాలము+అగు= తీగకు పాదు అయిన; జీవనము+ అంతయున్= నా బ్రతుకంతా; నీ మొగంబు+అకాన్= నీ పక్షం కాగా; ఈ+పురము= ఈ పట్టణంలోని; భామినులు+ఎల్లను= స్త్రీలంతా; నిన్నున్+కొల్వఁగన్= నిన్ను సేవించగా; పాలన చేయుము= ఏలుకొమ్ము.

తాత్పర్యం: ఓ అమాయకురాలా! ఈ విధంగా నన్ను లెక్కపెట్టకుండా చూచి నీపై నా ఆశను వమ్ము చేయకుము. నన్ను అనుగ్రహించి అంతు లేని సంపదలను, సుఖాలను స్వేచ్ఛగా అనుభవించుము. నా సంపదకు నీవే రాణివై ఈ పట్టణంలోని స్త్రీలు అందరూ నిన్ను కొలువగా రాణివాసంలో రాణించుము.

విశేషం: అలం: శ్లిష్టరూపకం. లక్ష్మీలతికలకు ఆలవాలం జీవనం - జీవనమంటే నీరని అర్థం. లతలకు నీరు, సంపదలకు బ్రతుకు అని శ్లేష మొత్తం మీద రూపకాలంకారం. కామాంధులైన రావణ కీచకులు ఒకే మాదిరి మాట్లాడారు. రావణుడు కూడా సీతమ్మను ఇట్లాగే ప్రలోభపెట్టాడు. ద్రౌపదితో కీచకుడు సంపదలను గూర్చిన ప్రలోభాన్ని కలిగించే మాటలు మాట్లాడటం వ్యర్థం. ఆమె మనస్సు చలించదు.

ఉ. రాజుల నెల్ల నుగ్రసమరంబుల వ్రేల్మిడి నేర్చి పేర్చి యీ
భూజనకోటి నాదగు విభుత్వ సమగ్రత నాదరింప వి
భ్రాజిత రాజ్యతంత్రములు పాలన సేయుదు నేన; వీటికిన్
రా జనఁగా నెపం బిడి విరాటునకుం దగఁ గూడు వెట్టుదున్. 233

ప్రతిపదార్థం: ఉగ్రసమరంబులన్= తీవ్రమైన యుద్ధాలలో; రాజులన్+ఎల్లన్= రాజులనందరినీ; వ్రేల్మిడిన్= క్షణకాలంలో; ఏర్చి= దహించి; పేర్చి= అతిశయించి; ఈ భూజనకోటి= ఈ ప్రజల సమూహం; నాదగు= నాయొక్క; విభుత్వ సమగ్రతన్= ఆధిపత్య పరిపూర్ణతను; ఆదరింపన్= గౌరవించగా; విభ్రాజిత= ప్రకాశించే; రాజ్యతంత్రములు= రాచరికపు కార్యకలాపాలు; నేను+అ= కీచకుడైన నేనే; పాలన+చేయుదున్= నిర్వహిస్తున్నాను; వీటికిన్= ఈ నగరానికి; రాజు+అనఁగాన్= రాజు అనే; నెపంబు+ఇడి= సాకు చెప్పి; విరాటునకున్+తగన్+కూడు పెట్టుదున్= విరాట మహారాజుకు తగినట్లుగా అన్నం పెట్టుతున్నాను.

తాత్పర్యం: నేను భయంకర యుద్ధాలలో రాజులనందరినీ యుద్ధభూమిలో క్షణంలో చంపి, మించి, ఈ దేశంలో జనులందరూ నా సమగ్ర ప్రభుత్వాన్ని ఆదరిస్తూ ఉండగా నేనే రాజునై రాజ్యాంగం నడుపుతున్నాను. నామమాత్రంగా విరాటరాజును రాజుగా పేరుపెట్టి అతడికి తగినట్లు తిండి పడవేస్తున్నాను.

విశేషం: కీచకుడి ఆత్మస్తుతి అతడి ఔద్ధత్యాన్ని ప్రదర్శిస్తున్నది. (సంపా.)

వ. కావున. 234

తాత్పర్యం: కాబట్టి.

క. నీ వొకత వేల? యిలఁ బది।
వేవుర నే వలచి పట్ట వెదకిన నడ్డం
బై వచ్చి వలదు నా నిం।
దేవాఁడు మగండు? దీని నెఱుఁగవు కంటే! 235

ప్రతిపదార్థం: నీవు ఒకతవు+ఏల?= నీవు ఒక్కదానివే కాదు; ఇలన్= భూమిపై; పదివేవురన్= పదివేల మందిని; నే వలచిపట్టన్= నేను కోరిపట్టుకొనదలచి; వెదకినన్= వెదికిచూస్తే; అడ్డంబు+ఐ+వచ్చి= అడ్డంగా వచ్చి; వలదునాన్= వద్దని అనడానికి; ఇందున్+ఏ+వాఁడు= ఇక్కడ ఎవ్వడు; మగండు= పురుషుడు (సమర్థుడు) కలడు?; దీనిన్+ఎఱుఁగవు, కంటే!= దీన్ని తెలిసికొనలేకున్నావు గదా!

తాత్పర్యం: ఓ సైరంధ్రీ! నీవు ఒక్కదానివే కాదు, భూమిపై పదివేలమందినైనా నేను కోరి పట్టుకొంటే కాదని వారించగల మగాడు ఇక్కడ లేడు. దీనిని నీవు తెలిసికొనలేకున్నావు కదా!

విశేషం: కన్ను మిన్ను తెలియని అహంకారం కీచకుడి కంటికి పొరగా నిలిచింది.

చ. విరటుఁడు సూచుచుండ నిను వేవుర ముందట నట్లు ద్రోవ నొ
క్కరుఁడును గాదుగూడ దనఁగల్గెనె? పోటరులైన భర్త లే
వురు గలరంటి; వారి యలవుం జలముం గడగంటి; నింక నె
వ్వరు గల? రెట్లు దప్పె? దనివారణఁ బట్టెద నెందుఁ జొచ్చినన్.' 236

ప్రతిపదార్థం: విరటుఁడు= విరాటరాజు; చూచుచుండన్= చూస్తుండగా; నినున్= ద్రౌపదిని; వేవుర ముందటన్= వేలమంది ముందు; అట్లు త్రోవన్=

అట్లా త్రోసివేయగా; ఒక్కరుఁడును= ఒక్కడు కూడా; కాదు కూడదు+ అనన్+కల్గెనె?= ఇది తగనిది, చేయరానిది అనగలిగాడా?; పోటరులు+ఐన= బలవంతులైన; భర్తలు= మగలు; ఏవురు= ఐదుగురు; కలరు+అంటి(వి)= ఉన్నారన్నావు; వారి+అలవున్= వారి బలసంపద; చలమున్= పట్టుదల; కడ+కంటిన్= అంతుచూచాను; ఇంకన్+ఎవ్వరు కలరు?= ఇంక ఎవరున్నారు?; ఎట్లు తప్పెదు?= ఎట్లా తప్పించుకొంటావు?; ఎందున్+ చొచ్చినన్= ఎక్కడ చొరబడ్డా; అనివారణన్= అడ్డులేకుండా; పట్టెదన్= పట్టుకొంటాను, వశం చేసికొంటాను.

తాత్పర్యం: విరాటమహారాజు చూస్తుండగా సభలో వేలమంది ముందట నేను నిన్ను అట్లా త్రోసిపడవేసినా నన్ను అడ్డుకొన్నవారు ఎవరూ లేరు. నీకు బలవంతులైన ఐదుగురు భర్తలున్నారని పలికావు. వారి బలపరాక్రమాలు ఇప్పుడు తెలిసివచ్చాయి కదా! వారి అంతు చూస్తాను. నీవు ఎక్కడ చొరబడ్డా, అడ్డులేకుండా నిన్ను గ్రహిస్తాను.

విశేషం: ముందు వినయంగా, ఆ తర్వాత కఠినంగా మాట్లాడటం దుష్టుల లక్షణం. ఇక్కడ శ్రుతిమించి రాగాన పడుతున్నది కీచకుడి మాట తీరు. పట్టుకొంటాను - అనే క్రియ అతడి భావి క్రియకు సూచనగా చివర నిలపటం విశేషం. దానిని ద్రౌపది గ్రహించి కార్యాచరణకు దిగవలసి ఉన్నది. 'త్రోపన్' అనే పాఠానికి 'తాపన్', 'తన్నన్' అనే పాఠాంతరాలు ఉన్నాయి. (వివరాలకు ఈ ఆశ్వాసంలోని 128వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.)

వ. అనిన నవ్వెలంది 'వీఁడు దమకించి యున్నవాడు; నా యంత్రించు మాటలకు మున్న కదియంబడినఁ గర్జంబు దప్పు' నని విచారించి. 237

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+వెలంది= ద్రౌపది; వీఁడు= కీచకుడు; తమకించి+ ఉన్నవాఁడు= త్వరపడుతున్నాడు; నా యంత్రించు మాటలకున్+ మున్ను+అ= నేను కట్టడి చేసే మాటలు చెప్పక పూర్వమే; కదియన్+పడిన= మీదపడితే; కర్జంబు+తప్పున్+అని= చేయవలసిన పని చెడుతుందని; విచారించి= ఆలోచించి.

తాత్పర్యం: 'కీచకుడు నన్ను పట్టుకొనటానికి త్వరపడుతున్నాడు. నేను కట్టడి చేయవలసిన మాటలు చెప్పకముందే వీడు నన్ను సమీపిస్తే అనుకొన్న పని చెడిపోతుం'దని ఆలోచించి, ద్రౌపది. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. బహువిధంబుల నమ్మెయిఁ బలుకు నతని।
పలుకు లేర్పడ విని, మెత్తఁబడినయట్లు
సుభగ మెయివడి చూపుగాఁ జూచి తనదు।
హృదయ మెఱిఁగించు తెఱఁగున నిట్టులనియె. 238

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ విధంగా; బహువిధంబులన్= అనేక ప్రకారాలుగా; పలుకు= మాట్లాడే; అతని పలుకులు= కీచకుడి మాటలు; ఏర్పడన్+విని= శ్రద్ధగా ఆలకించి; మెత్తన్+పడిన+అట్లు= అంగీకరించినట్లుగా, లోబడినట్లుగా; సుభగ= మంచి భాగ్యంగల ద్రౌపది; మెయివడి చూపుగాన్= ఒప్పుకొన్న చూపుగా చూచి; తనదు హృదయంబు+ఎఱిఁగించు తెఱఁగునన్= తన మనస్సు బయటపెట్టుతున్నట్లుగా; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఆ విధంగా అనేక రీతులుగా పలుకుతున్న కీచకుడి మాటలన్నీ ద్రౌపది శ్రద్ధగా విని, మనసు మెత్తపడి అంగీకరించినట్లు అతడి వైపు చూచింది. తన మనసులోని మాటను చెప్పుకొంటున్నట్లు ఇట్లా పలికింది.

విశేషం: మెత్తబడటం మనసుకు సంబంధించిన గుణం. మెయివడి చూపులు ఆంగికాభి నయానికి సంబంధించినవి. ఇక వాచికాభినయం ప్రారంభం కానున్నది. అభినయభాషలో చెప్పిన అందమైన భావం. (సంపా.)

చ. 'వలదని యెంత సెప్పినను వావిరివై కడు వేగపాటుమైఁ
బలుమఱు నెల్లెడం దొడరఁబాఱెదు; నీ హృదయంబు నట్లకాఁ

దలఁపు మనోజు తూపులకుఁ దక్కటి చిత్తములుం; గడంగి వి
చ్చలవిడిసేఁత గర్జమె? విచారము గోర్కికిఁ గాని వావియే? 239

ప్రతిపదార్థం: వలదు+అని= వద్దని; ఎంత చెప్పినను= ఎంత చెప్పినా; వావిరివి+ఐ= వెంటబడివచ్చేవాడివై; కడువేగపాటుమైన్= మిక్కిలి తొందర పాటుతో; పలుమఱున్= పెక్కుసార్లు; ఎల్ల+ఎడన్= కనబడిన ప్రతిచోటా; తొడరన్+పాఱెదు= నాతో కూడటానికి తొందరపడతావు; మనోజు తూపులకున్= మన్మథుడి బాణాలకు; నీ హృదయంబున్+ అట్ల= నీ మనస్సు వలెనే; తక్కటి చిత్తములున్= ఇతరుల మనసులు కూడా; కాన్= ఔతాయని; తలఁపు= అనుకొమ్ము; కడంగి= పూనుకొని, కావాలని; విచ్చలవిడిచేఁత= గుట్టుమట్టు లేకుండా బయటపడి వ్యవహరించటం; కర్జమె?= తగిన పనియా?; విచారము= ఆలోచన; కోర్కికిన్= కోరికకు; కాని వావియే?= కాని వరసయా? (అంటే - కోరికకూ ఆలోచనకూ పొత్తు లేదా? అని భావం.)

తాత్పర్యం: 'నేను వద్దని ఎంత వారించినా వినకుండా వెంబడించి మాటిమాటికి తొందరపాటుతో నామీదికి వస్తున్నావు. నీ మనస్సు మన్మథవశమై నట్లే, అందరి మనస్సులుగూడ మదనావేశానికి లోనౌతాయని గ్రహించుము. ఆలోచనకూ కోరికకూ పొంతన ఉండదా?

విశేషం: మెత్తబడిన మానవతి నేరం మగవాడిమీద వేయటం గడుసుదనం. వలదని చెప్పిందట? ఏమి వలదని? అన్నది ప్రశ్న, ఎక్కడబడితే అక్కడ వెంటబడి కూడబలకటం వలదని చెప్పినట్లు తేలుతుంది. అయితే ఆమె కిష్టం లేదా? అని అనుమానం కలుగుతుంది. మన్మథుడు మగవాళ్ళను ఎట్లా బాణాలతో కొట్టుతాడో ఆడవాళ్ళను కూడా అట్లాగే కొట్టుతాడని ఊహించాలట. ఆ సంగతి తెలిస్తే మన్మథ క్రియ గుట్టుగా సాగాలని తెలుస్తుందట! బట్టబయలు ప్రణయం పనికిరాదట! లోకంలో రసికులకు కోర్కె ఉంటే చాలదట! దానిని గుట్టుగా తీర్చుకొనే ఆలోచన కూడా ఉండాలట! ఈ పద్యంలో చివరి వాక్యం మలి మెరుపు, 'విచారము గోర్కికి

కాని వావియే? ఇందులో కాకుధ్వని ఉంది. నిజంగా ఆలోచించి పనిచేయటం కోర్కెతీరటానికి విరుద్ధమైన పొంతన కాదు. ఆలోచించి పనిచేస్తే మన బంధుత్వం కుదిరేదే - అని, కాకువులో ఆలోచించటం కోర్కె తీరటానికి తగిన పొంతన కాదు అనిన్నీ అర్థాలు ఏర్పడతాయి. మొదటి అర్థం ప్రకృతం. రెండవ అర్థం అప్రకృతమైనా భావికథార్థ వ్యంజకం! ఈ కాకువు వలన ద్రౌపది అక్రమ సంబంధాన్ని సమర్థిస్తున్న అర్థచ్ఛాయ కూడా కలుగకుండా తిక్కన కల్పించాడు. (సంపా.)

క. మగ లడఁకువ నుండక తమ।
తగులమ పాటింతు; రెట్టి తగులం బైనన్
మగువల యెడలన యడఁగుం;
దగవు విడిచి యడిచిపడరు ధైర్యము పేర్మిన్. 240

ప్రతిపదార్థం: మగలు= పురుషులు; అడఁకువన్+ఉండక= అణగి మణగి ఉండక; తమ తగులము+అ= తమ మోహాన్నే; పాటింతురు= బహిర్గతం చేస్తారు; ఎట్టి తగులంబు+ఐనన్= ఎంత మోహమున్నా; మగువల+ఎడలన్+అ= స్త్రీల మనస్సులలోనే; అడఁగున్= అణగి ఉంటుంది; ధైర్యము పేర్మిన్= అధికమైన ధైర్యంతో; తగవు విడిచి= న్యాయం వదలి; అడిచిపడరు= బయటపడరు.

తాత్పర్యం: పురుషులు మోహావేశాన్ని రహస్యంగా ఉంచుకొనకుండా బయటకు వ్యక్తపరుస్తారు. స్త్రీలు తమ మోహాన్ని మనస్సులోనే ధైర్యంగా అణచుకొంటారు గాని, బయటపడరు.

విశేషం: ప్రణయ ప్రదర్శనలో స్త్రీ పురుషుల స్వభావాన్ని తెలిపే ఈ పద్యం సూక్తి, ఈ సూక్తిలో ధ్వనిగా స్ఫురించేది ద్రౌపది హృదయంలో ఉన్న గూఢమైన కోరిక. అది సూక్తిలో నిబద్ధం కావటం వలన ఆమె మాటలు దోషజుష్టాలు కావటం లేదు. ఇది తిక్కన ఆ పాత్రకు నేర్పిన వాక్య శిల్పం. (సంపా.)

తే. ఇట్టు లగుట యెఱిఁగి యెల్లభంగుల రహ।
స్యంబు గోలుపోనియట్లు గాఁగ
నడరు నీదు కోర్కి కనురూప మెట్టిది।
యట్టి భోగభంగి ననుభవింపు.' 241

ప్రతిపదార్థం: ఇట్టులు+అగుట, ఎఱిఁగి= ఇట్లా ఉండటం తెలిసికొని; ఎల్లభంగులన్= అన్ని విధాల; రహస్యంబు కోలుపోని+ అట్లుకాఁగన్= రహస్యం బయటపడనట్లుగా; అడరు= అతిశయించే; నీదు కోర్కికిన్= నీ అభిలాషకు; అనురూపము+ఎట్టిది= తగిన విధమేదో; అట్టి భోగభంగిన్= అటువంటి అనుభవ పద్ధతితో; అనుభవింపుము= పొందుము.

తాత్పర్యం: ఓ కీచకా! ఈ విషయాన్ని నీవు తెలిసికొని, అన్ని విధాలా రహస్యం బయటపడని విధంగా, అంటే గోప్యంగా, అతిశయించే నీ కోర్కెకు అనువైన పద్ధతి ఏదో అటువంటి భోగపద్ధతిలోనే నన్ను పొందుము.'

విశేషం: ఈ పద్యానికి మరొక విధంగా అర్థం చెప్పవచ్చును. ద్రౌపది సమయోచితంగా వ్యూహం ప్రకారం అభినయిస్తూ మాట్లాడుతున్న వైఖరి ప్రకృతార్థం. అయితే, తిక్కన ఆమె నోట పతివ్రత పలుకరాని పలుకులు రాకుండా రక్షించే రచనా శిల్పాన్ని పాటిస్తున్నాడు. ఆ వరుసలో ఈ పద్యం పరాకాష్ఠ. ఇందులో భోగ ప్రసక్తి వచ్చింది. కాని అది అశ్లీలం కాకూడదు, అనౌచిత్యం కాకూడదు. కాబట్టి ఈ పద్యాన్ని ఈ విధంగా చెప్పుకొనవచ్చును.

ప్రతిపదార్థం: ఇట్టులు+అగుట= స్త్రీలు బయటపడరు అనే విషయాన్ని - అంటే నా మనసులో ఉన్న గుట్టును నేను బయటపెట్టను అనే అంశాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; ఎల్లభంగులన్= అన్ని విధాలా; రహస్యంబు, కోలుపోని+అట్లు, కాఁగన్= భీముడు పన్నిన రహస్య వ్యూహం భగ్నంకాని విధంగా; అడరు= ఒప్పారు; నీదు కోర్కికిన్= నీవు నన్ను పొందాలి అనే అధర్మ వాంఛకు; అనురూపము+ఎట్టిది+అట్టి+భోగ, భంగిన్= తగిన ఫలం ఎటువంటిదో అటువంటి ఫలాన్ని (అంటే మృత్యువును); అనుభవింపుము= పొందుము.

తాత్పర్యం: నా గుట్టును నేను బయటపెట్టని పద్ధతిని తెలిసికొని, అన్నివిధాలా మా రహస్య వ్యూహం భగ్నం కాకుండా ఉండే విధంగానే సాగుతున్న నీ కోర్కెకు (నన్ను పొందాలన్న కోర్కెకు) ఎటువంటి ఫలాన్ని అనుభవించవలసి ఉంటుందో అటువంటి ఫలభోగాన్ని (మృత్యువును) పొందుము. కీచకుడికి కలిగిన పరసతీగమనవాంఛకు తగిన ఫలం మరణమని ద్రౌపది మాటలలోని గూఢార్థం. పరస్త్రీ గమనం వలన ఆయుస్సు క్షయమౌతుందని ఆర్యోక్తి, **"ఆయుః క్షతిర్వికలంతా వ్యపహాస్యతా చ । నిందార్థ హాని లఘుతా విగతిః పరత్ర । స్యాదేవ యద్యపి రతేన పరాంగనాయాః"**- ఇత్యాది సూక్తి లోకప్రసిద్ధం. ఈ తాత్పర్యం పఠితలు ఊహించగలిగింది; ద్రౌపదికి అవాచ్యదోషం కలిగించనిది, ఔచిత్యం పోషించేది, విజ్ఞులు మెచ్చేది, తిక్కన రచనా కళను తెలిపేది. కాని, కామి అయిన కీచకుడికి, కథాగతికి మొదటి అర్థమే ప్రస్తుతం. (సంపా.)

చ. అనవుడుఁ గీచకుండు హృదయంబునఁ బొంగి లతాంగితోడ ని
ట్లను 'ధృతిఁ గోలుపుచ్చెఁ గుసుమాయుధుఁ; డేటి విచార; మిట్టు లేఁ
ప నగునె? యైన నీదయిన పం పెదఁ గైకొని చేయువాఁడ; నే
యనువున నెప్పు డెయ్యెడ నిజాభిమతం బొడఁగూర్తు చెప్పుమా!' 242

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; కీచకుండు; హృదయంబునన్+పొంగి= మనస్సులో ఉప్పొంగి; లతాంగితోడన్= ద్రౌపదితో; ఇట్లు+అనున్; కుసుమ+ ఆయుధుఁడు= మన్మథుడు; ధృతిన్+కోలుపుచ్చెన్= ధైర్యం సడలిపోయేటట్లు చేశాడు; ఏటి విచారము?= ఇంకా దిగులు ఎందుకు? ఇట్టులు= ఈ విధంగా; ఏఁపన్+అగునె?= బాధించ తగునా?; ఐనన్= అయినప్పటికీ; నీది+అయిన= నీయొక్క; పంపు= ఆజ్ఞను; ఎదన్+కైకొని= మనసారా; చేయువాఁడన్= చేస్తాను; ఏ+అనువునన్= ఏ ఉపాయంతో; ఎప్పుడు? ఏ+ఎడన్?= ఎక్కడ?; నిజ+అభిమతంబు= నా కోరిక; ఒడన్+కూర్తు(వు) చెప్పుమా?= తీరుస్తావో చెప్పుము.

తాత్పర్యం: ద్రౌపది చెప్పిన మాటలకు కీచకుడి హృదయం ఉప్పొంగిపోయింది. ఆమెతో ఇట్లా అన్నాడు; 'సరే! మన్మథుడు నా కొండంత ధైర్యాన్ని సడలించాడు. అయినా ఇంకా నన్ను బాధించటం ధర్మం కాదు. నీ ఆజ్ఞ మనసార పాటిస్తాను. నీ ఉపాయంతో నా కోరిక ఎప్పుడు ఎక్కడ తీరుస్తావో చెప్పుము.'

విశేషం: నిజ శబ్దాన్ని తిక్కన ఆత్మార్థంలోనూ, యుష్మదర్థంలోనూ, అస్మదర్థంలోనూ వాడాడు. ఇక్కడ అస్మదర్థంలో ప్రయోగించబడింది. (సంపా.)

క. అని పలికినఁ బాంచాలియుఁ।
దన యురులం గీచకుండు దగులుట భావం
బున నిశ్చయించి యిట్లను।
ననురాగాయత్తచిత్త యైనది వోలెన్. 243

ప్రతిపదార్థం: అని పలికినన్= అని కీచకుడు పలుకగా; పాంచాలియున్= ద్రౌపది కూడా; కీచకుండు; తన+ఉరులన్ +తగులుట= తన ఉచ్చులో చిక్కుకొనటం; భావంబునన్= మనస్సులో; నిశ్చయించి= నిర్ణయించుకొని; అనురాగ+ఆయత్తచిత్త+ఐన+అది+ పోలెన్= ప్రేమ నిండిన హృదయం ఉన్నదానివలె; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: కీచకుడు అట్లా మాట్లాడగా ద్రౌపది అతడు తన ఉచ్చులో చిక్కకొన్నాడని భావించి ప్రేమ నిండిన మనసుగలదానివలె ఇట్లా పలికింది.

విశేషం: ఇక్కడ ఉచ్చులో చిక్కుకొన్న మృగంతో కీచకుడిని పోల్చటం విశేషం. ప్రాణాలు కోల్పోవటానికి ముందు గిజగిజలాడే విధంగా ఉన్నది కీచకుడి మనస్థితి.

ఉ. 'ఉత్తర లోనుగాఁ గల పయోజముఖుల్ పగలెల్లఁ బ్రీతితో
నృత్తముఁ జేసి పోవ కమనీయరహస్యవిధిన్ నిశీథినీ
వృత్తముఁ గోరువారలకు వేడ్కకుఁ బట్టగుచుండు నా గృహం;
బుత్తమ మిత్తెఱంగునకు నొంటిమెయిం దగ నీవు వచ్చినన్.' 244

ప్రతిపదార్థం: ఉత్తర లోనుగాన్+కల పయోజముఖుల్= ఉత్తర మొదలైన పద్మవదనలు; పగలు+ఎల్లన్= పగలంతా; ప్రీతితోన్= ఇష్టంతో; నృత్తమున్+ చేసి, పోవన్= నాట్యంచేసి పోగా; కమనీయ రహస్య, విధిన్= మనోజ్ఞమైన రహస్య పద్ధతిలో; నిశీథినీ, వృత్తమున్= చీకటి తప్పును; కోరు, వారలకున్= కోరేవాళ్ళకు; ఆ+గృహంబు= ఆ నర్తనశాల; వేడ్కకున్= వేడుకకు; పట్టు+అగుచున్+ ఉండున్= చోటు అవుతూ ఉంటుంది; ఈ+తెఱంగునకున్= ఈ విధానికి; ఒంటిమెయిన్= ఒంటరిగా; ఈవు; తగన్= ఒప్పునట్లుగా; వచ్చినన్= వస్తే; ఉత్తమము= శ్రేష్ఠం.

తాత్పర్యం: ఉత్తర మొదలైన కన్యలందరూ పగలంతా ప్రీతితో నాట్యం చేసిపోగా అతిరహస్యంగా చీకటితప్పు చేయగోరేవారికి ఆ నర్తనశాల వేడుక కలిగించే సంకేతప్రదేశం. అటువంటి రహస్యక్రీడకు నీవు ఒంటరిగా వస్తే మంచిది.

విశేషం: ద్రౌపది తమోఽభిసారికవలె మాట్లాడింది. తమోఽభిసారిక అంటే చీకట్లో నల్లని దుస్తులు ధరించి ఎవరికీ తెలియకుండా, ఎవరూ గుర్తు పట్టకుండా స్వయంగా ప్రియుడిని కూడటానికి సంకేత స్థలానికి పోయే వనిత. **'కమనీయ రహస్య విధిన్ నిశీథినీ వృత్తము గోరువారలకున్'** అని ఉదాత్త సంస్కృత సమాసాలను ప్రయోగించటం సాభిప్రాయం. తాను అత్యంతరహస్యంగా రాత్రి చరిత్రను కోరుతున్నదని భావం. అనగా, అతి గోప్యంగా రాత్రిళ్ళలో మాత్రమే రహస్యరతిని ఆమె కోరుతున్నట్లు ధ్వని. ఇక్కడ ఔచిత్య పోషకంగా ఉదారత అనే అర్థగుణాన్ని ప్రదర్శించింది. అంటే అగ్రామ్యత్వం (గ్రామ్యత్వం ప్రసంగంలో దొరలకుండా ఆ భావాన్నే అగ్రామ్యంగా చెప్పటం) ప్రదర్శించింది. పద్యాన్వయంలో- 'ఆ గృహంబు ఉత్తమము' అని చెప్పి 'ఇత్తెఱంగునకు నొంటి మెయిం దగ నీవు వచ్చినన్' అని అసంపూర్ణంగా వాక్యాన్ని ముగించటంలో ఆమె కోర్కె వ్యంగ్యంగా వ్యక్తమౌతుందని కొందరు వ్యాఖ్యానిస్తారు. ఆ అన్వయం అంత సమర్థనీయం కాదు. ఆ గృహం ఉత్తమమనటం కంటె, నీవు ఒంటరిగా వస్తే 'ఉత్తమము' అని నిర్దేశించిందనటం ఉత్తమం. ఆ మాటను ఊనికతో వాక్యారంభంలో ఉంచటం సార్థకం. అతడు ఒంటరిగా రావటమే భీమ వ్యూహాన్ని అనుసరించి కమనీయ

రహస్య విధిన్ నిశీథినీ వృత్తము కోరువారలకు (భీమద్రౌపదులకు) (ఆ పద్ధతియే) శ్రేష్ఠమైనది. ఉత్తమమైనది అని ధ్వని. గృహం కాదు ముఖ్యం, ఒంటరిగా రావటమని గ్రహించాలి. రాబోయే పద్యంలో కీచకు డిచ్చే సమాధానం ఈ అంశాన్నే ధ్రువపరుస్తున్నది. (సంపా.)

క. అనిన నతఁడు వికసిల్లుచు।
'నను నెమ్మెయి నేలుకొనిన నళినానన! నీ
యనుమతి సేయనె? యొక్కఁడ।
జనుదెంచెద నేఁటి రాత్రి సమ్మదలీలన్. 245

ప్రతిపదార్థం: అనినన్= ద్రౌపది అట్లా అనగా; అతఁడు= కీచకుడు; వికసిల్లుచున్= ఉల్లాసపడుతూ; నళిన+ఆనన!= పద్మముఖీ! ద్రౌపదీ!; ననున్= నన్ను (కీచకుడిని); ఏ+మెయిన్= ఏవిధంగా; ఏలుకొనినన్= పాలించినా (ఇది శృంగార స్ఫోరకమైన పదం); నీ అనుమతి+చేయనె?= నీ ఆజ్ఞ పాటించనా?; నేఁటి రాత్రి= ఈనాటి రాత్రి; సమ్మద లీలన్= సంతోషంతో; ఒక్కఁడన్= ఒక్కడినే; చనుదెంచెదన్= వస్తాను.

తాత్పర్యం: ద్రౌపది ఆ మాటలు అనగా కీచకుడు ఉల్లాసపడ్డాడు. 'ఓ పద్మముఖీ! నన్ను ఏ విధంగా నీవు ఏలుకొంటే ఆ విధంగా నీ ఆజ్ఞ శిరసావహిస్తాను. ఈ రాత్రికి నేను సంతోషంతో ఒంటరిగా వస్తాను.

విశేషం: తిక్కన పదప్రయోగ కౌశలం గమనించదగింది. అనుకొనని విధంగా సైరంధ్రి అంగీకారం తెలిపేసరికి కీచకుడికి సంతోషం కలిగింది. ఎట్లా? క్రమంగా ముఖం వికసించినట్లు, హృదయం విస్ఫారినట్లు అభినయంలో వ్యక్తమయ్యేటట్లు. 'వికసిల్లుచున్' అనే క్రియ ఆ భావాన్ని అభినయంలో గమ్యమానం చేస్తుంది. ఏలుకొనుట, అనుమతి - అనే మాటలు ప్రభుత్వంలోనూ, ప్రణయంలోనూ ఆయా అర్థాలలో ప్రయోగించే పదాలు. ద్రౌపదికి పూర్తిగా దాసుడైన కీచకుడు ఆమె ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించటానికి సిద్ధమయ్యాడు. ఆమె ప్రభుత్వాన్నీ, ప్రణయాన్నీ అంగీకరించాడు. దానితో భీమ ద్రౌపదుల వ్యూహం ఫలోన్ముఖం

అయింది. 'ఒంటరిగా ఈ రాత్రి సంతోషంతో కూడిన విలాసంతో వస్తానని, 'ఒంటరిగా రమ్మన్న ఆజ్ఞను పాటిస్తా'నని హామీ ఇచ్చాడు. ఇదే ద్రౌపదికీ, కథాగతికీ కావలసింది. (సంపా.)

తే. ఇదియ నిశ్చయ; మిమ్మాట వదలకుండు'।
మనిన 'నీ వొక్కరుండవ యరుగుదేర
వలయు; లేకున్న నయ్యెడ నిలుచుదానఁ।
గానుజూ నిక్కువం' బని పూని పలికి. 246

ప్రతిపదార్థం: ఇది+అ= ఇదే, ఈ మాటే; నిశ్చయము= నిర్ణయం, ఖాయం; ఈ మాట= నీవు ఇచ్చిన వాగ్దానం; వదలక+ఉండుము= విడువకుండా కాపాడుకో; అనినన్= అని కీచకుడు పలుకగా; నీవు= నీవు (కీచకుడు); ఒక్కరుండవు+అ= ఒక్కడివే; అరుగు దేర వలయున్= రావాలి!; లేక+ఉన్నన్= అట్లా కాకపోతే; ఆ+ఎడన్= అక్కడ; నిలుచుదానన్+ కాను+చూ= నిలబడను (ఉండను) సుమా!; నిక్కువంబు= ఈ మాట నిజం; అని= అంటూ; పూని పలికి= ఒత్తి చెప్పి, (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఇది నా నిర్ణయం. నీవన్న మాట నీవు తప్పకుండా పాటించుము!' అన్నాడు కీచకుడు. ఆ మాటలు విని ద్రౌపది - 'నీ వొక్కడివే రావాలి. లేకపోతే, నే నక్కడ నిలువకుండా వెళ్ళిపోతాను సుమా! నా మాట నిజం' అని గట్టిగా ఒత్తి చెప్పింది.

విశేషం: అతడు 'నిశ్చయం' అనటం, ఆమె 'నిక్కువం' అనటం- ఈ ఉభయ వాక్యాలలోని ఊనిక గల పదాలు, ఆమె అంగీకరించినా దానిని పూర్తిగా నమ్మలేని ఆశ్చర్యంలో ఉన్నాడు కీచకుడు. అందువలన అనుమానం తీర్చుకొనటానికి 'నీవిచ్చిన మాటను తప్పకుండా నిలుపుకొను' మన్నాడు. అతడు ధ్రువపరచుకొనటానికి ఆ మాట అన్నాడు. ద్రౌపదికి ఒక అవకాశం దొరికింది. కీచకుడు చంచలుడు. అతడు చెప్పిన మాటను చెప్పినట్లుగా చేస్తాడో లేదో అని

ఆమెకు అనుమానం. అది తీరేటట్లుగా ఒంటరిగా కీచకుడు రావటాన్ని ధ్రువపరచు కొనేటట్లుగా మాట్లాడింది. 'ఒంటరిగా రాకపోతే నీకు నేను దక్క'నని భయపెట్టింది. అది నిజమని నొక్కి చెప్పింది. అదే భావికార్యఫలానికి బీజం. (సంపా.)

క. 'మన మియ్యెడఁ బెద్దయుఁ బ్రొ।
ద్దనుమానములేక మాటలాడుట దగ; దీ
వును బొ, మ్మేనును నాదగు।
పనికేఁగెద' ననియెఁ గమలపత్త్రేక్షణయున్.' 247

ప్రతిపదార్థం: కమలపత్ర+ఈక్షణయున్= పద్మదళాల వంటి కనులుగల ద్రౌపదియూ; మనము= మనం - ద్రౌపది, కీచకుడు; ఈ+ఎడన్= ఇక్కడ; పెద్దయున్+ప్రొద్దు= ఎక్కువసేపు; అనుమానములేక= సంకోచం లేకుండా; మాటలు+ఆడుట= మాట్లాడుకొనటం; తగదు= భావ్యం కాదు; ఈవును= నీవుకూడా; పొమ్ము= వెళ్ళిపొమ్ము; ఏనును= నేను కూడా; నాదగు పనికిన్+ఏఁగెదన్= నా పని చేసికొనటానికి పోతాను; అనియెన్= అన్నది.

తాత్పర్యం: 'మన మిద్దరం ఇక్కడ ఎక్కువ సేపు సంకోచం లేకుండా మాట్లాడుకొనటం భావ్యం కాదు. నీవు వెళ్ళి పొమ్ము. నేనూ నా పని మీద పోతాను' అని ద్రౌపది కీచకుడిని నమ్మబలికింది.

విశేషం: 'ఈవును బొమ్ము; ఏనును నాదగుపని కేఁగెదన్' - నీవింక పొమ్ము, నేను భీముడి వద్ద కేగి నీవు పోవటానికి (చావటానికి) చేయవలసిన పని చేస్తాను - అనే గూడార్థం కూడా ధ్వనిస్తున్నది. (సంపా.)

చ. సమయము నిర్ణయింప విని చంద్రనిభానన పల్కులప్డు చి
త్తమునకు నింపుఁబెంపఁగ ముదంబునఁ గీచకముఖ్యుఁ డాత్మగే
హమునకుఁ బోయె; నమ్ముదిత యచ్చట వెండియుఁ బ్రస్తుతక్రియా
సముచిత వర్తనంబుఁ దగఁ జల్పి మహానసశాలలోనికిన్. 248

ప్రతిపదార్థం: సమయము నిర్ణయింపన్= సంకేత స్థలంలో కలిసే కాలాన్ని నిశ్చయించగా; విని; చంద్రనిభ+ఆనన= చంద్రుడితో సమమైన ముఖం గల ద్రౌపదియొక్క; పల్కులు= మాటలు; అప్డు= అప్పుడు; చిత్తమునకున్= మనస్సుకు; ఇంపున్+పెంపఁగన్= ప్రీతిని అతిశయింపజేయగా; కీచక ముఖ్యుఁడు= కీచకులలో శ్రేష్ఠుడైన సింహబలుడు; ముదంబునన్= సంతోషంతో; ఆత్మగేహమునకున్= తన ఇంటికి; పోయెన్= వెళ్ళాడు; ఆ+ముదిత= ద్రౌపది; అచ్చటన్= ఆ స్థలంలో; వెండియున్= మళ్ళీ; ప్రస్తుత క్రియా సముచిత వర్తనంబున్= అప్పటి కవసరమైన పనిని; తగన్+చల్పి= పూర్తిచేసి; మహానసశాలలోనికిన్= వంట ఇంట్లోకి (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: సంకేత సమయాన్ని నిశ్చయించిన ద్రౌపది మాటలు విని, కీచకుడు సంతోషపడి తన యింటికి వెళ్ళాడు. ద్రౌపది కూడా అక్కడ తాను చేస్తున్న పనిని పూర్తి చేసి వంటశాలకు (వెళ్లిందని ముందరి పద్యంతో అన్వయం.)

ద్రౌపది భీమునితోఁ గీచకుఁడు నర్తనశాలకు రాఁబోవుటం జెప్పుట (సం.4-21-25)

క. చని వెడ వికసిల్లెడు నా।
ననపద్మముతోడ ననిలనందనునకు ని
ట్లనియెఁ జతురోక్తిరీతి న।
తని గూఢక్రోధవహ్ని దరికొల్పంగన్. 249

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; వెడ వికసిల్లెడు= ఇంచుక వికసించిన; ఆనన పద్మముతోడన్= పద్మంవంటి వదనంతో; అనిలనందనునకున్= భీముడితో; చతుర+ఉక్తిరీతిన్= మాటల నేర్పరితనంతో; అతని= భీముడియొక్క; గూఢక్రోధ వహ్నిన్= దాగిన కోపమనే నిప్పును; దరికొల్పంగన్= మంటను ఎగద్రోసి మండించటానికై; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ద్రౌపది వంటశాలలోనికి వెళ్ళి ఇంచుక సంతోషంతో వికసించిన ముఖంతో భీముడి మనసులో దాగిఉన్న కోపాగ్నిని తన మాట నేర్పరితనంతో

ప్రజ్వరిల్లచేయటానికి ఇట్లా అన్నది.

విశేషం: అలం: రూపకం. గూఢకోపాగ్నిని ప్రజ్వలింపచేసేటట్లు చతురంగా మాట్లాబోతున్న దనటం విశేషం. గూఢకోపాగ్ని ప్రజ్వరిల్లి నా గూఢంగానే ఉండేటట్లు నిర్దేశించబోతున్నదని ధ్వని. (సంపా.)

తే. 'నా కొలఁతఁ దీర్చివచ్చితి;।
నీ కొలఁతయ యింక; సూతునిం దెగ జూడన్
లోకము వంచింపను దగు।
చీఁకటి రే యొదవెఁ; నేమి చేసెదొ చెపుమా?' 250

ప్రతిపదార్థం: నా కొలఁతన్= నా వంతు పనిని; తీర్చి వచ్చితిన్= పూర్తి చేసి వచ్చాను; ఇంకన్= ఇకమీద; నీ కొలఁత+అ= నీ వంతు పని మాత్రమే ఉన్నది; సూతునిన్= కీచకుడిని; తెగన్+చూడన్= చంపడానికి; లోకమున్+వంచింపను= జమలను మోస పుచ్చటానికి; తగు= తగిన; చీఁకటిరేయి= చీకటి రాత్రి; ఒదవెన్= కలుగనున్నది; ఏమి+ చేసెదొ చెపుమా!= ఏమి చేస్తావో చెప్పుము.

తాత్పర్యం: 'నా వంతు పని నేను పూర్తి చేసి వచ్చాను. నీ వంతు పనే ఇంక మిగిలి ఉన్నది. కీచక సంహారానికీ, లోకాన్ని మోసం చేయడానికీ తగిన చీకటిరాత్రి రానున్నది. ఇంక నీ ఇష్టం. ఏం చేస్తావో చెప్పుము.'

విశేషం: ఈ పద్యంలో చివరి పాదంలోని ప్రాసస్థానంలో 'చీఁకటి' శబ్దం ఉన్నది. అందులో ప్రాసస్థానంలో అరసున్నతో కూడిన కవర్ణం ఉండటం, మిగిలిన మూడు పాదాలలో అరసున్నలేని క వర్ణాలుండటం గమనించదగింది. దీనిని ఆనందరంగరాట్ఛందము సమర్థిస్తున్నది.

"ఒకటి కరసున్న గలిగి మూఁటి కవి లేక ।
ప్రాసములు లఘుపరములై పైని చెల్లుఁ;
గృతుల నొక్కొక్కచో నది యెట్టులనిన ।
నిఁకను నెఱిఁగింతుఁ జెప్పుఁడీ సుకవులనఁగ"

ఈ విధమైన ప్రాసమును అప్పకవే చెప్పాడు. దాని కతడు పెట్టిన పేరు ఖండాఖండ ప్రాసం. దాని లక్షణం- 'క, నిడుపులు నరసున్నలు దమ, కెడమునుగల కచటతపల కిలఁ బ్రాసములై, తొడరును నిర్బిందువు లొ, క్కెడ ఖండాఖండ సంజ్ఞ నినశశినయన'' అప్పకవి. తృతీయాశ్వాసంలో అతడు ఖండాఖండప్రాసకు ఈ పద్యాన్నే లక్ష్యంగా ఇచ్చాడు. అయినా ఈ శబ్దాన్ని శ.ర. సబిందుకంగానూ, చి.ని. సూ.ని. నిర్బిందుకంగానూ పేర్కొన్నాయి. నిర్బిందుకమయితే విశేషమే లేదు. (సంపా.)

వ. అనిన విని దరహసిత వదనుం డగుచు వృకోదరుం డిట్లనియె. 251

తాత్పర్యం: ఆ మాట విని చిరునవ్వుతో కూడిన ముఖంతో భీము డిట్లా అన్నాడు.

క. 'నన్నడుగ నేల? నీవును।
నన్నీచుఁడు నేమి మాటలాడితి? రది నా
కున్నట్టు లెఱుఁగఁ జెప్పుము।
ని న్నే మెచ్చించువాఁడ నీరజవదనా!' 252

ప్రతిపదార్థం: నీరజవదనా!= పద్మముఖీ! ఓ ద్రౌపదీ!; నన్నున్= (భీముడిని); అడుగన్+ఏల?= అడగటం ఎందుకు?; నీవునున్= నీవూ (ద్రౌపది); ఆ నీచుఁడున్= ఆ అల్పుడూ (కీచకుడూ); ఏమి మాటలు+ఆడితిరి?= ఏమి మాట్లాడుకొన్నారో?; అది; నాకు; ఉన్న+అట్టులు= ఉన్నది ఉన్నట్లుగా; ఎఱుఁగన్+చెప్పుము= తెలియజేయుము; నిన్నున్= ద్రౌపదిని; ఏన్= నేను (భీముడు); మెచ్చించువాఁడన్= మెప్పిస్తాను.

తాత్పర్యం: 'ఓ ద్రౌపదీ! నన్ను అడగటం దేనికీ? నీవూ, ఆ నీచుడూ ఏమేమి మాట్లాడుకొన్నారో నాకు ఉన్నది ఉన్నట్లుగా తెలుపుము. నిన్ను నేను మెప్పిస్తాను.'

వ. అనినఁ బాంచాలి సుదేష్ణ మందిరంబునం దా నుచితాచరణంబున నునికియు, సింహబలుండు సింగారించుకొని వచ్చుటయు, రేయింటి

మాటలవలనం దాను బెదరమియు, వాఁడు సామ దాన భేద దండంబులు సూపి పలుకుటయు, దానికి మెయికోలు భావించికొని క్రమంబునం దగిన సంభాణంబు సేసి, నాట్యమండపంబు సంకేతస్థలంబుగాఁజెప్పి, యొక్కరుండ వచ్చువాఁడవని నియమించుటయు, నద్దురా త్ముండు ప్రముదితాత్ముండగుచు రాత్రిసమయంబున నయ్యెడకు నొంటిమెయిం జనుదెంచువాఁడై చనుటయుఁ దెలియంజెప్పిన, నతండు పరమాహ్లాదంబునంబొంది. 253

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పాంచాలి= ద్రౌపది; సుదేష్ణ మందిరంబునన్= సుదేష్ణ యొక్క అంతపురంలో; తాను= (ద్రౌపది); ఉచిత+ఆచరణంబునన్+ ఉనికియున్= తన పనిలో తాను ఉండటమున్నూ; సింహబలుండు= కీచకుడు; సింగారించుకొని= అలంకరించుకొని; వచ్చుటయున్= రావటమున్నూ; రేయింటి= రాత్రి; మాటలవలనన్= భీమసేనుడు పల్కిన ఓదార్పుమాటల వలన; తాను బెదరమియున్= ద్రౌపది భయపడక ఉండటమున్నూ; వాఁడు= కీచకుడు; సామదానభేద దండంబులు= చతుర్విధోపాయాలు (నెమ్మదిగా చెప్పటం, దానం చేయటం; తగవు పెట్టడం; దండించటం); చూపి; పలుకుటయున్= మాట్లాడటమున్నూ; దానికిన్= అందుకు; మెయికోలు= ఒప్పుకొనటంగా; భావించికొని= అనుకొని; క్రమంబునన్= వరుసగా; తగిన సంభాషణంబు+చేసి= తగిన మాటలు మాట్లాడి; నాట్యమండపంబు= నర్తనశాల; సంకేతస్థలంబుగాన్= కలిసికొనే రహస్య ప్రదేశంగా; చెప్పి, ఒక్కరుండు+అ= ఒకడే; వచ్చువాఁడవు= రావాలి; అని నియమించుటయున్= అని కట్టడి చేయటమున్నూ; ఆ+దురాత్ముండు= ఆ నీచుడు; ప్రముదిత+ ఆత్ముండు+అగుచున్= సంతుష్టమనస్కుడై; రాత్రి సమయంబునన్= రాత్రిపూట; ఆ+ఎడకున్= అక్కడికి; ఒంటిమెయిన్= ఒంటరిగా; చనుదెంచు వాఁడై= వస్తానని; చనుటయున్= వెళ్లటమున్నూ; తెలియన్+చెప్పినన్= స్పష్టమయ్యేటట్లు చెప్పగా; అతండు= భీముడు; పరమ+ఆహ్లాదంబునన్= మిక్కిలి సంతోషం; పొంది= అనుభవించి.

తాత్పర్యం: అని చెప్పగా ద్రౌపది-సుదేష్ణమందిరంలో తాను తన పనిలో నిమగ్నమై ఉండటం, అక్కడికి కీచకుడు సింగారించుకొని రావటం, రాత్రి భీముడు తనకు ధైర్యం చెప్పటం వలన తాను బెదరకపోవటం, కీచకుడు సామదాన భేద దండోపాయాలతో లోబరుచుకొనాలని ప్రయత్నించటం. ద్రౌపది లోబడినట్లుగా నటించి వాడిని నర్తనశాలకు ఒంటరిగా రాత్రిపూట రమ్మని చెప్పటం, వాడు మూర్ఖుడు కాబట్టి వస్తానని చెప్పి సంతోషంతో పొంగుతూ వెళ్ళటం తేటపడేటట్లు చెప్పింది. ఆ మాటలు విని భీముడు మిక్కుటమైన సంతోషంతో పొంగిపోయాడు.

విశేషం: 1. కీచకుడు సామదానభేద దండోపాయాలను ప్రదర్శించి మాట్లాడాడు - అనటం తెలుగు పలుకుబడి. యుద్ధంలో ప్రయోగించేవి ఆ చతురుపాయాలు. శత్రువును లొంగదీసికొనటానికి క్రమంగా సంధి మాటలతో, కొంత రాజ్యత్యాగంతో, శత్రువుల మధ్య కలతలు పెట్టటంతో, చివరకు యుద్ధం చేయటంతో సాధించటం యుద్ధప్రక్రియలో ప్రసిద్ధాలు. ఒక క్రమంలో ఏ రంగంలోనైనా కార్యాన్ని సాధించే పద్ధతికి కూడా తెలుగువారు ఈ పలుకుబడిని ప్రయోగిస్తారు. అందువలననే ద్రౌపది కామ వ్యవహారంలో చతురుపాయాలను ఉటంకించింది. తిక్కన కావ్యకళా శిల్పంలో ఇదొక నేర్పరితనం. వెనుక జరిగిన సంభాషణలో ఉన్న నిర్మాణ శిల్ప రహస్యాలను తరువాతి సంభాషణలలో సూచించి కావ్యార్థ పూర్వాపర సమన్వయ సమాలోచనను పఠితలలో రేకెత్తింప చేస్తాడు తిక్కన. ఇది మహా కవిత్వ దీక్షావిధిలోని ఒక లక్షణం. ఈ సమన్వయ సూత్రం ప్రకారం కీచకుడు పలికిన మాటలలో సామోపాయం 252వ పద్యంలో, భేదోపాయం 253లో, దానోపాయం 254లో, దండోపాయం 256. 257వ పద్యాలలో కనబడతాయి. యుద్ధానికి సన్నద్ధుడవుతున్న భీముడితో చతురుపాయాల ప్రసక్తి తెచ్చి మాట్లాడటం చతురవాక్య విన్యాసం - గుప్తక్రోధాగ్నిని ప్రజ్వలింపజేసే ఇంధనం. కీచకుడు చతురుపాయాలను మదన యుద్ధ సాధనం కొరకు వాడాడు. యుద్ధం సిద్ధించింది. మరి భీముడు? ద్రౌపదిచేత సామదాన భేదోపాయాలు ప్రయోగించాడు. ద్రౌపది సుముఖంగా మాట్లాడటం సామం, తనను రహస్యంగా ఇచ్చుకొంటాననటం దానం,

ఒంటరిగా సంకేతస్థలానికి రమ్మని పిలవటం భేదం. ఈ మూడూ వంచనతో విఫలం కావటంతో యుద్ధం కంటె కీచకుడికి గత్యంతరం లేకపోవటం దండం. యుద్ధం సిద్ధించింది. కీచకుడు కోరుకొన్న మన్మథయుద్ధం వంచనతో వీగిపోతుంది; భీముడు కోరుకొన్న రహస్య ద్వంద్వయుద్ధం ఫలిస్తుంది. భీముడి ప్రహ్లాదానికి ఆ భావమే ఆధారం. పఠితలను భావనామయం చేయగల శిల్పకీలకాలు ఎక్కువగా ఇటువంటి పలుకుబళ్లు. 2. కథను చెప్పినట్లు తెలియజెప్పడానికి వచనం బాగా అనుకూలిస్తుంది. అందుకే తిక్కన చకచకా జరిగిన కథను పది వాక్యాలలో క్లుప్తంగా చెప్పించాడు. కథాకథనశైలిలో ఇది ఒక ఒడుపు. (సంపా.)

శా. 'క్రోధం బప్రతికారమై హృదయముం గుందింప నత్యంత చిం
తాధూతాత్ముఁడనైన నాకుఁ బరమోత్సాహంబు సంధిల్ల దు
స్సాధం బైన విరుద్ధ కార్య మిటు లాసన్నంబుగా సంఘటిం
తే ధర్మాత్మజుఁ డిచ్చమెచ్చఁ బగ సాధింపంగఁ గాన్పల్పమే?' 254

ప్రతిపదార్థం: క్రోధంబు= కోపం; అప్రతికారము+ఐ= తీర్చుకోలేనిదై; హృదయమున్= మనస్సును; కుందింపన్= బాధించగా; అత్యంత= మిక్కిలి; చింతాధూత+ఆత్ముఁడను+ఐన నాకున్= విచారంచేత చలించిన మనస్సు కలిగి ఉన్న నాకు (భీముడికి); పరమ+ ఉత్సాహంబు= మిక్కిలి సంతోషం; సంధిల్లన్= కలుగగా; దుస్+సాధంబు+ఐన= కష్టసాధ్యమైన; విరుద్ధ కార్యము= అజ్ఞాతవాసానికి వ్యతిరేకమైన పనిని; ఇటులు= ఈ విధంగా; ఆసన్నంబుగాన్= దగ్గరపడేటట్లు; సంఘటింతే?= కూర్చిపెట్టావుగదా!; ధర్మ+ఆత్మజుఁడు= ధర్మరాజు; ఇచ్చన్+మెచ్చన్= మనసులో మెచ్చుకొనేటట్లు; పగ సాధింపంగన్= శత్రువును జయించటాన్ని; కాన్పు (కాన్పుట)= చూడటం, సాధించటం; అల్పమే?= సులభమా?

తాత్పర్యం: 'ప్రతీకారం తీర్చుకొనలేని కోపం నా హృదయాన్ని క్రుంగదీయగా మిక్కిలి వ్యాకులచిత్తంతో ఉన్న నాకు అత్యంత ఉత్సాహాన్ని కలిగించేటట్లు,

కష్టసాధ్యమైన పనీ, అజ్ఞాతవాస ప్రవర్తనకు పూర్తిగా విరుద్ధమైనదీ అయిన ఇటువంటి కార్యాన్ని వెంటనే చేసేటట్లు సంఘటించావు. ఇక ధర్మరాజు మనసులో మెచ్చుకొనేటట్లు పగ సాధించి చూపటం సామాన్యమా? (లేదా-తేలికే.)

విశేషం: 1. కీచకుడిని చంపటం (పగసాధించటం) ఎంత ముఖ్యమో - దానిని అజ్ఞాతవాస సమయం చెడకుండా సాధించటం అంతే ముఖ్యం. అప్పుడే ధర్మరాజు మెచ్చుకొంటాడు. ఆ విధంగా అతడు మెచ్చుకొనేటట్లు పగసాధించగలగటం అల్పం కాదు. కష్టం. దానిని నీవు నేర్పుతో చేశావని భీముడు ద్రౌపదిని మెచ్చుకొంటున్నాడు.

2. రసాభ్యుదయ రహస్యాలను ధ్వనిమయంగా సంభాషణలలోనూ, సాత్త్వికాభినయాలలోనూ సూచించటం తిక్కన నైజం. భీముడి మనస్సులో పగసాధించాలనే క్రోధం ఉన్నది. అది గూఢంగా ఉన్నది. ప్రతీకారానికి అవకాశం లేకపోవటం చేత గుండెలోని నిప్పువలె అది అతడి హృదయాన్ని చింతతో దహించి వేస్తున్నది. ఇప్పుడు ద్రౌపది ప్రతీకారానికి తగిన కార్య సంఘటన చేసింది. చింత తొలగిపోయి వీరరసోచితమైన ఉత్సాహమనే స్థాయిభావం ప్రబుద్ధమయింది. అసాధ్యమైన కార్యాన్ని అద్భుతంగా నిర్వహించే భావం ఉత్సాహం. ద్రౌపది సంఘటించిన కార్యానికి ఆ రెండు లక్షణాలూ ఉన్నాయి. సింహబలుడిని అజ్ఞాతవాసనియమ భంగం కాకుండా రహస్యంగా సంహరించాలి. ఇది వీరరసకార్యం. దాని నిర్వహణం వలన ధర్మరాజు హృదయంలో అద్భుతం జనిస్తుంది. జన్యజనకరసాభ్యుదయ భావస్థితి ఇందులో గమ్యం. కీచకవధ కార్యనిర్వహణంలో ఉన్న సంశ్లిష్టత వ్యంగ్యం.

3. "ధర్మాత్మజుఁ డిచ్చ మెచ్చఁ బగ సాధింపంగఁ గాన్పల్పమే?'' అనే వాక్యంలో కాకుధ్వని ఉన్నది. ఆశ్చర్యార్థకంలో పలికితే= సామాన్యమా? కాదని భావం. ఏవార్థకంలో పలికితే - చాల తేలికే అని భావం. ఇది ఎంత తేలికో అంత కష్టం అన్నట్లుంటుంది. (సంపా.)

వ. అని పలికి కొండొక విచారించి. 255

తాత్పర్యం: అని మాట్లాడి కొంతసేపు ఆలోచించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'వెఱవక సంకేతించిన।
తెఱఁగున నయ్యెడకు నరుగుదెంచునొకో! కొం
దఱఁ దెచ్చునొకో! వెడఁగై।
యఱిముఱి వెలిపుచ్చునొకొ రహస్యం బెల్లన్! 256

ప్రతిపదార్థం: వెఱవక= భయపడక; సంకేతించిన తెఱఁగునన్= గుర్తు చెప్పిన విధంగా; ఆ+ఎడకున్= అక్కడకు; అరుగుదెంచునొకో!= వస్తాడా?; కొందఱన్= కొందరిని; తెచ్చునొకో?= వెంటతీసికొని వస్తాడా?; వెడఁగు+ఐ= వెర్రివాడై; అఱిముఱిన్= తొందరపాటుతో; రహస్యంబు+ఎల్లన్= రహస్యమంతా; వెలిపుచ్చునొకొ!= బయటపెట్టుతాడా!.

తాత్పర్యం: భయపడకుండా (అనుమానం లేకుండా) నీవు గుర్తు చెప్పినచోటికి వస్తాడా? లేక మరికొందరిని సహాయంగా తీసికొని వస్తాడా? తొందరపాటువలన మూఢుడై రహస్యాన్నంతా బట్టబయలు చేస్తాడా?

విశేషం: కీచకుడు మోసపోయాడా? లేక తాము మోసపోయామా? అనేది భీముడి భయం, తనమీద అనవసరమైన నెపం వస్తుంది. అందుకే సంశయనివారణకొరకు అడుగుతున్నాడు.

ఉ. అట్టిద యేల చేయు? ననయంబు నయం బొడఁగూడఁ బల్కి నీ
విట్టి తెఱంగు సేయుమని యేర్పడఁ జెప్పిన దాని కత్తఱిం
బుట్టిన సంతసంబు ననువుం బరికించితికాదె! యింక ని
ట్ట ట్టనఁ డెట్టులైన హృదయంబున నెక్కడి శంక వానికిన్. 257

ప్రతిపదార్థం: అట్టిది+అ ఏల చేయున్?= అట్లా ఎందుకు చేస్తాడు? అనయంబున్= మిక్కిలి; నయంబు+ఒడన్+కూడన్= ప్రియం కలిగేటట్లు; పల్కి= మాట్లాడి; నీవు+ఇట్టి తెఱంగు+చేయుము+అని= నీవిటువంటిరీతి చేయుమని; ఏర్పడన్+చెప్పిన దానికిన్= తెలిసేటట్లు చెప్పినదాని వలన; ఆ+తఱిన్= అప్పుడు; పుట్టిన సంతసంబు= కలిగిన సంతోషం; అనువున్= రీతి, విధం; పరికించితి(వి)కాదె!= చూచావుగదా!; ఇంకన్+ ఇట్టు+అట్టు+అనఁడు= ఇక ఇటనీ అటనీ ఊగిసలాడడు; ఎట్టులు+ఐనన్= ఎట్లాగైనా; హృదయంబునన్= మనస్సులో; వానికిన్= కీచకునకు; ఎక్కడి శంక?= అనుమాన మెక్కడిది?

తాత్పర్యం: అయినా కీచకు డట్లా ఎందుకు చేస్తాడులే! నీవు ప్రీతిగా మాట్లాడి, 'నీ వట్లా చేయు'మని స్పష్టంగా చెప్పినప్పుడు వాడికి కలిగిన సంతోషపు రీతి చూచావుగదా! ఇక ఎటూ పోలేడు, ఏమీ అనలేడు. వాడి మనసులో అనుమానానికి తావెక్కడ ఉంటుంది?

విశేషం: 1. ఆడది బొంకితే గోడపెట్టినట్లు ఉంటుంది. మాయాంధకారం వంటి మోహపు వాగురలో చిక్కిన మృగం కీచకుడు. వాడికి ఇంగితజ్ఞానం శూన్యం. అందుకే భీముడు ధైర్యంగా ఉన్నాడు. 2. పుట్టిన, సంతసంబు+అనువున్= కలిగిన సంతోషం యొక్క విధము- అని షష్ఠీసమాసం - ఉకారానికి అచ్చుపదం కాగా నుగాగమం అయి సంతసంబుననువు అయింది. సంతోషించిన విధము - అని అర్థం.

ఉ. వచ్చు, మదాంధవృత్తి ననివారణ నొక్కఁడ నాట్యశాలకుం
జొచ్చు, నవశ్యమున్ వెదకి చూచి ననుం గని యప్డు సంగరం
బిచ్చు, మదీయ బాహుబల హీనబలుండయి నీకుఁబ్రీతిగాఁ
జచ్చు. నసంశయం బిది; విచారము లన్నియు నింక నేటికిన్?' 258

ప్రతిపదార్థం: వచ్చున్= తప్పకుండా వస్తాడు; మద+అంధవృత్తిన్= కన్నుగానని గర్వంతో; అనివారణన్= అడ్డు లేకుండా; నాట్యశాలకున్= నర్తనశాలకు; ఒక్కఁడు+అ= ఒంటరిగా; చొచ్చున్= ప్రవేశిస్తాడు; అవశ్యమున్= తప్పకుండా; వెదకి

చూచి= వెదకిచూచి; ననున్+కని= నన్ను చూచి; అప్డు= అప్పుడే; సంగరంబు+ ఇచ్చున్= యుద్ధం చేస్తాడు; మదీయబాహుబల= నా భుజబలంచేత; హీనలుండు+అయి= క్షీణించిన బలంకలవాడయి; నీకున్= నీకు (ద్రౌపదికి); ప్రీతికాన్+చచ్చున్= సంతోషం కలిగేటట్లు చస్తాడు; ఇది= ఇది; అసంశయంబు= అనుమానం లేనిమాట; విచారములు= ఆలోచనలు; అన్నియున్= అన్నీ; ఇంకన్+ఏటికిన్?= ఇంక దేనికి?

తాత్పర్యం: కీచకుడు తప్పక వస్తాడు. కన్నుగానని మోహాంధకారంతో నిరభ్యంతరంగా నర్తనశాలలో ఒంటరిగానే ప్రవేశిస్తాడు. తప్పకుండా వెదకి నన్ను చూచి యుద్ధం చేస్తాడు. నా బాహుబలంముందు తన బలాన్ని కోల్పోయి నీకు ప్రీతి కలిగేటట్లు చస్తాడు. ఇందుకు అనుమానం లేదు. ఇంకా నీవు పలురకాలుగా ఆలోచించి విచారించ నవసరం లేదు.'

విశేషం: జరగబోయేది యథాతథంగా భీము డూహిస్తున్నాడు.

వ. అని నిశ్చయించి వృకోదరుండు వెండియు నిట్లనియె. 259

తాత్పర్యం: అని పలికి, తానన్న మాటలు తప్పక జరిగేవని నిర్ధారణ చేసి భీముడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

మ. 'బలియుం డా సొబగుండు భావభవదర్పభ్రాంతుఁడై వచ్చి ని
శ్చల సర్వాంగత నున్న న న్నరసి నీ చందంబు గాకున్న నా
కులతం బొందెడు, నప్డు మండపము సంక్షోభింపఁగా నేతుఁ గ
ట్టలుకన్ బెబ్బులిఁ గోలవ్రేచినటు లుగ్రాకార మేపారఁగన్. 260

ప్రతిపదార్థం: బలియుండు= బలిష్ఠుడైన; ఆ సొబగుండు= ఆ విటుడు; భావభవదర్ప భ్రాంతుఁడు+ఐ= మన్మథగర్వంతో చలితుడై; వచ్చి; నిశ్చల= చలనం లేని; సర్వాంగతన్+ ఉన్న= అన్ని అంగాలు కలవాడనై ఉండగా; నన్నున్+అరసి= నన్ను (భీముడిని) చూచి; నీ చందంబు+కాక+ఉన్న= నీవలె ఉండకపోవటంతో; ఆకులతన్+పొందెడున్= కలత పడతాడు; అప్డు= అప్పుడు;

మండపము= నర్తనశాల మండపం; సంక్షోభింపఁగాన్= చలించేటట్లు; కడు+ అలుకన్= మిక్కిలి కోపంతో; కోలన్= పెద్ద కర్రతో; బెబ్బులిన్= పెద్దపులిని; వ్రేచిన+అటులు= కొట్టినట్లు; ఉగ్ర+ఆకారము= మిక్కిలి కోపంతోడి భయంకరమైన రూపం; ఏపారఁగన్= అతిశయించగా; ఏతున్= బాధిస్తాను.

తాత్పర్యం: ఆ కీచకుడు మదనావేశంతో వచ్చి నిశ్చలంగా ఉండే నన్ను తడవిచూచి, నీవు కాకపోవటం తెలిసికొని కలత చెందుతాడు. అపుడు నేను కర్రతో కొట్టిన పెద్దపులి వలె తీవ్ర కోపంతో కూడిన భయంకర రూపంతో ఆ మండపమంతా సంక్షోభించేటట్లు విజృంభించి బాధిస్తాను.

విశేషం: అలం: ఉపమ. కీచకుడు భీముడిని తాకటం కోలతో కొట్టటంతోను, భీముడు - దానికి ప్రతిక్రియగా పెనుకోపంతో లేస్తున్న బెబ్బులితోనూ పోల్చబడ్డారు. బలియుడు, సొబగుడు అనే మాటలు కీచకుడిని వెక్కిరిస్తూ భీము డుపయోగించినవి. మొనగాడు, సోగ్గాడు అనే గ్రామ్యాలకు సమానమైనవి. భావభవదర్పభ్రాంతుడై - అనే సమాసానికి శ్లేషార్థం చెప్పుకొన వచ్చును. భావమునుండి పుట్టిన గర్వం వలన కలిగిన మోహంతో - అని ఒక అర్థం. మన్మథ సంబంధమైన గర్వం వలన కలిగిన మోహంతో అని రెండో అర్థం చెప్పవచ్చును. (సంపా.)

క. ఎఱిఁగి పిఱుసనిన వెసఁ బై।
కుఱుకుదు సాళువము గాకి నొడిసిన భంగిన్
వెఱచఱవం బొదువుదుఁ బఱి।
పఱిసేయుదు నీదు పూన్కి పారం బెయిదన్. 261

ప్రతిపదార్థం: ఎఱిఁగి= (అసలు సంగతి) తెలిసికొని; పిఱు+చనినన్= వెనుకాడితే; వెసన్= వెంటనే; సాళువము= డేగ; కాకిన్= కాకిని; ఒడిసిన భంగిన్= ఒడుపుగా పట్టు కొన్నట్లు; పైకిన్+ఉఱుకుదున్= పైకి దూకుతాను; వెఱ, చఱవన్= భయం వ్యాపించేటట్లు; పొదువుదున్= ఆక్రమించి

పట్టుకొంటాను; నీదుపూన్కి= ద్రౌపది ప్రయత్నం (కోర్కె); పారంబు+ ఎయిదన్= తుదముట్టగా; పఱిపఱి+చేయుదున్= పీడిస్తాను.

తాత్పర్యం: కీచకుడు నన్ను గుర్తించి వెనుకడుగు వేస్తే వాడిమీది కెగబడి డేగ కాకిని ఒడిచిపట్టుకొన్నట్లుగా వాడిని పట్టుకొంటాను. నీ కసి తీరేటట్లు వాడిని పీడించి నుగ్గునుగ్గు చేస్తాను.

విశేషం: అలం: ఉపమ.

ఆ. నాదు బాహుబలమునకు మాఱుకొనఁజాలు।
భుజబలంబుగలిగి పోక చిక్కఁ
బెనఁగి నన్నుఁ గొంత కినియింప నోపెడు।
చందమైన వినుము సరసిజాక్షి! 262

ప్రతిపదార్థం: సరసిజ+అక్షి!= పద్మాక్షీ-ద్రౌపదీ!; నాదు బాహు బలమునకున్= నాయొక్క (భీముడి) భుజశక్తికి; మాఱుకొనన్+చాలు= ఎదుర్కొనే సమర్థమైన; భుజబలంబు+కలిగి= భుజశక్తి కలిగి; పోక= పారిపోవక; చిక్కన్+పెనఁగి= గట్టిగా పెనగులాడి; నన్నున్= నన్ను (భీముడిని); కొంత= కొంచెం; కినియింపన్+ఓపెడు= కోపింపజేసే; చందము+ఐనన్= విధమైతే; వినుము.

తాత్పర్యం: ద్రౌపదీ! కీచకుడు నాతో యుద్ధం చేయగల శక్తిగలవాడై, వెనుకాడక ఎదిరించి గట్టిగా పెనగులాడి నన్ను కోపింపజేస్తే ఏమవుతుందో వినుము.

విశేషం: జరుగబోయే ప్రతివ్యూహం ఎట్లా ఉంటుందో ముందుగా చెప్పుతున్నాడు. చదరంగంలో పావులు కదిలించి రాజుయొక్క ఆట కట్టించటం వంటిదే ఎదుటివాడి బలాన్ని అంచనా వేయటం. భీముడు ద్రౌపదికి నమ్మకం కలిగించటానికే ఈ మాటలు అంటు న్నాడు.

మ. అవనీచక్రము సంచలింపఁగ, దివం బల్లాడ, నాశాచయం
బవధూతంబుగ, గోత్రశైలనికరం బాకంపముం బొంద, న
ర్ణవముల్ ఘూర్ణనమొందఁ, గ్రోధము కృతార్థత్వంబు నొందించి, చి
త్రవధప్రౌఢి వహించి సూతునకు రౌద్రం బేర్పడం జూపుదున్.' 263

ప్రతిపదార్థం: అవనీచక్రము= చక్రమువంటి భూమి; సంచలింపఁగన్= మిగుల కదిలేటట్లు; దివంబు= ఆకాశం; అల్లాడన్= దద్దరిల్లగా; ఆశాచయంబు= దిక్కుల సముదాయం; అవధూతంబుగన్= కొట్టుకొనిపోయే రీతిగా; గోత్రశైల; నికరంబు= కులపర్వతాల సమూహం; ఆకంపమున్+పొందన్= బాగా వణకగా; అర్ణవముల్= సముద్రాలు; ఘూర్ణనము+ఒందన్= తిరుగుడుపడి కలత చెందగా; క్రోధము= కోపం; కృతార్థత్వంబున్+ఒందించి= సఫలమయ్యే టట్లు; చిత్రవధ ప్రౌఢిన్= చిత్రహింస చేసే నేర్పరితనంతో; సూతునకున్= కీచకుడికి; రౌద్రంబు= రుద్రభావం, రౌద్ర రసస్ఫూర్తితో కూడిన క్రౌర్యం; ఏర్పడన్= స్పష్టంగా; చూపుదున్= చూపిస్తాను.

తాత్పర్యం: భూ మండలం కంపించగా, ఆకాశం అల్లల్లాడగా, దిక్కులు పిక్కటిల్లగా, కుల పర్వతాలు వణకగా; సముద్రాలు కల్లోలితం కాగా; నా క్రోధం సఫలమయ్యేటట్లు చిత్రవధ చేసే నేర్పరితనాన్ని ప్రదర్శించి, నా రౌద్రరూపాన్ని ఆ కీచకుడికి ప్రత్యక్షం చేస్తాను.

విశేషం: అలం: అతిశయోక్తి, క్రోధము కృతార్థత్వం పొందటమంటే రౌద్రంగా మారటం, ఎదుటివారికి ప్రాణహాని, కరుణం కలిగించటం. రౌద్రం అంటే రుద్రభావం, రుద్రుడు కోపిస్తే జగత్ప్రళయం సంభవించటం కవిసమయం. దానిని తాను తన రౌద్రం వలన కల్పించి కీచకుడికి ప్రళయాన్ని సృష్టిస్తానని రౌద్రోద్రేకంతో భీముడు పలికాడు. (సంపా.)

వ. అనినం బాంచాలి సంచలితస్వాంతయై, నిజాంతర్గతంబున 'నితని తీవ్ర క్రోధంబు గుప్తసాధనంబునకు బాధకంబగు' నని బోధింపం దలంచి యిట్లనియె. 264

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పాంచాలి= ద్రౌపది; సంచలితస్వాంత+ఐ= చలించిన మనస్సు గలదై; నిజ+అంతర్గతంబునన్=తన మనస్సులో; ఇతని=

భీముడియొక్క; తీవ్రక్రోధంబు= అధికమైన కోపం; గుప్తసాధనంబునకున్= అజ్ఞాతవాస రహస్యస్థితికి; బాధకంబు+అగున్+అని= భంగకరమవుతుందని; బోధింపన్+తలఁచి= చెప్పాలి అనుకొని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: భీము డిట్లా మాట్లాడేసరికి ద్రౌపది మనసులో ఉలిక్కిపడింది. భీముడి తీవ్రకోపావేశం తమ అజ్ఞాతవాసానికి భంగకరమవుతుందని ఆయనకు తెలిసేటట్లు చెప్పాలని ఇట్లా అన్నది.

ఉ. 'ఒవ్వనివారు నవ్వ, మహిమోదధి ధర్మసుతుండు దీనికిన్
నెవ్వగఁబొంద, భూజనులు నింద యొనర్వఁగ నే నొనర్చు నీ
చివ్వకు నీవు నల్కమెయిఁ జేసిన యాపని గూఢవృత్తికిన్
దవ్వగునేని నా యభిమతం బొడఁ గూడియు నిష్ఫలంబగున్ 265

ప్రతిపదార్థం: ఒవ్వనివారు= శత్రువులు; నవ్వన్= నవ్వేటట్లు; మహిమ+ఉదధి= గొప్పతనంలో సముద్రుడి వంటివాడు; ధర్మసుతుండు= ధర్మరాజు; దీనికిన్= ఈ పనికి; నెఱ+వగన్+పొందన్= ఎంతో బాధపడేటట్లు; భూజనులు= లోకులు; నింద+ ఒనర్పఁగన్= తిట్టేటట్లు; నేను+ఒనర్చు= నేను చేసే; ఈ చివ్వకున్= ఈ తగాదాకు; నీవు అల్కమెయిన్+చేసిన= నీవు కోపంతో చేసినట్లైతే; ఆ పని= ఆ విధంగా రౌద్రాన్ని లోక ప్రళయంగా ప్రదర్శించడం; గూఢవృత్తికిన్= రహస్య వర్తనానికి; దవ్వు+అగునేని= దూరమైతే; నా అభిమతంబు= నా కోరిక; ఒడఁగూడియున్= నెరవేరికూడా; నిష్ఫలంబు+ అగున్= నిష్ప్రయోజనం ఔతుంది.

తాత్పర్యం: 'మనమంటే పడనివారంతా నవ్వేటట్లు, ధర్మరాజుకు అధిక దుఃఖం కలిగేటట్లు, లోకనింద సంభవించేటట్లు, ఈ కలహంలో నీవు పెనుకోపంతో రహస్యం చెడగొడితే నా కోర్కె తీరినా చివరకు ఫలితం శూన్యమే ఔతుంది.

విశేషం: అజ్ఞాతవాసం భీముడి రౌద్రోద్రేకం వలన భగ్నం కాకూడదనీ, అంతటి రౌద్రంతో సాధించే కార్యం కూడా గుట్టుగా సాగాలనీ ద్రౌపది హెచ్చరించింది.

క. కావున వంచన బాహిర।
పోవక యుండంగ మన రిపుం బరిమార్పం
గావచ్చునేని నట్టిద।
నా వల; పటుగాక తక్కినను వలదు సుమీ!' 266

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; వంచన= మోసం; బాహిరపోవక+ఉండంగన్= బయల్పడకుండా; మన రిపున్= మన శత్రువును; పరిమార్పంగాన్ వచ్చునేనిన్= చంపటానికి వీలైతే; అట్టిది+అ= అట్లాంటిదే; నా వలపు= నా అభిమతం; అటు+కాక తక్కినను= అట్లా కాకపోతే; వలదు సుమీ!= ఈ యత్నం వద్దు సుమా!

తాత్పర్యం: మన అజ్ఞాతవాసం బహిరంగం కాకుండా మన శత్రువును చంపగలగాలి. అదే నా అభిమతం, అట్లా కాకపోతే ఈ ప్రయత్నమే వద్దు.'

వ. అనిన విని ద్రుపదనందనకుం బాండునందనుం డిట్లనియె. 267

తాత్పర్యం: ఆ మాటలు విని ద్రౌపదితో భీము డిట్లా అన్నాడు.

చ. 'మదమునఁ గీచకాగ్రజుఁడు మార్కొని నిల్చిన వీఁక మైమెయిం
గదిసితి మేని నప్పుడు ప్రకాశరహస్యవిభేదబుద్ధి నా
కొదవునె? యైన నేఁ దలఁచి యోపినభంగి నిగూఢవృత్తిమైఁ
బదిలము గల్గి తిన్నని యుపాయమునం దెగఁజూతు నాతనిన్.' 268

ప్రతిపదార్థం: కీచక+అగ్రజుఁడు= కీచకుల అన్న అయిన సింహబలుడు; మదమునన్= గర్వంతో; మార్కొని నిల్చినన్= ఎదిరించి నిలబడితే; వీఁకన్= పరాక్రమంతో; మై మెయిన్= అనాయాసంగా; కదిసితిమి+ఏనిన్= కలియబడితే; అప్పుడు= ఆ సమయంలో; ప్రకాశ, రహస్య విభేదబుద్ధి= ప్రకాశానికీ, రహస్యానికీ కల తేడాను పాటించే తెలివి; నాకున్+ఒదవునె?= నాకు కలుగుతుందా?; ఐనన్= ఐనా; నేన్+తలఁచి= నేను ఆలోచించి; ఓపినభంగిన్= నా శక్తికొద్దీ; నిగూఢవృత్తిమైన్= రహస్యమైన పద్ధతిలో; పదిలము,

కల్గి= జాగ్రత్తతో; తిన్నని+ఉపాయమునన్= సవ్యమైన ఉపాయంతో; అతనిన్= కీచకుడిని; తెగన్+చూతున్= చంప యత్నిస్తాను.

తాత్పర్యం: 'కీచకుడు మదించి ఎదిరించి నిలబడితే, అపుడు పరాక్రమించి అనాయాసంగా కలియబడితే, ఇది రహస్యంగా చేయాలి. ఇది ప్రకాశంగా చేయాలి - అనే విచక్షణ ఆ సమయంలో నా కెట్లా ఉంటుంది? అయినా, నీవు చెప్పిన విషయం మనసులో ఉంచుకొని ఓపినంతవరకు రహస్య పద్ధతిని భద్రంగా కాపాడుతూ తగిన ఉపాయంతో కీచకుడిని చంప యత్నిస్తాను.'

విశేషం: ద్రౌపది హెచ్చరిక భీముడి ఆవేశప్రవృత్తిలో కూడా మరచిపోలేని ఒక జాగ్రత్తను కలిగించింది. ఉపాయం సిద్ధించినా అపాయం కలుగకుండా వారించే ప్రయత్నం చేస్తేనే ఫలసిద్ధి కలిగేది. కార్యసాధనలో దేహశక్తి కంటె బుద్ధికుశలత ముఖ్యం.(సంపా.)

క. అనవుడు 'జయలక్ష్మిం జే।
కొను' మని దీవించి, 'యింతకుం గేకయ నం
దన నన్నుఁ దడవుఁ' దడయం।
జన దియ్యెడ'నని లతాంగి చనియెంబ్రీతిన్. 269

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; జయలక్ష్మిన్= విజయమనే సంపదను; చేకొనుము+ అని= పొందుమని; దీవించి= ఆశీర్వదించి; ఇంతకున్= ఇప్పటికే; కేకయనందన= సుదేష్ణ; నన్నున్= నన్ను; తడవున్= వెదకుతూ ఉంటుంది; ఈ+ఎడన్= ఇక్కడ; తడయన్+ చనదు= ఆలస్యం చేయడం మంచిది కాదు; అని= అని పలికి; లతాంగి= తీగవంటి శరీరంగల ద్రౌపది; ప్రీతిన్+చనియెన్= సంతృప్తితో వెళ్లింది.

తాత్పర్యం: ఆ మాటలు విని 'జయలక్ష్మిని పొందు' మని భీముడికి ద్రౌపది శుభాకాంక్షలు తెలిపింది. 'ఇప్పటికే సుదేష్ణ నాకొరకు వెదకుతూ ఉంటుంది. ఇక్కడ ఇంకా ఆలస్యం చేయటం మంచిది కాదు' అని అంటూ ద్రౌపది సంతృప్తితో వెళ్ళిపోయింది.

విశేషం: యుద్ధానికి వెళ్ళే భర్తలను వీరవనితలు 'విజయోऽస్తు' అని దీవిస్తారు కాని పాదాభి వందనాలు చేయరు. అది యుద్ధ మర్యాద. విజయం తథ్యమని నిశ్చయం ఏర్పడిన తర్వాత ద్రౌపది హృదయంలో ఒక సంతృప్తి ఏర్పడింది. భార్య దీవెన భర్తకు విజయ సూచన! (సంపా.)

వ. మారుతసుతుండును గృతనిశ్చయుండై యుండె; నటఁ గీచకుండు కందర్ప దర్పగోచరుండై పరిజనంబుల వంచించి యేకాంతస్థలంబున. 270

ప్రతిపదార్థం: మారుత సుతుండును= వాయుతనయుడు భీముడు కూడా; కృత నిశ్చయుండు+ఐ= కార్యం సాధించాలి అని చేయబడిన నిర్ణయంకలవాడై, (మనసులో గట్టిగా సంకల్పించుకొని అని భావం); ఉండెన్= ఉన్నాడు; అటన్= అక్కడ; కీచకుండు; కందర్ప, దర్ప, గోచరుండు+ఐ= మన్మథుడి గర్వానికి (మదనతాపానికి) గురి అయినవాడై; పరిజనంబులన్= పరివారాలను; వంచించి= కంటబడకుండా; ఏకాంత స్థలంబునన్= ఒంటరి ప్రదేశంలో.

తాత్పర్యం: ఇక్కడ భీముడు కూడా స్థిరనిశ్చయంతో ఉన్నాడు. అక్కడ కీచకుడు మదనతాపానికి గురిఅయి సేవకుల కళ్ళు గప్పి ఒంటరి ప్రదేశానికి చేరి (తరువాతి పద్యంతో అన్వయం.)

కీచకుఁడు ద్రౌపదియందలి మోహంబునఁ బరితాపంబు నొందుట

(ఇది మూలమునందు లేదు)

సీ. వామాక్షి రుచిర లావణ్యంబు భావించుఁ।
దన్వంగి రూపు చిత్తమున నిలుపుఁ,
గంబుకంధరచెన్ను కైవడి తలపోయు।
నంగన సౌకుమార్యముఁ దలంచు,
భామిని సహజ విభ్రమ మెదఁ గీలించుఁ।
బడఁతి చెయ్వులు మదిఁబట్టుకొలుపు,
మానిని గరువంపు మాటపొం దూహించు।
దళితాబ్జముఖి తిన్నఁదనము మెచ్చు,

తే. నడరి కోర్కులు చిఱ్ఱుముఱ్ఱాడ వెడఁగు।
పడిన యుల్లంబు పట్టునఁ బఱుపఁదనకు
వశముగాకున్న నెంతయు వంతఁబొందుఁ।,
జింత యెసకంబు వడిగొని చిక్కువఱుప. 271

ప్రతిపదార్థం: వామాక్షి= అందమైన కన్నులుగల ద్రౌపదియొక్క; రుచిరలావణ్యంబు= కాంతిమంతమైన మేని నిగనిగను; భావించున్= మరల మరల తలుస్తాడు; తన్వంగిరూపు= సన్నని మేనుగల ద్రౌపది ఆకారాన్ని; చిత్తమునన్+నిలుపు= మనస్సులో పదిల పరచుకొంటాడు; కంబుకంధర= శంఖంవంటి కంఠం కల ద్రౌపదియొక్క; చెన్నుకైవడి= అందాల తీరును; తలపోయున్= ఆలోచిస్తాడు; అంగన= అందమైన ద్రౌపది యొక్క; అంగన= ఆ స్త్రీయొక్క; సౌకుమార్యమున్= కోమలత్వమును; తలంచున్= భావిస్తాడు, స్మరిస్తాడు; భామిని= ఆ మగువయొక్క; సహజ విభ్రమము= సహజమైన విలాసాన్ని; ఎదన్+కీలించున్= మనస్సుతో హత్తుకొంటాడు; పడఁతి= యువతి అయిన ద్రౌపదియొక్క; చెయ్వులు= చేష్టలు; మదిన్= మనస్సులో; పట్టుకొలుపున్= నిలుపుకొంటాడు; మానిని= అభిమానవతి అయిన ద్రౌపది యొక్క; గరువము+ మాటపొందు= గడుసరి మాటల పొందిక; ఊహించున్= భావిస్తాడు; దళిత+అబ్జముఖి= వికసించిన పద్మంవంటి ముఖం కల ద్రౌపది యొక్క; తిన్నఁదనమున్= చక్కదనాన్ని; మెచ్చున్= మెచ్చుకొంటాడు; అడరి= అతిశయించి; కోర్కులు= ఆశలు; చిఱ్ఱుముఱ్ఱు+ ఆడన్= తొందరపెట్టగా; వెడఁగు పడిన= కలత పడిన; ఉల్లంబు= మనస్సును; పట్టునన్+ పఱుపన్= కుదుటపరచుకొనటానికి; తనకున్= కీచకుడికి; వశము+కాక+ఉన్నన్= సాధ్యపడకపోవటం వలన; ఎంతయున్= మిక్కిలి; చింత= విచారం; ఎసకంబు= అధికమై; వడిగొని= త్వరపడి; చిక్కు+పఱుపన్= చిరాకు పెట్టగా; వంతన్+పొందున్= బాధపడతాడు.

తాత్పర్యం: కీచకుడు అందమైన కన్నులుగల ద్రౌపది మేని నిగనిగలను మరీ మరీ తలంచేవాడు. సన్నని ఆమె అందమైన రూపాన్ని మనసులో

నిలుపుకొనేవాడు. శంఖం వంటి కంఠం గల ఆమె అందాల తీరును మనసులో తలపోసేవాడు. అందమైన శరీరంగల ఆమె కోమలత్వాన్ని భావించేవాడు. ఒయ్యారి అయిన ఆమె శరీర విలాసాలను మనసుకు హత్తుకొనేవాడు. ప్రౌఢురాలైన ద్రౌపది చేష్టలను హృదయంలో గట్టిగా నిలుపుకొనేవాడు; అభిమానవతి అయిన ఆమె గడుసరి మాటల పొందికలోని (అంతరార్థాలను) ఊహించేవాడు. వికసించిన పద్మం వలె ఉన్న ఆమె ముఖంలోని చక్కదనాన్ని ప్రశంసించేవాడు. ఈ విధంగా కోర్కెలు అతిశయించి తొందరపెట్టగా (సందడించగా) కలతపడిన మనస్సును కుదుటపరచుకొనలేకపోవటంతో చింత పెచ్చుపెరగగా వ్యాకులపడుతూ ఎంతో విరహబాధ పొందాడు.

విశేషం: అమూలకంగా వర్ణించిన కీచకుడి విరహ వర్ణన తెలుగు సాహిత్యంలోనే ఒక శృంగార నాయకుడి దశవిధ కామావస్థల ఆలంకారిక వర్ణనకు దారులు వేసింది. నాయిక అంగీకారం తెలిపింది. 'అభిలాష' ఫలసిద్ధి కొరకు అర్రులు చాస్తున్నది. అభిలాష దశవిధ కామావస్థలలో మొదటిది. **"వ్యవసాయా త్సమారబ్ధః సంకల్పేచ్ఛా సముద్భవః । సమాగమో పాయకృతః సోఽభిలాషః ప్రకీర్తితః॥"** 'నాట్యశాస్త్రమ్. 12-173. తాను కామించిన యువతిని గురించిన పర్యాలోచనతో కూడిన జ్ఞానంతో ప్రారంభమై, సంకల్పపూర్వకమైన ఇచ్ఛచేత ఉద్రిక్తమై, సమాగమోపాయాన్ని అన్వేషించటం వరకు సాగే మానసికావస్థ అభిలాష, తిక్కన ఈ అవస్థను సమగ్రంగా వర్ణించాడు ఈ ఘట్టంలో.

ఈ పద్యంలో సైరంధ్రి రూపవైభవాన్ని కీచకుడు దర్శించి మనస్సులో పర్యాలోచనం చేస్తున్న దశ వ్యక్తమౌతున్నది. ఇవి మూడంచెలుగా చెప్పబడుతున్నాయి. అవి: రూపం-గుణం-పర్యాలోచన విధానం. వాటి వర్ణన విధానం.

1. రూపం - వామాక్షి ; గుణం - లావణ్యం ; పర్యాలోచనం - భావించడం.
2. రూపం - తన్వంగి ; గుణం - రూపు ; పర్యాలోచనం - చిత్తమున నిలపటం.
3. రూపం - కంబుకంధర ; గుణం - చెన్నుకైవడి ; పర్యాలోచనం - తలపోయటం.

4. రూపం - అంగన ; గుణం - సౌకుమార్యం ; పర్యాలోచనం - తలంచటం.
5. రూపం - భామిని ; గుణం - సహజవిభ్రమం ; పర్యాలోచనం - ఎదఁ గిలించటం.
6. రూపం - పడతి ; గుణం - చెయ్వులు ; పర్యాలోచనం - మదిఁ బట్టుకొలుపటం.
7. రూపం - మానిని ; గుణం - గరువంపు మాటల పొందు ; పర్యాలోచనం - ఊహించటం.
8. రూపం - దళితాబ్జముఖి ; గుణం - తిన్నదనం ; పర్యాలోచనం - మెచ్చుకొనటం.

అష్టవిధ రూపగుణ పర్యాలోచనల వలన మనసులో సందడించే కోర్కెలను కీచకుఁడు నిలువరించుకొనలేకపోవటం అభిలాషలో ఇచ్ఛ అనే అంతర్దశ. చింత పెచ్చుపెరగటం వలన వ్యాకులపడటం ఉత్కంఠ అనే అంతర్దశ. ఎంతో వంత పొందటం సంకల్పదశలోని భాగం. తిక్కన కీచకుడి విరహవర్ణనం ఎంత రసోద్విగ్నమో, అంత శాస్త్రోక్తంగా ఉండటం విశేషం. (సంపా.)

చ. తలరు, నలందురున్, నవయుఁ, దాపభరంబున వెచ్చనూర్చు, మే
నలయఁగ నొల్లఁబోవు, వెగడందుఁ, గలంగుఁ, బరిభ్రమించుఁ, గొం
దలపడుఁ, దల్లడం బడరి ధైర్యము దూలిన బెగ్గడిల్లు, వి
చ్చలవిడిఁ బేర్చు, నెవ్వగల సందడి డెందము గంది చేడ్పడున్. 272

ప్రతిపదార్థం: తలరున్= తొందరపడతాడు; అలందురున్= దుఃఖిస్తాడు; నవయున్= కృశిస్తాడు; తాపభరంబునన్= మన్మథ సంబంధమైన తాపాధిక్యంతో; వెచ్చన్+ఊర్చున్= వేడినిట్టూర్పులు విడుస్తుంటాడు; మేన్+అలయఁగన్= శరీరం అలసిపోతే; ఒల్లన్+పోవున్= మూర్ఛపోతాడు; వెగడు+అందున్= భయపడతాడు; కలంగున్= కలత పడతాడు; పరిభ్రమించున్= తిరుగుతాడు; కొందలపడున్= సంక్షోభాన్ని ప్రకటిస్తాడు; తల్లడంబు= కలత; అడరి= ఎక్కువై; ధైర్యము+తూలినన్= ధైర్యం నశించగా; బెగ్గడిల్లున్= భయ పడతాడు; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; పేర్చున్= రేగిపోతాడు; నెఱ+వగల సందడిన్= మదనతాపం వలని బాధలు ఎక్కువకాగా; డెందము, కంది= మనస్సు బాధపడి తపించి; చేడ్పడున్= బాధతో చలించిపోతాడు.

తాత్పర్యం: కీచకుడు సైరంధ్రితోడి విరహవేదనలో వివిధ మదన వికారాలను ప్రకటించాడు. త్వరపడతాడు, దుఃఖిస్తాడు, కృశిస్తాడు, మన్మథతాపంతో నిట్టూరుస్తాడు, శరీరం అలసిపోతే మూర్ఛపోతాడు, భయపడతాడు, కలతపడతాడు, అటూ ఇటూ తిరుగాడుతాడు, క్షోభిస్తాడు, గుండెదడ ఎక్కువై భయపడతాడు, కట్టడ లేకుండా రెచ్చిపోతాడు, విరహతాపం వలన మనస్సు బాధపడి కంపించిపోతాడు.

విశేషం: విరహ వేదన అధికమైనప్పుడు కాముకుడు ప్రదర్శించే చేష్ట లివి. ఇవి మానసిక వికారాలకు వ్యంజకాలు. ఇన్ని భావాలకు, అవస్థలకు సంబంధించిన పరిభాషాపదాలను చాలావరకు తెలుగు పదాలలో చెప్పి తిక్కన అర్థవ్యక్తిని ప్రదర్శించటం తెలుగు భాషాశక్తిని ప్రవచించటం. (సంపా.)

వ. ఇవ్విధంబున మదనవేదనా దూయమాన మానసుం డగుచు నిట్లని వితర్కించు. 273

ప్రతిపదార్థం: ఈ విధంగా మన్మథబాధచే తపిస్తున్న మనస్సుగల కీచకుడు తన మనస్సు లో ఇట్లా ఆలోచించసాగాడు.

సీ. 'పడఁతి నన్నూఱడఁ బలికిన భంగిన,
నిచ్చమై నిక్కకు వచ్చునొక్కొ!
వచ్చి తొల్లిటియట్ల వడిఁ ద్రోచిపోవక,
పొలఁతి యింపెసలారఁ బొందునొక్కొ!

తలపోఁతఁ గలిగి యమ్మెలఁత వచ్చుటకు నొం।
డొక వింత పుట్టకయుండునొక్కొ!
గంధర్వు లేవురు గలరని చెప్పె న।
న్నెలఁతుక మాటలు నిక్కమొక్కొ!

తే. తెఱవ చిడిముడిపాటు సుదేష్ణ యెఱిఁగి।
వేడ్కఁ బనిపంచు టుడిగి రా విడుచునొక్కొ!
మదనుఁ డింతికి నొజ్జయై మతకములును।
నదను నెఱిఁగించి నాకడ కనుచునొక్కొ! 274

ప్రతిపదార్థం: పడఁతి= ఆ వనిత; నన్నున్= (కీచకుడిని); ఊఱడన్+పలికిన భంగినన్= ఊరడిస్తూ మాట్లాడినట్లుగానే; ఇచ్చమైన్= ఇష్టపడి; ఇక్కకున్= సంకేతస్థలానికి; వచ్చును+ఒక్కొ!= వస్తుందా?; వచ్చి; తొల్లిటి+అట్ల+అ= ఇంతకుముందు వలెనే; వడిన్+త్రోచిపోవక= వేగంగా త్రోసివేసిపోక; పాలఁతి= ఆ స్త్రీ; ఇంపు+ఎసలారన్= ప్రీతి అతిశయించగా; పొందున్+ఒక్కొ= నన్ను కూడుతుందా?; తలపోఁత+కలిగి= మనసుపడి; ఆ+మెలఁతవచ్చుటకున్= ఆ వనిత రావటానికి; ఒండొకవింత= మరొక ఆశ్చర్యకరమైన విషయం; పుట్టక+ఉండును+ఒక్కొ!= పుట్టకుండా ఉంటుందా!; గంధర్వులు+ ఏవురు= ఐదుగురు గంధర్వులు భర్తలుగా; కలరు+అని చెప్పెన్= ఉన్నారని చెప్పింది; ఆ+నెలఁతుకమాటలు= ఆ వనిత మాటలు; నిక్కము+ఒక్కొ?= నిజమా?; తెఱవ= ఆ వనిత యొక్క; చిడిముడిపాటు= తొట్రుపాటు; సుదేష్ణ+ ఎఱిఁగి= సుదేష్ణ తెలిసికొని; వేడ్కన్+పని+పంచుట+ఉడిగి= వేడుకగా పరిచర్యలకు పంపటం మాని; రాన్+విడుచున్+ఒక్కొ!= రావటానికి అంగీకరి స్తుందా?; మదనుఁడు= మన్మథుడు; ఇంతికిన్= ఆమెకు; ఒజ్జ+ఐ= గురువై; మతకములునున్= విలాసాలున్నూ, మాయలున్నూ; అదనున్= సమయం; ఎఱిఁగించి= తెలిపి; నా కడకున్= నా వద్దకు; అనుచున్+ఒక్కొ!= పంపుతాడా?

తాత్పర్యం: ‘ఆ వనిత నన్ను అనునయిస్తూ మాట్లాడిన విధంగానే ఇష్టపడి సంకేతస్థలానికి నిజంగా వస్తుందా? వచ్చినా ఇంతకుముందు వలె విదిలించిపోకుండా ఆమె ఆసక్తితో నన్ను పొందుతుందా? నన్ను గురించి ఆలోచిస్తూ రావటానికి బయలుదేరేలోగా ఆమెకు ఏదో వింత తలపు పుట్టకుండా ఉంటుందా? గంధర్వు లైదుగురు తనకు భర్తలుగా ఉన్నారని చెప్పిన ఆమె మాటలు నిజమై ఉండవచ్చునా? వలపువలన కలిగిన ఆమె తొట్రుపాటును గమనించి సుదేష్ణ మరేదైనా పని చెప్పకుండా సంకేతస్థలానికి రావటానికి వీలు కలిగిస్తుందా? మన్మథుడే ఆమెకు గురువై ఇతరుల కన్నుగప్పే గుట్టుమట్టులూ, మాయమర్మాలూ, వాటిని ఆయా సమయాలలో ప్రయోగించే నేర్పులూ తెలియజెప్పి (స్ఫురింపజేసి) నా దగ్గరికి పంపుతాడా?

విశేషం: అలం: అంత్యానుప్రాసం. దశవిధ కామావస్థలలో ‘చింత’ రెండవది. ఆ అవస్థను ఈ పద్యంలో తిక్కన క్రమంగా విస్తరించి రచించాడు. ఏ ఉపాయంతో ప్రియాసంగమం జరుగుతుందో అని స్వయంగాగానీ, నర్మసచివాదులతోగాని చేసే ఆలోచన చింత, కొందరు చింతను - చింత, చింతనం, విచింతనం అని మూడు రకాలుగా చెప్పుతారు. సైరంధ్రి అన్నమాట ప్రకారం తనకొరకు సంకేతస్థలానికి చెప్పిన సమయంలో చెప్పినట్లు వస్తుందా? - అని కీచకుడు శంకిస్తున్నాడు ఇక్కడ, అకస్మాత్తుగా ఆమెలో వచ్చిన పరిణామానికి తట్టుకొనలేని కీచకుడు చింతించటంలో శంకించటాన్ని మొదట వర్ణించటం ఔచిత్యం. ఇది విచింతనంలో ఒక భాగం. అన్నీ సవ్యంగా నడవాలనే ఆతురతలో అట్లా నడుస్తాయా? అనే అనుమానం ఈ శంకావస్థకు మూలం. అందులో కూడా ఒక క్రమాన్ని పాటించి భావించటం జరిగింది. ఆమె కోర్కెతో సుముఖత ప్రకటించింది - అది నిజమైన కోర్కెఅయి సంకేతస్థలానికి రావాలని కోరిక. వలపు నిజమైతే వస్తుంది. కాకపోతే రాదు. ఇది శంక. ఈ శంక విరహవేదనను తీవ్రతరం చేస్తుంది. వచ్చినా ఇదివరకువలె తనను త్రోసివేయక తన సామీప్యాన్ని, సంగమాన్ని అంగీకరిస్తుందో లేదో అని మరొక శంక. ఆమెకు కూడా వలపు చింత కలిగి, వేదనపడుతూ, తన వద్దకు రావాలని తొందరపడుతూ ఉంటే, ఏదైనా తెలియని ఒక అద్భుతం

జరిగి రాలేకపోతుందేమో! అయిదుగురు భర్తలున్నారనీ. నా రామెను రక్షిస్తుంటారనీ చెప్పిన మాట నిజమా? అబద్ధమా? అని శంక కలిగింది. వస్తే వాళ్ళకు తెలిసేటట్లు వస్తుందా, రహస్యంగా వస్తుందా? అంతుపట్టని అనుమానం. ఒకవేళ ఆమె వలపుతీవ్రత వలన తొట్రుపాటు పడుతుంటే గుర్తించి సుదేష్ణ అడ్డుపని కల్పించి పంపదేమో! అని శంకించి, శంకించి, చివరకు అడ్డంకుల నన్నింటినీ అధిరోహించ గలిగే నేర్పునూ, చేర్పునూ ఆమెకు మన్మథుడే స్వయంగా సమకూర్చాలని ఆశించాడు. ఈ పద్యంలో అయిదురకాల శంకలను కీచకుడు వ్యక్తం చేశాడు. అవి వరుసగా- ఆమె నిజంగా తనను కోరుతున్నదా? పొందుకు సిద్ధమవుతున్నదా? వేరే ఏవైనా ఆలోచనలున్నాయా? చింతకు, తరువాతి రెండూ చింతనకూ, అయిదవదీ, చివరిదీ అయిన ఆకాంక్ష విచింతనకూ సంబంధించి సాగటం - చింత అనే అవస్థను తిక్కన ఆవిష్కరించిన క్రమం. పద్యరచనలో అంత్యప్రాసాలంకారం చింతావస్థలో కీచకుడి దశావిస్ఫూర్తిని లయాత్మకంగా పఠితలకు స్ఫురింపజేసింది. (సంపా.)

ఉ. నిక్కమ పోలె నప్పుడొక నేరిమిమై ననుఁ ద్రోచిపుచ్చఁగా
నక్కమలాక్షి పొందు దగ నాడి, తుదిన్ నిజమేది, నేఁటి రే
యిక్కకు రాక తక్కిన, సహించునె నన్ మరుఁ? డట్టులైన నా
కెక్కడిప్రాణ, మేటితను, వెయ్యది నిల్కడ, యేమిసేయుదున్? 275

ప్రతిపదార్థం: నిక్కమపోలెన్= నిజమా అన్నట్లు; అప్పుడు+ఒకనేరిమిమైన్= అప్పుడు ఏదో ఒక నేర్పుతో; ననున్+త్రోచిపుచ్చఁగాన్= నన్ను నెట్టివేయగా; ఆ+కమల+అక్షి= పద్మాలవంటి కన్నులుగల ఆ సైరంధ్రి; పొందున్= కలయికను; తగన్+ఆడి= అనువుగా మాట్లాడి; తుదిన్= చివరకు; నిజము+ఏది= ఆ వాస్తవాన్ని కాదని; నేఁటిరేయి= ఈనాటి రాత్రి; ఇక్కకున్= సంకేత స్థలానికి; రాకతక్కినన్= రాకపోతే; మరుఁడు= మదనుడు; నన్+సహించునె?= నన్ను ఓర్చుకొంటాడా?; అట్టులు+ఐనన్= అట్లాఐతే; నాకున్+ఎక్కడి ప్రాణము?= నా ప్రాణం నిలుస్తుందా?; ఏటి తనువు?= ఈ

శరీరమెందుకు?; నిల్కడ ఏ+అది?= నిలుకడ ఎక్కడిది?; ఏమి+చేయుదున్= ఏమి చేసేది?

తాత్పర్యం: తనకు ఇష్టం లేకున్నా, నన్ను నేర్పుతో త్రోసిపుచ్చటానికై నిజంగా పొందుకోరుతున్నట్లే సమయానుకూలంగా మాట్లాడి, ఆ కమలాక్షి నాతో పొందుకోరి అంత సహజంగా అనువుగా మాట్లాడి కూడా చివరకు ఈ నిజాన్ని కల్లజేసి నేటి రాత్రికి సంకేతస్థలానికి రాకుండా మానివేస్తే మన్మథుడు నన్ను సహిస్తాడా? సహించకపోతే ఇక నా ప్రాణాలు నిలుస్తాయా? ఇక ఈ తను వెందుకు? ఇక నాకు శాంతి ఎక్కడిది? ఆ పరిస్థితులలో ఇక నేనేమి చేసేది?

విశేషం: ఇందులో 'అనుస్మృతి' అనే కామావస్థ వర్ణించబడింది. దేశ కాలాలను అనుసరించి పూర్వం అనుభూతాలైన విషయాలను మరల మరల తలచుకొనటం అనుస్మృతిగా సింగభూపాలుడు పేర్కొన్నాడు (చూడు: సాత్త్వికాభినయం: పి.యస్.ఆర్.అప్పారావు. పు.445). అప్పుడు త్రోచిపుచ్చింది ఇప్పుడు పొందు కోరుతున్నది సైరంధ్రి. ఇందులో రెండవది ప్రస్తుత వాస్తవం. ఒకవేళ ఇది కూడా నిజం కాకపోతే దిక్కేమిటి? అని కీచకుడి 'అనుస్మృతి'. ధీరుడైతే విరహాన్ని అతిక్రమిస్తాడు. కాముకుడైతే మరుని చేతిలో మరణంపాలౌతాడు. దశవిధ మన్మథావస్థలన్నీ అనుభవిస్తే చివరకు మిగిలేది మృత్యువే. దానిని కూడా స్మరిస్తూ కీచకుడు బెంబేలెత్తి పోతున్నాడు. ప్రియురాలు తనను వంచిస్తుందనే భావననే సహించలేకపోతున్నాడు. ఈ లక్షణమే దుష్టుడైన కీచకుడియందు కూడా శృంగారనాయక లక్షణాలను తలపింపచేస్తున్నది. (సంపా.)

క. అట్టేల రాక తక్కుం?
గట్టిఁడియే యా లతాంగి? కామాతురు నన్
బెట్టి యచట దానికి మన।
సెట్టు నిలుచుఁ? దగవు విడువ నెట్టులు నేర్చున్? 276

ప్రతిపదార్థం: అట్టు+ఏల= అట్లా ఎందుకు; రాకతక్కున్= రాకుండా మానుతుంది? ఆ లతాంగి= ఆ వనిత; కట్టిఁడి+ఏ= అంత కఠినాత్మురాలా?

నన్= నన్ను (కీచకుడిని); కామాతురున్= మదనావేశపరుడిగా; పెట్టి= ఉంచి; అచటన్= అక్కడ; దానికిన్= ఆమెకు; మనసు+ఎట్టునిలుచున్?= మనసు ఎట్లా నిలుస్తుంది?; తగవు విడువన్= ధర్మం వదలటానికి; ఎట్టులు నేర్చున్?= ఎట్లా చాలుతుంది?

తాత్పర్యం: ఆ లతాంగి రాకుండా అట్లా ఎలా ఉంటుంది? అంత కఠినాత్మురాలా? న న్నిక్కడ ఇంత కామపరవశుడినిగా చేసి అక్కడ ఆమె నిబ్బరంగా ఉండటానికి మనసెట్లా వస్తుంది? ఎంతైనా న్యాయం తప్పి ఎట్లా నడుస్తుంది?

విశేషం: 'అనుస్మృతి' అనే కామావస్థలో 'వితర్కం' అనే భావం ఇందులో ఆవిష్కరించబడింది. తనవలెనే ఆమె కూడా విరహాన్ని పొందుతుందనీ, ఆమెలో కూడా అనుస్మృతి అనే అవస్థ కలుగుతుందనీ, అది విరహధర్మమనీ, ఆమె వచ్చి తీరుతుందనీ వితర్కించాడు కీచకుడు. (సంపా.)

ఉ. దానికి నేటి నిక్కము? వృథా పరితాపముదక్కి, బాసమైఁ
బూనికి డిగ్గఁద్రావి, వెసఁబోయెద నిప్పుడ; పోయి ముట్టి య
బ్జాననఁ బట్టి తెచ్చి హృదయం బలరంగ ననంగతంత్రవి
ద్యా నిపుణత్వ మేర్పఱిచెదం; బ్రమదాంబుధి నోలలార్చెదన్. 277

ప్రతిపదార్థం: దానికిన్= ఆమెకు; ఏటి నిక్కము?= ఎక్కడి నిజాయితీ?; వృథా పరితాపము= ఫలితం లేని ఈ మనోవేదన; తక్కి= మాని; బాసమైన్= ఇచ్చినమాట మీది; పూనికి= ప్రయత్నం; డిగ్గన్+త్రావి= దిగమ్రింగి, వదిలిపెట్టి; ఇప్పుడు+అ= వెంటనే; వెసన్+పోయెదన్= వేగంగా వెళ్ళుతాను; పోయి= వెళ్ళి; ముట్టి= ఆక్రమించి; అబ్జ+ఆననన్= ఆ పద్మముఖిని; పట్టితెచ్చి= పట్టి తీసికొనివచ్చి; హృదయంబు+ అలరంగన్= మనస్సు రంజిల్లేటట్లు; అనంగతంత్ర విద్యానిపుణత్వము= మన్మథ క్రియాకలాపంలో నేర్పరితనాన్ని; ఏర్పఱిచెదన్= ప్రదర్శిస్తాను; ప్రమద+అంబుధిన్= సంతోష సముద్రంలో; ఓలలార్చెదన్= తేలియాడేటట్లు చేస్తాను.

తాత్పర్యం: ఆమెకు నిజం పాటించాలన్న నియమం ఉన్నదా? అందుకే, ఈ వృథా విరహవేదనను వదలిపెట్టి, చేసిన బాసను దిగమ్రింగి, ఇప్పుడే వేగంగా నేను వెళ్ళుతాను. వెళ్ళి ఆమెను ముట్టడించి పట్టి తీసికొని వస్తాను. మనసు రంజిల్లేటట్లు రతిక్రీడలలో నాకున్న పాండిత్యాన్నీ, నేర్పరితనాన్నీ ప్రదర్శించి చూపిస్తాను, సంతోషసాగరంలో ఓలలాడిస్తాను.

విశేషం: 1. అలం: రూపకం. ప్రమదాంబుధిలో ఓలలాడటంలో ఆ అలంకారం ఉన్నది. 2. ఈ పద్యంలో 'ఉద్వేగం' అనేకామావస్థ వర్ణించబడింది. **"ఆసనే శయనే చాపి న తుష్యతి, న తిష్ఠతి । నిత్యమే వోత్సుకా చ స్యా దుద్వేగస్థాన మాశ్రితా॥"** (నా.శా.12.181) ఆసన శయనాలలో సంతోషం కాని, నిలుకడకాని లేకపోవటం వలన ఉద్వేగంతో ప్రియురాలిని కలియాలనే ఉత్సుకత ప్రకటించటం ఉద్వేగం. సైరంధ్రిని వెంటనే పొందాలన్న ఉత్సుకత కీచకుడి కామభావోద్వేగాన్ని తెలుపుతున్నది. దాని కనుగుణంగా ఆలోచించటం ఇందులోని ప్రవృత్తి. సైరంధ్రి మాటమీద నిలబడుతుందని నమ్మితే ఉద్వేగానికి ఊపిరి లేదు. ఆ శంకతో మొదలై అనుకొన్న నియమాన్ని దిగమ్రింగి (రసాత్మకమైన క్రియ), ఆమెను శీఘ్రంగా పట్టి తెచ్చి రతిక్రీడలలో ముంచి తేల్చేంతవరకు ఊహించాడు కీచకుడు. అతడు దుర్విదగ్ధు డనటానికి ఇదొక ఉదాహరణ. అయినా, అతడి భావతీవ్రత శృంగారనాయకులకైతే ఒక అలంకారం కాకమానదు. అతడిని అట్లా ప్రదర్శించటం కూడా తిక్కన సంకల్పం. (సంపా.)

ఆ. అనుచు సంచలించు, నడియాసఁ గ్రమ్మఱఁ ।
బాసఁ దలఁచి ధృతికిఁ బట్టువెట్టు
మరుని కోహటించి యురియాడుఁ, దుదిముట్టఁ।
గాన నిశ్చయించుఁ గలఁగుఁ దేఱు. 278

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; అడియాసన్= తీరని ఆశగా; సంచలించున్= కంపించిపోతాడు; క్రమ్మఱన్= మళ్ళీ; బాసన్+తలఁచి= ఆమె ఇచ్చిన మాట గుర్తుకు తెచ్చుకొని; ధృతికిన్= ధైర్యానికి; పట్టు+పెట్టు= ఆధారం

కలిగిస్తాడు; మరునికిన్= మన్మథుడికి; ఓహటించి= వెనుదీసి; ఉరి యాడున్= ఊగిసలాడతాడు; తుదిముట్టన్+ కానన్= చివరివరకు చూడటానికి లేదా చనిపోయే యత్నం చేయటానికీ; నిశ్చయించున్= నిర్ణయిస్తాడు. కలఁగున్= అంతలోనే కలత పడతాడు; తేఱున్= అంతలోనే తేరుకొంటాడు.

తాత్పర్యం: ఈ విధంగా అనుకొంటూ తన ఆశలన్నీ అడియాస లైపోతాయేమో అని భావించి నిలువునా కంపించిపోయేవాడు. మళ్ళీ ఆమె ఇచ్చిన మాటను తలచుకొని ధైర్యాన్ని కూడగట్టుకొనేవాడు. అయినా మన్మథుడు పెట్టే తొందరకు జంకి వెనుకకూ ముందుకూ ఊగిసలాడేవాడు. చివరివరకు ఏమి జరుగుతుందో చూద్దామనీ (చనిపోయే యత్నం చేద్దామనీ) నిశ్చయించుకొనేవాడు. అంతలోనే కలతపడేవాడు, వెంటనే తేరుకొనేవాడు.

విశేషం: ఉద్వేగంలోని చిత్తవైకల్యం ఈ పద్యంలో వర్ణితం. అనిశ్చిత చిత్తస్థితి వలన విరహదశలో కలిగే - సంచలించడం, ధైర్యం తెచ్చుకొనటం, ఊగిసలాడటం, తుదముట్ట చూడ నిశ్చయించటం, కలత పడటం, తేరుకొనటం - అనే మదన వికారాలను ఒక క్రమ విన్యాస పద్ధతిలో తిక్కన సంవిధానం చేయటం సులభంగా గమనించవచ్చును. (సంపా.)

వ. మఱియు నక్కోమలివలని ప్రేముడిం దగిలి. **279**

తాత్పర్యం: ఆ ద్రౌపదిపైని మోహంలో చిక్కుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. పొడసూపినట్లైన వడిఁబట్ట సమకట్టి।
పరికించి కానక బమ్మరించు;
మెలఁగినయట్లైన బలికింపఁ దలఁచి,ని।
రూపించి లేమి నశ్రులు వహించుఁ;
గదిసినయట్లైనఁ గౌఁగిలింపఁ గడంగి।
యారసి బొంకైన నలఁత నొందు;

నొడఁబడ్డయట్లైన నడరి పైకొనఁజూచి।
చెన్నఁటి యగుట నిశ్చేష్టఁ బొరయు;

తే. లలిత వివిధ విహారంబులకు లతాంగి।
యెలసి సొలసిన యట్లైన నెలమిఁగలిసి
యభిమతక్రీడ సలుపంగ నప్పళించి।
వెదకి రిత్తబయల్ గని విహ్వలించు. **280**

ప్రతిపదార్థం: పొడసూపినట్లు+ఐనన్= కనబడినట్లుగా అనిపిస్తే; వడిన్+పట్టన్ సమకట్టి= త్వరగా పట్టుకొనాలని ప్రయత్నించి; పరికించి= (ఆ తరువాత) పరిశీలించి చూచి; కానక= కనబడక; బమ్మరించున్= ఆశ్చర్యపోతాడు; మెలఁగిన+అట్లు+ఐనన్= దగ్గరగా తిరుగుతున్నట్లు తోస్తే; పలికింపన్+తలఁచి= మాట్లాడించాలని అనుకొని; నిరూపించి= పరీక్షగా చూచి; లేమిన్= లేకపోవటం వలన; అశ్రులు వహించున్= కన్నీరు పెట్టుకొంటాడు; కదిసిన+అట్లు+ఐనన్= మరీ దగ్గరకు వచ్చినట్లు అనిపిస్తే; కౌఁగిలింపన్+కడంగి= కౌగిట చేర్చటానికి పూనుకొని; అరసి= బాగా చూచి, పరిశీలించి; బొంకు+ఐనన్= అదంతా అబద్ధమని తేలితే; అలఁతన్+ఒందున్= బాధ (శ్రమ) పడతాడు; ఒడఁబడ్డ+అట్లు+ఐనన్= (తనతో కూడటానికి) ఒప్పుకొన్నట్లు తోస్తే; అడరి= అతిశయించి; పైకొనన్+చూచి= పైన పడి క్రమ్ముకొనటానికి ప్రయత్నించి; చెన్నఁటి+అగుటన్= ఉత్తదే కావటం చేత; నిశ్చేష్టన్+పొరయున్= చేష్టలుడుగుతాడు; లలిత వివిధ విహారంబులకున్= సుకుమారమైన అనేక క్రీడలకు; లతాంగి= వనిత (సైరంధ్రి); ఎలసిసొలసిన అట్లు+ఐనన్= వశమై దరిచేరినట్లు అనిపించగా; ఎలమిన్= ప్రీతితో; కలిసి= కూడి; అభిమతక్రీడ= తనకు ఇష్టమైన పని (రతికేళి); చలుపంగన్= చేయటానికి; అప్పళించి= ప్రయత్నించి; వెదకి= తేరిపార బాగా చూచి; రిత్తబయల్ కని= శూన్య ప్రదేశం చూచి; విహ్వలించున్= శరీరావయవాలు స్వాధీనం తప్పినట్లుగా వివశుడైపోతాడు.

తాత్పర్యం: సైరంధ్రి ఎదుట కనపడినట్లనిపించేది. కీచకు డామెను వెంటనే పట్టుకొనాలని పూనుకొనేవాడు. తీరా చూస్తే కనపడేది కాదు. అందుకు ఆశ్చర్యపోయేవాడు. ఆమె తన ప్రక్కన తిరుగుతున్నట్లు అనిపించేది. అతడు ఆమెను పలకరించాలని భావించి ముందుకు వెళ్ళేవాడు. పరిశీలించి చూస్తే ఏమీ ఉండేది కాదు. అందుకు కన్నీరు పెట్టుకొనేవాడు. ఆమె తనకు బాగా దగ్గరగా వచ్చినట్లనిపించేది. అత డామెకు కౌగిలించుకొనాలని ప్రయత్నించి, అదంతా అబద్ధమని తెలిసి మనసు నొచ్చుకొనేవాడు. ఆమె తనతో కూడటానికి సుముఖురాలైన ట్లనిపించేది. వెంటనే ఆమెపై బడి కౌగిలించుకొనాలని చూచేవాడు. అదంతా ఉత్తదే అని తెలిసి కొయ్యబారిపోయేవాడు. ఆమె అతి కోమలమైన వివిధ విలాసాలతో తనకు వశమై, దరిచేరినట్లు అన్పించగా, వెంటనే ప్రీతితో ఆమెను అభిమత రతిక్రీడలలో ముంచెత్తాలని ప్రయత్నించేవాడు. చివరకు అంతా చూస్తే శూన్యమైన ఆకాశమే అని తెలిసికొని శరీరమంతా స్వాధీనం తప్పినట్లు వివశుడయ్యేవాడు.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. ఈ పద్యంలో కీచకుడి కామావస్థలలోని ఉన్మాదావస్థ వర్ణితమైనది. అనుమానంతో మొదలైన విరహవేదన ఉన్మాదంతో పరిణతి చెందింది. ఇందులో నాయిక నాయకుడిని కూడేటప్పుడు సాధారణంగా కానవచ్చే దర్శన, స్పర్శన, సామీప్య, సల్లాప, స్నేహ, సంశ్లేష, సాముఖ్య, సమ్మోహ, విలాస, విహార దశలను భావించుకొని ఉన్మత్త దశలో అవియే నిజమని భావించి మోసపోయి చివరకు వివశుడయ్యాడని వర్ణించిన ఈ రచనలో ఒక క్రమంతో పాటు రసధ్వని కూడా రాణించింది. కీచకుడి మదనోన్మాదం ఫలాన్ని పొందనున్నట్లు కనబడుతున్నా సైరంధ్రితో పొందు అనుమానాశ్రితమనీ, చివరకు అది అబద్ధమేననీ, పరిశీలించి చూస్తే అతడికి దక్కేది శూన్యమేననీ భావి కథారసార్థాలను తిక్కన ధ్వనింప చేస్తున్నాడు. రసభావ వ్యక్తీకరణం వలన ధ్వనించే రసార్థాలు రసధ్వని రసకందాలు. (సంపా.)

కీచకుఁ డుద్యానవనంబున విహరించుట

(ఇది మూలమునందు లేదు)

వ. ఇట్లు బహుప్రకారంబులగు మన్మథ వికారంబుల కగపడి వెగడంది యమంద సంతాప భరితాంతఃకరణుం డగుచు సింహబలుండు పరిచారికా ప్రార్థనం జేసి మజ్జన భోజనంబు లొకభంగి నడపినవాఁడై, తదనంతరంబ మనో జవేదనా పనోదనార్థంబు మందిరారామభూమికిం జని తత్ప్రదేశంబున. 281

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; బహుప్రకారంబులు+అగు= అనేక రకాలైన; మన్మథ వికారంబులకున్= శృంగారభావ చేష్టలకు; అగపడి= లోబడి; వెగడంది= భయపడి; అమంద సంతాపభరిత+అంతఃకరణుండు+అగుచున్= మిక్కిలి విచారంతో కూడిన మనస్సుకలవాడై; సింహబలుండు= కీచకుడు; పరిచారికా ప్రార్థనన్+చేసి= సేవికల కోరిక మేరకు; మజ్జన భోజనంబులు= స్నానభోజనాలు; ఒక భంగిన్ నడిపినవాఁడై= ఏదో విధంగా జరిపి; తద్+అనంతరంబు+అ= తర్వాత; మనోజవేదనా+అపనోదన+అర్థంబు= మన్మథ తాపం పోగొట్టుకొనటానికి; మందిర+ఆరామభూమికిన్+చని= ఇంటి తోటలోనికి వెళ్ళి; తద్+ప్రదేశంబునన్= అక్కడ.

తాత్పర్యం: ఇట్లా అనేక విధాలైన మదనవికారాలకులోనై తడబాటుపడి మిక్కిలి దుఃఖంతో నిండిన హృదయంతో కీచకుడు పరిచారికల బలవంతం మీద స్నాన భోజనాదులు ఏదో విధంగా ముగించుకొని, ఆ తరువాత మదనతాపం చల్లార్చుకొనటానికై అంతఃపురంలోని ఉద్యానవనంలోకి ప్రవేశించి, అక్కడ.

విశేషం: మన్మథ దశావస్థలలో అరతి, గమనం అనే వాటిని కావ్యాలంకారసంగ్రహంవంటి లక్షణ గ్రంథాలు చెప్పాయి. విరహతాపం వలన స్నానపానాదులందు ప్రీతి లేకపోవటం- అరతి. మదనతాపానికి గృహంలో ఉండలేక

శైత్యోపచారార్థమై ఉద్యానవనాదులలో విహరించటం, జలక్రీడలాడటం, చిగురుపాన్పుపై పవళించటం వంటి క్రియలు చేయటంలో తిరగటం (విహరించటం) గమనం. ఆ రెండు అవస్థలను తిక్కన కీచకుడిపట్ల ఈ వచనంలో పేర్కొన్నాడు. తరువాతి రెండు పద్యాలలో గమనావస్థను విస్తరించాడు. (సంపా.)

చ. కమలవనంబుపొంత నునుగా డ్పొకయించుక యాదరించుఁ, జి
త్తమునకుఁ దానఁ దల్లడము దన్కుటయుం జని గారవంపుఁజూ
తముకడ నిల్చు, నిల్చి యది తాపముఁ బెంచిన లేఁత తీవ జొం
పముఁ జొరఁబాఱు నం దలఁత పైకొనినన్ వెడలున్ వెనుంబడున్. 282

ప్రతిపదార్థం: కమలవనంబు పొంతన్= తామర వనం (కొలను) దగ్గర; మనుగాడ్పు= మెల్లని గాలిని; ఒక+ఇంచుక= కొద్దిగా; ఆదరించున్= మన్నిస్తాడు; దానన్= దానివలన; చిత్తమునకున్= మనస్సునకు; తల్లడము= బాధ; తన్కుటయున్= అతిశయించగా; చని= వెళ్ళి; గారవము+ చూతముకడన్= ప్రియమైన మామిడిచెట్టువద్ద; నిల్చున్= నిలబడతాడు; నిల్చి= నిలబడి; అది తాపమున్+పెంచినన్= అది విరహవేదన పెంచగా; లేఁత తీవ= లేత తీగల యొక్క; జొంపమున్= గుబురులోకి, పొదరింట్లోకి; చొఱన్+ పాఱున్= ప్రవేశిస్తాడు; అందున్= అందులో; అలఁత= అలసత(ట); పైకొనినన్= ఎక్కువ కాగా; వెడలున్= బయటకు వెళ్ళేవాడు; వెనుంబడున్= ఉపాయం తోచక మనసులో చింతపడేవాడు.

తాత్పర్యం: కీచకుడు తామరపూల కొలను దగ్గర నిలబడి చల్లని పిల్లగాలిని కొంతసేపు సేవించేవాడు. కాని, దాని వలన మదన వేదన ఎక్కువయ్యేది. అక్కడినుండి కదలి తనకు ప్రీతికరమైన మామిడి చెట్టు వద్ద నిలబడేవాడు. అది తాపాన్ని తగ్గించటానికి బదులు మరింత పెంచేది. ఆపైన లేదీగల పొదరిండ్లలో దూరేవాడు. అక్కడ జడతతో కూడిన గ్లాని ఏర్పడేది. పొదరిళ్ళలో ఉండలేక బయటపడేవాడు. మరే ఉపాయం తోచక మనసులో చింతించేవాడు.

విశేషం: ఉద్యానవనంలో బహిస్తాపాన్ని తగ్గించగల వస్తువులను మదనతాపం తగ్గటానికి కీచకుడు ఆశ్రయించ నారంభించాడు. అవి విరహతాపాన్ని తగ్గించటానికి బదులు పెంచసాగాయి. ఒకదానిని విడిచి మరొకదానిని ఆశ్రయిస్తూ తిరుగుతున్నాడు. కొలను దగ్గరి మలయపవనం, మామిడి చెట్టునీడ, లేదీవల మంటపాలూ ఇవన్నీ సూర్యతాపాన్ని తగ్గిస్తాయి కాని, విరహతాపాన్ని పెంచుతాయి. అంతర్గతమైన మదనతాపం తగ్గించే ఉపాయాంతరం తోచక కీచకుడు చింతించాడు. "అలఁత పైకొనినన్" అని అనటంలో తిక్కన విరహతాపంలో గోచరించే జాడ్యం గ్లాని, ఆలస్యం అనే సంచారిభావాలను ధ్వనింపచేస్తున్నాడు. చేయవలసిన పనులలో ఏది చేయాలి? ఏది చేయగూడదు? అనే ఆలోచన తోచక చింతించటం జాడ్యం, బడలికపడటం గ్లాని, చేయవలసిన పనులలో చురుకుదనం చూపకపోవటం ఆలస్యం. పై మూడు చర్యలలో ఈ మూడు సంచారిభావాలూ స్పష్టమౌతున్నాయి. (సంపా.)

ఆ. సుడియుగాలిఁ బువ్వుఁ బొడిఁ దన్నుఁ గప్పునో।
యనుచు బెగ్గలించు నగ్గలముగఁ
గురియు తేనియలకుఁ గొంకు లతాగుల్మ।
తరు సమీపములకు నరిగి యరిగి. 283

ప్రతిపదార్థం: లతా, గుల్మ, తరు సమీపములకున్= తీగల పొదల దగ్గరకూ, చెట్ల దగ్గరకూ; అరిగి+అరిగి= వెళ్ళి వెళ్ళి; సుడియుగాలిన్= చుట్టుకొని వీచే గాలి వలన; పువ్వు+పొడి= పుప్పొడి; తన్నున్= తనను (కీచకుడిని); కప్పునో= కప్పివేస్తుందేమో; అనుచున్= అని భావిస్తూ; అగ్గలముగన్= అధికంగా; బెగ్గలించున్= భయపడతాడు; కురియు తేనియలకున్= కురిసే పూలతేనెల జల్లులకు; కొంకున్= జంకేవాడు.

తాత్పర్యం: పూదీగల పొదరిండ్ల దగ్గరికీ, పూలచెట్ల దగ్గరికీ (సుగంధాన్ని సేవించి అలత పోగొట్టుకొనటానికి) కీచకుడు పోయేవాడు. పొదరిండ్ల దగ్గర సుడిగాలి వీచినప్పుడు పుప్పొడి తనను కప్పివేస్తుందేమో అని భయపడేవాడు. పూల చెట్లనీడలలో తిరుగుతున్నప్పుడు పూదేనెలు కురిసి ముంచివేస్తాయేమో అని లోలోన మిగుల జంకేవాడు.

విశేషం: గమనమనే మదనావస్థలో అలతను పోగొట్టుకొనటానికి చేసే రెండు యత్నాలు ఇందులో చెప్పబడ్డాయి. "సుగంధం పుష్టివర్ధనమ్" అని న్యాయం. సువాసనలు పీలిస్తే అలసత తీరి బలం చేకూరుతుందని పూల పొదరిళ్ల పొంతా, పూలచెట్ల పొంతా తిరిగాడు. కాని, పూల పుప్పొడులూ, మకరందాలూ మదనతాపాన్ని పెంచుతున్నాయి. దిక్కు తోచక తిరగటం సాగించాడు. (సంపా.)

వ. ఇత్తెఱంగున నొక్కయెడనయినను గాలూనక లీలోద్యానంబు కలయం గ్రుమ్మరుచు. 284

తాత్పర్యం: ఈ విధంగా ఒక్కచోట కూడా కాలు నిలుపకుండా విలాసోద్యానవనంలో కలయ తిరుగుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఇంపైన ప్రియ కాననిచ్చి, నిల్చిన మధు।
వాదట నాను మత్తాలివిభునిఁ,
జెట్టుపల్ పచరించి చుట్టుఁ గ్రుమ్మరి మనో।
రమ నియ్యకొలుపు మరాళవిభుని,
ఫలరస మొండొంటి కెలమిఁ జంచుల నిచ్చు।
మెయిన చొక్కెడు శుక మిథునములను,
గమిఁ బాసి తలిరుజొంపమునకు మెయిమెయిఁ।
దాఁకంగఁ జను పికదంపతులను

తే. జూచి చూచి యుల్లంబున నేచి కోర్కు,
లడర చిడిముడిపడు, మ్రానుపడు, వెడంగు
పడు, వెనుంబడుఁ దల్లడపడు, దురంత।
చింతబారికి నగపడు సింహ బలుఁడు. 285

ప్రతిపదార్థం: ఇంపైనప్రియకున్= ఇష్టమైన ప్రియురాలికి; ఆనన్+ఇచ్చి= త్రాగటాని కిచ్చిన పిమ్మట; నిల్చినమధువు= మిగిలిన తేనెను; ఆదటన్= ప్రీతితో;

ఆను= త్రాగే; మత్త+అలివిభునిన్= మదించిన మగ తుమ్మెదను; చెట్టుపల్= రెక్కలు; పచరించి= విప్పార్చి; చుట్టున్+క్రుమ్మరి= చుట్టూ తిరిగి; మనోరమన్= ప్రియురాలిని; ఇయ్యకొలుపు= అంగీకరింపజేసే; మరాళ విభునిన్= రాజహంసను; ఫలరసము= పండ్లరసాన్ని; ఒండు+ఒంటిన్= ఒకదానికొకటి; ఎలమిన్= ప్రేమతో; చంచులన్+ఇచ్చు= ముక్కు పుటాలతో అందించే; మెయిన్+అ= విధంగా; చొక్కెడు= సోలిపోవు; శుకమిథునములను= చిలుకల జంటలను; గమిన్+పాసి= గుంపును వదలి; తలిరు జొంపమునకున్= చిగురు పొదలకు; మెయిమెయిన్+తాఁకంగన్= శరీరాలు పరస్పరం రాచుకొనగా; చను= వెళ్ళే; పికదంపతులను= కోయిలల జంటలను; సింహబలుఁడు= కీచకుడు; చూచి చూచి= ఆసక్తితో చూచి; ఉల్లంబునన్= మనస్సులో; ఏచి= విజృంభించి; కోర్కులు+అడరన్= కోరికలు రేగగా; చిడిముడిపడున్= తొట్రుపడతాడు; మ్రానుపడున్= నిశ్చేష్టుడౌతాడు; వెడంగుపడున్= కలతపడతాడు; వెనుంబడున్= చింతిస్తాడు; తల్లడపడున్= కంపించి పోతాడు; దురంత చింత బారికిన్= అంతులేని బాధకు; అగపడున్= వశమౌతాడు.

తాత్పర్యం: ప్రియురాలికి ముందుగా పూదేనె పానీయాన్ని త్రాగనిచ్చి మిగిలిన పూదేనెను త్రాగుతున్న మగ తుమ్మెదను, రెక్కలను విప్పి ప్రేయసి చుట్టుతిరిగి దాని మనస్సు కరగించి లోబరుచుకొనే రాజహంసను, పండ్లరసాలను ఒకదానికొకటి ముక్కులతో ముచ్చటగా పంచుకొంటూ మురిసిపోయే చిలుకజంటలను, గుంపును కనుగప్పి ఏకాంతంలో ఒకదాని శరీరానికి మరొకటి తాకేటట్లు సాగే కోయిల జంటలను సింహబలుడైన కీచకుడు ఆసక్తితో చూచి, చూచి మనస్సులో కోర్కెలు రేగగా తొట్రుపడేవాడు, నిశ్చేష్టుడయ్యేవాడు, కలత చేందేవాడు, తపించేవాడు, తల్లడిల్లేవాడు, మితిమీరిన చింతకు లొంగిపోయేవాడు.

విశేషం: 1. అలం: యథాసంఖ్యం. శృంగార రసపోషణలో ఆలంబన, ఉద్దీపన, తటస్థ విభావాలను యథావకాశంగా వర్ణించటం కావ్యసంప్రదాయం. నాయికానాయకుల యౌవనాదులు ఆలంబన విభావాలు, చేష్టాదులు ఉద్దీపన విభావాలు. ఉద్యానాదులు తటస్థ విభావాలు. అయితే తటస్థ విభావాలను ఉద్దీపన

విభావాలుగా మార్చి చిత్రించటమే కవి ప్రతిభ. జడమైన ఉద్యానవనంలో చైతన్యస్ఫోరకమైన తిర్యక్కులు ఉద్దీపనకు తోడ్పడతాయి. ఉద్యానవనంలోని తుమ్మెదల జంటలు, హంస మిథునాలు, శుకపికాల దంపతులు సలిపే లలిత శృంగార చేష్టలు తటస్థ విభావంలోని ఉద్దీపన విభావ శక్తులు. కాళిదాసాది మహాకవులు నాయికానాయకుల రత్యుద్దీపనానికి వీటిని విభావాలుగా వాడారు. పశుపక్ష్యాదులందు మానవత్వారోపణం భావనామయం. ప్రియురాలికి మధువును ముందుగా ఇచ్చి మిగిలినది తాను త్రాగటం మనసిచ్చి పుచ్చుకొనటానికి సంకేతం; రెక్కలతో ప్రియురాలిని అనునయించి అంగీకరింప చేయటం సాంత్వన చాతుర్యం; ఫలరసాలను కలిపి అనుభవించటం మనసు లేకమైన మధుర భావనం. ఒంటరిగా జంటలు క్రీడించటం సంకేతస్థలాలలో స్వేచ్ఛగా రమించటం వంటివి. నాయిక పొందుగోరే సింహబలుడికి ఈ దృశ్యాలన్నీ ఉద్దీపకాలే ఔతాయి. వాటిలోకూడా ఒక క్రమవికాసదశ కనపడటం విశేషం. కావ్యంలో ఉద్దీపన విభావాలను చూచి ఉద్దీప్తమైన పాత్ర కీచకుడు. పాఠకుడికి అతడు ప్రత్యక్ష విభావ మౌతాడు. అతడిలో పై నాలుగు దృశ్యాలను చూడటం వలన నాలుగు భావచేష్టలు అనుభవించాడు. వరుసగా అవి- చిడిముడి పడటం, మ్రానుపడటం, వెడంగు పడటం, వెనుబడటం. కోరికలు పెల్లుబుకగా అతడు తల్లడపడటం జరిగింది. ఇందులో తిక్కనకు ప్రీతిపాత్రమైన యథాసంఖ్యాలంకారం రాణిస్తున్నది.

2. తిర్యక్కుల శృంగారం రసాభాస మంటారు. నిజమే. అది పఠితకు ప్రత్యక్ష విభావమైనప్పుడు. మరి ఆ శృంగారం కావ్యనాయక రత్యుద్దీపక విభావంగా వర్ణించబడినప్పుడు రసాభాసం కాదు, రసపోషకం. పశుపక్ష్యాదుల శృంగారం భావశబలతను ప్రదర్శించలేదు. మానసికావస్థలనే చూపగలుగుతుంది. అయితే ఈ పద్యంలో తుమ్మెదల హంసల శుకపికాల వలన కలిగే మానసికావస్థలు కీచకుడిలో సంచారిభావాల పెంపుదలకు తోడ్పడుతున్నవి. 'చూచిచూచి యుల్లంబున వేచి కోర్కులడరన్' అని స్పష్టంగా తిక్కన పేర్కొనటం గమనార్హం. తిక్కన రసశిల్పి. (సంపా.)

3. ఈ పద్యం కాళిదాసు కుమారసంభవ కావ్యంలోని అకాల వసంతావిర్భావ వర్ణన సందర్భంగా చెప్పిన-

'మధు ద్విరేఫః కుసుమైకపాత్రే - పపౌ ప్రియాం స్వామనువర్తమానః।
శృఙ్గేణ సంస్పర్శనిమీలితాక్షీం - మృగీమకణ్డూయత కృష్ణసారః॥
దదౌ రసాత్ పఙ్కజరేణుగన్ధి - గజాయ గణ్డూషజలం కరేణుః।
అర్ధోపభుక్తేన బిసేన జాయాం - సంభావయామాస రథాఙ్గనామా॥' - అనే శ్లోకాలను స్ఫురింపజేస్తున్నది.

వ. ఇట్టి వలవంత నిక్కడక్కడ వడిఁ దిరిగి తిరిగి. 286

తాత్పర్యం: ఇట్లాంటి విరహబాధతో అటూ ఇటూ వేగంగా తిరిగి తిరిగి.

క. వగ ముట్టికొనినఁ జిత్తము।
వెగడొందఁగ మేను గలయ వెమ్మఁగ ధృతి పాఁ
తగల నొక తీవయింటికిఁ।
దగియుండెడు చంద్రకాంతతల్పము సేరెన్. 287

ప్రతిపదార్థం: వగ= బాధ; ముట్టికొనినన్= ఆవహించగా; చిత్తము= మనస్సు; వెగడు+ఒందఁగన్= తడబాటు కలుగగా; మేను= శరీరం; కలయన్= అంతా; వెమ్మఁగన్= తాపం పొందగా; ధృతిపాఁతు= ధైర్యము యొక్క మూలం; అగలన్= పగిలిపోగా; ఒక తీవ+ఇంటికిన్= ఒక లతాగృహానికి; తగియుండెడు= సరిపోయిన; చంద్రకాంత తల్పము= చలువరాతి తిన్నెను; చేరెన్= చేరాడు.

తాత్పర్యం: విరహతాపం విపరీతం కాగా అతడి మనసు కలత పొందింది; శరీరమంతా వేడెక్కింది; మనోధైర్యం మూలంతో సహా తెగింది. నెమ్మదిగా ఒక లతామండపంలో అమరిఉన్న చలువరాతి శయ్యమీదకు చేరాడు.

విశేషం: విరహుల పాలిటి వరాలు చంద్రకాంత శిలావేదికలు. మేనిలోని తాపాన్ని పోగొడతాయి. ఒకరకంగా అధికం చేస్తాయి. కీచకుడికి తాపాన్ని అధికం చేసింది ఆ ప్రదేశం.

క. అం దొఱగి కీచకుం డా।
యిందీవరనయన నాత్మ నిడి వేడ్కమెయిన్
డెందము చన విచ్చలవిడిఁ।
గందర్పుఁడు వెట్టిఁ జేయఁగా నిట్లనియెన్. 288

ప్రతిపదార్థం: అందున్= దానిపై; ఒఱగి= వ్రాలి; కీచకుండు; ఆ+ఇందీవర నయనన్= కలువలవంటి కన్నులు గల సైరంధ్రిని; ఆత్మన్+ఇడి= మనస్సులో ఉంచుకొని; వేడ్క మెయిన్= వేడుకతో; డెందము= మనస్సు; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; చనన్= పోగా - ఊహలలో ఎగిరిపోతూ ఉంటే; కందర్పుఁడు= మన్మథుడు; వెట్టిన్+చేయఁగాన్= వెర్రివాడిని చేయగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ చంద్రకాంతశిలాతల్పంపై పరుండి కీచకు డా కలువలవంటి కన్నులు గల సైరంధ్రిని మనసులో నిలిపికొని, హృదయం ఆసక్తితో పరిపరివిధాల ఊహలలో తేలుతూ ఉండగా, మన్మథుడు అతడిని వెర్రివాడిని చేసి ఆడిస్తూ ఉంటే, ఇట్లా పలికాడు.

విశేషం: మనస్సు పరిపరివిధాలుగా పోవటం, మన్మథుడు వెర్రివాడిని చేయటం-అనే అంశాలు కీచకుడి ఉన్మత్తావస్థను సూచిస్తున్నాయి. "**తత్సంశ్రితాం కథాం యుంక్తే సర్వావస్థాగతాపి హి। పుంసః ప్రద్వేష్టి చాప్యన్యా నున్మాదః సంప్రకీర్తితః ॥ తిష్ఠ త్యనిమిషదృష్టి ర్దీర్ఘం నిఃశ్వసతి గచ్ఛతి ధ్యానమ్ । రోదితి విహారకాలే నాట్య మిదం స్యా త్తథోన్మాదే॥** (నా.శా. 12,185, 186). ఇది నాయికాపరంగా చెప్పిన లక్షణం. దీనిని ఇక్కడ పురుషపరంగా అన్వయించుకొనాలి. సర్వావస్థలలో నాయికాశ్రితమైన కథలనే ఎన్నుతూ, మిగిలినవాటిని ద్వేషించటం ఉన్మాద స్వభావం. కళ్ళార్పకుండా చూడటం, నిట్టూర్చటం, ఏదో ఏదో ఆలోచిస్తూ ఉండటం, విహార సమయంలో కూడా రోదించటం మొదలైనవి ఉన్మాద చేష్టలుగా భరతమహర్షి చెప్పాడు. ఆ అవస్థలోనే ఒక వస్తువును మరొక వస్తువుగా భావించటం

ఉన్మాద మన్నాడు రసార్ణవ సుధాకరకర్త సింగభూపాలుడు. తిక్కన ఈ అవస్థను కీచకపాత్రోచితంగా నిర్వహించటం ప్రకరణౌచిత్యం. (సంపా.)

సీ. 'కెంగేలుఁ గేలితోఁ గీలించి నెయ్యంపు।
మాటలఁ దగు మాఱుమాట లార్తుఁ
గుచము లురంబునఁ గుదియించి క్రమమున।
నిఱిసిన కౌఁగిట నింపొనర్తు,
నంగుళంబుల నల్ల నలకలఁ గబళించి।
కెమ్మోవి యాని యెక్కింతుఁ గాయ్వు,
మనము మనంబునఁ బెనఁచి కేళికిఁ జొచ్చి।
సతిఁ దేల్తు సౌఖ్యరసంపునిట్టఁ,

తే. దనివు మొదలైనఁ జిగురొత్తు తమకమునకుఁ।
బ్రాఁకు వెట్టుచు మగుడఁ బైఁబడుచు నింతి
వింత భంగుల కెలయించి వెకలిఁజేసి।
యభిమత క్రీడనములకు నలవరింతు.' 289

ప్రతిపదార్థం: కెంపు+కేలున్= ఆమె ఎర్రని చేతిని; కేలితోన్= (కీచకుడు) తన చేతితో; కీలించి= పట్టుకొని; నెయ్యము+మాటలన్= ప్రియమైన పలుకులతో; తగు మాఱుమాటలు+ఆర్తున్= తగిన మారుమాటలు పలికిస్తాను, చెప్పుతాను; కుచములు= స్తనములు; ఉరంబునన్= రొమ్మున; కుదియించి= గ్రుచ్చి; క్రమమునన్= క్రమంగా; ఇఱిసిన కౌఁగిటన్= బిగి కౌగిలిలో; ఇంపు+ఒనర్తున్= సౌఖ్యం కలిగిస్తాను; అంగుళంబులన్= వేళ్ళతో; అల్లన్= మెల్లగా; అలకలన్= ముంగురులను; కబళించి= పట్టుకొని; కెంపు+ మోవి= ఎర్రని పెదవిని; ఆని= త్రాగి; కాయ్వున్= కామాన్ని; ఎక్కింతున్= వ్యాపింప చేస్తాను; మనము= మనస్సు; మనంబునన్+ పెనఁచి= నా హృదయంతో పెనగజేసి; కేళికిన్+చొచ్చి= రతికేళికి ఉపక్రమించి; సౌఖ్యరసము+ నిట్టన్=

సంతోషరసప్రవాహంలో; సతిన్+తేల్తున్= ప్రియురాలిని అలరిస్తాను; తనివు= తృప్తి; మొదలైనన్= మొదలైతే; చిగురు+ఒత్తు= కలిగే; తమకమున కున్= మోహానికి; ప్రాఁకు+పెట్టుచున్= ఆశ్రయం కలిగిస్తూ; మగుడన్= మరల; పైన్+పడుచున్= ఆమెపై బడి కవ్విస్తూ; ఇంతిన్= సైరంధ్రిని; వింతభంగుల కున్= అపూర్వమైన పద్ధతులకు; ఎలయించి= ఉన్ముఖురాలిగా చేసి; వెకలిన్+ చేసి= వెర్రిగా నన్ను కోరేదాన్నిగా చేసి; అభిమతక్రీడనములకున్= ఇష్టమైన రతి వినోదాలకు; అలవరింతున్= అలవడేటట్లు చేస్తాను (నేర్పుతాను).

తాత్పర్యం: ఆమె లేత ఎర్రని చేతిని నా చేతితో పట్టుకొని వలపు మాటలాడి తగినట్లు ఆమెచేత కూడా పలికిస్తాను. ఆమె కుచాలను గుండెలకు హత్తుకొని బిగికౌగిట చేర్చి సంతోషం కలిగిస్తాను. ముంగురులను కొనవేళ్ళతో మెల్లగా సవరించి ఆమె పెదవిని ముద్దాడి కామాన్ని పెంపు చేస్తాను. నా మనస్సు ఆమె మనస్సుతో పెనవేసికొనేటట్లు చేసి రతికేళికి ఉపక్రమించి ఆమెను సౌఖ్యరస ప్రవాహంలో ఓలలాడిస్తాను. సంతృప్తి మొదలైతే మోహం చిగురెత్తుతుంది. దానికి పందిరి పెట్టినట్లు మరల మరల ఆమెపై పడుతూ అపూర్వమైన పద్ధతులకు ఆమె అలవాటుపడేటట్లు చేసి, నన్ను వదలలేని వెర్రిదానినిగా చేసి వశపరచుకొని నాకిష్టమైన రతిక్రీడలన్నీ ఆమెకు నేర్పుతాను.

విశేషం: మదనపరవశుడైన కీచకుడు ద్రౌపది చేజిక్కినట్లుగా భ్రమలో ఈ విధంగా భావిస్తున్నాడు. ఉన్మాదం అనే కామావస్థలో కామోన్మాదం అనే సంచారి భావం సలక్షణంగా ఈ పద్యంలో ఆవిష్కరించబడింది. ఇది తిక్కన మాటలలో భావరతి. (చూడు తరువాతి వచనం). (సంపా.)

వ. అనుచు వెండియు నిగుడు మనోరథంబులను, భావరతంబుల, శిశిరోపచారంబులఁ బ్రొద్దు గడపి (కడపి), కడగానక. 290

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; వెండియున్= మరల; నిగుడు= చెలరేగే; మనోరథంబులను= కోరికలతో; భావరతంబులన్= ఊహలలో సాగే,

మానసిక రతులతో; శిశిర+ ఉపచారంబులను= శైత్యోపచారాలతో; ప్రొద్దు+ కడపి, కడపి= కాలక్షేపం చేసి చేసి; కడ+కానక= ఎంతకూ ప్రొద్దుబోక.

తాత్పర్యం: అంటూ మళ్ళీ చిగురించే కోర్కెలతో, సంకల్పరతులతో, శైత్యోపచారాలతో కాలక్షేపం చేసి దానికి అంతం కనిపించక. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'మాయరవి యేల క్రుంకఁడొ।
కో?' యను, 'నిట్టేల తడసెనో?' యనుఁ; 'గ్రుంకం
బోయెడుఁ జూ యిప్పుడ' యను।
'దాయపటిచె' నను మనోజతాపము పేర్మిన్.' 291

ప్రతిపదార్థం: మనోజతాపముపేర్మిన్= మదనవేదన యొక్క ఆధిక్యం చేత; మాయరవి= కపటి అయిన సూర్యుడు; ఏలక్రుంకడొకో!= ఎందుకు అస్తమించడో; అనున్; ఇట్టు+ఏల తడసెనో?= ఇట్లా ఎందుకు ఆలస్యం చేశాడో?; అనున్; ఇప్పుడు+అ= ఇప్పుడే; క్రుంకన్+పోయెడున్+చూ!= అస్తమించబోతున్నాడు గదా!; అనున్; దాయ+పటిచెన్= పగవాడై బాధపెట్టాడు; అనున్= అంటాడు.

తాత్పర్యం: మదనతాపం ఎక్కువ కావటంతో కీచకుడు- 'ఈ దుర్మార్గుడైన సూర్యుడు ఇంకా ఎందుకు అస్తమించడో?' అంటాడు. 'ఇంత ఆలస్యం ఎందుకు చేశాడో?' అంటాడు. 'అదుగో! అస్తమించబోతున్నాడు' అంటాడు. 'పగవాడై బాధపెట్టుతున్నాడు' అంటాడు.

విశేషం: విప్రలంభంలోని ఉన్మాదావస్థలో - రాణించే మరొక అంశం- ఉపాలంభనం. ఇక్కడ ప్రొద్దుక్రుంకితే రతి ఫలిస్తుందని ఉన్మత్తుడై ఊహిస్తున్న కీచకుడికి ఎంతసేపటికి అస్తమించని ఆదిత్యుడి మీద ఆగ్రహం వచ్చింది. 'మాయరవి' అని ఉపాలంభించాడు. తదేకదృష్టితో సూర్యగతిని గమనిస్తూ ఉండటం చేత- ఎందుకు క్రుంకడు? ఆలస్యం ఎందుకు చేస్తున్నాడు? ఇక ఇప్పుడు క్రుంకు తాడులే!- ఇటువంటి సమయోచిత వాక్య చాపల్యాన్ని ప్రదర్శించాడు. (సంపా.)

తే. 'దినమ కాని యింక భువనంబులం దిట।
వట్టి రాత్రి లేని యట్టుగాఁగ
జేసెనొక్కొ విధి? విశేషించి నాకకా।
నేఁడ దినము సాఁగి నిలిచె నొక్కొ!' 292

ప్రతిపదార్థం: విధి= బ్రహ్మ; దినము+అ+కాని= పగలే కాని; ఇంకన్= ఇకపై; భువనంబు లందున్= ప్రపంచంలో; ఇట+వట్టి= ఇకమీద; రాత్రి లేని+అట్టు+కాఁగన్= రాత్రి లేనట్లుగా; చేసె నొక్కొ!= చేశాడేమో!; విశేషించి= అధికంగా; నాకున్+అకాన్= నా కొరకే; నేఁడు+అ= ఈ రోజే; దివము= పగలు; సాఁగి= పొడవై; నిలిచెన్+ఒక్కొ!= నిలిచి పోయిందేమో!

తాత్పర్యం: 'బ్రహ్మ పగలేకాని, లోకంలో రాత్రి అసలే లేకుండా చేశాడా? నా కొరకు మాత్రమే ఈనాడు, పగలు దీర్ఘమై సాగిందా?'

విశేషం: అలం: వ్యాజనింద. నిందచేత నింద స్ఫురించేటట్లు వ్యాజనింద, ప్రియా విరహం వలన దీర్ఘంగా తోస్తున్న పగటిని నెపంగా చేసికొని బ్రహ్మను రాత్రిలేని పగలును కల్పించినందుకు ఉపాలంభనం చేశాడు. ఇప్పుడు కీచకుడికి కావలసింది రాత్రి. అందువలన ఈ పరోక్ష సూర్యోపాలంభనం ప్రకరణౌచిత్యం. (సంపా.)

తే. అనుచుఁ గ్రుంకింపరానిప్రొ ద్దరసి యరసి.।
శిశిర పర్యంకమున మేను చేర్చి చేర్చి,
వంతఁ దలపోసి తలపోసి వనరి వనరి।
మిగుల వందురి వందురి, పొగిలి పొగిలి. 293

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; క్రుంకింపరాని= అస్తమించేటట్లు చేయలేని; ప్రొద్దు= సూర్యుడిని; అరసి+అరసి= చూచి చూచి; శిశిరపర్యంకము నన్= చల్లని పాన్పుపై; మేను= శరీరం; చేర్చిచేర్చి= చాలాసేపు చేరవేసి; వంతన్= దిగులుతో; తలపోసి, తలపోసి= మరీ మరీ ఆలోచించి; వనరి వనరి= మరీ

మరీ దుఃఖపడి; మిగులన్= ఎక్కువగా; వందురి వందురి= మరీ మరీ బాధపడి; పొగిలి పొగిలి= బాగా తపించి.

తాత్పర్యం: అని అంటూ, అస్తమింపచేయలేని ప్రొద్దును పదే పదే చూస్తూ, విరహతాపాన్ని చల్లార్చే పాన్పుపై శరీరాన్ని తేప తేపకూ చేరుస్తూ, వలపు దిగులుతో మరీ మరీ ఆలోచిస్తూ, దుఃఖపడుతూ, బాధపడుతూ, మిక్కిలి తపించాడు.

విశేషం: 1.అలం: వృత్త్యనుప్రాసం. ఇక్కడ అరసి అరసి, చేర్చి చేర్చి, వనరి వనరి, వందురి వందురి, పొగిలి పొగిలి అని ఆమ్రేడితంగా చెప్పడంలో కీచకుడి ఆవేదన లోని తీవ్రత వ్యక్తమవుతున్నది. 2. ఇందులో 'వ్యాధి' అనే మదనావస్థ వర్ణితం. 'కోరుకొన్న కలయిక సాధ్యం కాకపోవటంచేత కలిగే తాపం వ్యాధి' అవుతుంది. సంతాపం, నిశ్శ్వాసం, చల్లని వస్తువులను ఆశ్రయించటం, సేవించటం, జీవితాన్ని లెక్కచేయకపోవటం, మరణించాలన్న తలంపు, ధైర్యం కోలుపోవటం, ఒక్కసారి (విరుచుకొని) పడిపోవటం, అవయవాలు వదులుగా ఉండటం మున్నగునవి ఇందలి చేష్టలు అని సింగభూపాలుడు (రసార్ణవసుధాకరం II. 194-195- డాక్టర్ పి.యస్.ఆర్.అప్పారావుగారి 'సాత్త్వికాభినయం' నుండి పు. 449). (సంపా.)

సీ. తనికెడు నారటంబున నంతకంతకు।
వెమ్ముచు నునికికి విడుమరయును,
గోలు మసంగెడు కోర్కుల వెనువెంటఁ।
బాఱుచు నునికికి నూఱటయును,
వావిరిఁ బొదివెడు వగల సందడిఁబడి।
యురియుచు నునికికి నుడుకువయును,
నందంద కదిరెడు కొందలపాటుచేఁ।
దలఁకుచు నునికికి నిలుకడయును

ఆ. లేమిఁ దాల్మిగొనఁగలేక యలందురి।
తనువు నింద్రియములు మనము
ధృతియుఁ దనవశంబుగాక తల్లడపడి సింహ।
బలుఁడు విషమబాణుబారిఁ బాఱె. 294

ప్రతిపదార్థం: తనికెడు+ఆరటంబునన్= విస్తరించే ఆరాటంతో; అంతకున్+ అంతకున్= మాటిమాటికి; వెమ్మ్రుచున్= తాపం పొందుతూ; ఉనికికిన్= ఉండటానికి; విడు మరయును= విడుపున్నూ; కోలుమసంగెడు= మిక్కిలి అతిశయించే; కోర్కుల వెనువెంటన్= కోర్కెల వెంబడి; పాఱుచున్+ఉనికికిన్= పరుగెత్తుతుండటానికి; ఊఱట యును= ఊరడింపున్నూ; వావిరిన్= వరసగా; పొదివెడు= క్రమ్ముకొనే; వగలసందడిన్= చింతల అలజడిలో; పడి= చిక్కుకొని; ఉరియుచున్= తపిస్తూ; ఉనికికిన్= ఉండటానికి; ఉడుకువయును= విరామమున్నూ; అందు+అందు+అ= అప్పటికప్పుడే; కదిరెడు= కలిగే; కొందలపాటుచేన్= సంక్షోభంతో; తలఁకుచున్= భయపడుతూ; ఉనికికిన్= ఉండటానికి; నిలుకడయును= స్తిమితమున్నూ; లేమిన్= లేకపోవటం వలన (ఇది నాలుగు సీసపు పాదాలలోని చివరి క్రియలకూ అన్వయిస్తుంది); తాల్మికొనఁగలేక= ఓర్పు వహించలేక; అలందురి= శ్రమపడి; తనువు= శరీరం; ఇంద్రియములు= ఐదు ఇంద్రియాలు; మనము= మనస్సు; ధృతియున్= ధైర్యం; తవవశంబు+కాక= తనవల్లగాక; తల్లడము+పడి= కలతచెంది; సింహబలుఁడు= కీచకుడు; విషమబాణుబారిన్= మన్మథుడి బారినపడి; పాఱెన్= పోయాడు.

తాత్పర్యం: అంతకంతకు పెరిగే ఆరాటంతో తాపం పెచ్చుపెరుగుతూ ఉంటే దానికి విడుదల లేకపోవటం వలన, చెలరేగే కోర్కెల వెంట పరుగెత్తుతూ ఉంటే విరామం లేకపోవటం వలన, విరివిగా క్రమ్ముకొనే వలపు కోరికల సందడిలో పడి తపిస్తూ ఉంటే దానికి విశ్రాంతి లేకపోవటం వలన, అప్పటికప్పుడు పుట్టుకొని వచ్చే కలతపాటుతో భయపడుతూ ఉంటే, దానికి నిలుపుదల లేకపోవటం వలన సహనం చూపలేక, వ్యథపొంది, శరీరం,

ఇంద్రియాలూ, మనస్సూ, ధైర్యమూ తన వశం నుండి తప్పుకోగా సింహబలుడు తల్లడిల్లి మన్మథుడి బారినపడి పరుగులు తీశాడు.

విశేషం: 1. అలం: యథాసంఖ్యం. సీసపద్యపాదాలలోని వాక్యార్థాలకూ ఎత్తుగీతిలోని శబ్దాలకూ క్రమంగా అన్వయం కుదురుతుంది కాబట్టి యథాసంఖ్యాలంకారం. తాపానికి విడుదల లేకపోవటంతో శరీరం వశం తప్పింది. పరుగెత్తే కోర్కెలకు విరామం లేకపోవటంతో ఇంద్రియాలు వశం తప్పాయి. వలపు కోరికల సందడికి విశ్రాంతి లేకపోవటంతో మనస్సు వశం తప్పింది. కలతవలని భయం ఆగకపోవటంతో ధైర్యం వశం తప్పింది. ఈ నాలుగూ వశం తప్పటంతో సహనం కోల్పోయాడు. దానితో అయిదు బాణాల అనంగుడికి వశమైపోయాడు. అతడి వెంట పరుగెత్తసాగాడు. 2. వ్యాధి అనే మన్మథావస్థలో మన్మథతాపం వలన పడే బాధను వర్ణించటం పరాకాష్ఠ. ప్రియురాలి తోడి సమాగమం బాగా ఆలస్యం అవుతూ ఉండటంచేత కలిగే మన్మథ జ్వరం తాపమని విద్యానాథుడు ప్రతాపరుద్రీయంలో పేర్కొన్నాడు. ఆ తాపాన్ని నిగ్రహించుకోలేని స్థితి వలన శరీరాదులకు కలిగిన 'వ్యాధి' అవస్థను తిక్కన శాస్త్రోక్తంగా, ప్రకరణోచితంగా వర్ణించటం ప్రశంసనీయం. (సంపా.)

క. ఇమ్మెయిని నధిక పరితా।
పమ్మునఁ బడు సూతు హృదయపద్మం బలరం
దమ్మికొలంకులు మొగుడ, వ।
నమ్ములు సోలంగ దివసనాథుఁడు గ్రుంకెన్. 295

ప్రతిపదార్థం: ఈ మెయినిన్= ఈ విధంగా; అధిక పరితాపమ్మునన్+పడు= మిక్కిలి బాధపడే; సూతుహృదయపద్మంబు= సూతుడయిన కీచకుడి మనస్సు అనే పద్మం; అలరన్= విప్పారగా, సంతోషంగా; తమ్మి కొలంకులు= పద్మ సరోవరాలు; మొగుడన్= ముకుళించగా; వనమ్ములు= తోటలు; సోలంగన్= సొమ్మసిల్లగా; దివసనాథుఁడు= సూర్యుడు; క్రుంకెన్= అస్తమించాడు.

తాత్పర్యం: ఈ విధంగా మిక్కిలి మదనబాధ పొందే కీచకుడి మనస్సు సంతోషించగా, కమల సరోవరాలు ముకుళించగా, వనాలు సోలిపోగా సూర్యుడు అస్తమించాడు.

విశేషం: సూర్యాస్తమయానికి పద్మాలు ముకుళించాయి. వనాలు వన్నె తప్పాయి. కాని, కీచకుడి హృదయపద్మం మాత్రం వికసించింది. అంటే ఒక కార్యానికి బాధకమైనది మరొక కార్యానికి సాధకమైనదన్నమాట. ఇది వ్యాఘాతం. హృదయ పద్మం- రూపకం. సూర్యాస్తమయం కావటం కీచకుడి ప్రణయసిద్ధికి ప్రారంభంగా అనిపించినా చివర కది వ్యాఘాతానికి దారి తీయబోతున్నదని అలంకార ధ్వని. (సంపా.)

వ. తదనంతరంబ. 296

తాత్పర్యం: ఆ తరువాత.

సూర్యాస్తమయ వర్ణనము

(ఇది మూలమునందు లేదు)

క. ఇనుఁడు దనకడకు నేతెం।
చిన రాగముఁ బొందు టిది యుచిత మనఁగాఁ గెం
పున మెఱసి పశ్చిమాశాం।
గన జనసంభావనముల గౌరవ మందెన్. 297

ప్రతిపదార్థం: ఇనుఁడు= సూర్యుడు (ప్రియుడు); తన కడకున్= తనవద్దకు; ఏతెంచినన్= వచ్చినచో; రాగమున్= ప్రేమను (ఎఱ్ఱదనాన్ని); పొందుట+ఇది= పొందటమనేది; ఉచితము+అనఁగాన్= న్యాయమన్నట్లు; పశ్చిమ+ఆశా+ అంగన= పశ్చిమ దిక్కు అనే స్త్రీ; కెంపునన్ మెఱసి= ఎర్రదనంతో ప్రకాశించి; జనసంభావనముల= ప్రజల మన్ననల యొక్క; గౌరవము+అందెన్= గౌరవం పొందింది.

తాత్పర్యం: సూర్యుడు తనవద్దకు రాగా రాగం పొందటం (ఎర్రబడటం) అనేది న్యాయమే అన్నట్లు ఎర్రదనంతో వెలుగొందే పడమర దిక్కనే కాంత జనుల ప్రశంసలతో గౌరవం పొందింది.

విశేషం: 1. అలం: శ్లేష. ఉత్ప్రేక్ష, సమాసోక్తి, రూపకం. 2. ఇనుఁడు= (నానార్థాలు) సూర్యుడు, నాథుడు, రాజు; అంగన= వనిత, భార్య, రాగము+పొందుట= ఎర్రదనం వహించు, అనురాగం పొందుట; కెంపునన్= ఎర్రదనంతో, పద్మరాగమణితో; సంభావనములు= గౌరవాలు; నమస్సులు, ప్రశంసలు; గౌరవము= పెద్దరికం, మర్యాద, మన్నన. ఈ నానార్థస్ఫూర్తితో ఈ పద్యాన్ని అన్వయించవచ్చును. కాబట్టి శ్లేష. నాథుడైన సూర్యుడు కవయటానికి సమీపిస్తే పశ్చిమ దిక్కు అనే భార్య సహజంగా అనురాగాన్ని పొంది ఔచిత్యంతో శోభిల్లింది. అని లోకంలో ప్రజలంతా ఆమెను సంధ్యావందనాదులతో ప్రశంసిస్తూ ఉంటే - ఆమె గౌరవం పొందింది - అని అర్థమేర్పడి ఒక అనుకూలవతి యొక్క భర్తృ వాల్లభ్య గౌరవాన్ని భావించగలుగుతాం. ఈ అన్వయాన్నే - ఒక నాథుడికీ, భార్యకూ మధ్యా, ఒక రాజుకూ అభిసారికకూ మధ్య కూడా చేయవచ్చును. అందువలన శ్లేషాలంకారం. ఇందులో ప్రస్తుతాంశం వలన మరొక అప్రస్తుతాంశం స్ఫురిస్తున్నది కాబట్టి సమాసోక్తి. సూర్యుడు తన దరికి రాగానే పశ్చిమ దిశాంగన అనురాగం చెందిందేమో అన్నట్లు కెంజాయను వహించిందనటంలో ఉత్ప్రేక్ష. పశ్చిమాంగన అన్నప్పుడు రూపకం. 3. కవి ప్రకృతిని అలంకారికంగా వర్ణించటం ఒక యెత్తు; కావ్యంలోని ఒకపాత్రయొక్క చిత్తవృత్తి కనుగుణంగా సంభావనం చేయటం మరొక యెత్తు, తిక్కన చేసిన ఈ వర్ణనలో ఈ రెండెత్తులూ ఉండటం విశేషం. తత్కాల కీచక భావరతానికి అనుగుణమైన భావచిత్రం ఈ పద్యంలో అమరటం అలంకారశిల్పం. (సంపా.)

ఉ. చుక్కలు తోడుతోడఁ దలచూపఁదొడంగె, మనోభవుండు వి
ల్లెక్కిడి చక్రవాకముల యిక్కలు రోయఁగఁజొచ్చె, నేల కెం
పెక్కుచు వచ్చె; దీవియల యేడ్తెఱ సోయగ మందె; సందడుల్
దక్కెఁ బురంబు వీథుల, మదం బొలసెన్ విట చిత్తవృత్తులన్. 298

ప్రతిపదార్థం: చుక్కలు= నక్షత్రాలు; తోడుతోడన్= వెంటనే; తలచూపన్+ తొడంగెన్= కనిపించటం మొదలుపెట్టాయి; మనోభవుండు= మన్మథుడు; విల్లు+ఎక్కు+ఇడి= వింటిని ఎక్కుపెట్టి; చక్రవాకముల= చక్రవాక పక్షుల; ఇక్కలు= నివాసాలను; రోయఁగన్+చొచ్చెన్= వెదకసాగాడు; నేల= భూమి; కెంపు+ఎక్కుచున్ వచ్చెన్= ఎఱ్ఱబారసాగింది; దీవియల+ఏడ్తెఱ= దీపాల విజృంభణం; సోయగము+అందెన్= అందగించింది; సందడుల్= గొడవలు (శబ్దాలు); తక్కెన్= తగ్గాయి, పురంబు వీథులన్= నగర వీథులలో; విటచిత్తవృత్తులన్= విలాసకాండ్ర మనస్సులలో; మదంబు+ఒలసెన్= మద్యం సేవించటంవల్ల ఆనందం కలిగింది.

తాత్పర్యం: చుక్కలు ఒక్కొక్కటే మెరుస్తూ మొగాలు బైటపెడుతున్నాయి. మన్మథుడు విల్లు ఎక్కుపెట్టి చక్రవాకాలుండే చోట్లను వెదక నారంభించాడు. నేలంతా ఎరుపెక్కుతూ వచ్చింది. దీపాలకాంతి సోయగాన్ని సంతరించుకొన్నది. పురవీథులలో జనుల సందడి తగ్గింది. విటుల మనఃప్రవృత్తులలో మదభావం విరిసింది.

విశేషం: 1. అలం: స్వభావోక్తి, సూర్యు డస్తమించి చంద్రు డుదయించే లోపల ఉండే సంధ్యా సమయాన్ని సహజసుందరంగా, ధ్వని బంధురంగా తిక్కన వర్ణించాడు. చుక్కలు తోచటం, చక్రవాకాల జంటలు కళ్ళుకనపడక, దగ్గరున్నా విరహవేదన పడటం (అందుకే మన్మథుడు వాటిని బాణాలతో కొట్టుండాలి), సంధ్యారుణ కాంతితో భూమి ఎఱ్ఱబడటం (అంటే ఇంకా చీకటితో నల్లబడలేదని భావం), దీపాల సోయగం, పురవీథులు నిశ్శబ్దం కావటం, క్రమంగా విటులు మదించి విజృంభించటం - అనేవి ఆ సంధ్యాసమయంలో జరుగుతున్న పరిణామాన్ని క్రమంగా సూచిస్తూ తిక్కనప్రకృతిపరిశీలనప్రజ్ఞను ప్రకటిస్తున్నాయి. 2. ఇందులో విటుల మదభావం పేర్కొనబడింది. ఇది సంచారి భావం. మద్యం సేవించటం వలన కలిగేది మదమని భరతుడు; మద్యం వలన కలిగిన ఆనంద సమ్మోహాల మిశ్రమం మదమని సింగభూపాలుడు; మద్య సేవనం వలననేకాక ఐశ్వర్యం, విద్య, ఆభిజాత్యం, ఉత్తమ స్త్రీ పరిష్వంగ సంభోగాలు మొదలైన వాటివలన

కూడా ఏర్పడే భావం మదమని శారదాతనయుడు. ఇవి ఉత్తమ మధ్యమాధమ భేదాలతో మూడు రకాలు. తరుణ మదం (యౌవనం వలన ఏర్పడే మదం) ఉత్తమం; మధ్యమదం (మద్యం వలన ఏర్పడే మదం) మధ్యమం; అవకృష్టమదం (అల్పులమదం) అధమం అని భరత శాస్త్రం. కొన్ని మహాభారత ప్రతులలో 'మదంబు' అనే పాఠానికి బదులు 'ముదంబు' అనే పాఠం కనబడుతున్నది. 'మద'మనే పాఠమే సందర్భోచితం. విటులకు మదం సహజం కాని, ముదం కాదు. 3. ప్రకృతి వర్ణనాన్ని మానవ ప్రకృతి వ్యంజకంగా చేయటం తిక్కన నేర్పరితనం. కీచకుడు కూడా విటశేఖరుడు. అతడు వలపుమద్యం వలన మదభావాన్ని పొంది ఉన్నాడు. అతడు మనసులో కోరుకొనే సంధ్యాకాలం ఆతడి యెదుట ధ్వనిమయంగా తారసిల్లింది. మెరుస్తున్న క్రీగంటి చూపులు, కొనగోళ్ళు నక్షత్రాలుగా చెప్పటం కవిసమయం. అవి తలలెత్తి తోస్తున్నాయి. అట్లాగే చక్రవాకాల జంటలను వక్షోజాల జంటగానూ (వాటి మధ్య మన్మథ బాణం తాకేటట్లుగానూ) చెప్పుతారు. నేల (క్షేత్రం - భార్య - యోని) రాగరంజితం కావటం, దీపాల కాంతి వంటి నగల కాంతులు రంజిల్లటం, పురవీథులు - పురమంటే శరీరం, వీథులు అంటే కళామార్గాలు అలజడి లేకుండా అనుకూలంగా ఉండటం. ఇవన్నీ గమనిస్తే ఏ ఉత్తమ విటుడిలోనైనా తరుణమదం తురంగలిస్తుంది. కీచకుడి మనసులో శారదాతనయుడు చెప్పినట్లు ఉత్తమ స్త్రీ పరిష్వంగ సంభోగ భావజన్యమైన మదం ధ్వనిమయం. (సంపా.)

వ. పదంపడి జారచోరజనంబుల మనంబు లలరం జంద్రాస్తమయం బగుటయు. 299

ప్రతిపదార్థం: పదంపడి= తరువాత క్రమంగా; జారచోరజనంబుల= వ్యభిచారుల, దొంగల; మనంబుల= మనస్సులు; అలరన్= సంతోషించగా; చంద్ర+అస్తమయంబు+ అగుటయున్= చంద్రుడు క్రుంకగా.

తాత్పర్యం: వెంటనే జారచోరుల మనస్సులకు ఆహ్లాదం కలిగేటట్లు చంద్రుడు క్రుంకగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. పెనుమి ట్టిది పల్లం బిది।
యనకుండఁగ నోలమును బయలు నొక్కటిగాఁ
గనువిచ్చుటయును మోడ్చుట।
యును సరిగాఁ దమము పర్వె నుర్విం దోడ్తోన్. 300

ప్రతిపదార్థం: ఇది, పెనుమిట్టు= ఇది పెద్ద మిట్ట; ఇది పల్లంబు= ఇది గుంట; అనకుండఁగన్= అనటానికి వీలులేని విధంగా; ఓలమును= మరుగు ప్రదేశమూ; బయలున్= బయలూ; ఒక్కటిగాన్= ఒకేరకంగా; కనువిచ్చుటయును= వికసించటం; మోడ్చుటయును= ముడుచుకొనటం; సరి+కాన్= సమానం కాగా; ఉర్విన్= భూమిపై; తోడ్తోన్= వెంటవెంటనే; తమము= చీకటి; పర్వెన్= వ్యాపించింది.

తాత్పర్యం: ఇది ఎత్తు, ఇది పల్లం అని చెప్పలేనట్లుగా, లోపలా బయటా ఒకటే విధంగా, కళ్ళు తెరిచినా మూసినా ఒకటే విధంగా ఉండేటట్లు చీకటి క్రమంగా నేలను క్రమ్మేసింది.

భీమకీచకులు నర్తనశాలలోఁ గలసికొనుట (సం. 4-21-38)

వ. అప్పుడా కృశోదరి వృకోదరుకడకుం జని సమయం బయ్యె ననవుడు. 301

ప్రతిపదార్థం: ఆ కృశ+ఉదరి= చిక్కిన నడుము కలది (ఆ ద్రౌపది); వృక+ఉదరుకడకున్+చని= తోడేలు ఉదరంవంటి ఉదరం కలవాడు (తోడేలు ఆకలి కంటె ఆకలి గలవాడు) ఐన భీముడివద్దకు వెళ్ళి; సమయంబు+అయ్యెన్+అనవుడున్= సమయం అయిందని చెప్పగా.

తాత్పర్యం: అప్పుడు ద్రౌపది భీముడి వద్దకు వెళ్ళి సమయం అయిందని చెప్పగా.

తే. అతఁడు పెండ్లికిఁ బిలిచినయట్లు వికచ।
హృదయుఁడై తలచీర యాయితము సేసి

ద్రుపదనందనఁ జూచి 'నాతోన వెనుక।
నల్ల నంతంత నరుగుదె' మ్మని కడంగి. 302

ప్రతిపదార్థం: అతఁడు= భీముడు; పెండ్లికిన్+పిలిచిన+అట్లు= పెండ్లికి పిలిచినట్లు; వికచహృదయుఁడు+ఐ= వికసించిన మనస్సు కలవాడై; తలచీర= తలపాగా; ఆయితము+చేసి= సవరించుకొని; ద్రుపదనందనన్+చూచి= ద్రౌపదిని చూచి; నా తోన్+అ వెనుకన్= నా వెంట; అల్లన్+అంతన్+అంతన్= మెల్లగా దూరదూరంగా; అరుగు+తెమ్ము+అని= రమ్మని; కడంగి= పూని ముందుకు నడచి.

తాత్పర్యం: భీముడు పెళ్ళికి పిలిచినట్లు సంతోషించి, తలపాగా చుట్టుకొని ద్రౌపదిని తన వెనుక అనుసరిస్తూ కొంచెం దూరం దూరంగా మెల్లగా రమ్మని కోరి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: లోకోక్త్యలంకారం. పెళ్ళికి పిలిచినట్లు- అనేది జాతీయం. ఆనందంగా వెళ్ళటానికి సంకేతం. కీచకుడిని సంహరించటానికి భీము డెంత గాఢంగా ఉత్సాహపడుతున్నాడో ఒక్కసారి తన హృదయ వికాసం ప్రదర్శించటంలో ప్రకటితమౌతున్నది. 'తలచీర' అనేది ఆనాటి పురుషుల వస్త్రధారణను తెలియజేస్తున్నది. తలపాగాను చుట్టుకొనటం అలవాటు. 'చీర' అంటే కేవలం కోక అనే అర్థంలో కాక వస్త్రం అనే అర్థంలో తీసికొనాలి.

చ. గమనమువీఁక వేఱొక వికారము పుట్టక సంగరోత్సవో
ద్యమరభసాతిరేకము బయల్పడు టించుకలేక రోషసం
భ్రమ మొకయింతయైనఁ బరభావనిరూప్యముగాక ద్రౌపదీ
రమణుఁడు వోయె విక్రమధురంధరతం దగ నాట్యశాలకున్. 303

ప్రతిపదార్థం: గమనము వీఁకన్= పోవటంలోని ఉత్సాహంలో; వేఱొక వికారము= క్రొత్త మార్పు; పుట్టక= జనించక; సంగర+ఉత్సవ+ ఉద్యమరభస+

అతిరేకము= యుద్ధానికి పోయే పండుగ జరుపుకొనే ప్రయత్నం లోని వేగాధిక్యం; బయల్పడుట= బయటపడుట; ఇంచుకలేక= కొద్దిగా కూడా లేకుండా; రోషసంభ్రమము= కోపంతో కూడిన తొట్రుపాటు; ఒక ఇంత+ ఐనన్= కొంచెం కూడా; పరభావ నిరూప్యము+కాక= ఇతరుల మనస్సులచే తెలియదగినది గాక; ద్రౌపదీరమణుఁడు= భీముడు; విక్రమధురంధరతన్= పరాక్రమ నిర్వహణతో; నాట్యశాలకున్= నర్తనశాలకు; తగన్+పోయెన్= సముచితంగా వెళ్ళాడు.

తాత్పర్యం: ద్రౌపదీ రమణుడైన భీముడు తన నడకలో భేద మేమీ లేనట్లుగా, యుద్ధానికి పోయే ఉత్సాహం కొద్దిగా కూడా బయటపడకుండా, తన కోపావేశం బయటవారు తెలిసికొనలేకుండా గంభీర పరాక్రమమూర్తి వహించి నర్తనశాలకు వెళ్ళాడు.

విశేషం: ద్రౌపదీరమణుడనే విశేషణం భీముడి అంతరంగాన్ని ధ్వనిస్తున్నది. సరి అయిన కాలంలో శక్తిమంతంగా ప్రత్యర్థిని ఎదుర్కొనటానికి తగిన మానసిక సమాహిత సంకల్పాన్ని వికార విరహితమైన భీముడి గంభీర పరాక్రమమూర్తి వ్యక్తం చేస్తున్నది. అతడి మూర్తి తుఫానుకు ముందు కానవచ్చే ప్రకృతి ప్రశాంతతవలె కానవస్తున్నది.(సంపా.)

వ. చని వివేకరహితు హృదయంబునుం బోలెఁ దమోదూషితంబును, విదగ్ధ వనితా ప్రేమంబునుం బోలె దుర్నిరూపంబును, ఘోరాటవీ భాగంబునుం బోలె నిర్మనుష్యంబును, గాపురుష లక్ష్మీ విలాసంబునుం బోలె ననుపయోగ్యంబును, ననభ్యస్త శాస్త్రంబునుం బోలె దుర్గమంబును, స్వప్నలబ్ధపదార్థంబునుం బోలె నదృష్టి గోచరంబును, విషమ కావ్యంబునుం బోలె నస్పష్టాలంకారంబును, బాలిశు రాజ్యంబునుం బోలె జారచోర హృద్యంబునునైన యా నర్తనాగారంబు ముఖభాగ స్థలంబుసేరి. 304

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; వివేకరహితు హృదయంబునున్+పోలెన్= తెలివితక్కువ వాడి మనస్సువలె; తమస్(ః)+దూషితంబును= చీకటిచేత నిందించబడినదీ, (తమోగుణంచేత, అజ్ఞానం చేత చెడినదీ); విదగ్ధ వనితా ప్రేమంబునున్+పోలెన్= ప్రౌఢనాయిక ప్రేమవలె; దుర్ నిరూపంబును= తెలియరానిదీ; ఘోర+అటవీ భాగంబునున్+పోలెన్= భయం కరమైన అరణ్యంవలె; నిర్+మనుష్యంబును= మనుష్యులు లేనిదీ; కాపురుష లక్ష్మీ విలాసంబునున్+పోలెన్= నీచపురుషుడి సంపద యొక్క అతిశయంవలె; న+ ఉపయోగ్యం బునున్= ఉపయోగించటానికి వీలులేనిదీ; న+అభ్యస్తశాస్త్రంబు నున్+ పోలెన్= చదువబడని శాస్త్రంవలె; దుర్గమంబును= చొరబడరానిదీ; స్వప్నలబ్ధ పదార్థంబునున్+ పోలెన్= కలలో లభించిన వస్తువువలె; అదృష్టిగోచరంబును= కంటికి కనిపించనిదీ; విషమ కావ్యంబునున్+పోలెన్= కష్టమైన గ్రంథంవలె; అస్పష్ట+ అలంకారంబును= స్పష్టంగా తెలియని అలంకారాలు గలదీ; బాలిశురాజ్యంబును+ పోలెన్= మూర్ఖుడి రాజ్యంవలె; జారచోరహృద్యంబును= విటులకు, దొంగలకు ఇష్టమైనదీ; ఐన ఇనటువంటె; ఆ నర్తన+ అగారంబు= ఆ నాట్యశాలయొక్క; ముఖభాగస్థలంబు+చేరి= ముందరి ప్రదేశం చేరి.

తాత్పర్యం: తెలివితక్కువవాడి హృదయంవలె చీకటితో కలిషితమైనదీ, ప్రౌఢ నాయిక ప్రేమవలె నిరూపించలేనిదీ, భయంకరారణ్యంవలె మనుష్యులు లేనట్టిదీ, నీచపురుషుడి సంపద వలె ఉపయోగరహితమైనదీ, చదువబడని శాస్త్రం వలె చొరరానిదీ, కలలోని వస్తువు వలె కంటికి కనిపించనిదీ, కష్టమైన కావ్యంవలె అలంకారాలు స్పష్టం కానిదీ, దుష్టుడి రాజ్యం వలె జారులకూ, చోరులకూ సంతోషం కలిగించేదీ అయిన నర్తనశాల ముందరిభాగాన్ని చేరాడు.

విశేషం: 1. అలం: ఉపమ, శ్లేష. కన్ను పొడుచుకొన్నా కనబడని చీకటిలో నర్తనశాలను స్పష్టంగా చూచినట్లు వర్ణించటం సముచితం కాదు. కాని, ఆ ప్రదేశం ఒక మహాయుద్ధానికి రంగం కాబోతున్నది. అంతా చీకట్లో, ఆ భవనగర్భంలో జరుగబోతున్నది. అట్టి భవనాన్ని గురించి భౌతికంగా కాక భావనామయంగా వర్ణించి చెప్పటం ప్రకరణౌచిత్యం. భావనామయ చిత్రాన్ని ఆర్థీ ఉపమానాలతో

రూపుకట్టించటం, శ్లేషతో కూడిన సమానధార్మాలతో ఉపమేయోపమానాలను సమర్థించటం ఇందులో శిల్పం. ఉపమేయ, ఉపమాన ధర్మాలు వరుసగా ఇట్లా ఉంటాయి. తమము (చీకటి, తమోగుణం), దుర్నిరూపం (రూపం తెలిసికోలేనిది, ఇదమిత్థంగా తెలిసికొన లేనిది), నిర్మనుష్యం (మనుష్యులు సంచరించనిది, మనుష్యులు నివసించనిది), అనుపయోగ్యం (ఉపయోగించనిది; ఉపయోగానికి పనికిరానిది), దుర్గమంబు (వెళ్ళటానికి కష్టమైనది, దాటటానికి సాధ్యం కానిది), అదృష్టిగోచరంబు (కంటికి కనబడనిది, దృష్టిగోచరం కానిది. అస్పష్టాలంకారంబుఁ అర్థంకాని శబ్దార్థాలంకారాలు కలది, స్పష్టంగా కనబడని భవనాలంకారాలు కలది), జారచోరహృద్యంబు (జారులకు చోరులకు ఆకర్షణీయమైనది. జారులచేత చోరులచేత అందమైనది). 2. ఇటువంటి శైలి కాదంబరి, దశకుమార చరితంవంటి సంస్కృత కావ్యాలలో బాగా కనబడుతుంది. తిక్కన మిత్రుడు మూలఘటిక కేతన దండి దశకుమార చరిత్రను తెలుగుచేసి మిత్రుడికి అంకితమిచ్చాడు. తిక్కనకు కూడా దండి రచన మీద కొంత అభిమానం ఉండటంలో ఆశ్చర్యం లేదు. మొత్తానికి ఇది తిక్కన సహజశైలి కాదు. ప్రాచీన కవుల శైలులను కూడా యథావకాశంగా ప్రయోగించటం మహాకవిత్వ లక్షణాలలో ఒకటి. దానిని తిక్కన అక్కడక్కడ అద్భుతంగా, అయినా ఔచిత్యవంతంగా, నిర్వహిస్తాడు. అట్టి విశేషరచనకు ఇది ఒక ఉదాహరణం. (సంపా.)

క. కెలఁకులుఁ, బిఱింది దెసయుం, ।
గలయం బరికించి తన యఖండిత బాహా
బలగర్వమ యచ్చట ముం।
గలిగా మదమత్తభద్రగజసదృశగతిన్. 305

ప్రతిపదార్థం: కెలఁకులున్= పక్కప్రదేశాలూ; పిఱింది దెసయున్= వెనకదిక్కూ; కలయన్+పరికించి= చక్కగా చుట్టూ చూచి; తన= తనయొక్క (భీముడి యొక్క); అఖండిత బాహాబలగర్వము+అ= తక్కువకాని భుజబల సమృద్ధియే; అచ్చటన్= నర్తన శాలలో; ముంగలి+కాన్= ముందుకాగా; మదమత్తభద్రగజ సదృశగతిన్= మదించిన పట్టపు ఏనుగువలె నడుస్తూ,

తాత్పర్యం: భీముడు నర్తనశాల నాలుగు ప్రక్కల కలయ చూచి మొక్కవోని తన భుజబలమే సహాయంగా కలవాడై మదించిన పట్టపుటేనుగువలె నడుస్తూ వెళ్లాడు.

విశేషం: అలం: ఉపమ. భీముడి నడకను భద్రగజగమనంతో పోల్చడంతో జయం తథ్యమని సూచించటమైనది. నర్తనశాల ప్రవేశ ఘట్టాన్ని మూలాతిశయంగా తిక్కన చిత్రించాడు. మదంచేత మత్తిల్లిన భద్రగజంవలె నిస్సంకోచంగా లోపలికి ప్రవేశించాడట భీముడు! మదించినా భద్రతయందు శ్రద్ధ వహించిన వివేకం ప్రకటించా డతడు. అందువలననే నలుదిక్కులా కలయజూచి ఎవ్వరూ తనను చూడటం లేదని నిశ్చయించుకొన్నాడు. లోనికి ప్రవేశిస్తే తన బలమే తనకు రక్ష. ఏకైకవీరుడై విజృంభించాలి. ఆ సంగతిని తనలో తెలివికి తెచ్చుకొన్నాడు. వివేచనతో కూడుకొన్న విశిష్ట ప్రయత్నం విజయకారకం అనే ధైర్యంతో భద్రగజంవలె ముందుకు సాగాడు. (సంపా.)

శా. ధ్వాంతాకారితకుడ్యకుట్టిమ ఘనస్తంభావలీరూపముం,
భ్రాంతాది ప్రవిభాగ బోధ రహిత ప్రాగ్ద్వారముం, గాతర
స్వాంత త్రాసకరంబు నై, దురభివేశంబైన యా లోను ని
శ్చింతుండై సతికేలు వట్టికొని చొచ్చెన్ భీముఁ డత్యుగ్రతన్. 306

ప్రతిపదార్థం: ధ్వాంత+ఆకారిత= చీకటి రూపుకట్టినట్లుగా ఉన్న; కుడ్య= గోడలయొక్క; కుట్టిమ= నేలయొక్క; ఘనస్తంభ+ఆవలీ= పెద్ద స్తంభాల వరుస యొక్క; రూపమున్= రూపం కలదానినీ; ప్రాంత+ఆది= తుదిమొదళ్ళు, దగ్గరా దూరం మొదలైన; ప్రవిభాగ= భేదం యొక్క; బోధ రహిత= తెలివిడి లేని (తెలియని); ప్రాక్+ద్వారమున్= ముందరి (సింహ) ద్వారం కలదీ; కాతరస్వాంత= భయపడే మనస్సుకలవారికి; త్రాసకరంబున్+ఐ= భయం

కలిగించేదై; దురభివేశంబు+ఐన= చొరరానిదైన; ఆ లోను= ఆ నర్తనశాల లోపలి భాగంలో; నిశ్చింతుండు+ఐ= ఏ దిగులూ (ఏ అనుమానమూ) లేనివాడై; సతి కేలు= ద్రౌపది యొక్క చేయి; పట్టుకొని= అందికొని; భీముఁడు= అతి+ఉగ్రతన్= మిక్కిలి కోపంగా; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: చీకటి రూపుకట్టినట్లుగా మారిన గోడలూ, నేలపైభాగం, స్తంభాల వరుసా కల రూపంతో ఉన్నదానినీ, (భవనాంగాలను విడివిడిగా తెలిసికొనలేనంతగా చీకటిలో మునిగిపోయిన రూపం కలిగినదని భావం). తుది మొదళ్ళు విడమరచి తెలిసికొనలేని సింహద్వారం కలిగిందీ, (ముందు ద్వారం కూడా చీకట్లో స్పష్టంగా కనబడనిదీ అని భావం), పిరికివారి హృదయాలను చెదరగొట్టేదీ, చొరటానికి సాధ్యం కానిదీ అయిన నర్తనశాల లోపలిభాగంలోకి నిశ్చింతగా భీముడు భార్యచేయి పట్టుకొని అమితకోపంతో ప్రవేశించాడు.

విశేషం: ఈ వర్ణనం అమూలకం. ముఖద్వారం ద్వారా భీముడు నర్తనశాల లోపలిభాగంలోనికి ప్రవేశించే ఘట్ట మిది. ద్రౌపది చేయిపట్టుకొని మిక్కిలి భయం కలిగించే కోపభావంతో లోనికి ప్రవేశించాడు. లోపలంతా కటిక చీకటి. భవనాంగాలను, తుది మొదళ్ళను గుర్తించలేని చీకటి. పిరికివాళ్ళకు భయంకరంగా ఉండి చొరటానికి చొరనివ్వని చీకటి. తిక్కన ప్రకృతి వర్ణనను వాచ్యార్థ స్ఫూర్తికొరకు ఎంత వాడతాడో వ్యంగ్యార్థ దీప్తికొరకు అంత వాడతాడు. ఇందులో భావించదగిన అంశాలు-

1. వెనుకటి పద్యంలో మదమత్తగతి చెప్పబడింది. అది ఈ పద్యగతిలో చూపించబడింది. నర్తనశాల లోపలి భాగాన్ని నాలుగు సమాసాలతో వర్ణించాడు తిక్కన. ఉత్తరోత్తరాలు క్రమంగా చిన్నవైపోవటం విశేషం. అందులో కూడా ఒక క్రమవిన్యాసం కనపడుతుంది. అందులోకి భీముడు నిశ్చింతుడై ప్రవేశించి నడిచిన వైఖరిని 'ధ్వాంతాకారిత.. రూపమున్' అనే దీర్ఘసమాసం ధ్వనింపచేస్తున్నది. సింహద్వారాన్ని దాటుతున్న గతిలో సతి కేలువట్టి నడచినవైఖరి వ్యంజిత మౌతున్నది. పిరికివాళ్ళకు భయం కలిగించే చోటికి అతడు అత్యుగ్రతతో వెళ్లాడనీ,

దురభివేశమైన ఆ ప్రాంతంలో అవలీలగా ప్రవేశించాడనీ ధ్వని. నాలుగడుగులు వేయటం తెలుగు జాతీయం. భీముడు నాలుగడుగులు వేసినట్లు నాలుగు సమాసాలు. మొదట వేగంగా సాగి, క్రమంగా నెమ్మదిగా నడచిన వైఖరి భద్రతకు ప్రతీక. దీర్ఘాక్షర బహుళమైన పద్యగతి మందగతిని సూచిస్తూ నర్తనశాల వైశాల్యాన్ని కూడా ధ్వనింపజేస్తున్నది. కీచకుడు తప్పక వస్తాడనీ, అతడిని తప్పక జయిస్తాననీ నిశ్చయించిన భీముడు నిశ్చింతగా ముందుకు సాగాడనీ వ్యంగ్యం. 2. భీముడు విక్రమ గంభీరుడుగా నర్తనశాలవరకూ నిబ్బరంగా నడచి వచ్చాడు. ఇక చీకటింటిలో ప్రవేశించేటప్పుడు కార్యనిర్వహణకు తగిన 'అత్యుగ్రత' ను మనస్సులో నింపుకొన్నాడు. ఉగ్రత రౌద్రరస అనుభావం. రౌద్రం వలన శత్రుసంహారమే కార్యఫలం. నిశ్శబ్దమైన, భయంకరమైన అంధకారం మృత్యుసదృశ్యం. శత్రుసంహారరూపమైన కార్యం చీకటిలో ధ్వని. కీచకవధ అపూర్వంగా జరుగబోతున్నది. దాని నిర్వహణ భావనను భీముడికి అందించింది ఆ చీకటిరూపంగా తోచిన నర్తనశాలయే. ఇది గోడ, ఇది నేల, ఇవి స్తంభాలు అనే తేడా తెలియని ఆ వింత రూపం కీచకుడిని చంపటంలో అనుసరించవలసిన పద్ధతిని సూచించింది. వాడి కాళ్లూ, చేతులు, తల మొదలైనవాటిని అతడి శరీరంలో గ్రుచ్చి మహామాంసపిండం చేసి వింత చావు కల్పిస్తాడు. ఆ భావన ఈ మొదటి సమాసం స్ఫురింపచేసింది. ఇది మొదలు, ఇది తుద అని తెలియని ముఖద్వారం భీముడి వింత మల్లయుద్ధ వైఖరిని స్ఫురింపచేసింది. లోకభయంకరంగా, మరొకరు ఆ పద్ధతిలో యుద్ధం చేయలేరన్నట్లుగా గూఢంగా యుద్ధం చేయాలన్న అజ్ఞాతవ్రత దీక్షా స్పృహ చివర భీముడి మనస్సులో మెరిసింది. ఈ విధంగా చీకటిలో చీకటిగా తోచిన నర్తనశాల శత్రుసంభార విధాన సూచికగా భీముడి అంతరంగంలో స్ఫురించింది. ఇది తిక్కన వస్తురసధ్వని శిల్పం! (సంపా.)

వ. ఇట్లుసొచ్చి తతియంజని మధ్యప్రదేశంబున విరాటనందన లీలాపర్యంకం బరసి కని, దాని కనతిదూరంబునం బాంచాలి నోసరిల నునిచి, తా నా తల్పంబున నుండె; నంతం గీచకుండు. 307

ప్రతిపదార్థం: ఇట్లు+చొచ్చి= ఈవిధంగా ప్రవేశించి; తఱియన్+చని= లోపలికి వెళ్ళి; మధ్యప్రదేశంబునన్= నర్తనశాల నడిమిభాగంలో; విరాటనందన= ఉత్తరయొక్క; లీలాపర్యంకంబు= విలాసంగా పడుకొనే పాన్పును; అరసి కని= పరిశీలించి తెలిసికొని; దానికిన్+అనతి దూరంబునన్= దాని దగ్గరలో; పాంచాలిన్= ద్రౌపదిని; ఓసరిలన్+ఉనిచి= కనబడకుండా దాచి ఉంచి; తాను= భీముడు; ఆ తల్పంబునన్= ఆ పాన్పుపై; ఉండెన్= ఉన్నాడు; అంతన్= అప్పుడు; కీచకుడు.

తాత్పర్యం: భీము డా విధంగా ప్రవేశించి లోపలికి వెళ్ళి భవనంమధ్యలో ఉత్తర పవళించే మెత్తని పాన్పును పరిశీలించి, తెలిసికొని, దానికి సమీపాన ద్రౌపదిని కనబడకుండా దాచి వుంచి, ఆ పాన్పుపై కూర్చున్నాడు. అప్పుడు కీచకుడు.

విశేషం: లీలాపర్యంకం - విలాసశయ్య (మెత్తని పాన్పు). రాజకుమార్తె నాట్యాభ్యాసంలో అలసినప్పుడు విశ్రాంతి తీసికొనే మంచం. అది ఇప్పుడు లీలాపర్యంకం (విలాసశయ్య)గా పనికి వస్తుందని భీముడు ఆ స్థలాన్ని నిశ్చయించాడు. అది భవనమధ్యభాగంలో ఉన్నది కాబట్టి రహస్యం బాగా రక్షించబడుతుంది. ఈ రెండూ స్థలనిర్దేశంలో ముఖ్యమైన అంశాలు. (సంపా.)

క. కైసేసి మద వికారో।
ల్లాసంబున మేను వొంగ లఘుగతి నుత్కం
ఠాసవపానవిధాన।
వ్యాసంగతరంగితాంతరంగుం డగుచున్. 308

ప్రతిపదార్థం: కైసేసి= అలంకరించుకొని; మదవికార+ఉల్లాసంబునన్= మదభావం వలన కలిగిన వింత సంతోషంతో; మేను= శరీరం; పొంగన్= పొంగిపోగా; లఘుగతిన్= వేగంగా కొద్దిగా సేవించే పద్ధతిలో; ఉత్కంఠా= మదనోత్సాహం కొరకు; ఆసవ, పాన, విధాన వ్యాసంగ= మద్యాన్ని సేవించే పద్ధతిలోని ఆసక్తి చేత; తరంగిత+అంతరంగుండు= ఉప్పొంగుతున్న మనస్సు కలవాడు; అగుచున్= ఔతూ.

తాత్పర్యం: అలంకరించుకొని, మదభావంతో కలిగిన వింతగా శరీరం ఉప్పొంగుతూ ఉండగా; కొద్దిగా వేగంగా ఉత్కంఠాసవాన్ని (మదనోద్రేకానికి పనికి వచ్చే మద్యాన్ని) సేవించటం వలన కోర్కెతో తరగలెత్తిన మనస్సు కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఇందులోని మదభావం మద్యం వలన కలిగింది కాబట్టి కీచకుడు మధ్యమ ప్రవృత్తి కలవాడని ధ్వని. 'విధా+నవ్య+ఆసంగ= కొత్తదయిన మాలిని యొక్క సంగమము' అనే అర్థాన్ని జనహిత వ్యాఖ్య చెప్పింది. ఉత్కంఠా+ఆసవము= అనే సమాసాన్ని రూపకంగా శ్రీమున్నంగి శర్మ పరిష్కృత విరాటపర్వంలో చెప్పబడింది. (సంపా.)

శా. సింగంబున్న గుహా నికేతమునకున్ శీఘ్రంబునన్ వచ్చు మా
తంగంబుం బురుడించుచుం బవనపుత్ర స్వీకృతంబైన యా
రంగాగారము సేరవచ్చి మదిలో రాగంబు ఘూర్ణిల్ల నిం
తిం గాముం డిటఁ దేఁడె యింత కని యుద్వృత్తాంగజోన్మాదుఁడై. 309

ప్రతిపదార్థం: సింగంబు= సింహం; ఉన్న గుహానికేతమునకున్= ఉన్న గుహానివాసంలోనికి; శీఘ్రంబునన్= త్వరగా; వచ్చు= వచ్చే; మాతంగంబున్= ఏనుగును; పురుడించుచున్= పోలుతూ; పవనపుత్ర స్వీకృతంబు+ఐన= భీముడు గ్రహించిన; ఆ రంగ+అగారము= ఆ నర్తనశాల; చేరన్+వచ్చి= లోపలికివచ్చి; మదిలోన్= మనస్సులో; రాగంబు= వలపు; ఘూర్ణిల్లన్= తిరుగాడగా (వేగిరపెట్టగా); ఇంతకున్= ఇప్పటికే; ఇంతిన్= సైరంధ్రిని; కాముండు= మన్మథుడు; ఇఁటన్+తేఁడె= ఇక్కడకు తీసికొనిరాడా?; అని= అని భావించి; ఉత్+వృత్త+అంగజ+ఉన్మాదుఁడు+ఐ= విజృంభించిన (పైకెగిసిన) వలపుపిచ్చి కలవాడై.

తాత్పర్యం: సింహం ఉన్న గుహానివాసానికి వేగంగా వచ్చే ఏనుగును అనుకరిస్తూ భీముడు అధిష్ఠించి ఉన్న ఆ నర్తనశాలను సమీపించి కీచకుడు మనస్సులో వలపు సుడులు తిరుగుతూ నినదిస్తూ ఉండగా 'ఇప్పటికే మన్మథుడు ఆ కాంతను ఇక్కడికి తెచ్చి ఉంటాడులే' అని భావించి, ఒడలు తెలియక విజృంభించే వలపుపిచ్చి రెచ్చినవాడై.

విశేషం: అలం: ఉపమానం. సింహం నివసిస్తున్న కొండగుహకు ఏనుగు వేగంగా వెళ్ళినట్లు భీముడున్న నర్తనశాలకు కీచకుడు వెళ్ళాడు. చక్కని ఉపమానం. అట్లా వేగంగా వెళ్ళటానికిగల కారణం? సింహం ఉన్నదని తెలిసా? తెలియకా? తెలియకే వెళ్ళుతున్నాడు. అక్కడ మన్మథుడు తెచ్చి ఉంచిన వనిత ఉంటుందని వెళ్ళుతున్నాడు. వలపులు మదిలో సుళ్ళు తిరిగి రాగాలు తీస్తున్నాయి. వలపు పిచ్చి (మోహోన్మాదం) మనసులో ఉవ్వెత్తున లేస్తున్నది. అంటే ఉత్తమ వనితను పొందబోతున్నానన్న మదభావం, ఇదివరకే అతడిలో జాగృతమై పొంగులు వారుతున్న తరుణమదం, మద్యమదాలకు ఉత్పోషకంగా ఉన్నది. అందువలనే మూడంచెల ఉన్మాదం ముయ్యెత్తుగా ఎగసింది. అది ఉన్మత్తావస్థయొక్క పరాకాష్ఠ. దానివలన వనితాసంభోగవాంఛతో అతడు శాలలో ప్రవేశించాడు. పై ఉపమానం రాబోయే గండాన్ని సూచిస్తున్నది. సింహం బారిన ఏనుగు పడి మరణిస్తుందని అలంకార ధ్వని. ఇది పఠితలు మాత్రమే ఊహించగలరు. మరి సింహబలుడికి ఈ సంగతి తెలియదు. అది విధివిలాసం. అతడు మదనోన్మాదంతో వనిత మాటను నమ్మి నర్తనశాలలో ప్రవేశించాడు. కీచకుడిపరంగా అది విటుడు సంకేతస్థలానికి సానురాగంగా వెళ్ళుతున్న శృంగార రసస్థితిని తెలుపుతుంది. అది ధర్మవిరుద్ధమని పఠితలు భావించటంవలన అది రసాభాసమౌతుంది. అయినా, అతడు వంచనకు గురి ఔతున్నాడన్న భావం కూడా పఠితలకు కలుగుతుంది. కావున అతడివైపు వారి సానుభూతి కలుగుతుంది. సామాజికుల హృదయాలలో అలంకారశిల్పంతో భీముడితో సహానుభూతినీ, కామావస్థ చిత్రణంలో కీచకుడియందు సానుభూతినీ చిత్రించి విరుద్ధభావాల విశిష్టశబలతతో రసోల్లాసాన్ని కలిగించే రచనాశిల్ప మిది. (సంపా.)

ఉ. స్వాంతము బాహుగర్వఘనసంతమసాంధము గాఁగ శంక యొ
క్కంతయు లేక కీచకుఁ డహంకృతి ముంగలి గాఁగ మండపా
భ్యంతరభూమిఁ జొచ్చి తటియంజని యారసి సెజ్జఁ గాంచి య
త్యంత ముదావహం బగుడు నందు రయంబునఁ గేలు సాఁచినన్.310

ప్రతిపదార్థం: కీచకుఁడు= కీచకుడు; స్వాంతము= మనస్సు; బాహుగర్వ= భుజబల గర్వమనే; ఘనసంతమస+అంధము +కాఁగన్= చిమ్మచీకటివలన గ్రుడ్డిది కాగా; శంక+ ఒక్క+అంతయున్ లేక= అనుమానం కొద్దిగా కూడా లేకుండా; అహంకృతి= అహంకారం; ముంగలి+కాఁగన్= ముందు నడవగా; మండప+అభ్యంతరభూమిన్= నాట్యశాల లోపలిభాగంలో; చొచ్చి= ప్రవేశించి; తటియన్+చని= సంకేతస్థలాన్ని సమీపించి; ఆరసి= పరిశీలించి; సెజ్జన్+కాంచి= పాన్పును చూచి; అతి+అంత ముద్+ ఆవహంబు+ అగుడున్= మిక్కిలి సంతోషం కలిగించేది కావటం చేత; అందున్= అందులో; రయం బునన్= త్వరగా; కేలు= చేయి; చాఁచినన్= చాచగా.

తాత్పర్యం: తన మనస్సు బాహుబలమనే చిమ్మచీకటిలో గ్రుడ్డిదైపోగా రవంతకూడా అనుమానం లేకుండా కీచకుడు అహంకారమే ముందు నడవగా నర్తనశాల మండపంలోని అంతర్భాగానికివెళ్ళి, సంకేతంగా ఏర్పరచుకొన్న చోటును సమీపించి, పరిశీలించి శయ్యను చూచి, మిక్కిలి సంతోషం కలుగగా వెంటనే తన చేతిని ఆ శయ్యమీదకు పోనిచ్చాడు (చాచాడు).

విశేషం: అలం: రూపకం, కావ్యలింగం. 'స్వాంతము బాహుగర్వఘనసంతమసాంధము గాఁగన్' అన్న చోట రూపకం, కావ్యలింగం అలంకారాలుగా రాణిస్తున్నాయి. కీచకుడు నర్తనశాలలోకి ప్రవేశించిన తరువాత సైరంధ్రి వచ్చి ఉంటుందని నమ్మాడు. కాని, వచ్చింది సైరంధ్రియేనా అని తేల్చుకొనే ప్రయత్నం ముందుగా చేయలేదు. దానికి కారణం లేకపోలేదు. తాను వస్తే, వచ్చింది కీచకుడేనా అని ఆమె కూడా అడగలేదు. ఆమెకు తనమీద అంత నమ్మకం. అందువలన

తాను 'వచ్చింది నీవేనా?' అని చీకట్లో ఆమెను పలకరించి ధ్రువపరచుకొనలేదు. దీనికి అతడి బాహుబలగర్వమనే చీకటి కారణం. అందువలననే తనకు ఎదురయ్యే ప్రమాదాన్ని తెలిసికొనే వివేకం లేని గ్రుడ్డివాడయ్యాడు. తన అంతటివాడిని వలచి వచ్చిన మగువను గురించి భావించుకొంటూ తన గర్వమే మార్గదర్శిగా సాగిపోయి, సంకేతస్థలాన్ని గుర్తించి శయ్యను పసికట్టాడు. దానిపై ఆమె ఉన్న జాడలు లీలగా తోచాయి. మనస్సు సంతోషంతో పొంగిపోయింది. అప్పుడైనా పలకరించి ఎవరో తెలిసికొందామని అతడికి స్ఫురించలేదు. అతడి మనసు గ్రుడ్డిది కావటం చేత ఆమె కొరకు చేయి చాచాడు. (వస్తుజ్ఞానాన్ని చేతితో తెలిసికొనటం గ్రుడ్డివాడి లక్షణం) దీనికంతా కారణం బాహుగర్వఘన సంతసమత్వమే. ఇట్లా కీచకుడి చర్యలను సమర్థించటానికి తిక్కన కావ్యలింగాలంకారాన్ని ధ్వనిమయంగా వాడాడు. (సంపా.)

చ. ఘనతర కోప వేగమునఁ గంపమునొందు నిజాంగకంబులం
దనధృతి పెంపు సొం పచలితంబులఁ జేయ సమీరుకూర్మినం
దనుఁడు తదీయ చేష్టలును దద్వచనంబుల చొప్పు నేర్పడం
గను మతి నూరకుండె నవికార నిగూఢ నిజ ప్రకారుఁడై. 311

ప్రతిపదార్థం: ఘనతర= మిక్కిలి గొప్పదైన; కోపవేగమునన్= తీవ్రమైన కోపంతో, కంపమున్+ ఒందు= వణుకుతున్న; నిజ+అంగకంబులన్= తన అవయవాలను; తన ధృతి పెంపు సొంపు= తన ధైర్యగుణం యొక్క అతిశయ వైభవం; అచలితంబులన్= కదలనివాటివిగా; చేయన్= చేయగా; సమీరు కూర్మినందనుఁడు= వాయుదేవుడి ప్రియపుత్రుడు- భీముడు; తదీయచేష్టలను= అతడి చర్యలూ; తత్+వచనంబుల చొప్పున్= అతని మాటలతీరూ; ఏర్పడంగన్= తేటపడేటట్లు; కను మతిన్= చూద్దాములే అనే ఆలోచనతో; అవికార= వికారంలేని (ఎటువంటి కలతపాటు లేని); నిగూఢ నిజప్రకారుఁ డు+ఐ= కప్పబడిన తన పద్ధతి కలవాడై (లేదా రహస్యమైన తన పద్ధతి కలవాడై); ఊరక+ఉండెన్= ఊరకున్నాడు.

తాత్పర్యం: భీముడు తీవ్రమైన కోపంతో అదురుతున్న తన శరీర అవయవాలను ధైర్యశక్తి వైభవంతో చిక్కబట్టుకొని ఆ కీచకుడి చేష్టలను, మాటలతీరును పరికిద్దామని అనుకొని తన గుట్టు బయటపడకుండా (తన సహజమైన ఉద్ధత స్వభావాన్ని దాచుకొని) ఎటువంటి కోపతాపాలకు గురికాకుండా ఊరక ఉండిపోయాడు.

విశేషం: అంతటి భీముడు ఈ విధంగా తన పద్ధతి మార్చుకొని నడుచుకొనటం విచిత్రంగా ఉంటుంది. ఇందువలన ఉద్ధతుడైన భీముడు ధీరుడైనాడు. అతడిలో కోపం విజృంభించాలంటే కీచకుడు ద్రౌపది పట్ల పలికే పలుకులూ, చేసే చేష్టలూ అతడికి తెలియాలి. అవి క్రోధభావ విభావాలు కావాలి. అందుకై ఈ మౌనం. ఈ సౌమ్య నిర్వికార వర్తనం. (సంపా.)

ఆ. కీచకాధముండు కిమ్మీర వైరిపైఁ।
గేలు సాఁచి యా విశాలనయన
గాఁ దలంచి మేను గరుపాఱ నిట్లను।
మదన ఘూర్ణమాన హృదయుఁ డగుచు. 312

ప్రతిపదార్థం: కీచక+అధముండు= నీచుడైన కీచకుడు; కిమ్మీరవైరిపైన్= కిమ్మీరుడిని చంపిన భీముడిపై; కేలు+చాఁచి= చేయిసాచి; ఆ+విశాలనయన+ కాన్= ఆ వనిత (సైరంధ్రి)గా; తలఁచి= తలపోసి; మేను గఱుపారన్= శరీరం పులకించగా; మదన ఘూర్ణమాన హృదయుఁడు+అగుచున్= మన్మథభావాలతో కలయబారిన మనస్సుగలవాడౌతూ; ఇట్లు+అనున్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: కీచకుడు భీముడి శరీరంపై చేయి వేసి, మాలిని అనుకొని (స్పర్శను అనుభవించి) గగుర్పాటు చెందిన శరీరం కలవాడై, మన్మథభావాలు మనస్సులో ఉప్పతిల్లగా ఇట్లా అన్నాడు.

చ. 'వనిత! మనోహరంబులగు వస్తువులెల్లను వేడ్కనేటి నీ
కని నియమించి తెచ్చితిఁ బ్రియంబునఁ గైకొను; మెప్డు నంగనా

జనములు నన్నుఁజూచి మరు సాయకముల్ దమ చిత్తవృత్తు లేఁ
చినఁ గొనివచ్చి యిత్తురు విశిష్టధనంబులు నాకు లంచముల్. 313

సీ. నాదు రూపంబు మనంబునఁ జిక్కిన।
తరుణి ద క్కొరునేల సరకుసేయు?
నాదు లావణ్యంబునకు నిచ్చ మెచ్చిన।
యెలనాఁగ పైఁబడ కేల నిలుచు?
నా విలాసంబులు భావింపఁ బడసిన।
యింతి పుష్పాస్త్రుచే నెట్లు బ్రదుకు?
నా వివేకమున కానందింపఁ గనిన యం।
గన యెట్లు విరహాగ్నిఁ గ్రాఁగకుండు?

తే. మెఱయ నా యాడుమాటలు దెఱవపిండు।
నుల్లములకు నింపారెడు నురులు గావె?
యిట్లు నీ వొక్కతవె నన్ను నేలుకొంటి।
గాక మాట లింకేటికిఁ గమలవదన!' 314

ప్రతిపదార్థం: కమలవదన!= పద్మం వంటి ముఖం గల ఓ వనితా!; నాదు రూపంబు= నా సౌందర్యం; మనంబున్+చిక్కినన్= మనస్సులో లగ్నమైన; తరుణి= స్త్రీ; తక్కు+ఒరునిన్= మరొకరిని; ఏల= ఎందుకు; సరకుసేయున్?= లెక్కపెట్టుతుంది?; నాదు లావణ్యంబునకున్= నా మేని నిగనిగలకు; ఇచ్చన్+మెచ్చిన= మదిలో మెచ్చుకొన్న; ఎలనాఁగ= స్త్రీ; పైన్+పడక+ఏల నిలుచున్?= పైన వచ్చి పడకుండా ఎట్లా నిలువ గలుగు తుంది?; నా విలాసంబులు= నా శృంగారపు హొయలును గురించి; భావింపన్+ పడసిన= ఆలోచించే అదృష్టం పొందిన; ఇంతి= స్త్రీ; పుష్ప+అస్త్రుచేన్= మన్మథునిచేత; ఎట్లు బ్రదుకున్?= ఎట్లా బ్రదుకుతుంది?; నా వివేకమునకున్= నా తెలివి తేటలకు; ఆనందింపన్+కనిన= సంతోషించగలిగిన; అంగన= స్త్రీ; విరహ+ అగ్నిన్= విరహమనే నిప్పులో; ఎట్లు+క్రాఁగక+ఉండున్?= వేగకుండా ఎట్లా ఉండగలుగుతుంది?; మెఱయన్= ప్రకాశించగా; నా+ఆడు మాటలు= నేను మాట్లాడే మాటలు; తెఱవపిండు= స్త్రీ సమూహం యొక్క; ఉల్లములకున్= మనస్సులకు; ఇంపారెడు= ప్రీతి కలిగించే; ఉరులు కావె= ఉచ్చులు (బంధాలు) కావా?; ఇట్లు= ఈ విధంగా; నీవు+ఒక్కతవె= నీవు ఒక్కదానివే; నన్నున్= (కీచకుడిని); ఏలుకొంటి(వి)గాక!= ఏలుకొన్నావు సుమా!; మాటలు+ఇంకన్+ ఏటికిన్= ఇక ఇంతకంటె మాటలు ఎందుకు? (ఇక మీద మాటలతో కాలక్షేపం చేయటం ఎందుకు? (రతికి ఉపక్రమిద్దామని భావం).

తాత్పర్యం: నా సౌందర్యం చూచిన స్త్రీ నన్ను తప్ప మరొకరిని ఎందుకు లెక్కిస్తుంది? నా లావణ్యాన్ని చూచిన అంగన నాపైన పడిపోకుండా ఎట్లా ఉండగలదు? నా విలాసాలను చూచిన స్త్రీ మదనబాణాలకు గురి అయి ఎట్లా బతుకగలదు? నా తెలివితేటలు చూచి ఆనందించిన స్త్రీ విరహాగ్నిలో పడి వేగిపోకుండా ఎట్లా ఉండగలదు? నా మాటలు మగువల మనసులకు అందమైన గాలాలు! ఈ విధంగా నేనింతవరకూ వనితలనందరినీ ఆకర్షిస్తూ ఉన్నాను. కాని, ఇప్పుడు నీ వొక్కతెవే నన్ను ఆకర్షించి ఏలుకొన్నావు. ఇంతకంటె నేను ఇంక ఏమి చెప్పేది?' (అయినా ఇంకా మాటలతో పనేమిటి? చేతల కుపక్రమిద్దాం).

విశేషం: 1. కీచకుడి రూప, లావణ్య, విలాస, వివేక, సంభాషణలను చూచిన వనితలు వరుసగా ఇతరులను సరకుచేయరు. ఇతరులను మెచ్చుకోరు. ఇతరులను భావించరు. ఇతరుల వివేకానికి ఆనందించరు. కాగా, కీచకుడికే చిక్కుతారు. అతడినే కోరుతారు. అతడు దొరకకపోతే మన్మథబాణాలకు గురియై, చనిపోవాలను కొంటారు; మదనాగ్నిలో పడి మ్రగ్గిపోతారు. అతడి మాటలు ఇంపైన ఉరులు. అతడు దొరికితే ఇంపునిస్తాయి. దొరకకపోతే చంపుతాయి. ఇవన్నీ వనితలను

తన సౌందర్య విలాసాలతో ఏలుకొనే పద్ధతులని కీచకుడు ఆత్మస్తుతి చేసికొన్నాడు. 2. అంతగా వనితలను ఏలుకొన్న నన్ను ఏలుకొన్నదానవు నీవు-అని సైరంధ్రిని ప్రశంసించాడు. కీచకుడు. ఇవి ప్రియురాలిని ప్రసన్నురాలిని చేసికొనటానికి పలికే ప్రశంసోక్తులు. 3. 'మాటలింకేటికి కమలవదన!' అనే మాటలకు రెండు రకాల అర్థాలున్నాయి. ఇంతకంటె అతిశయోక్తులు ఎందుకని ఒక అర్థం. ఇంక మాట లెందుకు చేతలకు ఉపక్రమిద్దామని మరొక అర్థం. ఈ రెండవ అర్థాన్ని కూడా భావించి భీముడు ఉలిక్కిపడి ఉంటాడు. ఇక మాటలు తానే సాగించాడు చేతలకు ఊతలుగా. (సంపా.)

క. అనవుడు మనమున నిస్సీ!
యని, యుచిత నిగూఢభంగు లగు భాషణముల్
తన ప్రియ వినిపించుట కి।
ట్లనియెన్ మృదురీతి భీముఁ డాతనితోడన్. 315

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా విని; భీముఁడు; మనమునన్= మనస్సులో; ఇస్సీ! అని= ఛీ! అనుకొని; ఉచిత= తగిన; నిగూఢ భంగులగు= రహస్య పద్ధతులలో; భాషణముల్= మాటలు; తన ప్రియన్= తన భార్య అయిన ద్రౌపదికి; వినిపించుటకున్= వినిపించటానికి; మృదురీతిన్= (స్త్రీవలె) కోమల మైన పద్ధతిలో; ఆతనితోడన్= కీచకుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.
తాత్పర్యం: ఆ మాటలు విని భీముడు మనస్సున ఛీత్కరించుకొని, అప్పటికి తగినట్లుగా తన రహస్య పద్ధతికి అనువైన మాటలను తన ప్రియభార్య అయిన ద్రౌపదికి వినిపించేటట్లు సంతోషపెట్టాలని తలచి, (స్త్రీవలె) కోమలంగా కీచకుడితో ఇట్లా అన్నాడు.

తే. 'ఇట్టివాఁడవు గావున నీవు నిన్నుఁ।
బొగడికొనఁదగు; నకట! నా పోల్కి యాఁడు

దాని వెదకియు నెయ్యెడనైన నీకుఁ।
బడయవచ్చునె యెఱుఁగక పలికితిట్లు. 316

ప్రతిపదార్థం: ఇట్టివాఁడవు కావునన్= ఇటువంటివాడివి కాబట్టి; నీవు (కీచకుడు); నిన్నున్= నిన్నే; పొగడికొనన్+తగున్= పొగడుకొనటం సబబే; అకట!= ఔరా!; నా పోల్కి= నన్ను పోలిన; ఆఁడుదానిన్= స్త్రీని; వెదకియున్= వెదకినా కూడా; ఏ+ఎడన్+ ఐనన్= ఎక్కడైనా; నీకున్+పడయవచ్చునె?= నీవు పొందగలవా?; ఎఱుఁగక= తెలియక; ఇట్లు పలికితి(వి)= ఇట్లా మాట్లాడావు.

తాత్పర్యం: 'ఇటువంటివాడివి కాబట్టి నిన్ను నీవే పొగడుకొనటం సమంజసమే. నావంటి స్త్రీ ఎక్కడ వెదకినా నీకు దొరకదు. తెలియక నీవు ఇట్లా మాట్లాడావు.

విశేషం: 1. అలం: వ్యాజోక్తి. ఇందులో మొదటి వాక్యం కాకువు వలన ఏర్పడే అధిక్షేపోక్తి. అందులోనూ వ్యాజోక్తి. పైకి స్తుతి చేస్తున్నట్లుగా ఉన్నా కాకువులో స్ఫురించేది నింద. ఇట్టివాడివి అన్నప్పుడు వ్యతిరేకధ్వని స్ఫురిస్తుంది. ఇంతటి అధికుడవని ప్రశంస, ఇంతటి అధముడవని నింద. ఆత్మప్రశంస ఉద్ధతుల లక్షణం. ఉదాత్తుల స్వభావం కాదని అధిక్షేపం. 2. అలం: వ్యతిరేకం. ఈ పద్యంలోని రెండవ వాక్యం హాస్యోక్తి. తనంతటివాడు లేడని చెప్పుకొన్న కీచకుడికి ప్రతిసమాధానం. 'నా పోల్కి ఆడుది' అనునప్పుడు ఉపమానం కంటె ఉపమేయం అధికంగా చెప్పే వ్యతిరేకాలంకార స్ఫూర్తి ఉన్నది. భీముడు సైరంధ్రి స్థానంలో కూర్చొని ఆడుదాని గొంతుతో మాట్లాడుతున్నాడు- ఇప్పటి 'మిమిక్రీ' (ధ్వన్యనుకరణం) వలె, చీకటిలో చూడలేక భీముడినే వలచినదానిగా భావించాడు కీచకుడు. అందువలన నావంటి వింతస్త్రీ నీ కెక్కడా దొరకదని హాస్యోక్తి. 'ఎఱుఁగక పలికి తిట్లు' అనే మాట జాతీయం. అమాయకంగా మాట్లాడావనీ. నా సంగతి తెలియక మాట్లాడావనీ అర్థాలు ఏర్పడతాయి. ఇదీ హాస్యోక్తియే. 3. ఈ అధిక్షేప హాస్యోక్తులు భీముడి పౌరుష ప్రవృత్తికి భిన్నంగా ఉండి వికృతిని స్ఫురింప చేస్తాయి. కాబట్టి ద్రౌపదికీ, పఠితలకూ హాస్యాన్ని కలిగిస్తాయి. ఈ హాస్యం శృంగార

సంబంధమైన లలిత హాస్యం కాదు. శత్రువు మీద విసిరే అధిక్షేపరూప గంభీర హాస్యం. (Grim humour) ఈ హాస్యం ఒక్కసారి విరుచుకపడబోతున్న భీముడి రౌద్రాగ్నికి ధూమశిఖ వంటిది. (సంపా.)

క. నా యొడలు సేర్చినప్పుడ।
నీ యొడలెట్లగునొ? దాని నీవెఱిఁగెదు; న
న్నే యబలలతోడిదిగాఁ।
జేయఁదలంచితివి తప్పు సేసితి కంటే! 317

ప్రతిపదార్థం: నా ఒడలు+చేర్చిన+అప్పుడు+అ= నా శరీరంతో నీ శరీరం దగ్గర చేస్తే; నీ ఒడలు= నీ శరీరం; ఎట్లు+అగునొ?= ఎట్లా ఔతుందో; దానిన్= దానిని; నీవు+ఎఱిఁగెదు(వు)= నీవు తెలిసికొంటావు; నన్నున్+ఏ+అబలల తోడిదిగాన్= నన్ను మిగిలిన ఏ స్త్రీలతో సమానంగా; చేయన్+తలంచితివి= చేయాలనుకొన్నావో; తప్పు+చేసితి(వి)= తప్పుచేశావు; కంటే= చూచావా? (తెలుగులో తెలిసిందా? చూడు! అనే హెచ్చరికలకు సమానార్థకం).

తాత్పర్యం: నా శరీరంతో నీ శరీరం తగిలినప్పుడే నీ శరీరం ఏమవుతుందో అది నీవే తెలిసికొంటావు. నన్ను మిగిలిన సామాన్య స్త్రీలతో సమానంగా చేయదలచుకొన్నావో, తప్పు చేసినట్లే సుమా!

విశేషం: 1. ఇది శ్లేషగర్భితమైన వ్యంగ్యోక్తి. 'మాట లింకేటికిఁ గమలవదన!' అని 335వ పద్యంలో మదనకార్యోత్సాహాన్ని వ్యంగ్యంగా ప్రదర్శించిన కీచకుడి వాక్యానికి దీటుగా ప్రౌఢంగా భీముడు చెప్పిన మాట లివి. తెలుగు పలుకుబడుల వింత పోకడలు శృంగార రౌద్ర రసానుగుణంగా, శ్లేషమయంగా, వ్యంగ్యంగా ప్రయోగించే నేర్పు ఈ రచనలో రాణించింది. 'నా ఒడలు చేర్చునప్పుడు.' అనే వాక్యానికి నా శరీరంతో నీ శరీరం సంగమించేటప్పుడు-అని శృంగారపరమైన అర్థం. నా శరీరంతో ద్వంద్వయుద్ధం కొరకు నీ శరీరం తలపడ్డప్పుడు-అని రౌద్రరసపరమైన అర్థం. ఇది అర్థశ్లేష 2. 'నన్ను ఏ వనితల వంటిదానినిగానో భావించావా! తప్పు చేసిన వాడివే ఔతావు సుమా!' అన్నది వ్యంగ్యోక్తి (satire). నేను ఇతర సామాన్య

వనితలవంటి దానను కాను. నీవు అట్లా భావిస్తే పొరపాటుపడ్డట్లే. ఈ వాక్యంలో తాను అసామాన్య వనిత నన్నట్లు ప్రకృతార్థం. కాని, నేను ఆడుదనం లేని ఆడుదానిని. ఆడుదానిగా అభినయిస్తున్న పురుషుడిని. నన్ను స్త్రీగా భావించి అందరి స్త్రీలవలెనే భోగింపదలచుకొంటే నీవు పొరపాటుపడ్డట్లే. అది పొరపాటు కాదు పరదారాగమన దోషం కూడా! దానికి తగిన ఫలం అనుభవిస్తావు-అని ఎత్తిపొడుస్తూ అన్నమాట! 3. మొదటి వాక్యం రౌద్రగర్భితం: రెండవ వాక్యం శృంగార జల్పితం. రెండూ వెరసి ఈ పద్యం గంభీర హాస్యరస వ్యంజకం. ఇక్కడ స్త్రీకి పర్యాయంగా అబలా శబ్దం కావడం గమనించదగింది.నన్ను బలం లేని స్త్రీనిగా ఎంచుతున్నావేమో, నేను సబలుడైన పురుషుడిని సుమా! అనడం కూడా ధ్వనితం. (సంపా.)

క. నను ముట్టి నీవు వెండియు।
వనితల సంగతికిఁ బోవువాఁ డవె? యైనం
దను వేఁ బడసిన ఫలమే?।
కనియెద విదె చిత్తభవవికారము లెల్లన్.' 318

ప్రతిపదార్థం: నీవు (కీచకుడు); ననున్+ముట్టి= నన్ను తాకి; వెండియున్= మళ్ళీ; వనితల సంగతికిన్= స్త్రీల పొందుకు; పోవువాఁడవె?= పోగలవా? (పోలేవు); ఐనన్= ఐనా; తనువు= శరీరం; ఏన్= నేను; పడసిన ఫలమే?= పొందిన ఫలమే?; ఇదె= ఇప్పుడే; చిత్తభవవికారములు+ఎల్లన్= మన్మథుని వికారాలన్నీ (మనసులో కలిగిన భావాలన్నీ); కనియెదవు= చూస్తావు.

తాత్పర్యం: నన్నొకసారి ముట్టుకొన్న తరువాత మరింక ఆడువారి పొందుకు నీవు పోగలవా? మరింక ఏ ఆడువారి ముచ్చటలోనూ ఆసక్తిని చూపబోవు. (నీవు మరే స్త్రీలనూ కోరబోవు అని ఒక అర్థం. ఆడువారి పొందుకు పోలేని స్థితిని (చావును) పొందుతావని గూఢార్థం). కాగా, నే నీ శరీరాన్ని పడసిన (పుట్టినందుకు) ఫలమూ, నీ మనసులో కలిగే మన్మథ భావాల ఫలమూ ఇప్పుడే చూడగలవు (అనుభవించగలవు).

విశేషం: ఈ పద్యంలో శ్లేషానుప్రాణితమైన చమత్కారోక్తి గంభీర హాస్య వ్యంజకంగా నిబంధించబడింది. పద్యంలోని కొన్ని పదాలకు శ్లేషార్థాలివి. ముట్టి= తాకి, ఎదుర్కొని, ఆక్రమించి; వనితల సంగతి= స్త్రీలను గురించి మాట్లాడటం, స్త్రీల కథల ప్రస్తావనలు, స్త్రీల తోడి స్నేహం; పొందు, సంగమం; చిత్తభవ వికారములు= మన్మథ వికారాలు, మనసులో పుట్టిన భావాలు; కనియెదవు= చూస్తావు, అనుభవిస్తావు; తనువు పడసిన ఫలం= జన్మ ఎత్తిన దానికి ఫలం, ఈ (స్త్రీగా నటించే) రూపం తాల్చినందుకు ఫలం నిన్ను చంపకపోతే నేను శరీరం ధరించినందుకు ఫలమేముంది-అని భావం; ఇదే= ఇప్పుడే, ఇదిగో చూడు అని కార్యోన్ముఖుడు అయ్యే చర్యను సూచించే పదం.

శ్లేష తాత్పర్యం: నన్ను తాకి (ఎదుర్కొని) నీవు మళ్ళీ ఆడవాళ్ళ పొత్తుకు పోతావా? (నీవు-చనిపోతావు), అట్లా అయితే నేనీ శరీరాన్ని ధరించిన ఫలాన్నే నీవు నీ మనసులో పుట్టిన భావాల ఫలంగా పొందగలుగుతావు. (భీముడు పుట్టినందుకు ఫలం శత్రు సంహారం; కీచకుడి మనస్సులో కలిగిన పరసతీసమాగమ వికారాలకు ఫలం మరణం). (సంపా.)

మ. అనుచున్ గ్రక్కున లేచి రోషకఠినం బౌ హాస మా సూతు నె
మ్మన ముద్వేగముఁ బొందఁజేయ బలసామగ్రీసముజ్జృంభణం
బున వానిం దలపట్టి వంచుటయు నేపుం జేవయుం దోఁప వాఁ
డనుమానింపక బె ట్టదల్చికొని కోపాటోపదీప్తాంగుఁడై. 319

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; గ్రక్కునన్ లేచి= తటాలున లేచి; రోషకఠినంబు+ఔ= కోపంచేత భయంకరమైన; హాసము= నవ్వు; ఆ సూతు నెఱ+మనము= ఆ కీచకుడి నిండుమనస్సును; ఉద్వేగమున్+పొందన్+చేయన్= కలతపడేటట్లు చేయగా; బలసామగ్రీసముజ్జృంభణంబునన్= సమగ్రమైన బలాన్ని విజృంభింపజేసి; వానిన్= కీచకుడిని; తల+పట్టి వంచుటయున్= తలపట్టి వంచగా; ఏపున్= గర్వం; చేవయున్= బలమున్నూ;

తోఁపన్= తెలిసేటట్లు; వాఁడు= కీచకుడు; అనుమానింపక= వెనుకాడక, శంకించక; బెట్టు= గట్టిగా; అదల్చికొని= విడిపించుకొని; కోప+ఆటోపదీప్త+అంగుఁడు+ఐ= కోపంయొక్క తీవ్రత వలన మండిపడే శరీరం కలవాడై.

తాత్పర్యం: ఇట్లా అంటూనే తటాలున లేచి భీముడు కీచకుడి మనస్సు కలత చెందేటట్లు అట్టహాసం చేసి, తన భుజబలంచేత అతడి తలపట్టి వంచగా కీచకుడు బలపరాక్రమాలను కూడగట్టుకొని వెనుకాడకుండా గట్టిగా విడిపించుకొని తీవ్రమైన కోపంతో మండిపడుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇది కీచకుడు ఊహించని పరిస్థితి. తలపట్టి వంచటంలో ఏదో ఘోరం జరగబోతున్నదనే అనుమానం కలిగింది. మదనవికారం గాలికి పోయింది. తన భుజ పరాక్రమంతో విజృంభించిన కోపం దాల్చాడు.

భీమసేనుఁడు కీచకుని సంహరించుట (సం.4-21-50)

వ. గంధర్వుం డను తలంపున. 320

తాత్పర్యం: గంధర్వుడనే ఆలోచనతో.

చ. పవనతనూజు బాహువులు పాణియుగంబునఁ బట్టి వీఁకమై
నవనిపయిం బడం దిగిచి యంగము జానుల నూఁదినం గడున్
జవమున దండ తాడిత భుజంగము భంగి సముత్థితాంగుఁడై
యవయవముల్ ప్రకోపరభసాతిశయంబునఁ బొంగ నుద్ధతిన్. 321

ప్రతిపదార్థం: పవన తనూజు బాహువులు= వాయు తనయుడైన భీముడి యొక్క భుజాలు; పాణియుగంబునన్+పట్టి= రెండు చేతులతో పట్టుకొని; వీఁకమైన్= పరాక్రమంతో; అవనిపయిన్= నేలమీద; పడన్+తిగిచి= లాగి పడవేసి; అంగము= భీముడి శరీరం; జానులన్= మోకాళ్ళతో; ఊఁదినన్= అదమగా; కడున్+జవమునన్= అధికశక్తితో; దండతాడిత= కర్రతో కొట్టబడిన; భుజంగముభంగిన్= పామువలె; సముత్థిత+అంగుఁడు+ఐ= ఎగసిన శరీరం

కలవాడై; ఉద్ధతిన్= గర్వంతో; అవయవముల్= అవయవాలు; ప్రకోపరభస+ అతిశయంబునన్+పొంగన్= అధికమైన కోపవేగంతో ఉప్పొంగగా;

తాత్పర్యం: కీచకుడు భీముడి భుజాలను తన చేతులతో పట్టి బలిమితో లాగి నేలమీద పడవేసి అతడి శరీరాన్ని తన మోకాళ్ళతో అదుమగా, భీముడు కర్రదెబ్బతిన్న పామువలె చప్పున లేచి అధికమైన కోప సంరంభంవలన ఉప్పొంగిన సర్వశరీరావయవాలతో విజృంభించి గర్వంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ. మల్లయుద్ధంలోని భంగిమలను (పట్లు) మనోనేత్రాలకు చలనచిత్రంవలె గోచరించేటట్లు చేసిన వర్ణన మిది. భీముడు కీచకుడి తలపట్టి లాగి వంచాడు. అట్లా వంగిన కీచకుడికి భీముడి బాహువులు దగ్గరగా అందుతాయి. అందువలన కీచకుడు కూర్చున్న భీముడిని భుజాలు పట్టి బలంగా త్రోసి నేలమీదకు నెట్టి క్రింద పడవేసి, నడుముమీద మోకాళ్ళు పెట్టి అదిమాడు. ఇది కుస్తీలో మరొక పట్టు. అట్లా అదిమినప్పుడు నడుంమీద కర్రతో కొట్టితే తలతో తోకతో ఒక్కసారి విజృంభించి బుసకొట్టి ఎగిరే పామువలె భీముడు ఆ పట్టును అవలీలగా త్రోసి పైకి లేచాడు. భీముడికి కోపం రావాలంటే శత్రువు బలంగా అతడిని ఎదుర్కొనాలి. దానినిబట్టి అతడు శత్రువు బలాన్ని ఊహించి ప్రతిక్రియ మొదలుపెట్టుతాడు. ప్రస్తుతం కీచకుడి దెబ్బకు భీముడి ఒడలంతా కోపాతిశయంతో ఉప్పొంగిపోయింది; గర్వం తలయెత్తింది. చర్య ప్రతిచర్యతోపాటు భావావస్థల పరిణామాన్ని కూడా చిత్రించటంతో యుద్ధం చైతన్యవంతంగా ఉంటుంది తిక్కన రచనలో. (సంపా.)

మ. మగుడం గీచకుఁ బట్ట వాఁడును బలోన్మాదంబునన్ బాహు గ
ర్వ గరిష్ఠుండగు నా హిడింబరిపుఁ దీవ్రక్రోధుఁడై పట్టి బె
ట్టుగఁ ద్రోపాడఁగ నిద్దఱున్ భుజబలాటోపంబుమై నొండొరున్
మిగులం జాలక కొంతసేపు వడి మేమేఁ బోరి రుగ్రాకృతిన్. 322

ప్రతిపదార్థం: మగుడన్= మళ్ళీ; కీచకున్+పట్టన్= కీచకుడిని పట్టుకోగా; వాఁడును= కీచకుడుకూడా; బల+ఉన్మాదంబునన్= పరాక్రమ గర్వంతో; బాహుగర్వగరిష్ఠుండు+ అగు= భుజబలగర్వంతో గొప్పవాడైన; ఆ హిడింబ రిపున్= ఆ భీముడిని (హిడింబుడి శత్రువును); తీవ్రక్రోధుఁడు+ఐపట్టి= అధిక కోపంతో పట్టుకొని; బెట్టుగన్= మిక్కిలి; త్రోపాడఁగన్= తోయగా; ఇద్దఱున్= భీమకీచకులు; భుజబల+ఆటోపంబుమైన్= భుజాల బలం యొక్క ఆడంబరంతో; ఒండొరున్= ఒకరిని ఒకరు; మిగులన్+చాలక= మించిపోలేక; వడిన్= వేగంతో; మేమేన్= అనాయాసంగా; ఉగ్ర+ఆకృతిన్= భయంకరమైన ఆకారాలతో; కొంతసేపు= కొంచెంసేపు; పోరిరి= పోరాడారు.

తాత్పర్యం: భీముడు మరల కీచకుడిని బాహువులతో ఒకపట్టుపట్టాడు. బలోన్మాదంతో కూడిన ఆ కీచకుడు కూడా బాహుగర్వంగల వీరుల్లో శ్రేష్ఠుడైన భీముడిని తీవ్రమైన కోపంతో పట్టి గట్టిగా త్రోసినాడు. ఈ విధంగా వాళ్ల భుజబలాధిక్యంలో ఒకరినొకరు మించజాలక భయంకర స్వరూపులై త్రోపులాడుతూ అనాయాసంగా కొంతసేపు పోరాడినారు.

విశేషం: మల్లయుద్ధంలో వీరులు బాహువులలో పరస్పరం శరీరాలను బిగియబట్టి కలియబడుతూ పరస్పర భుజబలాలను ప్రదర్శించటం సర్వసామాన్యం. మేమే - మేమెయి - అనాయాసంగా (సూ.ని.) భుజబలంతో ఇద్దరూ సమానస్థాయిలో ఉన్నారు. కాబట్టి పోరు అనాయాసంగానూ, భయంకరంగానూ సాగింది. సమయుద్ధం సాగిన ఘట్టమిది. (సంపా.)

వ. అట్టియెడ. 323

తాత్పర్యం: ఆ సమయంలో.

క. తన యగపా టొరు లెఱుఁగుదు।
రని సూతుఁడు సమయభంగ మగుటకు భీముం
డును గొంకుచుఁ జప్పుడు సే।
యని గూఢ విమర్దనప్రహారములఁ దగన్. 324

ప్రతిపదార్థం: తన+అగపాటు= అక్కడి తన ఉనికి; ఒరులు= ఇతరులు; ఎఱుఁగుదురు+అని= తెలిసికొంటారని; సూతుఁడున్= కీచకుడూ; సమయ భంగము+అగుటకున్= అజ్ఞాతవాసం చెడిపోతుందని; భీముండును; కొంకుచున్= జంకుతూ; చప్పుడు+చేయని= శబ్దం కాని; గూఢవిమర్దన ప్రహారములన్= రహస్యంగా పొడిచే పిడికిటి పోట్ల దెబ్బలతో; తగన్= ఒప్పునట్లుగా.

తాత్పర్యం: ఆ సమయంలో తాను అటువంటి చోట ఉన్నానని ఇతరులు తెలిసికొంటారేమోనని కీచకుడూ, అజ్ఞాతవాస ప్రతిజ్ఞకు భంగం కలుతుందేమోనని భీముడూ లోలోన జంకుతూనే చప్పుడుకాని పిడికిటిపోట్ల దెబ్బలతో ఇద్దరికీ తగినట్లు (పోరసాగారు). (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: ఇది మల్లయుద్ధంలో మూడవ పద్ధతి. ఇందులో ఇద్దరూ పిడికిళ్ళ పోట్లతో ద్వంద్వయుద్ధం సాగించారు. అయితే ఇద్దరికీ కారణాలు వేరైనా భయం ఒకటే ఉంది. ఒకరిది పరువునష్టం కలిగే భయం. మరొకరిది వ్రతభంగభయం. ఇట్లా ఇద్దరికీ ఉపయోగపడిన ఒక భయం వర్ణించబడింది.

వ. మల్లయుద్ధ నైపుణ్యంబు మెఱయం గడంగి. 325

తాత్పర్యం: కుస్తీపట్ల పోరులో నేర్పరితనం ప్రదర్శించాలని పూనుకొని.

సీ. తిగిచిన నడుగులు దెరలక యొండొరుఁ।
గ్రమ్మఱఁ దిగుచుచుఁ గడిమి మెఱయఁ,
బొడిచిన వెస బీఱుపోవక యొండొరు।
నందంద పొడుచుచు నవనిఁ బెట్టి,
యొత్తిన బెగ్గలం బొందక యొండొరు।
బలువిడి నొత్తుచు నలవు మిగిలి,
యడఁగఁగంగఁ బొదివిన నడిచిపా టించుక।
యును లేక వీఁక నొండొరుల నడరి,

తే. యడఁగఁ బొదువుచు, నలుక యంతంత కగ్గ।
లించి యాయముల్ నొంచి దోర్లీల నెఱపి
యుల్లసిల్లిన స్రుక్క కొండొరుల రౌద్ర।
వృత్తి నొంచు చొండొరులకు వెక్కసముగ. 326

ప్రతిపదార్థం: తిగిచినన్= ఒకరి నొకరు లాగుకొనగా; అడుగులు తెరలక= పదాలు కదలక; ఒండొరున్= ఒకరి నొకరు; కడిమి మెఱయన్= పరాక్రమం ప్రకాశించగా; క్రమ్మఱన్+తిగుచుచున్= మళ్ళీ లాగుతూ; పొడిచినన్= పిడికిలితో కుమ్మగా; వెసన్= వేగంగా; బీఱు+పోవక= వెనుకంజ వేయకుండా; ఒండొరున్= ఒకరినొకరు; అందు+ అంద= అనేక చోట్లలో; పొడుచుచున్= గుద్దులాడుతూ; అవనిన్+పెట్టి= నేలమీద పడవేసి; ఒత్తినన్= అదిమినప్పటికీ; బెగ్గలంబు= భయంతోడి తత్తరపాటు; ఒందక= పొందకుడా; ఒండొరున్= ఒకరికొకరు; బలువు+ఇడిన్= పరాక్రమంతో; ఒత్తుచున్= అదుముతూ; అలవు మిగిలి= కోపం హెచ్చై; అడగంగన్+పొదివినన్= లోబడేటట్లు పట్టుకోగా; అడిచిపాటు= లొంగిపోవటం; ఇంచుకయును లేక= కొంచెం కూడా లేకుండా; వీఁకన్= పరాక్రమంతో ఒండొరులన్+అడరి= ఒకరినొకరు అతిశయించి; అడఁగన్+పొదువుచున్= లోబరచుకొనేటట్లు పట్టుకొని; అలుక= కోపం; అంతకున్+అంతకున్= క్రమక్రమంగా; అగ్గలించి= అధికమై; అయముల్+నొంచి= మర్మస్థానాలు నొప్పించి; దోస్+లీల, నెఱపి= భుజశక్తి ప్రదర్శించి; ఉల్లసిల్లినన్= ప్రకాశించగా; స్రుక్కక= వెనుదీయక; ఒండొరులు+అ= ఒకరి నొకరే; రౌద్రవృత్తిన్= రౌద్రరసప్రవృత్తులతో; నొంచుచున్= బాధిస్తూ; ఒండు+ఒరులకున్= ఒకరికొకరికి; వెక్కసముగన్= సహింపరానట్లుగా (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఒకరిని ఒకరు లాగగా అడుగులు కదలకుండా గట్టిగా నిలబడుతున్నా నేర్పుమీద పరస్పరం లాగుతూ ఉండేవారు; ఒకరిని ఒకరు గడుసుగా పిడికిళ్ళతో పొడిచినా వెనుకాడక పరస్పరం అవే చోట్ల తిరిగి

పొడుచుకొంటూ ఉండేవారు; ఒకరిని మరొకరు నేలమీద పడవేసి గట్టిగా ఒత్తినా భయపడక ఒకరినొకరు బలప్రయోగంతో ఒత్తుతూ ఉండేవారు; కోపం పెరిగి ఒకరి నొకరు లోబడేటట్లు క్రమ్మి పట్టుకొన్నా లొంగుబాటు ఏమాత్రం లేకుండా పౌరుషంతో ఒకరినొకరు అణచుకొనటానికి యత్నించేవారు. కోపం అంతకంతకూ పెరుగుతూ ఉండగా విజృంభించి ఆయువు పట్టులను బాధించి భుజబలాన్ని ప్రదర్శించి పొంగిపోయేవారు; ఎన్ని విధాలైనా ఒకరి కొకరు తగ్గేవారు కాదు. ఒక్కొక్కరిలో ఆయా సమయాలలో కలిగే రౌద్రరస మనఃప్రవృత్తులచేత ఇరువురూ ఒకరికి మరొకరు అసాధ్యులై పోరేవారు.

విశేషం: అలం: స్వభావోక్తి.

క. **కదియుచుఁ బాయుచుఁ బట్టుచు।**
నదలుచుచుం బడుచు లేచు చడఁగుచు వడిగొం
చొదవెడుకినుకం గడు బె।
ట్టిదముగఁ బెనఁగిరి చలంబు డింపక కడిమిన్. **327**

ప్రతిపదార్థం: కదియుచున్= సమీపిస్తూ; పాయుచున్= తొలగుతూ; పట్టుచున్= పట్టుకొంటూ; అదలుచుచున్= అదిలించుకొంటూ; పడుచున్+ లేచుచున్= పడుతూ లేస్తూ; అడఁగుచున్= లోబడుతూ; వడి+కొంచున్= వేగాన్ని చూపుతూ; ఒదవెడు కినుకన్= కలిగే కోపంతో; కడుబెట్టిదముగన్= మిక్కిలి భయంకరముగా; కడిమిన్= బలంతో; చలంబు డింపక= పట్టుదల వదలకుండా; పెనఁగిరి= పోరాడారు.

తాత్పర్యం: దగ్గరికి వస్తూ, దూరం పోతూ, పట్టుతూ, వదలుతూ, భయపెట్టుతూ, అదలిస్తూ, పడుతూ, లేస్తూ, తగ్గుతూ, వేగంగా విజృంభిస్తూ, పెరిగే కోపంతో పట్టుదలలు వీడకుండా పరాక్రమంతో మిక్కిలి భయంకరంగా పోరాడారు.

విశేషం: అలం: స్వభావోక్తి. తెలుగు పదాల పోహళింపుతో కుస్తీపట్ల మెలకువ లన్నిటినీ దేశీయంగా వర్ణించాడు తిక్కన. శబ్దాల సహాయంతో పిడిగుద్దుల సవ్వడిని

మన చెవులకు వినిపించేటట్లు చేశాడు. పద్యం చదివే తీరులో చదివితే మల్లయుద్ధంవలెనే ఉంటుంది.

ఆ. **ఇవ్విధమున నేచి యిరువురుఁ బెద్దయుఁ।**
బ్రొద్దు పోర వాయుపుత్రు బలము
దోడుతోడఁబెరుఁగఁదొడఁగె నాకీచకా।
ధమునిలావు పిదపఁ దఱుఁగఁజొచ్చె. **328**

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ రకంగా; ఏచి= విజృంభించి; ఇరువురున్= భీమ కీచకులు; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; పోరన్= యుద్ధం చేయగా; వాయుపుత్రు బలము= భీముడిశక్తి; తోడుతోడన్= అంతకంతకు; పెరుఁగన్+తొడఁగెన్= అధికం కాసాగింది; ఆ కీచక+అధముని లావు= ఆ నీచుడైన కీచకుడి శక్తి; పిదపన్= పిమ్మట; తరుఁగన్+చొచ్చెన్= తగ్గిపోసాగింది.

తాత్పర్యం: ఈ విధంగా పరాక్రమంతో ఒకరితో నొకరు చాలాసేపు పోరాడగా భీముడి భుజశక్తి క్రమంగా పెరుగసాగింది. ఆ నీచుడైన కీచకుడి శక్తి క్రమంగా తగ్గసాగింది.

ఉ. **దాని నెఱింగి యెంతయు నుదగ్రత నా బకవైరి గ్రక్కునన్**
వాని నడంగఁబట్టి పడవైచి మహోగ్రత నాక్రమించెఁ బం
చానన మేణముం బొదువున, ట్లతఁ డూర్జితశక్తి నుద్భటుం
డై నెగసెన్ సమీరసుతు నల్కకుఁ బ్రాఁ కిడినట్లు వీఁకతోన్. **329**

ప్రతిపదార్థం: దానిన్+ఎఱింగి= అది తెలిసికొని; ఎంతయున్= ఎంతో; ఉదగ్రతన్= కోపంతో; ఆ బకవైరి= ఆ (బకాసురుడి శత్రువు) భీముడు; గ్రక్కునన్= వెంటనే; వానిన్= కీచకుడిని; అడంగన్+పట్టి= అణిగేటట్లు పట్టుకొని; పడన్+వైచి= పడద్రోచి; మహా+ ఉగ్రతన్= మిక్కిలి పరాక్రమంతో; పంచాననము= సింహం; ఏణమున్= జింకను; పొదువు+అట్లు= పట్టుకొన్నట్లు; ఆక్రమించెన్= పట్టుకొన్నాడు; అట్లు= ఆవిధంగా; సమీరసుతు= భీముని

యొక్క; అల్కకున్= కోపానికి; వీఁకతోన్= పరాక్రమంతో; ప్రాఁకు+ఇడినట్లు= ప్రాకటానికి ఆధారాన్ని అందించినట్లు; అతఁడు= కీచకుడు; ఊర్జిత శక్తిన్= మిక్కిలిబలంతో; ఉద్భటుఁడు+ఐ= పరాక్రమవంతుడై; ఎగసెన్= పైకి ఎగిరాడు.

తాత్పర్యం: కీచకుడు బలహీనపడటం తెలిసికొని భీముడు సింహం జింకమీద పడి వెంటనే దానిని నేలమీద పడవేసి భయంకరంగా దానిని మొత్తం ఎట్లా ఆక్రమిస్తుందో అట్లా పరాక్రమంతో పొదివి పట్టాడు. భీముడి కోపలతకు ప్రాకు పెట్టినట్లుగా కీచకుడు తన శక్తినంతా పెంచి పరాక్రమాన్ని ప్రదర్శించి పెనగి పైకి లేచాడు.

విశేషం: అలం: ఉపమ. బలాబలాలను సూచించేవి సింహం జింకల ఉపమానాలు. కీచకుడు పట్టుతప్పించుకొని పైకి లేవటం భీముడి కోపానికి ఆధార స్తంభాన్ని నిలిపినట్లైనది. కోపాన్ని లతగా రూపించి ధ్వనిమయం చేశాడు తిక్కన.

క. నెగయునెడ నగ్గమైనను।
బిగియారుచుఁ బిఱుఁదుసనినఁ బిడికిటఁ గొఱసం
దిగడు బెడిదముగఁ బొడిచెం।
బగతుఁడు గను మిడిసి నేలఁబడి తన్నికొనన్. 330

ప్రతిపదార్థం: నెగయు+ఎడన్= పైకిలేచేటప్పుడు; అగ్గమైనను= లోబడినప్పటికీ; బిగి+ఆరుచున్= బిగువు కలవాడై; పిఱుఁదు+చనినన్= వెనుకకు పోగా; పగతుఁడు= శత్రువైన కీచకుడు; కనుమిడిసి= కనుగ్రుడ్లు బయటకివచ్చి; నేలన్+పడి= నేలమీదపడి; తన్నికొనన్= తన్నుకొనేటట్లు; పిడికిటన్= పిడికిలితో; కొఱసంది= ఆయువు పట్టును; కడుబెడిదముగన్= మిక్కిలి కఠినంగా; పొడిచెన్= పొడిచాడు.

తాత్పర్యం: కీచకుడు పైకెగసినప్పుడు లోబడినా కూడా, ఆ లోపల బిగువుగలవాడై వెనకకుబోయి తప్పించుకొనచూచినా భీముడు మిక్కిలి కోపంతో పిడికిలి పట్టి అతడి ఆయువుపట్టులో దారుణంగా పొడిచాడు. అంతటితో కీచకుడు కనుగ్రుడ్లు బయటికి వచ్చి నేలమీదపడి తన్నుకొన్నాడు.

ఆ. పల్లవ ప్రసూన ఫలభరితంబగు।
వ్రాను గూలఁద్రోచు మత్తగజము
పోలె వివిధ రత్నభూషణభూషితుం।
డైన సూతుఁ గూల్చె ననిలసుతుఁడు. 331

ప్రతిపదార్థం: పల్లవ ప్రసూన ఫలభరితంబు+అగు= చిగుళ్ళు, పూలు, పండ్లతో నిండి నదైన; వ్రాను= చెట్టు; కూలన్+త్రోచు= కూలత్రోసే; మత్తగజము పోలెన్= మదించిన ఏనుగువలె; వివిధ రత్న, భూషణ భూషితుండు+ఐన= అనేక రత్నాభరణాలతో అలం కరించబడినవాడైన; సూతున్= కీచకుడిని; అనిలసుతుఁడు= భీముడు; కూల్చెన్= పడ గొట్టాడు.

తాత్పర్యం: పల్లవపుష్పఫలభరితమైన వృక్షాన్ని అవలీలగా మదపుటేనుగు కూల ద్రోసినట్లుగా, వివిధ రత్నాలంకార శోభితుడైన కీచకుడిని భీముడు పడగొట్టాడు (చంపాడు).

విశేషం: అలం: ఉపమ, ఉపమేయాలు- అనిలసుతుడు, వివిధ రత్న భూషణ భూషితుడు అయిన సూతుడు; ఉపమానాలు-మత్తగజం, పల్లవ ప్రసూన ఫలభరితమైన వ్రాను, సమానధర్మం కూలద్రోయటం, కూలిపోయిన చెట్లకు పల్లవాదులు ఎట్లా శోభనీయవో పడిపోయిన (చనిపోయిన) కీచకుడికి ఆభరణాలు అలంకారాలు కావు. అయినా అతడు పడినా లేదా చచ్చినా వివిధ ఆభరణధారణశీలుడే. అనిలసుతుడు చెట్టును కూల్చినట్లు చెప్పటం ఔచిత్యం. కీచకు డంటే వెదురుబొంగు వంటివాడు. అనే అర్థం కూడా భావనారమణీయం. (సంపా.)

చ. వికృతపుఁ జావు సంప మది వేడుక పుట్టినఁ గిట్టిపట్టిమ
స్తకమును బీన దీర్ఘ భుజశాఖలుఁ బాదయుగంబు మేనిలో
నికిఁ జొర నుగ్గుగాఁ దుఱిమి నించిన గ్రంతలతిత్తియైన కీ
చకు ధరణీస్థలిం జదిపి చక్కని ముద్దగఁ జేసెఁ దుష్టుఁ డై. 332

ప్రతిపదార్థం: వికృతము+చావు= ఏవగింపు కలిగించే చావు; చంపన్= చంపటానికి; మదిన్ వేడుక పుట్టినన్= మనసులో కోరిక కలుగగా; కిట్టి= దగ్గరకు వెళ్ళి; పట్టి= పట్టుకొని; మస్తకమును= తలను; పీనదీర్ఘభుజశాఖలు= బలిసిన పొడవైన కొమ్మలవలె ఉండే చేతులును; పాదయుగంబు= రెండు పాదాలను; మేనిలోనికిన్+చొరఁగాన్= శరీరం లోపలికి చొచ్చుకొని పోయేటట్లు; నుగ్గుగాన్+తుటిమి= చూర్ణంగా చేసి తురిమి; నించినన్= నింపగా; క్రంతల తిత్తి+ఐన= రంధ్రాలు ఉండే సంచిగా; కీచకున్= కీచకుడిని; ధరణీస్థలిన్= నేలమీద; చదిపి= నలిపి; తుష్టుఁడు+ఐ= సంతోషించినవాడై; చక్కని ముద్దగన్= గుండ్రటి ముద్దగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: కీచకుడిని వికారంగా చంపాలని కోరికపుట్టి భీముడు అతడిని సమీపించి అతడి కళేబరాన్ని పట్టుకొని, తల, చేతులు, పాదాలు మొండెంలోకి జొచ్చుకొనేటట్లు దూర్చి, చిల్లులుపడిన నిండు సంచీవలెఉన్న శవాన్ని నేలమీద పడవేసి నలిపి, మనసు(లోని కసి) తీర గుండ్రని మాంసపు ముద్దగా చేశాడు.

విశేషం: 1. పరసతీగతమైన మన్మథ వికారాలకు నెలవైన అతడికి వికారపు చావు సముచితమైన ఫలమని భీముడు భావించాడు. కీచకుడి శరీరాన్ని ఒక మాంసపు ముద్దగా మార్చదలచాడు. తలనూ, చేతులనూ, కాళ్ళనూ విరిచి మొండెంలో గ్రుచ్చి సందుల తిత్తిగా మార్చాడు. దానిని భూమి మీద పెట్టి మర్దించి ముద్దగా చేశాడు. ఇది అసామాన్యమైన సంహారం. గంధర్వులెవ్వరో దివ్యశక్తులతో చేసినట్లు జనులు భావిస్తారు. భీముడి ప్రహారపు గుర్తులు దేహంమీద కనపడవు. చూచేవాళ్ళకు అసహ్యంగా ఉండి భయం వేస్తుంది. జుగుప్స కలుగుతుంది. ఆ వికారపు మృత్యువును కల్పించటంలో భీముడి ప్రతీకార వాంఛ. కసి, కోపం కూడా తోడ్పడ్డాయి. పైపెచ్చు ఎంత వికారంగా చంపితే ద్రౌపది అంత వినోదంగా హర్షిస్తుందనే గూఢవాంఛ కూడా హేతువు కావచ్చును. ఏమైనా, వీరకృత్యం అద్భుతంగా ముగిసింది. రౌద్రకర్మ బీభత్సాన్ని సృష్టించింది. భీమ యత్నం ఫలించింది. భీముడి ప్రకృతి, కీచకుడి వికృతి, ద్రౌపది సుకృతి చూచినవారు భీముడివలెనే తృప్తులౌతారు. 2. 'తుష్టుఁడై' అనే పదం సరళాదేశంతో 'దుష్టుఁడై' అని వినబడుతుంది. తిక్కన కావాలనే అట్లా చివర వాడడని చాలామంది పేర్కొంటారు. 'దుష్టుఁడై' అనే పాఠాంతరం కూడా ఉన్నది. కాని, దాని నెవ్వరూ పరిగణించరు. 'తుష్టుఁడై' అన్నది వాచ్యం. 'దుష్టుఁడై' అనేది ధ్వని. భీముడు అట్లా చంపి ఆనందించాడు. అది దౌష్ట్యం అని భావించేటట్లు ఉన్నది. అట్లా భావించటానికి పఠితల మనసులలో కీచకుడి పట్ల కొంత సానుభూతి ఏర్పడాలి. తిక్కన అటువంటి సానుభూతిని కలిగించాడు. అయినా భీముడిలో అందరూ సహానుభూతిని పొందుతారు. ఈ రసచర్చను భీమ నాయకత్వ నిర్ణయంలో ద్రౌపదిచేత చేయించి తిక్కన వ్యాఖ్యానించాడు. (సంపా.)

క. తన కడిమికలిమి నచ్చియు।
మనమునఁ దలఁ కడర సూతు మరణంబు గనుం
గొనుటకుఁ దల్లడపడు ప్రియ।
వనిత కతని చావు సెప్పి వడిఁ దన్మాత్రన్. 333

ప్రతిపదార్థం: తన కడిమి కలిమి= తన బలాధిక్యం; నచ్చియున్= నమ్మికూడా; మనమునన్= మనస్సులో; తలఁకు= భయం; అడరన్= అతిశయించగా; సూతు మరణంబు= కీచకుడి చావు; కనుఁగొనుటకున్= చూడటానికి; తల్లడపడు= చలించే; తన ప్రియవనితకున్= తన ప్రియురాలైన ద్రౌపదికి; అతని చావు+చెప్పి= అతడి మరణంగూర్చి చెప్పి; వడిన్= వేగంగా; తత్+మాత్రన్= ఆక్షణంలోనే.

తాత్పర్యం: భీముడి బలంమీద నమ్మకం కలిగినప్పటికీ, కీచకుడిని చంపగలడో, లేడో అనే భయంతో కీచకుడి చావు చూడటం ఎప్పుడా? అని తొందరపడుతున్న ద్రౌపదికి కీచకుడు చచ్చాడని చెప్పి వెంటనే. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: తాము చేసిన ఘనకార్యం ఆత్మీయులు చూస్తే సంతోషం. అందుకే భీముడు ద్రౌపదిని పిలిచి చూపించాలనుకొన్నాడు.

చ. అనలము గూఢ యత్నమున నయ్యెడకుం గొనివచ్చి దానిఁ జ
య్యన వెలుఁగొందఁజేయుటయు నచ్చెరువున్ భయముం బ్రియంబునున్

బెనఁగొనఁగాఁ గనుంగొనియె భీతమృగేక్షణ భీము డాయఁగాఁ
జని కడు నక్కజంబయిన చందమునం బడియున్న పీనుఁగున్.334

ప్రతిపదార్థం: అనలము= నిప్పు; గూఢ యత్నమునన్= రహస్యమైన ప్రయత్నంతో; ఆ+ఎడకున్= అక్కడకు; కొనివచ్చి= తీసికొని వచ్చి; దానిన్+ చయ్యనన్= దానిని వెంటనే; వెలుఁగొందన్+చేయుటయున్= వెలిగించగా; అచ్చెరువున్= ఆశ్చర్యం; భయమున్= భయమున్నూ; ప్రియంబునున్= ప్రీతియున్నూ; పెనఁగొనఁగాన్= ముప్పిరిగొనగా; భీతమృగ+ఈక్షణ= భయపడిన లేడి కన్నులవంటి కన్నులుగల ద్రౌపది; భీమున్= భీముడిని; డాయఁ గాన్= సమీపించగా; చని= వెళ్ళి; కడున్+అక్కజంబు+అయిన= మిక్కిలి వింత అయిన; చందమునన్= పద్ధతిలో; పడి+ఉన్న= పడిఉన్న; పీనుఁగున్= శవాన్ని; కనుఁగొనియెన్= చూచింది.

తాత్పర్యం: రహస్యంగా భీముడు నిప్పును తీసికొని వచ్చి వెలిగించగా ద్రౌపది భయసంభ్రమాశ్చర్య ప్రియములు పెనగొనగా విచిత్రంగా పడిఉన్న శవాన్ని చూచింది.

విశేషం: భీతమృగేక్షణ - సార్థకమైన విశేషణం. మృతి చెందిన కీచకుడి శవాన్ని చూడటానికి ఆసక్తి, భయం, ఆనందం అనే మూడు భావాల లక్షణం ఆ విశేషణంలో వ్యంగ్యం. ఆమెకు కీచకుడు చనిపోయాడన్న వార్త ఆశ్చర్యాన్ని కలిగించింది. అతడి పీనుఁగును చూడవలసివచ్చినందుకు భయం కలిగింది. శత్రుపీడ వదిలిందన్న వాస్తవం తెలిసినందుకు ప్రియభావం ఆమె చూపులలో పెనగొన్నది. (సంపా.)

ఉ. చూచుచుఁ జేరి వ్రేల్మిడుచుచుం దలయూఁచి విలక్షచిత్తయై
యా చపలాక్షి ముక్కుపయి నంగుళముం గదియించి 'దీనికై
కీచక! యింత సేసితి, సుఖిత్వముఁ బొందుదుగాక! యింక న
ట్లేచిన నిట్లు గా కుడుగునే?' యనుచున్ వెఱఁగందుచుండఁగన్. 335

ప్రతిపదార్థం: ఆ చపల+అక్షి= ద్రౌపది; చూచుచున్= చూస్తూ; చేరి= దగ్గరగా వచ్చి; వ్రేల్+మిడుచుచున్= వ్రేళ్ళు విరుస్తూ; తల+ఊఁచి= తలూపి; విలక్షచిత్త+ఐ= అబ్బురపడిన మనస్సుతో; ముక్కుపయిన్= ముక్కుమీద; అంగుళమున్= వ్రేలు; కదియించి= వేసికొని; కీచక!= ఓ కీచకా!; దీనికై= ఇందు కొరకై; ఇంత+చేసితి(వి)= ఇంత చేశావు; సుఖిత్వము= శాంతిని; పొందుదుగాక!= పొందుతావుగాక!; ఇంకన్= ఇంకా; అట్లు+విజృభిస్తే; ఇట్లు= ఇట్లా; కాక= కాకుండా; ఉడుగునే?= మానుతుందా?; అనుచున్= అని అంటూ; వెఱఁగు+అందుచుండఁగన్= ఆశ్చర్యపడుతూ ఉండగా.

తాత్పర్యం: చూస్తూ దగ్గరకు వెళ్ళి మెటికలు విరుస్తూ, తల ఊపి, ఆశ్చర్యపడిన మనస్సుతో ద్రౌపది ముక్కుమీద వేలు వేసికొని ఇట్లా అన్నది- 'కీచకా! దీనికొరకేనా ఇంత చేశావు? ఇకనైనా శాంతంగా ఉండుము. అట్లా విజృంభిస్తే, (నన్ను బాధిస్తే) నీకు ఇట్లా జరుగకపోదు' అని అంటూ ఆశ్చర్యపడుతూ ఉండగా.

విశేషం: స్త్రీలు మెటికలు విరవటం గ్రామీణ వాతావరణంలో సహజం. 'విలక్ష చిత్తయై' అనే పాఠానికి 'విదగ్ధ చిత్తయై' 'విషణ్ణ చిత్తయై' అనే పాఠాంతరాలు ఉన్నాయి. ఆ రెండింటికంటె ప్రస్తుతపాఠమే ప్రకరణోచితం.

క. 'పూనిక నెఱపితి సతి యవ
మానముఁ బరితాపభరము మాన్చితి నిపు డి
ట్లే' నని మదిఁ బొంగెడు పవ
మానసుతుం డిట్టులనియె మానినితోడన్. 336

ప్రతిపదార్థం: పూనిక= నిశ్చయించిన ప్రయత్నం; నెఱపితిన్= నెరవేర్చాను; సతి+అవమానమున్= భార్యయొక్క అవమానాన్ని; పరితాపభరమున్= దుఃఖభారాన్ని; ఇపుడు+ఇట్లు+ఏను= ఇప్పుడు ఈ విధంగా నేను; మాన్చితిన్+ అని= పోగొట్టానని; మదిన్= మనస్సులో; పొంగెడు= సంతోషించే; పవమాన

సుతుఁడు= వాయుసుతుడైన భీముడు; మానినితోడన్= ద్రౌపదితో; ఇట్టులు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'నేను అనుకొన్న పని నెరవేర్చాను. భార్య అవమానాన్నీ, దుః ఖభారాన్నీ పోగొట్టాను' అనుకొంటూ మనస్సులో ఉప్పొంగే భీముడు ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇక్కడ ద్రౌపదికి మానిని-అనే మాట వాడటం అద్భుతం. ఆమె అభిమానధనురాలు. భారతం మొత్తం కథ ఆమె అభిమానానికి దెబ్బ తగలటంతో నడుస్తుంది. మొదట వస్త్రాపహరణం, ఆ తర్వాత ఆమెకు జరిగిన అనేకావమానాలు అభిమాన ధనురాలి మనస్సును గాయపరిచాయి. అందుకే ఇక్కడ తిక్కన్న 'మానిని' అని సాభిప్రాయంగా వాడాడు.

శా. 'చింతాశల్యము వాసెనే? భుజబలోత్సేకంబు నీ కెక్కెనే?
శాంతిం బొందెనె రోషపావకుఁడు? దుశ్చారిత్రునిం జూచితే?
సంతోషించితె? యిట్లు గాక, బ్రదుకన్ శక్యంబె? దుర్వృత్తి నీ
చెంతం జేరినయట్టివీరులకు నాచేతం బయోజాననా!' 337

ప్రతిపదార్థం: పయోజ+అననా!= పద్మంవంటి ముఖంగల ఓ ద్రౌపదీ!; చింతాశల్యము= దుఃఖము అనే ముల్లు; పాసెనే?= తొలగిపోయిందా?; భుజబల+ఉత్సేకంబు= (నా) బాహుబలంయొక్క ఆధిక్యం; నీకున్+ఎక్కెనే?= నీ మనసు కెక్కిందా? (నచ్చిందా?); రోషపావకుఁడు= రోషమనే అగ్ని; శాంతిన్+ పొందెనె?= శాంతించాడా?; దుస్+చారిత్రునిన్= చెడు నడవడిగల కీచకుడిని; చూచితే?= చూచావా?; సంతోషించితె?= సంతోషించావా?; ఇట్లు+కాక= ఈ విధంగా కాకుండా; దుర్వృత్తిన్= చెడుప్రవర్తనతో; నీచెంతన్+చేరిన+ అట్టి= నీదగ్గరకు చేరినటువంటి; వీరులకున్= యోధులకు; నాచేతన్= నా చేతిలో; బ్రదుకన్ శక్యంబె!= బ్రతకటం సాధ్యమా?

తాత్పర్యం: 'ఓ పద్మముఖీ! గుండెలో ములికి వంటి నీ దుఃఖం తీరిందా? నా బలోద్రేకం నీ మనసు మెచ్చిందా? నీ కోపాగ్ని శాంతించిందా? దుష్టుడైన కీచకుడి భంగపాటు చూచావుకదా? సంతోషం కలిగిందా? దుర్బుద్ధితో నీ పొందుకోరే వీరులకు నా చేతిలో చావు తప్పదు. అది అంతే!'

విశేషం: తిక్కన దృశ్యశ్రవ్య - ఉభయకావ్యశిల్ప ప్రౌఢిని ప్రదర్శించే పద్య మిది. తిక్కన నర్తనశాలలో 'విక్రమ ధురంధరతన్' ప్రవేశించే భీముడిని 'ద్రౌపదీరమణు'డని పేర్కొన్నాడు. ద్రౌపదిని రమింపచేసేవాడు (సంతోష పెట్టేవాడు) అనేది భీముడికి బిరుదంగా ఇచ్చాడు. కీచకుడిని సంహరించే సంరంభమంతా రమణి మనసును రంజింపజేయటానికే అని తాత్పర్యం. దానిని ఈ పద్యం రమణీయంగా ప్రదర్శిస్తున్నది. భీముడు ద్రౌపదిని ఐదు ప్రశ్నలు అడుగుతున్నాడు. అవి నాటకంలోని 'పంచావస్థలకు' సంబంధించినవి. కీచకుడు కామభావోద్ధతుడై తనకు మానభంగం చేస్తాడేమోననే చింత ద్రౌపది హృదయంలో గుచ్చుకొన్న బాణపు ముక్కవలె బాధపెట్టుతూ ఉండేది. దానికి అతడి మరణమే మందని ద్రౌపది నిశ్చయం. ఇప్పు డామెకు ఆ బాధ తొలగిపోయిందా? అని మొదటి ప్రశ్న. సమస్యకు బీజం వంటి అంశం ఆరంభమై ఫలించిందికదా? అని ఆ ప్రశ్న పరమార్థం. ఆ బీజం ఫలించాలంటే తీవ్ర ప్రయత్నం కావాలి. అది భీముడు ప్రదర్శించిన 'భుజబలోత్సేకం' నిర్వహించింది. అది ఆమె మనసు మెచ్చేటట్లు సాగిందా? అని అడిగాడు. ప్రయత్నావస్థ ప్రశంసాపాత్రంగా సాగిందని ధ్వని. కీచకుడు చేసిన అవమానానికి తగిన ప్రతీకారం తీసికొనాలని ద్రౌపది పగ, అది అగ్నివలె ఆమె హృదయాన్ని దహిస్తూ ఉండేది. అది ప్రాప్త్యాశ (ఫలం సిద్ధిస్తుందో లేదో అనే తీవ్ర సంశయంతో కూడిన అనిశ్చిత స్థితి) వంటిది. అది చల్లారిందా అని అడిగాడు. ఆ దుర్గార్గుడి స్థితి చూచావా? అన్న ప్రశ్న 'నియతాప్తి'ని (కార్యావరోధాలైన అపాయాలన్నీ తీరి కోరిక సిద్ధించే దృఢనిశ్చయం) సూచిస్తున్నది. కీచక మరణం నియతాప్తికి నిండు ఫలం. చివరకు 'సంతోషించితె! అని అడిగాడు. ద్రౌపదీ రమణుడి వీరకార్యానికి ఫలం ప్రియురాలి హృదయప్రమోదం. భీముడి దృష్టిలో ద్రౌపది సంతోషమే కార్యఫలం. ఇవి ద్రౌపది నడుగుతున్న ప్రశ్నలే అయినా తిక్కన

కీచకవధ ఘట్టాన్ని ఒక నాటకంగా నిర్వహించిన శిల్పప్రౌఢిని పఠితకు జ్ఞాపకం చేస్తూ, నాటకంలోని పంచసంధులలోనిని అర్థప్రకృతులవలన కలిగే పంచ విధావస్థలు సముదాత్తంగా పఠితల మనస్సులకు ఆహ్లాదం కలిగించేటట్లుగా నిర్వహించబడ్డాయని తెలిసి కొన్నారా? అని అడుగుతున్న ప్రశ్నల వలె కనబడుతున్నాయి. ఆ ప్రశ్న లడుగుతున్నది కార్యనిర్వాహకుడైన నాయకుడు. ద్రౌపది సహృదయస్థానీయురాలుగా నిలిచింది. అందువలన ప్రశ్నలు కథాపరంగా, రసపరంగా కూడా ఉభయతారకంగా ఉన్నాయి.(ఈ అంశానికి సమాధానంగా ద్రౌపది నాయికవలె, సహృదయస్థానీయ వలె 360వ పద్యం చెప్పటం గమనించదగింది.) ఈ పద్యంలోని చివరి వాక్యం ద్రౌపదీరమణుడే అనగలడు. భార్యమీద ఈగవాలితే ఓర్చుకొనలేని ప్రణయప్రతాపమూర్తి భీముడు. ఆ మాటలు అంటున్నప్పుడు భీముడు 'ద్రౌపదీ రమణుడే' కాదు 'సింహబలమర్దనుడు'గా (359 పద్యం) కూడా ద్రౌపదికి తోచాడట! ఈ రెండూ తిక్కన భీమనాయకుడి కిచ్చిన సార్థకమైన బిరుదాలు. కీచకవధ ఘట్టంలోని నాటకీయ లక్షణాలను ధ్వనిమయం చేసే పంచప్రశ్నోపనిషత్తు వంటి దీ పద్యం! (సంపా.)

* * *